తెలుగు పీఠిక

డి. చంద్రశేఖర రెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాదు-500 001.

Ph.D. Thesis originally titled as "A Study of Prefaces to the Telugu Poetical works (20 th Century)" "తెలుగు కావ్యపీఠికల పరిశీలనము (20 వ శతాబ్దము)"
Author : D. Chandrasekhar Reddy

ప్రథమ ముద్రణం : 1990

ప్రతులు : 1000

వెల : రూ. 60-00

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాదు

పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాదు.

తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ప్రచురితం.

గ్రంథారంభానికి తోవ తీసేదీ పరిచయం అనీ, పీఠిక ఏ పుస్తకానికి ముందుం టుందో దానికి సంబంధించిన మూలం, చరిత్ర, పరిధి, లక్ష్యం లాంటి ప్రత్యేక విషయాలకు పరిమితమై ఉంటుందనీ[10] పీఠిక, పరిచయాల భేదాన్ని ది సెంచరీ డిక్షనరీ అండ్ సైక్లోపీడియా వివరించింది. 'గ్రంథవిషయాన్ని అర్థం చేసుకోవ డానికి దారితీసే ఒక ప్రాథమిక వక్తవ్యంగాని, వివరణగాని పరిచయం. ఇది ప్రధాన రచనకు ముందుంటుంది. గ్రంథంలోని విషయాన్ని గాని, గ్రంథ ప్రణా ళికను గాని ఇది చర్చిస్తుంది. దీన్ని విపులమైన పీఠిక అనికూడ అనవచ్చు'[11]; 'ఏ అధ్యయన శాఖలోనైనా ప్రాథమిక గ్రంథాన్ని పరిచయం అనవచ్చు'[12]; 'ఇది సాధారణంగా వ్యాసరూపంలో ఉంటుంది, కొన్నిసార్లు పద్యరూపంలో కూడా ఉండవచ్చు'[13]నని పరిచయాన్ని నిర్వచిస్తున్నాయి నిఘంటువులు. ఈ పరిచయాన్నే మనం తెలుగులో ఉపోద్ఘాతం అనికూడా అంటున్నాం. సుదీర్ఘమైన పీఠికలూ, సంక్షిప్తమైన పరిచయాలూ కొల్లలుగా ఉన్నాయి. ఉపోద్ఘాతాన్నే పస్పశమనికూడా అనవచ్చు[14] అయితే ఈ మాటను తెలుగు రచయితలు చాలా అరుదుగా వాడారు.

Fore word అన్న ఆంగ్లపదానికి సమానార్థకంగా ముందుమాట, తొలిపలుకు, మున్నుడి, మొదటిమాట మొదలైనవి వాడుకలో ఉన్నాయి. ఫోర్ వర్డ్ అన్న పదంకూడా ప్రిఫేస్‌లాగే ఒక గ్రంథానికి పరిచయం. అయితే ఫోర్ వర్డ్ రచయిత కంటే భిన్నమైన వ్యక్తి రాసిందిగా నిఘంటువులు[15] సూచి స్తున్నాయి. తెలుగులో మాత్రం రచయిత తొలిపలుకు అనీ, ముందుమాట అనీ స్వయంగా రాసుకున్న పరిచయాన్ని అనడం మామూలు. అయితే తొలిపలుకులు, ముందుమాటలు ఇతరులు రాసినవికూడా ఉన్నాయి. ఇంగ్లీషులో కూడా ఫోర్‌వర్డ్ కేవలం ఇతరులే రాసినట్లు కనిపించదు. Author's Foreword అన్న ప్రయోగం ఉంది. తొలిపలుకును వివరిస్తూ "ఇది Foreword అనునాంగ్ల పదమునకు తెలుగు. దీనిని మున్నుడి అనియునందురు. గ్రంథకర్తను గురించియు గ్రంథమును గురించియు నలతిగా వ్రాయు పరిచయ వాక్యములు''[16] అన్నాడు సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి.

Prologue అన్న పదాన్ని కూడా పై అర్థాలోనే వ్యవహరిస్తున్నట్లు నిఘంటువులు[17] చెప్తున్నాయి. ఇది ప్రస్తావన లాంటిది. ప్రస్తావన అన్నమాటను

పీఠికకు పర్యాయంగా ఏ విధంగా ఉపయోగిస్తున్నారో అట్లాగే ప్రొలాగ్‌ను కూడా ఇంగ్లీషులో ఉపయోగిస్తున్నారు. Prelude మన నాందీ పద్యంలాంటిది[18]. Preamble ఉపోద్ఘాతంలోని ఒక భాగాన్ని[19] సూచిస్తుంది.

ది సెంచరీ డిక్షనరీ అండ్ సైక్లోపీడియా 'ఇంట్రడక్షన్'ను నిర్వచిస్తూ ఎక్సోర్డియమ్, ఇంట్రడక్షన్, ప్రిఫేస్, ప్రిల్యూడ్, ప్రియాంబుల్, ప్రొలాగ్‌లకు వాడుకలో భేదాలున్నా అవి ఇంచుమించు సమానార్థకాలని వివరించింది. ఈ మాటలను ఆలంకారికార్థంలో ఉపయోగించే వీలుకూడా ఉందని తెల్పింది.[20] లాటిన్ వ్యతిరేకవాదులు 1842 తర్వాత ఇంగ్లీషులో లాటిన్ పదాలను యథాతథంగా వాడక వాటి అనువాదాలను వాడుకలోకి తెచ్చారు. అట్లా తెచ్చిన వాటిలో ప్రొలాగ్, ఫోర్‌వర్డ్ అయింది. దీని జర్మానిక్ మూలం Vorwort[21].

పీఠిక, పరిచయం, ముందుమాట (తొలిపలుకు, మున్నుడి, మొదటి మాట), ఉపోద్ఘాతం, అవతారిక, భూమిక, ప్రస్తావన మొదలైనవి తెలుగులో విస్తృతంగా వాడుతున్న మాటలు. నిఘంటువులు ఈ మాటల వాడుకలో చూపిస్తున్న వ్యత్యాసాలు అటు ఇంగ్లీషులోనూ, ఇటు తెలుగులోనూ కూడా రచయితలు పాటించలేదు. తెలుగులో ఈ మాటల్ని ప్రయోగించడంలో రచయితలు భేదాన్ని పాటించారా? ప్రయోగాలనుబట్టి వీటి భేదాన్ని గుర్తించడానికి అవకాశం ఉందా? పేరు వినగానే అందులో ఉన్న విషయమేమిటో, ఎవరు రాశారో గ్రహించడానికి వీలుందా? అన్న ప్రశ్నలకు జవాబు తెలుసుకుంటేగాని ఇవి ప్రత్యేకత ఉన్న భిన్నపదాలో, కేవల పర్యాయపదాలో అన్న విషయం తేలదు. అందుకు కర్త, నిడివి, రచయితల దృక్పథం, విషయవిధానం మొదలైన ప్రమాణాల నుపయోగించవచ్చు.

1. కర్త :

పీఠిక, పరిచయాదుల వాడుకలో కర్తను గుర్తించడానికి వీలుంటుందేమో పరిశీలిద్దాం. పీఠిక సాధారణంగా గ్రంథకర్త స్వీయమనే నిఘంటువులు చెప్తున్నాయి. కాని తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇది నిలబడదు. రచయితల స్వీయ పీఠికలకంటే ఇతరాలే ఎక్కువగా ఉన్నాయి. రచయిత, సంపాదకుడు లేక పరిష్కర్త, ప్రచురణ కర్త రాసినవి; రచయిత మరొకరిచేత రాయించు

కొన్నవి; ప్రచురణ కర్త రాయించినవి- అన్ని రకాల పీఠికలూ లభిస్తాయి. ప్రాచీన కావ్యాలను అచ్చువేసేటప్పుడు ప్రచురణ కర్తలు, సంపాదకులు, పరిష్కర్తలు రాసే పరిచయ వాక్యాలను సర్వాధికంగా పీఠికలనే వాడారు. దూబగుంట నారాయణ కవి 'పంచతంత్రా'నికి పరిష్కర్త జనమంచి శేషాద్రి శర్మ పీఠిక రాశాడు.[22] సముఖము వేంకటకృష్ణప్ప నాయకుని 'శృంగార అహల్యా సంక్రందనా'నికి సంపాదకుడు గంటి సూర్యనారాయణ శాస్త్రి పీఠిక రాశాడు.[23] వట్టికోట ఆళ్వారుస్వామి 'గంగు'కు ప్రకాశకులే పీఠిక రాశారు.[24] వేంకటపార్వతీశ్వర కవుల 'భావసంకీర్తన'నానికి తల్లావఝల శివశంకర శాస్త్రి పీఠిక రాశాడు.[25] నార్ల వెంకటేశ్వరరావు 'జాబాలి'కి తానే పీఠిక రాసుకున్నాడు.[26]

పరిచయం కూడా ఇంతే. తన 'వినోదబహిష్కరణములు'కు కవి కాండూరి నరసింహాచార్యులు పరిచయం రాసుకున్నాడు.[27] స్థానాపతి రుక్మిణమ్మ 'కాదంబిని'కి పురిపండా అప్పలస్వామి పరిచయం రాశాడు.[28] అబ్బూరి రామ కృష్ణరావు 'ఊహాగానము-ఇతర కృతులు'కు సంపాదకులు బూదరాజు రాధాకృష్ణ, ఏల్చూరి సుబ్రహ్మణ్యాలు పరిచయం రాశారు.

ముందుమాట సాధారణంగా ఇతరులు రాసేదని నిఘంటువులు చెప్తున్నాయి. కాని తెలుగులో 'పాంచజన్యము' అనే గ్రంథానికి రచయిత గడియారం రామకృష్ణశర్మే ముందుమాట రాసుకున్నాడు.[30] దీనికి పర్యాయపదమే అయిన **మొదటి మాట** కూడా అంతే. చలం తన 'స్త్రీ'కి మొదటి మాట రాసుకున్నాడు.[31] రాచకొండ విశ్వనాథశాస్త్రి 'ఆరుసారా కథ' లకు శ్రీశ్రీ మొదటి మాట రాశాడు.[32] ముందు మాటకే మరో పర్యాయ పదం **తొలిపలుకు**. 'మృగ తృష్ణ' రచయిత కాటూరి హనుమంతరావే తొలిపలుకు రాసుకున్నాడు.[33] త్రిపురనేని రామస్వామి చౌదరి 'సూతపురాణా'నికి తొలిపలుకు రాసుకున్నాడు.[34] దువ్వూరి రామిరెడ్డి 'కవికోకిల గ్రంథావళి-౧'కి దుర్భా సుబ్రహ్మణ్య శర్మ తొలిపల్కు రచించాడు.[35] వాసా కృష్ణమూర్తి 'శ్రీ పోతరాజు'కు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి తొలిపలుకు రాశాడు[36].

ఉపోద్ఘాతానికి కూడా అటువంటి విభాగం కుదురదు. శ్రీకృష్ణదేవ రాయల 'ఆముక్తమాల్యద'కు మేడేపల్లి వేంకట రమణాచార్యులు,[37] కుమార

ధూర్జటి 'ఇందుమతీ పరిణయా'నికి తిరుపతి వేంకటేశ్వరులు[38] ఉపోద్ఘాతం రాశారు. 'పానశాల'కు దువ్వూరి రామిరెడ్డే ఉపోద్ఘాతం రాసుకున్నాడు[39]. దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు'కు కట్టమంచి రామలింగారెడ్డి ఉపోద్ఘాతం రాశాడు[40]. కందుకూరి వీరేశలింగం తన 'వేశ్యా ప్రియా ప్రహసనా'నికి ఉపోద్ఘాతం రాసుకున్నాడు[41]. మంగళగిరి కేశవాచార్య 'ఆచార్యసూక్తి ముక్తావళి'కి ప్రచురణకర్త ఉపోద్ఘాతం రాశాడు[42].

ప్రస్తావన కూడా అంతే. సుంకర 'భూమికోసం'కు శ్రీనివాస చక్రవర్తి[43], చింతాదీక్షితులు 'ప్రజా వాఙ్మయాని'కి చలం[44] ప్రస్తావనలు రాస్తే, 'అశ్రుమాల'కు రచయిత దేశికాచార్యే ప్రస్తావన రాసుకున్నాడు[45]. 'మన పండితులు, కవులు, రచయితలు' అన్న గ్రంథానికి రచయిత సంపత్కుమారాచార్యే ప్రస్తావన కూర్చాడు[46]. సంస్కృత నాటకాలకు అనువాదాలలోను, వాటిని అనుసరించి వచ్చిన తెలుగు నాటకాల్లోనూ ప్రస్తావనలున్నాయి తప్ప ఆధునిక తెలుగు నాటకాలకు పీఠికలే తప్ప ప్రస్తావనలు అరుదు. ప్రస్తావన ఇతర రచనలకు వ్యాపించి పీఠికా పర్యాయవాచకంగా మారిపోయింది.

అదే విధంగా **భూమిక**ను కూడా ప్రత్యేకించడానికి వీల్లేదు. సారంగు తమ్మయ 'వైజయంతీ విలాసా'నికి ప్రచురణకర్తలే భూమిక రాశారు.[47] కొండేపూడి సుబ్బారావు 'కావ్యాంజలి'కి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి భూమిక రాశాడు [48] 'కర్పూర వసంతరాయలు'కు రచయిత సి. నారాయణరెడ్డి భూమిక రాసుకున్నాడు.[49]

పై పరిశీలనవల్ల ఏ పేరు పెట్టినా రచయితగాని, మరొకరుగాని, ప్రచురణకర్తగాని, సంపాదకుడుగాని ఎవరైనా రాసి ఉండవచ్చునని తేలుతున్నది.

2. నిడివి :

పీఠిక, పరిచయం, ముందుమాట, ఉపోద్ఘాతం, ప్రస్తావన, భూమిక, తొలిపలుకు మొదలైనవి నిడివిలో ఇదమిత్థంగా ఉంటాయని చెప్పడానికి వీలు లేదు. ఇంత నిడివి ఉంటే పీఠిక, ఇంత నిడివి ఉంటే పరిచయం, ఇంత ఉంటే ముందుమాట, ఇంత ఉంటే ఉపోద్ఘాతం - ఈ విధంగా 'ఇంత పరిమాణం ఉంటే

ఇది' అని చెప్పడానికి అనువుకాదు. కింది పట్టికను చూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. (ఉదాహరణ ప్రాయంగా వ్యత్యాస భేదం ఉన్న రెండు, మూడు గ్రంథాలను మాత్రమే చూపించాను)

పీఠిక		
ప్రజావాఙ్మయము[50]		3 వాక్యాలు
నరకంలో హరిశ్చంద్రుడు[51]		53 పుటలు
బసవపురాణము[52]		154 పుటలు
పండితారాధ్య చరిత్ర[53]		348 పుటలు
ఉపోద్ఘాతం		
సారస్వతాలోకము[54]		10 పఙ్క్తులు
పానశాల[55]		40 పుటలు
ప్రస్తావన		
ఆంధ్రసామ్రాజ్యము[56]		3 పద్యాలు
శతక సంపుటము[57]		18 పుటలు
తొలిపలుకు		
నివాళి[58]		1 పుట
సూతపురాణము[59]		18 పుటలు
శంబుక వధ[60]		47 పుటలు
ముందుమాట		
కాన్తిరేఖలు[61]		1 పుట
చంద్రిక కథ[62]		34 పుటలు
భూమిక		
రామాయణము[63]		2 పుటలు
పల్నాటి వీరచరిత్ర[64]	ప్రథమ భూమిక	80 పుటలు
	ద్వితీయ భూమిక	73 పుటలు
అవతారిక		
ద్రావిడభాషాసామ్యములు[65]		9 పంక్తులు
మహాత్మ కథ[66]		18 పుటలు

పరిచయం

వినోద బహిష్కరణములు[67]	1 పుట
ప్రద్యుమ్న చరిత్రము[68]	14 పుటలు
మాండలిక వృత్తిపదకోశం[69] 1 వ సం॥	39 పుటలు

మున్నుడి

రాష్ట్రగీత[70]	1 పుట
మధూదయము[71]	115 పుటలు

3. రచయితల దృక్పథం :

కరుటూరి సత్యనారాయణ 'కరుణాసౌగతా'నికి దిగుమర్తి సీతారామస్వామి పరిచయ ప్రభాసాన్ని రాశాడు. అందులో "సామాన్యముగా పీఠికయనగా కవిని కావ్యమును పొగడుట. కాని నీ యీ పీఠిక బహుపర్యాయములు పఠించిన మీదట సహృదయతకు తోచిన సమీక్షాలేశము"[72] అన్నాడు. ఇక్కడ పరిచయం పీఠిక, సమీక్షా మూడూ ఒక్కటే అయ్యాయి.

'ప్రసన్నరాఘవనాట్యప్రబంధా'నికి ప్రరోచన రాస్తూ బి. రామరాజు "ఈ పీఠికను వ్రాయుటకు తోడ్పడిన గ్రంథ రచయితలందరకు కృతజ్ఞుడను"[73] అన్నాడు. ప్రరోచన, పీఠిక ఒకటిగా వాడాడు.

'రాజగోపాల విలాసా'నికి ఇంగ్లీషులో Introduction రాసి దాన్నే పీఠికగా అనువదించాడు నిడుదవోలు వేంకటరావు.[74] 'వల్లభాభ్యుదయా'నికి ఇంగ్లీషులో Introduction రాసి కొంచెం వివరంగా తెలుగులో పీఠిక రాశాడు కోరాడ రామకృష్ణయ్య.[75] 'సకలనీతి కథాసారా'నికి సంపాదకుడు టి. చంద్రశేఖరన్ ఇంగ్లీషులో Preface రాశాడు. దాని అనువాదాన్నే మున్నుడిగా తెలుగులో వేయడం జరిగింది[76].

'శ్రీశకుంతలా పరిణయా'నికి ఇంగ్లీషులో Preface రాసి తెలుగులో పీఠికగా అనువదించాడు రాజాకొచ్చెర్లకోట రామచంద్ర వేంకట కృష్ణరావు బహద్దర్[77].

'కులశేఖర మహీపాలచరిత్ర'కు ఇంగ్లీషులో టి. చంద్రశేఖరన్ Introduction రాశాడు. దీన్నే పీఠికగా అనువదించారు[78].

'ప్రజావాఙ్మయా'నికి ప్రస్తావన రాస్తూ చలం "ఈనాడు ఇంకా దీక్షితులు గారి పుస్తకానికి ఓ ప్రస్తావన కావాలనుకోవడం చిత్రంగా ఉంది. ఇప్పటి తెలుగు సారస్వత శాఖల కెన్నిటికో ఆయనే ఉపోద్ఘాతం. దీక్షితులు గారి పుస్తకానికి చలం ఉపోద్ఘాతమా?"[79] అన్నాడు. ప్రస్తావన, ఉపోద్ఘాతం ఒక్కటేనన్న భావన.

'అడిదము సూరకవి జీవితము'[80] 'కవిసంశయ విచ్ఛేదము'[81] అనే రెండు పుస్తకాలకు నిడుదవోలు వేంకటరావు రాసిన ఒకే పీఠికను వావిళ్ళవారు వేశారు. అయితే ఒకదాన్ని మున్నుడి అని మరొకదాన్ని పీఠిక అనీ ప్రచురించారు.

'అనంతుని ఛందము' రెండోముద్రణకు పీఠిక రాస్తూ "మొదటిముద్రణ గురించి డా॥ గిడుగు సీతాపతి పంతులు గారి విపుల **పీఠికతో**, ప్రకటించి యున్నారు."[82] అన్నాడు నిడుదవోలు వేంకటరావు కాని గిడుగు సీతాపతి రాసింది **ఉపోద్ఘాతము**.

అదే ఉపోద్ఘాతంలో "మూడవది ఛందోదర్పణములోనిదే గాని కవిజనాశ్రయములోనిది కాదని మరియొకచోట నీ పీఠికలోనే తెలియజేసినాను" అనీ "అందుకు అనేక ఉదాహరణములు చూపించవచ్చును గాని ఈ **పీఠికలో** అవకాశము చాలదు గనుక మూడు మాత్రమే చూపిస్తున్నాను." అని గిడుగు సీతాపతే అన్నాడు.

రామరాజభూషణుని 'వసుచరిత్ర' కావ్యానికి సంస్కృతానువాదాన్ని ప్రచురిస్తూ దానికి ఇంగ్లీషులో Introduction రాసి దాన్నే తెలుగులో పీఠికగా అనువదించాడు బి. రామరాజు. ప్రచురణకర్తలు Contents లో Introduction in English అనీ, Introduction in Telugu అనీ వేశారు.[83]

'ప్రబంధరత్నావళి'కి నిడుదవోలు వేంకటరావు పీఠిక రచించాడు. ప్రచురణకర్తలు తమ మనవిలో 'మా కోర్కె మన్నించి అడిగినంతనే విలువగల

'భూమిక'ను రచించి యొసగిన కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు వేంకటరావు గారికి హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములర్పించుచున్నాము"[84] అన్నారు.

సుబ్రహ్మణ్యభారతి 'చంద్రిక కథ' అనువాదానికి అనువాదకులలో ఒకరు బంగోరె 34 పేజీల ముందుమాటలు రాశాడు. ఈ పుస్తకానికి 'లోక కథానాయకుడు వీరేశలింగం' అన్న పేరుతో కె. వి. రమణారెడ్డి, 'తమిళదేశపు తపఃఫలం సుబ్రహ్మణ్యభారతి' అన్న పేరుతో చల్లా రాధాకృష్ణశర్మ పరిచయాలు రాశారు. అయితే "వీరేశలింగం గారి వైపు నుండి శ్రీ కె. వి. రమణారెడ్డి పీఠికా ప్రాయంగానూ, సుబ్రహ్మణ్యభారతిగారి వైపు నుండి డా॥ చల్లా రాధాకృష్ణశర్మ గారు పరిచయరూపంగానూ రెండు వ్యాసానికలను ఈ నవలకు జతచేసారు"[85] అన్నాడు బంగోరె ముందుమాటలలో. వీటిలో మొదటిది 6 పేజీలు, రెండోది 7½ పేజీలూ ఉండడమే తప్ప భేదం లేదు. బంగోరె రెండింటినీ వ్యాసానికలనే అంటున్నాడు. అయినా మొదటిదాన్ని పీఠికాప్రాయంగాను రెండోదాన్ని పరిచయ రూపంగానూ అని అనడం, ఒకే మాట మళ్ళీ మళ్ళీ అనకుండా ఉండడంకోసం తప్ప మరొకందుకు కాదు.

పై విషయాలను పరిశీలిస్తే తెలుగు రచయితల దృష్టిలో పీఠిక, పరిచయం, మున్నుడి, ప్రస్తావన, ప్రరోచన, ఉపోద్ఘాతం మొదలయిన మాటలకు భేదంలేదని స్పష్టమౌతుంది.

4. విషయ విధానం :

పీఠికకు ఏ పేరు పెట్టినా, ఎవరు రాసినా విషయ విధానంలో భేదం కనిపించదు గ్రంథంలోని విషయంలో ఉండే భేదంవల్ల పీఠికలో కనిపించే చిన్న చిన్న భేదాలేతప్ప పీఠిక పేర్లకు విశిష్టార్థాన్నిచ్చే భేదం మాత్రం లేదు. ముందు చెప్పబోయే భిన్న ప్రమాణాలను అర్థం చేసుకోవడంలో ఇక్కడ ఇచ్చిన పట్టిక తోడ్పడుతుంది.

	గ్రంథం		రచయిత		పీఠికాకర్త		స్వీయపీఠిక	ప్రచురణ		పరిష్కృత గ్రంథం	ఆధునిక రచన
	ఒక్కటే	వేరు	ఒక్కడే	వేరు	ఒక్కడే	వేరు		ఒక్కటే	వేరు		
i.	—	+	—	+	—	+	—			+	—
ii.	—	+	—	+	+	—	—				
iii.	+	—	+	—	—	+	—	+	—		
iv.	+	—	+	—	—	+	—	—	+		
v.	—	+	—	+	—	—	+				
vi.	—	+	—	+	—	+	—				
vii.	—	+	+	—	—	—	+			—	+

రచనల మధ్య భేదాన్ని ఈ పట్టిక సూచిస్తుంది. ఇన్ని రకాల భేదం ఉన్నా పీఠికలో ఉండే విషయ విధానం మాత్రం ఒక్కటే.

(i) గ్రంథాలు వేరు, పీఠికా కర్తలు వేరు, పేర్లు వేరు, విషయ విధానం ఒక్కటే.

ఒకే వర్గానికి చెందిన రచనలకు విభిన్న వ్యక్తులు పీఠికలు రాసినప్పుడు వాటికి రకరకాల నామకరణాలు చేశారు. ఆ పేర్లు పెట్టడంలో విశిష్టత ఏమైనా ఉందేమో చర్చించిన విషయాన్నిబట్టి నిర్ణయించవచ్చు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తెలుగు క్లాసిక్స్ పాపులర్ ఎడిషన్ సీరీస్ వరుసక్రమంలో అనేక ప్రాచీన కావ్యాలను పరిష్కరింపించి ముద్రించింది. ఎందరో ప్రముఖ విద్వాంసులు ఈ గ్రంథాల పరిష్కరణలో తోడ్పడ్డారు. వీరిని కొన్నిచోట్ల పరిష్కర్తలనీ మరికొన్నిచోట్ల సంపాదకులని వ్యవహరించారు. వీరు తాము పరిష్కరించిన ఆయా గ్రంథాలకు విపులమైన పీఠికలు రచించారు. 20 నుండి 80 పేజీల దాకా విస్తరించి ఉన్న ఈ పీఠికలలో ఎక్కువ భాగం 30-40 పేజీల మధ్య ఉంటాయి. వీటిని కొందరు పీఠికలంటే మరికొందరు ఉపోద్ఘాతాలన్నారు. ప్రస్తావన, మున్నుడి, సంపాదకీయము, సమీక్ష, పరిచయతంత్రము, సంవీక్ష, దువారము మొదలైన పేర్లు కూడా కొందరు వాడారు.

ఆయా పేర్లతో రాసిన ఈ పీఠికలలో చర్చించిన విషయంలో ఏమి తారతమ్యాలున్నాయి ? ఉదాహరణకు ఒక్కొక్క పేరుతో ఉన్న ఒక్కొక్క పీఠికలో చర్చించిన విషయాన్ని పరిశీలించవచ్చు.

పింగళి సూరన 'ప్రభావతీ ప్రద్యుమ్న' కావ్యానికి గడియారం వేంకటశేషశాస్త్రి పీఠిక రచించాడు. "ఆ ప్రబంధమును గూర్చి పీఠికాప్రాయముగ నించుక ప్రస్తావింతును" అని 28 పేజీల పీఠికను రాశాడు. ఇందులో కవి ప్రశస్తి, వంశము, నివాసము, కాలము, కృతులు అన్న సాధారణ విషయాలను ముందు చర్చించి, ఆ తర్వాత ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని గురించి చర్చించాడు. ఈ ప్రబంధానికి ఉన్న మూలాలు. వాటిలో కవి చేసిన మార్పులు, శుచిముఖి పాత్ర నిర్మాణము, నాటకీయత, కవితారీతి, లోకశాస్త్రజ్ఞత, శబ్ద సంపద మొదలైన విషయాలను వివరించి చివర ఉపసంహారంలో కృతజ్ఞతలు చెప్పాడు.[86]

పింగళి సూరనదే 'కళాపూర్ణోదయా'నికి మరుపూరు కోదండ రామిరెడ్డి మున్నుడి రచించాడు. ఇందులో కూడా పింగళి సూరన వంశము, సూరన కాలము, కృతులు అన్న సాధారణ విషయాలను ముందు చర్చించి తర్వాత కళాపూర్ణోదయం కావ్యప్రత్యేకతలను వివరించాడు. కల్పనాశక్తి, భ్రాంతి ప్రహసనాలు, రచనావిధానము, కథకవిధానము, నామకరణములు, వ్యక్తుల భిన్నతత్వములు, భిన్నప్రేమ స్వరూపములు, కవితా శిల్పము, అనుకరణలు, సంస్కృతీకరణము మొదలైన విషయాలను వివరించి కృతజ్ఞతలతో ముగించాడు.[87]

పొన్నిగంటి తెలగన్న 'యయాతిచరిత్ర'కు నోరి నరిసింహశాస్త్రి ఉపోద్ఘాతం రాశాడు. కవికాలము, కృతిపతి విశేషాలు మొదలైన సాధారణ విషయాలను చర్చించి, యయాతిచరిత్ర గ్రంథ విశిష్టత, కథానుసరణము, కవితా విశేషాలు, ఛందోవ్యాకరణరీతులు, ఇతరుల అచ్చ తెలుగు గ్రంథాలు, మొదలైన విషయాలను వివరించి కృతజ్ఞతలతో పరిసమాప్తి చేశాడు.[88]

రఘునాథనాయకుని 'వాల్మీకిచరిత్ర'కు బి. రామరాజు సంపాదకీయం రాశాడు. రఘునాథనాయకుడు, చారిత్రాత్మకవిశేషాలు, రఘునాథుని ఆస్థానము-కవిపండితులు, రచనలు మొదలైన సాధారణ విషయాలచర్చ అనంతరం ఆయన చెప్పిన కవిత్వలక్షణం, వాల్మీకి చరిత్రకథ, కవిత్వం మొదలైన విషయాలను వివరిస్తూ కృతజ్ఞతలతో ముగించాడు.[89]

అనంతామాత్యుని 'భోజరాజీయా'నికి కొండూరు వీరరాఘవాచార్యులు సమీక్షరాశాడు. ఇందులో కథాకావ్యములు, కవి, కృతులు, వంశప్రశస్తి, దేశ కాలములు, కృతిభర్త మొదలైన సాధారణ విషయాలచర్చ తర్వాత కథ, కవిత్వ ప్రశస్తి, సంవిధానాదులు, వర్ణనలు, కవితాగుణములు, సామెతలు, జాతీయములు, ఛందోవ్యాకరణ విశేషాలు వివరించి ఉపసంహారములో కృతజ్ఞతలు తెలిపాడు.[90]

దూబగుంట నారాయణకవి 'పంచతంత్రా'నికి ఎన్. ఎస్. సుందరేశ్వర రావు పరిచయతంత్రం రాశాడు. ఇందులో కాకమ్మకథలు, పంచతంత్ర హితోపదేశాలు, పంచతంత్రము-ఆంధ్రులు, దూబగుంటనారాయణకవి, కృతిభర్త మొద

లైన సాధారణ విషయాలను చర్చించి, మిత్రలాభాదులు, మానవుల కథలు, మానవులు-జంతువులు ఛందోవ్యాకరణాదులు మొదలయిన విషయాలను వివరించాడు.[91]

'శతక సంపుటా'నికి స్వామీ శివశంకరస్వామీ ప్రస్తావన రచించాడు. ఇందులో శతక లక్షణాలు, సంస్కృత ప్రాకృతాలలోని ముక్తక కావ్యాలు, తెలుగు శతక వికాసము, నియమాలు, విషయ విభాగము, వ్యాకరణాదికాలను చర్చించాడు ఒక్కొక్క శతకానికీ ముందు ఆ శతక కర్తను పరిచయం చేశాడు.[92]

పై పీఠికలన్నింటిలోనూ, కవి పరిచయం, కావ్యపరిచయం ఈ రెండే ప్రధాన లక్షణాలు. అన్నిటిలోనూ పరిష్కరణను గురించిన విశేషాలున్నాయి. గ్రంథంలో ఉండే వైలక్షణ్యాలను బట్టి కొద్ది వివరణ భేదాలు తప్పించి ఏ పేరు పెట్టినా విషయం ఒక్కటే కనిపిస్తున్నది. కాబట్టి ఎవరికి తోచిన పేరు వారు పెడుతున్నారే తప్ప పేరులో ఉన్న విశేషమేమీ లేదు.

(ii) గ్రంథాలు వేరు, గ్రంథకర్తలు వేరు, పీఠికాకర్త ఒక్కడే, పేర్లు వేరు, విషయ విధానం ఒక్కటే

ఎవరు రాశారో తెలియని 'శృంగార పదములు' పీఠికనూ శాహమహారాజు 'సీతాకళ్యాణా'నికి తొలి పలుకునూ వడ్లమూడి గోపాలకృష్ణయ్య రాశాడు. 'శృంగార పదములు' పీఠికతో అక్షరచ్ఛందస్సులు - మాత్రాచ్ఛందస్సులు, గీతం, పదం, పాదం, చరణం, తెలుగులో పదవాఙ్మయం, ధాతుమాతువులు, విశిష్టరాగాలు, ఆంధ్రులైన మహారాష్ట్రులు, కొన్ని చారిత్రక విశేషాలు వివరించి కృతజ్ఞతలతో ముగించాడు.[93]

'సీతా కళ్యాణము' తొలిపలుకులో యక్షగానాలు, యక్షులు, సంగీతం, యక్షుల భౌమాభౌమత్వం, యక్షరాత్రి, జక్కులు-యక్షగానాలు, మార్గదేశిభేదాలు, సంస్కృత యక్షగాన కావ్యాలు, తెలుగు యక్షగానాలు, వీటిని వివరించి తర్వాత జనకుడు చంద్రవంశజుడా? దరువు, గద్యకైవారం, సూత్రధారుడు మొదలైన గ్రంథ సంబంధమైన విషయాలను చర్చించాడు.[94]

పై రెండు గ్రంథాల పీఠికలలోని చర్చాంశాలను పరిశీలిస్తే రెండింటి ధోరణి ఒకే పంథాలో నడుస్తుండడం స్పష్టమే. ఒకదాన్ని తొలిపలుకు అనీ మరోదాన్ని పీఠిక అనీ అనడానికి ప్రత్యేకమైన కారణం ఏమీ లేదు.

(iii) గ్రంథం ఒకటే, ఒకరికంటే ఎక్కువ పీఠికాకర్తలు, పేర్లు వేరు, విషయ విధానం ఒకటే

కరుటూరి సత్యనారాయణ 'తిష్యరక్షిత'కు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'పరిచయం' రాశాడు. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 'భూమిక' రచించాడు. పరిచయంలో హనుమచ్ఛాస్త్రి మూలం గురించి విచారిస్తూ రచయిత తీసుకున్న కథకు మూలమేమిటో తెలియదన్నాడు. కథలో ధర్మాధర్మాల సంఘర్షణ విపులంగా ఉందని చెప్తూ తిష్యరక్షిత అంటే కవికి అభిమానమన్నాడు. అశోకుడు, ఉపగుప్తుడు, కుణాలుడు, తిష్యరక్షిత మొదలైన పాత్రలను పరిచయం చేశాడు. కావ్యానికి వస్తువు శరీరమైతే రసరామణీయకాలు ప్రాణం అన్నాడు. రసపోషణ, వర్ణనలను సోదాహరణంగా చూపిస్తూ కవి నుడికారాన్ని మెచ్చుకొని. కొన్ని అపశబ్దాలు దొర్లినా వ్యాకరణమర్యాదల్ని పాటించడాన్ని ప్రశంసించాడు.

భూమికలో సత్యనారాయణశాస్త్రి కథకు మూలం హరప్రసాద శాస్త్రి బెంగాలీ రచన అనీ, శివశంకరస్వామిగారు తెలుగు వచనంలో రాసిన ఈ కథనే రచయిత స్వీకరించాడని తెలిపాడు, కథను పాత్రలను వివరించాడు. కవి శైలిని వివరించి, పలుకుబడిలో ప్రౌఢిమను సోదాహరణంగా వివరించాడు. కవి వ్యావహారిక ప్రయోగాలు తెలిసే చేశాడని సమర్థించాడు. నవలవలె చదువుకొనవచ్చునని ప్రశంసించాడు. రచయిత బి. ఎ. అన్న విషయాన్ని కూడా ఇద్దరూ స్పృశించారు.[95] ఈ రెండు పీఠికలలోని విషయచర్చా ఒకే అంశాలను ఆధారంగా చేసుకొని జరిగింది (మూలం, కథ, పాత్రలు, శైలి, నుడికారము, వ్యాకరణ మర్యాదలు.)

బీర్నీడి మోషే కవి 'హరిజనాభ్యుదయా'నికి విశ్వనాథ సత్యనారాయణ 'పీఠిక'ను, దివాకర్ల వేంకటావధాని 'పరిచయా'న్ని రాశారు. కవితో తమ పరిచయాన్ని వివరిస్తూ కవి గాయకుడనీ, హరికథలు చెప్పేవాడనీ విశ్వనాథ

అన్నాడు. పుస్తకము చీకటిరేక, వెలుగురేక అని రెండు భాగములంటూ కావ్యంలోని కథను వివరించాడు. "కవి బీర్నీని వంశమువాడు" అని కవి వంశాన్ని పేర్కొన్నాడు. కవిత్వాన్ని

1. వస్తువు, విషయము, కవి యూహ, అభిమానము

2. భాష, పలుకుబడి, జాతీయత, శబ్దములు కూర్చుటలో కవి శక్తి, పాండిత్యము, శైలి అని రెండు భాగాలుగా విభజించి, రెండవదే ముఖ్యమంటూ అది ఉంటే మొదటి లక్షణాలవసరం లేదంటాడు. హరిజన సమస్య గురించి చర్చించి చివర "అది యంతయు నెందుకు? ఈ కవి యొక్క పద్య రచన చక్కగా తీర్చిదిద్దినట్లుండును. ఈయన నిజమైన కవితా శక్తి గలవాడు" అని ముగించాడు.

వేంకటావధాని బీర్నీడి యుత్పత్తిని గొప్ప దనాన్ని వివరించి కవి ఆ వంశము వాడని విశ్వనాథ చెప్పినదే చెప్పాడు. అట్లాగే కావ్యము రెండు భాగాలుగా ఉందన్నాడు. కథను తెలిపాడు. ఆత్మీయాంశ సంబంధమైన కథ, హరిజన సమస్య స్వాతంత్ర్యము రాకముందటిదన్నాడు. శైలి జాతీయము, భావనాపరిపుష్టమునని సోదాహరణంగా వివరిస్తూ కవి పదప్రయోగచాతుర్యాన్ని కొనియాడాడు.[96] ఈ రెండు పీఠికలూ ఒకే త్రోవన నడిచాయనడం స్పష్టమే.

శాహమహారాజు 'సీతాకళ్యాణా'నికి వడ్లమూడి గోపాలకృష్ణయ్య 'తొలిపలుకు'ను, దివాకర్ల వేంకటావధాని 'ఉపోద్ఘాతము'ను రచించారు. తొలిపలుకులో యక్షగానం ప్రాచీనత, యక్షులు, యక్షరాత్రి, జక్కులు - యక్షగానాలు మార్గదేశి, సంస్కృత, తెలుగు యక్షగానాలు, సీతాకళ్యాణము దరువు, గద్యవైవారం అనే అంశాలను ప్రధానంగా చర్చిస్తే, ఉపోద్ఘాతంలో రచయిత - రచనలు, యక్షగాన వుత్పత్తివాదాలు, తెలుగు యక్షగానాలు, సీతాకళ్యాణము, కథ, నిర్మాణము, ఛందస్సులు అన్నవి ప్రధానాంశాలు[97]. చెప్పిన విషయాలు కొంచెం వేరయినా చర్చించిన విషయాలు ఒక్కటే.

వానా కృష్ణమూర్తిగారి 'శ్రీ పోతరాజు' అన్న కావ్యానికి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 'తొలిపలుకు'ను పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి 'పీఠిక'ను

రాశారు. కావ్యవస్తువు. పోతన మీద కవికి గల భక్తి, పద్యగమనము, పాత్ర పోషణ, భక్తిభావము అన్న విషయాలే రెండు పీఠికలలోనూ చర్చకు వచ్చాయి.[98]

(iv) గ్రంథం ఒకటే, ప్రచురణలు, పీఠికాకర్తలు వేరు, పేర్లు వేరు, విషయవిధానం ఒక్కటే.

'అనంతుని ఛందము' (ఛందోదర్పణము) ను వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారు మూడు సార్లు 1921, 1947, 1968 లలో ప్రచురించారు.

మొదటి ప్రచురణకు గిడుగు వేంకటసీతాపతి 45 పేజీల ఉపోద్ఘాతం రచించాడు. ఇందులో కవి కులము, రచనలు, కాలము, గ్రంథ విశేషములు, గ్రంథ ప్రచారము, పాఠనిర్ణయము, ఛందోవిషయములు వివరించాడు. తెలుగు ఛందోగ్రంథాలలో చెప్పిన వడిభేదాలు పేర్కొంటూ అనవసరంగా చెప్పిన వడిభేదాలు, వడిస్థలాలను చర్చించి, సీసములు, ఆర్యలు, గీతులు, అక్కరలు, షట్ప్రత్యయములు, క్రౌంచపదము, త్రిభంగి మొదలైనవాటిని విమర్శించాడు.

21 పేజీల ద్వితీయ ముద్రణ పీఠికలో నిడుదవోలు వేంకటరావు అనంతామాత్యుని వంశవృక్షము, అతని రచనలు, ఛందోదర్పణములోని విశేషములు ప్రాచీన లేఖన పద్ధతి, అర్ధబిందుప్రాసము, ఋ - రు యతి, ఌ - లు యతులను వివరించాడు.

29 పేజీల తృతీయ ముద్రణ సమీక్షలో రావూరి దొరసామి శర్మ కవికులము, కాలము, ఛందోదర్పణ ప్రాశస్త్యము వివరించి ఒక్కొక్క ఆశ్వాసములోని విషయాలను పరిశీలించాడు. గిడుగు సీతాపతి అభిప్రాయాలను కొన్నింటిని విమర్శించాడు. ఈ మూడు పీఠికల స్వరూపం ఒక్కటే. దీన్ని గమనించే దొరసామిశర్మ తమ సమీక్ష ఆరంభంలోనే "కొన్ని పట్లఁ జర్విత చర్వణ దోషము సైతము వాటిల్లును"[99] అన్నాడు.

(v) గ్రంథాలు వేరు, గ్రంథకర్తలు వేరు, స్వీయ పీఠికలు, విషయ విధానం ఒక్కటే.

గ్రంథకర్తే స్వయంగా పీఠిక రాసుకున్నప్పుడు కూడా దానికి వేరు వేరు పేర్లు పెట్టడం జరిగింది. అయినా వాటిలోని వస్తువు ఒక్కటే.

నండూరి సుబ్బారావు 'ఎంకిపాటలు'కు పీఠిక రాసుకున్నాడు. తాను మద్రాసులో చదువుకునే రోజులు, బసవరాజు అప్పారావుగారి తరిఫీదు, ట్రాంబండిలో గొంతులో సన్నగా బయలుదేరి 'గుండెగొంతుకలోన'గా బయటకి రావడం, బసవరాజు అప్పారావు భాష సహజం కాదనడం, సూర్యనారాయణ ప్రోత్సాహం, బసవరాజు అప్పారావు కూడా తన అభిప్రాయం మార్చుకోవడం మొదలయిన విషయాలను చెప్పుకొని కృతజ్ఞతలతో ముగించాడు.[100]

వింజమూరి వేంకటలక్ష్మీనరసింహారావు తన 'నౌరోజ్'కు మున్నుడి రాసుకున్నాడు. తన జీవితయాత్రలోని కొన్ని సంఘటనలవలన తనకు కరుణ రసం వైపు మ్రొగ్గు. అందుకే విషాదాంతగాథలే రాశాడు. 1945 మేలో కాలు విరగడంతో మనఃస్థితికి. దేహస్థితి తోడైంది. నౌరోజ్ కథను తెల్పి, నౌరోజ్ ఉత్సవంతో మొదలై మరుసటి సంవత్సరం నౌరోజ్ ఉత్సవంతో ముగిసింది కాబట్టి ఆ పేరు పెట్టినట్లు చెప్పుకున్నాడు. ఉదాత్తమైన విషాదాంత కథను పఠించినను, తిలకించినను, ఆత్మ క్షాళితమై శుద్ధిపొందిన భావము స్ఫురింపక మానదన్నాడు.[101] 'మన పండితులు, కవులు, రచయితలు' అన్న గ్రంథానికి రచయిత సంపత్కుమారాచార్య 'ప్రస్తావన' రాసుకున్నాడు. నన్నయనే హద్దుగా తీసుకున్నప్పటికీ మన సాహిత్య చరిత్రలో మరుగుపడిన కవులెందరో ఉన్నా రని, అటువంటి వారిలో ఓరుగల్లు మండలంలో పుట్టిన, నివసించినటువంటి వారి గురించి రాయదలచుకున్నామనీ, కేవలం, కవులు, రచయితలే కాక పండితులను గురించి కూడా ఇందులో రాస్తున్నాననీ ఈ మొదటి సంపుటంలో 25 గురు పండి తులు, కవులు, రచయితల గురించిన పరిచయం, లభించిన అన్ని వివరాలతో ఉన్నదనీ, చెప్పుకున్నాడు. కృతజ్ఞతలతో ముగించాడు.[102]

'పాంచజన్యము' అనే తన ఖండకావ్య సంపుటికి గడియారం రామకృష్ణ శర్మ ముందు మాట రాసుకున్నాడు. ఈ కవితలు 1943-76 మధ్యకాలంలో రాసినవనీ, ప్రబోధాత్మకములైనవి కాబట్టి పాంచజన్యము అని పేరు పెట్టడం జరిగిందనీ చెప్పాడు. ఆంధ్రదేశంలో వచ్చిన ప్రత్యక్ష పరోక్ష ఉద్యమాలన్నింటి

తోనూ సంబంధం ఉండడమే కాక పాల్గొనడం కూడా జరిగింది. ఆ ఉద్యమాలలో చూచిన అనేక సంఘటనల వలన కలిగిన మనోవ్యధలే ఈ కవితలు అని వివరిస్తూ కృతజ్ఞతలతో ముగించాడు.[103]

'మృగతృష్ణ' అనే తన ఖండకావ్య సంపుటికి కాశూరి హనుమంతరావు తొలిపలుకు రాసుకున్నాడు. ఈ సంపుటిలోని ఖండికలు 1953-71 మధ్య రచించినవనీ అందుకే వస్తు, వ్యక్తీకరణలలో, చాలా వైవిధ్యం ఉండడం సహజమనీ చెప్పుకున్నాడు. ఆంధ్రచ్ఛందస్సులలోని యతిప్రాసనియమం చాలా కఠినమైనదన్నాడు.[104]

'తేనెతెట్టె' అనే తన నాటకానికి నోరి నరసింహశాస్త్రి పరిచయం రాసుకున్నాడు. తమ రచనకు ప్రేరణ మేతర్‌లింక్ అని, ఆయన తేనెటీగల జీవితాన్ని పరిశీలించాడనీ చెప్తూ తేనెటీగలలో ఉండే రకాలు వాటి జీవితము, తాను అల్లిన కథా వివరించాడు.[105]

గుఱ్ఱం జాషువా తన 'స్వయంవరా' నికి భూమిక రాసుకొన్నాడు. తన రచనలోని కథ, అందులోని ప్రతీకలను వివరించి, ప్రచురణకు సహాయం చేసిన వారిని స్మరించి కృతజ్ఞతలతో ముగించాడు.[106]

రచయితలు ఒక్కొక్కరు తమ పీఠికలకు ఒక్కొక్క పేరు పెట్టినా వాటిలో చెప్పిన విషయ విధానంలో ప్రత్యేకత ఏమీలేదన్న విషయాన్ని దీన్ని బట్టి గుర్తించవచ్చు.

(vi) ఆధునిక రచనలు, ఇతరుల పీఠికలు, పేర్లు వేరు, విషయ విధానం ఒక్కటే.

ఆధునికమైన రచనలకు రచయితలు ఇతరుల చేత పీఠికలు రాయించుకున్నప్పుడు కూడా రకరకాల పేర్లను వాడారు. ఇక్కడా పేరునుబట్టి విషయగ్రహణం సాధ్యం కాదు.

చింతా దీక్షితులు 'ప్రజావాఙ్మయా' నికి చలం ప్రస్తావన రాశాడు. దీక్షితులుకూ తనకూ ఆలోచనా విధానంలో ఉన్న భేదాలను పేర్కొన్నాడు.

ప్రజల పాటల మాధుర్యాన్ని, భాషామార్దవాన్ని ప్రశంసిస్తూ అందులోనే గొప్ప కవిత్వం ఉందన్నాడు. ఆ పాటల్లో కనిపించే ప్రజల హృదయాలలోని భావాలను, తల్లి దనం, ప్రేమ వాటిలోని సహజత్వాన్ని మెచ్చుకున్నాడు. ఈ పాటల్ని శిష్ట సారస్వతంలో చేర్చుకోవాలంటూ దానికి దీక్షితుల కృషిని ప్రశంసించాడు.[107]

సి. నారాయణరెడ్డి 'శిఖరాలూ - లోయలూ' అన్న పుస్తకానికి ఓ. చిన్నపరెడ్డి ముందుమాట రాశాడు. జిబ్రాన్ మహాకవిని పరిచయం చేస్తూ పుస్తక నామౌచిత్యాన్ని, కవితలోని భాషాభావ సౌందర్యాలను వివరిస్తూ కవి, అనువాదకుడు ఇద్దరూ మానవతా వాదులేనన్నాడు. జిబ్రాన్ రచనలన్నింటా మానవతే ముఖ్యమనీ అతను ఒక రెబెల్ అనీ, ఆయన రచనల్లో సార్వకాలికత ఉందనీ, ఆయన అభ్యుదయవాది అనీ చెప్తూ మూలానికే వన్నె తెచ్చిన అనువాదాన్ని మెచ్చుకున్నాడు.[108]

గుఱ్ఱము వేంకటసుబ్రహ్మణ్యము 'అభిజ్ఞాన శాకుంతలానికి' శివశంకర స్వామి పీఠిక రాశాడు. అనువాదం సరళంగా ఉందన్నాడు. ఛందో ఔచిత్యానికి ఉదాహరణలిచ్చాడు. దీనికి మూల పాఠం మహారాష్ట్ర పాఠమనీ, దానికీ దాక్షిణాత్య పాఠానికి పెద్దగా భేదం లేదనీ చెప్పాడు. అభిజ్ఞాన శాకుంతలము ఇతివృత్తము, తుల్యబలవిరోధములు, అనురాగము, గృహస్థ ధర్మము, వైదిక ధర్మము అన్నవి ఈ పీఠికలోని ప్రధానాంశాలు. ఇందులోని శృంగారం శాంతానికి మిక్కిలి సమీపంగా ఉందన్నాడు.[109]

వేదం వేంకటరాయశాస్త్రి 'ఆంధ్రవిక్రమోర్వశీయ' నాటకానికి నేలటూరి రామదాసు ఉపోద్ఘాతం రాశాడు. కాళిదాసు కాలము, రచనలు తెలిపి, నాటక కథను, దానికి ఆధారాలను వివరించాడు. పాత్రలను పరిశీలించి, కాళిదాసు నాటకాలలోని గుణాలను పేర్కొన్నాడు. వేదం వేంకటరాయశాస్త్రి భాషా సేవను ప్రశంసించాడు. ఆయన ప్రవేశపెట్టిన పాత్రోచితభాషను సమర్థించి ఆంద్రీకరణ విధానాన్ని వివరించాడు.[110]

తుమ్మల సీతారామమూర్తి 'మహాత్మకథ'కు దువ్వూరి వేంకటరమణశాస్త్రి అవతారిక రాశాడు. అవతారిక రాయడంలో ఎదురయ్యే ప్రశంసా సమస్యను

పేర్కొని దాన్ని మరొక విధంగా తప్పించుకున్నాడు. రచయిత పూర్వ రచనలను గూర్చి ఆయా విద్వాంసులు చేసిన ప్రశంసలను ఉట్టంకించాడు. వాల్మీకి, తుమ్మలలకు పోలికలున్నాయని చెప్పాడు. శైలిని వివరించాడు. గాంధీ వర్ణనలు పేర్కొన్నాడు. కవి వాడిన లోకోక్తులను చూపించాడు.[111]

అబ్బూరి రామకృష్ణరావు 'నదీసుందరి' ద్వితీయముద్రణకు పురిపండా అప్పలస్వామి పరిచయం రాశాడు. తాను పరిచయం రాయవలసి వచ్చిన పరిస్థితులను వివరించాడు. అబ్బూరి నవ్యకవితకు నాందీ పలికిన మన మహా కవులలో విశిష్టుడని పేర్కొంటూ ఆయన శైలినీ, శిల్పాన్నీ వివరించాడు. అరవంలోని మూలకథను తీసుకొని రమ్యంగా అభినవమ్మగు రూపకం రచించాడన్నాడు. ఒక్కొక్క రంగం కథా విస్తరణ నాటకం పూర్తయేసరికి మనగుండెలలోనే కావేరి మహాప్రవాహం పొంగులు వారి ప్రవహిస్తుందంటూ అబ్బూరి రామకృష్ణ రావుగారి అమరకృతి నదీసుందరి అని ప్రశంసించాడు.[112]

దువ్వూరి రామిరెడ్డి 'కవికోకిల గ్రంథావళి-1'కి దుర్భా సుబ్రహ్మణ్యశర్మ 'తొలిపల్కు' రాశాడు. నలజారమ్మ, వనకుమారి, కృషీవలుడు, జలదాంగన, యువకస్వప్నము, కడపటి వీడుకోలు, పానశాలలలోని కథలను వివరించాడు. కవిభావుకత, కల్పనాశక్తి, కవితామాధుర్యాలను ప్రశంసిస్తూ కవికోకిల బిరుదు సార్థకమన్నాడు. "కవిత్వమునందుబోలె సాంఘిక రాజకీయములందును కృత్రిమ నిర్బంధములనుండి విడివడి సత్యసరణి గమనింప గోరుచున్న స్వాతంత్ర్యలాలసుడు" అంటూ, "వారు రసపిపాసువులు, రసముకొరకే వ్రాయుదురు", అని కవికోకిల రసప్రాధాన్యాన్ని పేర్కొన్నాడు. రామిరెడ్డి అర్థవిభవములు, ప్రసాద సమృద్ధి, శయ్యా సౌభాగ్యము, శబ్దవైభవములను వివరిస్తూ ఆయన కావ్యాలలోని వర్ణనల రామణీయకతను చూపించాడు.[113]

పై పీఠికలన్నింటిలోనూ కనిపించేది రచయిత, రచనలను పరిచయం చేయడమే. ఏ పేరు పెట్టినా చేసింది మాత్రం అదే.

(vii) రచనలు వేరు, స్వీయపీఠికలు, పేర్లు వేరు, విషయ విధానం ఒక్కటే.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'వేమన'కు పీఠిక రాసుకొన్నాడు, సర్ రఘుపతి వేంకటరత్నం నాయుడుగారి ఔదార్యం, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారి యభిమానం ఈ ఉపన్యాసాలకు కారణమని చెప్పుకొన్నాడు. వేమన కాలదేశాలను, సిద్ధాంతాలను నిర్ణయించాలంటే కడప, కర్నూలు మండలాలలో సావకాశంగా సంచారం చేయాలని, పెక్కు వ్రాత ప్రతులను చూచి పద్యాలన్నింటిని సంగ్రహించాలని చెప్పాడు. ముందు వేమన పద్యాలు అచ్చువేసేవారు పాత పాఠాలన్నీ విమర్శించవలసి ఉంటుందన్నాడు.[114]

ఆయనే తన 'సారస్వతాలోకా'నికి ఉపోద్ఘాతం రాసుకున్నాడు. అందులోని వ్యాసాల పూర్వప్రచురణను తడిమాడు. సుమారు 40 సంవత్సరాల జీవిత కాలంలో విభిన్నమైన సన్నివేశాలలో, చిత్త వృత్తులలో తలచిన తలపుల, ఆడిన మాటల సంగ్రహమిదికాబట్టి కాలాతీత దోషము, పునరుక్తి, పరస్పర సంగతి చాలమి ఇత్యాదులిందులో ఉండవచ్చునన్నాడు.[115]

అనంతకృష్ణశర్మ తన 'మిరాబాయి'కి పీఠిక రాసుకున్నాడు. అందులో మూలాన్ని, తాను ఖేదాంతంగా రాయడానికి కారణాన్నీ తెల్పాడు. దోషాలుంటే తెలుపవలసిందని విన్నవించాడు.[116]

సుందరపాండ్య విరచిత 'ఆర్య'కు తెలుగు అనువాదం రాళ్ళపల్లిది. దానికి ఆయనే ప్రస్తావన రాసుకున్నాడు. మూలం పరిష్కరణ, పరిష్కర్తలను గురించి వివరించి, మూలరచయిత సుందరపాండ్యుని కాలాన్ని గురించి చర్చించాడు. ఇందులోని ఆర్యలు ముక్తకాలు, కేవల నీతిబోధకాలు అని తెలిపాడు. ముద్రణకు సహాయం చేసినవారికి కృతజ్ఞతలు తెలిపాడు.[117]

పై గ్రంథాల రచయిత ఒక్కరే. పీఠికలు గ్రంథకర్తవే. అయినా ఒక చోట పీఠికఅనీ మరొక చోట ఉపోద్ఘాతమనీ, ఇంకొకచోట ప్రస్తావన అనీ అన్నాడు. చర్చించిన విషయాలలో కూడా వ్యత్యాసం లేదు.

5. పీఠికాంతర్గత పీఠిక :

ప్రస్తావన, ఉపోద్ఘాతం, పస్పశం, అవతారిక, ఉపక్రమణిక మొదలైన మాటల్ని పీఠికాపర్యాయపదాలుగానే కాక పీఠికలో మొదటి భాగానికి పేరుగా కూడా ఉపయోగించారు. 'మాండలిక వృత్తి పదకోశం, వాల్యూమ్-1'కి భద్రిరాజు కృష్ణమూర్తి 'గ్రంథ పరిచయం'లో మొదటి భాగం పేరు ప్రస్తావన.[118] 'క్రీడాభిరామా'నికి వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠికలో మొదటి భాగం ఉపోద్ఘాతం.[119] బూర్గుల రామకృష్ణరావు 'పండితరాజు పంచామృతా'నికి ఈయుణ్ణి వేంకటవీర రాఘవాచార్యుల పీఠిక 'పండితరాజ కర్ణపూరము'లో మొదటి భాగం పస్పశం.[120] 'ప్రబంధమణిభూషణము' పీఠికలో మొదటి భాగం పరిచయం.[121] దశకుమారచరిత్ర పీఠిక సమీక్షలో మొదటిభాగం ఉపక్రమణిక[122] పంచతంత్ర పీఠిక 'పరిచయతంత్రం'లో మొదటిభాగం ఆముఖం [123]

6. ప్రచురణకర్త సూచన పీఠిక :

పీఠిక, పరిచయం, తొలిపలుకు, ముందుమాట, అవతారిక, విజ్ఞప్తి, మనవి, ప్రకాశిక మొదలయిన మాటలన్నీ ప్రచురణకర్త సూచనకు కూడా పర్యాయపదాలుగా వాడుకలో ఉన్నాయి. ప్రచురణకర్త సూచనలో కవి, గ్రంథ పరిచయాదులు చోటు చేసుకొని కొంత పీఠికాలక్షణాన్ని సమకూర్చుకోవడం కూడా అరుదేమీకాదు.

ఆరుద్ర 'త్వమేవాఽహమ్' తొలికూర్పు 'ప్రకాశిక'. ప్రకాశకులు రాసింది రెండు పేజీలే అయినా కావ్యపరిచయం తగుపాళ్ళలోనే జరిగింది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వేసిన మూడోకూర్పు 'ముచ్చట' ఎడిటర్ తుమ్మల వెంకటరామయ్యది. ఇది కావ్య నేపథ్యాన్ని, పరిచయాన్నికూడా చేసింది.[124] ఆదిలో ప్రాచీన గ్రంథాలను ప్రముఖ కవులు రచయితలే ప్రచురించారు. ఆ ప్రచురణలకు వారు రాసిన పీఠికలలో కవి కావ్యపరిచయాదులు, ప్రచురణకర్త విజ్ఞప్తి కలిసే ఉంటాయి. కేతన 'దశకుమారచరిత్ర'ను 1901లో ప్రచురిస్తూ కందుకూరి వీరేశలింగం కవిని, కావ్యాన్ని పరిచయంచేసి లిఖితప్రతుల సంపాదనలోకష్టాలను, గ్రంథాన్ని వెంటనే ముద్రించవలసిన ఆవసరాన్ని పేర్కొంటూ ఎవరన్నా వ్రాతప్రతి పంపిస్తే వారికి పది కాపీలు ఉచితంగా ఇస్తాననీ, మళ్ళీ ముద్రించినప్పుడు మరో పదికాపీలు యిస్తానని వాగ్దానం చేశాడు.[125]

7. పండితాభిప్రాయాలు :

చాలామంది రచయితలు తమ గ్రంథాలకు అభిప్రాయాలు రాయించు కుంటున్నారు. పండితాభిప్రాయములు అన్న పేరుతో కొంతమంది పండితుల ప్రశంసలను గ్రంథాదిలో ముద్రించుకోవడం సర్వసాధారణమే. మరికొంత మంది వీటిని అభిప్రాయాలనకుండా, పీఠిక, పరిచయం, భూమిక, ప్రస్తావన వంటి పేర్లతో రాయడమూ, ప్రకటించుకోవడమూ జరుగుతున్నది. వీటికీ, అభిప్రాయాలకూ, భేదం లేదు. పైగా అన్నింటిలోనూ చెప్పే విషయం ఒక్కటే.

నామాంతరాలు, విశిష్టమైన నామకరణలు :

పీఠిక, ముందుమాట, తొలిపలుకు, పరిచయం, అవతారిక, ఉపోద్ఘాతం, భూమిక, మొదలైనవన్నీ ప్రచురణకర్త మనవిగా కూడా ఎన్నోచోట్ల గోచరిస్తాయి.

పై అన్ని ప్రమాణాలనూ నిడివి, పీఠికాకర్త, విషయం మొదలైన వాటినన్నింటినీ పరిశీలించింతర్వాత తెలుగు రచయితలలో పీఠిక, ముందుమాట, పరిచయం, అవతారిక, భూమిక, ప్రస్తావన మొదలైన మాటలకు ప్రయోగంలో ఏ విధమైన భేదమూలేదని స్పష్టమౌతుంది. ఇంతవరకూ చర్చించిన ఈ మాటలు పర్యాయపదాలు మాత్రమే బహుళప్రచారంలో ఉన్నవాటిని మాత్రమే తీసుకొని వాటి మధ్యభేదం లేదని చూపించే ప్రయత్నమే జరిగింది. ఇవికాక వీటి సమానార్థకాలు మరెన్నో ఉన్నాయి. ఆముఖం, ప్రరోచన, ప్రవేశిక, ప్రకాశిక, అవతరణి, ఉపక్రమణిక, ఉపసేచని, వీక్షణ, శీర్షకము, తిలకము, తిలకరేఖ, నామాట, ఒకమాట, రెండుమాటలు, ఒకటి రెండు మాటలు, తెలివిడి, ఇంట్రో, విజ్ఞప్తి, విజ్ఞాపనము, విన్నపము, మనవి, నీరాజనము, ఆత్మీయము, ఆత్మకథ, స్వాగతము,నతులు, అభివందనము, సుమనోంజలి, నమస్సుమాంజలి, కృతజ్ఞత, దీవెనలు, శ్రద్ధాంజలి, గ్రంథకర్త ప్రశస్తి, కవి ప్రశంస, రోచిరాశంసనము, మంగళాశాసనము, సమర్పణ, శ్రద్ధాంజలి, ఆశీస్సు, ఆమోదం, అనుభూతి, అనుబంధం, కావ్యోదయము, కావ్యవిషయము, కావ్యతత్వం, కావ్య సమీక్ష మొదలయినవన్నీ ఇటువంటివే. వీటినే మళ్లీ ముందు మరో ఉప పదం చేర్చి వాడడం కూడా జరుగుతున్నది. శోధక విజ్ఞప్తి, పరి

శోధక విజ్ఞప్తి, చిన్నమనవి మొదలైనవి ఇటువంటివి. వీటిలో ఆత్మకథ, ఆత్మీయము, స్వగతము, నా మాట వంటి వాటిని రచయిత స్వంతం అనీ, ఆశీస్సు, దీవెనలు, ఆమోదం, నీరాజనములు, శ్రద్ధాంజలి, కవి ప్రశంస, గ్రంథకర్తృ ప్రశస్తి, రోచిరాశంసనము, మంగళాశాసనము వంటివి ఇతరులు రాసినవనీ స్పష్టంగా గుర్తించవచ్చు. తక్కినవి ఎవరైనా రాయవచ్చు.

పైన చెప్పిన పేర్లుగాక, ఆయా పీఠికాకర్తలు విలక్షణమైన పేర్లు పెట్టిన సంఘటనలున్నాయి. వాటిలో హావణింపు, హేల, నిలువుటద్దం, దర్పణం, ప్రతిధ్వని, శరచ్చంద్రిక, యోగ్యతాపత్రం అన్నవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

అందరూ సామాన్యంగా వాడే ముందు మాట, తొలిపలుకు, మున్నుడు లను వాడకుండా, 'ముందుకు పోయేముందు', 'తెలుగు వెలుగు తెరవక ముందు', వంటి మాటలు కొందరు వాడారు. మళ్లీ ఈనాడు, చివరికీనాడు, ఇంకోసారి మళ్లీ తప్పలేదు వంటివి కూడా ఇంతే. రెండో ముద్రణ పీఠిక, మూడోముద్రణ పీఠిక మొదలైన మాటలకు బదులుగా వాడిన మాటలివి. పాతకాలపు పీఠికలు చాలా పాఠకుని సంబోధనతో మొదలవుతాయి. పీఠికకే 'హలో పాఠకుడా!' అని పేరు పెట్టడమూ కనిపిస్తుంది.

'ఉన్నదే చెబుతున్నాను' అన్నది దర్పణం వంటిది. 'నాకవితా ప్రేరణ' 'ఎందుకు రాసేను', మొదలైనవి స్వగతంలాంటివి.

కొంతమంది పీఠికా కర్తలు పుస్తకం పేరుతో సంబంధం ఉండేటట్లుగా పీఠికకు పేరు పెట్టారు. ఈ రెండు పేర్లకూ ఉండే పోలిక కొంత చమత్కారాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు కొన్ని -

పుస్తకం	పీఠిక
తొలకరి జల్లులు	మేఘరంజని
పాంచజన్యము	శంఖారావం
అశోకవనిలో రాముడు	వనద్వారం
సామెత	నానుడి - నానుడి

కర్పూర వసంతరాయలు	కర్పూర సౌరభము
మినీకవితా విప్లవం	మినీకవిత్వానికి మాక్సీ ఆహ్వానం
పిల్లీ శతకం. మొదటి ఎడిషన్	సుమతీ - పిల్లీ
పిల్లీ శతకం. రెండవ ఎడిషన్	దైవజ్ఞత్వం
గుడిసెలు కాలిపోతున్నై	దండోరా
తిమిరంతో సమరం	కాంతి కవాటం
విశ్వగీతి	ఆలాపన
ముళ్ళపొదలు	ముళ్ళబాట

గ్రంథకర్త పేరును పేర్కొనే పీఠికలు కొన్ని. ఉదాహరణకు 'వేదుల వ్యక్తి శక్తి', 'జ్ఞాన ప్రభాకరుడికి నా శాల్యూట్', 'ఖలీల్‌తో కలయిక', 'బసవ రాజు అప్పారావు మధురస్మృతికి', 'మల్లారెడ్డికి బహిరంగలేఖ', 'ఆళ్వార్'; మరికొన్ని పీఠికలు రచయితపేరును పేర్కొనక పోయినా రచయితకు ఒక విశేషణంగానో, స్మృతిగానో ఉంటాయి. ఉదాహరణకు 'ప్రతిభామయి' 'మనిషిని మనిషిగా చూచే మనీషి', 'మిత్రస్మృతి' మొదలైనవి.

కొన్నిచోట్ల గ్రంథం పేరే పీఠిక పేరు కూడా. ఉదాహరణకు ముత్యాల సరాలు, జీవితమధురిమ, కాశీఖండము, వల్లభాభ్యుదయము, కేయూర బాహు చరిత్రము మొదలైనవి ఇటువంటివి.

గ్రంథంలో తాము చర్చించే విషయాన్నే శీర్షికగా ఉపయోగించిన పీఠికలు కొన్ని. ఉదాహరణకు ఆంధ్రభాగవత రచనాక్రమము, పోతనాది కవి కవిత్వాది విమర్శనము, ఆముక్తమాల్యదా కర్తృత్వము, కొయ్యగుర్రం ఆధునిక మహాకావ్యం వంటివి ఇటువంటివి. సామాజికవిప్లవ కవిత్వం, తెలంగాణా పోరాట సాహిత్యం, అరుణ - ఒక సమీక్ష, మనిషే కవిత్వం, ఇది రహదారికాదు, దిగంబర శకంలోకి మొదలైనవి కూడా ఈ వర్గంలోకే వస్తాయి. ప్రత్యేకంగా పీఠిక అన్న మాటనుగాని దాని సమానార్థక పదాన్నిగాని శీర్షికలో ఉపయోగించకపోయినా వీటన్నిటిని పీఠికలనే అంటాం. ఏ పేరుతో పిలిచినా చివరికి అన్నీ సామాన్యవాచకమైన పీఠికా పదంతోనే ప్రవర్తిల్లుతాయి. పైన చెప్పిన పేర్లన్నింటినీ రెండు ప్రధానవర్గాలుగా విశ్లేషించవచ్చు. 1. పీఠికా సామాన్య

వాచకంతో ఉండేవి 2. ప్రత్యేకమైన పేరుతో ఉండేవి. ఉపోద్ఘాతం, ఆముఖం పరిచయం, ప్రస్తావన, తొలిపలుకు ఇత్యాదులన్నీ మొదటివర్గానికీ, హావళింపు, హేల, మేఘరంజని, ప్రతిభామయి మొదలయినవన్నీ రెండో వర్గానికీ చెందు తాయి. ఏ పేరు పెట్టినా వీటన్నింటికి పీఠికను సామాన్య నామంగా స్వీకరించ వచ్చు.

పీఠికా ప్రయోజనం :

రచనకు పీఠిక అవసరం ఏమిటి? గ్రంథంలో చర్చించడానికి వీలుపడని విషయాలు, పాఠకునికి తెలియవలసిన విషయాలు ఉంటాయి. వాటిని తెలియ జేయడం పీఠిక ప్రధాన కర్తవ్యం. పీఠిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొన్న ప్పుడు పీఠికల్ని రెండు వర్గాలుగా విభజించవలసి ఉంటుంది. 1. రచయిత స్వయంగా రాసుకొన్నవి, 2. ఇతరులు రాసినవి. ఈ రెండింటిలో కొన్ని సమాన లక్షణాలతో పాటు భిన్నాంశాలు కూడా ఉంటాయి.

1. గ్రంథ నేపథ్యమూ, గ్రంథ విషయ పరిచయమూ (వస్తువు, తానెన్ను కున్న రచనా విధానమూ, కొన్ని విషయాలకు వ్యాఖ్యానం (ప్రతీకలు మొ॥వి), లక్ష్యమూ, వ్యక్తిగత జీవిత విశేషాలూ స్వీయ పీఠికలలో ప్రధాన స్థానం వహిస్తాయి.

2. గ్రంథానికున్న చారిత్రక నేపథ్యమూ, గ్రంథ విషయ పరిచయమూ, **గ్రంథ సమీక్ష** (గుణదోష విచారం), లక్ష్యమూ (రచన నుండి గాని, రచయిత జీవితం నుండి గాని, ఇతర రచనల నుండి గాని ఊహించింది లేక రచయిత రచనలో గాని, మరెక్కడైనా కాని చెప్పుకొన్న దాన్ని ఉద్ధరించింది), **కవి కాలం, వ్యక్తిత్వం,** జీవిత విశేషాలు, **శైలి, పరిష్కరణ పద్ధతి** (రచయిత జీవించి ఉండనప్పుడు. ప్రతిని పరిష్కరించవలసిన అవసరం ఏర్పడ్డప్పుడు), **గ్రంథ ప్రచారాన్ని ఉద్దేశించిన ప్రశంసా** ఇతరులు పీఠిక రాసినప్పుడు ప్రధానమౌతాయి. (పెద్ద అక్షరాలతో ఉన్నవి స్వీయ పీఠికలలో కంటె భిన్నమైన విషయాలు).

రచయిత స్వీయ పీఠికలో ఉండే విషయాలను, అటువంటి పీఠిక రాయవలసిన అవసరాన్ని, తద్రచన ద్వారా రచయిత పొందే తృప్తిని క్రిస్టఫర్

మార్లీ వివరించాడు. పీఠిక లేకుండా పుస్తకం రాయడం కంటే, పుస్తకం లేకుండా పీఠిక రాయడమే నయమంటాడు.

''It has been my conviction that the most graceful function of authorship is the writing of prefaces. What is more pleasant than dashing those few pages of genial introduction after all the dreary months of spading at the text? A paragraph or two as to the intentions of the book; allusions to the unexpected difficulties encountered during composition; neatly phrased gratitude to eminent friends who have given gracious assistance; and a touching allusion to the critic on the hearth who has done the indexing-one of the trials of the wives of literary men not mentioned by Mrs. Andrew Lang in her pleasant essay on that topic. A pious wish to receive criticisms ''in case a second edition should be called for''; your address, and the date, add a homely touch at the end.

How delightful this bit of pleasant intimacy after the real toil is over! It is like paterfamilias coming out of his house at dusk, after the hard day's work, to read his news paper on the doorstep or it may be a bit of superb gesturing. No book is complete without a preface. Better a preface without a book...

Many men have written books without prefaces. But not many have written prefaces without books. And yet I am convinced it is one of the subtlest pleasures. I have planned several books, not yet written; but the prefaces are all ready this many a day. Let me show you the sort of thing I mean''[126] అని అంటూ తను రాయబోయే పుస్తకాలకు మోడల్ పీఠికల్ని రాసి చూపించాడు మార్లీ. వాటిలో 'ది లెటర్స్ ఆఫ్ ఆండ్రూ మాక్‌గిల్' అన్న పుస్తకానికీ, ఆరు సంపుటాల్లో రాయదలచుకొన్న ఒక చరిత్ర గ్రంథానికీ, ఒక కవితా గ్రంథం మొదటి, రెండవ, మూడవ ప్రచురణలకూ పీఠికలున్నాయి.

రచన చేయడంలో రచయితకో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యసాధనకోసం రచన చేయడంలో శ్రమపడతాడు. తను పడిన శ్రమను, తానుద్దేశించిన

లక్ష్యాన్నీ తెలియజేస్తూ, తన శ్రమ సఫలం కావాలని ఆశిస్తాడు. రచన పాఠకుల మనస్సుల్లో ఎన్నో సందేహాలను రేకెత్తించవచ్చు. వాటిని తీర్చడానికి రచయిత పాఠకుడి ఎదురుగ్గా కూర్చోడు కదా! అందుకే పాఠకుడికి రాదగిన అవకాశం ఉన్న సంశయాలను ఊహించుకొని వాటికి పీఠికలో రచయిత సమాధానం చెప్తాడు. ఈ ప్రయత్నంలో రచనా సమయంలో స్పష్టాస్పష్టంగా ఉన్న భావాలు పీఠికా రచనా ప్రయత్నంలో స్పష్టతను పొందవచ్చు. ఆ స్పష్టత రచనా పఠనంలో పాఠకుడి అవగాహనను మరింత పెంచడానికి తోడ్పడుతుంది. రచన వాంఛించే వివరణ, వ్యాఖ్యానం ఒక్కొక్కసారి పరిమాణంలో రచనకంటే దీర్ఘంగా ఉండవచ్చు. అటువంటి వివరాలతోకూడిన పీఠిక ఆవశ్యకతను రచయిత గుర్తించినప్పుడు పీఠిక నిడివి అనివార్యంగా పెరుగుతుంది. 'జాబాలి' అనే తన 30 పుటల నాటికకు నార్ల వెంకటేశ్వరరావు 67 పుటల పీఠిక రాశాడు. అందులో "ప్రాచీనమైన ప్రతిదాన్నీ పవిత్రమైనదిగా భావించేవారికి, పరమ సత్యమైనదిగా విశ్వసించే వారికి నేనింతవరకు రాసిన విషయాలే దుస్సహమైనవిగా తోచి ఉంటాయి. అయినా నాపై కోపగించి ఇంతటితో ఈ పీఠికను చదవడం మానివేయవద్దని నా మనవి" అనీ, "నా నాటిక చిన్నదైనా దానికి పెద్ద పీఠిక అవసరమని దీన్ని ప్రారంభించాను. అయితే ఇంత పెద్దదిగా ఇది పెరిగిపోతుందని మాత్రం ఊహించలేకపోయాను. ఇది మీకెంతవరకు ప్రయోజనకారి కాగలదో తెలియదుగాని, దీనివల్ల నామట్టుకు నేను పెద్ద లాభమే పొందాను. పెక్కేండ్లుగా సంస్కృత రామాయణాన్ని, రామాయణ వ్యాఖ్యానాలను, రామాయణంపై పరిశోధక గ్రంథాలను చదువుతున్నాను. ఈ విస్తృతపఠనం స్పష్టాస్పష్టమైన భావాలను ఎన్నింటినో నాలో రేపుతూ వచ్చింది. ఏపుగాపెరిగిన కీకారణ్యంవలె వున్న ఈ భావజాలానికి ఒకతీరు దిద్దడానికి, ఒక తెన్నుకూర్చడానికి ఈ పీఠికారచన నాకు విశేషంగా తోడ్పడింది. ఇట్టి ప్రయోజనాన్ని మీలో ఏకొందరు దీనినుంచి పొందగలిగినా, ఆరోగ్యం అంతససిగా లేని రోజులలో దీన్ని వ్రాయడానికి నేనుపడినశ్రమ వృథా కాలేదని సంతోషిస్తాను" అనీ అంటాడు.[127] ఈ మాటల్లో పీఠికారచనలో రచయిత పడ్డశ్రమా, ఆశించిన ప్రయోజనమూ స్పష్టమౌతుంది. పీఠిక కేవలం పఠనోన్ముఖం చేసే మామూలు నాలుగు వాక్యాలు మాత్రమే కాదనీ దానికి విశిష్టమైన ప్రయోజనం కూడా ఉందనీ వెల్లడౌతుంది.

"వార మాస పత్రికల అలవోక నవలలకు పీఠికలు అనవసపు ఖర్చు కావచ్చుగాని ఉత్తమ సాహిత్య కృషికి ఆదినుండీ కావ్యేతర ప్రసంగం అవసర మౌతుంది."128 అన్నాడు చందుసుబ్బారావు.

రచయిత తరువాతి ప్రచురణ కోసం విమర్శనాహ్వానిస్తాడు. పాఠకులు రచనలోని దోషాలను తెలియజేస్తే కృతజ్ఞతతో సరిదిద్దుకుంటా నంటాడు. ఇది పీఠికలో ఒకభాగం. 'మీరాబాయి' పీఠికలో "ఓపినకొలది శోధించియున్నాను. నాకన్ను మీరిన దోసంగులిందేవైన నున్న సహృదయాగ్రగణ్యులగు పండితులు కరుణించి నాకు దెలిపిన సాధ్యమైనంత సవరింతునని సవినయముగ విన్నవించెద. పీఠికా లేఖనపద్ధతి ననుసరించి ప్రార్థించితిగాని యిందువలనం బ్రయోజనముగానను, ఎఱిగిన సుహృదయులు దోషములను మన్నింతురుగాని కవికి దెలియ జేయరు. ఇంక నెఱుగనిదుర్హృదయులు గుణములనే దోషములుగ గ్రహించి వషట్కారములకుపక్రమింతురు. ఇకమాకు గరుణించి తప్పుల దెల్పువారెవ్వరు?"129 అన్నాడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

ఇతరులు పీఠిక రాసినప్పుడు గ్రంథకర్త, గ్రంథాల ప్రశంస, స్తుతి తప్పనిసరిగా వస్తుంది. అందుకే పీఠిక అంటేనే పొగడ్త అనే అభిప్రాయం ఏర్పడింది. "సామాన్యముగ పీఠికయనగా కవిని కావ్యమును పొగడుట"130 అన్నాడు దిగుమర్తి సీతారామస్వామి.

ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం-8' పీఠికలో రచయితతో తన అభిప్రాయ భేదాలను పేర్కొంటూ చివర "పీఠిక సామాన్య స్వరూపాన్ని దాటి పై మాటలు రాసినందుకు ఆరుద్రగారు నన్ను మన్నిస్తారని నమ్మినాను"131 అన్నాడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పీఠికా సామాన్య స్వరూపం అంటే గ్రంథప్రశంస అని స్ఫురింపజేస్తూ.

తుమ్మల సీతారామమూర్తి 'మహాత్మకథ'కు అవతారికరాస్తూ "ఈ రీతిని గురువునయిన నేను - ఈయన రచనముల గూర్చిన ఇతరోదీరిత ప్రశంసా వచనములు తటస్థముగ నాలకించుచు, లోలో నానందమొందుచు, తన్నుఁదా నభినందించుకొనవలసిన నేను - నేనుగా మహాత్మకథకు అవతారిక రచింప

వలసివచ్చినది. ఎట్టి చిక్కో గమనింపుడు. ఉదాత్త పవిత్రేతివృత్త సంభరితమయి, కమనీయ కవితా విలాస భాసురమయిన యీ కావ్యరత్నమునకు అవతారిక రచించునెడ, కవితా గుణమునుల్లేఖించు పట్టులందు కవిని గూర్చిన ప్రశంసావచనములు అనివార్యములయి ఆవరించునేమో ! అట్టి మెచ్చుకోళ్ళు లోకముమాట యటుండ మొదట ఈ శాలీనునికే రుచింపవాయెను. అదిగాక నేను మాత్రము ఆత్మీయ ప్రశంసకు అసంకోచముగ ప్రవర్తిల్లఁగలనా ? ఆత్మస్తుతికిని దానికిం గల భేదమేమి ?"[132] అన్నాడు దువ్వూరి వేంకటరమణశాస్త్రి.

పీఠిక కేవలం గ్రంథానికి సిఫారసు, రికమండేషన్ అన్న అభిప్రాయమూ ఉంది. "కావ్యము వ్రాయుట సుకరమేమోగాని వ్రాసిన వానిని ప్రకటించుటయు అభిప్రాయములకై పలువురి నాశ్రయించుటయు భగీరథ ప్రయాసము"[133] అన్నాడు కాండూరి నరసింహాచార్యులు. గడియారం వేంకటశేషశాస్త్రి 'శ్రీ రఘునాథీయా'నికి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పీఠికరాస్తూ "మీ గ్రంథమునకు ఎవరి పీఠికతో ఏమి పని ? అన్న నామనవిని లక్ష్యపెట్టలేదు"[134] అన్నాడు. చింతా దీక్షితులు 'ప్రజావాఙ్మయా'నికి ప్రస్తావనరాస్తూ చలం "ఈనాడు ఇంకా దీక్షితులు గారి పుస్తకానికి ఓ ప్రస్తావన కావాలనుకోడం చిత్రంగా ఉంది"[135] అన్నాడు. గ్రంథకర్త ప్రసిద్ధుడై, గ్రంథం ఉత్తమమయినప్పుడు దానికి సిఫారసు ఎందుకు? అందువల్ల దానికొకరు పీఠిక రాయడం అనావశ్యకమని భావించినట్లైంది. పీఠికల సిఫారసులవల్ల గ్రంథం నిలబడదు. అది కేవలం దాని శక్తివల్లనే నిలబడుతుంది. మంచి కవిత్వానికి ఇతరుల రికమండేషన్ అవసరం లేదు అని భావించారు చాలామంది.

కరుటూరి సత్యనారాయణ 'కరుణా సౌగతా'నికి పీఠికరాస్తూ మల్లంపల్లి శరభయ్య "అప్పట్లో వారి 'తిష్యరక్షిత'కు పీఠిక వ్రాయవలసిందని నన్ను కోరారు. నాకు నిజంగా పీఠికలమీద నమ్మకం లేదు...పీఠిక ఎంత కట్టుదిట్టంగా వ్రాసినా కావ్యంలో లేని గుణాన్ని తీసుకొనిరాలేదు సరిగదా ఉన్నగుణాన్ని మరుగుపరచనూలేదు. సామాన్యంగా పీఠికల ధోరణులు వాఙ్మయ గేహళిలోనికి అడుగుపెట్టబోతున్న ఈ నూత్న కావ్యకర్తలకింత యశోభిక్ష పెడుతూ అభ్యను

జ్ఞనిచ్చే పెద్దఱికాన్ని ప్రదర్శిస్తూ ఉంటాయి. కొన్ని సందర్భాలలో లబ్ధప్రతిష్ఠుడైన ఆ పీఠికా నిర్మాతకంటే ఈ కావ్యకర్తే సమర్థుడుగా గోచరిస్తూ ఉంటాడు" అనీ "ఇకముందు మరెవ్వరికి పీఠికావిరచన శ్రమను కలిగించని స్వయం ప్రకాశములైన మహా కావ్యములను రచిస్తూ ఉండ"మని[136] ఆకాంక్షించాడు.

గజ్జల మల్లారెడ్డి 'శంఖారావా'నికి పీఠికరాస్తూ శ్రీశ్రీ "మల్లారెడ్డి కవిత్వం ఇప్పటికే బహుజనాదరణ పొందింది. ఇవాళ నేను దీన్ని ప్రత్యేకంగా సిఫారసు చెయ్యవలసిన పనిలేదు. ఏదో లాంఛనప్రాయంగా నాకుతోచిన నాలుగు ముక్కలు రాసి నా ఆనందాన్ని పాఠకులందరితోనూ పంచుకోవడానికి ప్రయత్నించాను. మంచి కవిత్వం తన్నుతానే రికమెండ్ చేసుకుంటుంది"[137] అన్నాడు "మహాకవీ, రచయితా అయినవాడు రికమెండ్ చేస్తే గ్రంథానికి బ్రతుకు పెరగదు. అదనపు గౌరవం లభించదు. వైద్యుని మందువల్ల శరీరం శక్తి పెరగదు, శరీర దార్ఢ్యానికి మందుసాయం చేస్తుందంతే" అనీ "రచనలో వైయక్తికశక్తిలేనప్పుడు ఎన్నిపీఠికలూ, పాఠకుల్ని లంచం ఆశ చూపించి దగ్గరకు పిలిపించలేవు"[138] అనీ అన్నాడు చందు సుబ్బారావు.

కేవలం గ్రంథకర్త, గ్రంథాలను ప్రశంసించడమే కాదు. రచనలోని గుణదోషాలను పరిశీలించి విశ్లేషించిన పీఠికలుకూడా ఎన్నో ఉన్నాయి. ఇతరులు పీఠిక రాసినప్పుడు ఇది ఒక ప్రధాన లక్షణమే అవుతుంది. "సాధారణముగా ఉపోద్ఘాత రచయితలగు వారికి - ప్రస్తుతమగుచున్న యంశమును సాకల్యముగ చర్చించే గుణదోష విచారణసేవ చేయవలసి యుండుట మిగుల ముఖ్యమని నే నెఱుంగక పోలేదు"[139] అన్నాడు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి. ఈ గుణదోష విచారణకు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ పీఠికలన్నీ ఉదాహరణలుగా నిలుస్తాయి. ఇదే విషయాన్ని జాన్సన్ మరో విధంగా వ్యక్తం చేశాడు. "There are two things which I am confident I can do very well. One is an introduction to any literary work, stating what it is to contain, and how it should be executed in the most perfect manner; the other is a conclusion, showing from various causes why the execution has not been equal to what the author promised to himself and to the public".[140]

ఏది ఏమైనా ఒక గ్రంథానికి ఒక మంచి పీఠిక అవసరాన్ని డిజ్రేలీ ఈ విధంగా నొక్కి చెప్పాడు "A good preface is as essential to put the reader into good humour, as a good prologue to a play, or a fine symphony to an opera, containing something anologous to the work itself; so that we may feel it's want as a desire not else where to be gratified." ఆయనే "A preface being the entrance of a book, should invite by it's beauty. An elegant porch announces the splendour of the interior."[141] అనికూడా అన్నాడు.

"విషయ వివేచనతో, చక్కని శైలీ విన్యాసంతో కూడిన మంచి పీఠికలు పాఠకుల చిత్తాకర్షకాలై రచయిత శేముషీ వైభవానికి నికషోపలాలై విరాజిల్లుతాయి. పీఠికలవల్ల కలిగే ముఖ్య ప్రయోజనం ఇదే"[142] అన్నాడు భాస్కర చౌదరి.

మొత్తం మీద పీఠిక గ్రంథాన్ని అర్థం చేసుకోవడంలో తోడ్పడేదిగా ఉంటుంది. అందుకు అవసరమైన బహిరంతర్ సమాచారాన్ని అందిస్తుంది. అదే పీఠిక ప్రధాన ప్రయోజనం.

పీఠిక స్వరూపం, ప్రయోజనాలను పరిశీలించిన తర్వాత పీఠికను ఈ విధంగా నిర్వచించవచ్చు.

నిర్వచనం :

ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక, పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ, సహకరించిన వారికి కృతజ్ఞతలు చెప్తూ, ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన పీఠిక. ఇది వచన రూపంలోగాని, పద్యరూపంలోగాని ఉండవచ్చు. గ్రంథకర్తగాని, ఇతరులుగాని రాయవచ్చు.

పీఠిక : ఉత్పత్తి వికాసాలు

పూర్వరంగం

మొదటి అధ్యాయంలో ఆధునిక పీఠికా స్వరూపాన్ని పరిశీలించేటప్పుడు ఒక గ్రంథం విషయాన్ని, పరిధిని, లక్ష్యాన్ని సూచిస్తూ, గ్రంథ రచనకు పురి కొల్పిన మూలాలను, చరిత్రను, ఆధారాలను, గ్రంథ ప్రణాళికను పేర్కొని, కవికాలాదులను, రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులను విడమరుస్తూ, గ్రంథరచనకు తోడ్పడినవారికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాన గ్రంథానికి ముందుగా వెలువడే పరిచయమే పీఠిక, అని నిర్వచించాను. ఇది వ్యాసరూపంలో నయినా, పద్యరూపంలో నయినా ఉండవచ్చు. సంక్షిప్తంగాను ఉండవచ్చు. సుదీర్ఘంగాను సాగవచ్చు. అన్ని పీఠికల్లోనూ పైలక్షణాలలో కొన్నే ఉండవచ్చు, అన్నీ ఉండవచ్చు. ఏమైనా ప్రధాన రచనకు ముందుండే పరిచయ వాక్యాలే పీఠిక. పై నిర్వచనాన్ని విశ్లేషిస్తే వెలువడే అంశాలివి.

రూపం 1. పద్యమైనా, గద్యమైనా.
2. సంక్షిప్తమైనా, సుదీర్ఘమైనా

భావం 1. కవి - కాలాదులు (రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులు)

(గ్రంథేతర సమాచారం) 2. మూలం
3. కవితా పరామర్శ
4. విమర్శ
5. కృతజ్ఞతలు, అంకితం

(గ్రంథాంతర్గత సమాచారం) 1. ఇతివృత్తం. గ్రంథ ప్రణాళిక
2. గ్రంథ విషయ (కవిత్వ) పరిశీలన

పీఠిక హఠాత్తుగా ఆధునిక సాహిత్యంలో బయటపడింది కాదు. ప్రాచీన కావ్య నాటకాల అవతారికల్లో, ప్రస్తావనలలో, ప్రోలాగులలో ఆధునిక పీఠికా లక్షణాలు గోచరించటం వల్ల ఆధునిక పీఠిక శతాబ్దాల పరిణామక్రమంలో రూపుదిద్దుకున్నదే తప్ప ప్రత్యేకంగా ఎవరి సృష్టీకాదు అన్న విషయం స్పష్టమౌ

తుంది. వీటిలో బీజప్రాయంగా ఉన్న ఈ లక్షణాలు అనుకూల వాతావరణం (ఉత్తరరంగంలో చర్చించడం జరిగింది) ఏర్పడగానే స్వంత వ్యక్తిత్వంతో 17, 18 శతాబ్దాల నుండి అవతరించాయి. 1. ప్రొలాగులలో, అవతారికలలో, ప్రస్తావనలలో బీజప్రాయమై కన్పించే పీఠికాలక్షణాలను పరిశీలించటం. 2. అవి ఏ నేపథ్యం నుండి కావ్యాల్లో, నాటకాలలో చోటుచేసుకొన్నాయో చర్చించటం 3. తెలుగు సాహిత్యంలో ఆ లక్షణాలకు సంప్రదాయపరమైన, పాశ్చాత్య ప్రభావ పరమైన హేతువులను చర్చించటమే పీఠికకు పూర్వరంగమౌతుంది.

1. ప్రాచీన కావ్యావతారికలు, నాటకప్రస్తావనలు, ప్రొలాగులు:

ప్రాచీన తెలుగు సాహిత్యమంతా, సంస్కృత సాహిత్యానికి అనువాద, అనుసరణ ప్రాయంగా వచ్చినట్లే, ఆధునికాంధ్ర సాహిత్యం మీద ప్రభావం నెరపిన ఆంగ్ల సాహిత్యమంతా ప్రాచీన గ్రీకు లాటిన్ సాహిత్యాలకు అనువాద, అనుసరణ ప్రాయంగా వచ్చింది. తెలుగు కావ్యావతారికలను గురించి, ఆధునిక కాలంలో వెలువడుతున్న పీఠికలను గురించి చర్చించేటప్పుడు కావ్యావతారికలకు కొందరు సంస్కృత సాహిత్యాన్ని, కొందరు కన్నడ సాహిత్యాన్ని మూలంగా చెప్తున్నారు. ఆధునిక పీఠికకు ఆంగ్లమే మూలమంటున్నారు. అందువల్ల తెలుగు కావ్యావతారికలను పరిశీలించే ముందుగా సంస్కృత, గ్రీకు, లాటిన్, ఆంగ్ల కావ్య, నాటకావతారికలను, ప్రస్తావనలను, ప్రొలాగులను దిఙ్మాత్రంగా పరిశీలించడం అవసరం.

గ్రీకు కావ్యాలు, నాటకాలు - అవతారికలు, ప్రొలాగులు:

గ్రీకు సాహిత్యంలో లభిస్తున్న మొదటి రచనలు హోమర్‌వి. ఈయన ఇలియడ్, ఒడిస్సీ అన్న రెండు మహేతిహాసాలను రచించాడు. ఇలియడ్‌లో ఎకిలస్ ఆగ్రహాన్ని గురించి పాడమని దేవతనుద్బోధిస్తూ ప్రారంభిస్తాడు (దేవతాస్తుతి). తాను పాడబోయే కథాసూత్రాన్ని వివరిస్తాడు (ఇతివృత్తం)[1]. ఒడిస్సీలో ఆయన సూర్యుణ్ణి సంబోధిస్తాడు (దేవతా స్తుతి) నీవూ నేను జీవించి ఉన్నంతకాలం మన హృదయాలను కదిలించే పాట పాడాలని ఉంది అంటాడు.[2] కావ్య ప్రధాన కథాసూత్రాన్ని వివరిస్తాడు (ఇతివృత్తం)[3]. ఈ సంప్రదాయం

మహాకావ్యరచనా సందర్భంలో ఆధునిక గ్రీకు సాహిత్యంలో నేడు కూడా కనిపిస్తుంది. ఇవి కావ్యావతారికల వంటివి.

గ్రీకు నాటకాలలో సంస్కృత నాటకాలలోని ప్రస్తావన మాదిరిగా ప్రొలాగ్ ఉంటుంది.[4] క్రీ॥పూ. 478 లో ఫ్రినికస్ రచించిన 'ఫోనీషియన్ ఉమెన్' అన్న నాటకంలో మొదటిసారి ప్రొలాగ్ కనిపిస్తుంది. యురిపిడిస్ తన విషాదాంత నాటకాలకు ఇతివృత్త సూచనా ప్రధానమైన విపుల ప్రస్తావన (ప్రొలాగ్) లను రచించాడు.[5] 'హిప్పొలైటస్' నాటక ప్రస్తావన ఆఫ్రొడైట్ దేవతచేత చేయిస్తాడు యురిపిడిస్[6]. 'అల్ సెస్టిస్' అన్న మరో నాటకానికి రెండు పాత్రలతో కూడిన ప్రస్తావనను రచించాడాయన.[7] వీటిలో ఒక పాత్ర అపోలో రెండో పాత్ర మృత్యువు. ఈ రెండు పాత్రల సంభాషణలో నాటకేతివృత్తం వెల్లడౌతుంది.

లాటిను సాహిత్యం

ప్రాచీన లాటిను సాహిత్యమంతా గ్రీకు సాహిత్యానికి అనువాద అనుసరణ ప్రాయంగా వచ్చింది. గ్రీకు సాహిత్యం అత్యున్నత దశలో ఉన్న రోజుల్లో రోమన్లు సామ్రాజ్య విస్తరణాది కార్యక్రమాల్లో మునిగి తేలుతున్నారు. వాఙ్మయాది సంస్కృతీ కార్యక్రమాల్లో పాల్గొనే తీరికే వారికిలేదు. గ్రీసును జయించిన తరువాత, గ్రీకు సంస్కృతిని చూచిన తరువాత గాని వారికి తాము కోల్పోయిన దేమిటో తెలియలేదు. యుద్ధంలో బందీలుగా వచ్చిన గ్రీకులు కొందరు రోమన్లకు నాటకరంగాన్ని ప్రసాదించారు. అంతకు ముందు నామ మాత్రంగాను, అభివృద్ధి చెందనిదశలోను, అవికసితంగాను ఉన్న రోమన్ల నాటక కళ గ్రీకు నాటక పరిచయంతో ఒక్కసారిగా వికసించింది. ప్రాథమిక దశలో చాలవరకు గ్రీకు నాటకాల అనువాదాలే లాటినులో వచ్చాయి. తరువాత కొన్ని స్వతంత్ర రచనలు బయలుదేరినా ఇతివృత్తాన్ని గ్రీకు సాహిత్యం నుండే గ్రహించాయి.

గ్రీకు నాటకంతోపాటు ప్రస్తావన కూడా లాటిన్‌లో ప్రవేశించింది. మొదటి తరం నాటకకర్తల్లో టైటస్ మాక్సియస్‌ప్లాటస్(క్రీ.పూ.254-184)అగ్రగణ్యుడు. ప్లాటస్ ప్రస్తావనలు ఒక వాక్యం నుండి రెండు పేజీల దాకా ఉంటాయి. 'క్యూర్‌కోలస్' అన్న నాటకానికి ప్రస్తావన ఏకవాక్యంలో ఉన్నది. నాటకం

మొదలవబోతున్నది, సావధానంగా ఉండి నాటకాన్ని తిలకించండని ప్రేక్షకుల నుద్బోధిస్తాడాయన.[8] సాధారణంగా ప్లాటస్ తన నాటకాలలో మూల నాటకం పేరు, తత్కర్త పేరు, తనపేరు, తన అనువాదం పేరు చెప్తాడు[9] (మూలం, కవి స్వీయప్రసక్తి); కథా సూత్రాన్ని వివరిస్తాడు[10]; నాటకం ప్రారంభంలో వచ్చే పాత్ర సూచన కూడా కొన్ని నాటకాలలో చేస్తాడు[11]; 'రూడెన్స్' మొదలైన నాటకాలలో ప్రస్తావనా రచనలో ప్లాటస్ తన ప్రతిభనంతా చూపాడని విమర్శకులు భావిస్తున్నారు. The Three penny days అన్న నాటక ప్రస్తావనలో లగ్జరీ, పావర్టీ అన్న రెండు పాత్రలను ప్రవేశపెట్టాడు. The Braggart warrior అన్న నాటకంలో రెండో అంకం మొదటి దృశ్యాన్ని ప్రస్తావనగా కూర్చాడు.

ప్లాటస్ తరువాత పబ్లియస్ టెరెన్షియస్ అఫర్ (క్రీ. పూ. 195-159) ప్రసిద్ధుడు. ఈయన ప్రస్తావనలు ప్లాటస్ ప్రస్తావనలకంటే భిన్నంగా ఉంటాయి. నాటకవస్తువును,కథా నిర్మాణాన్ని సూచించటానికి ప్లాటస్ ప్రస్తావనా రచన చేస్తే టెరెన్స్‌నాటకేతివృత్తానికి సంబంధించిన విషయాన్ని తన ప్రస్తావనల్లో సూచించనే లేదు. ఇతర సాహిత్య ప్రయోజనాల కోసం దాన్ని వినియోగించాడు. నాటక కర్తగా తన స్థానాన్ని సమర్థించుకోవటానికి, తన ప్రతి పక్షుల్ని విమర్శించటానికి ప్రస్తావనలనాయన విస్తృతంగా ఉపయోగించాడు[12](విమర్శ). ప్రస్తావనలో ముందుగానే ఇతివృత్త వివరణ లేకపోవటానికి కారణం,ఇతివృత్తం తెలియకుండా ఉన్నందువల్ల కలిగే ఉత్సుకతనూ, నాటకంలో హఠాత్ పరిణామాలవల్ల కలిగే ఆశ్చర్యాన్నీ నిలిపేందుకే అని కొందరంటారు.

క్రీ.శ. 4 వ శతాబ్దంలో జన్మించిన సెనెకా లాటిన్ నాటక రచయితలలో సుప్రసిద్ధుడు. ఆయన నాటకాలలో సాంకేతికంగా మొదటి అంకమే ప్రస్తావన. క్రీ.శ. 5 వ శతాబ్దికి చెందిన పేరు తెలియని రచయిత రాసిన 'క్వెరొలస్' అన్న నాటకానికి విడివిడిగా ప్రస్తావనా, అంకితమూ రెండూ ఉన్నాయి. మధ్యయుగంలో ప్రస్తావనా రచనలో మోలియర్ ప్లాటస్‌ను అనుసరించాడు. రాసైన్ ప్రస్తావన చదివే పాత్రగా పిటీని ప్రవేశపెట్టాడు.[13] కథేతివృత్తమే దీనిలో ప్రధానం.

ఆంగ్ల సాహిత్యం

ప్రాచీన ఆంగ్లనాటకకర్తల మీద గ్రీకు, లాటిన్ సంప్రదాయ ప్రభావం చాలా వుంది. మధ్య శతాబ్దాలలో అద్భుత రసప్రధానమైన నాటకాలు హోమిలీ (మత లేక నీతి ప్రధానమైన ఉపన్యాసం) తో మొదలయ్యేవి. ఆధునిక నాటకంతో ప్రస్తావన కూడ ఆంగ్ల సాహిత్యంలో ప్రవేశించింది. ప్రాచీన సంప్రదాయం నుండి సరాసరి దిగుమతైంది. థామస్ శాక్‌విల్ 'గోర్బొడక్' మూకాభినయానికి 1562 లో ఒక విధమైన ప్రస్తావన తయారు చేశాడు. పలువురు రాసిన చిన్న చిన్న కాల్పనికేతిహాసాల సంకలనానికి ప్రసిద్ధమైన పరిచయం కూడ రాశాడు. ఇతివృత్తమే దీనిలో ప్రధానం.[14]

షేక్స్పియర్‌కు ముందువాడు క్రిస్టఫర్ మార్లో. ఈయన తన 'డాక్టర్ ఫాస్టస్' నాటక ప్రస్తావనలో నాటకంలో వర్ణించని డాక్టర్ ఫాస్టస్ పూర్వ చరిత్రను ఉల్లేఖించి, ప్రస్తుతేతి వృత్తాన్ని సూచించి ప్రయోగాతిశయంతో పాత్ర ప్రవేశం చేయించాడు.[15] ఎలిజబెత్ కాలపు ఆంగ్ల నాటకంలో ప్రస్తావన నందరూ వాడలేదు. షేక్స్పియర్ తన 'రోమియో అండ్ జూలియట్'లో మాత్రం ఆ నాటకం విధి వక్రించిన ప్రేమికుల జంటకు సంబంధించినదని ప్రస్తావనలో సామాజికులకు కథా సూచన చేశాడు.[16] సంప్రదాయ నాటక లక్షణాలను సమర్థిస్తూ, ఆ లక్షణాలను పాటించని వారిని గర్హిస్తూ బెన్‌జాన్సన్ నాటక ప్రస్తావనలను రాశాడు.[17] రాచరిక పునరుద్ధరణ తరువాత నాటకాలకు ప్రస్తావనలు తప్పనిసరి అయ్యాయి.[18] రివైవల్స్‌లో నాటకకర్త కాక మరెవరన్నా ప్రస్తావనలు రాసేవారు. అవి లయబద్ధమైన పద్యరూపంలో ఉండేవి. ప్రధాన నటుడు లేక నటి ప్రయోగించే వారు. ప్రాచీన సంప్రదాయాన్ని బెన్‌జాన్సన్ పద్ధతిలో పునరుద్ధరించిన వాళ్ళు రివైవల్స్.

ఆంగ్ల పద్యరచనలలోకి వస్తే చాసర్ తన 'కాంటర్బరీటేల్స్'కు అవతారిక రాశాడు. చాసర్‌కంటే ముందుండిన ఎనానిమస్ కవులు కూడ అవతారికలు రాసుకున్నారు. వీటన్నిటి స్వరూపం ఒకటే. ఇవి తరువాత చెప్పబోయే కథలకు పూర్వరంగాలు. సంస్కృత గద్యకావ్యాలలో కథాముఖం, పూర్వ పీఠిక అని

వ్యవహరించే భాగానికీ చాసర్ అవతారిక (ప్రొలాగ్)కూ ఏమీ తేడాలేదు. చాసర్ ముందుగా కాంటర్ బరీయాత్రకు అనువయిన వేసవికాలాన్ని వర్ణించాడు. తరువాత తాను ఎలా ప్రయాణ సన్నద్ధుడై సౌత్ వార్క్-లో టాబర్ట్ ఇన్‌లో దిగిందీ, తనలాగే వచ్చిన 29 మంది ఇతర ప్రయాణీకులను ఎలా కలుసుకున్నదీ వర్ణించాడు.[19]

ఆంగ్లకావ్యాల అవతారికలలో దేవతాస్తుతి వంటి ఇన్‌వొకేషన్ రాసే సంప్రదాయముంది. ఎడ్మండ్ స్పెన్సర్ 'ఫెయిరీక్వీన్'లో తానుపూనుకున్న రచనాకార్యానికి తాను అర్హుడుకాడనీ, శక్తిహీనుడైన తనకు ఆ రచన చేసే శక్తిని ప్రసాదించి సహాయం చేయమనీ హోలీ వర్జిన్‌ను ప్రార్థిస్తాడు.[20] మిల్టన్ మహాకవి కూడా తన పారడైజ్ లాస్ట్ ఇతిహాస కావ్యానికి ఇన్వొకేషన్ రాశాడు. ముందు కథా వస్తువును సూచించాడు. గద్యంలోగాని, పద్యంలో గాని అంతకు ముందెవ్వరూ ప్రయత్నించని రచనకు తాను పూనుకున్నానని, దాన్ని అత్యున్నతంగా నిర్వహించడానికి శక్తినిమ్మనీ మ్యూజ్ దేవతను ప్రార్థించాడు.[21]

18వ శతాబ్దానికల్లా పుస్తకాలకు పీఠికలు విస్తారంగా వచ్చాయి. ఇతిహాస కావ్యాలను వ్యంగ్యంగా అనుకరిస్తూ అలెగ్జాండర్ పోప్ తన వ్యంగ్యేతిహాసం (Mock epic) 'రేప్ ఆఫ్ ది లాక్' లో పూర్వకవులు ప్రస్తావనాప్రాయంగా పీఠికను రాయటాన్ని కూడా అనుకరించాడు.[22]

సంస్కృత సాహిత్యం

సంస్కృత సాహిత్యంలో ఆదికావ్యం 'రామాయణం' వాల్మీకి రచన. ఇందులో బాలకాండలో మొదటినాలుగు సర్గలు పీఠికాప్రాయమైనవి. ఇతివృత్తం, ప్రేరణ, హేతువు, ప్రయోజనాలతో కావ్యావతారికా రచన సాగింది.[23] రఘువంశంలో కాళిదాసు కూడా అవతారికా రచన చేశాడు. పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించి, సూర్యవంశ ప్రభువుల చరిత్రను వర్ణించడానికి తన అల్పత్వాన్ని పేర్కొంటూ, పూర్వకవుల మార్గాన్ని అనుసరిస్తానంటాడు. కావ్యపఠనార్హతను నిర్దేశిస్తాడు. [24] బాణుడు 'కాదంబరి'లో మంగళాచరణం చేసి, దుర్జన నిందా, సజ్జనస్తుతీ చేశాడు. కథావస్తువును ప్రశంసించాడు. తనవంశాన్ని వర్ణించాడు (స్వీయప్రసక్తి). ఆ వంశంలో తనచేత ఈ కథ అద్వితీయంగా నిబంధ

మైందని చెప్పుకున్నాడు.[25] బాణుని హర్ష చరిత్రలో అవతారికా ప్రాయమైన మొదటి ఉచ్ఛ్వాసంలో దైవస్తుతి, సుకవిస్తుతి, కుకవినింద, కవిత్వలక్షణం, కథావస్తువు ఉన్నాయి. చివరకథా నాయకుడైన హర్షుణ్ణి స్తుతించే శ్లోకంతో అవతారికను ముగించాడు బాణుడు. ప్రతిఉచ్ఛ్వాసం ఆరంభంలో రెండేసి శ్లోకాలతో ఆ ఉచ్ఛ్వాసంలోని విషయాన్ని సూచించాడు. ఇది లాటిన్ నాటకాల్లో, ఆంగ్ల కావ్యాలలో కనిపించే ఆర్గ్యుమెంటులాంటిదే.[26] కొన్ని కావ్యాలలో ఫలశ్రుతి కూడా కనిపిస్తుంది.

సంస్కృత నాటకాలలో గ్రీకునాటకాలలోని ప్రోలాగు లాగా ప్రస్తావన ఉంటుంది. దీన్నే స్థాపన, ఆముఖం అని కూడా అంటారు.[27] సంస్కృత నాటక కర్తలలో ఆద్యుడు భాసుడు. ఆయన తన రూపకాలకు స్థాపనలు రాశాడు. ఆయన రాసిన స్థాపనలన్నిటిలోను వస్తునిర్దేశమూ, పాత్రప్రవేశసూచనా కనిపిస్తాయి. కవి గురించిన ప్రసక్తి మాత్రం ఎక్కడా లేదు. 'ప్రతిమా' నాటకంలో ఋతు ప్రసక్తి కనిపిస్తుంది.[28]

కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతల' నాటక ప్రస్తావన సూత్రధారనటీ ప్రయుక్తం. నాటకం పేరు, కర్తపేరు వెల్లడించాడు. రంగప్రసాదనం కోసం గ్రీష్మ ఋతువర్ణన చేశాడు. ప్రయోగాతిశయంతో ప్రథమాంకంలో ప్రవేశిస్తున్న పాత్ర సూచనచేశాడు.[29] 'మాళవికాగ్ని మిత్రం'లో కూడ నాటకం పేరు, కర్త పేరు సూచించింతర్వాత, ప్రసిద్ధులైన నాటకకర్తలు, భాససౌమిల్లకాదులు ఉండుండగా సమకాలీనుడైన కవి కాళిదాసు నాటకమే ఎందుకు ప్రయోగించాలి, అని ప్రశ్నించుకొని, ప్రాచీనమైనదంతా మంచికాదు, నవీనమైనదంతా చెడ్డకాదు, సత్పురుషులు పరీక్షించి మంచే గ్రహిస్తారు, మూఢులు పరప్రత్యయనేయ బుద్ధులు అని సమాధానం చెప్తాడు.[30]

నాలుగవ శతాబ్దం వాడైన విశాఖదత్తుడు తన 'ముద్రారాక్షసం'లో భంగ్యంతరంగా నాందిలో కథాసూచన చేశాడు. నాటకం పేరు, కర్తపేరు తాత తండ్రులతోసహా చెప్పుకున్నాడు. ఉద్ఘాత్యకంతో పాత్రప్రవేశ సూచన చేశాడు.[31]

తొమ్మిదవ శతాబ్ది ప్రారంభకాలంవాడు మురారి తన 'అనర్ఘరాఘవ' నాటకంలో తన వంశాన్ని గురించి, తల్లిదండ్రుల్ని గురించి చెప్పుకున్నాడు.

అతని అమృతబిందు నిష్యందమైన రచననూ, తీసుకున్న ఇతివృత్తమూ, వాల్మీకి వాగమృతమూ దానికి కలిగించిన శోభనూ ప్రస్తావించాడు.[32]

ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన సంస్కృత కావ్యావతారికలను, నాటక ప్రస్తావనలను, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన ఆంగ్ల సాహిత్యంలోని ప్రొలాగులను, దాన్ని ప్రభావితం చేసిన గ్రీకు, లాటిను కావ్యాల, నాటకాల ప్రొలాగులను సమీక్షించిన తదుపరి మనకు లభించిన, అవతారికా, ప్రస్తావనా లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి.

రూపం	1.	సాధారణంగా పద్యం
	2.	నాతి దీర్ఘం
భావం	1.	దేవతాస్తుతి
	2.	ఫలశ్రుతి
(గ్రంథేతర	3.	అంకితం- కృతిపతి వర్ణన
సమాచారం)	4.	మూలం - మూలకర్తృ ప్రశంస
	5.	కవి స్వీయప్రసక్తి
	6.	కవిత్వాశయాలు - స్వకావ్యప్రశంస
	7.	విమర్శ
		i. కుకవినింద
		ii. సుకవిస్తుతి – పూర్వకవిస్తుతి
		iii. దుర్జననింద
		iv. సజ్జనస్తుతి
		v. కావ్యపఠనార్హత
(గ్రంథాంతర్గత సమాచారం)	1.	ఇతివృత్తం

పై అవతారికా, ప్రస్తావనా లక్షణాలన్నీ ఇంచుమించు కొద్దిరూప భేదంతో ఆధునిక పీఠికలకూ ఉన్నాయి. ఆధునిక పీఠికలు సాధిస్తున్న ప్రయోజనాన్నే నాటి అవసరానికి తగినట్లు కావ్యావతారికలూ, ప్రస్తావనలూ సాధిస్తున్నాయి. అందువల్ల అవీ పీఠికలే. ఆధునిక పీఠిక సంప్రదాయ సాహిత్య పరిణామక్రమంలో ప్రభవించినదే. అక్కడి లాగే యిక్కడ కూడ గ్రంథాంతర్గత సమాచారం కంటే గ్రంథేతర సమాచారమే అధికం.

2. పీఠికా లక్షణాలు – నేపథ్యం

పై పీఠికా లక్షణాలు కావ్యావతారికలలో, నాటకాల ప్రస్తావనలలో ఏ నేపథ్యం నుండి చోటు చేసుకున్నాయో చర్చించటం అవసరం.

i) మతవిశ్వాసాలు : పీఠికా లక్షణాలు

ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల్లో కాలక్రమంలో వచ్చిన పరిణామాన్ని చెప్పటమే దేశచరిత్ర అయితే, ఆ సంబంధాలు సాహిత్యంలో ఎలా ప్రతిబింబించాయో, దానికి అనుగుణంగా సాహిత్యరూపాలెలా ఏర్పడ్డాయో చెప్పటమే సాహిత్య చరిత్ర అవుతుంది. అనాది మానవుడు ఆహార సముపార్జన దశనుండి ఆహారోత్పాదన దశవరకు సాగినకాలంలో ఉపరితల విషయాలైన మతం, తత్వం, చట్టం, సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం మొదలైనవి ప్రభవించాయి. ఒకటినొకటి ప్రభావితం చేసుకున్నాయి. మతానికి, కళకు కొన్ని సామాన్య లక్షణాలున్నాయి. రెండింటిలోను ఆవేశం, ఉద్వేగం ప్రధాన లక్షణాలు. రెండింటిలోను ఊహ ముఖ్యపాత్ర వహిస్తోంది. ఇలా కొన్ని సామాన్య లక్షణాలున్నప్పటికీ కళ, మతం భిన్నమైనవి. ఒకదానికొకటి విరుద్ధమైనవి. ప్రపంచాన్ని సౌందర్యదృష్టితో వీక్షించటం కళ అయితే, మతమే వాస్తవిక ప్రపంచమయింది. జీవిత సత్యాన్ని వెలార్చేది కళ, వాస్తవికతపై సత్యంపై మానవుని ఆధిపత్యాన్ని వ్యక్తీకరించేదే కళ, ఇందుకు విరుద్ధంగా మతం మానవుని శక్తినిగాక బలహీనతను వ్యక్తపరుస్తుంది. ప్రకృతి, సమాజం మానవునిపై ఎలా ఆధిపత్యాన్ని వహించాయో తెల్పుతుంది. మానవుని బలహీనత ఆధారంగా రూపొంది, అవాస్తవికతపై నిలబడిన మతం ప్రాచీన సాహిత్యంపై తన ప్రభావంచూపి, ముఖ్యంగా ప్రాచీన కావ్యావతారికల, నాటక ప్రస్తావనల లక్షణాలేర్పడటంలో ఎలాదోహదం చేసిందో నిరూపించటమే ప్రస్తుత విషయం.

లభించే లిఖిత గ్రంథాల్లో ప్రాచీనమైన ఋగ్వేదం "ఆనాటి మానవుల ఆకాంక్షలు, అనుభూతులు, అనుభవాలు, ఆకలి, పశువులకోసం, ఆహారంకోసం, రక్షణ కోసం, విజయం కోసం కోరికలను"34 ప్రతిఫలిస్తుంది. "ఆహారం, పశువులు దోచుకొని వచ్చిన గణ నాయకుల స్తోత్రాలు, గణజీవితం - ఇవి ప్రాచీన వేదాల్లోని ప్రధాన వస్తువులు. అందులో దేవుళ్ళు లేరు. మతం లేదు.

అతీతశక్తి శాసిస్తుందనే విశ్వాసం వారికి లేదు. ఆదిమ వ్యావసాయిక జీవనంలో భాగంగా ఆహారోత్పత్తికి కారణమైన ప్రకృతి శక్తులను, మేఘాలను, వర్షాన్ని సామూహిక నాట్య రూపంలో అనుకరిస్తూ మాయ (Magic) తో అదుపు పెట్ట గల మన్న విశ్వాసమే వారిలో అధికంగా కనిపిస్తుంది. ప్రకృతిని, వాస్తవాన్ని అదుపులో పెట్టగల విశ్వాసం ఆదిమ వ్యావసాయక జీవితంలోని ప్రధానాంశం"[35] ఆహారోత్పత్తికి కారణమైన ప్రకృతి శక్తులను అతీతశక్తులుగా వారు భావించక పోయినా దేవతలుగా పిలవటం సాగింది. ఇది వారి ఊహకు, సౌందర్య దృష్టికి ప్రతీక. వెలుగు, ప్రకాశం కలిగినవన్నీ దేవతలయ్యాయి. ఎ.యల్. భాషమ్ ఇలా అన్నాడు.

"The Chief object of worship (of Aryans) were the devas a word cognate with Latin deus. The root from which this word is derived, div, is connected with brightness and radiance, and the devas by connotation were "The shining ones", The early gods of the Aryans, like those of the Greeks were chiefly connected with sky and predominantly male."[36]

ప్రఖ్యాత భారతీయ తత్త్వవ్యాఖ్యాన కారుడైన శాయణుడు కూడా ఋగ్వేదకాలపు దేవతలను ప్రకృతి శక్తులుగా అభివర్ణించాడు[37] దేవతల అవ తరణతో విశ్వాసం, నమ్మకం, ఆరాధన ప్రబలింది. మతం ప్రభవించింది. ఋగ్వేదం పదవమండలం రచనాకాలానికల్లా ప్రకృతి శక్తుల ఆరాధనలతోపాటు స్వల్పమైన తాత్త్వికి చింతన ప్రారంభమయింది. సృష్టికి మూలం వెదకటం మొదలయింది. వీటితోపాటుగా రాబోయే అధర్వవేదకాలానికి చెందిన చేతబడులు, మంత్రశక్తిలో నమ్మకం మొదలైన మూఢవిశ్వాసాలుకూడా చోటుచేసుకున్నాయి.

తరువాత కాలచరిత్రను కె. కె. రంగనాథాచార్యులు ఇలా విశ్లే షించాడు. "వేదకాలంనాటి ఆదిమ వ్యావసాయిక జీవితం నుండి ఉన్నత వర్గానికి నిమ్న వర్గానికి సంబంధించినవిగా రెండు మార్గాలు చీలాయి. ఆదిమ సమాజంలో మాయారూపంగా ఉన్న అనుకరణాత్మక ఆచార, వ్యవహార

విధానాలు వర్గ ప్రయోజనాలను కాపాడే యజ్ఞయాగాది కర్మకాండలుగా బ్రాహ్మణాల కాలంనాటికి రూపొందాయి. చదువుకున్న పురోహితవర్గం చేతిలో సంపన్న పోషకుల ప్రయోజనాన్ని కాపాడేందుకు ఇవి ఉపయోగించాయి. భావవాద ధోరణులు ఆనాటికింకా ప్రారంభం కాలేదు కాని శ్రమ విభజన జరిగి సమాజం వర్గాలుగా చీలింది. ఆనాటికి బుద్ధిబలంకంటె భుజబలానికే ప్రాధాన్యం, బ్రాహ్మణాల పరిణామమే మీమాంసా దర్శనం. పట్టణ జీవనం, వాణిజ్యప్రధానమైన బౌద్ధ సంస్కృతి క్షీణిస్తున్న దశలో వ్యవసాయం ప్రధానమై గ్రామీణ వ్యవస్థ పెంపొందే దశలో ఆదిమవ్యావసాయిక సంస్కృతి పరిణామ రూపమయిన యజ్ఞకాండలకు మళ్ళీ ప్రాధాన్యం లభించింది. మీమాంసకులు మొదట నిరీశ్వర వాదులు, మాయావాదాన్ని, అతీత శక్తిని వారు ఖండించారు. అతీత శక్తిని కాదనటం శాస్త్రీయ దృక్పథంతో చేసింది కాదు, కర్మకాండల ప్రాధాన్యాన్ని నిలబెట్టటానికి చేసినది. అన్నీ చేయగలిగిన అతీతశక్తి ఉన్నప్పుడు కర్మకాండల అవసరం ఏముందని వారు ప్రశ్నిస్తారు. మాయ స్వప్నంలాగ అవాస్తవం అయినప్పుడు అది దేన్నీ సృష్టించలేదని వారు వాదిస్తారు. యాగాదివిధానాలు తమంతట తామే తమ శక్తితో ఫలితాలను సాధిస్తాయని వారంటారు. క్రమంగా కర్మకాండలు తమ ఉత్పత్తి స్వభావాన్ని కోల్పోయి బాహ్యాడంబరాల రూపంలో భావతాత్త్విక ధోరణులతో కలసిపోయి పాలకవర్గ ప్రయోజనాలను కాపాడేవిగా పరిణమించాయి."38

ఉత్పత్తి సాధనలో పాటుపడిన తృతీయ, చతుర్థవర్గాలు సమర్థించిన బౌద్ధ, జైన మతాలలోకూడా క్రమంగా భావతాత్త్విక ధోరణులు ప్రబలాయి వేదమతం మార్గంలో కర్మకాండలు బలిశాయి. వజ్రయానకాలానికి పూర్తిగా బౌద్ధమతం వేదమతంలాగే పరిణమించింది, పాలకవర్గ ప్రయోజనాలకై పాటుబడసాగింది. వేదమతానికి, దానికి అంతరం నశించగానే బౌద్ధం భారతదేశంలో క్షీణించసాగింది. భావతాత్త్విక ధోరణులతో మళ్ళీ వేదమతం బలంపుంజుకొంది. అగ్రవర్గాల ప్రాధాన్యం అధికమయింది. ఈ దశలో యజ్ఞ యాగాలకు, కర్మకాండకు ప్రాధాన్యం లభించినా అవి ఏమాత్రం వ్యావసాయిక జీవితాన్ని ప్రతిఫలించేవిగా లేవు. ఫ్యూడల్ వ్యవస్థ (Feudalism from above) పూర్తిగా పాదుకొని పాలకవర్గ ప్రయోజనాలను సాధించే పావులయాయవి.

పాశ్చాత్యదేశాల వాతావరణం భారతదేశ వాతావరణంకంటే భిన్నమైనది. అవి చలిదేశాలు. సంవత్సరంలో ఆరునెలలు అననుకూల వాతావరణం. మంచు కురుస్తూ ఉంటుంది. ఉత్తరంగా సాగిన ఆర్యతెగల జీవితం అంత సౌఖ్యవంత మేమీ కాదు. సమిష్టి ఆహార సంపదనకూ, వస్తు సంపాదనకూ వారు ఎంతకాలం వినియోగించాలో అంతకాలమూ వాటి పరిరక్షణకై వినియోగించుకోవాల్సి వచ్చింది. ఎప్పుడు ఏ తెగ దండయాత్ర చేస్తుందో అన్న భయంతో అనుక్షణం జాగరూకులై ఉండవలసి వచ్చింది. ప్రకృతి శక్తుల ఆరాధనతో భారతదేశంలో మతం ఆవిర్భవిస్తే, పాశ్చాత్య దేశాలలో భయంతో మతావిర్భావమయింది. దీన్నే 'ఫియర్ రెలిజియన్' అన్నాడు ఐన్‌స్టీన్. క్రూరజంతువుల వల్ల హాని జరుగు తుందనే భయం, జాడ్యాలు, రోగాలభయం, ప్రకృతిశక్తుల విలయతాండవం పట్ల భయం ఆదిమ మానవుణ్ణి ఆలోచించేటట్లు చేసింది కలిగే ఫలితాలకు కారణాలు వెదకటం మొదలుపెట్టాడు. వీటన్నిటిని అదుపు చేసే శక్తి ఏదో కన్పించింది. ఈ ఉన్నతశక్తిని ఆరాధించటం మొదలు పెట్టాడు. ఆర్యులు భారత దేశానికి వచ్చేటప్పటికి ఈ భయజనిత మతదశను దాటి ప్రకృతి శక్తుల ఆరాధనా దశకు వచ్చారు. ఈజిప్టు, బాబిలోనియాలలో మొదటగా దేవతా సృజన జరిగింది. తమ పొలాలను సారవంతం చేసే పూజాదికర్మకాండలు (fertility rites) మొదలయ్యాయి. ఇసిస్, ఒసిరిస్ మొదలయిన దేవతలు ప్రభ వించారు. మానవాకారం (anthropomorphic gods) తో వెలిశారు. వారికి తమకున్న ఈర్ష్యాద్వేషాలు, ప్రేమానురాగాలు లాంటి భావాలను అంట గట్టటం జరిగింది. ఈ దేవతలు, తరువాత వెలిసిన గ్రీకు, రోమను దేవతలు మనుష్యుల కంటే ఏ మాత్రం భిన్నమైన లక్షణాలు కలిగిన వారు కారు. భేదమల్లా మానవునికంటే అధికమైన మహత్తు కలిగి ఉండటమే. అక్కడి దేవత లలా వెలియటానికి ప్రధాన కారణం ప్రజల భౌతిక జీవితం ప్రమాదభరితమయి ఉండడమే. సప్త సింధూ తీరంలో ఉత్పత్తికి ఆటంకం లేని సారవంతమైన ప్రదేశంలో సాగిన భారతీయ ఆర్యుల భావుకత కక్కడ చోటు లేదు. అక్కడి ఆలోచనలు చాలవరకు వాస్తవంగా సాగాయి. భారతీయ ఇంద్రుడికి సాటివచ్చే జియస్, జూపిటర్లను ఆరాధించారు. తెగలనాయకుల మధ్యయుద్ధాలను ఇలియడ్, ఒడిస్సీ, ఏనియడ్‌లాంటి కావ్యాలు గానం చేశాయి. క్రీస్తు జననంతో 'నీతి ప్రధాన మైన మతం' (moral religion) ప్రారంభమై, మానవాకార దేవతా మతాన్ని

(anthropomorphic religion) తోసిరాజన్నది. వర్గ విభజన ప్రారంభమై ఫ్యూడల్ వ్యవస్థ నెలకొన్నది. మొదట్లో పురోహిత వర్గం అధికారం కోసం పాలకవర్గంతో వైరుధ్యాన్ని పెంచుకొన్నది. అయితే తర్వాత వర్గ ప్రయోజనాల దృష్ట్యా రాజీపడి రెండూ సామాన్య జనాన్ని దోచసాగాయి.

(1) **దేవతాస్తుతి** (Invocation)

సాహిత్యం, కళలు శతాబ్దాల తరబడిగా మతంతో అవినాభావ సంబంధం ఏర్పరచుకోవడానికి గల కారణాల నెన్నుతూ ఎ.జిస్. ఇలా అన్నాడు.

"Artistic development was for many centuries inseperably linked to religion for a number of reasons.

Firstly, pre-christian religion took the form of mythology and mythology was not only an expression of man's helplessness in the face of elements, but also represented the first attempts of artistic treatment of life in man's imagination. Mythology represented both religion and an expression of the artistic creativity of peoples at the first stages of historical development. Ancient art could therefore, draw on mythology for images and subjects, Marx called mythology the soil and arsenel of ancient art. Art leaned on mythology not because the former was nourished by religion but because the latter possessed, bound up inseperably with religious conceptions, a broader extra religious content.

For a certain period of time christian mythology too played an analogous role in the development of art.

Secondly the development of art with in the frame work of religion during a long period of history is to be explained by the political dominance of history. During the middle ages the church maintained control over all social relationships. The religious view of the world left, a deep imprint on the entire life of society. Progressive men of learning and thinkers struggled against the dominance of the church, religious scholasticism and dogmatism, and possessed in consequence, extremely limited opportunities for development out side the frame work of religion, orders placed by the church, and church control.''[40]

కళపై మతప్రాబల్యాన్ని గూర్చి జిన్ చేసినవ్యాఖ్య పాశ్చాత్య దేశాలకే కాక భారతదేశంతో సహా మొత్తం ప్రపంచానికి వర్తిస్తుంది. మతం అన్ని సామాజిక సంబంధాలను తన అధీనంలో ఉంచుకొని పెత్తనం చెలాయించింది. కవి సమాజంలో భాగం. కవి రచనలు ఆనాటి సమాజం, పరిస్థితులను ప్రతిఫలింప చేస్తాయి. మతంపట్ల దేవుడిపట్ల నమ్మకం ఆనాడు సర్వసాధారణం. అందువల్లనే కవి తన రచన జనామోదయోగ్యంగా జరగాలనీ, విశ్వశ్రేయస్సును సాధించాలనీ మానవాతీతశక్తిని భగవంతుణ్ణి ప్రార్థించడం పీఠికాప్రకరణంలో సాగింది. కాళిదాసు రఘువంశంలో తన ఇష్టదైవతాలయిన పార్వతీపరమేశ్వరుల స్తుతితో కావ్యారంభం చేశాడు.[41]

భవభూతి 'ఉత్తర రామచరిత'లో వాగ్దేవిని పడయుదును గాక అన్నాడు.[42]

దండి 'దశకుమారచరిత్ర'ను ఆశీర్వచనంతో ప్రారంభించాడు.[43]

'కాదంబరి'లో బాణుడు త్రిమూర్తులకు విడివిడిగా మూడు శ్లోకాలలో నమస్కరించాడు.[44] 'హర్షచరిత'లో ఒక శ్లోకంలో శంకరుని, మరో శ్లోకంలో పార్వతిని స్తుతించాడు.[45]

పురాణం (Mythology) కవి ఊహకు, సౌందర్యదృష్టికి అత్యంత శక్తి నివ్వటం వల్ల, నమ్మకమున్నా లేకపోయినా, కవిపురాణాలను ఆశ్రయించా డంటే ఆశ్చర్యమేం లేదు. చంద్రుడు చామరంగా కలిగిన శాంభవునికి నమస్క-రిస్తున్నాడు హర్షుడు. పట్టిగా విభూతిరేఖలతో నడుమున జింక చర్మంతో తిరుప మెత్తుతున్న శివుడికి కాదు. కాలకూట విషస్పర్శజాత మూర్ఛను పోలికగా తీసు కోవటంతో, సముద్రమథనం, అందులో కాలకూట విషావిర్భావం అనే పౌరాణిక విషయాలను కవి ఉపయోగించుకున్నాడు. ఇవి కవి ఉపయోగించే పదునైన ఆయుధాలు.

'ఒడిస్సీ'లో హోమర్ సూర్యుణ్ణిలా సంబోధించాడు.

"O Sun my quick coquetting eye, my red haired hound
Sniff out all queries that I love, give them swift chase,
Tell me all that you've seen on earth, all that you've heard..."[46]

'ఇలియడ్' లో సాహిత్యాధిష్ఠాత్రి అయిన 'మ్యూజ్' ను సంబోధిస్తూ "Sing Goddess,the wrath of Achilles peleides.."[47]అంటాడు.

ఎడ్మండ్ స్పెన్సర్ తన 'ఫెయిరీక్వీన్' కావ్యాన్నిలా ప్రారంభించాడు.

"Help then, O holy virgin, chief of nyne
Thy weaker Novice to perform thy will"[48]

17వ శతాబ్దానికి చెందిన మిల్టన్ మహాకవి కూడా అప్పటికే విడిగా పీఠికలు రాయటం మొదలైనా ఇతిహాసకావ్యాల ఒరవడిలోనే దేవతా ప్రార్థన చేశాడు.

"Of Man's first disobedience and the fruit
of that forbidden tree...
Sing heav'nly muse..."[49]

ఏ ఫలాన్నాశించి ఆయన దైవ ప్రార్థన చేయటం?

"............................ I thence
Invoke thy aid to my adventurous song
that with no middle flight intends to soar
above the Aonian Mount while it pursues
things unattempted yet in prose or Rime"[50]

వచనంలోగాని, పద్యంలో గాని అంతకు ముందెవ్వరూ చేపట్టని పనిని చేపట్టిన తనకు దైవసహాయం అవసరం.

పాశ్చాత్య సాహిత్యంలో 'Sniff out' 'give' 'tell' 'sing' అని ఆజ్ఞార్థకంలో (వినయం లోపించక పోయినా) దేవతలను సంబోధించటంలో భారతదేశంలోని మతవిశ్వాసాలకు పాశ్చాత్యదేశాలలోని మత విశ్వాసాలకు మధ్య తేడా స్పష్టమవుతుంది. అక్కడి కవి దేవతనాజ్ఞాపించగలడు ఇక్కడికవి నమస్కరించి తాను చెప్పదలుచుకున్నది విన్నవిస్తాడు. అక్కడి దేవతలకు మానవులకు మధ్య ఉన్న దూరం తక్కువ. ఇక్కడి దేవతలకు మానవులకు మధ్య ఎంతో దూరం. కారణం భౌతిక జీవనమే. భూమి సారవంతమైనదో/కాకపోవడమో, ఉత్పత్తి అధికమో/అల్పమో కావడమే దీన్ని నిర్ణయిస్తుంది. భౌతికజీవనం ఎంత కష్టతరమైనదైతే, అంత వాస్తవికదృష్టి ఏర్పడుతుంది.

(2) ఫలశ్రుతి

యజ్ఞయాగాదులు దేవతా ప్రీతికోసమై మొదలయ్యాయి. కాలపరిణామంలో దేవతలకంటే యజ్ఞయాగాదులకు ప్రాముఖ్యం వచ్చింది. యజ్ఞాలు, యాగాలు చేస్తే వాటి శక్తివల్ల దేవతలు గత్యంతరం లేక తప్పక ప్రత్యక్షమై తమ కోరికలు తీరుస్తారన్న నమ్మకం ఋగ్వేద కాలాంతానికే ఏర్పడింది. మంత్రశక్తి మహిమను సంతరించుకున్నది. మంత్రాలతో ఇతరులకు మేలూ చేయవచ్చు, చెరుపూ చేయవచ్చు అన్న భావన ఏర్పడింది. రామునికంటే రామనామం బలవత్తరమైంది. భగవదవతారాలను వర్ణించే కావ్యపఠనం పుణ్య సంపాదకమయింది. కావ్యాన్ని పఠించినవారు, శ్రోతలు పుణ్యాన్ని పొందుతారు. ఇందులో మూడు విషయాలున్నాయి. మొదటిది కావ్యరసాస్వాదన. దీనివల్ల మానవుని సౌందర్య

దృష్టి తుష్టినొందుతుంది. రెండు ఇహ సంబంధియైన లాభం ఆయుష్షు పెరుగుతుంది. ద్విజులవాక్కు మహిమాన్వితమవుతుంది. క్షత్రియులు రాజులవుతారు. వణిజుల వ్యాపారం అభివృద్ధి పొందుతుంది. శూద్రులకు మరింత మంచి ఒనగూడుతుంది. మూడు చదవటంవల్ల, వినటంవల్ల ఇహమేగాక పరంకూడా సుభద్రమే. పాపాలు నశించి పుణ్యప్రాప్తి కలుగుతుంది. మనిషి మరణానంతరం స్వర్గధామాన్నే చేరుకుంటాడు. కావ్యపఠనం, శ్రవణం, రసహృదయానికి తృప్తినిస్తే అసలుపై వడ్డికూడా ఒనగూడే సందర్భంలో ఎవరు కావ్యపఠనం, శ్రవణంమీద ఆసక్తిలేకుండా ఉంటారు? వాల్మీకి రామాయణావతారికలో ఫలశ్రుతి చెప్పాడు[51] రామాయణంలో అవతారికా ప్రాయమైన తొలిసర్గలు ప్రక్షిప్తాలని చాలా మంది భావిస్తున్నారు. అయినా వాటి ప్రాచీనత కాదనడానికి వీలులేదు. ఫలశ్రుతిపట్ల ప్రజల నమ్మకాన్ని కాదనడానికి వీలులేదు.

ఈ ఫలశ్రుతి పాశ్చాత్య దేశ సాహిత్యాలలో లేదు. వారిదేవతలు వాస్తవికతకు దగ్గరగా సృజింపబడటం, మంత్రశక్తికి గల ప్రభావాధిక్యత మీద అక్కడి ప్రజలకున్న నమ్మకం తక్కువ కావటమే ఇందుకు కారణం.

ii) సాంకేతిక పురోగతి : పీఠికా లక్షణాలు

తొలివేదకాలంలో కవిత్వం (ఋక్కులలో కనిపించేటట్లుగా) పూర్తిగా వికసించినా, వారికి రాయటం తెలిసినట్లు కనిపించదు. అయితే ఆ కాలానికే రాయటం మొదలయిందనీ, ఆవులను 'అష్టకర్ణి' (చెవి మీద 8 సంఖ్య ఉన్నవి)గా అభివర్ణించడంవల్ల ఈ విషయం స్పష్టమవుతుందని కొంతమంది విద్వాంసులు భావించారు. కాని ఆ మాటకు వేరే వ్యాఖ్యానాలు చేసే అవకాశం ఉండడంవల్ల ఆ కాలానికే ఆర్యులకు రాయటం తెలుసునని నిర్ధారణగా చెప్పడానికి వీలుపడదు.[52] మలివేదకాలానికల్లా ఆర్యులకు వేదవేదాంగాలేకాక అనేక శాస్త్రాల పరిచయం ఉన్నట్లు ఉపనిషత్తులవల్ల తెలుస్తున్నది. వారు రాసి (గణితశాస్త్రం), నక్షత్రవిద్య (ఖగోళశాస్త్రం) సర్పవిద్య మొదలైన అనేక శాస్త్రాల నభ్యసించినట్లు కనిపిస్తున్నది.[53] అయితే ఇక్కడ కూడా రాయటం వారికి తెలుసునన్న విషయం వివాదాస్పదమే.

ఋగ్వేదం తరువాతిదైన 'తైత్తిరీయ సంహిత' లో పదార్థ (లక్షకోటి) వంటి పెద్ద సంఖ్య లున్నాయి. 'శతపథ బ్రాహ్మణం' లో సమయ చర్చ ఉంది. దీని ప్రకారం ఒక రోజును 7,59,375 భాగాలుగా చేయవచ్చు.[54] రాత లేకపోతే ఇంత సూక్ష్మాతి సూక్ష్మమైన లెక్కలు కట్టడం కష్టం.

వాఙ్మయంలోను, సూత్రాలకాలంలోను భారతీయులకు లిపిజ్ఞానం ఉందని తెలిపే ఆధారాలున్నాయి. క్రీ. పూ. 8 వ శతాబ్దిలోని పాణిని 'అష్టాధ్యాయి' లో లిపి, లిఖి, లిపికర, గ్రంథ శబ్దాలు ప్రయుక్త మయ్యాయి. ఆ కాలంలో లిపి ఉండటమే కాక రాయటం వృత్తిగాగల వారు కూడా ఉండేవారని స్పష్టమవుతుంది. పాణిని దేశీయ లిపినే కాక 'యవనానీ' అని యవన లిపిని కూడా పేర్కొన్నాడు. బౌద్ధుల 'లలితవిస్తర' లో కూడా లిపి ప్రచారంలో ఉందన్న విషయం ప్రసక్తమయింది. అయితే ఇవన్నీ సూచనలే. భారతీయుల లిపిజ్ఞానానికి మొదటి ప్రత్యక్ష ఆధారాలు అశోకుని శిలాశాసనాలే.

రాత తెలియని కాలంలో పాశ్చాత్యదేశాలకు సభ్యతా భిక్ష పెట్టిన గ్రీసు దేశీయులు కూడా తమ జాతీయగాథలైన 'ఇలియడ్', 'ఒడిస్సీ' ఇతిహాసకావ్యాలను పాడుకునేవారు. తరువాత ఎంతో కాలానికి గాని ఇవి రాత కెక్కలేదు. ఈ ఇతిహాసకావ్యాలను పాడటమే వృత్తిగా గలవారిని 'ఈడోస్' అని పిలిచేవారు. వీరి జ్ఞాపకశక్తి అసాధారణం. రాజులు, ధనవంతులు వీరిని పోషించేవారు. అయితే మానవమేధస్సు కావ్యాలను అక్షరబద్ధం చేయ సంకల్పించింది. ఈజిప్షియన్ల చిత్రలిపి, వంకరగీటుల సంకేత లిపులనుండి నేటి పాశ్చాత్యుల వర్ణమాల రూపొందింది. నేటి వర్ణ సమామ్నాయాన్ని కనిపెట్టింది పాశ్చాత్యులు కారు. ఈజిప్షియన్ల శత్రువులయిన 'సెమ్' తెగకు చెందిన 'హిక్కు'లనే వారు దీన్ని కనిపెట్టారు. వీరు ఈజిప్షియన్ చిత్రలిపుల నుండి ఇరవైయింటిని తీసుకున్నారు. వాటిని అతి సులభమైన పద్ధతిలో అక్షరాలుగా మార్చుకున్నారు.[55]

హిక్కుల వర్ణసమామ్నాయం ఈజిప్టు నుండి తూర్పుగా, మధ్యధరా సముద్రతీరదేశాలకు వ్యాపించింది. ఫినీషియన్లు, యూదులు, తమ మూలపురుషులయిన హిక్కుల రాతలను భద్రపరచుకున్నారు. ఫినీషియన్లు సముద్రయాత్రలలోను, వ్యాపారంలోను నిపుణులు, ''వీరు తమ సరుకులతో పాటు, తమ వర్ణ

సమామ్నాయాన్ని కూడ దేశ దేశాలకు తీసుకుని వెళ్ళారు. ఫినీషియా వారితో వ్యాపార సాపారాలు చేస్తున్న ప్రజలు, వీరి వర్ణ సమామ్నాయం స్వీకరించి వాడుక చేసుకున్నారు. ఫినీషియా వారు అలవాటు చేసినది కచ్చితంగా ఈజిప్టు నుండి వచ్చిన సెమిటిక్ అక్షరాలు కావు."[56] అవి మార్పు చెందాయి. ఇవి గ్రీసు, ఇటలీ దేశాలకు చేరాయి. ఈ స్థల, జలయాత్రలలో అక్షరాలు ఎంతో మారిపోతూ వచ్చాయి.

భారతీయ లిపులకు తొలి ఆధారాలయిన అశోక శిలా శాసనాలు ఖరోష్ఠి, బ్రాహ్మీ లిపులలో ఉన్నాయి. ఇవి రెండూ అరమాయిక్, సెమిటిక్ లిపులనుండి ఉద్ధరించబడ్డాయని పండితుల వాదం. అట్లా వచ్చిన లిపిని తమ భాషల ధ్వనుల కనుకూలంగా మలచుకొన్న ఖ్యాతి భారతీయులది. రాతకుపయోగించే సాధనాలు కూడా దేశదేశాలలో పలువిధాలుగా అభివృద్ధి చెందాయి. భారతదేశంలో రాత కుపయోగించిన సాధనాల గురించి ఎ. ఎల్. బాషమ్ వివరించాడు.[57]

భారతదేశంలో పత్రికాగితాల వాడుక 2 వేల సంవత్సరాలనుండి ఉన్నా అవి చాలా కాలం మన్నకపోవడంవల్లా, తయారుచేయడం కష్టమైనందువల్లా తాళ, భూర్జ పత్రాలకున్న వ్యాప్తి వాటికి లేదు. రెండు వేల సంవత్సరాల కిందట వెదురుగడ్డి, గుడ్డపీలికలు ఉపయోగించి చైనాలో కాగితాలు చేయడం ప్రారంభ మైంది. ఆధునికమైన కాగితానికి ఇదే మూలం. క్రీ. శ. 704 లో మధ్య ఆసియా లోని సమర్ఖండును అరబ్బులు జయించారు. ఇక్కడే వారికి కాగితంతో పరిచయం ఏర్పడింది. క్రమక్రమంగా సిసిలీ, స్పెయిన్, సిరియాలలో కాగితపు కార్ఖానాలు బయల్దేరాయి. 13 వ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీలకు కాగితం మిల్లులు వ్యాపించాయి. చైనానుండి కాగితం 10వ శతాబ్దానికి పూర్వమే భారతదేశానికి వచ్చినా 11వ శతాబ్దంలో మహమ్మదీయులరాకవల్లే దీని వ్యాప్తి జరిగింది. తర్వాత రెండు మూడు శతాబ్దాలకుగాని ఇది దక్షిణభారతానికి చేరలేదు. పోర్చుగీసువారి రాకతో దక్షిణ భారతదేశంలో కాగితాల వాడకం కొంచెం విస్త రించింది. అయినా ముద్రణాయంత్రాలు వచ్చేదాక సాంప్రదాయికమైన రాత సాధనాల వాడుకే ప్రచురంగా ఉండేది. ముద్రణతో కాగితం గిరాకీ హెచ్చింది.

ఇది ప్రాచీన కాలంనుండి మధ్యయుగాల చివరి వరకు లిపి, లేఖన సాధనాల సాంకేతిక అభివృద్ధి క్రమం. క్రమక్రమంగా జరిగిన లిపివికాసం, లేఖన సాధనాల అభివృద్ధి కారణంగా రచనా ప్రక్రియ మరింత నిడివిని సంతరించుకొన్నది. కావ్యేతిహాసాల దైర్ఘ్యం పెరగడంతో పాటు విపులమైన ప్రస్తావనలు, అవతారికలకు అవకాశం కలిగింది. కేవలం తీసుకున్న ఇతివృత్తవర్ణనకు పరిమితమైన రచయిత రచన మరికొంత విస్తృతిని పొందింది. కావ్యానికి కొంత బాహ్యమైన సమాచారాన్ని, వివరణలను ఇచ్చే ఆస్కారం కలిగింది. దీనితో రచయిత విశ్వాసాలు, అభిప్రాయాలు, స్వీయ వృత్తాంతం వెల్లడి కాజొచ్చాయి. కావ్యేతివృత్తం మరోరచన నుండి స్వీకరించినదైతే మూలాన్ని, మూలకర్తనూ ప్రశంసించటం, తనగూర్చి తన తల్లిదండ్రులు, పూర్వీకులగూర్చి చెప్పుకోవడం కవిత్వం ఎలా ఉండాలో తన అభిప్రాయాలను ప్రకటించడం, ఆ పైన సుకవిస్తుతి, కుకవినింద, సజ్జనస్తుతీ, దుర్జననిందా మొదలైనవన్నీ చోటుచేసుకొన్నాయి. కవి తనకథావస్తువును పీఠికాప్రాయంగా సంక్షిప్తంగా చెప్పడం ప్రారంభించాడు.

శ్రుతాలయిన వేదాలలో ఇటువంటి పీఠికలకు ఆస్కారం లేదు. గురుముఖతః నేర్చుకొని, కంఠస్థం చేసి, తన శిష్యులకు నేర్పటం పరంపరగా సాగింది. మౌఖికంగా అందించేటప్పుడు అనవసర విషయాలను వదిలివేయటం సహజం. చెప్పే విషయానికి సంక్షిప్తత ప్రాణమవుతుంది. అందువల్లనే ఋగ్వేద మంత్రాలకు కర్తలుగా వ్యక్తులను పేర్కొనక, ఋషి కుటుంబనామంతో వ్యవహరించటం జరిగింది. విశ్వామిత్ర, వామదేవ, అత్రి, భరద్వాజ, వశిష్ఠులను వ్యక్తులుగా గాక, ఋషి గోత్రీయులుగా భావించటం సముచితం. ఇదే పద్ధతిలో పాశ్చాత్యదేశాలలో కూడా ప్రాచీన కాలంలో ఇతిహాస కావ్యాలను గాయకులు (Trabadours) గ్రామగ్రామానికి వెళ్ళి కథాగానం చేసి ప్రచారం చేశారు. ఇలియడ్, ఒడిస్సీల వంటి కావ్యాలలో శ్రోతల నుద్దేశించి చెప్పేమాటలు, మౌఖిక ప్రచారం వల్లనే తర్వాతి కాలంలో ఆయా కావ్యాలలో చేరాయి. గద్యం కాక, పద్యమే అన్ని సాహిత్యాలలోను ఆరంభదశలో కనిపించడానికి గల కారణాలలో ఒకటి సాంకేతికంగా పురోగమించక పోవడమే.

సాంకేతిక పురోగతివల్ల ఏర్పడిన పీఠికా లక్షణాలివి.

(1) మూలం

తమ గ్రంథానికి మూలకథను ఎక్కడి నుండి తీసుకున్నారో అనువాద కర్తలు చెప్పుకుంటారు. మౌలిక రచనల్లో ఈ మూల ప్రశంస ఉండదు. కేవల అనువాదాలలో లేక పూర్వకవి రచిత ప్రసిద్ధేతి వృత్తాన్ని స్వీకరించినప్పుడూ ఉంటుంది.

'వీరచరిత' ప్రస్తావనలో భవభూతి వాల్మీకి మూలాన్ని తెల్పుకున్నాడు[58]

'ఉత్తరరామ చరిత'లో ప్రస్తావనలో చెప్పక పోయినా వాల్మీకినే ఒక పాత్రగా ప్రవేశపెట్టి ఉత్తరరామాయణ కథను అంతర్నాటికగా వాల్మీకి కృతంగా భవభూతి ప్రవేశపెట్టాడు. భరత వాక్యాన్ని అటువాల్మీకికీ, ఇటు తనకూ అన్వయించేటట్లుగా రచించాడు.[59]

మురారి కూడ 'అనర్ఘ రాఘవం'లో మూలకర్త అయిన వాల్మీకిని పేర్కొన్నాడు.[60]

లాటిన్ నాటక రచయిత ప్లాటస్ 'సార్టియన్టస్' అన్న నాటకంలో మూలం గురించి ఇట్లా చెప్పుకున్నాడు.

"If your ears are disengaged, pay attention, I wish to give you the name of the comedy. In Greek this comedy is called clerumenoe, in Latin sortientes, Diphilus wrote it in the Greek, and after the Plautus with the barking name wrote it over again in Latin"[61]

(2) కవితా పరామర్శ

కవిత్వం ఇట్లా ఉంటే సహృదయులు మెచ్చుకుంటారన్న భావాన్ని చాలా మంది కవులు వ్యక్తం చేశారు. బాణుడు తన 'కాదంబరి'లో కథ ఎట్లా ఉంటే పాఠక జనుల్ని ఆకర్షిస్తుందో తెలియజేశాడు.[62]

'హర్షచరిత్ర'లో ఆయా ప్రాంతాల కవుల కవిత్వంలో ఏయే ప్రధాన లక్షణాలుంటాయో ఇట్లా వివరించాడు,

"శ్లేష ప్రాయముదీచ్యేషు ప్రతీచ్యేష్వర్థమాత్రకః
ఉత్ప్రేక్షా దాక్షిణాత్యేషు గౌడేష్వక్షర డంబరం"63

కావ్యంలో ఏకత్రం కావాల్సిన గుణాల్ని చెప్తూ, ఆఖ్యాయికలుంటే కావ్యం హృద్యమౌతుందన్నాడు బాణుడు.64

కావ్యంలో తన కవిత్వ విశేషాలను చెప్పుకోవడం కూడా సాధారణమే. అక్కడక్కడా పూర్వకవుల కవితా విశేషాలను, ప్రతిభను కీర్తించడం కూడా ఉన్నది. అటువంటి సందర్భాలలో పూర్వకవులలో తాము గుర్తించిన లక్షణాలు వెల్లడవుతాయి. 'అనర్ఘరాఘవ' నాటకంలో మురారి తన వాఙ్మయం 'అమృత బిందు నిష్యంద' మని చెప్పుకున్నాడు.65 'రామాయణం' ద్వితీయ సర్గాంతంలో వాల్మీకి,66 'ఉత్తరరామచరిత'లో భవభూతి67 తమ కవిత్వాన్ని గురించి చెప్పుకున్నారు.

'కామెడి ఆఫ్ యాసెస్' లో ప్లాటస్

"The comedy is full of wit and mirth
It's sure to make you laugh..."68అంటాడు.

'ఒడిస్సీ'లో హోమర్ ఇట్లా అన్నాడు.

"O Sun, great oriental, my proud mind's golden cap
I love to wear you cocked askew and to burst in song
to rouse our hearts, so long as you and I both alive."69

హోమర్ లక్ష్యం "to burst in song to rouse our hearts".

(3) విమర్శ

కవులు పీఠికలో తమ వినయాన్ని చాటుకోవడమూ, ఇతర కవులనూ, అరసిక విమర్శకులనూ విమర్శించడమూ సాధారణమే. ఒక మహోన్నత రచనకు దైవ సహాయాన్ని అర్థించినట్లుగానే అటువంటి కావ్యనిర్వహణలో తమ అల్పత్వాన్ని వినయంగా ప్రకటించుకోవడమూ ఉంది.

కాళిదాసు రఘువంశంలో తన అల్పమతిని గూర్చి చింతిస్తూ పూర్వ కవులు మార్గాన్ని సుగమం చేయటం వల్ల తాను ప్రయత్నం చేస్తానంటాడు.[70] ఇదే పద్ధతిలో తన అల్పత్వాన్ని గూర్చి 'ఫెయిరీక్వీన్' లో స్పెన్సర్ చెప్పు కున్నాడు. "I... am now enforst, a farre unfitter taske" అంటూ

"Shed thy faire beams into my feeble cyne
And raise my thoughts, too humble and too vile
To think of that true glorious type of Thine
The argument of mine afflicted stile"[71]

అని ప్రార్థిస్తాడు.

కాళిదాసు 'మాళవికాగ్ని మిత్రం'లో భాససౌమిల్లకాది పూర్వ కవుల ప్రబంధాలను కాదని వర్తమాన కవి కాళిదాసు రచన పట్ల ఆదరమెలా కలుగు తుందని ప్రశ్నించుకొని,

"పురాణమిత్యేవ న సాధుసర్వం నచాపి కావ్యం నవమిత్యవద్యం
సన్తః పరీక్ష్యాన్యతర ద్భజన్తే మూఢః పరప్రత్యయనేయబుద్ధిః[72]

అని సమాధానం చెప్పుకొన్నాడు.

భవభూతి 'మాలతీ మాధవం'లో మెచ్చని పాఠకులను విమర్శించాడు.[73] 'ఉత్తరరామచరిత'లో 'తేనకిం నిరూపయతా రాజ్ఞస్సు పరిశుద్ధాముపస్థాన స్తోత్రి పద్ధతిం భావః' అన్న నటుని మాటలకు-

"సర్వథా వ్యవహర్తవ్యం, కుతోహ్యవచనీయతా
యథాస్త్రీణాం తథా వాచాం సాధుత్వేదుర్జనోజనః" అని సూత్రధారునితో సమాధానం చెప్పిస్తాడు. 'అతి దుర్జన ఇతివక్తవ్యం' అని నటుడు మరింత ఒత్తి పలుకుతాడు.[74]

లాటిన్ నాటక రచయిత టెరెన్స్ తన నాటకాల ప్రస్తావనలలో ప్రత్య ర్థులను విమర్శిస్తాడు. ప్రత్యర్థులు తన నాటకాలపై చేసిన విమర్శలను ఖండిస్తూ తన రచనలను సమర్థించుకోవటమే గాక వారి రచనల లోని లోపాలను కూడా ఎత్తిచూపిస్తాడు. 'ది యూనిచ్' అన్ననాటకం ప్రొలాగ్‌లో-

"Our poet wished his name to be enrolled among those writers who make it their object to please as many good people and hurt the feelings of as few as possible If any writer thinks that he has been harshly spoken by our poet, he ought to consider that the words were an answer to him, not an attack upon him, because, he began the strife"[75] అంటాడు.

బెన్‌జాన్సన్ తన నాటక ప్రస్తావనలలో సంప్రదాయ నాటక సిద్ధాంతాలను పాటించని నాటక కర్తలను విమర్శించాడు. సంప్రదాయ లక్షణాలను సమర్థించాడు.

(4) కవి స్వీయ ప్రసక్తి

అవతారికలో కవి తనను గురించి, తన తల్లిదండ్రుల గురించీ, పూర్వీకులను గురించీ, గురువులను గురించీ చెప్పుకోవడం సహజమే. ప్రాచీన గ్రీకు, సంస్కృత కవులు తమ గురించి ఏమీ చెప్పుకోలేదు. పరంపరగా తరువాతి కవులు, వ్యాఖ్యాతలు, లాక్షణికులు చెప్పిన విషయాలే వారి గురించి తెలుసుకోవడానికి ఎక్కువ తోడ్పడుతున్నాయి. గ్రీకు కవులు గాని నాటకకర్తలు గాని తమ గురించి ఏమీ చెప్పుకోలేదు. సంస్కృత కవుల్లో రామాయణ కర్త ఆదికవి వాల్మీకి, ప్రక్షిప్తమని భావించే బాలకాండ మొదటి సర్గలో కనిపిస్తాడు. మహాముని, మునిపుంగవుడు, వాక్యవిశారదుడు, కీర్తిమంతుడు, ఉదారధీమంతుడు మొదలైన విశేషణాలు వాల్మీకిని వర్ణిస్తున్నాయి.[76] 'కాదంబరి'లో బాణుడు పది శ్లోకాలలో తన వంశ వర్ణన చేశాడు.[77]

భాసుడు నాటకాలలో తన పేరు చెప్పుకోలేదు. కాని తరువాతి నాటక కర్తలు తమపేరు, తల్లితండ్రులపేర్లు చెప్పుకున్నారు. కాళిదాసు తన మూడు నాటకాలలోను నాటకాలపేర్లను, తన పేరునుమాత్రమే చెప్పుకున్నాడు. తన పాండిత్యాదులనుగాని, పూర్వీకులను గూర్చిగాని చెప్పలేదు. భవభూతి 'ఉత్తర

రామచరిత'లో 'అస్తిఖలు తత్రభవాన్ కాశ్యప శ్రీకంఠ పదలాంఛన పదవాక్య ప్రమాణ తత్త్వజ్ఞో భవభూతిర్నామ జాతుకర్ణీ పుత్రః "అని చెప్పుకొన్నాడు. ముద్రారాక్షస నాటకంలో విశాఖదత్తుడు "సామన్త వటేశ్వరదత్త పౌత్రస్య, మహారాజ భాస్కరదత్త సూనో కవి ర్విశాఖ దత్తస్యకృతిః" అని తాతతండ్రులను పేర్కొన్నాడు.

లాటిన్ కవులుకూడ తమ నాటకాలలో నాటకంపేరు, తమపేరు చెప్పు కొన్నారు. 'కామెడీ ఆఫ్ యాసెస్'లో "Maccius translated it, He calls it Asinaria, by your leave"[78] అని చెప్పుకున్నాడు టైటస్ మాక్సియస్ ప్లాటస్.

(5) సుకవిస్తుతి

కొందరు కవులు కావ్యరచనారంభంలో పూర్వకవులను ప్రశంసించారు. తమ కావ్యానికి ఇతివృత్తాన్నందించిన మూలకవి సంస్తుతి చాలాచోట్ల కనిపిస్తుంది. కొన్నిచోట్ల పేరుచెప్పి సంస్తుతించడమూ, మరికొన్నిచోట్ల పూర్వ మహాకవులను ఒక్కమాటలో ప్రశంసించడమూకూడా కనిపిస్తుంది. కాళిదాసు 'మాళవికాగ్ని మిత్రం'లో "ప్రథిత యశసాం భాససౌమిల్ల కవిపుత్రాదీనాం ప్రబంధా నతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయా కుతః పరిషదో బహుమానః'' అని అన డంలో భాసుడు, సౌమిల్లకుడు, కవిపుత్రుడు అనే ముగ్గురు ప్రాచీన కవుల ప్రశంస ఉన్నది. భవభూతి 'ఉత్తర రామచరిత'లో "ఇదం కవిభ్యః పూర్వేభ్యో నమోవాకం ప్రశాస్మహే" అని ఒక్కమాటలో పూర్వకవులకు నమస్క రించాడు. మురారి 'అనర్ఘ రాఘవం'లో వాల్మీకిని

"తమృషిం మనుష్యలోక ప్రవేశ విశ్రామ శాఖినంవాచామ్
సురలోకాదవతార ప్రాంతర ఖేదచ్ఛిదం వందే"[79] అని స్తుతించాడు.

బాణుడు 'హర్షచరిత'లో సుబంధుకవి 'వాసవదత్త'ను హరిచంద్ర కవినీ, శాతవాహనుని, ప్రవరసేనుని, భాసుని, కాళిదాసుని, గుణాఢ్యుని 'బృహత్కథ'ను, ఆఢ్యరాజును కీర్తించాడు.[80]

(6) కుకవి నింద

కు కవిత్వ మెటువంటిదో, కు కవి లక్షణాలేమిటో కొందరు కవులు వర్ణించారు. బాణుడు 'హర్షచరిత'లో కుకవులను దూషించాడు.[81]

(7) దుర్జన నింద, సజ్జన స్తుతి

దుర్జన నింద, సజ్జన స్తుతి పాఠకుల నుద్దేశించేకావచ్చు. ఇతరుల ప్రస్తావన తీసుకొని రావలసిన అవసరంలేదు. దుర్జనుల మాటలు, సజ్జనుల మాటలు ఎట్లా వుంటాయో, సుభాషితాన్ని స్వీకరించడంలో వీరికి ఎటువంటి భేదం ఉందో బాణుడు తెలియజేశాడు.[82]

ఈ విధంగా ఒకటి తరువాత ఒకటి పీఠికాలక్షణాలు ప్రస్తావనల్లో, అవతారికల్లో చోటు చేసుకున్నాయి. రాతపరికరాలు పెరిగిన కొద్దీ పీఠిక నిడివి పెరిగింది, చెప్పవలసిన గ్రంథేతర విషయాలు పెరిగాయి.

iii) మనస్తత్వ ప్రాతిపదిక - పీఠికా లక్షణం : ఇతివృత్తం

గ్రంథాంతర్గత విషయమైన ఇతివృత్తం కూడా సాంకేతిక పురోగతివల్లనే అవతారికలలో, ప్రస్తావనలలో చోటు చేసుకున్నది. అయితే దీనికి కొంత మనస్తత్వ ప్రాతిపదిక కూడా ఉంది.

మానవ మనస్తత్వం చాలా సంక్లిష్టమయింది. ఒక విషయాన్ని సూటిగా చెప్పదు. అసలు విషయం చెప్పేముందు ఉపోద్ఘాతాన్ని సిద్ధం చేసుకుంటుంది. చెప్పబోయే విషయం సుదీర్ఘమయిందయినప్పుడు శ్రోతను దీర్ఘకాలం అనిశ్చిత స్థితిలో ఉంచడం ఉచితం కాదు. అందువల్ల విషయాన్ని సంక్షిప్తంగా ఫలితార్థం చెప్పి తరువాత క్రమానుసరణంగా వృత్తాంతాన్ని చెప్పవలసి వస్తుంది.

మానవ మనస్తత్వం, విషయంకంటే, విషయసారగ్రహణకు ఎక్కువ తొందర పడుతుంది. ఇదే పీఠికలోనే ఇతివృత్త సంగ్రహానికి మూలం. ప్రాచీన కాలంలో అన్ని దేశాలలోనూ కావ్యపఠనం కంటే కావ్యశ్రవణమే సాధారణం. చాలామందికి చదవటమేరాదు. కాని అర్థం చేసుకోవటంలో వారికి కష్టమేమీలేదు. భారతదేశంలో పురోహితులు, పండితులు, పాశ్చాత్య దేశాలలో దేశ దిమ్మరులైన

గాయకులు (Trabadours) పురోహితులు (Church priests) కావ్యగానం చేసేవారు. మొదట్లో కావ్యంలోని విషయాన్ని సంక్షిప్తంగా శ్రోతలకు తెలియబరచి తరువాత కావ్యపఠనం ప్రారంభించేవారు. ఇట్లా ఇతివృత్తాన్ని సంగ్రహంగా చెప్పటం రాతపరికరాలు అందుబాటులోనికి రాగానే కావ్యావతారికలలోనికి, ప్రస్తావనలలోకి పాకింది. ఈ విధంగా పీఠికలో ఇతివృత్తాన్ని చెప్పే సంప్రదాయం ప్రారంభమయినా, కొంతమంది కవులు, నాటకకర్తలు పాఠకుల, శ్రోతల, ప్రేక్షకుల ఉత్సుకతను మరింత ఇనుమడింప చేయటానికి అసలు ఇతివృత్త ప్రసక్తే సాభిప్రాయంగా మానివేశారు.

శ్రవ్యకావ్యం కంటె దృశ్యకావ్యం పరిచయాన్ని అపేక్షిస్తుంది. శ్రవ్య కావ్య విషయంలో పాఠకుడు, లేక శ్రోత ఆ రచన గురించి, కథ గురించిన పూర్వాపరాలను యోచించుకొనే అవకాశం ఉంది. అవగాహనకు సరిపడే సమయాన్ని తీసుకోవచ్చు. సందేహాలను నివారించుకోవచ్చు. కాని దృశ్యకావ్యాలలో ఏవిధమైన ఉపోద్ఘాతమూ లేకపోతే హఠాత్తుగా రంగం మీద కనిపించిన పాత్ర ఏదో తెలుసుకోవటానికే సామాజికునికి కాలం వ్యర్థమవుతుంది. ఈ లోగా కొన్ని సంభాషణలు నడవడమూ, కొత్త పాత్రలు ప్రవేశించటమూ సామాజికుణ్ణి మరింత తికమకపెట్టే అవకాశం ఉంది. పాత్రల వర్తనలో తన్మయుడై రసానుభూతిని పొందవలసిన సామాజికుడు నాటకాన్ని అర్థంచేసుకునే ప్రయత్నంలోనే మిగిలిపోతాడు. అందువల్ల నాటకానికి కొంత ఉపోద్ఘాతం తప్పనిసరి అయింది. సంస్కృతంలో శ్రవ్యకావ్యాలలో అరుదుగా ఉండే అవతారిక దృశ్యకావ్యాలలో అనివార్యంగా ఉండడానికి ఇదే కారణం.

ప్రపంచ సాహిత్యంలో రాతపూర్వకంగా లభిస్తున్న మొదటి రచనలు మహేతిహాస కావ్యాలు (Epics). ఇవి మహిమాన్వితుడూ, ఉచ్చకుల సంజాతుడు, సద్ధర్మ పరాయణుడూ అయిన వ్యక్తిని గూర్చి గాని, లేక అటువంటి వంశాన్ని గూర్చి గాని చెప్పిన కథలు. సాధారణంగా ఇటువంటి వ్యక్తి చక్రవర్తీ, యోధుడూ అయి ఉంటాడు. వంశమయితే రాజవంశమే అయి ఉంటుంది. లేకపోతే పురాణ కథలు కావ్య వస్తువులవుతాయి. అప్పటికే వర్గవిభజన జరిగి, పాలకవర్గ ప్రయోజనాన్ని స్థాపించే కావ్యాలు అవి. కావ్య నాయకుడు పాలక వర్గానికి చెందినవాడు. హీనకులజుడు, నిమ్నవర్గీయుడు, సామాన్య మానవుడు

కావ్యనాయకుడు కాజాలడు. ఈ పరిస్థితి మహేతిహాసాల అనంతరం వచ్చిన కావ్య నాటకాల విషయంలో కూడా కొనసాగింది. వీటిలో కూడా సామాన్యుడు నాయకుడు కాలేదు. ధీరోదాత్తతాది నాయక లక్షణాలన్నీ పాలకవర్గానికే చెంది ఉంటాయి.

కవి తాను కావ్య రచనకు పూనుకోగా దానికి వస్తువుగా ఎన్నుకున్న విషయాన్ని ఎందుకు ఎన్నుకున్నాడో అసలు కథకు ముందే వివరిస్తాడు. 'రామాయణం' బాలకాండ ద్వితీయ సర్గలో బ్రహ్మ వాల్మీకితో ఇట్లా అన్నాడు.

"మచ్ఛందా దేవతే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ
రామస్యచరితం సర్వంకురు త్వమృషి సత్తమ
ధర్మాత్మనో గుణవతోలోకే రామస్య ధీమతః
వృత్తం కథయ ధీరస్య యథాతే నారదాచ్ఛ్రుతమ్"83

వాల్మీకి 'రామాయణ' కావ్యవస్తువునంతా మొదటి సర్గలో నారదుని నోట వినిపించాడు. మళ్ళీ మూడో సర్గలో 'రామాయణ' కథను రచించటానికి పూను కొని, ఆ కథనంతా నారదుడు చెప్పిన దానికంటే విపులంగా చెప్పాలని యోచి స్తున్న వాల్మీకికి మొత్తం రామచరిత్ర దృశ్యమానమయింది. తనకు కన్పించిన ఈ చరిత్రను మళ్ళీ సంక్షిప్తంగా చెప్పాడు. కాళిదాసు 'రఘువంశ' చక్రవర్తుల కథే చెప్పటానికి కారణం చెప్పుకున్నాడు.84

'ప్రతిమా' నాటకంలో పాత్రల పేర్లను,నాటకంపేరును ప్రథమ. శ్లోకంలో కూర్చి భాసుడు వస్తు సూచన చేశాడు.85 ఇది సర్వసాధారణమే, శ్లేషగాగాని, కేవల శబ్ద సామ్యంవల్లగాని వస్తు సూచన చేయవచ్చు.

గ్రీకు భాషలో లభిస్తున్న తొలిరచనలు హోమర్ ఇతిహాస కావ్యాలు - ఇలియడ్, ఒడిస్సీలు, ఇలియడ్‌లో ఎకిలస్ ఆగ్రహాన్నిగూర్చి పాడమని దేవత నుద్బోధిస్తూ, ఆయన ఆగ్రహకారణాన జరిగిన మానవ మారణ హోమాన్ని హోమర్ సూచిస్తాడు.

"Sing Goddess, the wrath of Achilles pileides
The ruinous ānger that woes on the Danaans brought

Unnumber'd and strong souls many of heroes sent
To hades, and made their bodies a pray for the dogs
A feast for the birds, while the purpose of Zeus was fulfilld'.
Even from the hour when the two first parted in strife
At rides,the king of men, and noble Achilles."[86]

యురిపిడిస్ తన 'హిప్పొలైటస్' అనే విషాదాంత నాటకంలోని ఇతి వృత్తాన్ని అఫ్రొడైట్ దేవత చేత చెప్పిస్తాడు.

"Now I will quickly tell you the truth of this story
Hippolytus, son of Theseus by the Amezon
Pupil of holy Pithius
Alone among the folk of this land of Trozen has blasphemed me"[87]

తన 'అల్‌సెస్టిస్' నాటకంలో కూడా 'అపోలో' 'డెత్' అనే రెండు పాత్రల సంభాషణ ద్వారా ఇతివృత్తాన్ని చెప్పిస్తాడు.

క్రిష్టఫర్‌మార్లో తన 'డాక్టర్ ఫాస్టస్' నాటక ప్రస్తావనను ప్రస్తుత ఇతి వృత్తాన్ని సూచించడానికే కాక నాటకకథకు పూర్వం జరిగిన ఫాస్టస్ చరిత్రను చెప్పడానికి కూడా వినియోగిస్తాడు.

"Now is he born, his parents of base stock
In Germany, with in a town called rhodes
of ripen years to wertenberg he went
where as his kinsmen chiefly brought him up
so soon he profits in divinity,
The fruitful plot of scholarism grac'd
That shortly he was grac'd with doctors name."[88]

చాసర్ తన 'కాంటర్బరీ టేల్స్' ప్రొలాగులో తను సౌత్ వార్క్ లోని టాబర్ట్ఇన్లో ఎలా చేరిందీ, ఇంకా 29 మంది తీర్థయాత్రికుల నెలా కలుసుకున్నదీ, ప్రతివ్యక్తిని, వారి ఆకార విశేషాలు, చిత్తవృత్తులతో పాటు చిత్రించాడు.[89]

మిల్టన్ మహాకావ్య ధోరణిలో తన 'పారడైజ్లాస్ట్' లో మొదటే వస్తు సూచన చేశాడు.

> "of Man's First Disobedience, and the Fruit,
> of that Forbidden Tree, whose mortal taste
> brought death into the world, and all our woe
> with loss of Eden, till one greater man
> Restore us, and regain the blissful seat
> Sing heav'nly muse."[90]

iv) ఫ్యూడల్ వ్యవస్థ - పీఠికా లక్షణం : అంకితం - కృతిపతి వర్ణన.

భారతదేశ చరిత్రలో 7-18 శతాబ్దాల మధ్యకాలాన్ని ఫ్యూడల్ వ్యవస్థా కాలంగా సోవియట్ ఇండాలజిస్టులు భావిస్తున్నారు.[91] భారత, యూరపుల ఫ్యూడల్ వ్యవస్థలలో ఉన్న సామ్యభేదాలను డి. డి. కోశాంబి వివరించాడు.[92]

ఫ్యూడల్ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం చాలా తక్కువ స్థాయిలో ఉండి, వ్యవసాయపు పనిముట్లు చాలా సాధారణమైనవిగా ఉంటాయి. వాటిని తయారు చేయడం తేలికే అయినా ఖర్చుతో కూడు కున్న పని. ఉత్పత్తి సమిష్టి కాదు. వ్యక్తి పరమైనది. శ్రమ విభజన చాలా ప్రాథమిక దశలో ఉంటుంది. ఉత్పత్తి లక్ష్యం గృహ, గ్రామ, సమాజ అవసరాలకు మాత్రమే పరిమితం. మార్కెట్టులో అమ్మకం దాని లక్ష్యం కాదు. ఇది యూరపులోనూ భారతదేశంలోనూ ఒక్కలాగే ఉంది. వెట్టిచాకిరి భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థాంత కాలానికి గాని స్థిరపడలేదు. యూరపులో బానిస విధానానికి ప్రాముఖ్యత వచ్చింది.

'ఫ్యూడలిజం ఫ్రం ఎబోవ్' కాలాన్నుండీ యూరపులోనూ, భారతదేశంలోనూ కూడా రాజకీయ వికేంద్రీకరణ సర్వసామాన్యంగానే జరిగింది. ఆదిమ

తెగల్లో సమిష్టి సంపద అయిన భూమి తెగనాయకుడి అధీనంలోకి వచ్చి అతడు ఫ్యూడల్ ప్రభువయ్యాడు. రాజుకు నేరుగా పన్ను చెల్లించే గ్రామాలు తప్ప మిగతా అన్ని గ్రామాల్లో గ్రామసభల అధికారం క్రమంగా దగ్గరి ఫ్యూడల్ ప్రభువుల హస్తగతమయింది. అయితే ఈ భూమి బలగాన్ని పంపి సేవచేసినంత కాలం ఫ్యూడల్ ప్రభువుల అధీనంలో ఉన్నా, తరచుగా జాగీర్లను మారుస్తూండే వారు. సైనికాధికారాలు వంశపారంపర్యంకావు. రాజ్యంలోని ఉన్నతాధికారు లంతా రాజు బానిసలే. పాక్షికంగా పాత గ్రామసభలు నిర్మూలితం కావడంవల్ల నిరాయుధులైన ప్రజలను అణచగలిగిన సాయుధబలం కలిగిన ఫ్యూడల్ ప్రభువు తన అధీనంలోని ప్రజలమీద న్యాయవిచారణ హక్కును సంపాదించాడు. ఇది తరవాత ఫ్యూడల్ వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేసింది.

బానిసవిధానం పెరగడం, శ్రేణుల కార్మిక సంఘాలు లుప్తమవడం, వ్యవస్థీకరింపబడిన పురోహితవర్గం లేకపోవడం - ఈ మూడు అంశాలు యూరో పియన్ ఫ్యూడలిజాన్ని, భారతదేశంలోని ఫ్యూడలిజాన్ని వేరుచేస్తున్నాయి. ఉత్పత్తికి ప్రాథమికరూపమైన కులవ్యవస్థ కార్మికసంఘాల స్థానాన్ని, పురోహిత వర్గస్థానాన్ని అధిష్ఠించింది.

ఇటువంటి ఫ్యూడల్ వ్యవస్థలో చక్రవర్తులు, రాజులు, ఫ్యూడల్ ప్రభువుల ఆస్థానాలలో వారి పోషణలో ఉంటూ, వారిని స్తుతించక పోవటం, వారికి తమ రచనలను అంకితమివ్వక పోవటం అసాధారణం. కావ్యాలను అంకితం చేసే సంప్రదాయం ఏ ప్రాచీన సాహిత్యంలోనూ కన్పించదు. ఫ్యూడల్ వ్యవస్థ ప్రారంభమైన మధ్యయుగాల్లోనే ఈ సంప్రదాయం బయలుదేరింది. రాజు వీరోచిత కృత్యాలను వర్ణించే కావ్యాలు వెలువడ్డాయి. సాహిత్యాన్ని ఆదిరాజ యశోబింబంగా భావించడమూ జరిగింది. దండి కావ్యాదర్శంలో "ఆదిరాజ యశోబింబమాదర్శం ప్రాప్యవాఙ్మయమ్ తేషామసన్నిధానేఽపి నస్వయం పశ్యనశ్యతి"93 అన్నాడు. హిందీ సాహిత్యంలో 'వీరగాథా కాల్'లో వచ్చిన కావ్యాలన్నీ ఇటువంటివే.

బాణుడు 'హర్షచరిత' గద్య కావ్యానికి మొదటి ఉచ్ఛ్వాసంలో పీఠికా ప్రాయంగా 20 శ్లోకాలను రచించాడు. వీటిలో చివరిశ్లోకం యిది-

"జయతి జ్వలత్ప్రతాప జ్వలన ప్రాకార కృత జగద్రక్షః ।
సకల ప్రణయ మనోరథ సిద్ధి శ్రీ పర్వతో హర్షః॥"94

బాణుడు తన ఆఖ్యాయికకు నాయకుడైన హర్షవర్ధనునికి జయం పలుకుతున్నాడు. మరి బాణుడు హర్షుని ఆస్థానంలోని కవే కాబట్టి ముందుగా కథానాయకుడైన తన ప్రభువుకు జయం కలుగుగాక అని చెప్పడంలో ఉభయార్థసిద్ధి కలుగుతున్నది. కాళిదాసు 'మాళవికాగ్ని మిత్ర' నాటకం కూడా ఇటువంటిదే. నాటకాంతంలో భరతవాక్యం అగ్నిమిత్రుని నోటనే పలికించాడు. వామనభట్ట బాణుని 'వీరనారాయణ చరిత్ర' కూడా 'హర్షచరిత్ర' ననుసరించిందే.

ఆదిశంకరుడు తన 'శివానందలహరి' లో తన బుద్ధికన్యను ఈశ్వరుని కిస్తున్నట్లుగా చెప్పుకున్నాడు. భగవంతుని విషయంలో కూడా ఫ్యూడల్ భావాల ప్రభావాన్ని ఇది నొక్కి చెప్తున్నది.

"శివ! తవ పరిచర్యా సన్నిధానాయ గౌర్యా
భవ! మమగుణధుర్యాం బుద్ధి కన్యాం ప్రదాస్యే।
సకల భువనబంధో! సచ్చిదానంద సింధో
సదయ! హృదయగేహే సర్వదా సంవసత్వం॥"95

అలంకార శాస్త్రంలో లక్షణాలన్నింటికీ తన ప్రభువునే లక్ష్యంగా చెప్పడం కూడా ఇటువంటిదే. 'ప్రతాపరుద్రీయం' వంటివి ఇందుకుదాహరణాలు. మధ్యయుగాలలోని గంగాదేవి మధురావిజయం వంటి సంస్కృత కావ్యాలలో కూడా 'అంకిత' సంప్రదాయం కనిపిస్తుంది.

లాటిన్‌లో క్రీ. శ. 5 వ శతాబ్దానికి చెందిన పేరు తెలియని రచయిత నాటకం 'క్వెరొలన్' కు అంకితమైంది. ఈ అంకితమిచ్చే సంప్రదాయం ప్రాచీనం కాదనీ, మధ్యయుగాల ఆరంభంలో కొత్తగా ఏర్పడిందనీ చెప్పడానికి ఇది కూడా ఒక నిదర్శనంగా పనికివస్తుంది.

మధ్యయుగాలలోనే ప్రారంభమైన సాహిత్యాలలో మొదటి నుండి ఈ సంప్రదాయం కనిపిస్తుంది. ఏ కథను కావ్యంగా రాస్తున్నా దాన్ని ఒక

ప్రభువుకు అంకితమివ్వడమూ, కథానాయకుడికీ, ప్రభువుకూ అభేదం చెప్పడమూ, ప్రభువు కథనే ఇతివృత్తంగా స్వీకరించడమూ మొదలైన ధోరణులు సర్వత్రా కనిపిస్తాయి.

ఉదాహరణకు ఇంగ్లీషులో ఎడ్మండ్ స్పెన్సర్ తన 'ఫెయిరీక్వీన్' కావ్యంలో తన రాణి ఎలిజబెత్‌కూ, దేవతకూ అభేదాన్నేర్పరుస్తూ కీర్తించాడు.

> "... O Goddess Heavenly bright
> Mirrour of grace and Majestic divine,
> Great Lady of the greatest Isle..."[96]

కొన్ని చోట్ల సంప్రదాయ సాహిత్యంలో గౌరవాన్ని పొందలేకపోయినా ప్రాంతీయ వీరుల, ప్రభువుల వీరోచిత కృత్యాలు కావ్య రూపాన్ని సంతరించు కోవడం మాత్రం అన్ని సాహిత్యాలలోనూ ఉన్నది. ఇది మధ్యయుగాల ఫ్యూడలిజం ప్రభావమే ననడంలో సందేహం లేదు.

(v) వర్ణవ్యవస్థ, పీఠికా లక్షణం - కావ్యపఠనార్హత :

ఉత్పత్తి సాధనాలు ఎవరిచేతిలో ఉంటాయో వారు నాగరికతకు చేరువై ఉంటారు. చదువు విశ్లేషించి పరికించే శక్తినీ, ఆలోచనకు పదునునూ కలిగిస్తుంది. అటువంటి చదువు పాలక ధనిక వర్గాల పక్షమై పోయింది.

'పురుష సూక్తం'లో 'పురుషుని' నోటి నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి రాజన్యులు (క్షత్రియులు), తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ప్రభవించినట్లు చెప్పారు. ఇండో-యూరోపియను సమాజంలో ఉన్న అంతరువులనే భారత ఆర్యులు (హింద్వార్యులు) వర్ణాలుగా స్వీకరించారు. ప్రాచీన ఇరానులో నాలుగు వర్ణాలు లేక నాలుగు పిస్త్రాస్ (Pistras) అన్న వర్ణవిభజన ఉండేది. అయితే ఋగ్వేదంలో ఎక్కడా నిర్బంధాలతో కూడిన సామాజిక వ్యవస్థ ఉన్నట్లు గోచరించదు. వర్ణాంతర వివాహానికి, వృత్తి మార్చుకోవడానికి, అన్నివర్ణాల వారు ఒక చోట కలిసి భుజించటానికి ఎటువంటి అడ్డంకులూ లేవు. బ్రాహ్మణులు క్షత్రియ స్త్రీలను వివాహం చేసికోవడానికి ఆర్యులు శూద్రులను వివాహమాడటానికి అనేక ఉదాహరణలు లభ్యమౌతాయి. కులాలు

(కుటుంబాలు) ఒకే వృత్తి చేయాలన్న నిబంధనేమీ లేదు. "నేను కవిని, మా తండ్రివైద్యుడు, మా అమ్మ ధాన్యాన్ని పిండిచేసేది, అభిప్రాయభేదాలున్నా ఒకే గృహంలో జీవనం సాగిస్తున్నాము" అంటాడు ఒక ఋక్ కర్త. శూద్రులు వండింది తినకూడదన్న నిషేధమెక్కడా లేదు. అంటుకుంటే మైలపడి పోతా మేమో నన్న భావనా లేదు.97

తరువాతి కాలంలో ఆశ్రమ ధర్మాలు ఏర్పడి, స్మృతుల కాలానికల్లా వర్ణవిభజన మరింత ఘనీభవించింది. అంతకు ముందు ఎవరికీ చదువు నిషిద్ధం కాదు. స్మృతుల కాలానికల్లా స్త్రీలకు వేదవిద్య నిషిద్ధమయింది. బ్రాహ్మణులకు క్షత్రియులకు మాత్రమే చదువుకునే హక్కు స్థిరపడింది. గురుకులాలు, దేవాలయాలు పాఠశాలలయ్యాయి.

ప్రాచీన రోమన్ సామ్రాజ్యంలో కూడ సామంతులు (patricians) వర్తక నిపుణులు (Knights), సామాన్యులు (Plebians) బానిసలు (Slaves) అన్న విభాగం ఉండేది. మధ్యయుగాల్లో లార్డులని పిలువబడే ఫ్యూడల్ భూస్వాములు, సేరీనౌకర్లు (Vassals) వృత్తి యజమానులు (Guild-masters) వృత్తి పనివారు (Journeymen) అప్రెంటిసులు, అర్ధబానిసలు అన్న విభాగం ఉండేది. ఇందులో ప్రతివర్గం అనేక శాఖలుగా విభజింపబడి ఉంది. అయితే ఇక్కడ కూడా చదువుకునేది, చదువు చెప్పేది పురోహిత వర్గమే. చర్చిలే మొదటి పాఠశాలలు.

వర్ణవ్యవస్థ ఘనీభవించిన కాలంలో విద్య పూర్తిగా ఒక వర్గానికే పరిమితమై పోయింది. ఆ వర్గం మెచ్చుకోలునే కవులు వాంఛించారు. అటువంటి విద్వాంసులే తమ కావ్యాలకు పాఠకులుగా, శ్రోతలుగా, నాటకాలను సామాజికులుగా కవులు ఉద్దేశించారు. తమ కావ్యరసాస్వాదనకు ఎటువంటి పాఠకులు అర్హులో కవులు అక్కడక్కడా చెప్పారు. రఘువంశంలో కాళిదాసు

> "తం సంతః శ్రోతు మర్హంతి సదసద్వ్యక్తి హేతవః ।
> హేమ్నః సం లక్ష్యతేఽహ్యగ్నౌ విశుద్ధిః శ్యామికాపివా ॥"98 అన్నాడు.

నాటక ప్రస్తావనలలో సామాజికుల మనస్సులను రంగంవైపు తిప్పుకోవడానికి ఉద్దేశించిన విషయాలలో వారి ప్రశంస కూడా ఒకటి. పండితులకు సంతోషం కలిగించినపుడు నాటక ప్రయోక్తకు తన నేర్పుమీద విశ్వాసం కలుగుతుందన్నాడు కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతల' ప్రస్తావనలో.

"ఆ పరితోషా ద్విదుషాం నసాధుమన్యే ప్రయోగ విజ్ఞానం।
బలవదపి శిక్షితానా మాత్మన్య ప్రత్యయం చేతః॥"[99]

'ముద్రారాక్షస' నాటక ప్రస్తావనలో విశాఖదత్తుడు

"చీయతే బాలిశస్యాపి సత్ క్షేత్ర పతితాకృషిః।
న శాలేః స్తమ్బకరితా వప్తుర్గుణ మపేక్షతే॥"[100]

అని పరిషత్ప్రశంస చేశాడు.

శ్రోతలను, సామాజికులను సంబోధించడం, గ్రీకు, లాటిన్ శ్రవ్య దృశ్య కావ్యాలలో కూడా ఉంది. ప్లాటస్ 'ది కామెడీ ఆఫ్ యాసెస్' లో "Pray gentlemen and ladies, pay attention"[101] అనటంలో 'Gentlemen and ladies' పై వర్గం వారే తప్ప కిందివర్గం కాదు.

సాహిత్య సృష్టికి కిందివర్గాలు యోగ్యాలు కావన్న భావన కూడా పై వర్గాలలో కొనసాగింది. బ్రాహ్మణులు తప్ప మరెవ్వరూ కావ్య రచనకు అర్హులు కాదన్న భావన చాలా చోట్ల స్పష్టంగా కనిపిస్తుంది. మధ్య యుగాలలోనే పై వర్గాలకు వ్యతిరేకంగా సమీకృతం కావడానికి భక్త్యాదులను మార్గంగా తీసుకొని కింది వర్గాలు తలెత్తే ప్రయత్నం చేసినప్పటికీ, ఈ ధోరణి మొన్నమొన్నటి దాకా కొనసాగింది. తెలుగు సాహిత్యంలో బ్రాహ్మణేతర కవుల రచనల కర్తృత్వ విషయంలో ప్రచురంగా కనిపించే వివాదాలు దీనికి ఒక ప్రబల నిదర్శనం.

"ఉపమగలిగిన శయ్యల నొప్పియున్న
అంత్రిమిఖవుని కావ్యంబు గ్రాహ్యంబుగాదు"[102]

అన్నాడు అప్పకవి - మొల్ల, చేమకూర వేంకటకవి మొదలైన వారి గురించి కన్పించే నిరసన వాక్యాలు కూడా ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి.

పైన చర్చించిన విధంగా వివిధ నేపథ్యాల నుండి పీఠికల లక్షణాలు కావ్యావతారికలలో, నాటక ప్రస్తావనలలో చోటుచేసుకున్నాయి. మొదట్లో ఈ పీఠికలు సంక్షిప్తంగా ఉండి రానురాను విస్తృతమవడం గమనించదగింది. తెలుగు, ఆంగ్ల సాహిత్యాలు మధ్యయుగాల్లో ఆరంభమయ్యాయి. అందువల్ల తెలుగు సాహిత్యంమీద సంస్కృత సాహిత్య ప్రభావమూ, ఆంగ్ల సాహిత్యం మీద, గ్రీకు, లాటిన్ సాహిత్యాల ప్రభావమూ పడింది. పైగా ఈ సాహిత్యాల ఉద్భవమే మధ్యయుగాలలో జరిగింది, కాబట్టి అప్పటికి వీటికి మూలమైన సాహిత్యాలలో కలిగిన లక్షణాలతో సమగ్ర పరిచయం ఉండడమూ, ఆ లక్షణాలూ అక్కడ కూడా చోటు చేసుకోవడమూ జరిగింది.

3. తెలుగు కావ్యావతారికలలో పీఠికా లక్షణాలు :

i) నన్నయ

నన్నయ ఆంధ్రభారతమే తెలుగులో లభిస్తున్న మొదటి గ్రంథం. భారతాన్ని నన్నయ అవతారికతో ప్రారంభించాడు. అవతారికను 'శ్రీవాణీ గిరిజాః' అన్న శ్లోకంతో త్రిమూర్తుల స్తుతితో ఆరంభించాడు. తరువాత తెలుగు వచనంలో మళ్ళీ ఆ విషయాన్ని స్పృశించి రాజరాజనరేంద్రుని వర్ణించాడు. రాజరాజొకనాడు కొలువుదీరి నన్నయను భారతాన్ని తెలుగులో రచింపమని కోరాడు. దేవతలకు నమస్కరించి, వాల్మీకి వ్యాసులను కొలిచి, సభను కొనియాడి, నారాయణభట్టు తోడ్పాటును ప్రశంసించి, తన కవితా లక్షణాలను పేర్కొని కథా రచనకు పూనుకున్నాడు. మూలకర్తను, మూలగ్రంథ మహిమనూ కొనియాడాడు. పర్వాల అనుక్రమణికను, పర్వసంగ్రహాన్ని తెలిపి కథను ప్రారంభించాడు.

1. శ్రీకారంతో ఆరంభం
2. ఇష్టదేవతాస్తుతి
3. కృతిపతివర్ణన
4. కృతికర్తృవర్ణన
5. పూర్వకవి స్తుతి
6. కవిత్వాశయాలు

7. కావ్య ప్రశంస
8. మూలకర్త ప్రశంస
9. కథా సంగ్రహం
10. ఫలశ్రుతి

ఇవి నన్నయ అవతారికలోని ప్రధానాంశాలు. ప్రాచీన సంస్కృత కావ్యాలలో కొన్ని శ్రీకారంతో ప్రారంభమయ్యాయి. ఆశీర్నమస్క్రియలు అరుదేమీ కాదు. అంకితం కృతిపతి నామాంకితంగా కొన్ని కృతులలో కనిపిస్తుంది. కృతికర్తృ వర్ణన ఉంది. పూర్వకవిస్తుతి, కావ్యప్రశంస, కవిత్వాశయాలు, మూలకర్త ప్రశంస, కథా సూచన ఉన్నాయి. తెలుగులో తరువాతి కవులు కుకవినింద, షష్ఠ్యంతాలు చేర్చారు. కుకవినింద కూడా సంస్కృత కవులు కొందరు చేశారు. షష్ఠ్యంతాలకు మూలం రఘువంశంలోనే కనిపిస్తుంది. కృతిపతి వర్ణన కృతిపతి వంశ వర్ణనగా తరువాతికాలంలో బాగా విస్తరించింది. అట్లాగే కృతికర్త వంశవర్ణన కూడా.

నన్నయ అవతారికలో కనిపించే ఈ లక్షణాలు పూర్వ సంస్కృత కవులలోనే ఉన్నాయనడం ఇంతకుముందు చెప్పిన ఉదాహరణలను బట్టి గుర్తించ వచ్చు. నన్నయ అవతారికా లక్షణాలను పై వాటితో పోల్చి పరిశీలిద్దాం.

1) ఇష్టదేవతా స్తుతి : నన్నయ

"శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహన్త్య విహతాం స్త్రీ పుంస యోగోద్భవాం
తేవేదత్రయ మూర్తయ స్త్రి పురుషాస్సంపూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీ కన్ధరాశ్శ్రేయసే."103

అని త్రిమూర్తులను స్తుతించాడు. ఆయనే మళ్ళీ వెంటనే తెలుగు వచనంలో 'అని సకలభువన రక్షణ ప్రభువులై యాద్యులైన హరిహర హిరణ్యగర్భ పద్మోమా వాణీ పతుల స్తుతియించి' అని చెప్పుకొన్నాడు. ఇది సంస్కృత నాటకాలలోని నాందీ శ్లోకాన్ని తలపిస్తుంది. తెలుగు కావ్యాన్ని సంస్కృత శ్లోకంతో ప్రారంభించాడు నన్నయ. కాళిదాసు రఘువంశంలో పార్వతీ

పరమేశ్వరుల స్తుతితో కావ్యారంభం చేశాడు. బాణుడు మూడు శ్లోకాలలో కాదంబరిలో త్రిమూర్తులను స్తుతించాడు. నన్నయ రాజరాజునానతిబడసి రచనకు దొడంగి మళ్ళీ హరి హరాజగజాననాది దేవతాతతికి నమస్కరించాడు. నన్నయ కావ్యాన్ని శ్రీకారంతో ప్రారంభం చేశాడు. సంస్కృతంలో కూడా భారవి, మాఘుడు, శ్రీకారంతోనే కావ్యారంభం చేశారు.

"శ్రియఃకురూణామధిపస్య పాలనీం
ప్రజాసువృత్తింయమయుంక్త వేదితుం।
సవర్ణలింగీ విదిత స్సమాయ యౌ
యుధిష్ఠిరం ద్వైతవనే వనేచరః॥"104

అని భారవి కిరాతార్జునీయాన్ని',

''శ్రియఃపతి శ్శ్రీమతి శాసితుం జగ
జ్జగన్నివాసోవసుదేవ సద్మని।
వసన్ దదర్శావతరం తమంబరా
ద్ధిరణ్య గర్భాంగభువం మునింహరిః॥''105

అని మాఘుడు శిశుపాలవధనీ ఆరంభించారు.

భోజరాజు తన చంపూరామాయణాన్ని శ్రీకారంతో ప్రారంభించక పోయినా సమానార్థకమయిన లక్ష్మీ శబ్దంతో ప్రారంభించాడు.

"లక్ష్మీం తనోతునితరామితరానపేక్ష
మంఘ్రిద్వయం నిగమశాఖి శిఖాప్రవాళం
హైరంబమంబురుహడంబర చౌర్యనిఘ్నం
విఘ్నాద్రిభేద శతధార ధురంధరంనః॥"106

2) కృతిపతివర్ణన : నన్నయతన భారతాన్ని రాజరాజ నరేంద్రుడికి అంకితం ఇచ్చాడా లేదా అన్న విషయంలో విమర్శకులలో భిన్నాభిప్రాయాలు న్నాయి. భారతావతారికలో ఎక్కడా రాజరాజు తనకు అంకితం ఇమ్మని అడ గడం గాని, రాజరాజుకు అంకితంగా తాను భారత రచనకు పూనుకున్నానని నన్నయ చెప్పడం గాని కనిపించదు. రాజరాజు భారతశ్రవణాసక్తిని కనబరి చాడు. శ్రీ మహాభారతము నందలి యభిప్రాయంబు విన నభిలాష ప్రకటించాడు.

'జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియింపు మధికధీయుక్తి మెయిన్"107

నన్నయ "దేవా నీయనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునం జేసి నానేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెదనని దొడంగి"108నాడు.

భారతావతారికలో విపులమైన రాజరాజనరేంద్రుని వర్ణన ఉంది. ఆశ్వాసాద్యంత పద్యాలలోను రాజరాజ సంబోధనాత్మకాలైన రాజరాజ నరేంద్ర వర్ణనలున్నాయి. రాజరాజ నరేంద్రుని శ్రోతగా చేసికొని నన్నయ భారతాన్ని రచించినట్టున్నది. పాల్కురికి సోమన బసవపురాణాదులు కూడ ఈ విధంగానే ఉన్నాయి. బసవపురాణానికి గొబ్బూరి సంగన శ్రోత. శ్రోతను ఆశ్వాస ఆద్యంతాలలో సంబోధించడం ఇక్కడా ఉన్నది. ఆరణ్యపర్వం చతుర్థాశ్వాసంలో 142 వ పద్యంతో ఆగిపోయిన నన్నయరచనను ఆ పర్వాంతం ఎర్రన పూరించాడు. అంతకు ముందే తిక్కన విరాటపర్వం మొదలుకొని పదిహేను పర్వాలనూ పూర్తి చేశాడు. తిక్కన ఆరణ్యపర్వాన్ని ముట్టుకొనక పోవడం అంతవరకూ అంకితం కావడమేనని, తిక్కన తన రచనను హరిహరనాథునకు అంకితం ఇవ్వదలచుకోవడం చేత ఆ భాగాన్ని రచింపలేదని కొందరంటున్నారు. ఏది ఏమైన నన్నయ భారతరచనకు ప్రేరేపకుడు, హేతుభూతమూ అయిన రాజరాజనరేంద్రుని ప్రశస్తిని ఆయన విపులంగానే వర్ణించాడు. రాజరాజు అడగడమూ, ఆయన అనుమతంబున నన్నయ రచనను ప్రారంభించడమూ ఆశ్వాసాద్యంత్యపద్యాలు అంకితాన్నే సూచిస్తున్నా యన్నాడు వేదాల తిరువేంగళాచార్యులు.109 రాజరాజనరేంద్రుడు నన్నయను తెలుగు భారతరచన చేయమని అనతిచ్చినట్లే బాణుని అతని బంధువులు హర్షచరిత్ర రాయమని కోరారు.

3) కృతికర్తృ వర్ణన : నన్నయ తనను గురించి ఒక సీసపద్యంలో చెప్పుకున్నాడు.

"తన కులబ్రాహ్మణు ననురక్తునవిరళ
జపహోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంతతాభ్యాసు బ్రహ్మాండాది
నానా పురాణ విజ్ఞాననిరతు

బాత్రునాపస్తంబ సూత్రు ముద్గలగోత్ర
    జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్య రచనాభి
    శోభితు సత్ప్రతిభాభియోగ్యు
నిత్యసత్య వచను మత్యమరాధిపా
చార్యుసుజనునన్న పార్యుజూచి
పరమధర్మ విదుడు వరచళుక్యాన్వయా
భరణుడిట్టులనియె గరుణతోడ"110

కాదంబరిలో బాణుడు తననేగాక తన వంశాన్ని మొత్తంగా పది శ్లోకాలలో వర్ణించాడు.

4) పూర్వకవిస్తుతి : నన్నయ వాల్మీకి వ్యాసులనిరువురనూ స్తుతించాడు "దుర్భరతపోవిభవాధికున్ గురుపద్యవిద్యకు నాద్యునంబురుహగర్భవిభుంబ్ర చేతసుపుత్రు భక్తిదలంచుచున్"111

అని వాల్మీకినీ,

"భారతభారతీ శుభగభస్తి చయంబులజేసి ఘోరసం
సారవికార సంతమసజాల విజృంభమువాపి సూరిచే
తోరుచిరాబ్జబోధన రతుండగు దివ్యపరాశరాత్మజాం
భోరుహమిత్రుగొల్చి మునిపూజితు భూరియశోవిరాజితున్"112

అని వ్యాసునీ స్తుతించాడు.

సంస్కృతంలో కాళిదాసు మొదలుకొని అనేకమంది కవులు పూర్వకవి ప్రశంస చేశారు. కాళిదాసు మాళవికాగ్నిమిత్రంలో భాస, సౌమిల్ల, కవిపుత్రాదులను పేర్కొన్నాడు. భవభూతి ఉత్తరరామ చరిత్రలో పూర్వకవులకు నమస్కరించాడు. మురారి అనర్ఘరాఘవంలో వాల్మీకిని స్తుతించాడు. బాణుడు హర్ష చరిత్రలో సుబంధుకవి 'వాసవదత్త'నూ, హరిచంద్ర కవినీ, శాతవాహనుని, ప్రవరసేనుని, భాసుని, కాళిదాసుని, గుణాఢ్యుని 'బృహత్కథ'నూ, ఆఢ్యరాజునూ కీర్తించాడు,

5) కవిత్వాశయాలు : నన్నయ తన రచనలోని లక్షణాలను ఈ విధంగా వివరించాడు.

'సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థయుక్తిలో
నారసి మేలునానితరులక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుడయ్యె జగద్ధితంబుగాన్"113

పూర్వ సంస్కృత కవులలో వాల్మీకి, బాణుడు, మురారి, మొదలైన వారు కూడా తమ కవిత్వ విశేషాలు చెప్పుకున్నారు. వాల్మీకి

"ఉదారవృత్తార్థ పదైర్మనోరమైః
తదాస్యరామస్య చకార కీర్తిమాన్ ।
సమాక్షరైః శ్లోక శతైర్యశస్వినో
యశస్కరం కావ్యముదార ధీర్మునిః ॥"

తదుపగత సమాససంధియోగం
సమమధురోపనతార్థ వాక్యబద్ధమ్
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చవధం నిశామయధ్వం"114

అని చెప్పుకున్నాడు. మురారి

"తత్తాదృగుజ్జ్వల కకుస్థకుల ప్రశస్తి
సౌరభ్య నిర్భర గభీర మనోహరాణి ।
వాల్మీకి వాగమృత కూపనిపాన లక్ష్మీ
మేతాని బిభ్రతి మురారికవేర్వాచాంసి॥'' 115

అని చెప్పుకున్నాడు.

6) కావ్యప్రశంస : తాను రచింపదలచుకున్న భారతగ్రంథ ప్రాశస్త్యాన్ని నన్నయ

"ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు

లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని
యైతిహాసికులితిహాసమనియు
బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిఁగొనియాడుచుండ
వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁజేసె భారతంబు"116 అనీ

"అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదార్థామలచ్ఛాయమై
సుమహద్వర్గ చతుష్క పుష్పవితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానాగుణ కీర్తనార్థ ఫలమై ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాతమమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై"117

అనీ వర్ణించాడు. మురారి 'అనర్ఘ రాఘవం'లో

"అపి కథ మసౌ రక్షోరాజ స్తతాప జగత్త్రయీ
మపి కథమభూదిక్ష్వాకూణాం కులేగరుడధ్వజః
అపికథ మృషో దైవ్యోవాచః స్వతః ప్రచకాశిరే
సుచరిత పరీపాకః సర్వః ప్రబంధకృతామయమ్"118

అనీ, భవభూతి 'మహావీరచరిత' ప్రస్తావనలో

"ప్రాచేతసోముని వృషా ప్రథమః కవీనాం
యత్పావనం రఘుపతేః ప్రణినాయ వృత్తం
భక్తస్యతత్ర సమరం స్తనుమాపివాణీ
తాం సుప్రసన్న మనసః కృతినోభజంతామ్"119 అనీ తమ ఇతివృత్తాన్ని ప్రశంసించారు.

7) మూలకర్త ప్రశంస : తన అనువాదానికి మూలకర్తయైన వ్యాస మునిని నన్నయ

"వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసె భారతంబు"120 అనీ

"ఇమ్ముగ సర్వలోక జనులెవ్వని యేని ముఖామృతాంశు బిం
బమ్మున నుద్భవంబయిన భారత వాగమృతంబు కర్ణరం
ధ్రమ్మను నంజలిందవిలి త్రావుచు రట్టి మునీంద్రలోక వం
ద్యుమ్ము నినప్పరాశరసుతుం బ్రణమిల్లి కరంబు భక్తితోన్" 121

అనీ ప్రశంసించాడు. మురారి 'అనర్ఘరాఘవం'లో

"మద్వర్గ్యా రసపాఠ గీతి గతిషు ప్రత్యేకముత్కర్షిణో
మౌద్గల్యస్యకవే ర్గభీరమధురో ద్గారాగిరాంవ్యూతయః
వీరోదాత్త గుణోత్తరో రఘుపతిః కావ్యార్థబీజం ముని
ర్వాల్మీకిః ఫలతిస్మయస్యచరిత స్తోత్రాయ దివ్యాగిరః"122

అని వాల్మీకిని ప్రశంసించాడు.

8) కథా సంగ్రహం : నన్నయ పర్వానుక్రమణికను, పర్వసంగ్రహాన్ని రాశాడు. పర్వానుక్రమణికలో నూరు పర్వాలను క్రమంలో చెప్పాడు. పర్వ సంగ్రహంలో అష్టాదశపర్వాలను ఒక్కొక్క పర్వంగా అందులో వచ్చే వృత్తాంతాలతో వివరించాడు.

రామాయణంలో వాల్మీకి కూడా మొదటి సర్గలో నారదుడి నోట రామాయణ కథనంతా వినిపించాడు. మళ్ళామూడో సర్గలో రామాయణ కథను రచించడానికి పూనుకున్న వాల్మీకికి విపులంగా రామాయణ గాథ అంతా కనిపించింది. ఏమేమి కనిపించిందో మళ్ళీ సంక్షిప్తంగా చెప్పాడు.

9) ఫలశ్రుతి : భారతశ్రవణం వల్ల కలిగే ఫలితాలను నన్నయ రాజరాజనరేంద్రుని నోట ఇలా చెప్పించాడు.

"అమలసువర్ణ శృంగ ఖురమై కపిలంబగు గోశతంబును
త్తమబహువేద విప్రులకు దానముచేసిన తత్ఫలంబు త
ద్యమ సమకూరు భారతకథా శ్రవణాభిరతిన్ మదీయచి
త్తమున నిశంబు భారతకథాశ్రవణ ప్రవణంబకావునన్"123

భారతం వినడంవల్ల కలిగే ఫలాన్ని నన్నయ ఇలా చెప్పాడు.

"ఆయురర్థులకు దీర్ఘాయురవాప్తియు
నర్థార్థులకు విపులార్థములును
ధర్మార్థులకు నిత్యధర్మ సంప్రాప్తియు
వినయార్థులకు మహావినయ మతియు
బుత్త్రార్థులకు బహుపుత్త్ర సమృద్ధియు
సంపదర్థులకిష్ట సంపదలును
గావించు నెప్పుడు భావించి వినుచుండు
వారల కిమ్మహా భారతంబు

భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ
వల్లభుండు భక్తవత్సలుండు
భవభయంబు లెల్లబాపి యిష్టార్థసం
సిద్ధి గరుణతోడ జేయునట్లు"[124]

"ఇమ్మహాభారతంబిమ్ములబాయక, విహితావధానులై వినుచునుండు వారికి విపుల ధర్మారంభ సంసిద్ధియగుబరమార్థంబ యక్రమమున వేదముల్ నాలుగు నాది పురాణముల్ పదునెనిమిదియు దత్ప్రమిత ధర్మ శాస్త్రంబులును మోక్షశాస్త్రతత్వంబులు నెఱిగిన ఫలమగునెల్ల ప్రొద్దు

దానములను బహువిధక్రతుహుతజప
బ్రహ్మచర్యములను బడయబడిన
పుణ్యఫలము బడయబోలు నశేష పా
పక్షయంబు నగు శుభంబు పెరుగు"[125]

రామాయణ పఠన ఫలాన్ని వాల్మీకి తెలియజేశాడు.[126]

ii) కావ్యావతారికలకు మూలం కన్నడమా ?

పై లక్షణాలను పరిశీలిస్తే నన్నయ అవతారిక నాటికి ఆయన అవతారికలో ఉన్న లక్షణాలన్నీ అంతకుముందు సంస్కృత కావ్యనాటకాలలో ఉన్నట్లు స్పష్టమౌతోంది. భారతదేశంలోని అన్ని ప్రాంతీయభాషా సాహిత్యాల మీద సంస్కృత భాషా సాహిత్యాల ప్రభావం విశేషం అనడంలో ఎటువంటి సందేహమూ అవసరము లేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళాలు సంస్కృతానికి

భిన్నమైన భాషాకుటుంబానికి చెందిన భాషలైనా రాజకీయ మత సాంస్కృతిక కారణాలవల్ల ఇండోయూరోపియన్ భాషాకుటుంబానికి చెందిన సంస్కృత ప్రాకృత భాషల ప్రభావానికి అత్యంతం లోనయ్యాయి. పరిపాలనా వ్యవస్థలో ఇది మరింత స్పష్టమౌతుంది. దాదాపు అన్ని ద్రావిడభాషలలో సాహిత్యసృష్టి ప్రధానంగా సంస్కృత వాఙ్మయం ఆధారంగానే జరిగింది. పాశ్చాత్య ప్రపంచంలో గ్రీకు భాషాసాహిత్యాల ప్రభావమూ వాటినే అనుకరించిన లాటిన్ భాషాసాహిత్యాల ప్రభావంగా యూరప్‌లోని ప్రాంతీయ భాషా సాహిత్యాలన్నింటి మీద, ఏ విధంగా ఉందో, ఇక్కడ సంస్కృత సాహిత్య ప్రభావం ఆ విధంగానే ఉంది. అక్కడ గ్రీకు, లాటిన్ భాషలే విద్యామాధ్యమంగా ఉన్నట్లు, ఇక్కడ సంస్కృతమే మాధ్యమం. సకల శాస్త్రాలూ ఏ ప్రాంతం వాళ్ళు రాసినవైనా సంస్కృత భాషలోనేవచ్చాయి. ప్రాంతీయ భాషల్లో మౌలికమైన శాస్త్ర సాహిత్యం రాలేదు. అందువల్ల సంస్కృతం మీద విద్యావిషయంగా కూడా పూర్తిగా ఆధారపడక తప్పలేదు.

మధ్యయుగాలలోనే దక్షిణాది భాషలన్నింటిలోనూ లిఖిత సాహిత్య సృష్టి ప్రారంభమయింది. ఒక్క తమిళంలోనే కొంత ప్రాచీన సాహిత్యం కనిపిస్తుంది. దక్షిణాది భాషలలోని సాహిత్యాలలో కనిపించే సమాన లక్షణాలకు సంస్కృత వాఙ్మయానుకరణం ఒక ప్రధానకారణం. ఈ భాషలు సాహిత్యవిషయంలో పరస్పరం ఇచ్చి పుచ్చుకున్న సందర్భాలు సంస్కృత సాహిత్యంతో పోల్చినప్పుడు అత్యంతాల్పమని చెప్పవలసి ఉంటుంది. ఉభయ భాషాల్లోనూ రచనలు చేసిన సందర్భాలూ అల్పమే. వాటిలో లభిస్తున్న వాటి సంఖ్య మరీ తక్కువ. ఉభయభాషాకవులన్నప్పుడు సంస్కృతాంధ్రాలనే అర్థాన్నే మనవాళ్ళు ఉద్దేశిస్తున్నారుతప్ప దానిని తక్కిన, ద్రావిడ భాషాలలో ఒకదానితో తెలుగును కలిపి కాదు.

ఏ కవి అయినా కావ్యావతారికలలో పూర్వకవి స్తుతి చేసినపుడు తనకు ఆదర్శప్రాయమైన కవులనే స్తుతిస్తాడు. సాధారణంగా తాను ఏకవుల ననుసరించాడో వారినే పేర్కొంటాడు. తనకు ఎవరిపై గురుత్వం ఉంటుందో వారినే పేర్కొంటాడు. నన్నయ, నన్నెచోడుడు కన్నడ కవుల ననుసరించారని కొందరు విమర్శకులంటున్నారు. తమకు ఆదర్శప్రాయులైన సంస్కృత

కవులను స్తుతించిన వీరు ఒకవేళ తాము నిజంగా అనుసరించి ఉన్నట్లయితే తమకు పూర్వులయిన కన్నడకవుల పేర్లను ఎందుకు పేర్కొనలేదు? తనకు భారత రచనలో తోడ్పడ్డ నారాయణభట్టును ప్రత్యేకంగా స్మరించిన నన్నయ కన్నడ కవులనెందుకు పేర్కొనలేదు? అన్న సందేహానికి సమాధానం చెప్పవలసి ఉంటుంది. ఆయన వాల్మీకి వ్యాసులను మాత్రమే పేర్కొన్నాడు. వాల్మీకి వ్యాసులతోపాటు కాళిదాసు, భారవి, ఉద్భటుడు, బాణులను పేర్కొన్న నన్నెచోడుడుకూడా ఏ కన్నడ కవినీ పేర్కొనలేదు.

కన్నడంలో క్రీ. శ. 850 ప్రాంతంలో 'కవిరాజ మార్గం' వచ్చింది. దీని కంటే ముందే గద్య పద్య కవులు కన్నడంలో ఉన్నట్లు కవిరాజమార్గంలోని వారి ప్రసక్తి తెలియజేస్తుంది. అంతకుముందునుండే శాసనాలున్నాయి. తెలుగులో నన్నయదే లభిస్తున్న మొదటి గ్రంథం. తనకు ముందున్న తెలుగుకవులెవ్వరినీ ఆయన పేర్కొనలేదు. పద్యరచన ఆయనకు 200 ఏండ్లకు పూర్వమే ఉందన డానికి క్రీ. శ. 848 నాటి పండరంగని అద్దంకి శాసనమే నిదర్శనం. పూర్తిగా తెలుగులో ఉన్న శాసనాలు 6వ శతాబ్దం చివరి పాదం నుండీ లభిస్తున్నాయి.

కన్నడంలోగాని, తెలుగులోగాని, శాసనరచయితలైన వాళ్లు సంస్కృతంలో పాండిత్యం ఉన్నవాళ్లే. రాజాస్థానాలలోని సుప్రసిద్ధ కవిపండితులు శాసన రచయితలుగా మనకు దర్శనమిస్తారు. తెలుగులో శ్రీపతి పండితుడు శాసన రచన చేశాడంటారు. నన్నయ, శ్రీనాథాదులు శాసనకవులుగా సుప్రసిద్ధులే. శాసనాన్ని కావ్యమనడమూ, కావ్యానికున్న నిర్మాణ సమగ్రత సౌందర్యాలు శాసనాలకూ ఉండడమూ విస్పష్టమే. ప్రాంతీయ భాషాశాసనాలను కొన్ని చోట్ల సంస్కృత శ్లోకంతో ప్రారంభించడమూ, స్వస్తి, స్వస్తిశ్రీ, శ్రీ అనే మాటలతో శాసనారంభం చేసే సర్వసాధారణమైన సంప్రదాయమూ ఉన్నాయి.

సంస్కృత సాహిత్యంలో భట్టబాణుని ప్రవేశం ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించింది. అర్థం మీదకంటే శబ్దంమీద దృష్టిపెరగడానికి, దీర్ఘ సమాసభూయిష్ఠ రచనకూ బాణుడు మార్గదర్శకుడయ్యాడు. బాణుని పదబంధాలు, శబ్దప్రయోగ వైచిత్రి దేశికవులను చాలా ఆకర్షించాయి. తెలుగు కవుల శయ్యాపాకాల విషయంలో బాణుడి ప్రభావమే హెచ్చు. అందుకే పూర్వకవి స్తుతులలో వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసుల తరువాత బాణుడికే అగ్రస్థానం. శాసనకవుల మీద కూడా

బాణుడి ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. తెలుగు కన్నడ దేశాలలో లభిస్తున్న అనేక శాసనాలు బాణుని హర్షచరిత్రలోని మొదటి శ్లోకంతో ప్రారంభ మౌతున్నాయి.

ఆంధ్ర కన్నడ సాహిత్య సంప్రదాయాల మీద సంస్కృత వాఙ్మయ ప్రభావాన్ని తేలిగ్గా గుర్తించవచ్చు. బాణుడి అవతారికలు, రామాయణం ప్రథమ సర్గలు, సంస్కృత నాటకాల ప్రస్తావనలు కన్నడంలోనూ, తెలుగులోనూ కావ్యావతారికా సంప్రదాయానికి మూలం. కావ్యాలను అంకితమివ్వడమన్నది మధ్యయుగాలలో ప్రారంభమైన లక్షణం. ఇది ఒక సాహిత్యాన్ని చూసి మరొకటి నేర్చుకొన్నది కాదు.

సహజమైన పరిణామక్రమంలో వచ్చిన కొన్ని లక్షణాలతో సంస్కృత సాహిత్య ప్రభావంగానే తెలుగులో కావ్యావతారిక లేర్పడ్డాయి.

(iii) ఇతర తెలుగు కవులు - కావ్యావతారికలు

నన్నయ భారతావతారిక ఒరవడిలోనే తెలుగుకవుల కావ్యావతారికలు నడిచాయి. వాటిని కొందరు విపులీకరించారు. సంస్కృత కవుల నుండి నన్నయ స్వీకరించని మరికొన్ని లక్షణాలు కొందరు స్వీకరించారు. కొన్ని నూత్న కల్పనలు చేశారు.

ఇష్టదేవతా స్తుతి

నన్నెచోడుడు నన్నయకు భిన్నంగా తెలుగు పద్యంతో కావ్యారంభం చేశాడు. నన్నయలాగానే శ్రీకారంతో ప్రారంభించాడు. ఇష్టదేవతాస్తుతిని విస్తారంగా చేశాడు. ఇది నన్నయకు విపులీకరణం మాత్రమే నన్నెచోడుడు మూడు పద్యాలలో శంకరుని, విష్ణువు, బ్రహ్మ, సూర్యుడు, గణనాథుడు, షణ్ముఖుడు, మన్మథుడు, పార్వతి, సరస్వతులను ఒక్కొక్క పద్యంలో స్తుతించాడు. ఈ దేవతాతతి అంతా తమకు అభీష్టసిద్ధి కలిగించుగాక అని నన్నయకు భిన్నమైన ఆశీర్వచనంతో స్తుతిని మేళవించాడు. తరువాతి కవులలో ఈ ఇష్టదేవతా స్తుతి కొన్ని చోట్ల అతి సంక్షిప్తంగాను, కొన్నిచోట్ల అతివిస్తరంగాను కనిపిస్తుంది. దేవతాస్తుతి, సుకవి ప్రశంస, కుకవి నిరసన అన్నీ ఒకే పద్యంలో చేసిన కవులూ ఉన్నారు.[127]

గురుస్తుతి :

తెలుగులో గురుస్తుతికి కూడ నన్నెచోడుడే ఆద్యుడు. తన గురువు, కుమారసంభవ కృతి స్వీకర్తా అయిన జంగమ మల్లికార్జునుని విస్తారంగా వర్ణించాడు. స్తుతించాడు, మతపరమైన గురువులు, వంశగురువులు, కవితా విద్యా గురువులను స్తుతించడం తరువాత చాలామంది కవులలో కనిపిస్తుంది. తమ కృతిపతుల గురువుల ప్రశంస కూడా అక్కడక్కడా ఉన్నది. ఇది శ్రీనాథుని లోనే మొదట కనిపిస్తుంది.[128]

స్వీయ పూర్వీకుల ప్రశంస :

కావ్యవతారికలో తన తలిదండ్రులను పేర్కొన్న వారిలో కూడ నన్నెచోడుడే ప్రథముడు. కవులు తమ గురించి తాము చెప్పుకోవడంలో అనేక మార్గాలుపయోగించారు. నన్నయ ప్రథమ పురుషలో తన గురించి చెప్పుకోగా, నన్నెచోడుడు ఉత్తమ పురుషలో చెప్పుకున్నాడు. కొందరు కృతిపతి ముఖంగా,[129] కొందరు స్వప్నోదంతంలో దేవతా[130] పితృ[131] కవిపండిత[132] ముఖంగా, కొందరు మిత్రుల ముఖంగా,[133] కొందరు విద్వజ్జనుల ముఖంగా,[134] తమ గురించి వెల్లడించుకున్నారు. నన్నయ కేవలం తన గురించి మాత్రమే చెప్పు కొంటే, నన్నెచోడుడు తన వంశకర్తలను తల్లిదండ్రులను కూడా పేర్కొన్నాడు. పాల్కురికి సోమన కూడా తన తల్లిదండ్రులను పేర్కొన్నాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణావతారికలో తమ తాతగారిని పేర్కొన్నాడు. ఆశ్వాసాంత గద్యలో తండ్రిని పేర్కొన్నాడు. తరువాతి కవులలో కొందరు తమ వంశాన్ని వంశకర్త[134] నుండి గోత్రకర్త[135] నుండి వర్ణించిన వారున్నారు. తమ వంశవర్ణన విస్తారంగా చేయకపోయినా పితృప్రశంస మాత్రం చేసిన కవులు కొందరున్నారు.

కృతిపతి ప్రశంస :

నన్నయ కృతి చెప్పమని అడిగిన రాజరాజును 5 పద్యాలలోను ఒక వచనంలోనూ వర్ణించాడు. విమలాదిత్యతనూజుడు అని రాజరాజు తండ్రి పేరును పేర్కొన్నాడు. రాజరాజు 'హిమకరు దొట్టి పూరు భరతేశ్వరుల ప్రభు

పాండు భూపతుల్ క్రమమున వంశ కర్తలనగా మహినొప్పిన యస్మదీయ వంశము"[137] అన్నాడు.

నన్నెచోడుడు జంగమ మల్లికార్జునుని విస్తరించి వర్ణించాడే తప్ప ఆయన వంశవర్ణన చేయలేదు. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో మనుమసిద్ధి వంశాన్ని వర్ణించాడు. నన్నయ 'హిమకరుదొట్టి' ప్రభావం తెలుగుకవులందరి మీదా ఉంది. ఇది శాసన కవుల విషయంలోనూ స్పష్టమే మనుమసిద్ధి వంశ వర్ణన విష్ణువుతో ప్రారంభమైంది. వందల కొద్ది పద్యాలలో ప్రథమాశ్వాసమంతా వ్యాపించేటట్టు కృతిపతి వంశవర్ణనలు కొన్ని కావ్యాలలో గోచరిస్తాయి. 'రామ రాజీయం'లో రామరాజు వంశవర్ణన 430 పద్యాలలో జరిగింది. విష్ణువుతోనో, సూర్యచంద్రులతోనో ప్రారంభించి ప్రఖ్యాతుడైన చారిత్రక పురుషునిదాక పురాణపురుషులను వంశవర్ణనలో వర్ణించిన కవులెందరో ఉన్నారు.[138] కృతిభర్త తల్లిదండ్రులు ఇరువైపులా పూర్వ పురుషుల వర్ణనచేసిన కవులూ వున్నారు.[139]

కృతిపతి వంశాన్నే కాక ఆ కృతిపతి ప్రభువు వంశవర్ణనను చేసిన కవులూ ఉన్నారు. కేతన దశకుమార చరిత్రలో తిక్కన వంశాన్నీ, ఆయనకు ప్రభువైన మనుమసిద్ధి వంశాన్నీ కూడా వర్ణించాడు. కృతి ప్రేరేపకుని వంశ వర్ణనను కూడా కొందరు కవులు చేశారు.[140]

పూర్వ కవి స్తుతి :

తెలుగుకవులు కావ్యావతారికలలో పూర్వకవి స్తుతి సంప్రదాయాన్ని పాటించారు. తెలుగుకవులు పూర్వకవి స్తుతిలో సంస్కృత కవులకు అగ్రస్థానం ఇచ్చారు. ముందు సంస్కృత కవులను, తరువాత తెలుగు కవులనూ స్తుతించారు. తమ సాహిత్య సంప్రదాయాలకు సంస్కృతమే మూలం కావడమే అందుకు ప్రధాన కారణం. నన్నయ వాల్మీకి వ్యాసులను స్తుతించాడు. తెలుగు కవులెవరినీ పేర్కొనలేదు. నన్నెచోడుడు మరికొందరు సంస్కృత కవులను కూడా స్తుతించాడు కాని తెలుగు కవుల నెవరినీ స్తుతించలేదు. పాల్కురికి సోమన శివకవి ప్రవరులన్నాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో 'ఆది కవీంద్రుల, నూత్న సత్కవీశ్వరులను భక్తిగొల్చి,' అని ప్రత్యేకంగా ఎవరినీ పేర్కొనకుండానే పూర్వకవి ప్రశంసచేశాడు. భారతంలో వ్యాసునీ, నన్నయనూ

స్తుతించాడు. తెలుగు కవిని పూర్వ కవిస్తుతిలో చేర్చిన మొదటి కవి తిక్కనయే. తరువాతి వారిలో ఆది కవీంద్రుల, నూత్న సత్కవీశ్వరుల ధోరణిలో పేరు చెప్పక ఒకమాటలో నమస్కరించి పోయినవారు కొందరు, వేరు వేరుగా సంస్కృత కవులనూ, తెలుగు కవులనూ పెక్కుమందిని స్తుతించిన వారు కొందరు. వారి కవితా ధర్మాలను స్పృశించిన వారు మరికొందరు.

విద్వత్సభల ప్రశంస :

విద్వజ్జనులను, విద్వత్సభలను ప్రశంసించడం కూడా తెలుగు అవతారికలలో కనిపిస్తుంది. నన్నయ భారతంలో రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో ఉన్న విద్వజ్జనులను పేర్కొన్నాడు, ''పరమ వివేక సౌరభ విభాసిత''141 అన్న పద్యంలో సత్సభాంతర సరసీవనాలను కొనియాడాడు. మడికి సింగన వాసిష్ఠ రామాయణంలో

''అద్వైత తత్వమతుల జ
గద్విదిత విశాలయశుల గత కలుషుల, రా
గద్వేషలోభ రహితుల
విద్వత్సింహముల వేదవిదుల భజింతున్''142 అని ప్రశంసించాడు

కుకవినింద :

నన్నయ కుకవినింద చేయలేదు. తెలుగులో మొదట కుకవినింద చేసిన వాడు నన్నెచోడుడే. తెలుగు కవులు కుకవులనూ, కుకవి పద్ధతులనూ, కుకవిత్వాన్నీ దూషించారు. గోనబుద్ధారెడ్డి, ఎర్రన, పోతన, మొల్ల మొదలయిన కొందరు మాత్రం ఈ జోలికి పోలేదు. నన్నెచోడుడు నాలుగు పద్యాలలో కుకవినింద చేశాడు. నన్నెచోడుని విమర్శ ముఖ్యంగా గుణదోష విచారణ చేయలేని కవులగురించి. పాల్కురికి సోమన బసవపురాణంలో మృడు మహత్వము ను గానమి కుకవి లక్షణంగా చెప్పాడు. కుకవులను కుక్కలు, ఈగలు, పాములు, కాకులు, కీటకములు, బాగురు పిల్లులనీ, దొంగలు, దుర్విటులు, అమంగళ జనులు, అజ్ఞులు, మూఢస్వాంతులూననీ దూషించారు.

కవిత్వాశయాలు :

నన్నయ తన కవిత్వంలో ఎవరేమేమి గుర్తిస్తారో చెప్పుకున్నాడు. కవిత్వ లక్షణాలను, తమ కవిత్వవైఖరులను చాలామంది తెలుగు కవులు చెప్పుకున్నారు. కావ్యావతారికలలో ఈ కవిత్వాశయ, లక్షణాల ప్రసక్తి ప్రత్యేకంగానే గాక, సుకవిస్తుతి, కుకవినిందలలో కూడా ద్యోతకమౌతుంది. నన్నయ తన కవిత్వాశయాన్ని స్పష్టంగా చెప్పుకున్నాడు. నన్నెచోడుడు సత్కవిత్వ లక్షణాన్ని ఎనిమిది పద్యాలలో చెప్పాడు. సత్కవిత్వదుష్కవిత్వ తారతమ్య నిరూపణం కూడా ఇందులో చేశాడు.

"సరళముగాగ భావములు జానుదెనుంగున నింపు పెంపుతో
బిరిగొనవర్ణనల్ ఫణితి పేర్కొననర్థము లొత్తగిల్ల బం
ధురముగ ప్రాణముల్ మధు మృదుత్వరసంబున గందళింపన
క్షరములు సూక్తులార్యులకు గర్ణరసాయన లీల గ్రాలగాన్"143

అన్నది ఇక్కడ ప్రధానంగా చెప్పిన విషయం. నన్నయ సారమతింగవీంద్రులన్న పద్యంతో దీన్ని పోల్చుకోవచ్చు. చివర అష్టాదశవర్ణనలు, దశప్రాణంబులు, నవరసభావములు, షట్త్రింశదలంకారములతో 'రమణీయంబైన దివ్యకథారంభమున కభిముఖుండనై' అని తన రచనాలక్షణాలను తెలియజేశాడు. సంధి సమాస పదబంధాల వంటి వ్యాకరణాంశాలు, వళిప్రాసల వంటి ఛందోవిశేషాలూ, అలంకార, రీతి, వృత్తి, గుణ, పాక, శయ్యాది శైలీ విశేషాలూ, అష్టాదశవర్ణనలు, రస, చమత్కారాదులు, భాషావిశేషాలు, కవితాభేదాలు, ఈ విధంగా కవితాపరామర్శలో కవులు తడుమని విషయాలే లేవు. కవికి ఉండవలసిన లక్షణాలలో సర్వజ్ఞత, చతుష్షష్టి కళామర్మజ్ఞత పలువురు చాటినవే.

పైన చెప్పిన మాటలు వాడకుండా కేవలం ఉపమానాలతోనే కవిత్వం ఇలా ఉండాలని చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. 'జాజుల పొట్లము విప్పిన యోజ,144 కప్పురంబులు కుప్పలుగా బోసినట్లు, కుంకుమ పైపై గుప్పిన క్రియ విరిపొట్లము విప్పినగతి,145 తేనె సోక నోరు తీయన యగు రీతి146 భూరి వివేక చిత్తులకు బోలుననందలపన్ దళంబులన్ సౌరభమిచ్చు గంధవహుచందమునం ప్రకటంబు చేసి147 హారమూడా హారిణాంక వక్రతయు గాలాంతస్ఫురచ్ఛండికా

పరుషోద్గాఢ పయోధరస్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్, సరసత్వంబును సంభవించెననగా,[148] కవిత్వ ప్రౌఢి యాంధ్రీ ఘన స్తనకుంభ స్ఫురణన్[149] వలిపపు సన్నపయ్యెదను వాసిగ గంధపు బూత తోడుతన్ గొలదిగ గానవచ్చు వలిగుబ్బచనుంగవ ఠీవి నొప్పగా,[150] 'అల్లనవిచ్చు చెంగలువలందు రజంబను కప్పురంబుపై జల్లగ జల్లనై వలచు సౌరభముల్ వెదజల్లు భావముల్ పల్లవహస్తచన్నుగవ పయ్యెద జీబుగ దోచుభాతిగా'[151] 'ఘనతర ఘూర్జరీ కుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ స్తనగతి దేటగాక యరచాటగుచాంధ్రవధూటి చొక్కపుం జనుగవబోలి [152] మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

కావ్యకథా ప్రశంస :

తాము రచింప పూనుకున్న కావ్యకథా ప్రశంస, మూల కావ్య ప్రశంస, మూలకవి ప్రశంస, ఆంధ్రీకరణం, కావ్య విశిష్టత మొదలైన విషయాలను కావ్య ప్రశంసలో భాగంగా తీసుకోవచ్చు.

'ఏయది హృద్య మపూర్వం
బేయది యెద్దానివినిన నెఱుక సమగ్రం
బై యుండు నఘనిబర్హణ
మేయది యక్కథయ వినగ నిష్టము మాకున్'[153] అని నన్నయ

'ఏ కథ పురాణ సమ్మత
మే కథ వేద ప్రసిద్ధమే కథ పుణ్య
శ్లోకస్తుత్య గుణాన్విత
మే కథ చదువంగ వినగనింపై యుండున్'[154] అని దగ్గుపల్లి దుగ్గన

'ఎత్తటినైనను ధీరో
దాత్తనృపోత్తముడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్యమగుట
నుత్తరరామాయణోక్తి యుక్తుడనైతిన్'[155] అని తిక్కన

'రాజిత కీర్తియైన రఘురాము చరిత్రము'[156] మొదలయిన విధంగా మొల్ల తమ కావ్యకథా ప్రశంస చేశారు.

కావ్యకథ మిశ్రంగా ఉండాలని చాలామంది కవులు అవతారికలలో చెప్పారు. జక్కన 'విక్రమార్క చరిత్ర'లో, పినవీరన 'శృంగారశాకుంతలం' లో, రామరాజ భూషణుడు 'వసుచరిత్ర'లో, సంకుసాల నృసింహకవి 'కవికర్ణ రసాయనం'లో మిశ్రకథ ప్రాధాన్యాన్ని తెల్పారు. అటువంటి మిశ్రకథలే ఇతి వృత్తంగా ఎన్నుకున్నారు.

మూలకావ్యాన్ని, దాని కర్త అయిన వ్యాసమునినీ నన్నయ 'ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంతమనియు' అన్న పద్యంలో ప్రస్తుతించాడు. పాల్కురికి సోమనకూడా చతుర్వేద సారంలో తన కృతిని ఈ విధంగానే వర్ణించాడు. బసవపురాణ, పండితారాధ్య చరిత్రల్లో శివభక్తతతి గాథలే తన రచనకు మూలమని పేర్కొన్నాడు.

పోతన 'లలిత స్కంధము గృష్ణమూలము'157 అన్న పద్యంలో భాగవత ప్రాశస్త్యాన్ని తెలిపాడు. శ్రీనాథుడు 'పనివడినారికేళ ఫలపాకమునంజవియైన భట్టహర్షుని కవితానుగుంభములు'158 అన్నాడు.

'స్తుత్యము గలి కల్మష రా
హిత్యము నాఖ్యాయికా విహిత బీజ చతు
స్సీత్యము శ్రీహరి కథలను
నిత్యంబునునైన జైమినిజభారతమున్'159 అని పిల్లలమర్రి పినవీర

భద్రుడు ప్రశంసించాడు. 'సాత్యవతేయ మహామునీంద్రుడను సుధాబ్ధికి గల్పకం బనగ వెలయు శ్రీ వరాహపురాణంబు'160 అన్నారు నంది మల్లయ్య, ఘంట సింగనలు. 'వివరింప నిది సర్వవేదాంతసారంబు'161 అని ప్రబోధచంద్రో దయం గురించి ఈ కవులే చెప్పారు. 'ప్రతి జన్మకృత మహాపాతక సంఘాత పర్వతదంభోళి భాగవతము'162 - ఇత్యాదిగా భాగవతాన్ని స్తుతించాడు, బాల భాగవత కర్త దోనూరి కోనేరునాథ కవి.

'భారత ప్రోక్త కథ మూలకారణముగ
గాళిదాసుని నాటక క్రమము కొంత
తావకోక్తికి నభినవ శ్రీవహింప
గూర్మి గృతి సేయు నాకు శాకుంతలంబు'163 అని కృతి భర్త

పినవీరనను కోరాడు.

తెనాలి రామకృష్ణుడు 'స్కంద పురాణనీరనిధి కౌస్తుభమై ప్రభవించు దేవకీనందను సత్కథోదయము నవ్యకవిత్వ కళాకలాపమున్ కుందనమున్ ఘటించి[164] అన్నాడు పాండురంగ మాహాత్మ్యంలో.

స్వీయానువాద ప్రసక్తి :

నన్నయ తన అనువాదాన్ని 'తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగాన్' అన్నమాటల్లో వివరించాడు. 'తిక్కన అమ్మహా కావ్యంబు నర్థంబు సంగతంబు చేసెద' నన్నాడు.[165]

'ఈ సరసోక్తి కావ్యమొకడిమ్ముల సంస్కృత భాష నచ్చుగా
జేసిననట్ల వీడు మఱి చేయుట యేటిదియంచు జెప్పగా
జేసి యనాదరంబురక చేయకుడీ విలుకాడు తూటుగా
నేసిననందె పాఱ మఱియేసిన వానిద సూటిగావునన్'[166] అన్నాడు కొరవి గోపరాజు.

శృంగార నైషధంలో చివర కావ్యోప సంహారంలో శ్రీనాథుడు తన అనువాద విధానాన్ని చాటుకొన్నాడు.[167]

ప్రక్రియ ప్రశస్తి :

కవులు తామొక విశిష్టమైన నూతన రచనకు పూనుకొన్నప్పుడు దాని ప్రత్యేకతను, లక్షణాన్ని తాము దానిని నిర్వహించదలచిన విధానాన్ని చెప్తారు. ఇది ముఖ్యంగా ప్రక్రియాపరమైనది.

నన్నయ భారత రచన ఆరంభించిన నాటికి ఆయన ఎన్నుకున్న రచనా మార్గం స్థిరపడి ఉంటుంది. అందుకే ఆయన తానెన్నుకున్న ప్రక్రియను గురించిగాని, దాన్ని తాను నిర్వహించదలచిన మార్గాన్ని కాని తెలియజేయలేదు. తాననుసరించిన మార్గాన్ని సమర్థించుకొనవలసిన అవసరం ఆయనకు కలుగలేదు.

తెలుగులో పాల్కురికి సోమన అనేక నూతన ప్రక్రియలకు ఆద్యుడయ్యాడు. ప్రధానంగా ద్విపదలో మహాకావ్యరచన పేర్కొనదగింది. తాను ద్విపదను ఎన్నుకోవడానికి కారణాన్ని తెలుపుతూ, దాని ప్రాశస్త్యాన్ని ఉగ్గడించాడు పాల్కురికి సోమన. బసవపురాణంలో

'ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమై పరగిన జానుదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు గోర్కిదైవార
దెలుగు మాటలనంగ వలదు'[168] అనీ

పండితారాధ్య చరిత్రలో

'ఒప్పదు ద్విపదగావ్యోక్తి నావలవ
దారూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జానుతెనుగు విశేషము ప్రసన్నతకు
ఉపమింప గద్యపద్యోదాత్తకృతులు
ద్విపదయు సమమ భావింప'[169] అనీ అన్నాడు. తన రచనా లక్షణాన్ని

"ప్రాసమైనను యతిపై వడియైన
దేనిగా నిలిపి యాదిప్రాస నియతి
దప్పకుండగ ద్విపదలు రచియింతు"[170] అని చెప్పుకున్నాడు. ద్విపద

కాక నిర్వచనమైన పద్య మహాకావ్యాలు లేనినాడు తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని తలపెట్టాడు.

"వచనము లేకయు వర్ణన
రచియింపగ గొంతవచ్చు బౌద్ధులకు గథా
ప్రచయము బద్యములన పొం
దుచితంబుగ జెప్పటార్యులొప్పిదమనరే?"[171]

అని చెప్పుకున్నాడు.

ఈ అభిప్రాయం భారత రచనా కాలానికి మారింది కాబట్టే తానుముందు చెప్పిన 'గద్యముతోడుత పద్యమును చెప్పిపెట్ట' నన్న ప్రతిజ్ఞను వదిలిపెట్టి, ఆ భేదాన్ని చూపించడానికి "మహాకవిత్వ దీక్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్"[172] అని ప్రత్యేకంగా చెప్పాడు.

రాఘవ పాండవీయంలో పింగళిసూరన, యయాతి చరిత్రలో పొన్నిగంటి తెలగన, దశరథ రాజనందన చరిత్రలో మరింగంటి సింగరాచార్యులు మొదలయిన వారు తమ ప్రక్రియా వైశిష్ట్యాన్ని, లక్షణాన్ని, నిర్వహింపదలచిన విధానాన్ని చెప్పుకున్నారు.

కథాంశ వ్యక్తీకరణ :

తాము రచింపబూనుకున్న కావ్యంలోని కథాక్రమాన్ని ప్రణాళికను తెలియజేసినవారు తెలుగులో కొందరు మాత్రమే. నన్నయ పర్వానుక్రమణికలో నూరుపర్వాలను చెప్పాడు. పర్వసంగ్రహంలో 18 పర్వాలలో ఒక్కొక్క పర్వంలో వచ్చే కథాంశాలను క్రమంలో చెప్పాడు. ఒక్కొక్క పర్వంలో సంస్కృతంలో ఎన్ని శ్లోకాలున్నదీ చెప్పాడు. నన్నెచోడుడు కుమార సంభవంలో ఒక పద్యంలో,

'సతిజన్మంబున్ గణాధీశ్వరుజననము దక్షక్రతుధ్వంసముంబా
ర్వతి జన్మంబున్ భవోగ్రవ్రతచింతయు దేవద్విషత్ క్షోభమున్ శ్రీ
సుత సంహారమ్ము భూభృత్ సుతతపము నుమాసుందరోద్వాహముంద
ద్రతిభోగంబుం గుమారోదయము నతడనిందారకుంబోరగెల్వున్'173

అని కథా ప్రణాళికను వివరించాడు. తరువాతి కవులు కొందరు ఆశ్వాసాంతగద్యలలో ఆ ఆశ్వాసంలో చెప్పిన కథాంశాలను సంక్షిప్తంగా చెప్పే పద్ధతిని అవలంబించారు.

అంకితం, షష్ఠ్యంతాలు :

కావ్యావతారికలలో షష్ఠ్యంతరచన తెలుగులో విశిష్టమైనది. నన్నయ షష్ఠ్యంతాలు రాయలేదు. పాల్కురికి సోమన రాయలేదు. నన్నెచోడుని తోనే ఈ సంప్రదాయం మొదలయింది. దీనికి కాళిదాసు రఘువంశంలోని "సోహమాజన్మ సిద్ధానాం" ఇత్యాది శ్లోకాలు, కేశవనామాలు, ఉదాహరణ గ్రంథాలు, దేవతా స్తోత్రనామావళులు మొదలైన వాటిని మూలాలుగా విమర్శకులు భావిస్తున్నారు. నన్నెచోడుని కాలపు శాసనాలలో కూడా ఈ సంప్రదాయం కనిపిస్తుంది. కృతిపతి, కృతిప్రేరేపకులకు ఈ షష్ఠ్యంతాలు రాసే పద్ధతిని మనవారు అవలంబించారు.

సామాన్యంగా కందపద్యాలలో సాగుతుంది షష్ఠ్యంతరచన. కొందరు వృత్తాలను కందాలను కలిపి, కొందరు కేవలం వృత్తాలలోను చేశారు; గౌరననాటి నుండి ద్విపద కావ్యాలలో ద్విపదలలో షష్ఠ్యంత రచన జరిగింది. చరిగొండ ధర్మన్న తేటగీతిలో రాశాడు. అంకితంగాని ప్రేరేపకుడుగాని లేని కావ్యాలలో షష్ఠ్యంతా లుండవు, వీటికి సంఖ్యానియమంకూడ లేదు. 1 నుండి 11 పద్యాల దాకా కని పిస్తాయి.

కావ్యరచనా హేతువులు :

కావ్యరచనాహేతువును తెలియజేయడం కూడా అవతారికలో ఒక ప్రధానాంశమే. రాజరాజనరేంద్రుడు తెలుగులో భారతాన్ని వినాలనుకోవడమే నన్నయ భారతానువాదానికి హేతువు. రాజరాజుతన భారత శ్రవణాసక్తికి కారణాలను కూడా పేర్కొన్నాడు. కృతిపతి ప్రత్యక్షంగా కవిని కావ్యరచనకు పురికొల్పడమూ, స్వప్నంలో భగవంతుడు కనపడి కావ్యరచనకు పురికొల్పడమూ, స్వప్నంలోనే తండ్రియో, తాతయో కన్పించి ప్రోత్సహించడమూ, గ్రథించిన రచనకు పతిని ఎన్నిక చేయడంలో తోడ్పడడమూ, కొన్నిచోట్ల కృతిపతికే స్వప్నవృత్తాంత మన్వయించడమూ తెలుగు కావ్యాలలో కనిపిస్తుంది. సప్తసంతానా లలో కృతిని మేలైనదిగా భావించారు చాలామంది. కవిత్వాన్ని ఆరాధనా విశేషంగా భావించారు కొందరు. భక్తియే కారణమైంది కొందరికి. కావ్య ప్రయోజనమే కొందరకు ప్రేరకమైంది.

కృతజ్ఞతలు :

కావ్యరచనలో తమకు తోడ్పడినవారిని ప్రశంసించడం కూడా అవతా రికా భాగమే. నన్నయ నారాయణభట్టు తోడ్పాటును,

పాయకపాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణునట్లు వాసిగ ధరామరవంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుడుం దనకిష్టుడున్ సహా
ధ్యాయుడునైన వాడభిమతస్థితి దోడయి నిర్వహింపగాన్.[174]

అని పేర్కొన్నాడు. బిల్హణీయంలో పండిపెద్దికృష్ణస్వామి చిత్రకవి నరసింహాచార్యులు సహకారాన్ని కొనియాడాడు. బేకుమళ్ళ రంగశాయి, కంకంటి పాపరాజు, కంకంటి నరసింహములు తమకుకృతులలో తోడ్పడిన పుష్పగిరి తిమ్మనను స్తుతించారు.

ఫలశ్రుతి :

గ్రంథాంతంలో ఫలశ్రుతి సాధారణంగా ఉంటుంది. గ్రంథావతారికలో ఫలశ్రుతి చెప్పడం నన్నయతోనే ప్రారంభమైంది. 175

పోతన భాగవతంలో

"శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతంబైన
భాగవతంబు సద్భక్తితోడ
వినగోరువారల విమల చిత్తంబుల
జెచ్చెరనీశుండు సిక్కుగాక
యితర శాస్త్రంబుల నీశుండు సిక్కునే
మంచివారలకు నిర్మత్సరులకు
గపటనిర్ముక్తులై కాంక్షసేయక యిందు
దగిలియుండుట మహాతత్వబుద్ధి
పరగనాధ్యాత్మికాతాదిపత్రయంబు
నడచి పరమార్థభూతమై యధిక సుఖద
మైసమస్తంబుగాకయు నయ్యునుండు
వస్తువెఱుగంగదగు భాగవతమునందు"176 అన్నాడు.

గ్రంథాంతంలో ఫలశ్రుతి చెప్పడం సర్వసాధాణమే అయినా అవతారికలో చెప్పడం అరుదే.

స్వీయ, పర పీఠికలు :

నన్నయ అవతారికను ప్రథమ పురుషలో రాశాడు. అందువల్ల అది ఆయన రచనకాదనీ నారాయణభట్టో మరొకరో రచించి ఉంటారని కొందరభిప్రాయపడ్డారు. పోతనాది కవుల అవతారికలలో కూడా కొన్ని పద్యాలు ప్రథమ

పురుషలో కనిపిస్తాయి. గ్రంథకర్త జీవితకాలంలో అవతారిక రచింపక పోతే అనంతరం కొడుకులో, మనుమలో తాము రాసో, ఇతరుల చేతనో అవతారికను కల్పించి, అంకితాలివ్వడం కూడా ఉన్నది. అవతారికలో తన, తన వంశ ప్రతిష్ఠలను వర్ణించుకోవలసి వస్తుంది కాబట్టి, అది ఉచితం కాదని భావించినవారు ఇతరులచేత రాయించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సముఖం వేంకట కృష్ణప్ప నాయకుని అహల్యాసంక్రందనంలో వేంకటకృష్ణప్ప వంశాన్ని శేషము వేంకటపతి, ఋణిగె కృష్ణకవి వర్ణించారు.

పై విషయాలను పరిశీలిస్తే ఆధునిక పీఠికా బీజాలు ప్రాచీన సాహిత్యంలోనే ఉన్నట్లు స్పష్టమౌతుంది.

పీఠిక : ఉత్పత్తి వికాసాలు
ఉత్తరరంగం

కావ్యావతారికల్లో, నాటక ప్రస్తావనల్లో బీజప్రాయంగా వున్న పీఠికా లక్షణాలు అనుకూల వాతావరణం ఏర్పడగానే విస్తరించి ఆధునిక పీఠికలేర్పడ్డాయి. కొన్ని లక్షణాలు కాలానుగుణంగా నశించి, మరికొన్ని రూపొందాయి; కొన్ని పుష్టిని పొందాయి. సాంకేతిక, వైజ్ఞానిక వ్యాప్తిలో దైవప్రార్థన, ఫలశ్రుతి లాంటి లక్షణాలు అంతరించాయి. పీఠిక పద్యంనుండి వచనమై క్రమంగా వ్యాసమయింది. దాని విషయం, పరిధి, లక్ష్యం, ప్రయోజనం విస్తృతమయ్యాయి. పీఠికలను రచయితలే కాక ఇతరులు - పరిష్కర్తలు, ప్రచురణకర్తలు, సంపాదకులు, పండితులు-రాయటం మొదలయింది. పరిష్కృత గ్రంథాలయితే కవి కాలాదులను గూర్చిన చర్చ విపులంగా సాగింది; శబ్ద చర్చ, కవిత్వ తత్త్వ చర్చ జరిగింది; పీఠికా రచయితలు చారిత్రికాంశాలు, శాసనాధారాలు చూపసాగారు. రాజకీయ సామాజిక చర్చ విపులమైంది. అవసరమైతే పీఠిక విస్తృతంగా పేజీలకు పేజీలు పెరిగింది.

సాంకేతిక వైజ్ఞానిక విధానాల్లో, ఆర్థిక, సాంఘిక, రాజకీయ సిద్ధాంతాల్లో, మతం, దేవుడిపట్లగల ఆలోచనల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులే ఆధునిక పీఠిక ప్రస్తుత స్థితిని చేరుకోవటానికి కారణం. కారణం-ఫలితం (కాజ్ అండ్ ఎఫెక్ట్) లాగా ఒకదానివల్ల మరోటి, దానివల్ల ఇంకొకటి, కొన్ని ఒకేసారి - యిలా ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరగటంతో పారిశ్రామికీకరణ, ఫలితంగా నగరాలు, పారిశ్రామిక వాడలు పెరగటం, పారిశ్రామికీకరణతో అప్పటివరకు వున్న ఫ్యూడల్ వ్యవస్థ నశించి, దాని స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నెలకొనటం, ఫ్యూడల్ భూస్వాముల స్థానే మధ్య తరగతి పెట్టుబడిదారీవర్గం ప్రబలమవటం, వారు ప్రజాస్వామిక విలువలకు, వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యమివ్వటం, మతప్రాధాన్యత నశించటం, ముడి పదార్థాలకోసం,

తయారయిన వస్తువుల నమ్ముకొనేందుకు వాణిజ్య విపణులకోసం వలస స్థావరాలను వెదుక్కోవటంలో ఐరోపా దేశాలు పోటీ పడటం, వలస స్థావరాలను ముడి పదార్థాలు అందించే కేంద్రాలుగా, వాణిజ్య విపణులుగా మలచుకోవటం, మధ్య తరగతి పెట్టుబడి దారీ వర్గ ఉదారవాదం, పారిశ్రామికీకరణతో మురికి వాడలు ప్రబలటం, కార్మిక సంఘాలు వెలయటం, ఉదారవాదం సామ్యవాదానికి దారి తీయటం, జాతీయవాదం, అది ముదిరి సామ్రాజ్య వాదంగా మారటం, వలస స్థావరాల్లో తప్పనిసరిగా జరిగిన సాంకేతిక వైజ్ఞానికాభివృద్ధి, ఫలితంగా ప్రజల్లో చైతన్యం, అవసరానికి దేశ భాషల పునరుజ్జీవనం, ఉదార మనస్కులైన పాలకవర్గం వారే కొందరు దేశ హితైషులవటం - యిలా ఎన్నో మార్పులు - ఒకేసారి, ఒకే క్రమంలో రాలేదు. ఆధునిక పీఠికకు సూటియైన కారణం ఇదీ అని చెప్పటం కష్టం. ఈ పై నేపథ్యంలో ఆధునిక పీఠిక ముస్తాబై తన దైన రూపాన్ని సంతరించుకున్నది. ఆయా పరిస్థితులను సంక్షిప్తంగా పరిశీలించటమే ఈ అధ్యాయపు ముఖ్యోద్దేశం.

18, 19 శతాబ్దాలలో ప్రపంచంలో వచ్చిన సాంకేతిక, వైజ్ఞానిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిణామాలు :

పారిశ్రామిక విప్లవం :

18 వ శతాబ్దంలో ఐరోపాలో గొప్ప రాజకీయ, ఆర్థిక విప్లవాలు వచ్చాయి. ఫ్రెంచి విప్లవం కొనసాగుతూండగా, ఇంగ్లాండులో తరువాతి కాలపు తీరు తెన్నులను పూర్తిగా మార్చి వేసిన ఆర్థిక విప్లవం తల ఎత్తింది. దీన్నే సుప్రసిద్ధ చరిత్ర కారుడయిన టాయెన్ బీ 'పారిశ్రామిక విప్లవం' అన్నాడు. వస్తూత్పత్తిలో వచ్చిన మార్పులే పారిశ్రామిక విప్లవం. ఎన్నో వైజ్ఞానిక ఆవిష్కరణల ఫలితంగా యంత్రాలు తయారై, వాటితో వస్తూత్పత్తి ప్రారంభ మయింది. ఫలితంగా శతాబ్దాల తరబడి సాగిన సామాజిక - ఆర్థిక వ్యవస్థ - ఫ్యూడల్ వ్యవస్థ-అంతరించి, పెట్టుబడి దారీ విధానానికీ, సామ్రాజ్య వాద విధానానికి ఇది నాంది పలికింది.

ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం పత్తి, నూలు పరిశ్రమతో మొదలయింది. పత్తి నూలు పరిశ్రమలో కనుక్కొన్న యంత్రాలు నడవటానికి ఇను

ము, ఉక్కు కావలసివచ్చాయి. 1783 లో బొగ్గు కొలిమిలో మండించి ఇను మును వేరువిసే విధానాన్ని క్రాంప్టన్ కనుగొన్నాడు. దీనితో బొగ్గు గనుల పరిశ్రమ మొదలయింది. ఇనుము, బొగ్గు పరిశ్రమలు పెద్ద ఎత్తున ప్రారంభమై అకాలాన్నే 'ఇనుము బొగ్గు యుగం'గా అభివర్ణించే పరిస్థితి వచ్చింది. ఆ పైన 1769 లో జేమ్స్ వాట్ తయారు చేసిన ఆవిరి యంత్రం పారిశ్రామికీ కరణను మరింత వేగవంతం చేసింది. ఇంగ్లాండులో సంభవించిన మార్పులు, వైజ్ఞానిక ఆవిష్కరణలు, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికా మొదలయిన దేశాలకు వ్యాపించాయి. ఈ వైజ్ఞానిక ఆవిష్కరణలు, ఇంకా కొత్త ఆవిష్కరణలకు మూలమై, చాలా గొప్ప మౌలికమయిన మార్పులు తీసుకువచ్చాయి. ఆవిరి యంత్రంనుండి టర్బైన్లు, గాసొలిన్ యంత్రాలు, విద్యుత్ మోటార్లు ప్రభవించాయి. రైలునుండి కార్లు మొదలైన ఆటోమొబైల్ సాధనాలు, విమానాలు కనుక్కొన్నారు. టెలి గ్రాఫ్, టెలిఫోన్, వైర్‌లెస్ చివరకు టెలివిజన్ ఆవిర్భవించాయి. 'బొగ్గు-యినుము యుగం' మెల్లగా మానవుణ్ణి 'అణుయుగం' లోకి ప్రవేశపెట్టింది.

పెట్టుబడిదారీ విధానం: వలస విధానం: సామ్రాజ్యవాదం

పారిశ్రామిక విప్లవ ఫలితంగా పాత, ఫ్యూడల్ సమాజం ముక్కలయింది. కార్మికునికి బదులుగా యంత్రాలు పనిచేయ సాగాయి. అధికోత్పత్తి మొదల యింది. ముడి పదార్థాలకోసం వ్యవసాయ రంగంలో కూడాఎన్నో మార్పులు వచ్చాయి. యంత్రాలు వాడసాగారు. కుటీర పరిశ్రమలు వెలిశాయి. శ్రమ విభ జన మరింతగా సాగింది. యంత్రాగార స్థాపన పెట్టుబడిదారీ వ్యవస్థకు దారి తీసింది. ఫాక్టరీల నిర్మాణానికి, యంత్రాలు, ముడిపదార్థాల కొనుగోలుకు, కార్మి కులకు వేతనాలు చెల్లించటానికి పెద్ద మొత్తాల్లో డబ్బు అవసరమయింది. అందు వల్ల కొద్దిమంది ధనవంతులు - పెట్టుబడి దారుల - చేతుల్లోకి ఉత్పత్తి సాధనాలు పోయాయి. సమాజంలో వారి పలుకుబడి పెరిగిపోయింది. వారు లాభాలకోసం ఉత్పత్తిచేయడం మొదలు పెట్టారు. పాత వాణిజ్య, వ్యాపార విధానాలకు స్వస్తి పలికి స్వేచ్ఛతో కూడిన పోటీ మొదలయింది. స్వేచ్ఛావ్యాపార విధానాలవల్ల ఇంగ్లండులో పరిశ్రమలు అధికమయి, మొత్తం ప్రపంచానికి కావాల్సిన వస్తువులు తయారు చేసే, 'వర్క్‌షాపు' అయింది ఇంగ్లండు. పరిశ్రమలు బాగా విస్తరించ టంతో ఇంగ్లాండుకు రెండు అవసరాలేర్పడ్డాయి. ఒకటి, తన పరిశ్రమలకు కావా

ల్సిన ముడిపదార్థాలు, రెండు, తయారయిన వస్తువుల అమ్మకానికి మార్కెట్టు. దాంతో వలస స్థావరాల వెదకులాట, ఆ ప్రయత్నంలో ఇంగ్లండుకు ఇతర ఐరోపా దేశాలతో పోటీ మొదలయింది. ఆఫ్రికా, ఆసియా ఖండాలు ఆయా దేశాలకు వలస స్థావరాలయాయి. ముఖ్యంగా ఇంగ్లాండు, ఫ్రాన్సు లాంటిదేశాలు ప్రపంచం మొత్తం మీద తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకో సాగాయి. ఆ విధంగా సామ్రాజ్య వాదం తలెత్తింది.

భావ విప్లవం :

పారిశ్రామిక విప్లవ ఫలితంగా మానవుని జీవితరంగా లన్నిటిలోను ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రజలకు మతంపట్ల నమ్మకం తగ్గసాగింది. వ్యవసాయం కంటే పరిశ్రమల ప్రాముఖ్యత పెరగటంతో గ్రామీణులు జీవనోపాధి దొరికే పట్టణాలకు తరలి వెళ్ళసాగారు. ఫలితంగా కార్మికులు అల్పవేతనాలపై దొరకటంతో, పెట్టుబడి దారులు వారి శ్రమశక్తిని దోచసాగారు. గనుల్లో స్త్రీలు, పిల్లలూ కూడా పనిచేయసాగారు. పరిశ్రమల చుట్టూ మురికి వాడలు వెలిసాయి. అవి బీదతనం, అనారోగ్యం, అవినీతి, నేరాలకు ఆటపట్టులయ్యాయి. కార్మికుల దయనీయ పరిస్థితులు, వారి దుస్థితి - వాటి నుండి వారి నుద్ధరించటానికి సామాజిక ఉద్యమాలు మొదలయ్యాయి. కార్మిక సంఘాలు, సహకారోద్యమాలు మొదలయ్యాయి క్రమంగా ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని కార్మిక,కర్మాగార చట్టాలను నిర్మించసాగింది. ఇది క్రమంగా సామ్య వాదానికి దారి తీసింది.

ఫ్యూడల్ భూస్వాములకు రాజకీయంగా పలుకుబడి సన్నగిల్లి, మధ్య తరగతికి చెందిన పెట్టుబడిదారుల అధికారం మొదలయింది. వారు స్వేచ్ఛకు, తదితర ప్రజాస్వామిక విలువలకు ప్రాధాన్య మిచ్చారు. మతసహనం, అందరికీ వోటుహక్కు, వ్యక్తి స్వాతంత్ర్యం, మితమైన ప్రభుత్వ జోక్యం వారి రాజకీయ నినాదాలయ్యాయి. ఈ విధంగా వైయక్తిక ఉదారవాదం తలెత్తింది. పెట్టుబడి దారీ విధానంవల్ల జాతీయ వాదంకూడ ప్రబలింది. దేశం మొత్తం పారిశ్రామికంగా అభివృద్ధి గాంచడం, చలన సాధనాలు అభివృద్ధి పొందటంతో ప్రాంతీయ భేదాలు తొలగిపోయి జాతీయత నెలకొన్నది. విదేశీ విపణులకోసం ఆరాటపడే పెట్టుబడిదారీ విధానంతో చేతులు కలిపిన జాతీయ వాదం ఎన్నో భయంకర యుద్ధాలకు దారితీసింది. అందువల్లే కారల్ మార్క్సు సామ్రాజ్య వాదాన్ని పెట్టుబడి దారీ విధానపు చివరి దశగా వర్ణించాడు.

పెట్టుబడిదారుల ఉదారవాదతత్త్వానికి వ్యతిరేకంగా కార్మికవర్గ విప్లవ తత్త్వమైన సామ్యవాదం ప్రాదుర్భవించింది. పెట్టుబడిదారుల వ్యక్తివాదాన్ని తిరస్కరించి, వారి జాతీయ, సామ్రాజ్య వాదాల స్థానే విశ్వజన వాదాన్ని సామ్యవాదం ప్రవేశపెట్టింది. కారల్ మార్క్స్ తన కమ్యూనిస్ట్ సిద్ధాంతంతో కొత్త తరానికి యుగ పురుషుడయ్యాడు.

భారతదేశం - ఇంగ్లాండుకు వలస స్థావరంగా స్థిరపడటం, ఆర్థిక రంగం:

బ్రిటీషు సామ్రాజ్యంలో భారతదేశం ఒక వలస స్థావర మయింది. 18వ శతాబ్దానికల్లా ఆంగ్లేయులు భారతదేశంలో తమరాజ్యాన్ని సుస్థిరంచేసుకున్నారు. అంతకు ముందు ఎంతో మంది భారతదేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నా దానివల్ల దేశంలో పెద్దమార్పేం జరగలేదు. పాతరాజులు పోయి కొత్త రాజులు వచ్చారు. పాతరాజ్యాలు నశించి కొత్త రాజ్యాలు ప్రభవిల్లాయి. అయితే సామాన్య మానవుడి జీవిత విధానం దీనివల్ల ఎలాంటి మార్పు పొందలేదు. వేల సంవత్సరాల తరబడి ఎలావుందో, అలాగే కొనసాగింది. స్వయం సమృద్ధిగల గ్రామ ఆర్థిక వ్యవస్థలో మార్పురాలేదు. ఈ సందర్భంలో ఎ. ఆర్. దేశాయ్ ఇలా అన్నాడు.

"With the self-sufficient village based on communal possession of land, Unity of village industry and agriculture, the village as the Unit of revenue assessment and finally village production almost exclusively for village use, as its main pivot, this economic structure of Pre- British India triumphantly serviced, in its main outlines, for centuries, all foreign invasions, military convultions, religious upheavals and dynastic wars. All these events, however spectacular and cataclysmic, affected only the social, political or religio-idealogical superstructure of Indian society but not its economic base. The self sufficient village, in which

practically the entire population lived, successfully survived the most violent political storms and military holocausts".[1]

బ్రిటన్‌లో ఫ్యూడల్ వ్యవస్థ నశించి పెట్టుబడిదారీ వ్యవస్థ నెలకొన్నది. అలాంటి దేశం ఫ్యూడల్ వ్యవస్థలో అణగారి పోయిన భారతదేశాన్ని జయించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు సాంకేతికంగా అభివృద్ధి చెంది వుంటాయి. కనుక, ఫ్యూడల్ వ్యవస్థ కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థికంగా చాలా శక్తివంతమై వుంటుంది. తన వలస స్థావరమైన భారతదేశంలో ఉన్న ఫ్యూడల్ వ్యవస్థను నాశనం చేసి గాని, బ్రిటన్ తన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు తగినట్లుగా భారతదేశాన్ని మార్చుకోలేకపోయింది, మొదటగా స్వయం సమృద్ధి గల గ్రామ వ్యవస్థపై దెబ్బ తీసింది. ఇదే భారతీయ ప్రజల జీవిత విధానం మారటానికి ప్రధాన కారణం. ఆంగ్లేయులు రాకపూర్వం, భూమి అటు రాజుకు గాని, లేక రైతుకు గాని చెందివుండేది కాదు. అది ఉమ్మడి గ్రామ సంపద. స్వంత భూమి (ఆస్తి) అన్నది సృజించింది ఆంగ్లేయులే. 1793 లో కారన్ వాలీస్ బెంగాలు, బీహారు, ఒరిస్సాల్లో 'పర్మనెంట్ లాండ్ సెటిల్మెంట్'ను ప్రవేశపెట్టి మొదటగా భూస్వాములను తయారుచేశాడు. వీళ్ళు మొదట్లో శిస్తు వసూలు చేసేవారు. వీళ్ల శాశ్వత పద్ధతి పైన ఒక నిర్ణీత మొత్తం ఈస్టిండియా కంపెనీ వారికి చెల్లించవలసి వుంటుంది. దీనివల్ల బ్రిటిషు వారికి తేలిగ్గా, ఖర్చు లేకుండా శిస్తు వసూలు కావడమే కాక, తమని అభిమానించే లాబీవర్గం ఒకటి ఏర్పడింది. అయితే దీనివల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని, తరవాత 'టెంప రరీలాండు సెటిల్మెంటు' ప్రవేశపెట్టారు. దీంతో శిస్తు వసూలు దార్లకు యాజ మాన్యపు హక్కులు వచ్చాయి కాని, ప్రభుత్వం తమకు తోచినప్పుడు నిర్ణీత మొత్తాన్ని ఎక్కువ చేయవచ్చు. అలా మొదట్లో శిస్తుదార్లుగా వున్న వీరందరూ అనతి కాలంలో జమీందార్లయ్యారు. ఆ తరువాత 1820 లో బొంబాయి, సింధు, బిరారు, మద్రాసు, అస్సాం మొదలైన ప్రాంతాల్లో 'రైత్వారీ సెటిల్మెంట్'ను ప్రవేశపెట్టారు. ఇలా భూమి హక్కు ప్రవేశపెట్టబడటంతో భూమి కూడ కొనేందుకు, అమ్మేందుకు వీలైన వస్తువయింది. ఆంగ్లేయులు రాకపూర్వం సాలీనా భూమిశిస్తు ఉత్పత్తిలో ఒక భాగం మాత్రమే వుండేది. కాని కంపెనీ

పాలనలో ఒకనిర్ణీత మొత్తం చెల్లించాల్సి వుంటుంది. వానలు పడకపోవటం, పండకపోవటం, వరదలవల్ల నష్టంలాంటి ప్రకృతి వైపరీత్యాలతో నిమిత్తం లేకుండా రైతు ఆ నిర్ణీత మొత్తాన్ని చెల్లించవలసి వుంటుంది. దాంతో రైతు బీద వాడై తన పొలాన్ని అమ్మటమో, తనఖాపెట్టటమో చేయాల్సివచ్చింది. కొత్త భూమి శిస్తుపద్ధతి వల్ల గ్రామం తన పర్యవేక్షణా బాధ్యతనీ, పంచాయతీగా ఏర్పడి న్యాయ నిర్ణేతగా వ్యవహరించే బాధ్యతనీ కోల్పోయింది. న్యాయ నిర్ణయానికి కోర్టు లేర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం యిప్పుడు గ్రామ పెద్దతో కాక, గ్రామస్థులతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకొంది. కొత్త భూమి శిస్తు పద్ధతివల్ల గ్రామావసరాలకు మాత్రమే పండించటమనే పద్ధతి మారిపోయి, మార్కెట్టులో అమ్మటానికి ఉత్పత్తి చేయసాగారు గ్రామస్థులు. చలన సాధనాలు అధికం కావటంతో వ్యవసాయం మరింతగా వ్యాపార మయింది.

గ్రామ సమిష్టి స్వయం పరిపాలనా లక్షణం ప్రభుత్వం చేపట్టిన ఇతర కార్య క్రమాలతో పూర్తిగా నశించింది. గ్రామాధికారం నుంచి భూమి తొలగి పోవటమే కాక, గ్రామ సమీపస్థ అటవీసంపద వాడు కోవటానికీ, పచ్చిగడ్డి భూముల్లో పశువులు మేపుకోవటానికి నిషేధమేర్పడింది. దీంతో గ్రామ స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతినింది. మెల్లమెల్లగా గ్రామం కేంద్ర ప్రభుత్వం అధీనంలోని ఒక పాలకాంగంగా మారిపోయింది.

కంపెనీ పాలనలో స్వదేశ పరిశ్రమలు కూడ దెబ్బతిన్నాయి. ఈ సందర్భంలో కె.ఎ. ఆన్టోనోవా యిలా అన్నది.

"This (British rule) also affected the position of the numerous craftsmen who had been supplying the needs of the feudal families. In Bengal, for instance, the town of Decca lost its one-time importance, for the inhabitants had specialised in the production of fine and costly fabrics. Those craftsmen who did not depart for the villages were severely exploited by the company, since they were not allowed to sell their wares to

private merchants both in Bengal and in the South. In the 1790's there were fatal cases resulting from beatings received at the hands of company agents, if weekly quotas were not fulfilled company employees threw the weavers into prison without food and water"[2]

19 వ శతాబ్దం ప్రారంభం వరకూ భారత దేశాన్నుండి ఇంగ్లాండుకు వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. అయితే కంపెనీ వారు కాక, కంపెనీలో పనిచేసే ఉద్యోగులు వీటిని ఎగుమతి చేసి స్వంత వ్యాపారం చేసుకునే వారు. 19 వ శతాబ్ది ప్రారంభమయ్యే కాలానికి భారతదేశం నుండి వస్త్రాల ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. వస్త్రాలకు బదులుగా బ్రిటనులోని వస్త్ర కర్మాగారాలకు భారత దేశం నూలు ఎగుమతి చేయసాగింది. అలాగే 18 వ శతాబ్దాంతానికల్లా బెంగా లులో పట్టు పురుగుల పెంపకం, ఉప్పు తయారీలను ప్రభుత్వం పూర్తిగా తగ్గించి వేసింది.

అలా పారిశ్రామిక బూర్జువా వర్గం ఇంగ్లాండులో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటూ, భారతదేశ ఆర్థిక వ్యవస్థను తన వర్గ ప్రయోజనాన్ని సంతరింప చేసేదిగా తీర్చిదిద్దుకో సాగింది. బ్రిటిషు సుంక విధానం భారతదేశానికి బ్రిటిషు వారి ఎగుమతులను ప్రోత్సహించేదిగా తయారయింది. ఇంగ్లాండులో ఎక్స్‌పోర్ట్ టారిఫ్ చాల తక్కువగాను, ఇంపోర్ట్ టారిఫ్ చాల ఎక్కువగాను వుండటంతో ఇంగ్లాండు నుండి భారతదేశానికి దిగుమతులు ఎక్కువై, ఎగుమతులు తగ్గి పోవటంతో వలస స్థావరమైన భారతదేశాన్ని దోచుకోవటం అధికమయింది. ఇంగ్లాండు నుండి దిగుమతి అయిన గుడ్డలు చౌకగా అమ్మటంతో స్వదేశ వస్త్రాలు కూడ అవే ధరలకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడటంవల్ల దేశీయ వస్త్ర కార్మికుల జీవిత ప్రమాణం పడి పోయింది. కలకత్తాలో నౌకా నిర్మాణంకూడ కుంటుపడింది. బ్రిటనుతో ఈ పరిశ్రమ పోటీ పడలేకపోయింది.

బ్రిటిషువారు తమ ఫ్యూడల్ దోపిడీ విధానాలతో పెద్దమొత్తాలు అవసరం లేకుండానే రైతాంగాన్ని దోచడం మొదలుపెట్టారు. ముందుగా ఏ కొద్దిమొత్తమో

అడ్వాన్సు యిచ్చి, రైతులు తమ నీలిమందు, నల్లమందు పంటలను బ్రిటీషు వారు నిర్ణయించిన ధరలకు అమ్మడానికి వివశులను చేసేవారు. రైతుల కిచ్చిన అప్పులు ఎప్పటికీ తీరేవికావు. తండ్రుల నుండి కొడుకులకవి సంక్రమించేవి. ఇంగ్లాండుకు మంచిరకం ముడిపదార్థాల నందించే కేంద్రంగా భారతదేశాన్ని మలచుకొనే ఉద్దేశంతో 1820 తరువాత బ్రిటీషు పెట్టుబడిదారులు బీహారులో చెరుకు, బీరారులో 'లాంగ్ స్టేపిల్ కాటను', బెంగాలులో పట్టు, మైసూరులో కాఫీ, పొగాకు పంటలు, పండించడానికి ప్రోత్సాహమిచ్చినా, దేశీయ రైతుల హైన్య జీవన ప్రమాణాలవల్ల అలా వీలుపడలేదు.

ముడి సరుకులు ప్రపంచ వాణిజ్య విపణులు చేరటానికి రోడ్లు, రైలు మార్గాలు అవసరమయ్యాయి. ఆ విధంగా రేవు పట్టణాల వరకు రోడ్లు వేయటం, రైలు మార్గాలు నిర్మించటం జరిగింది. 19 వ శతాబ్ది మధ్యకల్లా మొదటి రైలు మార్గం వేయటం జరిగింది. అవసరానుగుణంగా తంతితపాలా శాఖ వ్యవస్థీకరింపబడింది. అప్పటికే వున్న పంటకాలువల్ని బాగుచేయటం, కొత్త కాలువల త్రవ్వకం చేపట్టడం జరిగింది. బ్రిటీషు వారి విధానాలను కె. ఎ. ఆన్టోనోవా యిలా వర్ణించింది.

"In general the economic policy of the colonial government in India was one of ambivalence : On the one hand, there was encouragement for the development of new economic regions and new communications while village communities were on the decline, on the other, feudal exploitation of the peasants via taxation was being intensified and private ownership of land was being consolidated. So that land owners were renting out their lands to share - croppers and reducing the peasants to the position of little more than serfs. On the one hand, India being turned into a source of raw material and agricultural produce for Britain, a development which was preparing the soil

for the emergence of capitalist production in that country, while on the other, various types of feudal practices and obstacles in the path of national production were holding back the development of India's economy".[3]

భారతదేశం క్రమక్రమంగా ఇంగ్లాండుకు వలస స్థావరంగా స్థిరపడటం మొదలవగానే, ఈస్ట్ ఇండియా కంపెనీ వారి విధానాలు, బ్రిటీషు పారిశ్రామిక బూర్జువా వర్గం వలస స్థావరాల లాభాలు పంచుకునేందుకు జరిపిన పెనుగులాట ఫలితంగా వారి ప్రయోజనాలకు అనుగుణంగా మారాల్సి వచ్చాయి. బ్రిటీషు పార్లమెంటు కంపెనీ వ్యవహారాల్లో ప్రతిసారీ తలదూర్చటంతో ఇది మనకు స్పష్టమవుతోంది. 1773 లో పార్లమెంటు ఆమోదించిన 'రెగ్యులేటింగ్ ఆక్ట్' ప్రకారం బ్రిటీషు రాజు / రాణి కంపెనీ గవర్నరు జనరలును, బెంగాల్ కౌన్సిలు సభ్యులను, కలకత్తా సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తులను నియమించడానికి అవకాశం కలిగింది. ఆ తరువాత పార్లమెంటు ఆమోదించిన అనేక చట్టాలతో కంపెనీ విధానాలు కంపెనీ వశం దాటి చివరకు భారత పరిపాలన కూడ బ్రిటీషు ప్రభుత్వం చేతుల్లోకి పోయింది.

తప్పనిసరి పరిణామాలు :

స్వప్రయోజన సాధనకై అప్పుడు భారతదేశంలో రెండు శక్తులు పని చేస్తున్నాయి. ఒకటి - క్రైస్తవ మిషనరీలు, రెండు - ఈస్టిండియా కంపెనీ, ఆ తరువాత బ్రిటీషు ప్రభుత్వం. ఈ రెండూ స్వప్రయోజనం కోసమే పనిచేసినా కొంత దేశానికి మేలు కలిగించే పనికూడ చేయాల్సి వచ్చింది. మత ప్రచారానికై క్రైస్తవ మిషనరీలు, పాలనా యంత్రాంగాన్ని నడిపేందుకు కంపెనీకి కావాల్సిన ఇంగ్లీషు నేర్చిన ఉద్యోగుల కోసం కంపెనీ-రెండూ విద్యారంగాన్ని సాధనంగా చేపట్టాయి. అందుకోసం పుస్తకాలు, వాటి ముద్రణకు ముద్రణశాలలు, వాటితో పాటు, పత్రికలు వెలిశాయి. ఆంగ్ల విద్యాబోధనతో ఉదారవాదం, దాంతో ప్రజల్లో రాజకీయ చైతన్యం, జాతీయ వాదం, సామ్యవాదం మొదలైనవి ఉద్భవించాయి. అవసరానుగుణంగా వైద్యం, విజ్ఞాన వ్యాప్తి జరిగాయి.

ముద్రణ-క్రైస్తవ మిషనరీల, ఆంగ్లోద్యోగుల భాషాసేవ :

అచ్చును మొదటి సారిగా 1550 లో పోర్చుగీసువారు గోవాలో ప్రవేశ పెట్టారు. ఫాస్టర్ డీలియో రాసిన, 1560 లో అచ్చైన 'ది స్పిరిచ్యువల్ కాంపీడియం ఆఫ్ ది క్రిష్టియన్ లైఫ్' అన్నదే భారతదేశంలో మొదటగా అచ్చైన గ్రంథం. చాల వరకు అన్ని రంగాల్లో ప్రప్రథమంగా కృషి చేసినవారు క్రిస్టియను మిషనరీలు అనటానికి ఇదో ఉదాహరణ. ఆ తరువాత 1772 లో మద్రాసులో, 1778 లో కలకత్తాలో, 1792 లో బొంబాయిలో ముద్రణ యంత్రాలు వచ్చాయి. అయితే తెలుగులో అచ్చయిన మొదటి పుస్తకాలు **1746-47** ల్లో జర్మనీలోని హాలె (Halle) అనే పట్టణంలో అచ్చయ్యాయి. బెంజిమన్ షూల్జ్ అనే ఫాదరీరాసిన 'మోక్షానికి కొంచ్చు పొయ్యే దోవ', 'సత్యమైన వేదంలో వుండే జ్ఞాన వుపదేశాల యొక్క సంక్షేపం', 'నూరు జ్ఞాన వచనాల యొక్క చిన్ని పుస్తకం' 'పెద్ద స్వామి మీద ప్రయోగించిన తర్కం' మొదలైన రచనలు కర పత్రాల వంటి చిన్న పుస్తకాలు. భారతదేశంలోని ముద్రణాలయాల్లో మొదట ప్రచురితమైన పుస్తకాలన్నీ క్రైస్తవ మత ప్రచారానికి అవసరమైన సామగ్రే. వివిధ ప్రాంతీయ భాషల్లో బైబిలు (పాత, కొత్త నిబంధన గ్రంథాలు), మతాచార్యుల, మతస్థుల నడవడికకు సంబంధించిన చిన్న పుస్తకాలు, క్రైస్తవ భక్తుల చరిత్రలు, కీర్తనలు అచ్చయ్యాయి. ఇవి బెంగాలులోని శ్రీరాం పురం మిషను ముద్రణాలయంనుండి వెలువడ్డాయి.

"మద్రాసు నగరములో మొదటి మారు అచ్చయిన తెలుగు గ్రంథము క్రీ. శ. 1807 నాటిది. ఇది తెలుగు వ్యాకరణము. ఆ కాలములో క్రైస్తవమత బోధకులకూ, దేశము కుంపిణీ వారికి స్వాధీనమై వారి పరిపాలన క్రిందికి వచ్చిన తరువాత దేశపాలకులుగ నియమితులైన బ్రిటీషు అధికారులకూ తెలుగు భాష అభ్యసింపవలసిన ఆవశ్యకము కలిగినది."[4] దేశ పాలన చక్కగా సాగాలంటే తమ ఉద్యోగులు ప్రజల భాషలు తెల్సి వుండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన బ్రిటీషు ఈష్టిండియా కంపెనీ డైరెక్టర్లు 18వ శతాబ్ది మధ్యలోనే ప్రభుత్వ ప్రజా ప్రకటనలు (పబ్లిక్ ప్రొక్లమేషన్స్) భిన్న భారతీయ భాషల్లో వుండాలని ఆదేశమిచ్చారు. ఆ ప్రకటనలు రాయడానికి ఇంగ్లీషు, అక్కడి ప్రాంతీయ భాష తెల్సిన వాళ్ళవసరమయ్యారు. అలా భారతీయ భాషలు నేర్చుకోవడం తప్పనిసరి

అయింది ఆంగ్లోద్యోగులకు. భారతీయ భాషలు నేర్చుకోవటానికి ఉపయోగపడే గ్రంథ రచనను ప్రభుత్వం ప్రోత్సహించింది. అలాగే తమ ప్రయోజనార్థం క్రైస్తవ మిషనరీలు ప్రయత్నించాయి.

మొదటగా కాప్టెన్ విలియమ్ కిర్క్ పాట్రిక్ రాసిన హిందీ వ్యాకరణం, నిఘంటువు 1788లో అచ్చయ్యాయి. భాష నేర్చుకోవటానికి వ్యాకరణాలు, నిఘంటువులు తప్పనిసరికాబట్టి వాటికి ప్రోత్సాహం లభించింది. క్రమంగా మిగతా భాషల్లో నిఘంటువులు, వ్యాకరణాలు అచ్చయ్యాయి. 18వ శతాబ్ది అంతంవరకు ఆంగ్లోద్యోగులు దేశభాషలు నేర్చుకోవటానికి తమ స్వంత ఏర్పాట్లు చేసుకున్నారు. దానికయ్యే ఖర్చు ప్రభుత్వం భరించింది. ఆ తరువాత ప్రభుత్వమే తమ సివిల్ సర్వెంట్లకు ప్రాంతీయ భాషలు నేర్పటానికి ఫోర్ట్ విలియమ్‌లో ఒక కాలేజీని 1800 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. తరువాత ఫోర్ట్ సెయింట్ జార్జి (1812) లోను, బొంబాయిలోనుకూడ కాలేజీలు ఏర్పడ్డాయి. ఈ కళాశాలల్లో దేశభాషల బోధన, పరీక్షల నిర్వహణేకాక, పుస్తకానువాదాలు, ప్రచురణ కార్యక్రమంకూడ చేపట్టటం జరిగింది.

క్రైస్తవ మిషనరీలు వీరికి తీసిపోలేదు. 1810లో సెయింట్‌లూక్ (లూకా సువార్త) ప్రచురితమయింది. బైబిలు కొత్త నిబంధనల పుస్తకం 1811లో అచ్చయింది. క్రైస్తవ మత ప్రచారకుడయిన విలియమ్ కారీ ఆంగ్లంలో రచించిన తెలుగు వ్యాకరణం (ది తెలింగా గ్రామర్) 1814 లో అచ్చయింది.

ఫోర్ట్ సెయింట్ జార్జి కాలేజి మొదటగా ఒక లాటిను భాషా వ్యాకరణాన్ని, 'సదూర్ అగరాది' అన్న తమిళ నిఘంటువును ప్రచురించింది. కాలేజీ ప్రారంభించిన పది సంవత్సరాల్లో వ్యాకరణాలు, నిఘంటువులే కాక అనేక ప్రాథమిక పాఠ్య గ్రంథాలు కూడా ప్రచురితమయ్యాయి. కాలేజీకి చెందిన ఏ.డి. కాంప్‌బెల్ రాసిన తెలుగువ్యాకరణం 1816లో వెలువడింది. 1818లో విలియం బ్రౌన్ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు (ఏ ఒకాబులరీ ఆఫ్ జెంటూ అండ్ ఇంగ్లీష్) ప్రచురితమయింది. ఏ. డి. కాంప్‌బెల్ తెలుగు ఇంగ్లీషు నిఘంటువు (ఏ డిక్షనరీ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్) 1821 లో అచ్చయింది. వర్ణమాల అక్షర క్రమాన్ని పాటించిన మొదటి తెలుగు - తెలుగు నిఘంటువు 1848 లో వచ్చిన మండూరు రంగ

నాయకులు శ్రేష్ఠి 'ఆంధ్రదీపిక' అయితే ఇదే పేరుతో, ఇదే పద్ధతిలో 1806లో రాసిన తెలుగు-తెలుగు నిఘంటువు కూడఉంది. అది రాసింది మామిడి వెంకయ్య. సెయింట్ జార్జి కళాశాల వారు ఇది ఉత్తమ గ్రంథంగా ఎంచి, దీన్ని ముద్రించ డానికి కాపీరైటు హక్కులకోసం ఆయనతో రాయబారాలు జరిపి, మే7, 1814న బందరులో హక్కుపత్రాన్ని పొంది కూడా ఏ కారణంవల్లో ముద్రించలేదు. ప్రభుత్వ అనువాదకుడుగా వున్న చుండూరు రంగనాయకులు శ్రేష్ఠి ఈ గ్రంథం నుంచి చాల సేకరించి ఉండవచ్చు. మామిడి వెంకయ్య 'ఆంధ్రదీపిక' శ్రీవాసవి గ్రంథ ప్రచురణ సమితి, మచిలీపట్నం వారు 1965లో మొదటగా ముద్రిం చారు.[5]

తరువాత తరువాత మద్రాసులోనే కాక గుంటూరు, రాజమండ్రి విశాఖ పట్టణం మొదలైన నగరాల్లో కూడ ముద్రణాలయాలు వెలిశాయి. ఈ ముద్రణా లయాలను మొదట స్థాపించిన వారు క్రైస్తవ మత బోధకులే. 1806-07లో మద్రాసులో తెలుగు ముద్రణ ఆరంభ మయినా ప్రారంభ దశలో వుండేకష్టాల వల్ల అది 1830 వరకు ఎక్కువ అభివృద్ధి పొందలేదు. ముద్రణా సౌకర్యాలు గ్రహించిన దేశీయులు 1830 తర్వాత మంచి పుస్తకాల నచ్చువేయటం మొదలు పెట్టారు. ఇంకో పాతిక సంవత్సరాల్లో తెలుగులో పత్రికలు కూడా ప్రారంభ మయ్యాయి. "1820 వ సంవత్సరము వరకు ముద్రణములో అభివృద్ధి ఏమిన్ని లేదు. ఇపుడు తెలుగులోను అరవములోను పత్రికలు ఉన్నప్పటికి వాటిలో మతమునకు సంబంధించినవో కులమునకు సంబంధించినవో. పరస్పర దూషణములు వాద ప్రతివాదములు ఉంటేనే కాని అవి నిలవటము లేద"[6] ని సి. పి. బ్రౌను 1852లో రాశాడు. తెలంగాణాలో 1935 దాకా తెలుగులో ముద్ర ణాలయాలే స్థాపితం కాలేదు.

ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాల అధ్యాపకుల్లో ఒకరయిన రావిపాటి గురు మూర్తిశాస్త్రి "ద్వాత్రింశత్ సాలభంజికల కథలు" 1819లో వెలువడింది. 1920లో ప్రాంతీయ భాషల్లో పాఠ్యగ్రంథాల ప్రచురణకు 'ది మద్రాస్ స్కూల్ బుక్ సొసైటి' ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పడింది. ఇది విద్యార్థుల ఉపయోగార్థం ఎన్నో పాఠ్యపుస్తకాలను వెలయించింది. ఈ స్కూల్‌బుక్ సొసైటి ఆధ్వర్యం లోనే 1829లో ఆంగ్లానువాదంతో సహా వేమన పద్యాలు సి. పి. బ్రౌన్ రాయగా

అచ్చైంది. గురుమూర్తి శాస్త్రి 'పంచతంత్ర కథలు' 1834లో వీరే ప్రచురించారు. దీనికి తెలుగు పీఠిక వుంది. 1840 తరువాత వసు చరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, నల చరిత్ర మొదలైన కావ్యాలెన్నో త్వరిత గతిని ప్రచురితమయ్యాయి. సుమతీ శతకం, దాశరథీ శతకం మొదలయిన శతకాలు కూడ అచ్చయ్యాయి. వీటిలో కొన్నింటికి ఇంగ్లీషులోను, కొన్నింటికి తెలుగులోను పీఠికలు కన్పిస్తాయి. 'నల చక్రవర్తి కథ' ద్విపదలో 1841 లోను గౌరన 'హరిశ్చంద్ర ద్విపద', 'నవనాథ చరిత్ర' లోని ఒక కథతో కూడ 1842 లోను అచ్చయ్యాయి. ఈ పుస్తకంలో అంతకుముందు ప్రచురితమైన తెలుగు పుస్తకాల పట్టిక యిలా వుంది.

వసు చరిత్ర, వ్యాఖ్యానంతో
మను చరిత్ర, రెండు ప్రచురణలు
కుచేలో పాఖ్యానం
భాగవతం సప్తమ స్కంధం
హరిశ్చంద్ర ద్విపద
నల ద్విపద
వేమన, సుమతి, భాస్కర, కాళహస్తి, భళిర కరివేల్పు,
లావణ్యసీమ శతకాలు.
ఆంధ్ర వ్యాకరణం
అచ్చులో వున్న పుస్తకాలు :
శంకరకవి హరిశ్చంద్ర
కంచివీర శరభయ్య హరిశ్చంద్ర
ఆది పర్వం.

1842 లోనే 'వర్తమాన తరంగిణి' పత్రికలో 'హంస వింశతి', 'వేణు గోపాల శతకం', 'వసు చరిత్ర' (వ్యాఖ్యానంతో), గురుమూర్తి శాస్త్రి 'ఆంధ్ర శబ్ద రత్నాకరము', 'ఆంధ్రనామ సంగ్రహం' (టీకతో), 'హరిశ్చంద్రోపాఖ్యానం' (యక్షగానం), 'రుక్మిణీ కళ్యాణం'. 'ప్రహ్లాద చరిత్ర', 'భగవద్గీతలు' 'బాలశిక్ష', 'భజగోవింద శ్లోకములు', 'కవిజన రంజనము', 'శుకరంభా సంవాదములు', 'రంభా రావణ సంవాదము', 'గజేంద్ర మోక్షము', 'రామతారక

శతకము', 'కాళహస్తి శతకము', 'దాశరథీ శతకాల' ప్రకటనలు కనిపిస్తాయి. 1847 తర్వాత మద్రాసులో 'ఉపయుక్త గ్రంథకరణ సభ' ఎన్నో గ్రంథాల్ని ప్రచురించింది. 1855 కల్లా ప్రభుత్వం వారు జిల్లా ముద్రణశాలలను స్థాపించారు. ఇవి కలెక్టర్ల పర్యవేక్షణలో పనిచేశాయి. 1860 నాటికి మరికొన్ని శతకాలు, నైషధం వంటి కావ్యాలు, వాచకాలు వచ్చాయి. చిన్నయ సూరి 'నీతి చంద్రిక' 1853 లో వచ్చింది.[7] స్వతంత్ర ముద్రణాలయాలు చాలా వచ్చినా, ప్రభుత్వం వాటికి అనుమతి నివ్వటానికి చాల కఠిన నిబంధన లుండేవి.

దేశ భాషా సేవ చేసిన ఆంగ్ల ప్రభుత్వోద్యోగులు :

ఎందరో ఆంగ్లోద్యోగులు, క్రైస్తవ మిషనరీలు దేశ భాషల అభివృద్ధికై పాటు పడ్డారు ఏ. డి. కాంప్ బెల్ రాసిన తెలుగు వ్యాకరణానికి ఎల్లిస్ రాసిన నోట్ ద్రావిడభాషల ప్రత్యేక కుటుంబత్వాన్ని నిరూపించడానికి మూల కారణమయింది. బిషప్ కాల్డ్వెల్ ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణం ఈ విషయాన్ని సిద్ధాంతీకరించింది.

తెలుగు భాషాసాహిత్యాలకు, చరిత్రకు సేవచేసిన వాళ్ళలో మొదట పేర్కొనదగినవాళ్ళు కల్నల్ కాలిన్ మెకంజీ, ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఇంజనీరింగు శాఖ ఉద్యోగిగా ఈస్టిండియా కంపెనీ సైన్యంతో దేశంలో పలుప్రాంతాలను సందర్శించిన మెకంజీ దేశీయ వాఙ్మయంలోనూ, ప్రాచీన వృత్తాంతాలలోనూ దేశ చరిత్ర నిర్మాణానికి ఉపకరించే సాధనసామగ్రి చాలా ఉందని తెలుసుకున్నాడు. కావలి సోదరుల సహాయంతో ఈ సామగ్రినంతా సేకరించాడు. 1793 - 1816 మధ్యకాలంలో వివిధ భాషలకు చెందిన సుమారు 1568 తాళపత్ర గ్రంథాలనూ, 2070 స్థానిక చరిత్రలు, వృత్తాంతాలనూ, 8076 శాసన పాఠాలనూ, 79 దేశపటాలనూ, 2630 చిత్రాలనూ, 6218 నాణాలనూ, 106 శిల్ప చిత్రాలనూ, 40 పురాతన వస్తువులనూ మెకెంజీ సేకరించాడు.[8] ప్రాంతీయ భాషలేవీ తెలియకపోయినా మెకంజీ కృషి దేశ చరిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించింది.

"In 1825 I found Telugu literature dead. In thirty years I raised it to life"[9] అని రాసుకున్నాడు సి పి. బ్రౌన్. 1829లో

వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించాడు. మనుచరిత్ర, వసు చరిత్ర మొదలైన గ్రంథాలు వ్యాఖ్యానాలతో అచ్చుకావడానికి, మరెన్నో తాళ పత్ర గ్రంథాలు అచ్చుకు నోచుకోవడానికి బ్రౌనే కారకుడు. 1852, 53, 54 లలో ఇంగ్లీషు-తెలుగు, తెలుగు-ఇంగ్లీషు, మిశ్రభాషా నిఘంటువులను కూర్చాడు. 1840 లో తెలుగు వ్యాకరణం రాశాడు. అనేక విషయాల మీద ఎన్నో వ్యాసాలు రాశాడు. మొదట అచ్చయిన తెలుగు కావ్యాలను పరిష్కరింపచేసి పీఠికలు రాశాడు. పరిష్కృత కావ్య పీఠికలకు బ్రౌన్ పీఠికలే ఆదర్శం.

విద్యావ్యాప్తి :

ఆంగ్లేయులు విద్యారంగాన్ని స్పృశించక ముందు భారతదేశంలో హిందువులకు టోల్స్, విద్యాలయాలు, చతుష్పదులు విద్యాసంస్థలు. సంస్కృత, సంప్రదాయ శాస్త్రాలు బోధనా విషయాలు, అలాగే మహమ్మదీయులకు మసీదులు, మక్తబ్‌లు విద్యాసంస్థలు. అక్కడ అరబ్బీ, పర్షియను భాషాబోధన. కొరాను కంఠస్థం చేయించటం జరిగేది ఏమైనా రెండుచోట్ల విద్యాబోధన లౌకిక పరమయినది కాక ప్రధానంగా మత పరమయినది. మొదట్లో కంపెనీ వారికి విద్యావ్యాప్తి పట్ల ఆసక్తి లేదు. వారన్ హేస్టింగ్స్ 1781 లో కలకత్తాలో మద్రసా (మహమ్మదీయుల విద్యాబోధనకు) స్థాపించాడు. సర్ విలియం జోన్స్ 1784 లో "ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్'ను కలకత్తాలో స్థాపించాడు. హిందువుల కోసం 1792 లో జొనాథన్ డంకన్ వారణాసిలో సంస్కృత కళాశాలను ప్రారంభించాడు. కంపెనీ ఉద్యోగి అయిన ఛార్లెస్ గ్రాంట్ ఇంగ్లీషు చదువు కోసం దేశమంతటా పాఠశాలలను తెరవాలని ఆశించాడు కాని, కంపెనీ డైరెక్టర్లు ఆయన ఉద్దేశాన్ని సాగనివ్వలేదు.

ప్రభుత్వం సాధించనిది క్రిష్టియను మిషనరీలు సాధించాయి. క్రిష్టియను మిషనరీలు పాఠశాలలు స్థాపించి ఆంగ్ల విద్యాబోధనను ప్రవేశపెట్టాయి. బెంగాలులో విలియమ్ కారీ మిషనరీ పాఠశాలలను ప్రారంభించాడు. బెంగాలీ భాషలో బైబిలును ప్రచురించాడు. ఆ విధంగా బెంగాలులో ఆంగ్ల విద్యావ్యాప్తికి, బెంగాలీ వచన సాహిత్యానికి ఆయన శ్రీకారం చుట్టాడు. డేవిడ్ హేర్, రాజారామమోహన రాయలు కలకత్తాలో హిందూకాలేజీని స్థాపించారు.

ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయలేకపోయింది. 1813 లోని కంపెనీ ఛార్టరు విద్యావ్యాప్తికోసం ప్రతి సంవత్సరం ఒక లక్ష రూపాయలు కేటాయించాలని ఆదేశించింది. అయితే ఫలితం సున్న. 1823 లో బెంగాల్‌లో 'కమిటీ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్' ఏర్పాటయిందాకా ఏమీ జరగలేదు. అప్పుడు కలకత్తాలో సంస్కృత కళాశాలను స్థాపించాలనే నిర్ణయం జరిగింది. ఉదారభావ ప్రేరితుడైన రాజారామ మోహనరాయ్ దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆయన ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంలో సంప్రదాయ విద్య భారతదేశానికి పనికిరాదన్నాడు.

"The Sanskrit system of education would be the best calculated to keep this country in darkness if such had been the policy of British legislature. But as the improvement of the native population is the object of the government, it will consequently promote a more liberal and enlightened system of instruction, embracing mathematics, natural philosophy chemistry and anatomy..."[10].

'కమిటీ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్'లోనే రెండు వర్గాలేర్పడ్డాయి. 'ఓరియంటలిస్టులు' సంప్రదాయ విద్యకు 'ఆంగ్లిసిస్టులు' ఆంగ్ల విద్యా వ్యాప్తికి పాటుపడాలని వాదించారు. 1834 లో మెకాలే కమిటీ సభ్యుడవటంలో ఆంగ్లిసిస్టులు బలం పుంజుకున్నారు. బెంటింగ్ కూడ ఆంగ్ల విద్యావ్యాప్తికే ఆమోదాన్ని తెలిపాడు. తరువాత లార్డ్ హార్డింజ్ నిర్ణయాలతో ఇంగ్లీషు విద్యావ్యాప్తి మరింతగా ముందుకు సాగింది. 'కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్' వారు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారినే ప్రభుత్వోద్యోగులుగా తీసుకోసాగారు. ఆర్. సి. మజుందార్ ఇలా అన్నాడు "Virtually English education was made the only passport to higher appointments available to the Indians, and hence its popularity and rapid progress were equally assured".[11]

ఆంగ్లవిద్యావ్యాప్తితో పాటుగా, దేశభాషలకు కూడ ప్రాధాన్యత వచ్చింది. 1857 లో భారత దేశంలో మొదటి విశ్వవిద్యాలయం కలకత్తాలో ఏర్పాటయింది 1857-1887 మధ్యకాలంలో యింకా నాలుగు విశ్వవిద్యాలయాలు బొంబాయి, మద్రాసు, లాహోర్, అలహాబాదుల్లో స్థాపింపబడ్డాయి.

ఆంగ్ల విద్యావ్యాప్తి వల్ల బ్రిటీషు ప్రభుత్వానికి కావలసిన దేశీయ ఉద్యోగులు తయారవటమే కాక, ఆంగ్ల పెట్టుబడిదారీ బూర్జువా వర్గపు ఉదారవాదం, స్వేచ్ఛా ప్రియత్వం, ప్రజాస్వామిక భావాలు ప్రచలితమయ్యాయి. తత్ఫలితంగా యూరపులో వచ్చిన భావ విప్లవం భారతదేశంలోను కొనసాగింది.

ఉదారవాదం : సంఘ సంస్కరణ

ఆంగ్ల విద్యావ్యాప్తి వల్ల కలిగిన లాభాలను గూర్చి ఆర్. సి. మజుందార్ ఇలా అన్నాడు.

"The advantages of English education were reaped mostly by the middle-class Hindus. The Hindu aristocracy and the muslim community generally held aloof from it. But although confined to a few, English education produced memorable results. It not only qualified Indians for taking their share in the administration of their country, but it also inspired them with those liberal ideas which were sweeping over England and led to such momentous measures as the Catholic Emancipation Act (1829), the Reform Bill (1832), the Abolition of Slavery (1833), and the New Poor Law (1834)".[12]

ఈ ఉదారవాద ప్రభావమే సంఘ సంస్కరణ రంగంలో కూడ ప్రతిఫలించింది. శిశుహత్య, సతీసహగమనం, బాల్యవివాహాలు, దేవదాసీలు మొదలైన దురాచారాలు దేశంలో ప్రబలంగా ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా సంఘ

సంస్కర్తలు ఉద్యమాలు లేవదీశారు. అప్పటి ప్రభుత్వం 1795, 1802లలో రెండు రెగ్యులేషన్ చట్టాలద్వారా శిశుహత్యా దురాచారాన్ని నిర్మూలించే ప్రయత్నం చేసింది. 1812, 1815, 1817లలో సతీ సహగమనానికి వ్యతిరేకంగా రెగ్యులేషన్లను ప్రవేశపెట్టింది. వీటితో పెద్దగా ఫలితం కలగలేదు. విలియం బెంటింగ్ ప్రవేశపెట్టిన 1829 రెగ్యులేషన్-17 ఈ దురాచారాన్ని నిషేధించింది. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా 1860లోనే చట్టం వచ్చినా 1929లో చైల్డ్‌మారేజ్ రిస్ట్రైంట్ఆక్ట్ (శారదా బిల్) వచ్చిందాకా పెద్ద ప్రభావం కనిపించలేదు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషిఫలితంగా 1856లో వితంతు పునర్వివాహం చట్టబద్ధమయింది. దక్షిణాదిలో ప్రచారంలోఉన్న దేవదాసీ దురాచారానికి వ్యతిరేకంగా ముత్తు లక్ష్మిరెడ్డి ప్రయత్నంతో 1925లో చట్టం వచ్చింది.

బాలికా విద్యావ్యాప్తికి మొదట పాటు పడింది క్రైస్తవ మిషనరీలు. బెంగాలులో బ్రహ్మసమాజం, బొంబాయిలో పార్శీలు ఈ విషయంలో పాటు బడ్డారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 1855-58 మధ్య 40 బాలికా పాఠశాలల్ని స్థాపించాడు. తెలుగుదేశంలో అన్నిరకాల స్త్రీ సమస్యలమీద కందుకూరి వీరేశలింగం కృషిచేశాడు. స్త్రీ జనోద్ధరణకు నడుంకట్టి ఏకైక లక్ష్యంతో పని చేశాడు.

బహుభార్యాత్వం, అంటరానితనం, వరకట్నం మొదలైన దురాచారాలకు వ్యతిరేకంగాకూడా పోరాటం జరిగింది. చట్టాలు వచ్చాయి.

మతం :

ఉదారవాదం మతంపట్ల ప్రజల దురభిమానాన్ని క్రమక్రమంగా తగ్గించింది. మత సంస్కరణ రంగంలో మొదటగా పేర్కొనదగింది 1828 లో రాజారామమోహన రాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజం. విగ్రహారాధనను నిరసించటం, ఏకేశ్వరోపాసన దీని ముఖ్యలక్ష్యాలు. దీనికి వేదమే ప్రమాణం. రాజా రామమోహన రాయ్ ఇంత సంస్కర్త ఐనా చివరివరకు సనాతన బ్రాహ్మణుడుగానే బతికాడు. వేద పఠనం చేసే గదిలోకి అబ్రాహ్మణుల నెవరినీ రానిచ్చేవాడు కాదు. ఈయనకు వారసుడైన కేశవచంద్ర సేను కాలంలో బ్రహ్మసమాజంలో కులాల పట్టింపులు తొలగిపోయాయి. బహిరంగంగా ఆయన వర్ణాంతర వివాహాలను, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు.

ఆంగ్ల విద్యా ప్రభావితుడై మతంలో మానవతా దృష్టిని కనపర్చిన వివేకానందుడు మత సంస్కర్తలలో మరొకడు. ప్రజల దుర్భర దారిద్ర్యానికి, మౌఢ్యానికి ద్రవించిన వివేకానందుడు ముందు పీళ్ళకు కావాల్సింది మతంకాదు, ఆహారం - కనీస భౌతికావసరాలు తీరటం - అని ఎలుగెత్తి చాటాడు.

మత సంస్కరణలో కూడ తెలుగుదేశంలో ఉదార దృక్పథాన్ని ప్రసరించినవాడు కందుకూరి వీరేశలింగం. ఈయన కూడ బ్రహ్మమతావలంబి.

జాతీయ వాదం :

ఎల్.ఎస్.ఎస్. ఓమాలీ జాతీయ వాద ప్రాదుర్భావ విషయంలో అన్న మాటలు అక్షర సత్యాలు.

"One of the most notable consequences of British rule has been the birth and growth of nationalism binding together differnt races and comunities and transcending the barriers caused by a multiplicity of languages, though by no means obliterating the lines of religious cleavage such a spirit did not exist when the British appeared on the Indian scene, and the establishment of their dominion was facilitated by its absence. There was a clan spirit among the Rajputs of Rajaputana, and there were sectional loyalties or regional nationalisms, as among the Marathas and Sikhs but no common all-India Consciousness or Capacity for combined action. Lack of racial, religious and linguistic homogenity militated against solidarity, as also did the lack of means of easy and rapid inter-communication; in all countries with poor means of life tends to be intensely local".[13]

ఆంగ్లేయుల పరిపాలన, భారతీయులనేకత్రితం చేసి జాతీయ భావాలను కల్గించింది. ఐరోపా జాతీయ శక్తులు, భారతీయులలో కూడ జాతీయ భావాలకు స్ఫూర్తి నిచ్చాయి. వాషింగ్టన్, కావర్, మజ్జినీ, బిస్మార్క్, కొస్సూత్, ఎమ్మెట్, పార్నెల్ లాంటి ఐరోపీయులతో పాటు రాణాప్రతాప్‌సింగ్, రామదాస్, గురుగోవింద సింగ్, శివాజీ, టిప్పు సుల్తాన్, ఝాన్సీరాణీల నుండి స్ఫూర్తిని పొందసాగారు.

పాశ్చాత్య రాజకీయ ఉద్యమాల భావాలు, పద్ధతి పదజాలం పుణికిపుచ్చు కోవటమే కాక ఆందోళనకు పాశ్చాత్యులుపయోగించిన ఆయుధాలనే - వార్తా పత్రికలు, ఉపన్యాసాలు, కరపత్రాలు పంచటం, పెద్ద ఎత్తున సమావేశాలు ఏర్పాటు చేయటం, అభ్యర్థనలు పంపటం - చేపట్టారు. పాశ్చాత్యుల ననుకరిస్తూ 'నేషనల్ కాంగ్రెస్' 'హోమ్‌రూల్ లీగ్' లాంటి రాజకీయ సంఘాలు ఏర్పడ్డాయి రష్యన్ నిహిలిస్ట్ వ్యవస్థా పద్ధతులతో టెర్రరిష్టు ఉద్యమం మొదలయింది. రాజకీయ హత్యలకు మజ్జినీ స్ఫూర్తినిచ్చాడు. హింసాకాండకు కొస్సూత్ ఉదాహరణ య్యాడు. 'నేషనల్ కాంగ్రెసు' సభ్యులు తీసుకున్న ప్రమాణం 'అమెరికన్ డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' పదజాలంతో నిండి వుంది.

అవ్యవస్థితులైన జాతీయ వాదులు 1885 లో నేషనల్ కాంగ్రేసు ఏర్పడటంతో వ్యవస్థీకరింపబడ్డారు. దానికి స్ఫూర్తి నిచ్చిన వాడు ఏ. ఓ. హ్యూమ్. అనతి కాలంలోనే కాంగ్రేసులో అతివాద, మితవాద వర్గాలేర్పడ్డాయి. బెంగాలు విభజన (1905) సమయంలో బంకిమ్‌బాబు వందేమాతరం గీతం ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. 1920 ప్రాంతాల్లో మహాత్మాగాంధీ రాజకీయ రంగంలో అడుగిడటంతో జాతీయ భావాలు దేశంలో నలుమూలలకు వ్యాపించాయి.

జాతీయవాదం సాహిత్యంపై చెరగని ముద్ర వేసింది. జాతీయతను ప్రబోధిస్తూ కవితలు, నవలలు వచ్చాయి. పీఠికలు ఈ విషయాన్ని చర్చించాయి.

సామ్యవాదం :

భౌతిక వాద, హేతువాద దృక్పథంతో దేశహితాన్ని కాంక్షించినవారు సామ్యవాదులు. భారతదేశం యిప్పుడు చూడాల్సింది భూతకాలంలో తన గొప్ప

తనాన్ని కాదు, భవిష్యత్తును గూర్చి ఆలోచించాలన్నారు. గాంధీ చర్ఖా ఉద్యమాన్ని నిరసించారు. భారతదేశ భవిష్యత్తు పారిశ్రామికీ కరణలోనే వున్నదనీ ఆర్థిక ప్రగతే అసలైన ప్రగతి అనీ అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని రాజకీయ స్వాతంత్ర్యం నిరర్థకమని వీరి ఉద్దేశం.

ఒక విధంగా కాంగ్రేసులో లెఫ్ట్‌వింగుకు చెందిన వారు జవహర్‌లాల్ నెహూౄ, సుభాష్ చంద్రబోస్‌లు. సామ్యవాద సిద్ధాంతాలు ప్రబలటంతో కార్మిక సంఘాలు వెలిశాయి. ఇవి కార్మికుల మేలుకీ, క్షేమానికీ కృషిచేయ సాగాయి. 1929 లో కమ్యూనిష్టులు కార్మిక సంఘ నాయకత్వాన్ని చేపట్టారు. రష్యా వెళ్ళి కమ్యూనిష్టు సిద్ధాంతాలతో ప్రభావితుడై ఇండియాలో కమ్యూనిష్టులను వ్యవస్థీక రించటం మొదలుపెట్టిన వాడు ఎమ్. ఎన్. రాయ్. బ్రిటిష్ ప్రెస్‌లో వెలువడిన 'మానిఫెస్టో టు ఇండియన్ రివల్యూషనరీస్' రాసిన వారు ఎమ్. ఎన్. రాయ్, అబనీ ముఖర్జీలు. 1921 లో శాస్త్రీయ కమ్యూనిజాన్ని వివరిస్తూ చిన్న పుస్త కాన్ని - 'గాంధీ వర్సెస్ లెనిన్' - శ్రీపాద అమృత డాంగే వెలువరిం చాడు. మే 1922లో డాంగే సారథ్యంలో మొదటి మార్క్సిస్ట్ పత్రిక 'సోషలిస్ట్' వెలువడింది. 1922 లో మాస్కో నుండి తిరిగి వచ్చిన తరువాత వారణాసిలో షౌకత్ ఉస్మానీ కమ్యూనిస్ట్ సంఘాన్ని స్థాపించాడు. గులామ్ హుస్సేన్ నాయ కత్వంలో లాహోర్‌లో మరో సంఘం వెలసింది. వీరి పత్రిక 'ఇంక్విలాబ్'. 1923 లో సింగారవేలు చెట్టియార్ 'లేబర్ - కిసాన్ గజిట్' ప్రచురించ సాగాడు. కమ్యూనిస్టులపై ప్రభుత్వఅత్యాచారాలు మొదలయ్యాయి.భారతీయ కమ్యూనిష్టులను 'బోల్షివిక్' ఏజెంట్లుగా అభివర్ణించటం జరిగింది. 1925లో కాన్పూరులో సింగార వేలు అధ్యక్షతన జరిగిన కమ్యూనిస్టుల సమావేశంలో, బొంబాయి కేంద్రంగా కమ్యూనిష్టుపార్టీ ఆఫ్ ఇండియా అవతరణకు నిర్ణయం తీసుకోవటం జరిగింది.

కార్మిక సంఘాలలో కమ్యూనిష్టుల పలుకుబడి, ప్రాబల్యం పెరిగాయి. వీరి ఆధ్వర్యంలో 1934లో వస్త్ర పరిశ్రమల కార్మికులు మూడు నెలలు చేసిన సమ్మె కార్మిక సంఘాల చరిత్రలో ఓ మైలురాయి. 1934-35లో 'కిసాన్ సభ' ఏర్పాటయింది. కమ్యూనిస్టుపలుకుబడిని గమనించి వారి సహకారం కోరుతూ, శాస్త్రీయ, సామ్యవాద సిద్ధాంతాలతో 1934లో 'కాంగ్రేసు-సోషలిస్టు' పార్టీ ఉద్భ వించింది. దీని నాయకులు జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య నరేంద్ర దేవ్,

అశోక్ మెహతాలు జులై 1942లో బ్రిటిష్ ప్రభుత్వం 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా' ని చట్ట సమ్మతమైనదిగా అంగీకరించింది.

కమ్యూనిష్టులు నిర్వహించిన అన్ని ఉద్యమాల్లోకి చెప్పుకోతగింది 'తెలంగాణా రైతాంగ పోరాటం'. సూర్యాపేటలో మొదలైన ఉద్యమం మొత్తం తెలంగాణాను భగ భగ మండించింది.

కమ్యూనిస్టు, సామ్యవాద సిద్ధాంతాలు సాహిత్యంలో ప్రతిఫలించాయి. దీనితో ఒక కొత్తయుగం మొదలయింది.

ఉదారవాద, జాతియవాద, సామ్యవాద సిద్ధాంతాలు భారతీయ సాహిత్యంలో ప్రతి ఫలించటం :

పైన పేర్కొన్న నేపథ్యంలో భారతీయ సాహిత్యం రూపు రేఖలను దిద్దుకున్నది. భావంలోనే కాక రూపంలో కూడ భారతీయ సాహిత్యం మార్పు పొందింది. ప్రప్రథమంలో అన్ని భాషల్లో సంస్కృత భూయిష్ఠ పదజాలంతో సాహిత్యం వెలువడినా, అది మెల్లమెల్లగా ప్రజా భాషలో (వ్యావహారిక భాషలో) రాసాగింది. భాషలో, రూపంలో, భావంలో నూతన ప్రయోగాలు రాసాగాయి. మతం మెల్లమెల్లగా సాహిత్యం నుండి తన మొహాన్ని చాటు చేసుకోసాగింది.

రూపం, భాష :

ఆంగ్ల కవిత్వంతో ప్రభావితమై భారతీయ సాహిత్యం రూప వైవిధ్యతను పొందింది. 'అమిత్రాక్షర ఛందం' (బ్లాంక్ వర్స్)లో మధుసూదన దత్తు తన మేఘ నాధ వధను రాశాడు. ఇంగ్లిషు సానెట్ రూపం కలిగిన 'చతుర్ దశ పదీ కవిత' కూడా ఆయనే రాశాడు. సంస్కృతంలో ప్రాస నియమం లేకపోయినా, బెంగాలీలో ప్రాస నియమం వుంది. మిల్టను పద్ధతిలో మధుసూదన దత్తు రాసిన 'అమిత్రాక్షర ఛందం'లో ప్రాస నియమాన్ని తోసి రాజన్నాడు. తన చారిత్రక కాల్పనిక, నాటకాలకు గిరీష చంద్ర ఘోష్ వ్యావహారిక భాషకు దగ్గరైన 'అమిత్రాక్షర ఛందా'న్నే వాడాడు. రవీంద్రనాధ టాగూరు ఈయన్నను సరించాడు.

మరాఠీ సాహిత్యంలో కూడ కవితలో రూపవైవిధ్యం కొరవడింది. అది 'బవి' లేక 'ఆర్య వృత్తం'లో కాని, 'అభంగ వృత్తం'లో కాని ఉండేది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఎలిజీలు, సానెట్లు, లిరిక్‌లు కవులు రాయసాగారు.

తెలుగు కవిత్వ రూపంలో కూడా మార్పులు వచ్చాయి. వృత్తాలు పోయి మాత్రా ఛందస్సుకు ప్రాధాన్యత వచ్చింది. గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలు' అని పేరు పెట్టి తనదైన మాత్రా ఛందస్సులో కవిత్వం, అలతి అలతి పదాలతో రాయసాగాడు. భావకవులూ ఈయన్ని అనుసరించారు. తెలుగులో రచనలు వ్యావహారిక భాషలో రావాలని వ్యావహారిక భాషోద్యమాన్ని చేపట్టాడు గిడుగు వేంకట రామమూర్తి. లక్షణానికి లక్ష్యాన్ని సాధించాడు గురజాడ.

ఉదారవాదం స్వేచ్ఛా ప్రియత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని ప్రబోధించింది. దాంతో ఛందోబంధనాలు సడలసాగాయి. ఇది చివరికి వచన కవిత్వానికి దారి తీసింది. భాషకూడ సంస్కృతపు బిగికౌగిలినుండి బయట పడింది. వ్యావహారిక భాషలో రచనలు రాసాగాయి.

భావం : సాహిత్య ప్రక్రియలు :

కవిత్వం : భారతీయ భాషల సాహిత్యాలన్నింటిలోనూ ఈ ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది. బెంగాలీ కవిత్వంలో మధుసూదనదత్తు తన 'మేఘనాథ వధ' కావ్యానికి రామాయణంనుండి కథావస్తువును తీసుకున్నా ఆయన దాన్ని ఆధునికంగా మలిచాడు. మత ప్రమేయంలేని ఇతిహాస కావ్యంగా దాన్ని రచించాడు. ఈ పద్ధతిలో ఆయన్ను అనుసరించినవారు రంగలాల్ బెనర్జీ, హేమచంద్ర బెనర్జీ, నవీన చంద్ర సేనులు, కవిత్వంలో రవీంద్రనాథ టాగూరు ఆంగ్ల కవిత్వంనుండి, రూప సంగ్రహణే కాని భావ సంగ్రహణ చేయలేదు. 'ప్రోగ్రెసివ్ రైటర్స్ ఎసోసియేషన్'లో భాగమై ఆధునిక కవిత్వానికి నాంది పలికినవాడు హరీంద్రనాథ చటోపాధ్యాయ, తరువాత జాతీయ వాదంతో ప్రభావితమైన దేశభక్తి కవిత్వం, సోషలిజం, కమ్యూనిజంతో ప్రభావితమైన విప్లవ కవిత్వమూ రాసాగింది.

ఆంగ్ల భావకవులైన వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్, బైరన్ ఇత్యాదుల కవితలతో ప్రభావితులై రాసిన మరాఠీ కవులలో ప్రముఖులు గోవిందరాజ్, తాంబే, మాధవజూలియన్, ఎన్. వి. ప్రభృతులు, 'రంగారావ్‌హర్షే', 'బంతో పంత్ ఉదాస్' రాసిన చంద్రశేఖర్, మిల్టను 'ల్లెగ్రో' 'ఇల్‌పిన్‌సెరసో'ల పద్ధతిలో రచించాడు.

తమిళ కవులలో 'రాక్షణ్య యాత్రికమ్'ను క్రిష్ణపిళ్లై 'పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్' ఫక్కీలో రాశాడు. మున్సిఫ్ వేదనాయగమ్ పిళ్లై 'పెన్మతి మాలై' 'సర్వ సామాన్య కీర్తనై' లిరికల్ పద్ధతిలో ఆధునిక వస్తువుతో రాసిన కావ్యాలు. సుబ్రహ్మణ్య భారతి 'స్వదేశ గీతా'లు దేశభక్తి ప్రపూరితమైనవి. హిందీ కవిత్వంలో ఆధునికతకు శ్రీకారం చుట్టినవాడు భారతేందు హరిశ్చంద్ర. దేశభక్తి గీతాలు రాసిన మైథిలీశరణ్ గుప్త పేర్కొనదగినకవి. ఆంగ్ల భావకవుల సంప్రదాయంతో ప్రభావితయై 'శోకమే సుఖమను మృదు మానసికచ్ఛాయ ప్రతినిధి'గా మహాదేవి వర్మా కవిత్వం రాసింది. అద్వైత శక్తి, రవీంద్ర, వివేకానందుల ప్రభావంతో వేదాంత సౌరభాన్ని గుప్పించినవాడు 'నిరాలా' నూతన శైలిలో ప్రేమ, సౌందర్యం, ఆనందం ఈ మూడింటిని విషయ సామగ్రిగా గ్రహించి కావ్య రచనలు సాగించాడు జయశంకర ప్రసాద్. ఇంగ్లీషు రొమాంటిక్ కవుల లాగా ప్రకృతి, మానవుల సహజ సుందర రహస్యాత్మక సంబంధాన్ని వ్యక్తీకరించినవాడు సుమిత్రానందన్ పంత్. ప్రేమ, ప్రకృతి, తిరుగుబాటులను కావ్య వస్తువులుగా గ్రహించాడు బాలకృష్ణ శర్మ. దేశభక్తి, స్వాతంత్ర్య పిపాసలతో కూడిన రచనలు చేశాడు రామనరేశ త్రిపాఠీ. కవిత్వాన్ని భావంబర వీధులనుండి కిందకుదించి, పలాయన వాదంకాదని, సామాజిక స్పృహతో కవిత్వం రాయాలని ఉద్దేశించి నడుంకట్టిన వాళ్ళు రామధారీ సింహ దినకర్, నరేంద్ర సుమన్, అంచల్ మొదలయిన వాళ్ళు.

తెలుగు కవిత్వంలో ప్రాచీన పద్ధతి నవలంబించిన తిరుపతి వేంకట కవులు పురాణాలు ప్రబంధాలు రాశారు. ఆంగ్లభావ కవుల ప్రభావంతో కవిత్వం చెప్పినవాళ్ళు తరువాతివాళ్ళు. నవయుగ వైతాళికుడైన గురజాడ అప్పారావు నవ్య కవితకు ప్రస్థానభేరి మ్రోగించాడు. రాయప్రోలు సుబ్బారావు 'లలిత' 'తృణకం

కణకము' లను రచించాడు. ఇట్లా లఘుకావ్యాలను ఈ పద్ధతిలో రాసిన వారిలో అబ్బూరి రామకృష్ణారావు, దువ్వూరి రామిరెడ్డి, జాషువా ముఖ్యులు. దేశభక్తి, అమలిన శృంగారం, శబ్ద మాధుర్యం వీటిలో ప్రధాన లక్షణాలు. 1917 లో నవ్య సాహితీ సమితి ఏర్పడింది. 'సాహితి' అనే పత్రికను ప్రచురించింది. దీనిలోనూ, ఇతర పత్రికలలోనూ చారిత్రాత్మకాలు, ప్రణయ పూరితాలు, భావ బంధురాలైన ఖండ కావ్యాలు వెలువడ్డాయి. ఈ కవుల్లో తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, జాషువా, వేదుల సత్యనారాయణ శాస్త్రి, నాయని సుబ్బారావు మొదలైనవాళ్ళు ముఖ్యులు. నండూరి వేంకట సుబ్బారావు 'ఎంకి పాటలు' వ్యావహారిక భాషలో రాసి ఎంతో సంచలనాన్ని సృష్టించాడు.

జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగించే రచనలు చేసినవారు చాల మంది. దుర్భాక రాజశేఖర శతావధాని 'రాణాప్రతాపసింహ చరిత్ర', గడియారము వేంకట శేషశాస్త్రి 'శివభారతము', జంధ్యాల పాపయ్యశాస్త్రి 'విజయశ్రీ' మొదలైనవి ఈ రంగంలో ముఖ్యమైన రచనలు. 'ఆంధ్ర ప్రశస్తి', 'రాష్ట్ర గానము', 'హంపీ క్షేత్రము', 'ఆంధ్ర పురాణము' మొదలైనవి ఆంధ్రాభిమానాన్ని పెంపొందించే కావ్యాలు. గాంధీ అహింసా సిద్ధాంతంతో ప్రభావితులైన కవులు, ఆయన్ని గూర్చి, ఆయనకు ప్రతీకగా బుద్ధుణ్ణి గూర్చి కావ్యాలు రాయసాగారు. బుద్ధుని జీవితానికి సంబంధించినవి పింగళి కాటూరి కవుల 'సౌందరనందము', సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి 'జాతక కథా గుచ్ఛము'. గాంధీజీ జీవితానికి సంబంధించి రాసిన కావ్యం తుమ్మల సీతారామమూర్తి 'మహాత్మ కథ'. జాషువా హరిజనోద్ధరణాన్ని వస్తువుగా గ్రహించి ఎన్నో ఖండ కావ్యాలు రాశాడు.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత కవితా ప్రయోజనం ఆనందమే కాదనీ, 'సామాజిక స్పృహ' కూడా ఉండాలనీ, సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ విధానాలను నిరసిస్తూ కార్మికుల కర్షకుల కష్టాలను, ధనికుల భూస్వాముల దౌష్ట్యాన్ని ప్రతిబింబిస్తూ సామ్యవాద, కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ఆధునిక కవిత్వం ప్రభవించింది. మహాకవి శ్రీశ్రీ ఈ యుగకర్త. నారాయణ బాబు, ఆరుద్ర, దాశరథి, పఠాభి మొదలైన వారీ మార్గాన్ననుసరించారు కవిత్వంలో

సింబాలిజమ్, డాడాయిజమ్, సర్రియలిజాలు కూడా ప్రవేశించాయి. 'దిగంబర కవులు' కుళ్ళిపోయిన సమాజాన్ని పెకిలివేయాలనే లక్ష్యంతో కవిత్వం రాశారు. విప్లవోద్యమాలకు ప్రతిస్పందించి వచ్చిన విప్లవ కవిత్వోద్యమానికి శ్రీశ్రీ నాయకత్వం వహించాడు.

నవల, కథానిక :

ఈ రెండు ప్రక్రియలూ ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనే భారతీయ భాషల్లోకి అడుగుపెట్టాయి. బెంగాలీలో ఈ రెండు ప్రక్రియలూ 1850 ప్రాంతంలో ప్రారంభమయ్యాయి; బంకించంద్ర చటర్జీ 1864 లోనే 'రాజమోహన్స్ వైఫ్' అనే ఇంగ్లీషు నవల రాశాడు. బెంగాలీలో ఆయన మొదటి నవల 'దుర్గేశనందిని' (1865). బంకింబాబు చారిత్రక నవలలూ, సాంఘిక నవలలూ కూడా రాశాడు. ఆయన 'ఆనందమఠం' లోని వందేమాతరం గీతం జాతీయోద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. రవీంద్రనాథ టాగూరు, శరత్‌చంద్ర చటర్జీ బెంగాలీ నవలా, కథానికా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. పందొమ్మిదో శతాబ్దం తృతీయ పాదంలోనే మరాఠీలో కూడా నవల ప్రారంభమయింది. హెచ్. ఎన్. ఆప్టే నవలా రచనతో మరాఠీ సాహిత్యంలో నూతనాధ్యాయాన్ని సృష్టించాడు. 'కళ కళకోసమే', 'కళ విశ్వశ్రేయస్సుకోసమే' అనే రెండు వర్గాలూ మరాఠీలో నవలారచన చేశాయి. యన్. యస్. ఫడ్కే మొదటి వర్గానికీ వి. ఎస్. ఖండేకర్ ద్వితీయ వర్గానికీ చెందుతారు. హిందీలో మొదటి నవల 'పరీక్షాగురు'. ప్రేమ్ చంద్ ప్రవేశంతో హిందీనవల ఉన్నత పథాలకు పయనించింది. 'గోదాన్' ప్రేంచంద్ సర్వోత్తమ సృష్టి. హిందీ కథానికా సాహిత్యంలో కూడా ప్రేంచంద్ అద్వితీయస్థానాన్ని సంపాదించాడు. జయశంకర ప్రసాద్, జైనేంద్ర, భగవతీ చరణ్ వర్మ, ఇలాచంద్ర జోషీ, అజ్ఞేయ, యశపాల్, రాహుల్ సాంకృత్యాయన్ మొదలైనవాళ్ళు హిందీ నవలా, కథానికా సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. తమిళంలో వేదనాయగం పిళ్లై మొదటినవలాకర్త 1876 లో 'ప్రతాప మొదలియార్ చరిత్రము' అనే నవల రాశాడు. మలయాళంలో 1887 లో గాని మొదటి నవల రాలేదు. 1889 లో ఓ. చందుమీనన్ రాసిన 'ఇందులేఖ'తో మలయాళ నవల వికాసాన్ని పొందింది.

తెలుగులో 1870 దశకంలోనే నవలా రచన ప్రారంభమయింది. కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రే మొదటి సీరియస్ ప్రయత్నం. తొలి నవలాకారుల్లో చిలకమర్తి లక్ష్మీనరసింహం పేర్కొనదగినవాడు. మొదటిదశలో తెలుగు నవలకు సాంఘిక సమస్యలు వస్తువులయ్యాయి. సమాజాన్ని వాస్తవికంగా చిత్రీకరించి, సమస్యల్ని ప్రతిఫలింప జేయడం ప్రధాన లక్ష్యమయింది. తరువాత జాతీయోద్యమం నవలను ప్రభావితం చేసింది. మాలపల్లివంటి నవలలు ఈ నేపథ్యంలోనే వచ్చాయి. జాతీయోద్యమ ప్రభావమే చారిత్రక నవలకు ప్రేరకమయింది. నోరినరసింహశాస్త్రి, అడవి బాపిరాజులు మంచి చారిత్రక నవలలు రాశారు. విశ్వనాథ సత్యనారాయణ, బాపిరాజుల నవలల్లో నాటి సమాజం ప్రతిబింబిస్తుంది. చలం స్త్రీ పురుష సంబంధాల విషయంలో సమాజంలో నెలకొని ఉన్న విలువల్ని ప్రశ్నించాడు. సామ్యవాదభావాల ప్రభావంగా, తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యంలో ప్రగతి శీల నవల ఆవిర్భవించింది. 1950 లలో మనస్తత్వ విశ్లేషణాత్మక నవల గోపీచంద్, బుచ్చిబాబులతో ప్రవేశించింది. 1960 లలో కుటుంబ జీవనం ప్రధాన ఇతి వృత్తంగా అసంఖ్యాకంగా నవలలు వచ్చాయి. వ్యాపార నవలకు కూడా ప్రారంభం ఇదే.

తెలుగు కథానిక 1887 లో గురజాడ అప్పారావు 'దిద్దుబాటు'తో మొదలయింది, శ్రీ పాదసుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, చింతాదీక్షితులు, చలం, విశ్వనాథ సత్యనారాయణ, అడవిబాపిరాజు, మునిమాణిక్యం నరసింహారావు, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బుచ్చిబాబు, మధురాంతకం రాజారాం, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, చాగంటి సోమయాజులు, పాలగుమ్మి పద్మరాజు మొదలైనవాళ్ళు ఎన్నో కథలు రాశారు.

ప్రముఖ భారతీయ భాషలన్నింటిలోనూ నాటకం 1850 తర్వాతే వచ్చింది. మొదట్లో సంస్కృత, ఆంగ్ల నాటకాలకు అనువాదాలు ఎక్కువగా వచ్చాయి. తరువాత స్వతంత్ర నాటకం వచ్చింది. ఆదిలో నవల, కథానిక లాగానే నాటకం కూడా సంఘ సంస్కరణాత్మకంగానే వచ్చింది. కందుకూరి చిలకమర్తుల ప్రహసనాలు ఈ విషయంలో చెప్పుకోదగ్గవి. గురజాడ 'కన్యాశుల్క' నాటకం తెలుగు నాటక చరిత్రలో ఒక ఉన్నత శిఖరాగ్రం. ప్రదర్శన పరంగా తెలుగు

నాటకం తొలిదశ అంతా పౌరాణిక, చారిత్రక నాటకాల దశ. తరువాతి దశలోనే సాంఘిక నాటకం ప్రచారంలోకి వచ్చింది. ఏకాంకికలు ఆంగ్ల సాహిత్యప్రభావం వల్లే వచ్చాయి.

పైన చర్చించిన సాహిత్య ప్రక్రియలే కాక వ్యాసం, జీవిత చరిత్రలు, దేశ చరిత్ర, విమర్శ కూడ ఆంగ్ల సాహిత్య పరిచయంతో, ప్రభావంతో పైన పేర్కొన్న నేపథ్యంలో కొత్త పుంతలు తొక్కి కొంగొత్త మార్గాలననుసరించాయి.

వ్యాపార దృష్టి :

ఈ నేపథ్యంలో గ్రంథ పరిష్కరణ, గ్రంథ రచన సాగుతుండగా, గ్రంథ ప్రచురణలో వ్యాపార దృష్టి మొదలయింది. మొదట్లో ప్రభుత్వం నిఘంటువులు వ్యాకరణం రాయించి ప్రచురింపించింది. క్రైస్తవ మిషనరీలు మత ప్రచారాని కనువైన గ్రంథాలు రాసి ప్రచురించారు. విద్యావ్యాప్తికి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, తదితర గ్రంథ ప్రచురణ చేపట్టింది. క్రమంగా సి.పి. బ్రౌన్ లాంటి మహామహులు పరిష్కృత కావ్య ప్రచురణ మొదలు పెట్టారు. మెల్లగా ప్రైవేటు రంగంలో కూడ ముద్రణాలయాలు వెలిశాయి. మొదట్లో ముద్రాపకులే ప్రచురణ కర్తలు. తరువాత గ్రంథ ప్రచురణ సంస్థలు వెలసి, ముద్రించటం తప్ప మిగతా కార్యక్రమాన్నంతా చేపట్టసాగాయి. రచయితలు సొంతంగాను పుస్తక ప్రచురణ చేయసాగారు. ప్రైవేటు రంగంలో గ్రంథ ప్రచురణ మొదలవటంతో, వ్యాపార దృష్టికూడ ప్రారంభమయింది. దాంతో పుస్తకాలు అమ్ముకోవటానికి సూచికలు (ఎడ్వర్‌టైజ్‌మెంట్స్) రాయటం, ప్రచారం, గ్రంథ ప్రచురణకు సాయ పడిన రాజపోషకులు, మహారాజ పోషకుల జాబితాలు పుస్తకానికి ముందూ, వెనకా అచ్చొత్తించటం, పుస్తక ప్రచురణకు ముందుగానే తక్కువ ధర (ప్రీ- పబ్లికేషన్ ప్రైస్) పేరుతో డబ్బు వసూలు చేయడం, పుస్తకాల నమ్మే వ్యాపార సంస్థలు వెలియటం, పత్రికల్లో పుస్తకాల గూర్చి ప్రకటన లివ్వటం మొదలయింది. గ్రంథ పరిచయం చేసే పీఠికలు ప్రభుత్వ ప్రచురణలతోనే మొదలయి, ప్రైవేటు రంగంలో గ్రంథ ప్రచురణతో నిడివిని పెంచుకొని, అనేక వాద వివాదాలకు తావయ్యాయి. పుస్తక ప్రచురణలోను వ్యాపార దృష్టి ప్రబలి, ఆంగ్ల గ్రంథాల పీఠికల మాదిరి తెలుగు పీఠికలు కూడా వెలువడి అనేక విషయాలు చర్చించ సాగాయి.

ప్రాచీన కావ్యావతారికలకు, ఆధునిక సాహిత్యం లోని పీఠికలకు గల సామ్యవైషమ్యాలు :సాధించిన ప్రయోజనాలు.

రూపం :

ఆధునిక పీఠికలు ప్రారంభ దశలో సంప్రదాయ ఫక్కీలో అక్కడక్కడా అరుదుగా పద్య రూపంలో వచ్చినా, తరువాత్తరువాత వచనమే పీఠికా రచనకు మాధ్యమ మయింది. కొన్ని పీఠికలు సంక్షిప్తంగాను, కొన్ని విస్తృతంగాను, సుదీర్ఘంగాను సాగాయి. గ్రంథంతో సంబంధం లేకుండా విడిగా, గ్రంథానికి ముందుగా ప్రచురింప బడసాగాయి.

భావం : (గ్రంథాంతర్గత సమాచారం)

గ్రంథేతి వృత్తాన్ని చర్చించటం, రసపోషణ, అలంకారాలు, వ్యాకరణాంశాలు, పాత్ర చిత్రణ మొదలయినవి సంప్రదాయ పద్ధతిలో మొదట సాగినా, ఆధునిక నేపథ్యంలో గ్రంథేతి వృత్తాన్ని పరిశీలించటం, అనేక వాదాల దృష్టికోణాల నుండి పరిశీలించడం పాత్ర చిత్రణా చర్చ ఇత్యాదులు ప్రారంభమయ్యాయి.

భావం (గ్రంథేతర సమాచారం) :

నాటక ప్రస్తావనలు, కావ్యావ తారికలు సాధారణంగా కవే రాసేవాడు. కాని ఆధునిక పీఠికలు రచయితా, ముద్రాపకుడూ, పరిష్కర్తా, ప్రచురణకర్తా, లేక మరో పండితుడయినా - ఎవరైనా రాయటం మొదలయింది. ఒకోసారి ఒకే గ్రంథానికి ఇద్దరు ముగ్గురు కూడ పీఠికలు రాయటం జరిగింది.

సాంకేతిక, వైజ్ఞానిక ప్రగతితో మత విశ్వాసం సన్నగిల్లి, దేవతాస్తుతి, ఫలశ్రుతి లాంటి అవతారికా లక్షణాలంతరించాయి. మూలం, మూలకర్తను గూర్చి రాయటం, మూలకర్త కాల నిర్దేశం, చరిత్రాంశాలు, మూలానికి అనువాదానికి గల సామ్యవైషమ్యాల చర్చ సాగింది. గ్రంథాన్ని అంకిత మివ్వటమనే ఫ్యూడల్ భావం కొంత వరకు తగ్గినా ప్రచురంగానే వుంది. అందువల్ల కృతిపతిని గూర్చిన విశేషాలు ఆధునిక పీఠికల్లో కూడా చోటు చేసుకున్నాయి.

స్వతంత్ర రచనలైతే రచయిత తనను గూర్చి తానే రాసుకోసాగాడు. రచయిత తన గ్రంథాన్ని ముద్రించుకోవటంలో పడ్డ కష్టాలను వివరించ సాగాడు. పరిష్కృత గ్రంథమైతే తనకు లభ్యమైన ప్రతి, అది అసంపూర్ణమైతే ఇంకెవరి దగ్గరనైన వుంటే తనకు పంపమని అభ్యర్థించటం, భిన్న ప్రతుల పాఠాంతరాలు, పాఠాంతరాలలో ఏది సమంజసమో చర్చించటం, గ్రంథం శిథిల మైతే దాన్ని పూరించిన విధానం - ఇవన్నీ పీఠికల్లో చోటు చేసుకున్నాయి. ఇవన్నీ ప్రాచీన కావ్యావతారికల్లో నాటకప్రస్తావనల్లో లేని విషయాలు.

ప్రాచీన కావ్యావతారికల్లో కవిత్వాశయమూ, స్వకావ్య ప్రశంస మాత్రమే ఉండేది. పూర్వ కవిస్తుతి, సజ్జన స్తుతి, కుకవినింద, దుర్జన నింద, కావ్య పఠనా ర్హతలకు మాత్రమే పరిమితమై సాగింది. ఆధునిక పీఠికలు నిడివిని పెంచు కుంటూ పోగా కవితా పరామర్శ, కళాసిద్ధాంతాల ప్రతిపాదనలు చోటుచేసు కున్నాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాన్ని పీఠికా కర్తలు చర్చించ సాగారు. గ్రంథ రచనకు, ప్రచురణకు, ముద్రణకు తోడు పడ్డవారికి కృతజ్ఞతలు తెలియ చేయ సాగారు.

సాధించిన ప్రయోజనం :

రాజకీయ, ఆర్థిక, సామాజిక, కళా సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ విమ ర్శిస్తూ, దేశచరిత్రనూ, భాషాచరిత్రనూ, సాహిత్య చరిత్రనూ, సాహిత్య విమ ర్శనూ నిర్మిస్తూ ఆధునిక పీఠికా ప్రస్థానం సాగింది. వీటి నుండే ఆయా అంశాలు బయట పడి దేశ చరిత్ర, భాషాచరిత్ర, సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ విడిగా గ్రంథాలుగా ఏర్పడటానికి వీలు కలిగింది. జన సామాన్యంలో పఠనాసక్తిని పెంచాయి పీఠికలు. విద్యావ్యాప్తికీ తోడుపడ్డాయి. వచనంలో వెలువడటంతో - మరీ ఆధునిక పీఠికలు వ్యావహారిక భాషలో, జనుల భాషలో వెలువడ్డంతో సామాన్య పాఠకునికి ఆయా శాస్త్రాలు చదవక పోయినా రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలు, వాటివల్ల సాహిత్యంలో వచ్చిన మార్పులు అర్థ మవసాగాయి. ఆయా విషయాలను గూర్చిన పరిచయాన్ని పెంచడం ద్వారా పాఠకుల అవగాహనా శక్తిని అభివృద్ధి చేసి తద్వారా సాహిత్యస్థాయి పెరగ డానికి పీఠికలు కారణమయ్యాయి

పరిష్కృత ప్రాచీన కావ్యముద్రణాలు

అకారాది క్రమంతో ఉన్న తొలి తెలుగు నిఘంటువు మామిడి వెంకయ్య 'ఆంధ్ర దీపిక.' ఇది 1806 మే నెలలో పూర్తయింది. ఫోర్ట్ సెయింట్ జార్జి కాలేజీ 1812 లోనే ఈ నిఘంటువును కొని అచ్చువేయాలని తలపెట్టింది. నిఘంటువును సేకరించడమయితే జరిగింది, కాని ముద్రణ కాలేదు. 1965 లో శ్రీ వాసవి గ్రంథ ప్రచారణ సమితి, మచిలీపట్టణం వారు దీన్ని తొలిసారి ప్రచురించారు. రచయిత ఒక శ్లోకంతోనూ, 7 పద్యాలతోనూ ఇష్ట దేవతాస్తుతి (శివస్తుతి) చేసి ఒక్క పద్యంలో తన గురించి చెప్పుకొన్నాడు.

> "నేను మామిడి వంశాంబునిధి విధుండ
> సూరనాహ్వాయు పౌత్రుండ సుజన హితుఁడ
> వేంకనార్యుని పుత్రుండ వినుత యశుఁడ
> వేంకటార్య సమాఖ్యచే వెలయు వాఁడ".[1]

తరువాత వచనంలో తను అంతకు పూర్వమే శబ్దార్థ కల్పతరువనే సంస్కృత నిఘంటువును రచించినట్లు, తెలుగులో పెక్కు నిఘంటువులు లేవనీ ఉన్నవానిలో ఆంధ్రనామ సంగ్రహము చాలా క్లుప్తమనీ మిత్రులైన పండితులు అనేక వ్యాకరణ ఛందో గ్రంథాల పరిచయం కలవాడవు, కాబట్టి తెలుగులో అన్ని పదాలూ కూర్చి ఏకార్థ నానార్థాలతో ఒక గ్రంథం రాయమని కోరినట్లు, దానికి స్వప్నంలో తన గురువు కన్పించి హర్షించినట్లూ, అదే ఈశ్వరానుగ్రహమని తలచి ఆంధ్రదీపిక అనే పేరు గల ఈ గ్రంథాన్ని ప్రారంభించినట్లూ చెప్పుకొన్నాడు.[2] కొంచెం కావ్యధోరణిలో ఉన్నా తెలుగులో ఇదే మొదటి పీఠిక అని చెప్పాలి. తన పూర్వ రచనలు, తెలుగులో ఇటువంటి గ్రంథ రచనావసరమూ తన గ్రంథ ప్రణాళిక అన్నీ చెప్పుకొన్నాడు నిఘంటు కర్త ఇందులో.

ప్రాచీన కావ్యాల పరిష్కృత ప్రచురణల పీఠికలు :

ప్రాచీన కావ్యాలను సంపాదించడం, వాటిని పరిశోధించి పరిష్కరింప జేయడం, టీకలు రాయించటం, ముద్రించడం ప్రారంభించినవాడు ఛార్లెస్

ఫిలిప్ బ్రౌన్. ఆయన సంపాదించిన తాళపత్ర గ్రంథాలకు కాగితపు ప్రతులు రాయించాడు. వాటిని గురించి నోట్స్ రాశాడు. వాటిమీద చిన్న చిన్న వ్యాఖ్యలు రాసుకొన్నాడు. తెలుగు ప్రాచీన సాహిత్య రచలను అంచనావేయడంలో బ్రౌన్ ఆలోచనా ధోరణి వీటినుండి స్పష్టమౌతుంది. బ్రౌన్ ఈ కావ్యాలను ముద్రించడంలో కూడ ఒక ప్రత్యేకత ఉంది. భాష నేర్చుకొనే వారికి ప్రారంభదశలో ఉపయోగపడే గ్రంథాలుగా ఆయన భావించినవి వేమన పద్యాలు, ద్విపద కథా కావ్యాలు వంటివి. అచ్చైన ప్రాచీన తెలుగు సాహిత్య రచనల్లో మొదటిది వేమన పద్యాలే.[3] బ్రౌన్ వేమన పద్యాలలో కొన్నింటిని ఎన్నుకొని వాటిని ఆంగ్లంలోకి అనువదించి, మూలమూ అనువాదంతో కూడా 1829 లో అచ్చువేశాడు. దీనికి 5 పేజీల పీఠికను ఇంగ్లీషులో సంతరించాడు. ఈ పీఠిక 23-11-1824 నాటిది. బహుశా ప్రచురణకు అప్పుడే సిద్ధంచేసి ఉంటాడు. ప్రచురణ ఆలస్యమయి వుంటుంది.

తెలుగు భాషకున్న పటిష్ఠమైన వ్యాకరణ వ్యవస్థనూ, చాలా అభివృద్ధి చెందిన ఛందో వ్యవస్థనూ, తెలుగుభాషా మాధుర్యాన్నీ, సంస్కృత భాషా ప్రభావాన్నీ బ్రౌన్ ఈ పీఠికలో పేర్కొన్నాడు.[4]

18 వ శతాబ్దిలో మహమ్మదీయుల ఆక్రమణవల్ల తెలంగాణాలో సాహిత్య వ్యవసాయం వెనుకపడిందనీ, బ్రిటీషు ప్రభుత్వ పాలనలో పాతికేళ్ళ శాంతియుత జీవనంలో సాహిత్య పునరుజ్జీవనానికి అవకాశం ఏర్పడిందనీ రాశాడు.[5]

వేమన కాపు అనీ, కడపజిల్లా గండికోట అతని జన్మస్థానం కావచ్చుననీ, వేమన పద్యాల రచన 17 వ శతాబ్దం చివరిభాగం కావచ్చుననీ తెలియచేశాడు.[6]

వేమన పద్యాలు కొన్ని తమిళం, మలయాళం, కన్నడాలలోకి అనువాదమయ్యాయనీ, అతని సూక్తులెన్నో సామెతలయ్యాయని వాటిలో కొన్ని హితోపదేశం, భగవద్గీతవంటి సంస్కృత రచనలకు అనువాదాలనీ, వాటిలో కొన్ని పూర్తిగా సంస్కృత శబ్దాలలోనే ఉన్నాయనీ చెప్పాడు.[7]

తనకు తెలుగుభాష, వ్యాకరణం, ఛందస్సు బోధించిన తిప్పాభొట్ల వెంకటశివశాస్త్రి, అద్వైత బ్రహ్మయ్యలను పేర్కొన్నాడు ప్రతుల సంపాదన, పరిష్కరణల గూర్చి తెలియజేశాడు. ప్రతుల అధ్వాన్నస్థితిని పేర్కొన్నాడు.[8]

తొలి పరిష్కృత గ్రంథాల పీఠికలు ఇంగ్లీషులో పరిష్కృత గ్రంథాల పీఠికలను అనుసరించినవే. దీనికి మొదటి పీఠికలు బ్రౌన్ రాసినవే కావడం ఒక కారణం. ఇంగ్లీషులో ఉన్నట్లుగానే గ్రంథాలకు అడ్వర్టైజ్‌మెంట్స్ కూడా తొలిదశలో కనిపిస్తాయి. వీటిని తెలుగులో సూచికలన్నారు. 1841 లో ప్రచురిత మైన నెల్లూరి రాఘవకవి ద్విపద నలచక్రవర్తి కథకు సి. పి. బ్రౌన్ స్వయంగా అడ్వర్టైజ్‌మెంట్ రాశాడు. "The tale of Nala has been written in various metre by different Telugu poets, who have introduced such incidents and employed such a style as the public taste approved. As arranged by the poet Raghava it is remarkably popular, and has been selected for publication because so easy as to suit begginers in the language. A translation has also been prepared which may probably be published"[9] అని భాష నేర్చుకోవడంలో ప్రారంభదశలో ఉన్నవారికి ఉపయోగపడే రచనగా ఆయన దీన్ని అభివర్ణించాడు.

1840 లో ప్రచురితమైన ఆత్మబోధ ప్రకాశిక అనే మత సంబంధమైన గ్రంథానికి తెలుగులో సూచిక ఉంది. ఈ సూచికలో" ... ఈ గ్రంథము సంస్కృత భాషయందే నుండుటవల్ల సాధారణముగా నందరికిన్ని బోధింపబడ నశక్యముగా నున్నందున యిట్టి గ్రంథమును బ్రంహ్మ విద్యా పారంగతులైన పురాణం వేంకటనారాయణ శాస్త్రుల పుత్రులైన కృష్ణశాస్త్రులు తెలిగించి ప్రతి పదమునకున్ను తెలుగులో నర్థమున్ను వెనుక తాత్పర్యమునున్ను వ్రాశి యీ తీరుననే అగస్త్య భాషాప్రవీణులైన రామానుజ కవిరాయల గుండా ద్రావిడ భాషయందున్ను చేయించి వీరిరువర్లును చెంన పట్టణమందు 1840 సంవత్సర మందు నచ్చువేయించిరి"[10] అని గ్రంథరచనా లక్ష్యాన్ని తెల్పడం జరిగింది. దీనికి తమిళంలో కూడా సంక్షిప్తంగా సూచిక ఉంది.

1842 లో అచ్చైన 'The Calamities of Harischandra' with Extracts from the Navanadha Charitra (హరిశ్చంద్ర ద్విపద కావ్యము) కు సి. పి. బ్రౌన్ పీఠిక రాశాడు. ఈ పీఠికలో ఆయన ప్రాచీన తెలుగు సాహిత్యంలోని గ్రంథాలను మూడు వర్గాలుగా విభజించాడు. ఆంగ్లంలో మిల్టన్ రచనలతోనూ, గ్రీకులో పిండార్ రచనలతోనూ పోల్చదగినవి ప్రథమ శ్రేణి రచనలు మనుచరిత్ర, వసుచరిత్ర మొదలైన ఆలంకారిక రచనలు ఈ వర్గానికిచెందినవి. ఆంగ్లంలో బైరన్, పోప్‌ల రచనలతో పోల్చదగిన విజయ విలాసము,అనిరుద్ధ చరిత్ర మొదలైనవి రెండవ శ్రేణికి చెందినవి.వాల్టర్ స్కాట్, గోల్డ్‌స్మిత్, రచనలతో పోల్చదగిన హరిశ్చంద్ర కథవంటివి ద్విపదలో రాసినా, పద్యంలో రాసినా బహు జనాదరణ ఉన్న రచనలు తృతీయ శ్రేణికి చెందినవి. బ్రౌన్ చేసిన ఈ విభాగం క్లాసిక్స్‌ను ఉత్తమ రచనలుగా భావించే దృక్పథం. తెలుగులో ఆయా కావ్యాలను, ఆంగ్ల రచయితల కావ్యాలతో పోల్చి చెప్పడం వల్ల ఈ పీఠిక ప్రధానంగా ఆంగ్లేయుల నుద్దేశించిందనిపిస్తుంది. ఎనిమిది రాత ప్రతులను సంప్రదించి పాఠ నిర్ణయంచేసి తప్పులను సవరించి ప్రచురించినట్లుగా ఆయన పీఠికలో చెప్పుకొన్నాడు. గ్రంథముఖ పత్రంమీదే గౌరన కవికాలం క్రీ. శ. 1600 ప్రాంతం అని ఉంది.[11] వివిధ రాత ప్రతులను సంప్రదించి పరిష్కరణ చేసే ఈ పద్ధతిని తరువాతి పరిష్కర్తలందరూ అవలంబించారు.

1848 లో పోతన ఆంధ్రభాగవతం మొదటిసారి అచ్చైంది. పురాణం హయగ్రీవ శాస్త్రి దీన్ని ప్రచురించాడు. ఆయన దీనికి పీఠిక రాస్తూ ఏకశిలా నగరం అన్న మాటకు ఒంటిమిట్ట అర్థంగా చెప్పి పోతన కడప జిల్లాలోని ఒంటిమిట్ట గ్రామం వాడని రాశాడు.[12] ఇది తరువాత అనేక వాదవివాదాలకు దారితీసింది.

గ్రంథ ప్రచురణోద్యమం :

క్రీ. శ. 1857 కు పూర్వం అచ్చయిన తెలుగు పుస్తకాల సంఖ్యే చాలా పరిమితం. కావ్యాల సంఖ్య మరీ తక్కువ. వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. 1857 కు పూర్వం మద్రాసులో పట్టుమని పది ముద్రణాలయాలు కూడా లేవు. ఆ తర్వాత తెలుగు ముద్రణ కొంత వేగాన్నందుకుంది. సాహిత్యాభిమానులు, రచయితలు, పండితులు ముద్రణాలయాలు నెలకొల్పి గ్రంథ ప్రచురణకు

పూనుకున్నారు. ఈ గ్రంథ ప్రచురణోద్యమం తొలిదశలో వ్యాపార దృక్పథం చాలా తక్కువ. పునరుజ్జీవనంలో భాగంగా తెలుగు గ్రంథ ప్రచురణకు సి. పి. బ్రౌన్ ఇచ్చిన స్ఫూర్తితో, తమ తమ అభిమాన గ్రంథాలను అనేక కష్టనష్టాలకు ఓర్చుకొని ప్రచురణకర్తలు ముద్రణకు పూనుకున్నారు. ఈ కాలంలో జరిగిన గ్రంథ ప్రచురణను వృత్తిగా కంటే ఔత్సాహిక కార్యక్రమంగా గుర్తించవచ్చు. 19 వ శతాబ్దం చివరిదాకా తెలుగు పుస్తకాల ముద్రణకు మద్రాసే ప్రధాన కేంద్రం. క్రమక్రమంగా రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్టణం, గుంటూరు మొదలయిన ఆంధ్ర పట్టణాలలో ముద్రణాలయాలు వెలిశాయి. సుదీర్ఘకాలం అనేక గ్రంథాలను ప్రచురించి ఆంధ్రభాషాసాహిత్యాలకు అపూర్వసేవ లందించిన ప్రచురణ సంస్థలు వెలిశాయి.

వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ :

వావిళ్ళ రామస్వామి శాస్త్రులు క్రీ. శ. 1854 లోనే గ్రంథ ప్రచురణ ప్రారంభించాడు. ఈ సంస్థ నూరేళ్ళకు పైగా వేలాది గ్రంథాలు ప్రచురించింది. తొలిదశలో తెలుగు పుస్తకాలకంటే సంస్కృత గ్రంథాలే ఎక్కువగా ప్రచురించినా రానురాను తెలుగు పుస్తకాల ప్రచురణే ప్రధానమయింది. తెలుగు, సంస్కృతం, తమిళం, ఇంగ్లీషు మొదలైన భాషల్లో అనేక గ్రంథాలు ప్రచురించినా వావిళ్ళ సంస్థ ఆంధ్ర గ్రంథ ప్రచురణకే సంకేతమయింది. వావిళ్ళ సంస్థ ప్రచురించని ప్రాచీనతెలుగు కావ్యం లేదంటే అతిశయోక్తి కాదేమో.

వావిళ్ళ ప్రచురణలలో మొదట కేవలం మూల గ్రంథాల ప్రచురణే ఎక్కువగా జరిగింది. అక్కడక్కడా కొన్ని పుస్తకాలకు మాత్రమే పీఠికలు రాసేవాళ్ళు. ఆ తర్వాత గ్రంథానికి పీఠిక దాదాపు అనివార్యమయింది. వాళ్ళే ఒక గ్రంథాన్ని అనేకసార్లు ముద్రించినప్పుడు భిన్న విద్వాంసులచేత పీఠికలు రాయించారు కూడా. సి. పి. బ్రౌన్ వేసిన బాటలో గ్రంథ పరిష్కరణ కోసం సుప్రసిద్ధ విద్వాంసులను వావిళ్ళ సంస్థ నియమించుకుంది. గ్రంథ పరిష్కరణ, పీఠికా రచనలలో రాయదుర్గం నరసయ్య శాస్త్రి, శేషాద్రి రమణ కవులు, నాగపూడి కుప్పుస్వామయ్య, జనమంచి శేషాద్రి శర్మ, కట్టమంచి రామలింగారెడ్డి, మేడేపల్లి వేంకట రమణాచార్యులు, వేదం లక్ష్మీనారాయణశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, బండారు తమ్మయ్య, నిడుదవోలు వేంకటరావు, బులుసు

వేంకట రమణయ్య, వఝల చిన సీతారామస్వామి శాస్త్రి మొదలైన వాళ్ళు వారివాళ్ళ సంస్థకు తోడ్పడ్డారు. ప్రాచీన పరిష్కృత గ్రంథాల పీఠికల సామాన్య లక్షణాలన్నీ వారివాళ్ళ పీఠికలలో దర్శనమిస్తాయి. కవి, కావ్యాలకు సంబంధించిన విస్తారమైన సమాచారం ఈ పీఠికలలో ఉంటుంది. బండారు తమ్మయ్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, వఝల చిన సీతారామస్వామి శాస్త్రి వంటివారు వారివాళ్ళ ప్రచురణలకు సుదీర్ఘమైన విపుల పీఠికలు రచించారు.

వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్ :

ఈ సంస్థ సుప్రసిద్ధ విద్వాంసుడూ, రచయితా వేదం వేంకటరాయశాస్త్రి స్థాపించింది. ఈ సంస్థ ప్రచురణలలో అధికభాగం వేదం వేంకటరాయశాస్త్రి స్వీయ రచనలే. ఆయన రచించిన వ్యాఖ్యానాలు, విమర్శలు, టీకలు ప్రాధాన్యం వహించాయి. ఆముక్తమాల్యద, శృంగార నైషధము, విజయ విలాసము, సారంగధర చరిత్రము, జ్ఞాన వాసిష్ఠ రామాయణము, పారిజాతాపహరణము, హరిశ్చంద్రోపాఖ్యానము మొదలైన కావ్యాలను ఈ సంస్థ ప్రచురించింది. ఆముక్తమాల్యద, శృంగార నైషధాలకు వేదం వేంకటరాయ శాస్త్రి సంజీవని, సర్వంకష అనే విపులమైన వ్యాఖ్యానాలు రచించాడు. ఈ వ్యాఖ్యానాలకు రచించిన పీఠికలే వేదం వారి కావ్య పీఠికలలో ముఖ్యమైనవి. తక్కిన వాటికి పీఠికలు చాలా చిన్నవి.

ఆనంద ముద్రణాలయము :

ఈ ప్రచురణ సంస్థలో ఆంధ్ర మహాభారతము, శ్రీమదాంధ్ర భాగవతము నిర్వచనోత్తర రామాయణము, మనుచరిత్రము, వసుచరిత్రము, శృంగార నైషధము, సీతారామాంజనేయ సంవాదము మొదలైన కావ్యాలు ప్రచురితమయ్యాయి. తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య, కొమాండూరు అనంతాచార్యులు, రాయదుర్గం నరసయ్య శాస్త్రి, కందుకూరి వీరేశలింగం, నాగపూడి కుప్పుస్వామయ్య ప్రభృతులు పరిష్కర్తలుగా, పీఠికా కర్తలుగా వ్యవహరించారు.

అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వము :

అప్పటికి అముద్రితాలయిన కావ్యాలను ప్రచురించే ఉద్దేశంతో చెలికాని లచ్చారావు అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలో జాహ్నవీ మాహాత్మ్యము, రంగనాథ రామాయణము, శ్రీరంగ మాహాత్మ్యము, విజయ నందన విలాసము, సర్వకామదా పరిణయము, రాఘవ పాండవ యాద వీయము, శ్రీ లక్ష్మీనారాయణ పరిణయము, నారాయణాచల మాహాత్మ్యము, మొదలైన అనేక కావ్యాలు ప్రచురితమయ్యాయి. ఈ ప్రచురణ క్రమంలో మొదటి పది కావ్యాలకూ చెలికాని లచ్చారావు, తరువాతి వాటికి చెలికాని వేంకట ధర్మారావు నాలుగయిదు పేజీలకు మించని పీఠికలు రాశారు.

విస్మృత కవులు :

మానవల్లి రామకృష్ణ కవి విస్మృత కవులు అన్న క్రమంలో కొన్ని కావ్యాలు ప్రచురించాడు. వీటిలో ముఖ్యమైంది రెండు భాగాలుగా అచ్చైన నన్నె చోడుని కుమారసంభవం. క్రీడాభిరామం, నీతిశాస్త్రముక్తావళి, ప్రబంధమణి భూషణము, త్రిపురాంతకోదాహరణము, సకల నీతి సమ్మతము, శ్రీరంగ మాహా త్మ్యములను కూడా పరిష్కరించి పీఠికలు రాసి ముద్రించాడు రామకృష్ణకవి. ఈయన కుమార సంభవ పీఠిక వివాద గ్రస్తమయింది.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు :

గ్రాంథిక భాషావాదాన్ని ప్రచారం చేయడానికి ఏర్పడిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు కూడా ప్రాచీన కావ్యాలను ప్రచురించింది. ఈ సంస్థ తొలి ప్రచురణ చెదలువాడ మల్లయ 'విప్రనారాయణ చరిత్రము'. దీనికి జయంతి రామయ్య, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి పీఠిక రచించారు. రఘునాథరామా యణం, జైమిని భారతం, చంద్రభాను చరిత్రము, నారసింహ పురాణము, కాళింది కన్యా పరిణయము, సాంబోపాఖ్యానము, సింహాసన ద్వాత్రింశిక, శివ రాత్రి మాహాత్మ్యము, రాధికా సాంత్వనము మొదలైనవి వీరి ప్రచురణలు. కొత్త పల్లి సూర్యారావు, ఎన్.వి. జోగారావు, కట్టి సాంబమూర్తి శాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి మొదలైన వాళ్ళు వీటికి పీఠికలు రాశారు.

ఆంధ్ర గ్రంథమాల :

కాశీనాథుని నాగేశ్వరరావు స్థాపించిన గ్రంథమాల ఇది. సకలనీతి సమ్మతము, నవచోళ చరిత్ర, బసవపురాణము, పండితారాధ్య చరిత్రము మొదలయినవి ఈ గ్రంథమాల ప్రచురణలే బసవపురాణానికి వేటూరి ప్రభాకరశాస్త్రి, పండితారాధ్య చరిత్రానికి చిలుకూరి నారాయణరావు రచించిన పీఠికలు విఖ్యాతాలు.

మద్రాసు గవర్నమెంటు ఓరియంటల్ సిరీస్ :

తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయంలోనూ, మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత భాండాగారంలోనూ అముద్రితంగా ఉన్న శాస్త్ర కావ్య గ్రంథాలను ప్రచురించే ప్రయత్నంలో అనేక తెలుగు కావ్యాలను కూడా ప్రచురించడం జరిగింది. కట్టావరదరాజు రామాయణం నాలుగు సంపుటాలుగా, మన్నారుదాస విలాసము, ఉషా పరిణయము, రఘునాథ నాయకాభ్యుదయము. ద్విపద భాగవతము, సకల నీతి కథాసారము, రాజగోపాల విలాసము, కులశేఖర మహీపాల చరిత్ర, బాలభారతము మొదలైన గ్రంథాలను ఈ క్రమంలో ప్రచురించారు. టి. చంద్రశేఖరన్, ఎస్. గోపాలన్, నిడుదవోలు వేంకటరావు, విఠల దేవుని సుందరశర్మ, వాసిష్ఠ ఆ. మహాదేవశాస్త్రి మొదలైన వాళ్లు వీటికి పీఠికలు రచించారు.

మద్రాసు విశ్వవిద్యాలయం కూడా కోరాడ రామకృష్ణయ్య, శ్రీ పాద లక్ష్మీపతిశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతంల పీఠికలతో వల్లభాభ్యుదయము, విష్ణు పురాణము మొదలైనవి ప్రచురించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అనేక ప్రాచీన ప్రబంధాలనూ, మహాభారతాన్ని ప్రచురించింది. "ప్రతి గ్రంథములో గ్రంథకర్తను గూర్చి గ్రంథ ప్రాశస్త్యమును గూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికలను చేర్చవలెనని నిశ్చయించనైనది"[13] అన్నాడు దేవులపల్లి రామానుజరావు. విజయవిలాసము, మనుచరిత్ర, వసుచరిత్ర, సారంగధర చరిత్ర, ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యము, శృంగార నైషధము, పారిజాతాపహరణము, నిర్వచనోత్తర రామాయణము, కేయూర బాహుచరిత్ర, దశకుమార చరిత్ర, భోజరాజీయము, విక్ర

మార్కండేయ చరిత్ర, ఉత్తర హరివంశము, హరివంశము, భారతము, భాగవతము మొదలైన సాహిత్య అకాడమీ ప్రచురణలకు సమకాలంలో ప్రసిద్ధులైన పండితు లంతా పీఠికలు రచించారు. ఈ గ్రంథాలకు నలభై పేజీలన్న నియమం పెట్టు కున్నా అంతకంటే దీర్ఘమైన పీఠికలు కూడా వచ్చాయి. తాపీ ధర్మారావు, విద్వాన్ విశ్వం, పుట్టపర్తి నారాయణాచార్యులు, గడియారం వేంకటశేషశాస్త్రి, దివాకర్ల వేంకటావధాని, ఖండవల్లి లక్ష్మీరంజనం, పాటిబండ మాధవశర్మ, పల్లా దుర్గయ్య, తిమ్మావఝ్ఝల కోదండ రామయ్య, మరుపూరు కోదండ రామరెడ్డి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ మొదలైన వాళ్ళు ఈ పీఠికా కర్తల్లో ఉన్నారు.

ఎం. శేషాచలం అండ్ కంపెనీ :

ఎమెస్కో సంప్రదాయసాహితి పేర ఈ సంస్థ ఆంధ్ర పంచమహా కావ్యా లతో మొదలుపెట్టి ఇరవైకి పైగా కావ్యాలు ప్రచురించింది. "ఈ ప్రాచీన మహా కావ్యాలు కూడ నెంకొకటి చొప్పున సరసమైన ధరలకు అందరికీ అందచేయ డానికీ"14.... "ఈ సంప్రదాయ సాహిత్య ప్రచురణలలో నవసాహిత్యకుల అభిరుచినుద్దీపింపచేసే పీఠికలతో"15 ప్రచురించాలన్నది వీరి ఉద్దేశం. దీనికి అను గుణంగా మొదటి పది ప్రచురణలకు విశ్వనాథ సత్యనారాయణ పీఠికలు రాశాడు. ఈ ప్రచురణలలో విశ్వనాథ పీఠికల గురించీ, ఎమెస్కో పీఠికల గురించీ బి. వి. సింగరాచార్య ఇట్లా చెప్పాడు, "ఎమెస్కో సంప్రదాయ సాహితీ పరం పరలో వెలువడే కావ్యాలకు పీఠికా రచనలో ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. తొలి పది కావ్యాలకు పీఠికలు రచించిన కవిసామ్రాట్టు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు పెట్టిన ఒరవడి అది. మన ప్రాచీన సాహిత్యంతో ఎక్కువ పరిచయంలేని నవరసజ్ఞులకు మన ప్రబంధ సాహిత్యంలో అభిరుచి కల్గించటానికి ఉద్దిష్టమైన ఈ ప్రచురణలకు ఇది ఆవశ్యకమని తోచి, ఆ విధంగా పీఠికలు రచింపచేయడం ఆచారం అయింది. పీఠికల్లో కావ్యంలోని కథను సంగ్రహంగా తెలిపి, అందలి అందాలను ముందుగా పాఠకులకు చవిచూపించటం ఆదినుంచీ ఎమెస్కో సంప్రదాయ సాహితి పద్ధతి"16

తరువాతి పుస్తకాలకు పీఠికలు రాసిన బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు, స్వామి శివశంకరస్వామి, డి. చిన్న కృష్ణయ్య, ఆరుద్ర, బాలాంత్రపునళినీ కాంతరావు, బి. వి. సింగరాచార్య, యామిజాల పద్మనాభస్వామి మొదలైన వాళ్ళు ఈ ఒరవడిలోనే నడిచారు.

ఇతరులు :

వెంకట్రామ గ్రంథమాల ప్రభావతీ ప్రద్యుమ్నము, కాళహస్తి మాహాత్మ్యము మొదలైన గ్రంథాలనూ, శృంగార గ్రంథమాల, శృంగార కావ్య గ్రంథమండలి, పండిత కావ్యగ్రంథమండలి మొదలైనవి క్రీడాభిరామము, అహల్యా సంక్రందనము, రాధికా సాంత్వనము వంటి శృంగార రచనలను ప్రచురించారు. కొండపల్లి వీరవేంకయ్య, అద్దేపల్లి, విశాలాంధ్ర మొదలయిన ప్రచురణ సంస్థలుకూడా కొన్ని కావ్యాలను ప్రచురించాయి.

వ్యక్తులనేకులు అనేక గ్రంథాలను ప్రచురించారు. కందుకూరి వీరేశలింగం దశకుమార చరిత్ర, భోజరాజీయాలను ప్రచురించాడు. హరవిలాసము, నిరంకుశోపాఖ్యానము, కేయూర బాహుచరిత్రము, శ్రీ శకుంతలా పరిణయము, శుకసప్తతి మొదలైన కావ్యాలను చిన్నచిన్న పీఠికలు రచించి రాజా కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావు ప్రచురించాడు. ముక్త్యాల, గద్వాల, వనపర్తి, దోమకొండ మొదలైన సంస్థానాధిపతులు కూడా ఈ గ్రంథ ప్రచురణోద్యమంలో తోడ్పడ్డారు.

అముద్రిత గ్రంథ చింతామణి, సరస్వతి, కవితా పత్రికాధిపతులు అనేక కావ్యాలను పీఠికలతో ప్రచురించారు.

ప్రాచీన కావ్య పీఠికా ప్రస్థానంలో నాలుగు మైలురాళ్ళు :

ఆంధ్ర వాఙ్మయంలో ప్రధానమైన ప్రాచీన రచనలన్నీ దాదాపుగా ప్రముఖ పండితుల, పరిశోధకుల పీఠికలతో వెలుగు చూడడం ఆయా గ్రంథాల గురించి తెలుసుకోవడానికి తోడ్పడింది. ఒకే గ్రంథం అనేక ప్రచురణలు భిన్న విద్వాంసుల పీఠికలతో వెలువడడం మరిన్ని విశేషాలు వెల్లడి కావడానికి దోహదం చేసింది. ప్రాచీన కావ్య ప్రచురణల పీఠికలలో మైలురాళ్ళని చెప్పదగ్గ పీఠికలను కొంచెం విపులంగా పరిశీలించి, పరిష్కృత గ్రంథాల పీఠికల సామాన్య లక్షణాలనూ, వాటిలో చర్చకు వచ్చిన కొన్ని ప్రధానాంశాలనూ పేర్కొంటాను.

ప్రాచీన సంస్కృత గ్రంథాల పీఠికలలో నన్నెచోడుని కుమారసంభవానికి మానవల్లి రామకృష్ణకవి పీఠికా, పల్నాటి వీరచరిత్రకు అక్కిరాజు ఉమాకాంతం పీఠికా, కళాపూర్ణోదయానికి కట్టమంచి రామలింగారెడ్డి పీఠికా, పండితారాధ్య చరిత్రకు చిలుకూరి నారాయణరావు పీఠికా ఈ పరిశీలనకు విషయంగా తీసుకోవడం జరిగింది.

మానవల్లి రామకృష్ణకవి తొలిసారిగా కుమారసంభవ కావ్యాన్ని వెలుగులోకి తెచ్చాడు. నన్నెచోడ కవి కాలనిర్ణయం ఎంతో చర్చకు తావిచ్చింది. కవి కాలనిర్ణయంలో శాసనాది చారిత్రకాధారాలు, భాషాఛందోరూపాలు ప్రమాణంగా తీసుకోవడం జరిగింది. ఆ విధంగా కుమార సంభవ పీఠిక ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నది.

చరిత్ర సత్యాలను వెలికితీయడానికి మూలాధారాలను విస్తృతంగా పరిశీలించడమేగాక వాటిని సమర్థవంతంగా వ్యాఖ్యానించడంలోనూ, భాషా సాహిత్య సిద్ధాంతాలకు సంబంధించి దృఢమైన అభిప్రాయాలను ప్రకటించడంలోనూ, వాటిని తర్కబద్ధంగా నిరూపించడంలోనూ, చూపించిన నైపుణ్యానికి అక్కిరాజు ఉమాకాంతం "పల్నాటి వీరచరిత్ర" భూమికలు ఉదాహరణప్రాయాలు.

తెలుగులో కవిత్వేతర (కృతికర్త, కృతిభర్త, కాలం, ప్రాంతం, మతాచారాలు మొ॥) విషయాలను ఏ మాత్రమూ స్పృశించకుండా కేవలం. కవిత్వ తత్వాన్నే పరిశీలించిన తొలిపీఠిక కట్టమంచి రామలింగారెడ్డి కళాపూర్ణోదయ పీఠిక. ఈ సంప్రదాయాన్ని పాటించిన పీఠికలు తరువాతి కాలంలో కూడా చాలా అరుదు.

కేవలం కవిత్వేతర విషయాల చర్చే ఎంత సుదీర్ఘంగా చేయవచ్చో అన్నది చిలుకూరి నారాయణరావు పండితారాధ్య చరిత్ర పీఠిక నిరూపిస్తుంది. ఒక కవి దేశం, కాలం, మతాచారాలు, భాషావిశేషాలు మొదలైన అంశాల చర్చ ఇందులో విస్తృతంగా జరిగింది. ముఖ్యంగా భాషాఛందో విశేషాలు చాలా చోటు ఆక్రమించుకొన్నాయి పూర్వ పీఠికలలో ఇతరులు చెప్పిన విషయాలపై విమర్శ కూడా ఇందులో ఉంది. ఈ విధంగా దానికొక ప్రత్యేకత చేకూరింది.

పై కారణాల వల్లనే ఈ నాలుగు పీఠికలను ప్రతినిధులుగా ఎన్నుకోవడం జరిగింది.

కుమార సంభవ పీఠిక :

కుమార సంభవ కావ్యాన్ని వెలుగులోకి తెచ్చింది మానవల్లి రామకృష్ణ కవి. తమ విస్మృత కవులు అన్న క్రమంలో రెండో గ్రంథంగా 1909 లో కుమార సంభవం మొదటి భాగాన్ని రామకృష్ణకవి తొలిసారిగా ప్రకటించాడు. ఈ భాగం ఏడు ఆశ్వాసాలు (సుమారు వేయి గద్య పద్యాలు) ఈ గ్రంథ ప్రకటన తెలుగు సాహిత్యలోకంలో ఒక సంచలనాన్ని కలిగించింది. అయితే యీ సంచలనానికి గ్రంథ గుణదోషాలు అంతగా కారణంకాదు. గ్రంథ పీఠికలో "ఇతడు (నన్నెచోడుడు) క్రీ.శ. 940 లో పాశ్చాత్య చాళుక్యులతో యుద్ధముచేసి రణరంగమున నిహతుడయ్యెను" అని రామకృష్ణకవి రాయడమే సంచలనానికి హేతువు. నన్నె చోడుడు క్రీ.శ. 940 లో రణ నిహతుడయ్యాడంటే అతని కుమారసంభవ కావ్యరచన నన్నయ ఆంధ్రభారత రచన కంటే కనీసం నూరేళ్ళు ముందు జరిగి ఉండాలి. తెలుగు సాహిత్యానికి నన్నయే ఆదికవి అని నమ్ముతూ ఉండిన ఆంధ్రసాహిత్య లోకం నివ్వెరబోయింది. గ్రంథ ప్రచురణ పూర్తి కాకమునుపే దీన్నిగూర్చి వదంతులు బయలుదేరాయి. పీఠికలో "ఈ కృతి నన్నయభట్టుకంటె నూరేండ్లు పూర్వము దైనను 1000 సంవత్సరాలుగా నెవ్వరును గుర్తెఱుంగక యుండ దటస్థింపదనియు దీనిని నేనో మఱి యెవ్వరో రచించి గ్రంథ ప్రాశస్త్యమునకై ప్రాచీనుల పేర వ్యవహరింపబడెననియు గ్రంథమును ప్రచురింపక మునుపే యొక వార్త పుట్టినది" అని రామకృష్ణ కవే అన్నాడు. ఇది ప్రధానచర్చనీయాంశమై మొన్న మొన్నటిదాకా వ్యాసాలు, గ్రంథాలు, పీఠికలూ వచ్చాయి. నన్నెచోడుడి కర్తృత్వాన్ని గురించిన చర్చ స్వల్పమే గాని, కాలాన్ని గురించిన చర్చమాత్రం విపరీతంగా జరిగింది. మానవల్లి కవి వాదాన్ని సమర్థించినవారు కొందరయితే, నన్నెచోడుడు నన్నయ తిక్కనల నడిమి వాడనీ, తిక్కనకు కూడా చాలా అర్వాచీనుడనీ వాదాలు చేశారు మరికొందరు. ప్రస్తుతం స్థూలంగా నన్నయ తిక్కనల నడిమి కాలమన్న అంగీకారమే కనిపిస్తుంది. నన్నెచోడుని కర్తృత్వ విషయాన్ని అంగీకరించినవారే ఎక్కువ. మానవల్లి కవికి కర్తృత్వాన్ని ఆపాదించినవారు తక్కువే అయినా ఈ వాదాన్ని ఇప్పటికీ తిరుగదోడుతూ ఉండడం కనిపిస్తూనే ఉంది.[17]

గ్రంథం ప్రాచీనమని నిరూపించడానికి లక్షణకారులుదాహరించిన పద్యాలనూ, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, జక్కన మొదలైన కవులు అనుకరించిన పద్యాలనూ రామకృష్ణ కవి ఉదాహరించాడు. నన్నెచోడునిలో భాషా ప్రాచీన రూపాల ప్రయోగాలను చూపించాడు. కృతిపతి కృతి నాయకులకు అభేదం చెప్పడంలో కన్నడ సంప్రదాయాన్ని పేర్కొన్నాడు.

"నన్నెచోడుని కుమార సంభవము నానా విధాలంకారములకును, నపూర్వ వ్యాకరణ లక్షణములకును, కొన్ని శబ్ద చిత్రములకును, భావ వ్యంగ్య ధ్వనులకును లక్ష్యము లిచ్చుటయందు ప్రథమ గణ్యముగా నున్నది" అని మాత్రమే నన్నెచోడుని కవిత్వ శైలిని గురించి రామకృష్ణకవి చెప్పిన మాటలు. సర్వజ్ఞత్వంలో తిక్కన, నాచన సోమన, ఎఱ్ఱనలతో పోల్చాడు.

కుమారసంభవం ద్వితీయ భాగాన్ని రామకృష్ణకవి 1914 లో ప్రకటించాడు. ఈ ద్వితీయ భాగ పీఠికలో నన్నెచోడుని కాలాన్ని నిర్ణయించడానికి అనేక శాసన, మత విషయక ప్రమాణాలను ఆధారంగా తీసుకున్నాడు. "పైన చెప్పిన యంశములనన్నియు క్రోడీకరించి చూడగా నన్నెచోడు డొరయూరి నేలుచున్నవాడనియు బాకనాటి నేలుచుండి కృష్ణాతటమున క్రీ.శ. 902లో శాసనములో పేర్కొనబడిన చోడబల్లి కుమారుడనియు విక్రమ కేసరి సంభావించిన మల్లికార్జుననకు శిష్యుడనియు వనవాసి దేశపు చాళుక్య సామంతులలో యుద్ధము చేసి మృతి చెందియుండ వచ్చుననియు..." నా మనస్సునకుద్బోధన మగుచున్నదన్నాడు.

"ఇక నన్నెచోడుడు నన్నయ భట్టారులకంటె ప్రాచీన తరుడని కుమార సంభవములోని వ్యాకరణ ఛందో విశేషా పూర్వ పద ప్రయోగములు సహస్ర ముఖముల ఘోషించుచున్నవి" అంటూ ఆయా ప్రయోగాలను నిరూపించాడు. అనుబంధంలో ప్రాచీన ప్రయోగాలను సాధించే సూత్రాలను, లఘుటీకను, ముఖ్యపాఠభేదాలను, వ్యాఖ్యానంలో ఉదాహరించిన గ్రంథాల పట్టికను ఇచ్చాడు.

ఒక కవి కాలాన్ని నిర్ణయించేందుకు భాషా, ఛందో ప్రయోగ ప్రాచీనతను ఆధారంగా గ్రహించిన తొలిపీఠికగా ఈ పీఠికను గుర్తించవచ్చు. కవి దేశకాలాదులను గూర్చిన చర్చలు అంతకు ముందటి పీఠికలలో కూడా కనిపిస్తున్నప్ప

టికీ ఇంత విస్తారమైన చారిత్రక పరిశీలన లేదనే చెప్పాలి. శాసన పరిశోధన, గ్రంథ అంతస్సాక్ష్యాల పరిశీలన, సమకాలీన అర్వాచీన గ్రంథాధారాల పరిశీలనాదుల దృష్ట్యా చారిత్రక సత్యాన్ని స్థాపించే ప్రయత్నం బృహద్రూపంలో మనకు మొదట దర్శనమిచ్చేది మానవల్లి రామకృష్ణకవి పీఠికలలోనే. శాసనాదుల మౌలిక పరిశీలన, పరిశోధన సాహిత్య చరిత్ర దృష్ట్యా ఈయనతోనే బహుళ ప్రచారంలోకి వచ్చింది.

పల్నాటి వీర చరిత్ర పీఠిక :

ప్రాచీన కావ్య పీఠికలకు సంబంధించి విశిష్టమయిన పీఠికలలో అక్కిరాజు ఉమాకాంతం పల్నాటి వీరచరిత్ర భూమికకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ గ్రంథం రెండు ప్రచురణలకూ రెండు భూమికలు ఆయన రాశాడు. తెలుగు భూమికలలోని ప్రధానాంశాలను ఇంగ్లీషులో ఇంట్రడక్షన్స్‌గా రచించాడు. పల్నాటి వీరచరిత్ర మొదటి ప్రచురణ 1911 నాటిది. రెండవ ప్రచురణ 1938 నాటిది. ఉమాకాంతం భూమికలలో ప్రధాన విషయమైన పల్నాటి వీరచరిత్రకు సంబంధించిన అనేకాంశాలతోపాటు అవాంతర విషయాలనేకం చోటు చేసుకోవడం వల్ల వాటి పరిమాణం కూడా పెద్దదే అయింది. ప్రథమ భూమిక 82 పేజీలు, ద్వితీయ భూమిక 96 పేజీలు ఉంది. ప్రథమ భూమికలో పలనాడు శబ్దచర్చ వివరంగా ఉంది. "ఈ సీమ యున్నతములయిన కొండలచే జుట్టు నావరింపబడి నడుమ బల్లముగా నుండుటవలన 'పల్లునాడు' నాబేరొంది 'పల్లునాడు' పల్లు, విల్లు, ముల్లు శబ్దంబులంబోలె జడ్డకు లోపంబు రాగా 'పలునాడు' గా మారి 'పలునాడు' కొద్ది మార్పుచెంది, పలనాడై, పలనాడు పల్నాడై 'పలనాడు' 'పల్నాడు' అను రెండు రూపములు మాత్రము వ్యవరింపబడుచూ వచ్చెనని నా యభిప్రాయము" (పల్నాటి వీరచరిత్ర ప్ర. భూమిక) వీరులంటే ఎవరో చర్చించాడు. వీరచరిత్రకు సంబంధించిన చారిత్రకాంశాలు కాలము, హైహయులు, వారి మూలము మొదలైన అంశాలను శాసనాలు, కావ్యాలు, చరిత్రకారుల రాతలు ఆధారంగా సుదీర్ఘమైన పరిశీలనచేసి నిర్ణయించాడు. పల్నాటియుద్ధ కాలం క్రీ. శ. 1178-82 మధ్య అని నిర్ణయించాడు. అక్కిరాజు ఉమాకాంతం ప్రచండమైన తార్కికుడు. ఆయన వాదం హేతుబద్ధంగానూ, చాలా కురుకుగానూ

ఉంటుంది.చరిత్ర విషయంలో,సాహిత్యం విషయంలో,విద్యవిషయంలో. స్వతంత్ర భావాల విషయంలో స్పష్టమైన అభిప్రాయాలు ఆయనవి జాత్యభిమానం ఎక్కువ. శ్రీనాథ జీవిత సంగ్రహమన్న ఉపశీర్షిక కింద ప్రథమ భూమికలో శ్రీనాథుని రచనలను పరిశీలించాడు. శ్రీనాథుని జీవితాన్ని గురించి వివరాలు చెప్తూ శ్రీనాథుని జన్మభూమి కర్ణాటక దేశమని ఉపపత్తులు చూపించాడు. శ్రీనాథుని రచనల కాలాన్ని పరిశీలించాడు. ఆయన చాటు పద్యాలను "దీనారటంకాల తీర్థమాడించితి..." మొదలైన వాటిని ఉదహరించాడు. తెలుగుకవుల అనువాద విధానం విషయంలో ఉమాకాంతానికి తిరుగులేని గాఢాభిప్రాయాలున్నాయి. మూల విరుద్ధత గానీ, భేదం గానీ అనువాదంలో ఉండరాదన్నది ఆయన అభిప్రాయం. శ్రీనాథుడు తన అనువాదంలో చూపించిన మూల అవిధేయతను ఉమాకాంతం హర్షించలేదు. ఈ విషయంలో తెలుగు కవులంతా ఆయనకు ఒక్కటే. తెలుగు కవిత్వం అధమ మార్గాలకు ప్రాకిందన్నది ఆయన అభిప్రాయం. పల్నాటి వీరచరిత్ర ద్వితీయా వృత్తి సమయంలో ప్రథమ భూమికకు చేర్చిన ఒక గచ్ఛద్వ్యాఖ్యలో "కావ్యాస్వాదానికి అనుకూలమై రస ప్రలుబ్ధమైన బుద్ధి యొక్క వినాశం అధికంగా తెలుగు దేశంలో తెలుగు పద్యకర్తల్లో నన్నయ కాలం నుండే ఆరంభమై శ్రీనాథుడి సమయం వరకు సమగ్రతను సమీపించినట్లు కనబడుతున్నది. కనుకనే కాళిదాసు రఘువంశాది కావ్యాలుండగా వాటినుపేక్షించి తదపేక్షచేత, అధమ కావ్యమనదగిన నైషధం మీదికి అతడి దృష్టి పోయి 'కవికులాదృష్టాధ్వపాంథుండు' అని శ్రీహర్షుణ్ణి పొగడి వుంటాడు...... ఇట్లానే పింగళి సూరన్న శుష్కమైనశ్లేష పద్యరచనకు ఆశ పడ్డాడు. ఈ తీరుగా కాల ప్రభావం, నన్నయ పద్యం యొక్క దుర్గుణాలయిన వళి ప్రాసల చెత్త, అణచి వేస్తున్నప్పటికీ శ్రీనాథుడు, పింగళి సూరన అక్కడక్కడ వాటిని అతిక్రమించి నిసర్గ కవితా పరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వీరిద్దరిలో భావ సౌకుమార్యాదుల్లో పింగళి సూరన్న మేలనవచ్చును. మరికి పద్యాలకు వీరు బలికాకుంటే వీరివల్ల తెలుగుదేశాని కెంత ప్రకృష్టమైన కృతులు లభించి ఉండేవో అని సంభావిస్తుంటాను" అన్నాడు (పు. 53, 54). కావ్యమంతా ఒకే ఛందంలోనే రాయాలి, కనీసం ఆశ్వాసమంతానైనా ఏక ఛందంలో రాయాలన్నది ఉమాకాంతం అభిప్రాయం. "తెలుగు వారట్లు (సంస్కృతాంగ్ల కవులట్లు) గాక యొక యాశ్వాసముననే బహు విధ వృత్తములు, జాతులు, నుపజాతులు

వ్రాయు దురభ్యాసము కలిగి యున్నారు" అని రాస్తూ తమ వాదానికి సమర్థనగా విశ్వనాథుణ్ణి, అరిష్టాటిల్ని ఉట్టంకించాడు. వీరచరిత్ర సాహిత్య లక్షణాలను బట్టి ఉదాత్త రచన కాదనే ఆయన అభిప్రాయం. అయినా అందులోని విశేషాలను ద్వితీయ భూమికలో "కాళిదాసీ యాదుల్లోవలె ఉత్తమ కవితా స్వరూపం వీర చరిత్రలో లేకున్నప్పటికీ అది శ్రీనాథుడి కృతుల్లోనే కాక తెలుగు వాఙ్మయ మంతటిలో విశిష్టమైనదిగా కనబడుతున్నది. దీంట్లో ద్వితీయాక్షరపు ఆట లేక పోవడం వల్ల సగం తుక్కు వదలడం మొదటి విశేషం. ఇది తెలుగు సాంప్ర దాయానికి సరిపడని సంస్కృత వృత్తాలైన శార్దూల మత్తేభాదుల్లో కాక దేశ్య పద్యంలో బసవ పురాణాదుల వలె వుండడం రెండవ విశేషం. అనువాదం కాక మూల గ్రంథంగా వుండడం మూడవ విశేషం. మనకు సన్నిహితమైన స్థలాలు మహాశూర నిలయాలై నిద్రించే ఆంధ్రుల్లో వీరత్వాదులను ప్రబోధిస్తూ ఇందు కార్య రంగాలుగా వుండడం నాల్గవ విశేషం. వీరగీతాలనే వాఙ్మయశాఖ యందిది ప్రథమ గణ్యమై వుండడం ఐదవ విశేషం" అని పేర్కొన్నాడు (పు. 36, 37). "పల్నాటి వీరచరిత్ర కొన్ని మహా ప్రబంధలక్షణాలుగల మూలగ్రంథం. నన్నయ భారతాదులవలె అనువాదం గాని, హంస వింశత్యాదుల వలె క్షుద్రవృత్త బాహుళ్యంగల పుక్కిటి పురాణం గాని, మనుచరిత్రాదులవలె పూర్వ కథా విశిష్టం గాని, కానటువంటి ఒక అపూర్వ కృతి" అనిఅభివర్ణించాడు (పు. 6).

తన అభిప్రాయాల విషయంలో ఎంత పట్టుదల ఉన్నా అవి న్యాయం కావని అనుకొన్నప్పుడు మార్చుకోవడానికి ఉమాకాంతం వెనుదీయలేదు. "... కాదని యెవ్వరైనా ఋజువుపరిచితే ఆ మాటలు ప్రామాణికంగా వుంటే నా సిద్ధాంతాన్ని వదులుకుంటానని లేకపోతే ఆ మాటలను ఉపేక్షిస్తానని" అన్నాడు (పు - 35).

భాష విషయంలో మొదటి ప్రచురణ కాలానికి, రెండో ప్రచురణకాలానికి ఆయన ఆలోచనలో మార్పు వచ్చింది. "మొదటిసారి ముద్రితమైన పల్నాటి వీరచరిత్రలో వున్న అరసున్నాలు, బండిరాలు, భాషా ప్రవాహంలో లేని అనావశ్యక గజడదబసవలు మొదలైనవి, నేను చేర్చినవేను. ఇవి మూల

గ్రంథంలో లేవు. ఇవి లేకుంటే తెలుగు గ్రంథం కాదనుకొనే దశలో ఛాందస మార్గాన్ని అనుసరించి వాటిని చేర్చాను ఈ అకార్యానికి ప్రాయశ్చిత్త రూపంగా వాటి నిపుడు తొలగించాను" అన్నాడు.

తెలుగు వాఙ్మయం నానాదశలను విశ్లేషిస్తూ ఆంధ్రులు కాకతీయులు, రెడ్ల పరిపాలనలో తప్ప ఎప్పుడూ దాస్యంలోనే ఉన్నారనీ అందుకే వాళ్ళ సాహిత్యం కూడా అధమ దశలోనే ఉందన్నాడు. కాకతీయుల, రెడ్ల కాలంలోనే తెలుగు సాహిత్యం కొంత పై చూపుచూచిందని తర్వాత మళ్ళీ కిందిచూపేననీ ఉమాకాంతం విశ్లేషణ. తెలుగు ఎప్పుడూ విద్యావాహికగా ఉండకపోవడమే అందుకు ప్రధాన హేతువని ఆయన నిష్కర్ష.

ప్రసంగవశాన ఈ పీఠికలో అనేక విషయాలు చోటుచేసుకొన్నాయి. ఉదాహరణకు శ్రీనాథుడు కర్ణాటకుడని చెప్తూ, నన్నయకూడా ఆంధ్రుడు కాదనీ, తమిళుడనీ చెప్పాడు. ప్రమాణంగా అనేక భాషా ప్రయోగాలు చూపించాడు. తిక్కన విరాటపర్వంలో రసాభాసం గురించి; భగవద్గీత అనువదింపకపోవడానికి కారణాలను గురించి ప్రసంగించాడు. ఆంధ్రుల జాతీయాభిమాన రాహిత్యాన్ని గురించి విస్తారంగా విచారించాడు. ప్రబంధం కావ్య పర్యాయ వాచకమే తప్ప, అందులో విశిష్టత లేదని నిరూపించాడు.

గ్రంథారంభంలో ఉమాకాంతం అధికారి నిరూపణం చేశాడు. "కాళిదాసాదుల ఉత్తమ కావ్యాలు పఠించి, శాస్త్ర పరిచయం, సాహిత్య విచారణలో ఆవశ్యక ప్రజ్ఞ, మహాపురుషారాధన తత్పరత్వం కలిగి ఇతిహాస జిజ్ఞాసువులైన వారు ఈ కృతి శ్రవణమందు పూర్ణాధికారులు తక్కినవారికి ఉపదేశాన్ని అనుసరించి బోధోపలబ్ధి. కేవల వినోదం కోసం వినేవారు అధమాధికారులు". తెలుగు సాహిత్యమంతా ఈ అధమాధికారులకోసం ఉద్దేశించిందేనని ఆయన అభిప్రాయం. అది పూర్ణాధికారులు లేక ఉత్తమాధికారుల కోసం ఉద్దేశించాలనీ, అధమాధికారుల్ని ఉత్తమాధికారులుగా మార్చగలిగేదిగా ఉండాలనీ అప్పుడే భాష, జాతి, సాహిత్యాలు సమున్నతిని పొందుతాయని ఉమాకాంతం ఆశయం.

కొన్ని విషయాలలో భేదాభిప్రాయాలున్నా ద్వ్యర్థి, త్ర్యర్థి కావ్యాలు, నిర్వచన, నిరోష్ఠ్య, శుద్ధాంధ్ర కావ్యాలు, చిత్రబంధకవిత్వాలు, క్షుద్ర ప్రబంధాలు, ఆశు కవిత్వం, అవధానాలు నిరర్థకాలన్న విషయంలోనూ, కవిత్వం ఉదాత్తమైనది

కావాలన్న విషయంలోనూ, ఉత్తమ సాహిత్యసృష్టికి స్వతంత్రమూ, స్వజాత్యభిమానము ఉన్నజాతి అవసరమన్న విషయంలోనూ ఉమాకాంతం దృష్టి, కట్టమంచి రామలింగారెడ్డి దృష్టి ఒక్కటే.

కళాపూర్ణోదయ పీఠిక :

ప్రాచీన కావ్యాల పీఠికలలో ప్రత్యేకంగా పేర్కొనదగింది కట్టమంచి రామలింగారెడ్డి కళాపూర్ణోదయానికి రాసిన పీఠిక. కవిత్వతత్త్వ విచారమే ప్రధానంగా సాగిన ఈ పీఠిక విశిష్టమైంది. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు కట్టమంచి రామలింగారెడ్డిని పితామహునిగా చెప్పడం జరుగుతున్నది. ఆయన కవిత్వతత్త్వ విచారము ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యమంటున్నారు. ఈ విషయంలో వింజమూరి రంగాచార్యుల 'పింగళి సూరనార్యుడు' కట్టమంచి రచన కన్నా కొంచెం ముందే వచ్చింది, కాబట్టి అది తొలి అనే వాళ్ళూ ఉన్నారు. ఏది తొలి అయినా తరువాతి విమర్శకులందరి మీదా ప్రభావాన్ని చూపించింది కవిత్వ తత్త్వ విచారమే ననడంలో సందేహం లేదు. దీనికి ప్రాధాన్యం రావడానికి సాహిత్యేతర కారణాలను చూపించిన వారున్నారు. దూషణలు వచ్చినా, భూషణలు వచ్చినా ఈ రచనకే గుర్తింపు. తరువాతి విమర్శకులలో ఆధునిక భావాలు గల వారికి ఇదే మార్గదర్శకమయిందనడంలో సందేహం లేదు. ఆనాటి భావకవులకు ప్రేరణ నిచ్చిందనడంలోనూ సందేహం లేదు. కళాపూర్ణోదయ పీఠిక ఈ కవిత్వ తత్త్వ విచారానికి సంక్షిప్తరూపం. కవిత్వతత్త్వ విచారంలో ప్రభావతీ ప్రద్యుమ్న విమర్శకూడా కలిసి ఉంది. ఇక్కడ కళాపూర్ణోదయానికే పరిచయం రాస్తున్నాడు, కాబట్టి ప్రభావతీ ప్రద్యుమ్న విమర్శలేదు.

కవిత్వతత్త్వ విచారము 1914 లో వచ్చింది. కళాపూర్ణోదయ పీఠిక 1917 నాటిది. కట్టమంచి ఈ పీఠికలో సూరన దేశకాలాదుల చర్చ చేయలేదు. కవిత్వమే ప్రధాన విమర్శాంశమైంది. ప్రాచీన కావ్యాల పీఠికలకు సంబంధించి నంతవరకూ ఇది అపూర్వమనే చెప్పవలసి ఉంటుంది.

"కళా పూర్ణోదయ మాంధ్రమున నద్వితీయమైన గ్రంథము. భారత, మనుచరిత్రాది గ్రంథముల వలె ఐరివర్తనము గాని ప్రాచీన కథా మూలకము గాని కాదు; మఱి కవియొక్క స్వసృష్టి. ప్రబంధకవు లెవ్వరియందున గనబడని

ప్రతిభయు, భావనాశక్తియు, సంపర్భశుద్ధియు, పాత్రోచిత పద్యరచనయు నిందు సుప్రసిద్ధములు. ఐనను గాల దోషము తప్పించుకొనరాని దగుటచే ప్రబంధకవుల యందలి స్ఖాలిత్యము లిందును బెక్కులు గలవు; కాని దోషముల కంటె గుణము లెన్నియో మడుంగు లెక్కువ. సూరన రచించిన గ్రంథములలో నెల్లనిది యుత్తమోత్తమము" అన్నది కట్టమంచి సిద్ధాంతము (పు. 84-85).

కల్పనాశక్తి కావ్యనిర్మాణంలో అత్యంతావశ్యకం. తెలుగు కవులలో అది తక్కువ. తిక్కనాది కవులలో ఉందేమో కాని అది వెల్లడయ్యే అవకాశం కలగలేదు. "కల్పనా సామర్థ్యమీ కవికి బలె నాంధ్రులలో మఱెవ్వరికి గానము. తిక్కనాదుల కుండవచ్చునేమో? సూరనయందు ప్రబంధకవులకుంగల వర్ణనాశక్తితోడ వారికి లేని కథా కల్పనా శక్తియు, వివిధములైన సందర్భములను సంధానమునకుం దెచ్చు ప్రతిభయు, సహవాసములు; మఱియు భావనాశక్తికి దోడు భాషాశక్తియు నీతనికి గలదు "అన్నది ఆయన నిష్కర్ష (పు. 86).

కళా పూర్ణోదయంలోని కథాకల్పనా చమత్కారాన్ని ఆయనశ్లాఘించాడు. కథను చెప్పడంలో ప్రత్యక్ష, పరోక్ష కథనమనే విభాగం కాక కాలక్రమ విధానమని, కార్య కారణ క్రమ విధానమని రెండుగా కొత్తరీతిని విభాగం చేశాడు. కళా పూర్ణోదయ కథ ఈ రెండో మార్గానికి చెందింది. సామాన్య ప్రబంధాల కథా నిర్మాణ విధానంలో అయితే పంచమాశ్వాసంలోని సరస్వతీ చతుర్ముఖుల లీలా కేళితో ఈ కావ్యం మొదలయేదని చెప్తూ ఆదిలోనే అనేక పాత్రలతో కథ మొదలు పెట్టి జరగబోయే కథ విషయంలో పాఠకుని ఉత్కంఠను అడుగడుగునా పెంచే విధంగా నిర్మించిన పింగళి సూరన కల్పనాశక్తికి జోహార్లర్పించాడు. కథా నిర్మాణాన్ని, కల్పనను ఇంత పొగడినా 6వ ఆశ్వాసంలోని 189వ పద్యం తరువాతి భాగంలోని రచన అంతా నిరర్థకమనీ, దానికి ఏక సూత్రతను ఘటించడానికి కల్పించిన మణిహార వృత్తాంతం అసంభావ్యాలతో నిండి ఉందనీ తీవ్రంగా విమర్శించాడు.

శృంగార వర్ణనలో సూరన తొక్కిన నూతన మార్గాలను విశ్లేషించాడు. సామాన్య ప్రబంధాలలోని రతి వర్ణన వంటిదైన మధురలాలసా, కళాపూర్ణుల శృంగారాన్ని తృణీకరించి నూత్న పద్ధతిలో సంతరించిన శల్యాసుర చరిత్రం,

సుగాత్రీ శాలీనుల విచిత్ర కథ; సరస్వతీ చతుర్ముఖ విలాస ఘట్టం, కలభాషిణి యొక్క మనోహర చరిత్రలను సోదాహరణంగా చర్చించాడు. ఈ సన్నివేశాల లోని సూరన ప్రతిభను, కల్పనా సామర్థ్యాన్ని, భావనాశక్తినీ ఉగ్గడించాడు.

కళా పూర్ణోదయం మీద ఇంత అభిమానం ఉన్నా కల్పనా భంగాలను మాత్రం సహించలేదు. లక్షణ శాస్త్రబద్ధంగానూ, శబ్దాలంకార ప్రచురంగానూ ఉండే రచన మీద ఆయనకు నిరాదరమే. 6వ ఆశ్వాసంలోని 189వ పద్యం తరువాతి రచనను "ప్రతిభ లేని పాడు కొంపలీ భాగములు. నిరర్థక పద్యపూరి తములు. అలంకారాది శాస్త్రముల యందలి మూఢభక్తి పటుతమము" (పే.118) అని తెగడాడు. రచనలో కృత్రిమత్వం పనికిరాదు. చిత్రకవిత్వాదులు నిరాదర ణీయాలు అవి లేనందువల్ల "ప్రభావతీ ప్రద్యుమ్నము రచనా విషయమున గళా పూర్ణోదయము కంటె మిన్న" అని అభిప్రాయపడ్డాడు.

కావ్య పీఠికలో కవి జీవితాదులకంటే కవిత్వ విమర్శకే ప్రాధాన్యమిచ్చిన తొలి పీఠికగా కట్టమంచి రామలింగారెడ్డి కళాపూర్ణోదయ పీఠికకు ఉన్నత స్థానం ఉంది.

పండితారాధ్య చరిత్ర పీఠిక :

1939లో ఆంధ్ర గ్రంథమాల 30వ గ్రంథంగా వెలువడ్డ శ్రీ మల్లికార్జున పండితారాధ్య చరిత్ర ఒక విశిష్టమైన ప్రచురణ. సాధారణంగా ప్రాచీన కావ్యా లేవీ ఇంత సమగ్రంగా అచ్చుపడవు. ఈ గ్రంథం చిలుకూరి నారాయణరావు పరిష్కరణ. బహుశా ఇంత సుదీర్ఘమైన ఉపోద్ఘాతం కూడా ఏ ప్రాచీన కావ్యానికి లేదు. చిలుకూరి నారాయణరావు దీనికి 348 పుటల విపులమైన పీఠికనురచించాడు. ఈ పీఠికను సోమనాథుని గురించిన ప్రత్యేక పరిశోధన గ్రంథం అనవచ్చు. పాల్కురికి సోమన దేశకాలాలు, ఆయన పేర్కొన్న చారిత్రక వ్యక్తులు, భక్తులు మొదలైనవారి దేశకాలాలు సోమనాథుని గ్రంథాల ఆంతరంగిక సాక్ష్యాన్ని బట్టి, అనేక శాసనాలను బట్టి, కన్నడ గ్రంథాలను బట్టి, ఇతర తెలుగు కావ్యాలను బట్టి ప్రామాణికంగా నిర్ణయించే ప్రయత్నం చేశాడు పరిష్కర్త.

శైవ పండిత త్రయాన్ని గురించీ, బసవేశ్వరుడి గూర్చీ విపులమైన చర్చ చేశాడు. పాల్కురికి సోమన కులగోత్రాలను గూర్చి చర్చించి అతడు బ్రాహ్మణుడని నిర్ణయించాడు. సోమనాథుని రచనలను పేర్కొన్నాడు కాని తెలుగు రచనలకే ప్రాధాన్యమిచ్చి తక్కినవి వేటూరి ప్రభాకరశాస్త్రి బసవపురాణ పీఠికలో చూడ వచ్చునని వదలివేశాడు. సోమనాథుని రచనల్లో బసవపురాణ, పండితారాధ్య చరిత్రలకే అగ్ర తాంబూలం. ఈ రెండింటి లోనూ పాల్కురికి సోమన్నే చెప్పిన విషయాలను బట్టి కావ్యకళ అంటే అతని అభిప్రాయాలను నారాయణరావు క్రోడీకరించాడు. పాల్కురికి సోమన నవీన గుణాలని చెప్పి 25 లక్షణాలను సంగ్రహంగా చెప్పాడు.

వాటిలో కథావస్తువులో కొత్తదనము, వీర శైవ సిద్ధాంతమును వివరించే ఉద్దేశముతో కావ్యమనే ఆధారమును కల్పించుకొని, సిద్దాంతమును ప్రత్యేకముగా విస్తరించి చెప్పక కథతో మేళవించి, కవి తన సిద్ధాంతమును ప్రతిపాదిస్తున్నాడనే విషయమును పాఠకులకు తోచకుండా చేయడము, అనేకములయిన విడివిడి భక్తమాహాత్మ్య కథల నొక్కచోట చేర్చి, అవి అన్నీ ప్రత్యేక కథలు కానట్లు కావ్య స్వరూపమును కల్పించడము, తనకు పూర్వము కేవలము పాటలకు, పదములకు మాత్రము ఉపకరిస్తూ ఉండే ద్విపదఛందస్సును మహాకావ్యోపయోగిగా దిద్దితీర్చడము, అంతకు పూర్వము సంస్కృత భూయిష్ఠముగా ఉండే ఆంధ్ర కావ్యరచనలను నిరసించి జానుతెనుగను పేర సమసంస్కృతోక్తులతో రచనను సాగించడము, కావ్యలక్షణమునకు తాను వశుడు కాక, లక్షణమును సంపూర్ణముగా తన వశములో ఉంచుకొనడము, సందర్భమునను సరించి భాష పోకడలను మార్చివేయడము అన్నవి ముఖ్యమైనవి (పు. 101-104). రసాలు, వర్ణనలు, అలంకారాలు, గుణదోషాలు మొదలైనవి సోమన పేర్కొన్న విధాన్ని సామాన్య లక్షణాలతో పోల్చి చెప్పాడు.

44 పేజీల ద్విపద సాహిత్య చరిత్ర ఈ ఉపోద్ఘాతంలో చోటు చేసుకుంది. ఇందులో 67 గురు ద్విపద కవులను గూర్చిన వివరాలున్నాయి. ఆయా కవుల రచనలనే కాక చాలా మంది కాల నిర్ణయమూ, వారి వంశ వృక్షాలనివ్వడమూ జరిగింది. ఛందో, భాషా విషయకమైన చర్చకూడా ఇంత విపులంగా మరే ప్రాచీన కావ్య పీఠికలోనూ కనిపించదు. ఈ గ్రంథ పరిష్కరణ గిడుగు రామ

మూర్తి పంతులు ప్రారంభించడమూ, వారి శిష్యుడైన చిలుకూరి నారాయణరావు ఈ పనిలో కొంత ఆయనకు తోడ్పడడమూ, పరిష్కరణ సామగ్రి గిడుగు సిద్ధం చేసుకున్నదంతా వారికీయడమూ, చిలుకూరి నారాయణరావు స్వయంగా ప్రసిద్ధ భాషా పరిశోధకుడు కావడమూ, ఇందుకు కారణం కావచ్చు ఆయా గ్రంథాల నుంచి ఎత్తి ఉదాహరించడానికి పాల్కురికి సోమన ఉపయోగించిన 142 నిరర్థక పదాల పట్టికను అకారాది క్రమణికలో అట, అది, అనగ జాలి మొదలైనవి ఇచ్చాడు (పు. 163, 164). సంస్కృత వాక్యాలను ద్విపదల్లో కూర్చిన విధానాన్ని సోదాహరణంగా నిరూపించాడు. "అతడుదహరించిన ఒక వాక్యమైనా సంపూర్ణముగా ఒక్క చోట చేరలేదు. ద్విపదలో అది చేరడానికి కష్టమైనది. కాబట్టి ఆ వాక్యముల నాతడు తుండుతుండ్లుగా తెగగొట్టినాడు" అని విశ్లేషించాడు (పు.172).

ప్రాసయతి ద్విపదలలో తగునని ప్రమాణం చూపించి వాడినా పండితారాధ్య చరిత్రలో 3200కు పైగా ఉన్న ద్విపద పాదాలలో 200 కు మాత్రమే సోమన ప్రాస యతిని వాడినట్లు గుర్తించాడు. ద్విపద రచనలో బసవపురాణ, పండితారాధ్య చరిత్రల కున్న భేదాన్ని పరిశీలించాడు. "...బసవపురాణపు ద్విపదలు రోకటి పాటలుగా ఏర్పడినవి. పండితారాధ్య చరిత్రములో సోమనాథుడు ద్విపద ననేక విధములుగా నడిపించాడు" ఇత్యాది (పు. 174).

సోమనాథుని భాషను గురించి విస్తరించి వ్రాయడానికి పీఠికలో స్థలము చాలదు అంటూనే సోమన ప్రయోగాలను కొన్ని వర్గాల కింద విభజించి చూపాడు. వేటూరి ప్రభాకర శాస్త్రి బసవపురాణ పాఠాలకూ తన పండితారాధ్య చరిత్ర పాఠాలకూ వ్యత్యాసాన్ని చూపాడు. ఉదా: ఒబగు చౌడయ్య, చౌడరసు శబ్దాలలో ప్రభాకర శాస్త్రి అరసున్నా నుంచలేదనీ, తానుంచాననీ కాని ఇద్దరికీ ప్రమాణాలు లేవనీ అన్నాడు (పు. 182) ప్రభాకరశాస్త్రి స్వీకరించిన తొరగెన్ స్థానంలో తొంబగు ఉండాలని శబ్దరత్నాకరము, కళాపూర్ణోదయ ప్రయోగాల నుండి నిర్ణయించాడు. బసవపురాణ పండితారాధ్య చరిత్రలలో రేఫ నిర్ణయం చేశాడు. రకారంతో వచ్చే 232 పదాలనూ, ఱకారంతో వచ్చే 172 పదాలను అకారాది క్రమణికలో ప్రాస ప్రాసయతి స్థానంలో వచ్చిన వాటిని వాటిలో ప్రాస, ప్రాసయతి స్థానంలో వచ్చిన పదాలతో సహా పట్టికగా ఇచ్చాడు (పు. 184-206).

బసవ పురాణ పండితారాధ్య చరిత్రలలో కనిపించే సంధి విశేషాలను విసంధిగా ప్రయోగించిన అనేక రూపాలను దాదాపు అన్ని వ్యాకరణ విశేషాలనూ చిలుకూరి నారాయణరావు సోదాహరణంగా పేర్కొన్నాడు.

బసవపురాణ, పండితారాధ్య చరిత్రలలో ప్రయుక్తమయిన సామెతలను, ఉపమానాలను అకారాది క్రమణికలో పట్టికగా ఇచ్చాడు. ఇవి 298. సోమన వాడిన 73 జాతీయాలనూ, 7 రకాల ఊతపదాలనూ, ఆమ్రేడితాలనూ, పేర్కొన్నాడు. నిఘంటువుల కెక్కని అనేక పదాల నుదహరించి కొన్నిటికి అర్థనిర్ణయాన్నీ చేశాడు (పు. 242-267).

మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం లోనూ, తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భాండాగారం లోనూ ఉన్న 124 వీరశైవ గ్రంథాల పట్టికను ఇచ్చాడు (పు. 268-273).

శైవ సంప్రదాయాన్ని గురించి, వీరశైవుల మూల పీఠాలు, వాటి స్థాపకుల గురించి చర్చించాడు. అరవై ముగ్గురు నాయనార్లు అన్న ప్రసిద్ధే కాని వీళ్లు ఒక్కొక్క గ్రంథంలో ఒక్కొక్క విధంగా ఉన్నారని తెల్పుతూ, తమిళ, సంస్కృత, కర్ణాటాంధ్ర గ్రంథాలు, శాసనాలు ఆధారంగా వీరిని నిర్ణయించే ప్రయత్నం చేశాడు. పండితారాధ్య చరిత్రలో కనిపించే అరవై ముగ్గురు నాయనార్లలో ఇతరాధారాలవల్ల తెలియవచ్చిన యాభై ముగ్గురి వివరాలను ఇచ్చి, అరువత్తు మూవురులోగాని, వీరశైవ గ్రంథాల్లోగాని కనిపించక శిలా, తామ్ర శాసనాలలో కనిపించే ఎందరో నాయనార్లను తెలిపాడు. వీరశైవ సిద్ధాంతాన్ని తెలిపి, పాల్కురికి సోమనాథుడు నిరూపించిన వీరశైవాన్ని విపులంగా చర్చించాడు.

బసవపురాణ, పండితారాధ్య చరిత్రలలో వచ్చే ప్రదేశాల పేర్లను పట్టికగా ఇచ్చి వాటిలో శ్రీశైల చరిత్రను విపులీకరించాడు. అప్పటికి నాగార్జున కొండ బయట పడలేదేమో శ్రీశైలాన్నే చిలుకూరి నారాయణరావు శ్రీ పర్వతంగా కూడా భ్రమించాడు.

ఈ ఉపోద్ఘాతం కేవలం పండితారాధ్య చరిత్ర పీఠికగా కాక బసవపురాణ పండితారాధ్య చరిత్రల ఉమ్మడి పీఠికగా కనిపిస్తుంది. వేటూరి ప్రభాకరశాస్త్రి బసవపురాణ పీఠిక దృష్టిలో ఉండడంవల్ల ఇట్లా జరిగి ఉంటుంది. కవిచరిత్ర, ఛందస్సు, భాష, మత విషయాలు మొదలయిన బాహ్యాంశాలే ఈ పీఠికలో విస్తృతంగా చోటు చేసుకున్నాయి తప్ప కవిత్వతత్వ విచారం అల్పమేనని చెప్పాలి.

పరిష్కృత ప్రచురణల పీఠికల సామాన్య లక్షణాలు :

ప్రాచీన కావ్య ప్రచురణల పీఠికలలో ఈ కింది సాధారణ లక్షణాలను మనం గుర్తించవచ్చు.

1. పరిష్కరణ
2. కర్తృత్వం
3. కాలనిర్ణయం
4. రచనలు - పౌర్వాపర్వం
5. ప్రాంత, కుల, మతాదులు
6. కవిత్వం - అనువాద విధానం - అనుసరణలు.

పైలక్షణాలలో అన్నీ కాని, ఎవైనా కొన్ని గాని, విభిన్న క్రమాలలో ఉంటాయి. ఇవన్నీ సామాన్య విషయాలే. అయితే మనకున్న చారిత్రక సామగ్రి లోని అసమగ్రత వల్ల, అస్పష్టత వల్ల అనేక విషయాలలో ఏకాభిప్రాయం కుదరదు. తమతమ అభిప్రాయాలకు ఆధారంగా చారిత్రకాంశాలను క్రోడీకరించ వలసి వస్తుంది. ఒక విషయాన్ని నిరూపించడానికి అనేక శాసనాలు, చరిత్ర కారుల రాతలు సమకాలీన, అర్వాచీన కవుల కావ్యాలు, గ్రంథంలోని అంత రంగిక సాక్ష్యాలు పరిశీలించి ఉట్టంకించ వలసిన అవసరం ఏర్పడుతుంది. వాటిని విశ్లేషించడంలో, వ్యాఖ్యానించడంలో కూడా భేదం ఉంటుంది. అందువల్లే సామా న్యాంశాల క్రోడీకరణకే దైర్ఘ్యం పెరిగిన పీఠిక నిడివి ఈ వాద వివాదాల వల్ల, ప్రమాణాల క్రోడీకరణ వల్ల గ్రంథం కంటే కూడా విస్తరించడం జరిగింది. దాదాపు 350 పేజీల దాకా పీఠిక ఆక్రమించడం ఈ విషయాన్నే తెలియ జేస్తుంది. సామాన్య అంశాలను విడిచి ప్రాచీన కావ్య పీఠికలు లేవదీసిన, చర్చిం చిన కొన్ని ప్రధాన విషయాల వివాదాలను మాత్రమే ఇక్కడ ఉదాహరణ ప్రాయంగా ఇస్తున్నాను.

ఈ వివాదాలకు చారిత్రక విషయాలకు సంబంధించిన అసమగ్రత, అస్పష్టతలే కారణమని ముందే పేర్కొనడం జరిగింది. లోకంలో ఎన్నో పుక్కిటి పురాణాలు ప్రచారంలో ఉన్నాయి. నన్నయ, వేములవాడ భీమకవి - అధర్వణు లకు సంబంధించినవి, పాల్కురికి సోమన మహిమను వెల్లడించేవి, శ్రీనాథుడు - పోతనలకు సంబంధించినవి, పిలలమఱ్ఱి పిన వీరనకు సంబంధించినవి, తెనాలి రామకృష్ణుని పేర ప్రచారమౌతున్నవి, ధూర్జటి, పెద్దన, తిమ్మన, భట్టు మూర్తు లకు సంబంధించినవి, కూచిమంచి తిమ్మకవి, అడిదము సూరకవులకు సంబం ధించినవి, ఇట్లా ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. వీటి మీద ఎంతో కొంత విశ్వాసమూ, ఆయా కవుల పేర్లతో ప్రసిద్ధమై, ప్రచారంలో ఉన్న చాటువులపై వున్న విశ్వాసమూ కూడా ఈ అస్పష్టతకు దోహదం చేసింది. అయితే ప్రారంభ కాలంలో వీటిమీద కనబరచిన విశ్వాసం తరువాతి కాలంలో చాలా వరకు తగ్గింది. ఋజువైన, తర్క బద్ధమైన చారిత్రకాంశాలకు ప్రాధాన్యం హెచ్చింది. అభిమాన దురభిమానాలు కొంచెం తగ్గుముఖం పట్టి సత్యాన్వేషణ ప్రధానమవుతూవచ్చింది. అయినా పండితుల మధ్య నెలకొన్న స్పర్థ అక్కడక్కడా సత్యంమీద ముసుగు కప్పుతూనే ఉంది. ఈ స్పర్థకు తోడు కులమత విభేదాలు కూడా అక్కడక్కడా అరుదుగానైనా పని చేశాయి.

పరిష్కరణ :

ప్రాచీన కావ్యాల ముద్రణలో సి.పి. బ్రౌన్ ఒక ఒరవడి దిద్దాడు. సాధ్య మయినంతవరకు రాత ప్రతులన్నింటినీ సంపాదించడం, వాటిని ఒకదానితో ఒకటి సరిపోల్చడం, పాఠభేదాలలో శుద్ధమైన పాఠాన్ని గ్రహించడం బ్రౌన్ ప్రవేశపెట్టిన పద్ధతి. ప్రాచీన కావ్యాలకు దేశంలో నలుమూలల్లో అనేక రాత ప్రతులు లభిస్తాయి. వాటిని సేకరించడం మొదటి పని. వ్యయప్రయాసలతో కూడుకున్నపని. వ్యాపార దృష్టితో కాక కేవలం భాషా సేవ దృష్టితోనే ఆనాడు ఈ పనికి పూనుకున్నారు. విభిన్న లేఖకులు రాసిన ఈ ప్రతులు ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ఉంటుంది.

తాళపత్ర ప్రతుల పరిశీలన అనేక శ్రమలతో కూడుకున్నది. లేఖన సంప్రదాయంలో ప్రతి కాలానికీ, పరిష్కరణ కాలానికీ చాలా భేదాలుంటాయి. వాటిని పరిష్కర్త గుర్తించ వలసి ఉంటుంది. లేఖకులు పండితులు కానప్పుడు

ప్రతులలో అనేక దోషాలు చోటుచేసుకుంటాయి. వాటిలో లేఖకుని దోషమేదో, కవి పాఠమేదో గుర్తించవలసి ఉంటుంది. ప్రతులు సమగ్రంగా ఉండవు. ఒక ప్రతిలో ఉన్న భాగం మరొక ప్రతిలో ఉండదు. అటువంటి అధిక పాఠాలను గుర్తింపవలసి ఉంటుంది. కొన్ని భాగాలు శిథిలమై ఉండవచ్చు, కొన్ని అక్షరాలు, కొన్ని మాటలు, కొన్ని పద్యపాదాలు, కొన్ని పద్యాలే లుప్తం కావచ్చు, వాటిని ఊహించవలసి ఉంటుంది. కవి హృదయానికి దగ్గరైన పాఠాలను గుర్తించ వలసి ఉంటుంది. ఒక్కొక్క సారి ఒక గ్రంథానికి ఒకే ప్రతి లభ్యమవుతుంది. అదీ సరిగా లేకపోతే పరిష్కర్త బాధ చెప్పనవసరం లేదు. 'హరిశ్చంద్ర ద్విపద కావ్య' పీఠికలో బ్రౌన్ ఇట్లా అన్నాడు "The version now printed, had been so frequently transcribed that in the course of time the text was much corrupted, but by comparing eight manuscripts the erroneous words and metres have now been rectified"[18].

ప్రాచీన కావ్య ప్రచురణకు కావ్య పరిష్కరణ ఒక అనివార్యమైన అంశమైంది. అందుకే వాటి పీఠికలలో పరిష్కరణ విషయం తప్పనిసరిగా ఉంటుంది. తమకు లభించిన ప్రతులేవి? వాటి స్వరూపం ఏమిటి? అవసరమైన సంస్కరణలేమిటి? తాము సంస్కరించిన విధానమేమిటి? అన్న విషయాలు పరిష్కర్తలు వివరిస్తారు. ప్రతుల సేకరణలో తమకెదురైన ఇబ్బందులను పేర్కొంటారు. 'విప్రనారాయణ చరిత్రము' (1915) 'భార్గవపురాణము' (1922), 'నారాయణాచల మాహాత్మ్యము' (1923) మొదలైన కావ్యాలు వాటి ప్రచురణ నాటికి ఏకైక లిఖిత ప్రతుల ఆధారంగా ముద్రించబడ్డవే. 'శ్రీరఘునాథ రామాయణము' ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణము (1937). దీని మొదటి భాగమే ముద్రితమైంది. అసమగ్రమైన ప్రతి. "ఇది పూర్తిగా లభించునను నాశతో బ్ర శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు సంపాదించిన యసంపూర్ణ పుస్తకమునుండి యెత్తి వ్రాసి ప్రకటింప నారంభించితిమి కాని లభింపలేదు"[19] అన్నాడు కొత్తపల్లి సూర్యారావు.

అసమగ్రమైన ప్రతులతో పరిష్కరణ కష్టమైన పని. పరిష్కర్తలు అక్కడక్కడా లోపించిన భాగాలను పూరించవలసిన అవసరం కూడా ఏర్పడు

తుంది. "చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము లోని ప్రతి సమగ్రము కాక రెండవ యాశ్వాసములో సగము వఱకును కొరవడినదిగా యున్నది. బహుజనపల్లి సీతారామాచార్యుల వారి ప్రతియు నీ మాతృకకు పుత్రికయే 1903 లో మానవల్లి రామకృష్ణయ్యగారు యిచ్చిన తాళపత్ర లిఖిత పుస్తకమున సమగ్రమైననూ, రెండవ యాశ్వాసము యుత్తరార్థమందున్నది. సప్తమాశ్వాసము కొనయందు మాత్రము నేను పూరింపవలసి వచ్చిన పద్య భాగమును గుండలీకరణము చేసియున్నాను"[20] అన్నాడు కందుకూరి వీరేశలింగం 'భోజరాజీయము" పీఠికలో. 'దశకుమార చరిత్ర' పీఠికలో లిఖిత ప్రతుల సంపాదన లోని కష్టాలను కందుకూరి వీరేశలింగం పేర్కొన్నాడు. ఎవరైనా రాత ప్రతి పంపిస్తే వారికి ఈ ప్రచురణ కాపీలు పది, మళ్ళీ ముద్రించినప్పుడు మరో పది పంపిస్తానని ఆయన వాగ్దానం చేశాడు.[21] ఇందులో కూడా కొన్ని భాగాలు ఆయన పూరించవలసి వచ్చింది. కావ్యాలలో నష్ట భాగాలను కవులచేత పూరింపచేయడం కూడా ఉంది. 'జాహ్నవీ మాహాత్మ్యము' లోని నష్ట భాగాలను ప్రచురణ కర్తే వేంకట పార్వతీశ్వర కవులచేత పూరింపచేశాడు.[22] నష్టభాగాలను పూరించకుండా కేవలం చుక్కలు పెట్టి ముద్రించడం కూడా జరిగింది. కొన్ని గ్రంథాలలో అసభ్యాలనుకున్న భాగాలను కూడా ఈ విధంగా చుక్కలు పెట్టి ముద్రించడం జరిగింది.

ప్రాచీన లేఖన సంప్రదాయం తాళ పత్ర ప్రతులను బట్టి తెలుస్తుంది. నాటి శాసనాలు కూడా ఇందుకు తోడ్పడుతాయి. ఈ లిపిజ్ఞానం ఉంటే తప్ప పరిష్కరణ సాధ్యంకాదు. 19వ శతాబ్దం పూర్వ భాగందాకా అర్ధానుస్వారానికి ప్రత్యేక లిపి చిహ్నంలేదు పూర్ణానుస్వారమే దీన్ని కూడా సూచించేది. పూర్వస్వర దీర్ఘహ్రస్వాలను బట్టి, అనంతర హల్లు ద్విత్వా ద్విత్వాలను బట్టి, పద్యాలలో ఛందస్సును బట్టి దీన్ని గుర్తించవలసి ఉంటుంది. అట్లాగే రేఫ, ఱకారాలు స్పష్టంగా ఉండవు. వాటి మధ్య ఉచ్చారణ భేదం లేకపోవడంవల్ల ఏ మాటలో లఘురేఫమో, ఏమాటలో అలఘురేఫమో గుర్తించడం కష్టం. ఇవి కలగాపులగంగా ఉండడమూ, ఒకే మాట రెండింటితో కూడ అనేక మంది కవుల ప్రయోగాలలో కనిపించడమూ జరగడంతో వీటి నిర్ణయం ఒక సమస్య అయింది. లక్షణ కర్తలు

రేఫ,ఱకారనిర్ణయానికి ప్రయత్నించారు. విడిగాపట్టికలిచ్చారు. గణ,యతి,ప్రాసల నియమాలు ఎక్కువగా ఉండడంవల్ల వీటి సహాయంతో కొన్ని ప్రయోగాలను నిర్ణయించడం సాధ్యమౌతుంది. అయితే ఈ లక్షణాలు కూడా కాలక్రమంలో మారుతూ ఉండడంవల్ల, భిన్న సంప్రదాయాలుండడం వల్ల అభిప్రాయ భేదాలకు తావుంటుంది. కవులు వ్యవహార సిద్ధమైన ప్రయోగాలను లక్షణ విరుద్ధమైనప్పటికీ చేసినప్పుడు వాటిని గుర్తించడం కష్టమవుతుంది. కవి సమకాలిక శాసనాదులను పరిశీలించినప్పుడు వీటిని గుర్తించడానికి అవకాశం కలుగుతుంది. అయితే ప్రామాణికులైన కవులు లక్షణ విరుద్ధమైన ప్రయోగాలు చెయ్యరన్న నమ్మకంతో వాటిని సరిచేసే ప్రయత్నం పరిష్కర్తలు చేశారు. పరిష్కర్తలైన పండితులు లక్షణ శాస్త్రాలను బట్టి కావ్య పాఠాలను సరిచేయడానికి పూనుకోవడంతో లక్షణ శాస్త్రాలకు భిన్నంగా ప్రయుక్తమైన కవి ప్రయోగాలు అనుకూలంగా సంస్కరింప బడ్డాయి. లక్షణ విరుద్ధమైన ప్రయోగాల విషయంలో ఒక నిర్ణయానికి రావడానికి ఆధారాలేమైనా ఉన్నాయా? పరిష్కర్త ఇష్టానుసారంగా చేయడమేనా? అదే కవి ఇతర ప్రయోగాలను ఆధారంగా తీసుకోవడమో, అనేక ప్రతులున్నప్పుడు ఎక్కువ ప్రతులలో కనిపించే ప్రయోగాన్ని స్వీకరించడమో చేయవలసి ఉంటుంది. అన్ని ప్రతులలోనూ ఒకే రూపం ఉండి ఛందో నియమాలకు అనుగుణంగా ఉన్నప్పటికీ వ్యాకరణ విరుద్ధమైతే మార్చటానికి పరిష్కర్తలు వెనుదీయలేదు. ఈ విధమైన పరిష్కరణ అనేక వాద వివాదాలకు దారితీసింది. కవి ప్రయోగాలను మార్చరాదన్నవారూ, లక్షణ విరుద్ధమైతే మార్చవచ్చునన్న వారూ ఉండడంతో కొన్ని గ్రంథాల పరిష్కరణ విషయంలో వాగ్యుద్ధం జరిగింది. పరిష్కర్తలు స్వీకరించిన రూపాల సాధుత్వ, అసాధుత్వాల విషయంలోనూ, ఔచిత్య, అనౌచిత్యాల విషయంలోనూ తీవ్రమైన చర్చలు జరిగాయి.

ఒకే గ్రంథం ఒకటికంటే ఎక్కువసార్లు ముద్రితమైనప్పుడు భిన్న ప్రచురణలకు పరిష్కర్తలు వేరయినప్పుడు పీఠికలలో వారి మత భేదాలు వెల్లడయ్యాయి. పత్రికలలో జరిగిన చర్చలకు కూడా ఈ పీఠికలలో సమాధానాలివ్వడం జరిగింది. పాల్కురికి సోమన 'బసవ పురాణా'నికి వేటూరి ప్రభాకర శాస్త్రి, 'పండితారాధ్య చరిత్ర'కు చిలుకూరి నారాయణరావు బృహత్పీఠికలు రచించారు. ప్రభాకర శాస్త్రి నిర్ణయించిన పాఠాలకు భిన్నంగా చిలుకూరి నారాయణరావు నిర్ణయించిన పాఠాల విషయం 'పండితారాధ్య చరిత్ర' పీఠికలో

కనిపిస్తుంది. వీటిలో కొన్నిటికి ప్రమాణాలుండడం కొన్నిటికి లేకపోవడం కూడా ఉంది. ఉదాహరణకు 'ఒలుగు'లో వేటూరి ప్రభాకరశాస్త్రి అర్ధానుస్వారా న్నుంచ లేదనీ, తానుంచాననీ చెప్తూ ఇద్దరికీ ప్రమాణాలు లేవన్నాడు చిలుకూరి నారాయణరావు.

పరిష్కరణ విషయంలోని వాద వివాదాలకు భాగవత పరిష్కరణ మొక్కటి చాలు ఉదాహరణకు; భాగవతాన్ని అనేకులు ప్రచురించారు. వీటిలో ముఖ్యమైనవి పురాణం హయగ్రీవ శాస్త్రి, తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పరిష్కరణలు. తక్కినవి మొదటి రెండు ప్రచురణలను అనుసరించినవే తప్ప ప్రత్యేకత లేనివి. ఈ రెండు ప్రచురణలను గూర్చి దీపాల పిచ్చయ్య శాస్త్రి ఈవిధంగా అన్నాడు. "పురాణం వారిదే అచ్చు ప్రతులలో మొట్టమొదటిది. వారు వ్రాత ప్రతుల పాఠములను సవరింపక పోలేదుగాని, మొత్తముమీద వారి ప్రతి, వ్రాత ప్రతులకు చాల సన్నిహితముగా నున్నది. అందువలన అకాడమీ పరిష్కర్తలు, ఆ ప్రతిని ప్రమాణముగా గ్రహించినారు....పాఠముల నెక్కువగా మార్చినవారు - తంజనగరం వారు. వారు హ. (హయగ్రీవ శాస్త్రిల) ప్రతిలోని సాధు పాఠములను సైతము మార్చి వేశారు."[23]

తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య గ్రంథ పరిష్కరణను గురించి 1911 నాటికే చాలా విమర్శ వచ్చింది. ఆయనే "ఇక్కాలమున దెనుగు గ్రంథములను సంస్కృతమూలముతోను, వ్రాత ప్రతులతోను బోల్చి యథాశక్తి నిర్దుష్టముగా సవరించి మేముముద్రించుటం గొందఱుచూచి 'కూర్చిరి మార్చిరి చెఱిపిరిచెడినది' యని చేయు నాక్షేపణములు నాక్రోశములు గర్ణతాడితములగు చున్నవి. వీని గొంత పరామర్శించుట కిపుడు మిక్కిలియవసరమై యున్నది"[24] అన్నాడు. తన పరిష్కరణ విధానాన్ని "మూలమును జూచి, పోతన కవితా వైలక్ష్యములను బరిశీలించి, తక్కిన కవుల రచనా విశేషముల విమర్శించి, పెక్కు వ్రాత ప్రతుల శోధించి, నా కావించిన సవరణలును, బూరించిన గ్రంథపాఠములను, విడదీసిన కూర్పులును, దేట పరచిన మార్పులును సమంజసములో కావో యను విషయమున గుణ దోషగ్రహణ పారీణులగు సహృదయ శిరోమణులే ప్రమాణము"[25] అని అన్నాడు.

"శ్రీ మహాభాగవతము వ్రాత ప్రతులు 257 సంపాదించితిమి. వాటి నన్నిటిని పరస్పరము పోల్చి పరికించి 26 ప్రతులు వేఱు పరచితిమి. వానిని 16 గురు పరిశీలకులతో ప్రతిపంక్తిగా చదివి భిన్నభిన్న పాఠములను సేకరించితిమి. ఈ విధముగా ఎత్తి వ్రాసిన పాఠములను తిరిగి శ్రద్ధతో పరిశీలించిన పిమ్మట పాఠస్వీకారము జరిగినది"[26] అన్నారు సాహిత్య అకాడమి ప్రచురణ సంపాదకులు.

'మదిలో గృష్ణుడెశోద' వంటి ప్రయోగాలు నారయయెంత లాక్షణికుడో తెలియజేస్తాయన్నాడు తేవప్పెరుమాళ్ళయ్య. అయితే నారయ తానుగా చేసిన ఈ ప్రయోగాలను మార్చడం ఆయనకు తప్పుగా తోచలేదు. శబ్ద ప్రయోగాలకే ఇది పరిమితం కాలేదు. పండితులు తమతమ తాత్విక విశ్వాసాల కనుగుణంగా పాఠాలను మార్చడం కూడా ఉందని ఆయనే చెప్పాడు "మరియు బండితులు తమ తమ దర్శనము చొప్పున బాఠముల దిద్దుటయు గలదు"[27] కాని "ఆ సంగతి (కవి పాఠములను దిద్దే అధికారము పరిష్కర్తకు లేదన్న సంగతి) తంజనగరం ప్రభృతులకు తెలియదు. అందువలన, పోతనాదుల ప్రయోగములను ఎవరి యిష్టము వచ్చినట్లు వారు దిద్దినారు"[28] అన్నాడు దీపాల పిచ్చయ్య శాస్త్రి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ భాగవత ప్రచురణ మీద కూడా ఎన్నో ఆక్షేపణలు వచ్చాయి. వాటికి సమాధానాలు చెప్పడానికి ఒక ప్రత్యేక గ్రంథమే కావలసి వచ్చింది.[29]

తరువాతి కాలపు ప్రచురణలలో లిఖిత ప్రతులతో పాటు పూర్వ ప్రచురణల ముద్రిత ప్రతులనుకూడ పలిశీలించడం జరిగింది. పరిష్కృత గ్రంథ పీఠికలు పరిష్కరణ విధానాన్ని, సమస్యల్ని, పరిష్కారాల్ని సూచిస్తున్నాయి.

కర్తృత్వ చర్చ :

తెలుగు కవులు తమ గ్రంథాల అవతారికలలో తమను గూర్చి, తమ వంశం గురించి, తమ కృతి అంకితం తీసుకుంటున్న కృతి పతిని గురించి, ఆయన వంశం గురించీ అనేక వివరాలు ఇచ్చారు. అవతారికలలో కర్తృత్వ విషయం స్పష్టంగా ఉన్నప్పటికీ ఆయా గ్రంథాల కర్తృత్వ విషయంలో అనేక వాదవివాదాలుత్పన్నమయ్యాయి, ఇటువంటి వాద వివాదాలు చాలావరకు పరిష్కర్తల పీఠికల మూలంగా తలెత్తినవే.

లక్షణ గ్రంథాలలో ప్రాచీన కృతులనుండి ఉదాహరించేటప్పుడు లక్షణ కర్తలు కావ్యకర్త పేరును పొరపాటుగాగాని లోకంలో ఉన్న ప్రవాదం మూలకంగాగాని, తమ విశ్వాసానికనుగుణంగాగాని, గ్రంథావతారికలోని పేరు కంటే భిన్నంగా చెప్పడం కర్తృత్వ వివాదాలు తలెత్తడానికి కారణ మయింది. కాలమూ, ఇద్దరు కవుల సంబంధమూ నిరూపించి శైలిలో పోలికలు చూపించటం ద్వారా కర్తృత్వ నిర్ణయం చేయడానికి పరిష్కర్తలు ప్రయత్నించారు.

కుమార సంభవం, రంగనాథ, భాస్కర రామాయణాలు, క్రీడాభిరామం వీరభద్ర విజయం, ఆముక్తమాల్యద, రాధికా సాంత్వనం, ఉత్తర రామాయణం మొదలైన గ్రంథాల విషయంలో ఇటువంటి వివాదం ఉన్నది. కిందటి శతాబ్దం లోని ప్రముఖ వ్యక్తుల ప్రసిద్ధ రచనల విషయంలోనే ఇటువంటి వివాదాలేర్పడగా ప్రాచీన కావ్యాల విషయంలో ఏర్పడడంలో ఆశ్చర్యం లేదు.[30]

క్రీడాభిరామం తొలిసారిగా 1909లో అచ్చైంది. దీన్ని ప్రకటించింది మానవల్లి రామకృష్ణ కవి. ఆయన క్రీడాభిరామ పీఠికలో రెండు వాదాలకూ తగిన ఉపపత్తులను చూపించి "ఈ యంశములు పండితులును చరిత్రకారులును నిష్పక్షపాతముగా నూహించి మఱికొన్ని దృష్టాంతములున్నచో దెలిపి నిజస్థితిని గుర్తెఱుంగ జేయుదురని నేను సుముఖులం బ్రార్థించెదను"[31] అన్నాడు. క్రీడాభిరామ పునర్ముద్రణ 1929 లో వచ్చింది. ఈ మధ్య కాలంలో శ్రీనాథుని కర్తృత్వ విషయం అనేక వ్యాసాలలోనూ గ్రంథాలలోనూ చర్చింపబడింది.[32] క్రీడాభిరామ పునర్ముద్రణ ఉపోద్ఘాతంలో వేటూరి ప్రభాకర శాస్త్రి సుదీర్ఘమైన చర్చ చేసి శ్రీనాథుడే కర్త అని నిర్ణయించాడు [33] పూర్వోక్త సందర్భాలలో బండారు తమ్మయ్య వాదాన్ని ఈ ఉపోద్ఘాతంలో వేటూరి ప్రభాకరశాస్త్రి విమర్శించాడు. "బండారు తమ్మయ్య వాక్యములు బూటకంపు, బూకరింపుల బుంగలు దుర్వివేక దురంధరములు"[34] అని దూషించాడు 1960 లో వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ క్రీడాభిరామం ప్రచురించారు. దీనికి బండారు తమ్మయ్య పీఠిక రాస్తూ ప్రభాకరశాస్త్రి వాదాన్ని ఖండించి వల్లభరాయ కృతమేననీ, శ్రీనాథుని సహాయం ఉందని వాదించాడు [35] ఈ రెండు పీఠికలలో పరస్పర విమర్శ లెన్నో ఉన్నాయి.[36] క్రీడాభిరామ కర్త వల్లభరాయడే, శ్రీనాథునికే విధమైన సంబంధములేదు అన్నాడు బి.ఎన్. శాస్త్రి[37]. వల్లభరాయ కర్తృత్వాన్ని

చిలుకూరి పాపయ్యశాస్త్రి సమర్థించాడు.[38] రంగనాథ రామాయణ కర్తృత్వ వివాదం కూడా తేలనిదే 'A History of Telugu Literature' అన్న పుస్తకానికి పీఠిక రాస్తూ "Men of genius like Kona Buddha Reddy, The author of the Ramayana, which has been spuriously attributed to a mythical Ranganatha, were able to Dravidianise the Ramayana itself"[39] అన్నాడు కట్టమంచి రామలింగారెడ్డి. రామాయణ కర్త రంగనాథుడే అన్న ప్రచారం అంతకు ముందే ఉందన్న మాట. ఆంధ్ర విశ్వకళాపరిత్ప్రచురణకు పింగళి లక్ష్మీకాంతం పీఠిక, కట్టమంచి రామలింగారెడ్డి అనుబంధ పీఠిక రెండూ రామాయణ కర్తృత్వం గోనబుద్ధా రెడ్డిదే అని నిరూపించడానికి ప్రయత్నించాయి.[40] వావిళ్ళ ప్రచురణకు నాగపూడి కుప్పుస్వామయ్య, రాయల అండ్ కో ప్రచురణకు మల్లంపల్లి సోమశేఖర శర్మ రాసిన పీఠికలలో ఈవాదం విమర్శకు గురైంది.[41] రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ మొదలైన వారు పత్రికా వ్యాసాలలో కట్టమంచి రామలింగారెడ్డి వాదాన్ని తీవ్రంగా విమర్శించారు.[42] సమర్థించినవారూ ఉన్నారు. వాఙ్మయ చరిత్ర గ్రంథాలలో కూడా ఈ చర్చ కొనసాగింది. ఉత్తర రామాయణ పీఠికలో, రామాయణ, ఉత్తర రామాయణాల కర్త ఒకరు కాదనీ, పూర్వ రామాయణము గోనబుద్ధ భూపతి, ఉత్తర రామాయణము గోన కాచ భూపతి, విఠల భూపతులనీ చెలికాని లచ్చారావు పేర్కొన్నాడు.[43] భారతుల మార్కండేయశర్మ రంగనాథుడే అన్నాడు.[44] బొగ్గర ఆదినారాయణాచార్యుడూ ఇదే అన్నాడు.[45]

భాస్కర రామాయణ కర్తృత్వ విషయంలోనూ వివాదం ఉన్నది.నిర్వచనోత్తర రామాయణ పీఠికలో నాగపూడి కుప్పుస్వామయ్య రామాయణము తిక్కన తాతగారైన భాస్కర మంత్రి కృతమన్నాడు.[46] పాటిబండ మాధవ శర్మ తిక్కన తాత భాస్కరుడు పూర్వ రామాయణమును రచించి ఉండవచ్చుననీ అది హుళక్కి భాస్కరాదుల రామాయణ ప్రశస్తి ముందు నిలబడలేక పోయి ఉండవచ్చునని అన్నాడు[47] హుళక్కి భాస్కరునకు తప్ప మరొక భాస్కరునికీ రచనలో స్థానము లేదన్నాడు భారతుల మార్కండేయ శర్మ.[48] మంత్రి భాస్కరుడే నన్నాడు బొగ్గర ఆదినారాయణాచార్యుడు.[49]

ఆముక్తమాల్యదా కర్తృత్వ వివాదం కూడా ప్రసిద్ధం. 1869 నాటి వావిళ్ళ ఆముక్తమాల్యదా ప్రచురణ పీఠికలో పెద్దన రచన అని ఉండగా,[50] వేదం వేంకట రాయశాస్త్రి ఆముక్తమాల్యదా సంజీవనీ వ్యాఖ్యా సహిత ప్రచురణం పీఠికలో రాయల కర్తృత్వాన్ని సమర్థించడం జరిగింది.[51] రాయలే, పెద్దన సహాయం ఉండవచ్చునని నేలటూరి రామదాసయ్యంగారు. వెల్లండ ప్రభాకరామాత్యుడు, చిలుకూరి నారాయణరావు కృష్ణరాయలే అని వాదించారు. ఈ రెండు వాదాలను సమర్థిస్తూ ఎన్నో వ్యాసాలు వచ్చాయి.

వీరభద్ర విజయ,భోగినీదండకాదుల కర్త పోతన అయిఉండడని కొందరు, భాగవత రచనకు పూర్వము రచించి యుండనోపునని కొందరు, భాగవతానంతరమే వీరభద్ర విజయమని కొందరు వాదించారు. ఉత్తర రామాయణ రచన కంకంటి పాపరాజుది కాదని, పుష్పగిరి తిమ్మకవి రచించి, కంకంటి పాపరాజు పేరు పెట్టాడని ఒక వాదముంది. ఈ విషయాన్ని తడిమి ఉత్తర రామాయణ పీఠికలో కంకంటి పాపరాజు కృతమేనన్నారు ప్రచురణకర్తలు, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.[52] నేలటూరి వేంకటరమణయ్య కూడ ఇదే అభిప్రాయాన్ని ప్రకటించాడు.[53] వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి కూడ ఈ అభియాన్ని అంగీకరించి ఉట్టంకించాడు.[54]

కుమార సంభవ కర్తృత్వ విషయ వదంతులను గూర్చి ముందే చెప్పడం జరిగింది. అది ఇప్పుడు గ్రంథ రూపం ధరించింది.[55] కుమార సంభవం పీఠికలలో ఎవరూ ఈ విషయం చర్చించలేదు.

'పల్నాటి వీరచరిత్ర' కర్త కొంత భాగం వరకైనా శ్రీనాథుడేనని అక్కిరాజు ఉమాకాంతం,[56] పింగళి లక్ష్మీకాంతం[57] నమ్ముతూ ఉంటే "శృంగార నైషధ కర్తయు పల్నాటివీరచరిత్రకర్తయు నెప్పటికిని నొక్కరు కాజాలరు"[58] అన్నాడు శిష్టా రామకృష్ణ శాస్త్రి.

ఆయా గ్రంథాల ప్రచురణ సందర్భంలో పీఠికల్లో తమ వాదాలకు అనుకూలంగా అనేక విషయాలను గూర్చి చర్చించడం సర్వ సాధారణమే. రాయలు ఆముక్తమాల్యద రచించాడా ? అని ప్రశ్న వేసుకుని ఆయన సంస్కృత రచనల విషయంలోనూ సందేహం వెలిబుచ్చిన వారున్నారు. లాక్షణికులు సత్యా

వధూ ప్రీణనం వంటి సంస్కృత రచనల్ని కూడా అల్లసాని పెద్దనకు ఉదహరించడం దీనికి ప్రమాణమయింది. సమకాలీనులు, మిత్రులు, ఆప్తులు, అయినట్లు కన్పించే కవుల విషయంలో ఇటువంటి చర్చలు అనేకం లేవదీయడం జరిగింది. లక్షణ కర్తల పొరపాట్లు, విశ్వాసాలు, మూలం చూడకుండానే ఒకరి నొకరు ఉదహరించుకోవడం, వదంతులు ఇటువంటి వివాదాలకు మూలం. ఈ విషయాలు సాహిత్య చరిత్ర గ్రంథాల్లోకి ఎక్కాయి. పత్రికల్లో చర్చలూ జరిగాయి.

కాల నిర్ణయం :

కవుల కాలనిర్ణయం కూడా అధికంగా గ్రంథ పీఠికలలోనే జరిగింది. ఆదిలో ప్రథమ ప్రచురణలలో జరిగిన కాల నిర్ణయాలు కొంత పుక్కిటి పురాణాల మీద ఆధారపడ్డాయి. కందుకూరి వీరేశలింగం ఆంధ్రకవుల చరిత్ర వెలువడ్డాక చాలా వరకు ఆయననే ప్రమాణంగా స్వీకరించడం జరిగింది. చరిత్ర పరిశోధన అభివృద్ధి చెందడం బహుకావ్య సామాగ్రి అందుబాటులోకి రావడంతో కవుల కాల నిర్ణయానికి ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. కవి చరిత్రలకోసమే శాసన పరిశోధనాదులు వృద్ధి చెందాయి. సాహిత్య వేత్తలయిన పండితులే ఈ పరిశోధనకు పూనుకున్నారు. ఆదిలో కేవలం కాలాన్ని పేర్కొనడమే జరిగింది. ప్రమాణాల పరిశీలన తక్కువే. ఉదాహరణకు గౌరన కాలం 1600 ప్రాంతం అని సి. పి. బ్రౌన్ నిర్ణయించాడు.[59] తరువాత ఈ నిర్ణయాలు చాలా మార్పులు పొందాయి. కొత్త కొత్త ఆధారాలు బయట పడుతూ ఉండటంతో ఈ మార్పులు సహజమే అయ్యాయి. కాని స్పష్టమైన ఆధారాలు లేని చోట, విశ్వాసాలు బలమై వాదాలు పెరిగాయి.

కాల నిర్ణయాన్ని గూర్చిన వివాదాలలో మొదటి ప్రధానమైన వివాదం నన్నె చోడుని కాల నిర్ణయాన్ని గూర్చినది. 1909లో మొదటిసారి ఈ గ్రంథల మొదటి భాగాన్ని ప్రచురిస్తూ మానవల్లి రామకృష్ణకవి నన్నెచోడుడు క్రీ. శ. 940 లో రణనిహతుడయ్యాడని పేర్కొన్నాడు.[60] ఇది అనేక విమర్శలకు లోనైంది. ఈ చర్చలో ఆనాటి ప్రసిద్ధ పండితులంతా పాల్గొన్నారు. ఎన్నో వ్యాసాలు, గ్రంథాలువచ్చాయి.[61] కుమారసంభవం ప్రకాశకవిజ్ఞప్తిలో వావిళ్ళవేంకటేశ్వరులీవాదనలనిట్లా క్రోడీకరించాడు. "ఈతడురాజైనను, తన గ్రంథమున

చారిత్రాంశములను తెలుపక పోవుటచేత నీతని కాలము వివాదములకు మూలమైనది. అవి నాలుగు విధములు, 1. ఈ కవి తెనుగున నాదికవియని యనుకొను చున్న నన్నయ భట్టారకునకు పూర్వుడు. అనగా క్రీ. శ. 940 సం॥ ప్రాంతమువాడు. 2. నన్నయతో సమకాలికుడు అనగా క్రీ. శ. 1054 సం॥ ప్రాంతమువాడు, 3. నన్నయకు వెనుక నొక శతాబ్ది లోపువాడు అనగా క్రీ. శ. 1130 - 50 ప్రాంతమువాడు 4. తిక్కనకు తరువాతివాడు. అనగా సం॥ 1275-1350 ప్రాంతమువాడు. నన్నెచోడకవి క్రీ. శ. సం॥ 1130-50 ప్రాంతము వాడనియే నేడంగీకృతమైనది."[62]

పాల్కురికి సోమనాథుని కాలాన్ని గురించికూడ విపులమైన చర్చ జరిగింది. వేటూరి ప్రభాకరశాస్త్రి పాల్కురికి సోమన క్రీ. శ. 1190 ప్రాంతం వాడన్నాడు.[63] 1190-1260, 70 ప్రాంతమని నిడుదవోలు వేంకటరావు[64], 1120-1240 నడుమనని బండారు తమ్మయ్య[65]లు భావించారు. చాగంటి శేషయ్య ఆంధ్ర కవితరంగిణిలో 1240-1320 మధ్యకాలంగా నిర్ణయించాడు.[66] ప్రతాపరుద్రుడా? రెండవ ప్రతాపరుద్రుడా అన్న దాన్నిబట్టి నిర్ణయించడంతో ఈ వివాదానికి అవకాశం కలిగింది.

చారిత్రకాధారాలు కొంత స్పష్టంగా ఉన్నచోట్లకూడా అభిమాన దురభిమానాలు కారణంగా కొన్ని వాదాలు పుడతాయి. ఎఱ్ఱన కాలనిర్ణయం స్థూలంగా కష్టంకాదు. అద్దంకి రాజధానిగా పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉండి అతనికి హరివంశాన్ని 'అంకితం చేశాడు. తెలుగు పూర్వకవుల జనన మరణ సంవత్సరాలు తెలియడానికి ఏమీ అవకాశం లేదు. ఫలానా రచన చేసే నాటికి ఇంత వయసు ఉండి ఉంటుంది, ఫలానా రాజు ఆస్థానంలో ప్రవేశించే నాటికి ఇంత వయసు ఉండి ఉంటుంది, ఇన్ని సంవత్సరాలు బ్రతికి ఉంటాడు అని ఊహించి తమ ఊహకు అనుగుణంగా తర్కాన్ని ఉపయోగిస్తూ చిన్న చిన్న ఆధారాలతో కాల నిర్ణయ ప్రయత్నాలు సర్వత్రా కనిపిస్తాయి. స్థూలంగా కాల నిర్ణయం చేయగలమే తప్ప ఖచ్చితమైన సంవత్సరాలు ఎవరూ నిర్ణయించలేరు.

ఎఱ్ఱన జననం క్రీ. శ. 1280 ప్రాంతమన్న కందుకూరి వాదాన్నే దివాకర్ల వేంకటావధాని సమర్థించాడు.[67] ఎఱ్ఱన 1350 వరకు జీవించి ఉంటాడని

కందుకూరి[68], 1345 అని చాగంటి శేషయ్య[69], 1335 అని వేలూరి శివరామ శాస్త్రి,[70] 1355 అని పురిపండా అప్పల స్వామి భావిస్తున్నారు[71], ఎఱ్ఱన కాలం 1300-1375 అని నోరి నరసింహ శాస్త్రి[72]. 1350 తరువాత కూడా కొంత కాలం జీవించి ఉండ వచ్చునని దివాకర్ల అనుమానం.[73] ఎఱ్ఱన పుట్టుక 1285 అనీ 1360 తరువాత కూడా జీవించి ఉన్నాడని పాటిబండ మాధవశర్మ.[74]

నాచన సోముని కాలాన్ని నిర్ణయించే పెంచుకల దిన్నె శాసనం విషయమూ కొంచెమించుమించు ఇంతే. చివరికి 1344 అని నిర్ణయం. మరి నాచన సోమన ఉత్తర హరివంశం అంతకు పూర్వమే రచించాడా? తరువాతా? అన్నది సమస్య.

శ్రీనాథుడి కాల నిర్ణయమూ అంతే, 1355 - 1450 మధ్య అయిదేళ్ళు అటూ ఇటూగా అనేక వాదాలుత్పన్న మయ్యాయి. ప్రసిద్ధమైన చారిత్రక పురుషులు, శాసనాలు అన్నీ ప్రమాణాలుగా ఉండగనే ఇది సంభవిస్తున్నది. ఒక్కొక్కచోట ఏ ఆధారమూ లేకుండా ఒక ఐదు సంవత్సరాలు అటూ ఇటూ మార్చి నిర్ణయించడం హాస్యాస్పదంగా కూడా తోస్తుంది.

మొల్ల కాలనిర్ణయం రాయల కాలానికీ, ప్రతాపరుద్రుని కాలానికీ తీసుకొని పోయారు. ఆమె శ్రీనాథుణ్ణి స్మరించింది కాబట్టి ప్రతాపరుద్రుడి కాలంలో బాల్యంలో ఉండి శ్రీనాథుని మొదటి రచనలను ఎరిగి ఉండవచ్చునని ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ నిర్ణయం. మొల్లకాలం 1320, 25-1400, 1405 కావచ్చునని ఆమె ఊహ.[75] 1323 తర్వాత లేడనుకుంటున్న ప్రతాపరుద్రుడి కాలంలో బాల్యంలో ఉండడమంటే ఎంత వయసని? రామాయణాన్ని రాసి ప్రతాపరుద్రుడి సభకు వచ్చిందని కదా ఏకామ్రనాథుడు చెప్పింది. కాబట్టి ఆమె జననం 1320 - 25 ప్రాంతం అని చెప్పడం ఎంతవరకు సమంజసం ?

అష్ట దిగ్గజ కవులంటున్న వారిలో రామరాజభూషణుడు, పింగళి సూరన తెనాలి రామకృష్ణుల కాలం విషయంలోనూ వివాదం ఉంది. వీరు రాయల కాలంలో వారేననీ, తరువాతి వారనీ రెండు వాదాలు కన్పిస్తున్నాయి. పింగళి సూరన్న సుమారు 1532-1583 మధ్య కాలం వాడని మరుపూరు కోదండరామ రెడ్డి.[76] తెనాలి రామకృష్ణుడు రాయల కాలంలో లేడని చాలామంది భావిస్తుండగా

1465-1560 అన్న చాగంటి శేషయ్య వాదాన్నీ, కాకపోతే 1490-1575 మధ్యనైనా ఉండవచ్చుననీ రాయలసమకాలికుడే అని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ భావించాడు.[77] రామరాజభూషణుడి విషయమూ అంతే 1577 ప్రాంతంలో తిరుమల రాయలకు వసుచరిత్ర అంకితమిచ్చిన రామరాజభూషణుడు రాయల ఆస్థానంలో ఉండి ఉండడని కొందరు భావిస్తుంటే అప్పటికి 30, 35 ఏండ్ల యువకుడై వుండవచ్చుననీ, అందులో అసంభావ్యమేమీ లేదనీ కొందరు భావిస్తున్నారు.

సింహాసన ద్వాత్రింశిక రచించిన కొరవి గోపరాజు, 17వ శతాబ్ది వాడని కందుకూరి వీరేశలింగం పంతులు ఆంధ్ర కవుల చరిత్రలో రాస్తే 1480 ప్రాంతం వాడన్నాడు వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి[78] టేకుమళ్ళ కామేశ్వర రావు, మల్లంపల్లి సోమశేఖర శర్మలు భిన్నాభిప్రాయం వ్యక్తంచేశారు. పిల్లలమర్రి పిన వీరభద్రుని తరువాతి వాడని 1500 తరువాతే నన్నది గడియారం రామకృష్ణ శర్మ అభిప్రాయం.[79]

కవుల పౌర్వాపర్యం గూర్చిన చర్చకూడా ఉంది. రంగనాథ, భాస్కర రామాయణాలలో ఏది మొదటిది అన్న ప్రశ్న. రంగనాథ రామాయణమే పూర్వమని పెక్కురు విమర్శకుల అభిప్రాయం. ఎఱ్ఱన, నాచన సోమనల విషయంలోనూ ఇటువంటి వివాదమే, ఎవరు ఎవరిని అనుసరించారన్నదే ఈ తర్కానికి మూలం. సోమనను ఎఱ్ఱన అనుసరించాడని వేలూరి శివరామ శాస్త్రి అభిప్రాయపడితే "ఎఱ్ఱా ప్రగ్గడ కంటె నితడు ప్రాచీనుడుగాడు. సమకాలము వాడుగాని యించుక తర్వాతి వాడుగాని యగును"[80] అన్నాడు వేటూరి ప్రభాకరశాస్త్రి.

పీఠికలలోని ఈ వివాదాలన్నీ చారిత్రక సత్య నిరూపణకు చాలా వరకు తోడ్పడ్డాయి,

రచనల పౌర్వాపర్యం :

శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర రచనా కాలానికి సంబంధించింది ఒక అభిప్రాయభేదం. "శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రమును బాల్యదశలో గొంత మాత్రము రచించెను. దానిలో కథా భాగమును మరల గ్రీడాభిరామమున నోరు

గంట వీథులలో జిత్రములలో వ్రాసి వీర చరిత పాడినట్లు తత్కథ గొంత సూచింపబడియున్నది"[81] అని మానవల్లి రామకృష్ణ కవి అంటే, "...పల్నాటి వీర చరిత్రమే యితడు రచించిన గ్రంథములలో నెల్ల జివరి గ్రంథమని చెప్ప వలయును. శైలిని బట్టికూడ నిట్లే తలంపవలసియున్నది. వీర చరిత్రము తరు వాత నేమియు రచించినట్లు కనబడదు"[82] అన్నాడు అక్కిరాజు ఉమాకాంతం.

శ్రీనాథుని ఇతర రచనల కాలం విషయంలోనూ భిన్నాభిప్రాయాలు కని పిస్తాయి. 1404 లో నైషధము, 1424 లో భీమ ఖండము, 1432 లో కాశీఖండము నని అక్కిరాజు ఉమాకాంతం[83] నైషధ రచన 1400 కు పూర్వమేననీ అంకితం 1405 కు తర్వాతననీ వేదము వేంకటరాయశాస్త్రి[84]. హరవిలాస రచనా కాలం 1400 లని వేదము వేంకటరాయ శాస్త్రి,[85] 1430 ప్రాంతమని వేటూరి ప్రభాకర శాస్త్రి,[86] నైషధ రచన 1410 ప్రాంతమని ఖండవల్లి లక్ష్మీరంజనం, చాగంటి శేషయ్య వాదాన్ని స్వీకరించాడు.[87] నైషధము 1415, హరవిలాసము 1425, భీమఖండము 1430, కాశీఖండము 1445 నని గ. శ్రీ. న. ఆచార్య.[88] శివరాత్రి మాహాత్మ్యం శ్రీనాథుని బాల్య కవిత అని నాగపూడి కుప్పుస్వామయ్య[89] అంటే 1440 ప్రాంతంలో వృద్ధాప్యంలో చేసిన రచన అని కట్టిసాంబమూర్తి శాస్త్రి అన్నాడు.[90]

ఎఱ్ఱన గ్రంథాల పౌర్వాపర్యం గురించిన చర్చకూడా చాలా మంది చేశారు. అరణ్య పర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము గాని లేక రామాయణము, అరణ్యపర్వశేషము, నృసింహ పురాణము, హరివంశము, అనిగాని వరుసక్రమమని వేలూరి శివరామశాస్త్రి[91] రామాయణము, హరివంశము, అరణ్యపర్వశేషము, నృసింహపురాణము అన్న క్రమము పాటిబండ మాధవ శర్మది.[92] అరణ్యపర్వశేషము, నృసింహపురాణము; రామాయణము, హరివం శము నన్నది దివాకర్ల వేంకటావధాని క్రమము[93].

బహు గ్రంథకర్తలైన ప్రముఖ కవుల రచనల విషయంలోనే ఈ వివా దాలు అధికంగా కన్పిస్తాయి.

ప్రాంతం, కుల మతాదులు :

నన్నయ "తమిళుడో, చాళుక్యుల ప్రధాన నగరమైన కళ్యాణపుర ప్రాంతాలనుండి వచ్చిన కర్ణాటుడో అయివుంటాడని వ్యక్తమవుతున్నది."94 అన్నాడు అక్కిరాజు ఉమాకాంతం.

"సోమనాథుడు నేటి మైసూరు రాజ్యములోని తుమ్కూరు జిల్లాలో తెనుగు కన్నడ దేశములకు కూడలిలో ఉన్న పాలకురికి (పాల్కురికి) గ్రామములో జన్మించినాడనిన్ని, చిన్నతనములోనే శ్రీశైల ప్రాంతమునకు వచ్చి చేరుకున్నాడనిన్ని, పాల్కురికిలో జన్మించడము చేత గ్రామము పేరే అతనికింటి పేరయినదనిన్ని, వృద్ధాప్యము వరకున్ను శ్రీశైల ప్రాంతములోనే ఉండి, సిద్ధిపొందే కాలానికి స్వదేశముపోయి కల్కె మనే గ్రామములో చేరి, అక్కడనే సమాధిని పొందినాడనిన్ని నిర్ణయింపవచ్చును"95 అన్నాడు చిలుకూరి నారాయణరావు.

"ప్రతాపచరిత్రము, పిడుపర్తి సోమనాథుని పద్య బసవపురాణముబట్టి కూడ నీ పాలకురికి యోరుగల్లు ప్రాంతమందలిదని కాననగును. ఇదినేటి నిజాము రాష్ట్రములో నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలో వరంగల్లుకు బంద్రెండు క్రోసుల దూరములో నున్నది... దీనికి రెండు మైళ్ళదూరములోనే బమ్మెర పోతనామాత్యుని నివాస స్థానమైన బమ్మెర గ్రామమున్నది."96 అన్నాడు బండారు తమ్మయ్య.

"బమ్మెర పోతనా మాత్యుండు కడప మండలములో నున్న యేకశిలా నగరమను నామాంతరముగల యొంటి మిట్ట యందుండినవాడు"97 అని నాగపూడి కుప్పుసామయ్య. "బమ్మెర పోతన యేకశిలానగరమున నున్నట్లు భాగవతమున చెప్పినందుకు జెన్నపురిలో దానిని మొదట ముద్రించిన వారొంటిమిట్ట యని యూహించి యా యభిప్రాయమునే పీఠికలో వ్రాయగా లోకములో నిట్టి ప్రవాదమును కలిగినది. ఒంటిమిట్ట కేకశిలానగరమను నున్నత నామధేయము పొసగునని దేశచరిత్రకారులంగీకరింపరు"98 అని మానవల్లి రామకృష్ణ కవి.

శ్రీనాథుడు కర్ణాటు డన్నాడు అక్కిరాజు ఉమాకాంతం99 ఆంధ్రుడే నన్నాడు పింగళి లక్ష్మీకాంతం.100 శ్రీనాథుని కాల్ పట్టణాన్ని గురించి ఎన్నో

వాదాలున్నాయి. కందుకూరి కొత్తపట్టణమంటే, చిలుకూరి కృష్ణా పట్టణమనీ, వేటూరి కాశీపట్టణమో, కలపటమో అని, మరొకరు కర్ణాటకలో పశ్చిమ సముద్ర తీరాన ఉన్న పట్టణమనీ ప్రతిపాదిస్తే నాయని కృష్ణకుమారి, వారి పెదనాన్న నాయని నరసింహారావు వాదం ప్రకారం ఒంగోలుకు పదిమైళ్ళ దూరంలో ఉన్న పాదర్తి అన్నది.101 కర్ణాట అన్న శ్రీనాథుని ప్రయోగానికి కన్నడ కాదని కర్ణాటాంధ్ర సంధిప్రాంతంలోని తెలుగేననీ వేటూరి వేంకట రమణయ్య అర్థం చెప్పాడు.

ప్రాంతమే గాక నియోగి, వైదిక భేదాలగురించి, మత విషయాల గురించీ విస్తృతమైన చర్చ పీఠికలలో కనిపిస్తుంది. భాగవత రామాయణాదుల ప్రచురణలలో ఆయా గ్రంథాల మత ప్రాముఖ్యం గురించి పీఠికలు చర్చిస్తే పాలకురికి సోమన గ్రంథాలలో మతతత్వాన్ని గురించి చర్చించారు. బసవ పురాణానికి వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠిక, పండితారాధ్య చరిత్రకు చిలుకూరి నారాయణరావు పీఠికా, బసవ పురాణానికి బండారు తమ్మయ్య పీఠికా వీరశైవ మత సిద్ధాంతాల గురించి విపులమైన చర్చ చేశాయి. శ్రీనాథుని ఈశ్వరార్చన కళాశీలత్వాన్ని గురించి, రాయలు, తెనాలి రామకృష్ణుల వైష్ణవాన్ని గురించి చర్చ జరిగింది. ఆయా గ్రంథాలలోని అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాల చర్చ పీఠికలలో సాగింది.

కవిత్వం :

తెలుగు కావ్యరచన అనువాదంతోనే ప్రారంభమైంది. అందువల్ల ఏ గ్రంథ పీఠికలోనైనా కవి అనువాద విధానం తప్పనిసరిగా స్మరించబడుతుంది. భాగవతాదిపురాణాలలో, భారత రామాయణాది ఇతిహాసాలలో, శృంగార నైషధం వంటి మూలానుసరణాత్మకాలైన కావ్యాలలో మూలం విస్పష్టం. మూల రచనను, అనువాదాన్ని పరిశీలించేటప్పుడు మూలానికి అనువాదానికి ఉన్న భేదాలు ప్రధానం. అనువాద గ్రంథానికే అనేక ప్రతులు, భిన్నపాఠాలు, వాటి విషయంలో అభిప్రాయభేదాలు ఉన్నప్పుడు మూలగ్రంథాల విషయం చెప్పనవసరం లేదు. అయినా స్థూలంగా మూలగ్రంథ పాఠాన్ని అవగాహన చేసుకోవడంలో పెద్ద ఇబ్బందిలేదు. ఒక్కొక్కసారి అనువాదాన్ని బట్టి మూల పాఠ నిర్ణయం కూడా చేయవలసి రావచ్చు. “సంక్షేపించుట, విస్తరించుట,

అన్యథాకరించుట, పరిహరించుట, నూత్నముగా కల్పించుట నన్నయ ఆంధ్రీకరణ లక్షణములు"[102] ఇది స్థూలంగా నన్నయ అనువాద విధానం. మూలంలోని ప్రధాన కథా సూత్రానికిభంగం వాటిల్లకుండా ఈ మార్పులుంటాయి. ఆధునిక కాలం వచ్చిందాకా తెలుగుకవుల అనువాద విధానం నన్నయనే అనుసరించింది. యథామాతృకానువాదాలు కిందటి శతాబ్దంలోనే ఎక్కువయ్యాయి. తెలుగు కవుల ఈ అనువాద విధానాన్ని స్వతంత్రానువాదం లేక స్వేచ్ఛానువాదం అని పేర్కొంటూ పీఠికా కర్తలు సమర్థించారు. "సంక్షేపించుట, పరిహరించుట కథకు నిబిడత్వము కథనమునకు ప్రౌఢత్వము సంపాదించుటకు, విస్తరించుట, కల్పించుట రసభావముల పోషణకు, అన్యథాకరించుట ఔచిత్యమునకు, ఇతిహాస మును కావ్యముగా రూపొందించుటకు ఈ విధానము సర్వథా యోగ్యమై యున్నది."[103] అని నన్నయ గురించి.నన్నయ 'భారత బద్ధ నిరూపితార్థ మేర్పడ' చేయుట, తిక్కన "అమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద", "తెలుగు బాస వినిర్మింప దివురుటరయ" అన్నమాటలు దీన్నే సూచిస్తున్నాయన్నారు. కవిత్రయం వారిది అనువాదం కాదు. పునస్సృష్టియని మన విమర్శకుల అభి ప్రాయం. అనువాదం చేయడంలో ఏ ఏ భాగాలను సంక్షేపించింది, ఏ భాగాలను పరిహరించింది, ఏ భాగాలను విస్తరించింది, ఏ భాగాలలో మార్చి రాసిందీ, ఏ భాగాలను నూతనంగా కల్పించిందీ సోదాహరణంగా పీఠికలలో ఆయా పీఠికా కర్తలు విమర్శించారు. ఆ విమర్శలో అనువాదకులు మూలానికి ఏ విధంగా మెరుగులు దిద్దిందీ, ఔచిత్య శోభితం చేసిందీ వివరించారు. మూలానికి చేసిన మార్పులు కావ్యత్వాన్ని కూర్చడానికీ, ఔచిత్య శోభాన్వితం చేయడానికేనని వీరి తలంపు. కథాసన్నివేశాలు, వర్ణనలు, ప్రత్యేకంగా మూల శ్లోకానికి అనువాదాలు మొదలైనవి ఈ పరిశీలనలో ప్రాముఖ్యం వహించాయి. శబ్ద ప్రయోగ వైశిష్ట్యం, అర్థ వైలక్షణ్యాలను వివరించారు. తెలుగు కవులందరిదీ ఇదే అనువాద విధానం. ఈ విధానాన్ని మెచ్చుకున్నవాళ్ళే ఎక్కువయినా తీవ్రంగా విమర్శించిన వాళ్ళూ ఉన్నారు. నన్నయను అనుసరించడంవల్ల కలిగినవన్నీ అనర్థాలే నన్నారు వీళ్ళు. ఈ ఆలోచనలో మొదట చెప్పుకోదగింది అక్కిరాజు ఉమాకాంతాన్ని. ఈ విధానమే తప్పుల తడక అని ఆయన అభిప్రాయం. మూలాభిప్రాయానికి భిన్నంగా అనువాదం ఉండకూడదన్నది ఆయన నిష్కర్ష. మూలానికి మెరుగు పెట్టారని ఇతర విమర్శకులు మెచ్చుకున్న సందర్భాలలో మూలాన్ని ఎంత

ఔచిత్య రహితంగా అనువాదం చేశారో నిరూపించడానికి ప్రయత్నించాడు. పల్కూటి వీరచరిత్ర భూమికలో విరాటపర్వంలో ద్రౌపదీ కీచకుల ఘట్టాన్ని ఉదాహరణగా తీసుకొని, అది రసాభాసమనీ, ద్రౌపదీ విషయంలో కీచక గతమైన రతిని క్షుద్రమైనదాన్ని అతిశయించి వర్ణించడం అనౌచిత్యమనీ వాదించాడు.[104]

రామాయణ, భాగవతాలలోకూడా అనువాదవిధానాన్ని గురించి, మార్పులు చేర్పుల గురించి ఎన్నో వివరాలు పీఠికల ద్వారా వెల్లడవుతున్నాయి. వాల్మీకి రామాయణంలో లేని విషయాలు తెలుగు రామాయణాలలో కన్పించడానికి కొన్ని కారణాలు కట్టమంచి రామలింగారెడ్డి అనుబంధ పీఠికలో చూడవచ్చు. ఆర్య, అనార్య భేదాన్ని కూడా ఆయన పేర్కొన్నాడు.[105] భాగవతంలో పోతన శ్రీధరభాష్యాన్ని కూడా అనువాదం చేసుకొన్న సందర్భాలను తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్య పీఠికలో చూడవచ్చు.[106]

శృంగార నైషధ కావ్యాంతంలో "శబ్దంబనుసరించియు, నభిప్రాయంబు గుఱించియు, భావంబుపలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యం బాదరించియు, ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబున చెప్పబడి" అని శ్రీనాథుడే చెప్పుకొన్నాడు.[107] దీన్నే లక్షణంగా తీసుకొని నైషధానువాదానికి అన్వయించారు పీఠికాకర్తలు.

ప్రబంధాలలో వస్తువు అల్పమూ, వర్ణనలు అధికమూ. వస్తువు విషయంలో రామరాజభూషణుని "కేవల కల్పనా కథలు..." అన్న పద్యంలో చెప్పినట్లు ఆద్యకథలకు కల్పన జోడించడం ప్రబంధ కవులు చేసింది. కుమారసంభవానికి స్పష్టంగా ఒక మూలం లేదు. అనేక పురాణాలలోనూ కాళిదాసు, ఉద్భటాదుల కావ్యాలలోనూ (లక్షణ కర్త లుదాహరించిన శ్లోకాలు ఆధారంగా) కన్పించే ఇతివృత్తాన్ని ఎంతవరకు నన్నెచోడు డనుసరించాడన్నది పీఠికా కర్తలు చర్చించారు. కేయూర బాహుచరిత్ర మూలాన్నీ, అందులోని నీతికథల మూలాన్నీ చర్చించారు. హరిశ్చంద్రోపాఖ్యానం, శృంగార శాకుంతలం వంటి గ్రంథాలకు మూలమైన భిన్న గ్రంథాలనూ, వారు ఏ మూలంనుండి ఏ కథాభాగాన్ని స్వీకరించిందీ, వారి కల్పన ఏదీ అన్న విషయాన్నిగూర్చి చర్చించారు. ప్రబంధాలలోని ఇతివృత్తాలకు మూలాలను, కవి కల్పనలను విస్తృతంగా చర్చించారు.

హరివంశమూలాన్ని ఎఱ్ఱన, నాచన సోమన్నల అనువాదంలోని భేదాల్ని పరిశీలించారు. విక్రమార్కచరిత్ర, భోజరాజీయం, సింహాసన ద్వాత్రింశిక మొదలైనవాటి మూలకథలను పరిశీలించారు. సకలనీతి సమ్మతమువంటి వాటి మూలగ్రంథాలను, ఏవి ఎందులో నుండి తీసుకున్నారో నిర్ణయించే ప్రయత్నం చేశారు. మూలం విషయంలో అభిప్రాయభేదాలుకూడా ఉన్నాయి. ఉదాహరణకు శ్రీనాథుని భీమఖండం. స్కాంద పురాణాంతర్గతమైన భీమ ఖండమే దానికి మూలం. అయితే ఆ మూలంకూడా శ్రీనాథ కృతమే కావచ్చునని వేటూరి ప్రభాకరశాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం ప్రభృతుల అభిప్రాయం. "ఆంధ్ర దేశానికి సంబంధించిన భీమఖండాన్ని సంస్కృతంలోకూడా శ్రీనాథుడే రచించాడేమోనని నేనప్పుడప్పుడు అనుకుంటూ ఉంటాను"108 అన్నాడు అక్కిరాజు ఉమాకాంతం. శ్రీనాథుడు కాకపోయినా తెలుగు భీమఖండాన్నే స్కాంద పురాణంలోకి తరువాత వారెవరో ఎక్కించి ఉంటారని మరికొందరి ఊహ. లేదు, శ్రీనాథుడే సంస్కృతంనుండి అనువాదం చేశాడని బండారు తమ్మయ్య అభిప్రాయం. "సంస్కృత మూలమునుగూడ శ్రీనాథుడే తెలుగుకృతినిబట్టి వెలయించెననెడి వాదములో సత్యమేమియు లేదు"109 అనీ, "శ్రీనాథుడు హర విలాసమును గొండవీటి సీమలో రచించునాటికే స్కాంద పురాణాంతర్గతమగు భీమఖండము మూలము నాతడు చూచి దాని ననుసరించియే యా గ్రంథమందలి హాలహల భక్షణ కథను రచించెనని స్పష్టముగాక మానదు"110 అనీ, "భీమేశ్వర పురాణము శ్రీనాథుని యితర సంస్కృత గ్రంథానువాదములకన్న మూలమున కెక్కువ చేరికగా రచితమయినట్లు కానవచ్చుచున్నది"111 అని బండారు తమ్మయ్య నిర్ణయించాడు.

తెలుగు కావ్యాలలో మూలానికి అతిసన్నిహితమైన రచనలు అరుదు. కాబట్టి అనువాద విధానం చర్చకు రాకుండా ఉండదు.

కిందటి శతాబ్దపు పీఠికలలో కవిశైలిని గూర్చిన వివరాలు, విశ్లేషణ తక్కువే. ధారాళమైన శైలి, సమాస భూయిష్ఠ రచన, అలతి అలతి పదాలతో శిథిలమైన శైలి, లలితపద విస్తరము వంటి మాటలతో సామాన్యంగా శైలిని వర్ణించేవాళ్ళు. వైదర్భి, పాంచాలివంటి రీతుల్ని ఉపయోగించేవాళ్ళు. సాధారణంగా మచ్చుకు కొన్ని పద్యాలుచూపి వాటిని బట్టి కవి కవిత్వ ప్రౌఢిని ఊహించుకో

మని పాఠకులకే వదిలివేసే వాళ్ళు. తరువాత కవి వాడిన శబ్దార్థాలంకారాలు, వర్ణనలు, రసాలు, జాతీయాలు, నానుడులు విశేష ప్రయోగాలు మొదలైనవి, కథాసారం పాత్ర చిత్రణాదులు చోటుచేసుకోవడం మొదలుపెట్టాయి. వీటన్నింటిని సోదాహరణంగా వివరించడానికి స్థలం పెరగసాగింది

ప్రాచీన కావ్య పీఠికలలో కేవలం కవిత్వాన్ని గురించి మాత్రమే చర్చించిన పీఠిక కట్టమంచి రామలింగారెడ్డి కళాపూర్ణోదయ పీఠిక.

వ్యక్తి సహజమైన ఇష్టాయిష్టాలు కొంత ధ్వనించినప్పటికీ సమకాలీన కవుల విషయంలో కంటే ప్రాచీన కవులవిషయంలో ఎక్కువ విషయ ప్రాధాన్యం (Objectivity) ఉంటుంది. ప్రాచీన సాహిత్యం అంతా పీఠికాకారుడి ముందు ఉంటుంది, కాబట్టి ప్రసక్తాప్రసక్త విషయ వైపుల్యం సాధారణమే. కవుల కవిత్వాన్ని అంచనావేయడంలో కేవల వర్ణనాత్మక వివరణం కాక తులనాత్మక పరిశీలన కూడా సాధారణమే.

ఆయా కవులమీద పూర్వ కవుల ప్రభావం ఎలాపడింది అన్నది పీఠికలలోని ఒక పరిశీలనాంశం. కవిత్రయం వారి ప్రభావం తరువాతి కవులందరి మీదా ఉంది. ఎఱ్ఱన, నాచన సోమనల ప్రభావం పోతన మీద ఉంది. శ్రీనాథుడు, పిల్లలమఱ్ఱి పినవీరనల ప్రభావం తరువాతి ప్రబంధ కవులందరి మీదా ఉంది. ఆయా కవులు ఏయే సందర్భాలలో ఏ పూర్వ కవిని ఎట్లా అనుసరించారన్నది ఒక పరిశీలనాంశమైతే తాము పరిశీలిస్తున్న కవిప్రభావం ఆ తర్వాత కవులమీద ఎట్లా పడింది అన్నది రెండో పరిశీలనాంశం. అతన్ని ఏయే కవులు ఎట్లా అనుసరించారో పరిశీలించడం జరిగింది. ఈ విషయంలోనూ అక్కడక్కడా అభిప్రాయ భేదాలు తప్పవు. ఉదాహరణకు "నాచన సోముని ఉత్తర హరివంశమును నెర్రాప్రెగడ హరివంశమును నొకేమారు క్రమక్రమముగా చదువుచూబోగా సోమననే ఎర్రన అనుకరించినటుల నాకు దోచినది" అని వేలూరి శివరామశాస్త్రి అభిప్రాయపడితే, "కాని ఎర్రయ వొకరిని అనుకరించే వాడుకాడు. పైగా సోమన సమకాలికుడు. ఎర్రయ కంటేచిన్నవాడు"112 అన్నాడు పురిపండా. "సోముని హరివంశమును, ఎర్రన హరివంశమును పోల్చి చూచినచో ఎర్రన ననుసరించియే

సోముడు వ్రాసెననుటలో సందేహములేదు" అన్నాడు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ.

అనుసరణ విషయం ఎట్లా ఉన్నా ఎవరికవిత్వం శ్రేష్ఠం అన్న వివాదం కూడా ఉంది. ఎవరి కవిత్వంలో ఏ లక్షణాలున్నాయన్న విశ్లేషణ కూడా కన్పిస్తుంది. ఒకే గ్రంథం బహు కర్తృకమైనప్పుడు, ఒకే ఇతివృత్తాన్ని తీసుకొని భిన్న కవులు భిన్న గ్రంథాలు రాసినప్పుడు ఇది తప్పదు. భాస్కర రామాయణ కవుల కవిత్వాన్ని పరస్పరం పోల్చడమూ, భాస్కర రంగనాథ రామాయణాల కవిత్వాన్ని పోల్చడమూ ఉంది. ద్విపద కవిత్వమంటే తక్కువచూపు ఇప్పటికీ చాలామంది విమర్శకులకున్నట్లు కనిపిస్తుంది. కొందరు మాత్రం ద్విపదకే అగ్ర స్థానం ఇచ్చారు. "భాస్కరరామాయణములోని కంద గద్య వృత్తములలో కంటె రంగనాథ రామాయణము నందలి ద్విపద పంక్తులలో భావమెక్కువ హృదయంగమముగను నానందజనకముగను బ్రకటింప బడినదని యొప్పు కొనక తప్పదు. ద్విపద చరణంబులు నాతిదీర్ఘంబులై నాతిహ్రస్వంబులై యుండును గావున కరచరణాది సమస్తావయవంబులు నిరవధికముగా నొక్కతరి దృగ్గోచరంబగు పరిమిత పరిమాణ చిత్రపటంబు భంగి నిరంతరాయముగ సమగ్రముగా గ్రాహ్యంబులై తదనుగుణమైన అవిచ్ఛిన్నానందమును గలిగించు చుండును"113 అన్నాడు అక్కిరాజు ఉమాకాంతం.

భాగవత రచనలో పోతన కవిత్వంతో ఏర్చూరి సింగన, వెలిగందల నారయ, గంగయల కవిత్వాన్ని పోల్చడం కనిపిస్తుంది.

ప్రబంధకవులలో మను, వసుచరిత్రల తులనాత్మకపరిశీలన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

ఒక్కొక్క కవి కవిత్వంలో ఒక్కొక్క విశిష్టతను గుర్తించడం జరిగింది. పూర్వకవుల కవిత్వ విశేషాలను అర్వాచీన కవులు గుర్తించి పేర్కొంటే విమర్శకులు వాటిని విపులీకరించడమూ జరిగింది. ఉదాహరణకు "వేమన స్ఫుట బలోక్తి, పింగళిసూరన మృదుభావ నిరతి, శ్రీనాథుడి వాక్యశిల్పం, ప్రాచీనాంధ్ర వాఙ్మయంలో గణనీయమైనవని భావిస్తాను''114 అన్నాడు అక్కిరాజు ఉమా కాంతం.

ఇంతవరకు పైన పేర్కొన్న వివాదాలు ప్రధానమైన వాటిలో కొన్ని మాత్రమే. నన్నయ రచన భారతంలో ఎంతవరకు? ఆంధ్ర శబ్దచింతామణి కర్త ఎవరు?, అరణ్యపర్వ శేషోన్నయం అంటే పర్వపూరణమా, శేషపూరణమా? భట్టుమూర్తి, రామరాజభూషణుడు ఒక్కరేనా?, చక్రపాణి రంగనాథుడు, రంగనాథ రామాయణ కర్తఅనబడుతున్న రంగనాథుడు ఒక్కరేనా? పోతన రేఫఱకార సాంకర్యం చేశాడా?, దక్షిణాంధ్రయుగ కాలానికి సంబంధించిన బిల్హణీయాది అనేక కృతుల కర్తృత్వ మీమాంసలు, ఇంటిపేర్లు మొదలైన వెన్నో పీఠికలలో చర్చనీయాంశాలైనాయి.

భిన్న ప్రక్రియలకు చెందిన గ్రంథాల పీఠికలలో ఆయా ప్రక్రియల చరిత్ర కూడా సంక్షిప్తంగానో, వివరంగానో చెప్పడం జరిగింది. శతకాలు, ఉదాహరణాలు, ద్విపద కావ్యాలు, వీథి, యక్షగానాలు, ద్వ్యర్థి, త్ర్యర్థి కావ్యాలు, అష్టకాలు, అచ్చతెనుగు కావ్యాలు, నిరోష్ఠ్యాది కావ్యాల పీఠికలు ఆయా రచనల లక్షణాలనూ, కొంత చరిత్రనూ వివరిస్తున్నాయి.

పీఠికలలో చెప్పిన విషయాలు, ఇతర పీఠికలు, వ్యాసాలు, విమర్శ గ్రంథాలు మొదలైన వాటిలో చర్చకు కారణమయ్యాయి. ఇతర రచనలలో వ్యక్తమయిన అభిప్రాయాలు పీఠికలలో చర్చకు వచ్చాయి. ఆ విధంగా సాహిత్య విమర్శకూ, చరిత్రకూ ఆకరాలుగా పీఠికలు తోడ్పడ్డాయి.

కవితోద్యమాలు

20వ శతాబ్దంలోని తెలుగు సాహిత్యం ప్రధానంగా మూడు ఉద్యమాలతో పెనవేసుకుని వుంది.

1. కాల్పనికోద్యమం
2. అభ్యుదయ సాహిత్యోద్యమం
3. విప్లవ సాహిత్యోద్యమం

ఈ మూడు ఉద్యమాల కాలంలోను ఒక వైపున సాంప్రదాయిక రచనలు కనిపిస్తూనే ఉంటాయి. అంతేకాదు కాల్పనికోద్యమ కాలంలో సాంప్రదాయిక సాహిత్యమూ, అభ్యుదయ సాహిత్యోద్యమకాలంలో సాంప్రదాయిక కాల్పనిక సాహిత్యాలు, విప్లవ సాహిత్యోద్యమ కాలంలో అభ్యుదయ, కాల్పనిక, సాంప్రదాయిక సాహిత్యాలు వెలువడుతూనే వున్నాయి. కాకపోతే తక్కినవాటి కంటే ఆయా కాలాలలో ఆ ఉద్యమ సాహిత్యాలే ప్రాధాన్యాన్ని వహిస్తాయి.

ప్రాచీన సాహిత్య సంప్రదాయాలకు, భావాలకు భిన్నమైన రచనలు కిందటి శతాబ్దంలో మొదట కవిత్వేతర ప్రక్రియల్లోనే కనిపిస్తాయి. కాని ఆ తర్వాత సమాజంలో వచ్చిన ఏ ఉద్యమానికైనా ముందు నిలబడింది కవిత్వమే. వేగంగా వికాసాన్ని పొందింది కూడ కవిత్వమే; సాహిత్యోద్యమ లక్షణాలకు లక్ష్యంగా నిలబడి ఉందీ కవిత్వమే. సాహిత్య విమర్శకు ప్రధాన లక్ష్యమూ కవిత్వమే. ఆయా కాలాలలో సామాజికోద్యమాలే సాహిత్యస్వరూపాన్ని నిర్ణయిస్తాయి సమాజ చరిత్రకూ, సాహిత్య చరిత్రకు బింబ ప్రతిబింబ సంబంధమే. కాఞట్టి అన్ని సాహిత్య ప్రక్రియలూ ఈ చరిత్రకు అద్దంపట్టక తప్పదు. అయినా కవిత్వం ఈ విషయంలో తక్కిన ప్రక్రియలకన్నా ముందుంది. కనుక ఈ ప్రకరణంలో ఉద్యమాల నేపథ్యంలో పరిశీలనకు కవిత్వ ప్రక్రియకు సంబంధించిన

పీఠికలనే గ్రహించడం జరిగింది. ఇతర ప్రక్రియలలో కవిత్వానికి సంబంధించి వచ్చినన్ని పీఠిక లుండకపోవటం కూడా ఇందుకు ఒక కారణం.

ఉద్యమాలతో సంబంధం లేకుండా వచ్చిన సాంప్రదాయిక కవిత్వ పీఠికలను, హేతువాద అనుభూతివాద ధోరణులలో వచ్చిన కవిత్వ పీఠికలను గూర్చి తరువాతి ప్రకరణంలో చర్చిస్తాను. ఆపై ప్రకరణంలో మిగతా సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన పీఠికలను గూర్చి చర్చిస్తాను.

ఉద్యమాల కాలంలో కవిత్వ ప్రక్రియ రూపంలోనూ, భావంలోను ఎన్నో మార్పులు పొందింది. ముందుగా రూపంలోని మార్పులను, తరువాత భావంలో వచ్చిన మార్పులను గూర్చి చర్చిస్తాను. 1789 లో వచ్చిన ఫ్రెంచి విప్లవం ఉదార వాద ప్రాబల్యతకు దారితీసింది. స్వేచ్ఛ (లిబర్టీ) సమానత్వం (ఈక్వాలిటీ), సోదరభావం (ఫ్రెటర్నిటి) ఫ్రెంచి విప్లవంలో నినాదాలయ్యాయి. ఉదారవాదం, సామ్యవాదానికి దారితీసింది. ఫ్రెంచి విప్లవంతో ప్రభావితులైన అన్నిదేశాల కవులకు, రచయితలకు, 'స్వేచ్ఛ' ప్రణవ మంత్రమైంది. రూపంలోను, భావంలోను స్వేచ్ఛకై కవులు, రచయితలు పాటుబడ్డారు. విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. పాశ్చాత్య రాజకీయ, ఆర్థిక. సాంఘిక, సాహిత్య చరిత్రలతో ప్రభావితులైన తెలుగు కవులూ, రచయితలూ పాత పద్ధతులకు స్వస్తిచెప్పి కొత్తమార్గాలు తొక్కారు. అయితే ఈ మార్పు ఒక క్రమ పరిణామంలో వచ్చింది. కొత్త రచనలు వచ్చినా పాత రచనలు సాగాయి. మార్పునందరూ ఒక్కసారిగా ఆహ్వానించలేదు.

రూపం :

1. నవ్య కవిత్వం :

రాజకీయ రంగంలో స్వేచ్ఛకు నివాళి పట్టినట్టుగానే, కవిత్వ ప్రక్రియలోను ఛందో బంధనాలనుండి విడివడాలని కవులు ప్రయత్నించారు. తెలుగు సాహిత్యంలో తొలి ప్రయత్నం యుగకర్త గురజాడ అప్పారావుది. అడుగుజాడ గురజాడది; అది భావికిబాటే; ఆయన అడుగు జాడల్లోనే తరువాతి కవులు నడిచారు. 'ముత్యాల సరములు'కంటే ముందుగా అచ్చయిన ఆయన 'ముత్యాల సరములు' అన్న వ్యాసంలో భాష, ఛందస్సు, కావ్యగుణాల గురించి ముత్యాలసరాల మీద వచ్చిన విమర్శకు గురజాడ సమాధానం చెప్పాడు. ముత్యాల సరములకు

తాను ఏర్పరచుకొన్న నియమాలను వివరించాడు. పార్సీ గజలు అనుసరణాన్ని చెప్పుకున్నాడు. యతి ప్రాసలు అలంకారాలే తప్ప నైసర్గికమైన లక్షణాలు కావని స్పష్టం చేశాడు.

"నేను యెరిగియె యతి ప్రాసలను అలంకారములుగా ముత్యాల సరములలో ప్రయోగించితిని. నియమముగా నుంచిన యెడల, యతి ప్రాసములకుగాను తెచ్చిపెట్టుకున్న శబ్దములు అర్థ పటుత్వమును చెరచి, సందర్భమును తప్పించి, యీడ్చుకపోవును"[1] అని తన మార్గాన్ని వెల్లడించాడు.

భాష విషయంలో కూడ ఆయన దృక్పథం విలక్షణమైనది. వాడుక భాషను గురజాడ మాతృభాష అని వ్యవహరించాడు. "లక్షణ గ్రంథములనూ, ప్రాచీన గ్రంథములనూ అనుసరించి గ్రాంథిక భాషనే రాతామని వారు యెంత ప్రయత్నించిననూ మాతృభాషా ప్రభావమువల్ల వాడుకభాషలోని ప్రయోగములు తెలిసో తెలియకో పంక్తులలో వచ్చి కూర్చుంటవి"[2] అన్నాడు. ఆయన మళ్ళీ "వాడుకభాష జీవిక కలది. దాని ప్రచారము మహానదీ ప్రవాహము వంటిది. ఎవరడ్డగలరు?"[3] అని వాడుకభాషాప్రచారాన్ని ఎవరూ అడ్డలేరని స్పష్టంచేశాడు.

కవిత్వం ఖండ కావ్యాల రూపంలో వెలువడడానికి కూడ ఆద్యుడు గురజాడ అప్పారావే.

2. భావ కవిత్వం :

భావ కవులు ఛందస్సులో నూతన ప్రయోగాలు చేసినవాళ్ళు కారు. రాయప్రోలు సుబ్బారావు తన 'తృణ కంకణము' లో లిరిక్ సంప్రదాయాన్ని అనుసరించినట్లు చెప్పుకున్నాడు. ఇంగ్లీషు లిరిక్‌కి ఈయన లిరిక్‌కి భేదంఉన్నట్లు కనిపిస్తుంది. తన లిరిక్ లక్షణాన్ని గూర్చి ఆయన ఇలా చెప్పాడు ; "కథ భిన్నంగావుంటుంది. అంగోపాంగములు అంతగా విస్తరించవు. పూర్వోత్తరములు కూడ అధికంగా కథితములు కావు. పెద్ద చెఱకు గడలో రసస్నిగ్ధములైన కండ కణుపులు ఏరెండోమూడో ఏరుకుని సహృదయచర్యకు అందించటమే ప్రధానదృష్టి. అందువల్ల కథా గుంఫనము తీగమీది పువ్వులాగ కలసీ కలయక వుంటుంది"[4] భావకవులు గురజాడ ముత్యాలసరాన్ని కొంత స్వీకరించారు కాని తక్కినవన్నీ పూర్వ ఛందస్సులే. భావకవులు అచ్చులో వృత్తాల స్వరూపాన్ని కొంత

మార్చారు. కొన్ని సార్లు అవి వృత్తాలని గుర్తించడానికే వీలు లేనట్లు ముద్రణలో రూపొందాయి. వేంకట పార్వతీశ కవులు సీస పద్యాలను గుర్తించ రాకుండా ముద్రించారు. ఉదాహరణకు -

ఇది కక్కసపు దిత్తి,
యీ తిత్తిలోపల ననిలముండుట జూడు
మంతె చాలు;
ఇది మొండి కట్టియ,
యిక్కట్టె లోపల నగ్ని యుండుట జూడు
మంతె చాలు;
ఇది బండ జూగుట్ట,
యీ గుట్టలోపల నంచువుండుట జూడు
మంతె చాలు ;
ఇది మంటి సిరి బొమ్మ,
యీ బొమ్మలోపల హంస యుండుట జూడు
మంతె చాలు ;
......
స్థైర్యమూ లేదు ;
విశ్రాంతియూ లేదు ;
నా జీవత మిపుడు స్వభావ చంచలంబైనదై,
వికలంబయి యున్నది ;
గాలిలో దీపంబు బోలి యున్నయది ;
నేను చేసికొన్నది తీర్చువారెవ్వరును లేరు ;
కనుక వగపు జెంది నిన్ను బ్రార్థించితిని ;
తలంచుకొను నెడ నీవింతలో గరుణింపగలవు ;
......

మొదలైనవి. ఇలా ముద్రించటానికి తల ఊచుతూ శివశంకర శాస్త్రి యిలా అన్నాడు.

"ముద్రణ సౌకర్యాలు బాగా ఏర్పడ్డ తర్వాత సాహిత్య గ్రంథాలు శ్రవణేంద్రియం కంటే నయనేంద్రియానికే నచ్చుతున్నవి. నిజానికి నేత్రంకన్న శ్రోత్రమే సాహిత్యానుభవం సమగ్రంగా సమకూర్చుకో గలుగుతుంది. ఈ భావ సంకీర్తన కావ్యం చూపులకు ఒక రకం, పఠనానికి మరొక రకం. ముద్రణలో ముద్దుకోసం ఇలా జరిగింది. పఠనంలో ఒక పసందూ ఉన్నది. ఒక బాధా ఉన్నది. సామాన్య దృష్టికి ఈ పుస్తకం ఛందోబద్ధ మనిపించదు. పద్యరచనా ప్రవీణులు కూడా ప్రథమ వీక్షణంలో ఆంతర్యం అవగతం చేసుకోలేరు. ఇవి సీస పద్యాలని చెప్పినా కాదని వాదించిన వారున్నారు."5

వర్డ్స్ వర్త్ 'లిరికల్ బాలెడ్స్' పీఠిక చదివి తాను కూడా 1909 లో పద్యాన్ని గద్యంలాగ ప్రయత్న పూర్వకంగా రాసినట్లు శివశంకరశాస్త్రి చెప్పుకొన్నాడు. "సామాన్యంగా వృత్త పాదాలను మడత వేసి ఒకటి రెండు చేసి, అచ్చు వెయ్యడం అలవాటు. ఆలెక్కన నాలుగు పాదాలు ఎనిమిది అవుతవి. శ్రీ ముద్దుకృష్ణ 'వైతాళికులు' అన్న కావ్య సందోహంలో వృత్తము ఆరు పాదాలుగా అచ్చొత్తించాడు. శ్రీ కవికొండల వెంకటరావు వృత్తము బహుపాదాలుగా ముద్రించాడు."6

అంటే ఛందో బంధనాలనుండి బయటపడి స్వేచ్ఛగా కవిత్వం చెప్పాలని మనసు కోరినా సంప్రదాయాన్నొక్కసారిగా త్యజించ లేక పోయారు ఆనాటి కవులు. ఆ కోర్కెను గద్యంలాగ ముద్రించడంలో కొంత వరకు తీర్చుకున్నారు. భావకవులు, భావంలో కొంతవరకు నూతనత్వాన్ని సాధించినా, రూపంలో ప్రాచీన కవుల వాసనలను కట్టమంచి రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు'కి రాసిన పీఠికలో గుర్తించాడు. శైలిని, అలంకారాలను విమర్శిస్తూ ఆయన ఇలా అన్నాడు. "అచ్చటచ్చట, శైలి యందును దూరోపమలు మొదలగు నలంకారముల యందును బ్రాచీన వాసన యింకను కొంత వదలవలసి యున్నటుల తోచెడిని"7. పింగళి, కాటూరి 'తొలకరి'కి పీఠిక రాస్తూ రచనకు "సంస్కృత ఛందస్సుల కంటే దేశి ఛందస్సులు మనకనుగుణ" మన్నాడు.8 ఇట్లా కవులు, విమర్శకులు కవిత్వానికి ఏదో ఒక రకమైన ఛందస్సు అవసరమనే భావించారు; పూర్తిగా త్యజించలేదు. ఇది ఒక క్రమ పరిణామం.

'ఎంకి పాటలు' భావకవితా యుగంలో ఒక విశిష్ట రచన. జానపద గీతాలకు దగ్గరగా వుండే భాషలో. శైలిలో రాయటం నండూరి సుబ్బారావు చేసిన నూత్న ప్రయోగం, ఆనాడు పండితులైనవాళ్ళు భావకవిత్వాన్నే వెక్కిరిస్తూ ఉంటే ఇటువంటి రచనలు మరింత దుమారాన్ని రేపాయి. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి వంటి పండితుడు దీనికి పీఠిక రాశాడు. "ప్రాచీన ప్రౌఢ ప్రబంధరీతులకు భిన్నంగా ఈనాడు పండిత పామర సాధారణముగా జన సామాన్యము ఆస్వాదించి తనిసి తమంత తాము గానము చేసి ధన్యతను గాంచుటకనువైన రచనలను ఆధునిక కవి కుమారులెందరో చేస్తున్నా" రనీ, నండూరి సుబ్బారావు "తక్కిన కవి ప్రపంచమువలెగాక తమ శుశ్రూషాంజలు లకు భిన్న మార్గముల నాంధ్ర వాగ్దేవి నలంకరించుచున్నారు. సుబ్బారావుగారు ఆంధ్ర జాతికి సహజములై-శ్రావ్యములై-సొంపు నింపగల మృదు మధుర గేయ ములతో అందునను నేడు వాడుకలో - వ్యవహారములోనున్న జీవద్భాషలో ఎంకి నాయుడు బావల దాంపత్య పూతములను భావోన్నతములును ముగ్ధ ముగ్ధములును అగు ప్రణయ గాథలను గానము సేయుచున్నారు."9 అని ఈ గీతాల ప్రత్యేకతను తెలిపాడు. "ఈ పాటలంత తేటతెల్లముగా - సాధారణ జనమున కంతటికిని తెల్పగల గేయములివి తప్ప మనలో నితరములు లేవనుట సత్య దూరము కాదు."10 అని కొనియాడాడు.

శ్రీ శ్రీ 'ప్రభవ' మొదలుగా అనేకమంది యువ కవులకూ, ప్రసిద్ధ కవులకూ పీఠికలు రాసిన పురిపండా, 'ప్రభవ' ఉపక్రమణికలో ప్రాచీన అధునాతన కవిత్వ రూప భేదాన్నిలా చెప్పాడు. "సారస్వతారామమున నేడు ప్రభవించుచున్న కవితా వల్లరులలో ఖండకావ్య మగ్రతాంబూలమును స్వీకరించుచున్నది. ఒకప్పుడు పురాణములతోడను, మరొకప్పుడు ప్రబంధముల తోడను అలంకరింపబడు తెలుగుతల్లి నేడు ఖండకావ్య సంపుటములతో నలంకరింపబడుచున్నది. ఆ దినములకు ఈ దినములకు పోల్కియేలేదు. నాటి కవులకు పాండితీ ప్రకర్షయే ముఖ్యము. నేటి కవులకు స్వేచ్ఛయేప్రధానము."11

'ప్రభవ' కవిత్వ శైలిని గురించి పురిపండా "లలిత పద భాసురమై అనర్గళధారా సంకలితమై ఉన్నత భావద్యోతకమై 'ప్రభవ' విలసిల్లు చున్నది.

ప్రతి గీతమునందును మాధుర్యము స్ఫురించుచున్నది. పెక్కుచోట్ల ఆంగ్ల సారస్వత ఛాయలు పడినవి. కవి విషయానుగుణ్యముగ వృత్తాల సాగించెను, 'అంతిమ యాత్ర' మొదలగు వానియందు కైశికియు, 'ప్రళయ నర్తనము' మొదలగు వానియందారభటియు, 'మత స్వీకృతి' మొదలగు వానియందు భారతియు 'మృత్యు ప్రబోధము' మొదలగు వానియందు సాత్వతియు జూడ దగును. ఇది మిక్కిలి ప్రశంసనీయము. ఇందు బదునాఱు విషయములుండుటచే దీనిని 'చంద్రకళ' యని చెప్పవచ్చును."[12] అంటూ తన 'ఉపక్రమణిక'ను అరసున్నాలు, బండిఱాలతో గ్రాంథిక భాషలో నడిపించాడు. కవిత్వ పారిభాషిక పదజాలమంతా అలంకార శాస్త్రాలలోనిదే.

3. అభ్యుదయ కవిత్వం :

'మా కవిత్వంలో ఉండకూడని వస్తువు, వాడకూడని భాషలేనే లే'దని[13] నిక్కచ్చిగా చెప్పుకున్నారు ఆధునిక కవులు.

ఆధునిక కవితోద్యమంలో శిష్లా, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణ బాబుల రచనలు మొదటివి. వీరిలో శిష్లా ప్రథముడు. పాతపదాలకు కొత్త అర్థాన్ని కల్పించిన ఘనత ఈయనది. శిష్లా అతి నవీనుల్లో కడు ప్రాచీనుడు. "శిష్లా చేసిన సాహితీ సేవ ఏముందీ అంటే వేలకొలది సంవత్సరాలనుండి అందరినోట పడి అరిగిపోయి వాటం చెడిన నిస్సారమైన మాటలను పునఃసృష్టి చేయడానికి ప్రయత్నిస్తున్నాడు"[14] అన్నాడు నారాయణబాబు. అవసరాల సూర్యారావు కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు. "ఈ మహోదయ ప్రథమ రేఖలు శ్రీ శిష్లా రచనలలో కనిపించాయి. కాల్పనిక యుగంపై విముఖత్వము నూతనత్వం కోసం ఒక అవ్యక్త వేదన ప్రస్ఫుటమౌతాయి. అధునాతన పాశ్చాత్య సాహిత్య రీతుల ననుసరించడానికి భాషను పునఃసృష్టి చేయడానికి ఈయన ప్రయత్నించాడు. పురాతన రీతులనుండి విడివడి నూతన పథాన్ని అవలంబించి రానున్న మార్పుకు అంకురార్పణ చేసిన ప్రథముడీయన."[15]

1950 లో మొదటి సారి అచ్చయినా 1940 లోనే శ్రీ శ్రీ 'మహాప్రస్థానా'నికి చెలం పీఠిక రాశాడు. ఆధునిక సాహిత్యంలోనే విశిష్టమైన పీఠికగా ప్రసిద్ధ

మైన ఈ యోగ్యతాపత్రం శ్రీ శ్రీ కవిత్వంలోని ప్రచండ వేగాన్నందుకున్నది. "కవిత్వంలోను, జీవితంలోను, Economy of words and thoughts లేకపోవటం దేశభక్తికన్న హీనమైన పాపం" అన్నాడు గుడిపాటి వెంకటచలం. పాత కవిత్వం గురించి, ప్రస్తుత కవిత్వం గురించీ, శ్రీ శ్రీ కవిత్వం గురించి చెలం విశ్లేషణ చేశాడు. కవిత్వాన్ని తూచే రాళ్ళు తన వద్ద లేవంటూనే శ్రీ శ్రీ కవిత్వాన్ని సరిగ్గా తూచాడు. "కవిత్వాన్ని ముఖ్యంగా తెలుగు కవిత్వ కన్యల్ని చూస్తే చలానికి ఇంపేషన్స్, అనుమానం. శబ్ద సౌందర్యంతో తృప్తిపడి సంతోషించవలసిందే కాని, చెప్పేదానికి అర్థం వెతకడం అవివేకం అని ... తను చెప్పదలుకొన్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చాతకాని తనాన్ని, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా కఠిన పదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి - ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు సులభంగా సూటిగా చెప్పేసి, ఇంత ధ్యానానికీ, మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ వ్యవధి నివ్వరాదా అని చెలంకోర్కె. ఆ పని స్త్రీలూ చెయ్యరు, దేశ నాయకులూ చెయ్యరు - ఎంకీ, శ్రీశ్రీ తప్ప."[16]

ఇంకా ఇలా అన్నాడు, "పాత పదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవీ జీవితంలోవీ ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరగ్గొట్టాడు శ్రీశ్రీ"[17]

రూపంలో సంప్రదాయాన్ని విడనాడటం ఆధునిక కవిత్వంలో మొదలైంది. ఆరుద్ర 'త్వమేవాఽహమ్' ప్రకాశికలో ప్రకాశకులు ఆరుద్ర భాష, టెక్నిక్కుల గురించే మాట్లాడారు. "కవిసమయాలలోను, వస్తువులోను, ఛందో నియమాల లోను, సంప్రదాయాన్ని కవి ఛిద్రం చేశాడు. ప్రాచీన అలంకారాల్ని వదలి సమకాలీన నాగరికతను అపభ్రాంతం చేసే పద చిత్రాల్ని విశేషంగా వాడాడు. అంతే కాదు తాను జీవిస్తున్న యుగంలో పూర్తిగా సజీవంగా ఉన్న వ్యక్తి గతానుభవ రీతుల్ని, అనుభవ ప్రకారాల్ని నవీన స్వేచ్ఛాయుత జ్ఞానేంద్రియ వ్యాపారాన్ని ఖచ్చితంగా వ్యంజించాడు. అభిగల్నీ, సంజ్ఞల్ని విశేషంగా వాడుతూ తన శిల్పాన్ని బలవత్తరం చేసుకొన్నాడు."[18] ఆధునిక కవిత్వానికి వచన

కవిత్వమే అనుకూల రూపం అని చాలామంది భావించారు. 'తృణకోణాలు' కవిత్వ సంకలనానికి పీఠిక రాసిన అనుముల కృష్ణమూర్తి ఇలా అన్నాడు. "ఆధునిక కవికి స్వంత వ్యక్తిత్వాన్ని స్వేచ్ఛా విహారాన్ని వచన కవితా మార్గమే త్వరగా ప్రసాదిస్తుందనిపిస్తుంది"[19] నగ్నముని 'తూర్పు గాలి'కి పీఠిక రాస్తూ శ్రీశ్రీ "వృత్తాలు ఛందస్సుల పట్టాలమీద నడిచే రైలుబండ్లు, వచన గీతాలు వ్యోమ యానం చేసే విమానాలు. వచనం బరువైన బండలాగ ఒకంతటగాని ఆకాశం మీదకు లేవదు. వచనాన్ని కవనం చేయటం అనేది ఒక్క కళాకారునికి మాత్రమే సాధ్యం"[20] అన్నాడు.

కె.వి. రమణారెడ్డి సంస్కృత శబ్దాల ప్రయోగాన్ని తగ్గించాలనీ, మొదట తాము ఛందో బందోబస్తులను ఛట్‌పట్‌మని తెంచినప్పటికీ వస్తువు యొక్క అవసరాని కనుగుణమైన ఛందస్సును స్వీకరించడం తప్పదని అభిప్రాయపడ్డాడు.[21] వచన గేయాన్ని ఆహ్వానించాడు. ముక్తఛందోరీతులు భావకవిత్వం ప్రాధాన్యమిచ్చిన గేయానికీ, పద్యంలోని గేయగుణానికీ రియాక్షనుగా వెలువడ్డా యన్నాడు.[22] ఇట్లా అంటూ 'ఈ యుగంలో తెలుగు కవుల మనస్సులకు తగులుతున్న మేలైన కొత్త రూపాలలో వచన గేయం ఒకటి అని నా నమ్మకం' అన్న కుందుర్తిని ఉదహరించాడు.

సంప్రదాయ కావ్య ధోరణులను ఆయన యిలా విమర్శించాడు "ఎన్నడో లాక్షణికులేర్పరచిన మాన దండాలను అనుసరించి వస్తువులోనూ, రీతిలోనూ నిరుత్సకమైన జడిమకు లోబడి వర్తమాన యుగావసరాలనేమి, జన హృదయా న్నేమి ధ్వనించక, శబ్దాలంకారాలు అర్థాలంకారాలు గాడిద మోతకాగా...చిరకాలాను గత కావ్య ధోరణులు మురుగునీటి గుంటలైనవి. నవ్య సాహిత్య పరిషదుద్యమ ఫలితంగా, యీ నీటి గుంట ఉపరితలం మట్టుకే చెదిరింది కాని అంతకంటే పెద్ద మార్పేమీ కలుగలేదు. వ్యావహారిక భాషోద్యమాన్ని, సులభ కావ్య శైలిని, దేశిచ్ఛందోరీతులను తొలుదొలుత స్వీకరించి, వెనువెంటనే కొద్దికాలానికే వాటి జీవ వస్తువును భ్రూణ హత్యజేసి పై బెంకను మట్టుకు నవ్య సాహిత్య పరిష దుద్యమం లోకానికి చూపసాగింది."[23]

'ఫిడేలు రాగాల డజన్' పీఠికలో శ్రీశ్రీ "ఛందస్సుల చందశాసనానికి కూడా కాలం వెళ్ళిపోయింది. కవి హృదయంలోని రాగాలాపన ఎట్టి తీగ సాగితే అదే గీతానికి ఆకారం నిర్ణయించాలి."[24] అన్నాడు. నానార్థాలు పర్యాయ పదాలు రెండూ నవకవికి నచ్చవన్నాడు.

కుందుర్తి ఆంజనేయులు ప్రసిద్ధ కవులకూ, యువకవులకూ, అనేక పీఠికలు రాశాడు. పీఠికలలో తన రాజకీయ సాహిత్య సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. వచన కవితా ప్రక్రియను ప్రచారం చేయటమే ప్రధాన ధ్యేయంగా కుందుర్తి పీఠికలు నడిచాయి. అభ్యుదయ కవిత్వానికి రూపం వచన గేయమే నన్నది కుందుర్తి అభిప్రాయం. అభ్యుదయ కవిత్వము, వచన గేయము ఒక్కసారిగా రావడం బహుశా ఈ రెండింటికి అవినాభావ సంబంధం కల్పించడానికి హేతువై ఉంటుంది. 'తంగెడు పూలు' కు పీఠిక రాస్తూ ఆయన ఇలా అన్నాడు. "సమకాలీన సమాజ స్పృహతో కూడిన రచనలు చేసేవారు, పురోగామి దృక్పథం కలవారందరూ అభ్యుదయ కవులే. ఈ విధంగా చూసినప్పుడు ఈనాటి వచన కవిత్వంలో అధికభాగం అభ్యుదయ కవిత్వమే. వచన కవిత రాయడం ప్రారంభించగానే పాత వాసనలు కలవారు గూడా అభ్యుదయ కవితానుగుణమైన ఊహలను ప్రకటించడం తదనుకూలమైన కావ్య వస్తువును ఎన్నుకోవడం తప్పని సరి అయిన పరిస్థితి ఏర్పడింది"[25] ఇది కొంత విపరీతమైన ఆలోచనే. భావానికి బంధనాలు వేసే రూపాన్ని త్యజించి అవతరించిన వచన కవిత తిరిగి రూపంతోపాటు భావాలు అనుగుణంగా సాగుతాయనడం, మళ్ళీ రూపానికి ప్రాధాన్యత ఇచ్చినట్లే అవుతుంది. 'దివ్యదీపం'కు రాసిన పీఠికలో ఆయన ఈ అయోమయం నుండి కొంతబయట పడినట్లు కనిపిస్తుంది. "ప్రపంచ వ్యాప్తంగా కళలలో సోషలిస్టు వాస్తవికతా వాదం ప్రవేశించిన తరువాత పటం పూర్తిగా మారిపోయింది. అది నడవడలచుకొన్న తీరు వచన కవిత్వంగా రూపురేఖలు దిద్దుకున్నది. ఈ రెండూ రెండు కావు. ఒకటే. మరి వచన కవిత్వరూపంలోనే వస్తున్న ప్రేమ కవిత్వాలు, భక్తికవిత్వాలు, అయోమయపు మిస్టిక్ కవిత్వాలు, అనుభూతి కవిత్వాల మాటేమిటి? ఇవి తిరోగమన లక్షణాలు; దొడ్డిదారిన ఇంట్లో ప్రవేశించే ప్రయత్నాలు."[26]

శైలీ పరంగా అభ్యుదయ కవిత్వానికి సారళ్యం ప్రధానమంటాడు కుందుర్తి. వాడుక భాష, తెలుగు ఇడియం, సారళ్యత కవిత్వంలో ఉండాలంటాడు. కవిత్వానికి గూఢత్వ కవచం ఉండరాదంటాడు. నవీనుల్లో కవితాస్పృహ పేరిట కవిత్వంలో చోటుచేసుకుంటున్న గూఢత్వాన్ని విమర్శించాడు, "నాకు అనిపిస్తున్నదేమంటే నినాదాల కవిత్వం, రాజకీయ కవిత్వం, ప్రబోధ కవిత్వం అనే మాట పడకుండా ఉండేందుకు కవితా స్పృహ అనే భ్రాంతిలోపడి, నవీనులు -అందులోనూ సామాజిక వాదులు కూడా - అలంకారాలవైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇవి కూడా అలంకారం, వక్రోక్తి - యిత్యాది పాత మాటల రూపంలోనైతే లొంగేవారు కారు. కాని ఇమేజ్, ఎక్స్‌ప్రెషన్, ఫిగర్, పిక్చర్ మొదలైన కొత్త మాటలు కాబట్టి అంగీకరించి వాటివెంబడి పోతున్నారు. దీనివల్ల పూర్వం అలంకార భారం గల కవిత్వం ప్రజలకు ఎంత దూరంగా ఉండేదో ఇప్పుడంతే దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతున్నది."[27]

అందువల్లే కవిత్వ భాష ప్రజల సంభాషణా స్థాయిలో ఉండాలన్నాడు కుందుర్తి. "దాదాపు పదిహేనేండ్ల క్రితం అనుకుంటాను వరంగల్లులో ఏర్పాటు చేసిన 'మిత్రమండలి' సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఆధునిక కవిత్వపు శైలి సామాన్య ప్రజల సంభాషణా స్థాయికి రావాలని నేను మొదటిసారిగా ప్రతిపాదించాను.''[28]

కవిత్వంలో సారళ్యాన్ని సాధించడానికి మార్గ నిర్దేశం చేశాడు కుందుర్తి. 'దర్పణం'కు పీఠిక రాస్తూ ''ప్రబోధం వగైరా మాటలు అనిపించుకోకుండా ఉండడానికి నేను చాలకాలంగా చెప్తున్న పరిష్కారం, నీవు చెప్పదలచుకొన్న సందేశంతో కథాంశను జోడించటం. అప్పుడు దాన్ని ఎవరూ ఏమీ అనే వీలుండదు. పైగా కథాంశ ఎప్పుడు వచ్చిందో సాధారణంగా సారళ్యం దాని వెంట వస్తూనే ఉంటుంది. వద్దని నీవు మనసులో అడ్డుపెడితే తప్ప. జానపద సాహిత్య కథా కావ్యాలు, మన పూర్వ మహాకావ్యాలు (ఎపిక్స్) దీనికి ఉదాహరణలు"[29] అన్నాడు కుందుర్తి. కథా, నవలా ప్రక్రియల (వచన ప్రక్రియల) కథాంశ లక్షణాన్ని వచన కవిత్వానికి జోడించడం, వచన కవిత్వాన్ని మరో మలుపు తిప్పటం కుందుర్తి చేసిన పని.

వచన కవిత్వంలోని శైలీభేదాన్ని కుందుర్తి ఇలా విశ్లేషించాడు. "వచన కవిత నేడు ప్రధానంగా రెండు రకాలైన శైలులను ఆశ్రయించుకొని ప్రయాణం చేస్తున్నది. 1 సమాస బాహుళ్యము, సంస్కృత లేక ఆంగ్లభాషా శబ్దప్రదర్శనమూ, ఉక్తిలో గ్రాంథిక ఛాయలూ కలిగి పద్యమూ, వచన గేయమూ అనే భేదం మాత్రమే, మిగుల్చుకుని పూర్వ కావ్య భాషా సంప్రదాయానికి చేరువగా నడుస్తున్న శైలి. రెండవది వ్యావహారిక భాషా వాదాన్ని జీర్ణించుకుని, ప్రజల పలుకుబడిలోని మెళకువలను సంగ్రహించుకొని, తెలుగు నుడికారములోని సొగసులను ఆవిష్కరించుకుంటూ, వర్తమాన కాలపరిస్థితులకూ సమకాలీన ప్రజల హృదయాలకూ దగ్గరగా నడుస్తున శైలి భాషా, భావ వికాసోద్యమాలకు ఆద్యులైన గిడుగు, గురజాడ ఆశయాలకు యీ రెండవ శైలి నిజమైన వారసురాలు."[30]

అభ్యుదయ కవిత్వానికి రూపం వచన కవిత్వమే అని వాదించినా, దాన్ని ఒక ఉద్యమ స్థాయికి తెచ్చినా కవిత్వం సామాన్యుడికి అందుబాటులో ఉండాలన్న లక్ష్యంలో అది పూర్తిగా సఫలం కాలేదని కుందుర్తి కూడ గుర్తించాడు. అది పాక్షికంగా మాత్రమే సఫలం కావటానికి ప్రజల సాంస్కృతిక స్థాయి ఎదగక పోవడమే కారణమని భావించాడు. సామాన్యుని దగ్గరకు పోవటానికి దేశీ ఛందస్సులే శరణ్యమని భావించాడు. "విప్లవ కవులు మొదలగు అత్యాధునికులు లయబద్ధమైన దేశిచ్ఛందస్సుల వైపు మరలుతున్నారు. నేరుగా సామాన్యుల దగ్గరకు పోయి ప్రబోధం చేయాలంటే దేశిమార్గమే శరణ్యము. అభ్యుదయ కవిత్వపు రోజుల్లో కూడా సుంకర, వాసిరెడ్డి ప్రభృతులు ఈ మార్గాన్ని చేపట్టి రచనలు చేశారు. బుర్రకథలు, జంగం కథలు, జముకుల కథలు, జానపద గేయ ఫణితులు సరళసుందరములైన నాటక ప్రదర్శనములు మొదలగు వాటి ద్వారానే నిజంగా ప్రజలను చేరుకునే అవకాశం ఉంది. వచన కవిత్వం మొదలగు ఈ రూపాలు కొద్దో గొప్పో చదువూ సంస్కారం కల మధ్యతరగతి ప్రజలను మాత్రమే ప్రబోధితం చేయగలుగుతాయి."[31] అన్నాడు కుందుర్తి. మారుతున్న ధోరణులతోపాటు కుందుర్తి ఆలోచనలలోను మార్పులు వచ్చాయి. 'తంగెడు పూలు'కు పీఠిక రాస్తూ మళ్ళీ ఇదే విషయాన్ని స్పష్టం చేశాడు. "మన లక్ష్యం సామాన్య పాఠకుడు మామూలు మధ్యతరగతి మనిషి. లేకుంటే నిరక్షరాస్యులయిన కోట్లాది కార్మిక కర్షకులు... కాని వీరిలో చదువుకున్న సామాన్య మధ్యతరగతి పాఠకుణ్ణి మాత్రమే మనం అందుకోగలిగాం. మన లక్ష్యమైన

కార్మిక కర్షక జనావళి దగ్గరకు పోలేకపోయామనే భావన యిటీవలనే ప్రచారం పొందింది. ఇది యథార్థం కూడా. వారి దగ్గరకు పోవాలంటే జానపద రీతు లొక్కటే మార్గం... వచన కవిత రూపంలో సామాన్య ప్రజల దగ్గరకు పోవాలంటే భారత రామాయణాలు పోయినట్లు పోవాలి."32

కవిత్వంలో అలంకార ప్రాధాన్యాన్ని కుందుర్తి నిర్ద్వంద్వంగా ఖండిం చాడు. కవిత్వంలో కవి అభిప్రాయ ప్రకటనకు దోహదం చేయటమే వాటి పాత్రగా భావించాడు.

'మినీ కవిత' ఆధునిక సాహిత్య ప్రక్రియ. భావ కవిత్వపు ఖండకావ్యాలు, ఖండికలు కుంచించుకుపోయి, మరీ చిన్నవయిపోయి మినీ కవితలయ్యాయి ఆధునిక కవిత్వంలో. వచన కవిత్వ రూపాన్ని చేపట్టిన మినీ కవితకు స్పష్టమైన ప్రత్యేక రూపం ఏదీలేదు. - మరీ చిన్నదవటం తప్ప. కుందుర్తికి యిష్టంలేని సాహిత్య ప్రక్రియ యిది. దీనివల్ల కవి పెరగడని ఆయన ఉద్దేశం. ఆయన మాటల్లో - "దాదాపు పాతికేళ్ళ క్రితమే భావకవిత్వం నుండి మనకు సంక్రమించిన ఖండికా సంప్రదాయాన్ని నేను ఖండించాను. నేను చెప్పే కథా కావ్య సిద్ధాంతానికీ, ఖండికా సంప్రదాయ నిరసనకూ సంబంధం వుంది. ఈ రెండూ ఒక భావ ధారనుండి పుట్టినవే. ఇటీవలి కాలంలో ఖండిక అనేది పరి మాణంలో ఇంకా చిన్నదై మినీ కవితగా రూపం దాల్చింది... 'గంగి గోవుపాలు గరిటెడైనను చాలు', 'వాక్యం రసాత్మకం కావ్యం' మొదలైన వాటిని అడ్డం పెట్టుకుని చేసుకుంటున్న ఈ ఆత్మ వంచన గురించి కనీసం అభ్యుదయ భావుకు లైన యువకవులైనా పునఃపరిశీలన చేసుకోవలసిందని నేను సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను. దీనిని పట్టుకొని వ్రేలాడితే వారు ఇక పెరగరేమోననే భయంతోనే అంటున్న మాటల్ని వారు అపార్థం చేసుకోరనే నా విశ్వాసం"33 మినీ కవితలపట్ల కుందుర్తి ఆవేదన నర్థం చేసుకోవడంలో కష్టం యేమీలేదు. ఆయన ఉద్దేశం కవిత్వం మధ్య తరగతి పాఠకుల నధిగమించి కార్మిక, కర్షక వర్గాలకు చేరటం. అది దేశిమార్గంలో, కథాంశ ప్రాబల్యంతో సాధించవలసి వుంది. ఉదాహరణలు భారత రామాయణాల్లాంటివి స్పష్టంగా చూపిస్తున్నాడు. అలాంటి సందర్భంలో కార్మిక కర్షక వర్గాన్ని ఆకర్షించలేని వచన కవితా రూపంలో, కథాంశకు అసలు అవకాశంలేని మినీ కవిత ఏం సాధించగలదు?

అందువల్ల మినీ కవిత ఏ ప్రయోజనాన్నీ సాధించలేదు. అందుకే 'ఆత్మవంచన' చేసుకోవద్దని తపనతో కుందుర్తి అన్నాడు.

4. అభ్యుదయ-విప్లవ కవితోద్యమాల సంధి దశ : దిగంబర కవులు

జీవితంలోని కృత్రిమాల ముసుగును తొలగించి స్వేచ్ఛగా అసలు రూపంలో బతక యత్నించమని ప్రబోధిస్తూ, అలా తామున్నామని ఎలుగెత్తి చాటిన కవులు దిగంబర కవులు. వారి కవితలను ఏమనాలో వారే చెప్పారు. వారు ప్రచురించిన మొదటి సంపుటంలో వాటి నేమనాలో నిర్ణయించుకోలేదు కాని, రెండో సంపుటంలో 'దిక్'లు అన్నారు. తమ కవిత్వాన్ని వచన కవిత అనలేదు సరికదా అననివ్వం కూడ అన్నారు. వచన కవితపట్ల తమ అపనమ్మకాన్ని జ్వాలాముఖి హిమజ్వాల రాసిన 'చూపు'కు పీఠికలో యిలా వ్యక్తపరిచాడు. "ఆధునిక యుగావసరంగా సాహిత్య ప్రక్రియల సంస్కరణలో వచ్చిన వచన కవిత నేటి బూర్జువా డెమాక్రసీకి చిహ్నంగా 'ప్రివిలేజ్‌డ్ క్లాస్ పొయట్రీ'గా అభివృద్ధి చెందింది...వస్తుపర ప్రాధాన్యత తగ్గి, రూపపరమైన సాహిత్య ప్రక్రియ ఆధునిక సాహిత్యంలో ఒక నవీన ఉద్యమంలా వేళ్ళూన సాగింది. ఏ ప్రయోజనమూలేని వానికి ఏ సాంఘిక ప్రయోజనమూ ఉండదు. అలాగే వచన కవిత మొదట్లో ప్రివిలేజ్‌డ్ క్లాస్ పొయట్రీగా దీర్ఘాలు తీసింది. అభ్యుదయ భావాన్ని నిర్మూలించటానికి శాయశక్తులా పనిచేసింది. రూపంలో వచ్చిన మార్పు వస్తువులో రావాల్సిన సాంఘిక నిబద్ధతను విచ్ఛిన్నం చేసింది. విగత ప్రాణుల స్వగతాలుగా, నిర్వేద వచనాలుగా అనుభూతి అన్వేషణలో భావకవుల ఆత్మాశ్రయ వాదాన్ని తిరిగి ప్రచారం చేసింది."34

వచన కవితపై అపనమ్మకాన్ని దిగంబర కవుల పదజాలంతో జ్వాలాముఖి ఇలా వ్యక్తపరిచాడు. "యుగావసరాన్ని వెనక్కి మళ్ళించి సొంత అవసరాలు తీర్చుకునే స్వార్థపర శక్తులు ఏ అవకాశాన్ని జారవిడుచుకోవు. అన్ని రకాల ధోరణులు డెమాక్రసీలో ప్రవేశించినట్లుగానే వచన కవితలో నానా గోత్రీకులు ప్రవేశించి కుంభమేళా చేశారు. అభ్యుదయ కవితా రెనిగేడ్లు, భావ కవుల స్వగతాలు, జాతిని కొల్లగొట్టే జాతీయ వాద తిరోగమన వాదాలు, మాటల గారడీలు, ఎగుడు దిగుడు వాక్యాల అర్థరాహిత్యాలు, అనుభూతి, మానసిక వికారాలు, అతీంద్రియ అన్వేషణలు, గమ్మత్తులు, షార్ట్‌కట్‌లు, వలస సంస్కృతి

తాత్విక ధోరణులు, ఆధునికతా మోసగాళ్ళు వగైరా ప్రతీప శక్తులు వచన కవితలో బ్రూట్ మెజారిటీని సంపాదించుకున్నాయి. సాహిత్య ప్రయోజనం రూపంలో మారి తిరిగి సంప్రదాయ బద్ధమై పాలకవర్గం కొమ్ము కాయసాగింది. సాహిత్య ప్రపంచం తీవ్ర సంక్షోభానికి గురి అయింది."35 అందుకనే దిగంబర కవులు తమ 'దిక్'లను వచన కవిత అననీయమన్నారు.

దిగంబర కవులకున్న భావపరమైన అపనమ్మకాన్ని రూపంగా వచన కవిత్వానికంటగట్టడం న్యాయం కాదు. రూపంగా భావకవులూ, అభ్యుదయ కవులూ, దిగంబర కవులూ, విప్లవ కవులూ వచన కవిత్వాన్ని చేపట్టారు. భావ వ్యక్తీకరణకు అది ఒక వాహిక మాత్రమే. తమ కవిత్వాన్ని 'దిక్' లన్నా, వచన కవిత్వమన నీయమని దబాయించి చెప్పినా రూపపరంగా దిగంబర కవుల కవిత్వం వచన కవిత్వమే. ఏవిధంగానూ దాన్ని వచన కవిత్వం నుండి వేరు చేయలేము.

౫. విప్లవ కవితోద్యమం :

అభ్యుదయ కవిత్వానికి రూపం వచన కవితగా ప్రచారం పొందింది. విప్లవ కవిత్వ విషయంలోనూ రూపాన్ని గురించిన చర్చ జరిగినా గేయం, వచన కవిత రెండింటినీ విప్లవ కవులు స్వీకరించారు. ప్రాధాన్య వివక్ష కనబడుతుంది. విప్లవ భావాల ప్రచారానికి జానపద కళారూపాలను ఉపయోగించవలసిన ప్రాధాన్యతను చాల మంది పేర్కొన్నారు. "అనేక ప్రయోగాలకు ఆలవాలమైన ఈనాటి కవిత ప్రధానంగా వచన కవితా శిల్పంతోనే కొనసాగుతున్నది. మరో వైపు ప్రజా పోరాటాల్లో భాగంగా పని వుండే 'పాట' కలిసిపోతున్నది. పోరాట స్వభావం కల కవిత్వం వచన కవితా రూపంలో ఉన్నా తన పరిమితుల్లో ఉద్యమంలో భాగం పంచుకుంటున్నది; చేరవలసిన వాళ్ళ దగ్గరికి చేరుకుంటూనే ఉంది."36 అన్నాడు నిఖిలేశ్వర్.

కె. వి. రమణారెడ్డి 'మరోఝుంఝు' అన్న కవితా సంకలనానికి పీఠిక రాస్తూ యిలా అన్నాడు. "ఈ సంకలనంలో మనం దాదాపు పాటలను చేర్చలేదు. అన్నీ వచన కవితలే. వచన కవిత పాటలా వర్గ శత్రువు గుండెల్లోకి ఈటెగా సూటిగా పోక, లేక ప్రజల్లోకి తేలిగ్గా ఒడుపుగా పోక కాస్త ఎడంగా బిగ్గరగా

చదివేందుకు అనువుగా ఉంటుంది. కావాలనే దానికి పూర్తిస్థానం ఈ సంకలనంలో ఇస్తున్నాము. విప్లవ కవితకంతటికీ ఇదే లక్షణమనుకోకూడదు. అది ఎన్నో పాయలు గల నది. ఒక పాయనే ఇక్కడ ఉన్నంతలో చూపుతున్నాం"37 కాని ఆయనే "విప్లవ సాహిత్యం తన మధ్యతరగతి విద్యాధిక రచయితల పాఠకుల పరిమితులను పూర్తిగా వదిలేసుకుంటూ, పాఠకుల్ని శ్రోతలుగా మార్చగోరుతున్నట్లుగానే కవులను గాయకులుగా మార్చగోరుతుంది. ఇది ఆ ఉద్యమానికి అనివార్యమైన పరిణామము''38 అన్నాడు 'అరణ్య నేత్రం' పీఠికలో. ఇదే పుస్తకానికి మరో పరిచయం రాస్తూ నగ్నముని, ''కందం రాసినవాడే కవి' అని నాడు కొందరన్నట్లు 'పాటలు రాసేవాడే జనందగ్గరకు పోగల కవి' - అనేవారు నేడు కొందరున్నారు. మాట్లాడే భాష రాసే భాష శతాబ్దాలుగా ఒకటి కాని దేశంలో, నిరక్షరాస్యులు మాత్రమే ఎక్కువ సంఖ్యలో ఇంకా ఉన్న ఈ దేశంలో ఏ ఒక్క నిర్వచనమూ పూర్తి నిజాన్ని వెల్లడి చేయలేదు. పాట రాసినా, ఆట ఆడినా, మాట వాడినా అది ఈ వ్యవస్థను, దానికి ఆధారమైన నేటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతిక విలువల్ని మార్చే ప్రయత్నంలో ఆయుధం కాగలగాలి"39 అన్నాడు.

విప్లవ సాహిత్యంలో పాట తెచ్చిన మార్పులను పేర్కొంటూ "ఉద్యమం నీరు కారినప్పుడు మధ్య కాలంలో కవిత్వం ప్రజల్నుంచి దూరమై అస్పష్ట వాక్య విన్యాస వైచిత్రీ మూలకమైన వచన కవిత్వంగా వారపత్రికల్లో ప్రభుత్వ, రేడియో కవి సమ్మేళనాల్లో పెడదారి పట్టినప్పుడు, అది పెడదారి అని గుర్తించక విప్లవ కవులు కూడా వచన కవులుగా చలామణి అవుతున్నప్పుడు వాళ్ళను సరి అయిన దారికి తిప్పటమే 'నరుడో భాస్కరుడా' అనే పాట నిర్వహించిన చారిత్రక కర్తవ్యం."40 అన్నాడు చేకూరి రామారావు 'జన్నహక్కు' కు పీఠిక రాస్తూ. అదే పీఠికలో చెరబండ రాజు వచన కవిత్వాన్ని వదలి పాటలు రాయడాన్ని మెచ్చుకున్నాడు. "విరసం ఏర్పడక ముందు చెరబండరాజు బలమైన వచన కవిత్వం రాశాడు. కాని 'నరుడో భాస్కరుడా' పాట (శివుడు) విప్లవ కవుల కళ్ళు తెరిపించినప్పుడు వచన కవిత్వపు మార్గానికి 'గుడ్‌బై' కొట్టి తను ఉద్దేశించిన శ్రోతల కర్థమయ్యే తేలికైన భాషలో సరళమైన ఊహాలతో మనసుకు పట్టే కవితా పరిమళంతో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జాతిని కదిలించే

గీతాలు రాస్తున్నాడిప్పుడు''41 అయితే ఆయనే '71-80 ఈతరం యుద్ధ కవిత'కు పీఠిక రాస్తూ వచన కవిత్వాన్ని ఈ విధంగా ఉగ్గడించాడు, "1970-80 మధ్య కాలాన్ని కొందరు పాటల యుగంగా వర్ణించారు. ప్రచారానికి పాట ప్రబలమైన ఆయుధ మనడానికి సందేహం లేదు. అయితే విప్లవ కవిత్వం పాటలకు మాత్రమే పరిమిత మనుకోవటం హ్రస్వ దృష్టి. ఉత్తమ కవిత్వం ఏ రూపంలో ఉన్నా గుర్తింపు పొందుతుంది. వినే జనాన్ని పాటలు చైతన్యవంతం చేస్తే చదివే జనంలో వచన కవిత్వం చొచ్చుకుపోతుంది. ఆధునిక కవితా రూపంగా వచన కవిత స్థిరపడిందనేది తిరుగులేని సత్యం. దీన్ని బూర్జువా కవితా రూపంగా చిత్రించడం సాహిత్య పరంగా సంకుచితత్వం రాజకీయపరంగా అవివేకం. ఏ సమాజం సృష్టించినా పనికి వచ్చే వస్తువు పారవేసుకోం. పాటకున్న ప్రయోజనాల్తోపాటు పాటకు కొన్ని పరిమితులున్నాయి. ఉదాహరణకు ఈ సంపుటిలో 'శాంతియాగో'ని గాని 'కొయ్య గుర్రా'న్ని గానీ నేను పాటలో ఊహించలేను. రూపపరంగా వచన కవిత్వం సాధించిన అభివృద్ధిని విప్లవ కవులు సొంతం చేసుకోవటం ఈ దశాబ్దపు కవితా లక్షణాల్లో ఒకటిగా గుర్తించాలి.''42

త్రిపురనేని మధుసూదనరావు జానపద కళారూపాలు కూడా విప్లవ కవిత్వ రూపంగా ఉండాలన్నాడు, "అక్షరాస్యులు కవిత్వం, కథ, నవల మొదలైన వాటిని చదువుతారు. కాబట్టి ఈ ప్రక్రియల్తో అక్షరాస్యుల్లో మాత్రమే భావ విప్లవం తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. నాటకాలు, బుర్ర కథలు, జక్కుల కథలు, పద కవిత్వం, చిత్ర లేఖనం మొదలైన కళారూపాల ద్వారా నిరక్షరాస్యుల్ని చైతన్యవంతులుగా చేయాలి.''43 అందువల్లనే, కవికి తన పాఠకులు తెలుసు కాబట్టి, తను ఆ పాఠకుల వర్గ సంస్కారాన్ని, చైతన్యాన్ని, అనుభవాన్ని, పరిసరాన్ని స్పష్టంగా అవగాహన చేసుకొని వాళ్ళు ప్రభావితులయ్యేటట్లుగా రచనలు చేయాలి. కార్మిక కర్షకులతో, గిరిజనులతో కలిసి జీవించి వారి జీవితాల్ని అధ్యయనం చేసి వారి భాషలో వారిని ఆకర్షించే ప్రక్రియల్లో రచనలు చేయాలన్నది త్రిపురనేని మధుసూదనరావు విప్లవ రచయితలకు చేసిన ప్రతిపాదన.44

ఇక పదజాలం దగ్గరకువస్తే, సిద్ధాంత సంబంధమైన మాటల్ని ఎక్కువగా వాడకూడదన్నాడు, చేకూరి రామారావు 'జన్మహక్కు'కు రాసిన పీఠికలో "ప్రజల

భాషలో రాసేటప్పుడు వర్గపోరు, వర్గకసి వంటి సామాన్యులకు అర్థస్ఫూర్తి కలిగించని మాటలను రానియ్యకుండా జాగ్రత్త పడాలి. ఆ మాటలు వాడకుండా ఆ స్ఫూర్తి సాధించడం కవికి కష్టంకాదు. ఆ మాటలు పార్టీడాక్యుమెంట్లలో బాగుంటై. కాని కవిత్వంలో ఇముడుతై అని నాకు నమ్మకం లేదు. సిద్ధాంత సంబంధమైన మాటలు ప్రజల భాషలోకి అనువదించకుండా ప్రజాకవిత్వంలో వాడితే కవితా రచనలో కవిత్వపు స్థాయి తగ్గుతుంది. కవిత్వానికి సిద్ధాంత నేపథ్యం అవసరమే. అయితే కవిత్వాన్ని మింగేసి తానే ముందుకు రాకూడదు." అంటూ ఇమేజీల గురించి "ఒకే ఇమేజిని కవులు అరగదీసి వాడుకోవడంవల్ల అనుకున్నంత కవితా స్ఫూర్తి కలగక విసుగు పుట్టిస్తుంది"45 అన్నాడు. అయితే "కొత్త సంకేతాలు- తూర్పు, సూర్యుడు, అగ్ని, మందారం వగైరా-సర్వసాధారణమనిపించ వచ్చుగాని ఏకవి శక్తి పద్ధతీ ఆ కవివి. వస్తువులోనూ పోలికలుండవచ్చు కాని దాన్ని ప్రకటించే రీతి పలు విధాలుగా వుంటూనే ఉంది"46 అని సమర్థించాడు కె. వి. రమణారెడ్డి.

ఏమైనా భాష, ప్రతీకలు, భావ చిత్రాలు ప్రజా వ్యవహారానికి దగ్గరగా వుండాలనీ, పాఠకుల అవగాహనా పరిధికి మించి పోకూడదనీ విప్లవ కవిత్వ విమర్శకుల అభిప్రాయం. "ప్రజల భాషలో ఉండే పదాలు, నుడికారాలు, వాళ్ళకు పరిచితమైన ఇమేజెస్ వాడినప్పుడే అది ప్రజా కవిత్వం అవుతుంది"47 అన్నాడు చేకూరి రామారావు 'జన్మహక్కు' పీఠికలో. వరవర రావు "రాంమోహన్ పద చిత్రాలు, కవి సమయాలు, పోలికలు, వ్యక్తీకరణలు, శబ్దంమీది మోజు ఒక్కటి తగ్గించుకుంటే బుద్ధికే కాకుండా అనుభూతికీ చేరువ అవుతాయి"48 అని రాంమోహన రాజుకు సలహా ఇచ్చాడు. మధ్యతరగతి పలుకుబళ్ళను తొలగించుకోవాలని హనుమంతరెడ్డికి సలహా ఇచ్చాడు కాశీపతి "హనుమంతరెడ్డి 'గుండె దండోరా'ఇంకా పీడిత ప్రజల భాషలో పలుకాల్సిన అవసరముంది. అతడు జానపదబాణీల్లో రాసిన గీతాల్లోకూడా మధ్యతరగతి పలుకుబళ్ళు అక్కడక్కడా కనిపిస్తాయి."49

శివసాగర్ వచన పద్యంలోనూ, జానపద శైలి పాటలలోను ఏకకాలంలో పండిత పామరులను వొప్పించే పద్ధతి, పద ప్రయోగం విప్లవ కవులకు అనుసరణీయంగా చేకూరి రామారావు భావించాడు. శివసాగర్ వచన కవితా బలాన్ని ఆయన ఇలా చెప్పాడు "ఇంతకు పూర్వం వచన కవిత్వం అంత్య ప్రాసల వల్ల, వాక్యంలో పదక్రమ వ్యత్యయం వల్ల చమత్కార సంబోధనల వల్ల, అవహేళన

వాక్యాలవల్లా బతికింది; లేదా బతకాలని చూసింది....చెప్పే విషయంలో బలం వల్లా, చెప్పే పద్ధతిలో నిజాయితీ వల్లా శక్తివంతమైన వ్యక్తీకరణ వల్ల సూటిగా చెప్పి కవిత్వంగా ఒప్పించడం శివసాగర్ వచన కవిత్వంలో సాధించిన గొప్ప తనం"[50] గా రామారావు భావించాడు.

'అరణ్య నేత్రం'కు పీఠిక రాస్తూ కె. వి. రమణారెడ్డి యిలా అన్నాడు "భావచిత్రాలు (ఇమేజరి)కవిత్వానికి తప్పనిసరి. దానికిఅవే సాధనాలూ, ఆయుధాలూ. వచ్చిన చిక్కల్లా యేమిటంటే, ఏ భావ చిత్రమైనా గాని కవికొక్కడికే అర్థమైతే తక్కిన వారికి అనర్థమే. కవితోపాటు తక్కినవారికీ అర్థమైతేనే భావ చిత్రానికి సాఫల్యం. ఇంకో విషయం - అతిసంకీర్ణత కవినుంచి పాఠకుడికి భావాన్ని సరిగా సాఫీగా అందివ్వదు. కవి ప్రతిదాన్నీ అలంకారమయం చేస్తానంటే పాఠకులు తలపట్టుకోవల్సి వస్తుంది. సామాజిక పరివర్తనకు - విప్లవానికి - నడుంకట్టి తన కలాన్ని సైరనుగా మార్చదలుచుకున్న కవికి యీ తేటదనం, సూటిదనం కవిత్వ పరంగా మూలధనమే. ఈ విషయంలో జయధీర్ తిరుమల రావు మరింతగా బరువు తగ్గించుకోవాలి.''[51]

కవితోద్యమాల కాలంలో రూపం యిలా ఎన్నో మార్పులు పొందింది. గురజాడ వాడుక భాషలో కవిత్వం రాయాలన్నాడు. మాత్రా ఛందస్సులో కవిత్వం రాశాడు. యతి ప్రాసలు అలంకారాలే తప్ప నైసర్గిక లక్షణాలు కావని వాటిని తోసి పుచ్చాడు. భావ కవులు రూపం విషయంలో పెద్దగా సాధించిందేమీ లేదు. గురజాడను కొంత అనుకరించినా ఎక్కువగా పూర్వ ఛందస్సులే ఉపయోగించుకున్నారు. 'ఎంకి పాటలు' భావకవితా యుగంలో ఒక విశిష్ట రచన. జానపద గీతాలకు దగ్గరగా వుండే భాషలో, శైలిలో రాయటంతో అవి ప్రజలనెక్కువగా ఆకర్షించాయి. రూప పరంగా ఖండ కావ్యం భావ కవిత సాధించిన ఘనత.

అభ్యుదయ కవితోద్యమంతో రూప పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఛందస్సుల చండశాసనానికి కాలం వెళ్ళి పోయిందన్నారు. కొంతమంది వస్తువు అవసరాని కనుగుణమైన ఛందస్సును స్వీకరించటం తప్పదని అభిప్రాయపడ్డారు. అలంకారాల గాడిద బరువులను కాదన్నారు. అభ్యుదయ కవిత్వానికి రూప

లక్షణాన్ని సిద్ధాంతీకరించినవాడు కుందుర్తి ఆంజనేయులు. ఆయన తన పీఠికల్లో వ్యక్త పరచిన అభిప్రాయాల్లో ఓ క్రమ పరిణామం వుంది. మొదట్లో వచన కవిత్వమే అభ్యుదయ కవిత్వానికి ఖచ్చితమైనరూపం అన్నాడు. వ్యావహారికభాషలో ప్రజల పలుకుబడిలోని మెళకువలను సంగ్రహించు కుని తెలుగు నుడికారాన్ని పుణికి పుచ్చుకుని వర్తమాన పరిస్థితులకు, సమకాలీన ప్రజలకు దగ్గరగా నడిచేదే సరియైన శైలి అని ఆయన అభిప్రాయం. కవిత్వంలో సారళ్యం అవసరమని, గూఢత్వం పనికి రాదని అంటాడు. ఎవరి కోసం కవి ఉద్దేశించాడో వారికి అర్థం కాకపోతే ఆ కవిత్వం వ్యర్థం అని ఆయన ఉద్దేశం. కవిత్వంలో సారళ్యం సాధించటానికి ఒక కిటుకు కనిపెట్టాడాయన-కథాంశను జోడించటం. అప్పుడది ప్రజా హృదయాలకు హత్తుకుంటుంది. రామాయణ, భారతాలలాగే సామాన్య జనాన్ని ఆకర్షిస్తుంది. అయితే ఆయన సలహా పాటించిన వారు తక్కువ.

కుందుర్తి ఆలోచనల్లో గొప్పదనం, ఆయన ఎప్పుడూ ప్రజలను - ఎవరి కోసమై కవిత్వం వెలువడుతూందో వారిని - లక్ష్యంగా పెట్టుకోవటం. లక్ష్యానికి భిన్నంగా ఫలితాలు కనబడినప్పుడు తన ఆలోచనలను మార్చుకోవటానికి ఆయన ఎప్పుడూ సంకోచించలేదు. తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళనలేదు. కవిత్వం వచన కవిత వల్ల సామాన్యుడికి - కార్మికుడికి, కర్షకుడికి - అందుబాటులో లేదని గ్రహించగానే కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ప్రజల సాంస్కృతిక స్థాయి ఎదగకపోవటం కారణంగా గ్రహించాడు. వచన కవిత మధ్య తరగతి వర్గానికే పరిమితమయింది. నిమ్న వర్గపు సామాన్యుడికి అందుబాటులోకి రావాలంటే దేశి ఛందస్సులే శరణ్యమని భావించాడు. జానపద రీతు లొక్కటే మార్గమని గ్రహించాడు, జానపద గేయాలు ఆ పని చేయగలవనీ భావించాడు.

విప్లవకవులూ చివరకు అదే ఆలోచనకు వచ్చారు. గేయం, పాట సామాన్యులను కూడ కదిలించ గలదనీ వారు భావించారు. వచన కవిత మెదడుకు, బుద్ధికి ఆలోచనలు కల్గిస్తే, పాట హృదయాన్ని కూడ కదలించ కలదని వారు అనుకున్నారు. గేయానికి, పాటకు గల లయ, ఉద్వేగం శ్రావ్యత వారిని జానపద కళారూపాలను ఆశ్రయించటానికి ప్రేరేపించినట్లు కనిపిస్తుంది.

వారి ఈ ఆలోచన పైకి వెనకడుగు వేసినట్లుగా కన్పిస్తుంది. భావకవులు గేయాన్ని అనుసరించడానికి ప్రయత్నించటం లయ, ఉద్వేగం, శ్రావ్యతను సాధించటమే. కాని అభ్యుదయ, విప్లవ కవులు ఇవి మాత్రమే సాధించటానికి గేయాన్ని, జానపదకళారూపాలను ఆశ్రయించలేదు. వాటిని ఆశ్రయించటం వారు సాధించాల్సిన ప్రయోజనం సామాన్యుడిని కూడ చేరటం. సామాన్యుడి సాంస్కృతిక స్థాయికూడ ఎదిగిన తరువాత అభ్యుదయ, విప్లవ కవులకు వాటితో ప్రమేయం లేదు.

భావం :

1. నవ్య కవిత్వం :

రూపంలో లాగానే భావంలోను ఎన్నో మార్పులు వచ్చాయి. తెలుగులో ప్రాచీన కావ్య సంప్రదాయంనుండి కొంతైనా బయటపడి స్వతంత్రంగా వెలసిన మొదటి కావ్యం కట్ట మంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణము' ఇది 1900 లో ప్రకటితమయింది. ఒక సామాన్యురాలి అసామాన్య త్యాగం ఈ కావ్యంలో ఇతివృత్తం: "ఒకానొక త్రిలింగ దేశీయునిచే వ్రాయబడి బ్రౌన్ దొరగారిచే బ్రకటింపబడిన అనంతపుర చరిత్రము" అను గ్రంథము నుండి యిందలి కథను గైకొంటిని. అయినను గొన్ని యెడల రసాధిక్యమునకై నూతన కల్పనలు చేసినాడ"[52] అని ఇతివృత్తం గురించి ఆయన తన పీఠికలో చెప్పుకున్నాడు. ఆయన ఈ పుస్తకాన్ని స్త్రీల ప్రయోజనంకోసం ఉద్దేశించాడు. "ఈ చిన్ని పొత్తము ముఖ్యముగా స్త్రీలకొఱకు చేయబడినది. వారికుపయుక్తముగా నొప్పిన యెడల నా ప్రయాస సఫలత నొందినట్టే" అన్నాడు. కవితా గ్రంథంలో రచనా ప్రణాళికను గురించి, ఉద్దేశించిన పాఠకుల గురించి రచయిత స్వయంగా చెప్పుకోవటం ఇదే మొదలు.

తెలుగులో ఆధునిక కవిత్వానికి యుగకర్త అన్న విషయంలో వివాదం ప్రసిద్ధమే. రాయప్రోలు సుబ్బారావు అని కొందరూ, గురజాడ అప్పారావు అని కొందరూ, ఇరువురూనని మరికొందరూ సిద్ధాంతీకరించే ప్రయత్నం చేశారు. భాష, ఛందస్సులలో నవ్యత మాత్రమే గాక అసలు మౌలిక భావాలలోనే, ఆలోచనా దృక్పథంలోనే విశిష్టమైన నవ్యత గురజాడలో విశిష్టత. వ్యక్తి నిష్ఠమైన

భావ కవిత్వంపైన సమాజ నిష్ఠమైన అభ్యుదయ కవిత్వం తిరుగుబాటు చేయడానికి దాదాపు ముప్ఫయ్యేళ్ళు పడితే, భావ కవిత్వారంభంలోనే అభ్యుదయ కవిత్వ భావాలు గురజాడలో స్పష్టమయ్యాయి. అయితే గురజాడ భావాలకు తల లూపుతూనే వ్యక్తి ప్రధానమైన భావకవిత్వం వైపే నడిచారు వెంట వెంటనే వచ్చిన కవులు. ఇది ఒక విధంగా సహజం. వ్యక్తి ముందుగా తనవైపు చూసుకుని తరువాత తనచుట్టూ చూడటానికి ప్రయత్నిస్తాడు. తనను జీర్ణించుకుని చుట్టూ చూడటానికి మహాకవి అయి వుండాలి. అందువల్లనే గురజాడ నిస్సంశయంగా యుగకర్త, నవయుగ వైతాళికుడు. గురజాడ తన కవితకు పీఠిక రాయలేదు. సాహిత్యపరంగా ఆయన అభిప్రాయాలు కన్యాశుల్క పీఠికల్లోను, లేఖల్లోను వ్యక్తమవుతాయి. తనది ప్రజల ఉద్యమమనీ, ఎవరికోసమూ దాన్ని వదలుకోననీ గురజాడ ఉద్ఘాటించాడు.53 గురజాడలోని అభ్యుదయాంశ పరాకాష్ఠను ఈ మాటల్లో చూడవచ్చును. తనది ప్రజల ఉద్యమం అని చెప్పుకున్న కవి ఆ కాలంలో భారతదేశంలో ఏ భాషలోను ఉండి ఉండడు. అందుకే "సాహిత్యరంగంలో ఇప్పుడు నేను కావిస్తున్న కృషికి సమతుల్యమైన కృషి భారతదేశంలో మరెక్కడా కన్పించదు"54 అని తన లేఖల్లో రాసుకోగలిగాడు.

2. భావ కవిత్వం :

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు గడ్డలో విజృంభించిన వీచిక కాల్పనికోద్యమం. కాల్పనికోద్యమపు క్షీణ దశలో కూడ చావని కాల్పనికాంశ 'ఫిడేలు రాగాల డజన్' పీఠికలో ''విచిత్రమే సౌందర్యం, సౌందర్యమే విచిత్రం''55 అని శ్రీశ్రీ చేత అనిపించుకున్నది. అది కాల్పనికతకో లక్షణం. సౌందర్య రస దృష్టి, ప్రకృతి ఆరాధన, ఆత్మాశ్రయత్వం, ఆవేశోద్వేగాల (ఎమోషన్స్)కు ప్రాధాన్యం, సామాన్య మానవుడే ప్రధానమైన ప్రజాస్వామ్యదృష్టి - అన్నిటికంటే మిన్నయిన స్వేచ్ఛా ప్రియత్వం భావ కవిత్వపు లక్షణాలలో ప్రధాన మయినవి. ఇక కాల్పని కోద్యమంలో వచ్చిన పీఠికలను పరిశీలిద్దాం.

కథాసూత్ర (వస్తు) వివరణ :

రాయప్రోలు సుబ్బారావు 'లలిత' 1909 లో ప్రచురితమయింది. తర్వాత వెంట వెంటనే 'అనుమతి', 'కష్టకమల', 'తృణ కంకణము', 'స్నేహలత'

అచ్చయ్యాయి. రాయప్రోలు వీటికి స్వయంగా పీఠికలు రాసుకున్నాడు. ఆయన పీఠికల్లో ప్రధాన లక్షణం కథాసూత్ర వివరణ, భావకవిత్వ యుగంలోని కవిత్వ ప్రధాన లక్షణాలలో ఒకటి కథా రాహిత్యం రాయప్రోలు రచనల్లో మాత్రం కథ ప్రాముఖ్యాన్ని పొందింది. ఈ ఇతివృత్తం ప్రఖ్యాతం కావలసిన అవసరం లేదు. ''ఇక ఇతివృత్తం. ఇందు కోసము ఏ పురాణ గాథలకో వెళ్ళలేదు. భగవంతుడు మానవుణ్ణి బుద్ధిమంతునిగా సృష్టించాడు. అతడు గడచిన యుగ యుగాంతరములలో అనంత సుఖ సాధన చేశాడు. ఇహ పర సుఖాల కోసము ఎన్ని వికారములో చెంది, ఎన్ని సంస్కారములో పొంది, వర్ధమానవికాసియై విలసిల్లాడు. అందువల్ల శుచీరుచీ, వినయం, వివేకం చదువూ సంప్రదాయం అనుదినానుష్ఠానములో వున్న కాపురములలో పుట్టి అదుపు ఆజ్ఞలలో పెరిగిన తరుణ వయస్కులను ఇద్దరిని పాత్రలుగా తీసుకున్నాను"56 అన్నాడు రాయప్రోలు సుబ్బారావు 'తృణకంకణము' గూర్చి ప్రసంగిస్తూ.

రాయప్రోలు సుబ్బారావు కావ్యాలన్నింటిలోను తరుణ వయస్కుల ఇతివృత్తమే చోటుచేసుకున్నది. స్నేహలతలో ''ఆమె వయసు 15 సంవత్సరములు. వయో వికాసము ప్రేమ తరంగిత మగు తరుణము. ఈ యవస్థలో అక్షతమును, అకలంకమునగు తరుణాంతరంగము భావోత్కంఠ నంటీ యంటక యాదరోద్రగ్ర బద్ధమై యుండును. విశుద్ధ రాగవిలీనయగు హృదయమునకు ప్రపంచము స్వప్నము. కేవలం ధ్యానబద్ధమైన మనోవృత్తి హైన్యమును సైపదు. అందు వలననే యెంతటి స్వార్థ త్యాగమయినను నిరాయాసముగా జేయగలదు"57 అందుకనే ఆయన కావ్యాలన్నిటిలో సునాయాసంగా స్వార్థ త్యాగం చేయకలిగిన తరుణ వయస్కులే నాయికా నాయకులు. ఆయన రచనలు నాయికా ప్రధానాలు.

రాయప్రోలు సుబ్బారావు తన కావ్యాలకు పేర్లు పెట్టటంలో కూడా ఔచిత్యం చూపించాడు. తృణ కంకణానికి ఆ పేరు పెట్టటానికి కారణం ఆయన ఈ విధంగా చెప్పాడు. "అంటీ అంటక పచ్చని తృణ పత్రమును అందగించిన అచ్చ జలకణమువలె కృతిలో సుతిమెత్తని సుహృత్కరణీయము జరిగింది. అందువల్ల దీనిని తృణ కంకణ మంటేను."58

పాత్రలు-సామాన్య ప్రజాజీవనం :

భావ కవుల రచనల్లోని పాత్రలు సాధారణాలే. రాజులు, అధికారులు, ధనికులకు కాలం చెల్లిపోయింది. రాయప్రోలు సుబ్బారావు రచనల్లో పాత్రలు మధ్య తరగతికి చెందినవారు. కృష్ణశాస్త్రి లాంటి వారి కవితల్లో ఊహా ప్రేయసులు - ఊర్వశి-మిగిలినా చాలమంది భావకవుల నాయికా నాయకులు సామాన్య ప్రజానీకంనుండే వచ్చారు. దువ్వూరి రామిరెడ్డి, పింగళి, కాటూరి మొదలయిన వాళ్ళు రైతు జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్నారు. దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు'కూ, పింగళి - కాటూరి 'తొలకరి'కీ కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు రాశాడు. భావకవులు స్వేచ్ఛా ప్రియులు, పూర్వ సారస్వత సంప్రదాయాల నుండి స్వతంత్రించినవారు అంటూ, 'కవిత్వ తత్వ విచారము' లోని తన వాక్యాలనే ఉదహరిస్తూ సామాన్యుణ్ణి ఇతివృత్తంగా ప్రాచీన కవులు స్వీకరించ లేదనీ, జనసామాన్యం ప్రతిదిన వృత్తాన్ని వర్ణించేపని ఆధునిక కవులు చేస్తున్నారన్నాడు. "రాజపుత్రులను, రాజ కన్యలను, బ్రాహ్మణులను, వేశ్యలను బట్టి జంఝాట మాడుట తప్ప గవితకు మేలైన యన్య కర్మములు లేవా?" అని ప్రశ్నించుకుని జవాబిలా యిచ్చాడు : "ఉన్నవి యనుటకే 'కృషీవలుడు'ను, అబ్బూరి రామ కృష్ణారావు, రాయప్రోలు సుబ్బారావు మొదలైన యువ కవులు విరచించి యుండెడు నవ్య కావ్యములు ప్రమాణములు"[59] అన్నాడు.

సమాజంలో రాజకీయ ఆర్థిక వ్యవస్థలలో వచ్చిన మార్పుల కారణంగా నైతిక విలువలలోను, సమాజ స్థితిగతులలోను, సామాజిక విలువలలోను వచ్చిన మార్పులను భావకవులు సరిగా అర్థం చేసుకోలేదన్న విషయాన్ని ఈ పీఠికలో కట్టమంచి రామలింగా రెడ్డి గుర్తించాడు. కాని సామాజిక విషయాలను మాత్రం కవి కొంత తడవినాడనీ "మింటి నెగయు పక్షియైనను భూమి మీద పెట్టి యుండెడి గూటిపై జూపు వేయక యుండునా?"[60] అన్నాడు.

'ప్రభవ'కు ఉపక్రమణిక రాస్తూ పురిపండా అప్పలస్వామి ప్రాచీన అధునాతన సాహిత్య భేదాన్ని యిలా చెప్పాడు, "నాటి కవులకు పాండితీ ప్రకర్షయే ముఖ్యము, నేటి కవులకు స్వేచ్ఛయే ప్రధానము. వారు చాలా వఱకు తమ

ప్రభువుల మెప్పించు కొఱకు కృతుల రచించిరి. నేటి మన వారొకరి కొరకు వ్రాయుచుండుట లేదు."61

సామాన్య లయిన పాత్రల నెన్నుకోవటంలో భావకవుల స్వేచ్ఛా ప్రియత్వం వెల్లడవుతుంది. సామాన్య మానవుడే ప్రధానమైన ప్రజాస్వామ్య దృష్టి వారి రచనలో వ్యక్త మవుతుంది. కవిత్వం రాజ దర్బారుల నుండి ప్రజల మధ్యకు రావటం మొదలైంది.

ఆవేశోద్వేగాల ప్రాధాన్యం :

బుద్ధికంటే హృదయానికి ప్రాధాన్య మిచ్చినవారు భావకవులు. హేతువుకు నిలబడని యిష్టం, అయిష్టం, ద్వేషం, భయం, ప్రేమ మొదలైన భావాలు హృదయ జన్యాలు. భావుకతకు పతాక స్థాయిని గూర్చే ఎమోషన్ - ప్రేమ, శృంగారం. అందువల్ల ప్రేమ కవిత్వం, శృంగారం వారి కావ్యాలలో ప్రధాన పాత్ర వహించింది. రాయప్రోలు సుబ్బారావు ప్రధాన సాహిత్య సిద్ధాంతం అమలిన శృంగారం. యువతీ యువకుల మధ్య శారీరకము గాని శృంగారం. స్నేహభావం వుండరాదా? అది రామణీయకం కారాదా? అన్నది ఆయన ప్రశ్న. ఆయన "లిరిక్కులలో అధికాధికంగా అనురాగమే ఇతివృత్త భాగంగా కనబడు తుంది. అయితే కార్యకలాపముల కంటే పాత్రల భావాలోకనమూ, చేష్టా విలాసమూ, నర్మ సంలాపములు విశేషంగా తరంగించుచున్నట్లు తగులును, కాగా బాహిరము కంటె ఆంతరమూ, వాచ్యము కంటె వ్యంగ్యమూ, ప్రస్తుత ములు కావడం ఈలాంటి రచనలో ప్రధాన వైఖరి"62 యింకా యిలా అన్నా డాయన "అయితే లిరిక్కులోని అనురాగము మన కావ్యములలో వలె సంభోగ పరిణామము పొంద నక్కరలేదు. విషయేంద్రియ భుక్తము కాక భావాత్మక మయిన స్నేహ యోగంగా పరిణతమౌతుంది. దీనిని అమలిన శృంగారమని సంకేతించితిని. మలినము కాజాలదని భావము. ఇలాంటి అనురాగ ధర్మము సకల ప్రాణి సహజంగా అనుభవములో వున్నది. ఇలాంటి కావ్యవృత్తము శుచి రుచి సమ్మితంగా ప్రసారమయితే రసాస్వాదనం కాదా కచకుచాది వర్ణనలతో అలంకృతము కాకపోతే కాంతా సౌందర్యము రూపు కట్టదా. సాల రసాల హింతాలములను వదిలి నిమ్మ దానిమ్మలను వర్ణనోజ్జీవితము చేస్తే ప్రకృతి రామణీయకం స్ఫురించుకోదా? నైఘంటికములయిన లతాపుష్పములను విడిచి నిత్య

సాంగత్య సుందరములయిన తీగ పందిళ్ళనూ, పూల పొదలనూ చిత్రిస్తే ఆవరణ సౌందర్యము అనుసంధానము కాదా ఈ మనోహరంసను నాగరిక పద బంధములో పొదిగి ఒలకపోయవలెననే ఉత్కంఠ ఈ నా రచనా రీతికి హేతువు."63 రాయప్రోలు సుబ్బారావు తన కావ్య పీఠికలలో చెప్పినవీ కావ్యాలలో లక్ష్య భూతం చేసినవీ సిద్ధాంతాలుగా ఆయన సాహిత్య సిద్ధాంత కావ్యాలు "రమ్యాలోకము" "మాధురీ దర్శనము"లలో రూపుదిద్దుకున్నాయి.

రాయప్రోలు సుబ్బారావు అమలిన శృంగార సిద్ధాంతాన్ని అందరూ అంగీకరించినా అంగీకరించక పోయినా ఊర్వశినుండి ఎంకిదాక శృంగార నాయికలు భావకవుల రచనలకు ఆలంబనా లయినారు. ప్రకృతి ఆరాధన కూడా 'సాల రసాల హింతాలములను వదలి నిమ్మదానిమ్మలను' అనుసరించింది, 'నైఘంటికములయిన లతాపుష్పములను విడచి......తీగ పందిళ్ళనూ, పూపొద లనూ' ఆశ్రయించింది.

ఆస్తికత్వం (భక్తి) :

కాల్పనిక కవిత్వ లక్షణాలలో ఆస్తికత్వ మొకటి. భావకవులు ఆస్తికులే. భక్తి ప్రధానమైన రచనలు చాల చేశారు. ప్రణయ కవిత్వంలోను భగవత్సంబంధమైన ప్రతీకలూ, కల్పనలూ కనిపిస్తాయి. ప్రార్థనాదులు, భక్తిగీతాలు రచించారు. "భారతీయ కవులకు భక్తి ఉగ్గుపాలతో పెట్టిందనే చెప్పవచ్చు. మహాకవులు మొదలు మామూలు కవులవరకూ అందరూ యత్కించిత్ భగవన్నుతి చేసినవారే, మహా పాపాత్ముల మాట యేమోకాని మానవ సామాన్య హృదయం ప్రార్థనా శీలమనే ప్రాజ్ఞులు నిర్వచించారు. ఆర్తికలిగినప్పుడు భగవత్ప్రార్థన పరిపాటే. ఆర్త భక్తికి అగ్రస్థానం లేదు. కాని తర్వాత స్థానం ఉన్నది. సుఖ సమయంలో కూడా ఈశ్వర ప్రార్థన చేసేవారు ఎందరో వున్నారు. 'ప్రార్థనాబలం చేత పర్వతాలు కూడ కదులుతవి' అన్నారు భక్తులు"64 అన్నాడు శివశంకరశాస్త్రి.

"భగవదంశ ఉండటం చేతనే గ్రామ గ్రామంలో ప్రతిష్ఠితులైన దేవతలనుసంబోధించి మన ఆంధ్రకవులు అనేక శతకాలు చెప్పినారు. అదికూడ ఉపాసనా భేదమే. ఉపాసన ఉన్నపుడు రూప కల్పన సహజము. తమ యిష్టాను

సారంగా రుచి భేదాన్ని బట్టి భగవత్తత్వాన్ని, స్త్రీ మూర్తిగానో, పురుషాకృతి గానో, మానుషేతరముగానో భావించి భక్తాదులు ప్రణుతిస్తారు. కొంతమంది నిరాకార తత్వాన్నే ఉపాసిస్తారు. ఏ ప్రకారముగా భగవన్నుతి చేసినా బాగు పడవచ్చును''65 అని కూడా అన్నాడు శివశంకరశాస్త్రి.

అనుభూతి :

కవి తన కష్టాలను, బాధలను సంతోషాన్ని - తన అనుభూతిని చెప్పుకోవటానికి కవిత్వాన్ని ఆసరాగా తీసుకున్నాడు. అది ఆత్మాశ్రయ కవిత్వమయింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలో అనుభూతి ప్రాధాన్యం పొందటమే గాక, ఆయనపీఠికలోను అనుభూతికి అగ్రస్థానం లభించింది. ఆయన వచనమూ కవిత్వం లాగానే వుంటుంది. బసవరాజు అప్పారావు గీతాలకు పీఠిక రాస్తూ ''అప్పారావు పాట నిసర్గ మనోహరం, బసవరాజు పాటలో శక్తివేరు, చెప్పేను కదా, అతను నిట్టూర్పు, అతని కావ్యం నిట్టూర్పు, అతని పాట కూడ వేడివేడి నిట్టూర్పు. కంఠం త్రుంపి, త్రుంపి నాలుగుసార్లు మ్రోగించే వాడు. తునకలు, తునకలుగా, అది మమ్మల్ని పిలచి, పిలచి, దగ్గరగా వచ్చి వచ్చి మా గుండెల లోనికి ఒదిగి ఒదిగి, తల నక్కడ ఆనించి, ఒక్కొక్కప్పుడు కుములి కుములి, ఒక్కొక్కప్పుడు వెక్కి వెక్కి ఏడుస్తూ కష్టసుఖాలు చెప్పుకొనేది. అతని పాటకు నెత్తురు జీర అంటుకున్నట్టుండేది, బ్రతుకులో నుంచి బ్రద్దలు చేసుకుని ఒరుసుకుని వచ్చినప్పుడు అంటుకున్నట్టు. ఆ వేగమే, వేదనే అతని కవిత్వానికి ప్రాణం. కొస్త గాలి కదిలితే, తగిలితే ఒక్కొక్క ఆకే కదిలి, అన్ని ఆకులూ కలసి, అంతా నిలువునా ఒక పాటయైన రావిచెట్టు లాగ ఉండేవాడు బసవరాజు.''66

కవిత్వానుభూతే కృష్ణశాస్త్రి పీఠికల్లో ప్రధానాంశం. ''అప్పారావు కవిత్వం వల్ల ఏమి ప్రయోజనం అంటే ఏమి చెప్పను? అతని కావ్యాలన్నీ చదివాక నిటూర్పు విడువకుండా, కన్నీటితో చెక్కులు తడియకుండా వుండలేము. ఆ కన్నీటి కెంతటి శక్తి వుంది? ధూళీ దూసరా లేకుండా శుభ్రంగా, శాంతంగా, సుందరంగా వాన వెలసిన తరువాత చెట్టు లాగ చల్లని ఆవేశంతో జీవంతో ఊగుతూ నిలబడతాము''67

వేంకట పార్వతీశ కవుల 'కావ్య కుసుమావళి'కి పీఠిక రాస్తూ "వీరు ఉషః కాలపు కవులు. తొలివైతాళికులు. వీరి కావ్యం చదివినప్పుడు, తెల్లతెల్లవారగట్ల పెళ్ళివారిని ప్రబోధించే గొప్ప సన్నాయి పాట ఎందుచేతో నాకు జ్ఞాపకం వస్తుంది. ఆ శ్రావ్యధ్వని వల్ల మేలుకొని, తూలిపడి, కళ్ళు నులుముకుంటూ ప్రాంగణంలోకి రాగానే పచ్చని పందిళ్ళూ, ఆకుపచ్చని తోరణాలు, కళ్యాణ కలకలమూ, అన్నిటిలోను ప్రభాతోత్సవమూ మనకు సాక్షాత్కరిస్తాయి"68 అన్నాడు.

విమర్శ :

సాహిత్య విమర్శ కూడా పీఠికలలో మొదలైంది. 'తొలకరి' పీఠికలో కట్టమంచి రామలింగారెడ్డి ప్రాచీన కవితకు, ఆధునిక కవితకు ఉన్న భేదాలను పరామర్శించాడు. "ఆంధ్ర భాషయను మహా వనము కొన్ని శతాబ్దములుగ బెరుగుట మానియుండి నూతన దేశీయ జీవనమను కృషి మొదలగు కారణముల చేత దనకు నైజమైన పునర్వికాసము సూపుట కారంభించి, క్రొత్త క్రొత్త చిగుళ్ళను, పూవులను, వెలిబెట్టుచు నవీన వసంతమును ధరించి యెంతయు మనోహరముగా నున్నది.... ఈ కృతులనేకములు భావ గీతములని యిప్పుడు ప్రచారమునకు వచ్చిన క్రొత్త కవితా ప్రపంచమునకు జేరినవి."69 అంటూ భావకవిత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్న కాల్పనిక విమర్శ సాగింది. భావ కవిత్వానికి, కాల్పనిక విమర్శకీ స్వేచ్ఛయే ఊపిరి. ఇకప్పటిదాకా సంస్కృత (ఆర్య) దాస్యంలో వున్నామనీ, దానినుండి యిప్పుడే విముక్తి పొందుతున్నామనీ అంటూ "ఆర్యదాస్యము వదలి, యాంగ్లేయదాస్యములో బడుటయే మాత్రమును మంచిదికాదు, ఎట్టి పారతంత్ర్యమును స్వాతంత్ర్యమునకు నీడుగాదు. స్వాతంత్ర్యమనగా బరులతో సంబంధము లేక యుండెడిది కాదు - మఱి మనబుద్ధిని బ్రయోగించి యన్ని కాలములందలి అన్ని దేశముల యందలి గుణములను సాధ్యమైనంత వరకు గ్రహించి మనలో జీర్ణము చేసికొని దినదిన ప్రవర్ధమానులమై యుండుట"70 అని హేతువాద దృక్పథంతో ముందుకు సాగాడు భావ కవితా యుగంలో ప్రధాన సాహిత్య విమర్శకుడైన కట్టమంచి రామలింగారెడ్డి.

3. అభ్యుదయ కవితోద్యమం :

అభ్యుదయ కవిత్వంలో తొలి కావ్యం 1944 లో అచ్చయింది. శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణబాబుల రచనలు అంతకు ముందే పత్రికలలో అచ్చయినా అవి

పుస్తక రూపంలో రావటానికి చాలకాలమే పట్టింది. 1944 లో మొదటి అభ్యుదయ కావ్యం 'నయాగరా' అచ్చయింది. బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంలు ఇందులోని కవులు. దీని ద్వితీయ ముద్రణ 1975 లో జరిగింది. 'మళ్ళీ యిన్నాళ్ళకు' అని రాసిన పీఠికలో కుందుర్తి "అభ్యుదయ కవితాయుగంలో అచ్చు అయిన తొలి కావ్యం ఇదే అని చెప్పకోవచ్చు" అన్నాడు. "ఇది ప్రచురణ అయ్యేనాటికి శ్రీశ్రీగారి 'మహాప్రస్థానం' కూడా యింకా వ్రాత ప్రతిరూపంలోనే వుంది."71 అని కూడ చెప్పాడు. అయితే అప్పటికే అభ్యుదయ కవుల కవితా ఖండికలు పత్రికలలో దర్శనమిచ్చాయి.

ఉద్యమ హేతువు - రాజకీయ కారణాలు :

భావ, అభ్యుదయ కవిత్వాలకు హేతువును పూ. భా. యిలా వివరించాడు "దేశంలో చెలరేగిన జాతీయోద్యమం వలన దేశభక్తి పరంగాను, పాశ్చాత్య భాషా ప్రభావం వలన మధురభావ పరంగాను ఖండ కావ్యాలు వెల్లి విరిశాయి... మొదటి ప్రపంచ యుద్ధం, రష్యా విప్లవం తరువాత కలిగిన సంచలనం వలన శ్రామికులు, బాధితులు, పీడితులు సుఖ సంపదలు పొందాలనే ఆకాంక్ష వ్యాపించింది. ఆ ఆకాంక్ష యితివృత్తంగా అభ్యుదయ కవిత్వం రూపొందింది."72 మొదటి ప్రపంచ యుద్ధ ఫలితాలే కాక, రెండవ ప్రపంచ యుద్ధం కూడ కవులలో సంచలనాన్ని కలిగించింది. యుద్ధ వ్యతిరేకత, స్వేచ్ఛ, శాంతి అభ్యుదయ కవుల నినాదాలయ్యాయి.

ఆర్థిక సాంఘిక కారణాలు :

రాజకీయ కారణాలే కాక ఆర్థిక సాంఘిక కారణాలు కూడ దృక్పథంలో మార్పును కల్గించి అభ్యుదయ కవిత్వ హేతువులైనాయి. దాశరథి 'అగ్నిధార'కు దేవులపల్లి రామానుజరావు 'తొలి పలుకు' రాస్తూ ఈ శతాబ్దంలోని సాహిత్య పరిణామాన్ని ఈ పీఠికలో స్పృశించాడు. "భావకవిత ఇంచు మించుగా ఆధునిక సాహిత్యము నుండి నిష్క్రమించింది. గోదావరీ నదీ వాః పూరము గాని, కృష్ణా తరంగ పంక్తులు గాని అభ్యుదయ కవిత్వములో గానుపించవు. ప్రేయసిని గూర్చి ప్రేమ గీతాలు ఆధునిక కవులను ఆకర్షించుటలేదు. గులాబి గుత్తులు, పన్నీటి జల్లులు, వలపు తలపులు, వెన్నెల విహారాలు, తూగుటుయ్యాలలు నేటి కవితా వీథులలో కానరావు 'ఏ జాతి చరిత్ర చూచిన ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని పలికిన శ్రీశ్రీ తెలుగు

కవిత్వములో ఒకకొత్త మార్గము త్రొక్కినారు ...తెలుగు సాహిత్యములో ఇది యొక విప్లవాత్మకమైన మార్పు. ఈ మార్పునకు మన ఆర్థిక సాంఘిక పరిస్థితులే కారణమని చెప్పవచ్చును. నేడు మనదేశములో ఆర్థికముగా ఒక గొప్ప విప్లవము జరుగుచున్నది. రాజరికము పెట్టుబడిదారీ విధానము మీద ఒక పెద్ద తిరుగుబాటు జరుగుచున్నది...దున్నిన వానిదే భూమి యను సిద్ధాంతము యీనాడు సర్వదా అంగీకరింపబడుచున్నది."[73]

తిరుగుబాటు :

రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల మార్పులతో భావాలలోను మార్పులు వచ్చాయి, దృక్పథంలోనూ మార్పువచ్చింది. వ్యక్తి వాదానికి వత్తాసు పలికే భావ కవిత్వంపై అభ్యుదయ కవిత్వం ధ్వజమెత్తింది. 'కల్పన' కవితా సంకలనానికి అనిసెట్టి సుబ్బారావు, అవసరాల సూర్యారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణలు 'చింతన' అన్న పీఠికను సమకూర్చారు. డ్రైడెన్ రాసిన 'డ్రమెటిక్ పొయిజీ'లోవలె ఈ పీఠిక నలుగురి సంభాషణలతోను వుండటం ప్రత్యేకత. వ్యక్తి నిష్ఠమైన భావ కవిత్వం నశించటానికి కారణం సాంఘికాదర్శం - యుగ లక్షణం - లేకపోవటమే కారణమని భావించారు: "సాహిత్యం పురాణేతిహాసాలను విడచి జీవితంలో నుంచి పైకుబికే ఒక జీవ నదిగా వెలువడ నారంభించింది. మన భారతీయ సంస్కృతితోపాటు, పాశ్చాత్య కాల్పనిక సాహిత్య ప్రభావాన్నికూడ స్వీకరించిన భావకవులు పూర్వ సాహిత్య రూపాలకు, ఛందస్సులకు ఒక వినూత్న సారళ్యాన్ని సమకూర్చారు. జీవితాన్ని ఆదర్శవాద దృక్పథంతో పరిశీలించి, భావ ప్రకటనలోను, శైలిలోను స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రకటించారు. భావకవులు మన జీవితాన్ని కొత్తగా కనుగొనటానికి ప్రయత్నిస్తూ ఆ ఉత్సాహంలో ఆశ్చర్యానందాలను, అనురాగాభిమానాలను వెల్లడి చేశారు. వారిది ప్రధానంగా వ్యక్తిగత దృష్టి కావటంవల్లనే వారి ఆవేశానికి ఒక సాంఘికాదర్శం కంటె ఊహా ప్రేయసి ఆలంబనమైనది."[74]

సామాజిక స్పృహే కాక వాస్తవికత లోపించి ఊహాలోకంలో విహరించటం కూడా భావకవిత్వ పతనానికి కారణమని రాంషా అభిప్రాయ పడ్డాడు. సోమసుందర్ 'వజ్రాయుధం' తొలి కూర్పుకు ప్రకాశిక రాస్తూ యిలా అన్నాడు "ఒక వ్యక్తియొక్క సాంఘిక జీవితమే అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుంది, అని

కారల్ మార్క్స్ చెప్పాడు. ఈ కవి పాడటానికి గొంతు సవరించుకొంటున్న రోజుల్లోని చరిత్ర భూస్వామ్య వ్యవస్థ నశిస్తూ, బూర్జువా వ్యవస్థ పాలనాధి కారాన్ని ఆశిస్తూన్న కాలమని చెబుతోంది. ఆనాటి కవిత్వం విరగబడి సనాతన చైతన్యం మీద తిరగబడి కొత్త కొత్త దారుల్ని తొక్కి తొక్కి విసిగి వేసారి చివరికి వెగటుగా వికారంగా, విషాదంగా, ఆత్మ ఖండన వ్యాపారంగా తయారయింది. బూర్జువా వర్గపు ఉనికికి అనుకూల వాతావరణాన్ని వ్యక్తిగత అహం కలిగిస్తుంది కనుక - ఆరోజుల్లో కవికదే నినాదమయింది. కవిత్వం పరిసర నగ్న వాస్తవికతను కళ్ళువిప్పి చూడలేక నిరంజన కళకోసం ఆకాశపు దారులు పట్టి 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అంది. దాంతో ద్రష్ట అయిన కవి భ్రష్టుడయ్యాడు. అతని అనుభూతి కూడ నశించింది, దానితో అసంఖ్యాకమయిన ప్రజానీకం కవిత్వాన్ని చదవటం మానివేసింది. కవిత్వం తనకవసరమనే సంగతి విస్మరించింది. కనీసం దాని నర్థం చేసుకోటానికికూడ అది ప్రయత్నించ లేదు. ఎందుచేతనంటే కవిత్వం జీవితానికి అంత దూరమైపోయింది కనుక."75

అభ్యుదయ యుగ ప్రవర్తకునికి యోగ్యతా పత్రం :

భావ కవిత్వ యుగం తన పూర్వ యుగం మీద తిరుగుబాటు చేసింది. అదే విధంగా అభ్యుదయ కవితా యుగం భావకవిత్వ యుగం మీద తిరుగుబాటు చేసింది. ఈతిరుగుబాటు విప్లవ పరివర్తనలకు శిష్ట్లా, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణ బాబు రచనలు మొదటివి. "శిష్ట్లా అతినవీనుల్లో కడు ప్రాచీనుడు"76 అన్నాడు శ్రీరంగం నారాయణ బాబు. శిష్ట్లాను గూర్చి రాస్తూ "ఈ మహోదయ ప్రథమ రేఖలు శ్రీ శిష్ట్లా రచనలలో కనిపించాయి. కాల్పనిక విముఖత్వం, నూతనత్వం కోసం ఒక అవ్యక్త వేదన ప్రస్ఫుట మౌతాయి."77 అన్నాడు అవసరాల సూర్యారావు. శ్రీ శ్రీ, శ్రీరంగం నారాయణబాబు ఇద్దరూ సమకాలిక యువ కవులను ప్రభావితం చేశారు. "శ్రీ శ్రీ తన నిశిత తీక్ష్ణ దృష్టితో నేడు శిథిలమౌతున్న నాగరికతను, నిర్మితమౌతున్న నూత్న మానవోద్యమాన్ని దర్శించాడు శ్రీరంగం నారాయణ బాబు తన సహజవైచిత్రితో నేటి జీవితపు అట్టడుగులను శోధించి, నేటి జీవితంలోని కల్లోలాన్ని నిర్భయంగా వెల్లడించాడు ... వీరి తర్వాత వచ్చిన కవిత్వోపాసకులు ఛారపలంబించిన ఉత్తమ శాస్త్రీయ

దృక్పథాన్ని బహుముఖమైన జీవితానికి అనువర్తింపజేసి స్వరూప స్వభావాలలో కొత్త పోకడలు చూపడానికి ప్రయత్నిస్తున్నారు."78

1940 లో శ్రీశ్రీ 'మహాప్రస్థానా'నికి యోగ్యతా పత్రం రాసిన చెలం 'నవ ప్రపంచ నిర్మాణ కర్త'గా గుర్తించాడు. 'నెత్తురూ కన్నీళ్ళూ కలిపి కొత్త టానిక్ తయారు చేశారు, శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి' అనీ, 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ' అనీ ఈయన పీఠికలో వాక్యాలు సామెతల్లా వ్యాపించాయి. శ్రీశ్రీ మాటల్లో ఎకానమీ, మానవత్వం మీద ఉన్న ప్రగాఢ విశ్వాసం, "దేశాలకి ఉత్సాహాలకి కదలిపోయే యువక సైన్యాలకి, నూతనయుగ నిర్మాతలకి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కింద మార్చింగ్ బాండ్ కింద, కొత్త రక్తాన్ని కదను తొక్కించే సంగీతం" చెలం గుర్తించాడు. ఆయన మాటల్లో "ఇంకా రాత్రి చీకట్లో, లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటూ దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగత మిచ్చే వైతాళికుడు" శ్రీశ్రీ. పాత పద్ధతులు, విశ్వాసాలు, ధర్మాలు అన్ని ఓ మూల నుంచి కూలిపోతున్నాయని ఈ విధ్వంసం అనంతరం నవ ప్రపంచ నిర్మాణ కర్తల ఉత్సాహంతో కంఠం కలిపి శ్రీశ్రీ పాడుతున్నాడన్నాడు. శ్రీశ్రీ డ్రీమ్ చేస్తున్న లోకం "ఏలోకంలో అన్యాయాలు, అధికారాలు, ఏడుపులు, క్షామాలు, యాచకాలు క్షుద్ర కవిత్వాలు, శిక్షణలు, స్కాండల్స్, లేవో ఆ లోకం" శ్రీశ్రీ కంఠం అతనొక్కడిదే కాదు, "దేవుడు, అధికారులు, పాతర్లు, సౌఖ్యాలు, నీతులు, స్వర్గం మర్యాదలు మూట కట్టుకుని కులికే మీకు అర్థంకాని బాధ, మరణం,. దరిద్రం, అవిశ్వాసం, అశాంతి ఇవన్నీ అర్థంగాక గట్టిగా సృష్టినే ప్రశ్నిస్తున్న యువకుల లక్ష కంఠాల్ని ఏకం చేసి పలుకుతున్నాడు శ్రీ శ్రీ."79

తమను అతి నవ్యకవులని అభివర్ణించుకుంటూ అందులో తానూ, శ్రీ శ్రీ, శిష్ట్లా, రుక్మిణీ నాథశాస్త్రి మొదటి తరం అనీ, అనిసెట్టి, రామదాసు, ఏల్చూరి, ఆరుద్ర రెండో తరం అనీ రెంటాల మొదలైన అనేక మంది యువ కవులూ ఉన్నారని 'సంఘర్షణ' కు పీఠిక రాస్తూ అన్నాడు శ్రీరంగం నారాయణ బాబు.80 1944 లో 'నయాగరా' వెలువడిం తర్వాత పుంఖాను పుంఖాలుగా అభ్యుదయ రచనలు వెలువడ్డాయి. శ్రీ శ్రీ, శిష్ట్లా, నారాయణబాబు, దాశరథి, ఆరుద్ర,

నారపరెడ్డి, అనిసెట్టి, రమణారెడ్డి, సోమసుందర్, అజంతా, తిలక్, కుందుర్తి మొదలైన వాళ్ళు అనేక రచనలు చేశారు.

శ్రీ శ్రీ ముద్రను అంగీకరిస్తూనే, అభ్యుదయ కవిత్వం శ్రీ శ్రీ ని దాటి ముందుకు వచ్చిందని అభిప్రాయపడ్డాడు రమణారెడ్డి, అభ్యుదయ కవిత్వ యుగారంభానికీ, అప్పటికీ (1962) ఉన్న భేదాన్ని కె.వి. రమణారెడ్డి విశ్లేషిస్తూ యిలా అన్నాడు. "కావ్య స్వరూపంలో వచ్చినట్లే కావ్య వస్తువులో కూడా తొలి మార్పు వచ్చి ఇప్పటికే పాతికేళ్ళు కావస్తోంది. ఆ మార్పు అప్పటి రూపంలో ఇప్పుడూ లేదు. శ్రీ శ్రీ కి దూరంలో స్థూల రేఖా చిత్రంగానే దర్శన మిచ్చిన భావ పరిణామ రూపం, నేటి కవికి సూక్ష్మాంశా సహిత చిత్రంగా, మరింత దాపుగా, మరింత సమగ్రంగా కనిపిస్తూ వుంది. ఒక కృష్ణ పక్ష వినువీథిలో నుండి భూమి విశాల స్వరూపాన్ని మాత్రమే చూడగలిగినట్లు శ్రీ శ్రీ మానవ సమస్యల ప్రాథమిక రూపాలను చూసి ప్రాకృతిక నిర్భయత్వంతో గానం చేశాడు. ఆ తర్వాతి కవులు ఇంకా కిందికి దిగివచ్చారు. ఇంకా ఎక్కువ చూశారు. ఇంకా లోతుగా చొరబారినారు. సమస్యల ఉపరూపాలను కూడా చూసి, మానవ మనోనుభూతులను చిత్రకోటి పద్ధతులలో గానం చేశారు. అంటే శ్రీ శ్రీ ముద్ర ఎంతగాఢమైనా అది ఎన్నడో విడిపోయింది. శ్రీశ్రీని మీరి, తెలుగు కవిత్వరథం ముందుకు సాగి వచ్చింది."81

శ్రీశ్రీ భావకవిత్వ సంప్రదాయంలో కవిత్వం రాసి, ఆ వరవడిలో కొట్టుకు పోకుండా నిలిచి, యుగావసరాను సారంగా అభ్యుదయ కవిత్వసారథియై, మార్గ దర్శియై, అంతటితో ఆగిపోక విప్లవయుగ వైతాళికుడైనాడు. శ్రీశ్రీ వట వృక్షం కాదు. మర్రి చెట్టు కింద ఇంక ఏమొక్కలూ మొలవక పోవచ్చు. ఆయన మాత్రం ఎంతో మంది నవయువ కవులకు ప్రోత్సాహ మిచ్చాడు. 'శ్రీశ్రీని మీరి (అభ్యు దయ) కవిత్వం ముందుకు సాగ'లేదు ఆయనే పాడైపోయిన ఆ రథాన్ని వదలి మరో జంబోజెట్ ని అధిరోహించారు. శ్రీశ్రీ అభ్యుదయ కవితోద్యమానికి నిస్సంశయంగా యుగకర్త.

అభ్యుదయ కవిత్వ లక్షణాలు :

భావ కవిత్వంపై తిరుగుబాటుగా వచ్చిన అభ్యుదయ కవిత్వ లక్షణాలను, అవి పీఠికల్లో వ్యక్తమైన విధంగా పరిశీలిస్తాను.

వస్తు వైవిధ్యం :

'కాదేదీ కవిత కనర్హం అగ్గిపిల్లా, కుక్కపిల్లా, సబ్బుబిళ్ళా...' ఏదైనా కవితా వస్తువు అవుతుంది. శ్రీరంగం నారాయణబాబు 'సంఘర్షణ'కు పీఠిక రాస్తూ "మా కవిత్వంలో ఉండకూడని వస్తువు, వాడకూడని భాష లేనేలేదు. చాకలాడు, సంతబయలు, కుక్క, గాడిద, కుళ్ళుకాలువ, ఫేక్టరీ కూత, మర ఫిరంగి, మందుగుండు, బీదవాడు, భిక్షువర్షీయసి, అన్నీ - అవేమిటి ఇవేమిటి లోకంలో ఉన్నవన్నీ. పలాయన తత్వం పనికిరాదు...మేము లోకాన్ని జీవితాన్ని, ప్రకృతిని కూడ మారుస్తాము."82 గులాబి గుత్తులు, పన్నీటి జల్లులు, వలపు తలపులు, వెన్నెల విహారాలు, తూగుటుయ్యాలలకే పరిమితం కాలేదు వీరి కవిత్వం. అలా పరిమితమైన భావకవిత్వంపై తిరుగుబాటు చేసింది అభ్యుదయ కవిత్వం.

వాస్తవికత :

వాస్తవిక సమస్యల నుండి దూరంగా పోవటం అభ్యుదయ కవులకు నచ్చలేదు. రెంటాల గోపాలకృష్ణ రచించిన 'సంఘర్షణ' కావ్యానికి రాసిన ప్రవరలో శ్రీ రంగం నారాయణబాబు ఇట్లా అన్నాడు, ''సాహిత్య జగత్తును గంగవెర్రు లెత్తించు భావకవిత్వపు రోజులవి. స్వర్ణయుగం అన్నారు వాళ్ళు. యథార్థ యుగం అంటున్నాము మేము....అంతవరకు భావకవులతో పాటు మేముకూడా జీవిత గ్రీష్మాన్ని దర్శించేందుకు మనో నేత్రానికి తగిలించిన 'గాగుల్స్' నేల విసిరి కొడుదుం కదా. హృదయంలో పొగలూ, సెగలూ రేగి వీథికాలువ నీటిలో బురదలో ఆపసోపాలు పడిపోతున్న విశ్వనాథుడు, ఊరి బయట పొలంలో ఇన కిరణాలు క్రౌర్యంతో కాయక్లేశ పడుతున్న సేద్యగాని శరీరం మీద పండిస్తున్న ఘర్మమౌక్తికాలతో ఒక తాజ్‌మహల్ కట్టాలని బుద్ధి పుట్టింది.''83

అవాస్తవికతతో కూడిన భావకవిత్వాన్ని విమర్శిస్తూ, సోమసుందర్ 'వజ్రాయుధం' తొలికూర్పుకు ప్రకాశిక రాస్తూ రాంషా క్రిస్టోఫర్ కాడ్వెల్ పంక్తుల్ని యిలా ఉదహరించాడు "కమ్యూనిస్టు కవిత్వం సంపూర్ణమైనది. మానవుడు తన అవసరాన్ని ఎంత చైతన్యంతో గుర్తిస్తాడో అంత చైతన్యంతోటే బాహ్య వాస్తవికతను గుర్తిస్తాడు కనక."84

వాస్తవికత అధివాస్తవికతకు దారి తీసింది :

అధి వాస్తవికతను గూర్చి విస్తరిస్తూ శ్రీరంగం నారాయణ బాబు యిలా అన్నాడు "ఒక జీవిత కాలమంతా జగత్తులో సమస్త విషయాలనూ వ్యక్తంగానూ, వ్యక్తావ్యక్తంగానూ సేకరించుకున్న అనుభూతి శకలాలు మెట్లు పేర్చి మేడమెట్లు కట్టుకొన్నట్టు వుంటాయి. ఈ అనుభూతులన్నింటినీ కిన్నెర మీటినట్లు ఒకేమారు కదల గలిగే శక్తి స్వరూపిణి పదం... ఈ కాలంలో వాత్స్యాయనుడూ, మనువూ కాదు, మా ఋషులు మార్క్స్, ఫ్రాయిడ్. యదార్థ జగత్తు, స్వాప్నిక జగత్తు తారుమారయ్యాయి. యదార్థాన్ని గుర్తించము. కలలు మాకు యదార్థాలు. ఈ జగత్తుతో మాకు పనిలేదు. మాది స్వప్న జగత్తు; సంపన్నులు, భాషా సంపన్నులూ మాకు విరోధులు. కావ్య లక్షణాలే అవలక్షణాలు. అందరం కవులమే. వ్యక్తాన్ని వదలిపెడతాము వ్యక్తావ్యక్తంలో ఈత కొడతాము. ఏదో విధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం. అదేది రాయిస్తే అదే కవిత్వం. ఇది అధివాస్తవికుల మతం. సాహిత్య వృక్షం మీద చిటారి కొమ్మన కూర్చుని ఊగిసలాడటం; ఇది సాహిత్యానికి గొప్ప ప్రయోజనం, అనర్థం కూడా సమకూరుస్తుంది. కేవలం ప్రయోజనాన్నే వినియోగించుకొని అనర్థాన్ని విస్మరించటం కొమ్ములు తిరిగిన కవి చెయ్యగల పని."85 దీన్ని కొన్ని కవిత్వపు రహదారుల్లో ఒకటిగా చెప్తూ ఇటువంటివి యింకా ఎన్నెన్నో వున్నాయంటాడు అతి నవ్యకవుల ఈ రాహదారులన్నీ మానవ పురోగమనం కోసమే.

శ్రీ రంగం నారాయణ బాబు, మరి ఒకరిద్దరు మాత్రమే అనుసరించిన ఈ అధివాస్తవికత ప్రాచుర్యం పొందలేదు. "అధివాస్తవికత (సర్రియలిజం) అనే పేరుతో కొత్త పోకడ బయలుదేరింది. కాని యిందులో అయోమయత్వం ఎక్కువ అవటం వలన ప్రజాదరణ పొందలేకపోయింది."86 అన్నాడు పూ.భా.

తాత్త్విక దృక్పథం : మార్క్సిజం

అభ్యుదయ కవుల తాత్త్విక దృక్పథం, మార్క్సిజం. 'కల్పన' కవితా సంకలనానికి రాసిన 'చింతన' అన్న పీఠికలో అనిసెట్టి సుబ్బారావు, అవసరాల సూర్యారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాల కృష్ణలు, ఒక యుగం సమాప్తమై మరో యుగం ప్రారంభం కానున్న సందిగ్ధ సంధ్యా సమయంలో

ఆంధ్ర జాతీయ పునరుజ్జీవనకాలంలో సామాజిక మార్పు ఫలితంగా సాహిత్యంలో ఒక నూతన దశ ప్రారంభమైందన్నారు. "నేటి కవులు ప్రస్తుతంలో నిలచి భవిష్యత్ స్వరూపాన్ని దర్శించటానికి యత్నిస్తున్నారు. దీనికి పురికొల్పే సమస్య 'లేమి'. భౌతిక ఆధ్యాత్మిక కల్లోలం ప్రస్తుత జీవితం దుస్సహమని, మార్పు అత్యవసరమని స్పష్టంచేస్తున్నది. ఆ మార్పు పేరు విప్లవం. 'ఆశ' ప్రగతికి వెన్నెముక. మృత్యువును జయించాలనే చిరవాంఛా సాఫల్యానికి యుద్ధ నివారణ, 'శాంతి' సాధన ప్రథమ సోపానాలు. 'స్వేచ్ఛ' నరుల నిత్యాదర్శం. 'శాంతి' సుఖమయ స్వేచ్ఛాయుత జీవనానికి ప్రాతిపదిక. ఇవి నేటి సత్యాలు"87 అన్నారు. అయితే ఈ పరిస్థితుల వివరణకు, ఈ ఆశలకు, ఆశయ సాధనకు ఒక మార్గం అవసరం. ఒక తాత్వికదృక్పథం అవసరం. అభ్యుదయ కవుల తాత్విక దృక్పథాన్ని గురించి "ఈ యుగంలో వ్యక్తి చైతన్యం సాంఘిక చైతన్యంగా విస్తరిల్లింది. వికలమైన సంఘవ్యవస్థ ఫలితంగా శకలాలై చెదిరిన జీవిత చిత్రణకు ప్రాధాన్యత కనిపిస్తుంది. ఈ యుగాన్ని ఆవరించిన ప్రధాన తత్వదృష్టి మార్క్సిజం. నేటి సాంఘిక విషబంధంలో చిక్కిన మానవునికి మార్క్సిజం గొప్ప నిష్కృతి మార్గంగా కనిపించింది. అందుచేత వివిధ అంతర్వైరుధ్యాలతో సంఘర్షితమౌతున్నా, సంఘగీతం ఈయుగంలోని కవితలో వినిపిస్తుంది. నేటి కవులు యుద్ధాన్ని, పరపీడనను, ఆర్థిక అసమానతను ద్వేషించి, విశ్వశాంతిని నవమానవ ప్రాదుర్భావాన్ని ఆశిస్తున్నారు"88 అని వివరించారు కల్పన పీఠికాకర్తలు.

ఆధునిక కవిత్వానికి మార్క్సిస్టు దృక్పథం ఒక ప్రధాన లక్షణమని కుందుర్తి కూడా భావించాడు. "ఈ యుగంలో వచ్చిన మరియొక విశేషము సామాజిక పరిస్థితులను మార్క్సిస్టు దృష్టితో అవగాహన చేసికోవటం. అభ్యుదయ యుగంలోని కవులూ, వచన కవితా, దిగంబర కవితా, విప్లవ కవితా మొదలగు వివిధ రంగాలలో సాధనచేస్తున్న వారందరూ మార్క్సిస్టు దృక్పథం కలవారే. అందువల్ల ఆధునిక కవిత్వానికి ఇది ఒక ప్రధాన లక్షణమై భాసిస్తున్నది."89

అభ్యుదయ కవిత్వం సామాన్య ప్రజలలో సాంఘిక చైతన్యమే లక్ష్యంగా కలిగింది. కె. వి. రమణారెడ్డి యిలా అన్నాడు "అభ్యుదయ రచయితలు

ఈ దేశంలో మన జనంయొక్క శ్రేయస్సుని ఆకాంక్షించే వారు మాత్రమే. అట్టడుగున నోరూ వాయీ లేక పడివుంటున్న వారికి ఉన్నతి కలగడమే వారి సాంఘిక ధ్యేయం వర్గాలను వారుకానీ మరెవరు కానీ సృష్టించలేదు. మరి - వర్గాలుగా ఎడపెడలై ఉన్న మన సమాజంలో బాధలతో సతమతమౌతున్న ప్రజాకోటికి కవిత్వం ద్వారా కూడా కొంత త్రాణ కల్పించి వారి సాంఘిక (అందులో భాగమే రాజకీయ) చైతన్యానికి మరింత పదునుపెట్టి సామాజిక వ్యవస్థను శుభ్రతరమూ, న్యాయతరమూ చేయడమే వారి ఆశయం."90

ఈ ప్రయత్నంలో నవ కవికి నిరాశ, నిస్పృహ, నిరాసక్తతలు లేవు. "నవకవి ఉజ్జ్వలమైన భవిష్యత్తును దర్శిస్తున్నాడు. ఆ నిశ్చల విశ్వాసాన్నే కవిత్వంలో ప్రకటిస్తూ మానవ జీవన మాలిన్యాన్ని క్షాళితం చేసి మానవ జాతిని పునరుజ్జీవితం చేస్తున్నాడు"91 అన్నాడు రెంటాల గోపాలకృష్ణ. ఇది మానవ జాతికి విముక్తిని కల్గిస్తుంది. "ఈనాడు కవిత అభ్యుదయ పథాలనంటి మానవజాతి పురోగమనం కోసం ఒక మహనీయ పథాన్ని చేపట్టింది. ఇది మానవజాతి అంతటికీ ముక్తినిస్తుంది. అతినవ్యకవులంత మందీ కూడా ఈ ఋజుమార్గంలోనే తమతమ కలాల్ని నడిపిస్తున్నారు."92 అన్నాడు శ్రీరంగం నారాయణబాబు.

కమిట్‌మెంటు (నిబద్ధత) :

అభ్యుదయ కవులు చాలామంది కమిట్‌మెంటు కలిగినవాళ్ళే చాలమంది మార్క్సిజంకు కమిట్ అయినవాళ్ళే. కవికి కమిట్‌మెంటు ఎప్పుడూ ఉంటుందని కుందుర్తి అభిప్రాయపడ్డాడు. అయితే దేనికి కమిట్ అయ్యాడన్నదే ప్రశ్న అంటా డాయన. అభ్యుదయ కవి మాత్రం ప్రజలకు కట్టుబడి ఉంటాడు. ప్రజా పక్షపాతం కలిగి వుంటాడు. "ఏనాడైనా కవి ఏదో ఒక ప్రాథమిక మూల సిద్ధాంతానికి కట్టుబడే ఉంటాడు. దేనికీ కట్టుబడనితనం అనేది అబద్ధం...... కళ ఎప్పుడూ ఏదో ఒక పక్షపాత దృష్టిని కలిగే వుంటుంది. దేవుని వైపు కావచ్చు, ప్రభువు వైపు కావచ్చు, యీ కాలంలో వలె సామాన్య ప్రజల వైపూ కావచ్చు. ఈ ముగ్గురినీ సంతృప్తిపరిచే కళ మాత్రం వుండటానికి వీలు లేదు. అభ్యుదయ భావన కలవారందరూ ప్రజా పక్షపాతం కలవారు. వారిలో తీవ్ర వాదపు డిగ్రీ హెచ్చుతగ్గు లుండవచ్చు. కార్మిక కర్షకాది పీడిత ప్రజల వైపున నిలబడి మాట్లాడటమే యీనాటి యుగధర్మం. దేవుణ్ణి కీర్తిస్తూ గానీ, ప్రభువులకు

మద్దతు పలుకుతూ గానీ రాసే కవులు యీ కాలానికి చెందిన కవులుగా పరిగణించబడరు. వారు సమకాలీన పూర్వ కవుల క్రింద లెక్క"93 అని నిర్ద్వంద్వంగా చెప్పాడు కుందుర్తి.

రాజకీయాల ప్రమేయం :

సాహిత్యంలో రాజకీయాలు తప్పనిసరి అని భావించారు చాలమంది. "రాజకీయాలు తృణీకరించ వీలు లేనంతటి నవ సమాజ జీవనంలో, కవి రాజకీయ సమస్యలకు అంధుడైతే తన కళకే సమగ్రత వుండదు. రాజకీయ కావ్యాలైనంత మాత్రాన అవి కావ్యాలు కాకుండా పోవు"94 అన్నాడు కె. వి. రమణారెడ్డి. రాజకీయమైనా కావ్య గుణమున్నపుడు కావ్యమే అవుతుంది. అది ఈనాడు తప్పనిసరి అని చెప్పే ఆవేశంలోనేనేమో వెంటనే "కావ్య గుణం కావాలి గాని, రాజకీయమైనా రంకు పురాణమైనా, గడ్డిపరక వలె క్షణమైనా హిమద్గిరి వలె స్థాణువైనా, కాలికమైనా, సార్వకాలికమైనా అవి మన్నింప దగిందే"95 అంటాడు. అట్లా మన్నింపదగిన కావ్య గుణమేమిటి ? రూపమా ? అని ప్రశ్నించుకోవలసి వస్తుంది. ఏమయినా రాజకీయాలు పరిహరింప కూడని వని చాలామంది భావించారు. మార్క్సిస్టు అవగాహన ఉన్నకవి సమాజాన్ని బాగా అర్థం చేసుకోగలడు. మంచి రచయిత అయిన వాడికి మార్క్సిస్టు అవగాహన వుంటే మరింత మంచి రచన చేయగల్గుతాడని కుందుర్తి అభిప్రాయపడ్డాడు. అయితే కవులు రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలుగా తయారుకావడం కుందుర్తికి ఇష్టంలేదు. ఈ సాహిత్య సంస్థలు రాజకీయ పార్టీల అనుబంధ సంస్థలయితే ఆ పార్టీలు చీలిపోయినప్పుడల్లా ఈ సంస్థలు కూడ చీలిపోవలసి వస్తుంది. చీలిపోయి చిన్నచిన్న ముక్కలైపోవటం జరుగుతుంది. పార్టీలలో సభ్యులు కాకుండా స్థూలంగా అభ్యుదయ దృక్పథం ఉంటే చాలునని కుందుర్తి భావన.96

అంతర్జాతీయ దృక్పథం : విశ్వశాంతి

నవీన కవులలో వున్న ఒక ప్రధాన లక్షణంగా అంతర్జాతీయ దృక్పథం, ప్రపంచ శాంతి ఆకాంక్షలను కె. వి. రమణారెడ్డి 'అడుగు జాడ గురజాడది' పీఠికలో పేర్కొన్నాడు. కవి వ్యక్తిగతం నుండి సామాజికం అయినపుడే

సమగ్రత అన్నాడు. అందుకే ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా కవులంతా దానికి స్పందిస్తున్నారన్నాడు. "గురజాడ, చిలకమర్తివంటి మనస్వుల కాలం లోనే, తెలుగు కవిభావన హిమాలయాలనూ, హిందూమహా సముద్రాన్నీ దాటి, దేశాభిమానానికి జోడుగా అంతర్జాతీయమైన దృక్పథాన్ని సంతరించుకొంది... కవి యొక్క సానుభూతి 'నా' నుండి 'నీ' మీదుగా 'మన' కు, 'స్వ' నుండి 'పర'కు ఎంత విస్తరిస్తే, అంతగా అతని వ్యక్తిత్వం సమగ్రమైనట్టు. అందు చేతనే హిరోషిమా గురించి రెంటాల వంటి కవి, మలయా గురించి సోమసుందర్ వంటి కవి, కొరియా గురించి ఈ రచయిత (కె. వి. రమణారెడ్డి), గ్రీస్ గురించి కుందుర్తి, పాసిఫిక్ యుద్ధరంగం, కీన్యా పోరాటం, వగైరాల గురించి మరెందరో కవులు గేయాలు రాశారు. ఇక విశ్వశాంతి అనేది పరమాశయమై ఈ కవులంద రినీ కదుపుతున్నది ఈ శాంతిని అశాంతినుండి తొలగించి, దీని వునికీ మనికీ నిష్కంటకం, నిరుపద్రవం చెయ్యాలనే అన్ని దేశాల స్వేచ్ఛా స్వాతంత్ర్యా లనూ ఈ కవులు అభిలషిస్తున్నారు."97 సమకాలీన కవులందరూ స్థూలంగా ఇటు వంటి భావాలే కలిగిన వాళ్ళయినా ప్రపంచంలోని శాంతికి భంగకరమైన అన్ని రకాల యుద్ధాలకీ మూలకారణమైన ధనస్వామ్య వ్యవస్థనే సమూలంగా పెకలించి వేయాలనే కోరిక మాత్రం కొందరిలో ప్రస్ఫుట మవుతుంది. అందుకే "అయితే కొందరు మాత్రమే యుద్ధాలన్నిటికీ మూలమైన ధనస్వామ్యాన్ని బలహీనం చేసేందుకు జరుగుతున్న సాంఘిక సత్రయాగంలో గేయాల సమిధలు వేలుస్తూ 'సహేంద్ర తక్షకాయ స్వాహా' అంటున్నా"98 రన్నాడు కె. వి. రమణారెడ్డి.

కథాంశ ప్రాధాన్యత :

కథాంశ ప్రాధాన్యత అభ్యుదయ కవిత్వ లక్షణాలలో ఒకటిగా వుండా లని కుందుర్తి ఆశించాడు. "ఆధునిక తెలుగు సాహిత్యానికి సంబంధించి నేను ప్రతిపాదించి ప్రచారం చేసిన మరొక ముఖ్య విషయము కథాకావ్య సిద్ధాం తము"99 అన్నాడు. దీనినుండి ఆయన ఎంతో ప్రయోజనం ఆశించాడు. "వర్తమాన కాలికమైన సంఘటనలు, కవి చుట్టూవున్న సంఘమూ, దాని పోకడలూ, దేశమూ అదినడుస్తున్న తీరు తెన్నులూ, ప్రపంచమూ, దానిలోని వివిధ సంఘర్షణలూ, ఇవన్నీ ఈనాటి కవి విస్మరించరాని విషయాలు. ఇప్పుడు వున్న కవి చేసిన రచన బలమైనదై కొన్ని శతాబ్దాలపాటు నిలవగలిగితే అప్పటి పాఠకులకు ఇప్పటి పరిస్థితులు తెలిసే విధంగా రచనలు వుండటం న్యాయం.

రామాయణ భారతాదులు ఈ లక్షణంవల్లనే ఇంతకాలం నిలిచి ఉన్నాయి."[100] అన్నాడు కుందుర్తి. పైగా "కథాంశ స్పృహలేనిదే అన్ని రకాలైన మానవోద్రేకాలను కావ్యంలో చొప్పించటానికి వీలుండదు. అనుభూతి వాదమనే పేరుతో చెలామణి అవుతున్న కవిత్వానికి అది సాధ్యంకాదు. ఎందుకంటే అది తన పరిధిని సంకుచిత పరచుకొని ఆలోచిస్తున్నది"[101] అన్నాడు.

మేళవింపు :

చాల మంది కవులు అభ్యుదయ వాదులే అయినా వారిలో కొంత సంప్రదాయమూ, భావకవితా ధోరణీ ఉండనేవుంది. నారపరెడ్డి కవిత్వాన్ని ప్రయోగ ఇట్లా విశ్లేషించాడు. "నారపరెడ్డి కవిత్వంలో ఒక కమ్మదనం, ఒక ప్రత్యేకతా- ప్రతి పదంలోను కనిపిస్తుంది. నారుమళ్ళలో తరగలు కట్టే గాలి పిల్లల్ని పలుకరిస్తూ పడమటి కొండ మీద సంధ్యాలతాంగి ఆరగట్టిన చీర చెంగావి ఛాయల్లో తేలియాడుతూ - మహాభోగిలాగా - ఆలోచించే కూడూ గూడూ లేని రైతుబిడ్డ నారపరెడ్డి, తాను పెరిగిన నేల మీదా, తాను చేసిన చేను మీదా, వదలని మమకారం ఒక పక్క వెనుకకు లాగుతూ, తను పెరిగిన నేలా, తను చేసిన చేనూ తనవి కాని వాస్తవం ముందుకు నడుపుతూ, - నారపరెడ్డి మధ్యేమార్గంలో నిలబడి భవిష్యత్తును దర్శిస్తున్నాడు. పాత లోకపు సంకెళ్ళు తెంపుకుని కొత్త దారులు తొక్కుతున్నాడు. ఈ ఎర్ర సంజలోనే ఆయన కావ్యమాలికలు కొత్త కాంతులు చిమ్మటం కూడా".[102]

నారపరెడ్డిదే 'మధువనము'కు ఆరుద్ర పద్యంలో ముందుమాట రాశాడు.

"నవీన ప్రాచీనతల
పసరుతో
కవితా వ్యవసాయం చేయదలచి
భావ కవుల
వియోగ కవనపు
పంటకోతలై పోయె పూర్వమే
కొత్తగా మన కవిగారు

చూపించేవి నాము పంట
వీరిచేతి లోన
అవి నెల్లూరు వడ్లు"[103]

అన్న ఆరుద్ర మాటల్లో కూడా పై అభిప్రాయమే ద్యోతక మవుతుంది. తన రచన గురించి నారపరెడ్డి కూడా కాల్పనిక నిష్ఠమైన భాషలో యిలా చెప్పు కున్నాడు. దాదాపు "పాతికేళ్ళ జీవిత ప్రయాణంలో కవితా హృదయం కన్న కలలకు, లోక జీవన సుఖాలకు శ్రుతి గల్పలేక, అపశ్రుతులు పాడలేక నా అంత రాత్మలో నిరోధించి నిరంకుశ సంఘంతో రాజీపడి తలవంచలేక, స్వేచ్ఛాభి మానాల విడువలేక, అడుగడుగునా సంఘర్షణతో అలసిపోయి, నాలో నేను పాడుకొన్న యేకాంత గానము, హృదయ భారంతో కళాదేవి ముందు వేదనతో నివేదించుకున్న ఆత్మ నివేదన ఈ మధువనము".[104]

భావ అభ్యుదయ కవిత్వాల మేళవింపు మల్లవరపు విశ్వేశ్వరరావులో కూడా కనిపిస్తుంది. మల్లవరపు 'ఉగాదులు - ఉత్సవాలు' కు సమీక్షణం రాస్తూ "మల్లవరపు వారిది భావ కవితా సౌధంలో భద్రపీఠం. రెండోతరం భావకవుల్లో మొదటి పీట వారిదే. కృష్ణశాస్త్రి గారి నిగ నిగలతో పాటు అభ్యుదయ కవి ధగ ధగలను కూడా క్వచిత్తుగా కలబోసుకున్న కవిత వీరిది"[105] అన్నాడు సి. నారాయణరెడ్డి.

దాశరథి కవితా పుష్పకానికి ఆరుద్ర పీఠిక రాశాడు. శ్రీశ్రీని, పాఠకుణ్ణి సంబోధిస్తూ దాశరథిని పరిచయం చేశాడు. దాశరథిలోని సంప్రదాయ తత్వాన్నీ, కొత్తదనాల్నీ, వీటి కలగలుపునీ దాశరథి కావ్యాలకు పీఠికలు రాసిన వాళ్ళంతా దేవులపల్లి రామానుజరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, ఖండవల్లి లక్ష్మీ రంజనం, ఆరుద్ర అందరూ - వ్యక్తం చేసిన వాళ్ళే. "పాఠక మహాశయా? దాశరథి ఏమిటో తెలుసా, కవితాపుష్పకం. ఎన్ని సంప్రదాయాలనైనా అది ఇముడ్చుకో గలదు. ఎన్ని కొత్తదనాలనైనా నింపుకోగలదు. ఎప్పుడూ పచ్చగా వుండగలదు. విప్లవాలను రమ్మంటుంది. వినూతనత్వానికి చోటిస్తుంది."[106] అన్నాడు ఆరుద్ర.

వచన కవితా శైలిలో తిలక్ చూపిన ఒడుపులవల్ల సంప్రదాయ పద్య కవితాభిమానులు కూడా వచన కవితా ప్రక్రియ వశపరచు కుంటుంటూ "ఒక

కొత్త ప్రక్రియ సాహిత్యంలో స్థిర పడటానికి చేసే ప్రయత్నంలో సంప్రదాయ వాదుల ఆమోదం కూడ ఒక ముఖ్యమైన ఘట్టమని నేననుకుంటాను'107 అన్నాడు కుందుర్తి.

అభ్యుదయ కవితోద్యమ కాలంలో విమర్శ :

అభ్యుదయ కవిత్వ యుగకర్త శ్రీ శ్రీ అయితే, గొప్ప విమర్శకుడు కుందుర్తి. కవితా రూప భావాల విషయమై నిర్దిష్టమైన దృక్పథం కలిగిన వ్యక్తి. అభ్యుదయ కవులనేక మందికి పీఠికలు రాశాడాయన. అభ్యుదయ కవిత్వ పీఠికల్లో విమర్శ మూడు ధోరణుల్లో సాగినట్లు కన్పిపిస్తుంది. మొదటిది అనుభూతితో, హృదయంతో పలకరించిన పీఠికా విమర్శ. రెండవది కేవలం కవిని పొగడటం, సర్టిఫికెట్లివ్వటం మూడవది మౌలిక విమర్శ.

అనుభూతి ధోరణి విమర్శ :

'యోగ్యతా పత్రం'గా ప్రసిద్ధికెక్కిన శ్రీశ్రీ 'మహాప్రస్థానా'నికి చెలం రాసిన పీఠిక ఈ కోవకు చెందుతుంది. ఈ వచనం కవిత్వం లాగ వుంటుంది. కాల్పనికతకు భావుకతకు ప్రాముఖ్యత నిచ్చినా వాస్తవికతా, హేతువాదం మరుగు పట్టని రచనలీయనవి. ఈయన రాసిన 'యోగ్యతా పత్రం'లో కూడ ఆ ఆ వ్యక్తిత్వం గోచరిస్తుంది. 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ' అన్న ఒక్క వాక్యం చాలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పట్టటానికి. ఈ వృద్ధ ప్రపంచానికి 'నెత్తురూ కన్నీళ్ళూ కలిపికొత్తటానిక్'ని తయారు చేసిన శ్రీశ్రీ ని గుర్తించటంలోనే ఈయన పీఠికా ప్రాముఖ్యత వ్యక్త మవుతుంది. 'కన్నీళ్ళు' చెలం భావుకతకు ప్రతీకఐతే, 'నెత్తురు' చెలం ప్రగతి దృష్టికి, ఆశావహమైన భవిష్యత్ దృష్టికి చిహ్నం.

"పాత పదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోపీ, జీవితంలోపీ ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరగ్గొట్టాడు శ్రీశ్రీ"108 అంటూ శ్రీశ్రీ కవితల్ని విమర్శించే కవుల్ని చెలం చీల్చి చెండాడాడు. "అబద్ధాలతో, స్తోత్రాలతో, వంచనలతో, అనుకూల దుష్ట ప్రచారంతో, ఆత్మశ్లాఘనలతో దేశం మీదపడి బతుకుతున్న యీ పేరషైట్ కవి వరేణ్యుల"109 ని వీరిని అభివర్ణించాడు. 'తాము బతికి వున్న కాలంలో పాత

వాఙ్మయం మీద తిరగబడ్డ యీ బతికివున్న శవాలు ఈ నాటికీ తాము ముప్పై యేళ్ళ క్రింద చేసిన తిరుగుబాటు ఇతరుల ఖర్చుమీద కాఫీ ఇడ్డెన్ల ముందు ఇన్స్పైర్ ఐ ప్రగల్భాలు పలికే ఈ రసికులు, తాము తెచ్చిన సంస్కారమే యింక సారస్వతానికి శాశ్వతావధి అని నిరూపించి, ఉప్పొంగి తెలుగు ప్రపంచాన్ని పావనం చెయ్యడానికి మీదికి ఉరికే భగీరథ ప్రవాహాన్ని ఊరిరబ్బిష్ చెత్తల కట్టలతో ఆపాలని ప్రయత్నిస్తున్నా'[110] రని విమర్శించాడు. వాళ్ళు "ఆ మూల పాత గోరీల కేసి మొహాలు తిప్పుకొని నగిషీలు చెక్కుతున్నారు- పాతపదాలకీ, ఊహాలకీ చిత్రికలు పట్టి - ప్రేయసి మెల్ల కన్నుల మీద పద్యాలు అల్లుతున్నారు - రామాయణాలూ, శర్మిష్ఠలూ వృద్ధమునులు వ్రాసి అర్పిస్తు న్నారు, 'భారతి'కి నైవేద్యంగా"[111] అంటూ పతాభి భావ కవిత్వాన్ని తన కవిత్వంలో విమర్శించినంత తీవ్రంగానూ చెలం భావ కవిత్వాన్ని విమర్శిం చాడు.

శ్రీశ్రీ మాటల శక్తిని ఆయన యిలా వర్ణించాడు; "హృదయం ఎల్లా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వటం అతనికే తెలుసు, మాటల్ని [illegible]లూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చేతనవును, పద్యాలు చదువుతోంటే, ఇవి మాటలు కావు, అక్షరాలు కావు - ఉద్రేకాలు, బాధలు, యథార్థాలు - అతని హృదయం లోంచి మన హృదయం లోకి డైరెక్టుగా పంపిన సందేశాలు?, నెత్తురు కాలువలనిపిస్తుంది"[112] ఇంకా "కొద్ది రోజుల్లో నేడు విప్ర[illegible] ప్రతి వొక్కరూ శ్రీశ్రీ పేరు కింద నుంచుని ఉనికిని సమర్థించుకోవలసిన గతి వస్తుంది"[113] అని భవిష్యత్తును సరిగా ఊహించాడు చెలం.

చెలం పీఠికలో మార్క్సిజమూ, వర్గ సంఘర్షణా, పీడితులూ, తాడితులూ వంటి పదజాలమూ ఎక్కడా కనిపించదు. శ్రీశ్రీ కవిత్వాన్ని చెలం అనుభవించి పలవరించాడు. కవిత్వాన్ని తాను అనుభవించిన అనుభూతి ఆధారంగానే [illegible]ంచాడు. చెలం వచనం కవిత్వమే. హృదయానికి పట్టినప్పుడే రాస్తాడు. పచ్చి పొగడ్తలు కావు. చింతాదీక్షితులు 'ప్రజా వాఙ్మయా'నికి చెలం రాసిన ప్రస్తావనను దీనితో పోల్చి చూడకోవచ్చు.

పొగడ్తలతో కూడిన విమర్శ :

'మల్లారెడ్డికి బహిరంగ లేఖ' అంటూ శ్రీశ్రీ రాసిన ఉత్తరం 'సవ్యసాచి' వారపత్రికలో మొదటగా ప్రచురింపబడి, తర్వాత 'మల్లారెడ్డి గేయాలు' ద్వితీయ ముద్రణలో 'హలో పాఠకుడా' అన్న శీర్షికతో వెలువడిన పీఠిక యిలా సాగుతుంది : "మట్టిలోంచి మాణిక్యాలు పుట్టినట్లు కమ్యూనిజంలోంచి కవులుద్భవిస్తారనటానికి గట్టి దాఖలా గజ్జల మల్లారెడ్డి. మల్లారెడ్డి కవిత్వం యిప్పటికే బహుజనాదరణ పొందింది. ఇవాళ నేను ప్రత్యేకంగా సిఫారసు చెయ్యవలసిన పని లేదు. ఏదో లాంఛనప్రాయంగా నాకు తోచిన ముక్కలు రాసి నా ఆనందాన్ని పాఠకులందరితో పంచుకోవటానికి ప్రయత్నించాను. మంచి కవిత్వం తన్ను తానే రికమెండ్ చేసుకుంటుంది. హలో పాఠకుడా ఇక పుట తిప్పు. మల్లారెడ్డి కావ్య మాధుర్యాన్ని ఆస్వాదించు."114 అట్లాగే ఏ అభ్యుదయ కవిని పొగడినా ఇక తాను కవిత్వం రాయవలసిన అవసరం లేదని అతిశయోక్తిగా చెప్పడం శ్రీశ్రీ అలవాటు. క్షణికమైన ఆవేశం కారణం కావచ్చు. కవిని మరింత ప్రోత్సహించాలనే మంచితనం కావచ్చు. ఇలాంటి పీఠికల వల్ల విమర్శకుని, లేక పీఠికాకర్త ప్రతిష్ఠవల్ల కవికి గౌరవం కలగవలసిందే తప్ప స్వంత శక్తివల్ల కాదు. ఇవి 'సిఫారసు' పీఠికలు. విమర్శలో యిలాంటి వాటికి స్థానం లేదు.

మౌలిక విమర్శ :

ఇలాంటి విమర్శకు స్థానం కల్పించిన కుందుర్తి, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శను సరియైన మార్గం పట్టించాడు. ఆయన మార్గదర్శి. కవిత్వ రూపంలో ఆయన ఆలోచనలను గూర్చి యింతకు ముందు చర్చించాను. భావం విషయంలో కూడ ఆయన దృష్టి విలక్షణం.

ఆధునిక కవిత్వానికి మార్క్సిస్టు దృక్పథం ఒక ప్రధాన లక్షణమని కుందుర్తి భావించాడు. సామాజిక స్పృహలేని కవిత్వం, కవిత్వం కాదని ఈయన అభిప్రాయం. "సమకాలీన సమాజ స్పృహతో కూడిన రచనలు చేసేవారు, పురోగామి దృక్పథం కల వారందరూ అభ్యుదయ కవులే" అని ఆయన అభిప్రాయపడ్డాడు115, "కవికి కమిట్‌మెంటు వుండాలని, దేనికీ కట్టుబడని తనం అనేది అబద్ధమ" నీ ఆయన భావించాడు.

ఆధునిక కవిత్వ రూపమైన వచన కవిత్వంలో వచ్చే ప్రేమ, భక్తి, అనుభూతి, అయోమయపు మిష్టిక్ కవిత్వాలను తిరోగమన లక్షణాలుగా, దొడ్డిదారిన యింట్లో ప్రవేశించే ప్రయత్నాలు'గా అభివర్ణించాడు. ప్రబంధ ధోరణి శైలినీ, భావవాద, అనుభూతివాద ధోరణుల్నీ కుందుర్తి నిరసించాడు. తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కి రాసిన పీఠికలో తిలక్‌లో కనిపించే ప్రాబంధిక శైలినీ కుందుర్తి ఆమోదించలేదు. ''శైలిలోను, ఉక్తి విధానంలోను, కొన్నిచోట్ల కావ్య వస్తువులోను కూడా భావకవితా ఛాయల బంధం నుండి బయట పడలేని స్థితి తిలక్‌లో స్పష్టంగా కనిపిస్తుంది''116 అనీ "తిలక్ కవిత్వం అభ్యుదయ కవిత్వం కొన్ని పాళ్ళు, భావ కవిత్వం కొన్ని పాళ్ళు కలసిన మిశ్రమ రూపం"117 అనీ, "అభినవ కాల్పనిక వాదమని చెప్పకోదగిన ఆతని అనుభూతి వాదము కవితకు తుది తీర్పు కాజాలదు"118 అనీ కుందుర్తి అభిప్రాయ పడ్డాడు.

అనుభూతి వాదం భావకవిత్వం కంటే భిన్నమైనది కాదన్నాడు కుందుర్తి. "ఈనాడు అనుభూతి కవిత అని పేరు తగిలించుకొని బయటకు వస్తున్న భావ కవిత్వం సందేశ శూన్యమైన, వర్ణనాత్మకమైన కావ్యాలను ఎక్కువగా విడుదల చేస్తున్నది. మిత్రులు శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మగారి నాయకత్వంలో నడుస్తున్న ఈ అనుభూతి కవితా వ్యాసంగం నా దృష్టిలో ఒక కౌంటర్ రివల్యూషన్ ... కవి సేన వారు తాము అభ్యుదయ కవుల మని చెప్పకోవటం లేదు. వారికి అభ్యుదయమూ, సామాజిక స్పృహ మొదలైన మాటలంటేనే రోత"119 అని అనుభూతి కవితను విమర్శించాడు కుందుర్తి.

అభ్యుదయ కవిత్వంలో కథాప్రాధాన్యతను నొక్కి చెప్పాడు కుందుర్తి. "నా దృష్టిలో కవికి సామాజిక స్పృహ ఎంత ముఖ్యమో, కావ్యానికి కథాంశ స్పృహ అంత ముఖ్యం"120 అన్నాడు. కథాంశ స్పృహ లేనిదే అన్ని రకాలైన మానవోద్రేకాలను కావ్యంలో చొప్పించటానికి వీలుండదు. కుందుర్తి దృష్టి కవిత్వం అట్టడుగు వర్గాలకు కూడ చేరటం కావటంవల్ల, వట్టి భావాలతో, వారిని ఆకట్టుకోవటం కష్టమనీ కథాంశంతో వారిని చేరవచ్చనీ ఆయన భావించాడు. రామాయణ భారతాలను ఉదాహరణగా చూపించాడు.

అభ్యుదయ కవులనేక మందికి కుందుర్తి పీఠికలు రాశాడు. కవిని వృధాగా పొగడటం, లేని విలువల్ని ఆపాదించటం కుందుర్తి చేయలేదు. ఆయన పీఠికల్లో సమకాలీన సాహితీ చర్చే అధికంగా వుంటుంది. తాను మెచ్చని విషయాలను నిర్మొగమాటంగా చెప్తాడు. యువ కవులను ప్రోత్సహిస్తూనే వారికి సలహాలిస్తాడు. కుందుర్తి పీఠికల్లో మరో ప్రత్యేకత - సాధారణంగా ఆ కవి కవిత్వం నుంచి పద్యాలూ, పాదాలు ఉదహరించి ఇదుగో ఇతని కవిత్వం అని చూపించడు. "ఈ కావ్యంలో ఈ నలుగురు కవులూ చేసిన రచనలలో కొన్నింటిని ఉదాహరణలుగా చూపించి చూడండి ఎంత రసవత్తరంగా వున్నాయో అని పాఠకులకు సిఫార్సు చేసే అలవాటు నాకులేదు. అది ఒక విధంగా చూస్తే పాఠకులను అవమాన పరచినట్లే ఎందుకంటే వారు ఆ మాత్రం రసాస్వాదన చేయలేని అమాయకులు కారుకదా"[121] అన్నాడాయన.

వ్యక్తిగత దృష్టివల్లనే సమకాలీన సామాజిక ప్రయోజనాలకు భావ కవిత్వం పనికిరాలేదు. భావ కవిత్వంలో కనిపించే కొద్దిపాటి అభ్యుదయాంశ కూడ ఈ వ్యక్తిగత దృష్టిమీద ఆధారపడిందే. అందుకే సామాజిక చైతన్యం బహిర్గతం కాగానే భావ కవిత్వం పేలవమై వెనకబడి పోయింది. భావకవితోద్యమం, ఆధునిక కవితోద్యమం ఆ యుగావసరాలకు అనుగుణంగా బహిర్గత మయ్యాయి. యుగావసరాలు తీరగానే కొత్తకు తావిచ్చాయి. 'Old Order changeth yielding place to New' అన్నట్టుగా విప్లవ కవిత్వానికి దారి చూపాయి. 1965 నాటికే సాహిత్య రంగంలో ఒక విధమైన నిస్తబ్ధత నెలకొన్నది. సంధి యుగంలో "వచ్చింది. అభ్యుదయ కవిత్వం పీడావిరగడైంది అనుకునే అన్నయ్యలకు ఉలికిపాటు కలిగించే విధంగా మరొక అభ్యుదయ కావ్యం - 'విషాదభారతం' వెలువడుతున్నది. అభ్యుదయ కవిత్వం పుబ్బలో పుట్టి మఖలో గిట్టే మూన్నాళ్ళ ముచ్చట కాదని నిరూపించేందుకేమో ఈ కావ్యావతరణ"[122] అన్న కె. వి. రమణారెడ్డి మాటలు ఈ విషయాన్నే నిరూపిస్తాయి ఆయనే "ఈ సంప్రదాయం ఇటీవలి కాలంలో కాస్త నిస్తేజమైంది నిజమే"[123] అని అంగీకరించాడు. అయినా "మందగించిన కవులు మందగించగా మొద్దుబారిన కవులు మొద్దుబారగా, జారిపోయిన కవులు జారిపోగా, ఎప్పటికప్పుడు కొత్త అభ్యుదయ కవులు గొంతు విప్పుతూనే ఉన్నారు"[123] అని దండోరా వేసినా

బయలు చేయడం తప్పని సరైంది. అన్యాయాన్ని, మోసాన్ని, నటనని, కుళ్ళును కుట్రల్నీ నిర్మోహమాటంగా ఎండ గట్టాల్సి వచ్చింది. సాహిత్య పీఠాధిపతుల నయవంచనల్ని జనం ముందుంచాల్సి వచ్చింది. కవితా సంకలనాల చంక లెగుర వేయడాన్ని వాటిడొల్లతనాన్ని, వచన కవితా తిరుణాళ్ళను ఒక కుదుపు దకు పాల్సి వచ్చింది."

"తీవ్రాతి తీవ్రమైన కోప తాపాలతో సాహిత్య పలాయన వాదాన్ని ప్రతిఘటిస్తూ, సాంఘిక అక్రమాన్ని ముందుకు తెస్తూ ఎస్టాబ్లిష్‌మెంటును ఎగాదిగా ప్రశ్నిస్తూ వంది మాగధుల్ని నిలదీస్తూ నిర్మోహమాటంగా నిప్పులు చెరగిన తిరుగుబాటు సాహిత్య వాదులే 'దిగంబరు కవులు'...... విసిగిన ప్రజానీకానికి తగిన తిరుగుబాటు ఆదేశాన్ని దిగంబర కవులు అందిచ్చారు. సంఘంలో రూపుదాలుస్తున్న తిరుగుబాటు వాస్తవాన్ని అందరికీ ఎలుగెత్తి చూపారు. కుహనా సాహిత్య మర్యాదల్ని బద్దలు కొట్టారు."

"భయంకర నిశ్శబ్దం పీడిస్తున్న సందర్భంలో సాంఘిక విచికిత్స ప్రతిష్టంభనలా పేరుకొని జడతాబంధంలో ఒక నిష్ఠుర నినాదం జాతి జాగృతికి బలాన్నిస్తుంది. స్పష్టమైన అవగాహనకు పూర్వ రంగాన్ని సృష్టిస్తుంది. ఈ సాంఘిక కర్తవ్య నిర్వహణలో అగ్రగాములుగా నిలచి దిగంబర కవులు ఎష్టాబ్లిష్‌మెంటును నఖశిఖ పర్యంతం కడిగేశారు."[125]

1965-68 మధ్య దిగంబర కవులు మూడు కవితా సంపుటాలను ప్రకటించారు. చైతన్య రహితమై కుళ్ళి కంపుకొడుతున్న సమాజాన్ని కొరడాలతో కొట్టి మేల్కొలిపే ప్రయత్నాన్ని చేశారు వీరు. ఈ కాలంలో ఒక ప్రత్యేకమైన రాజకీయ దృక్పథం వీరిలో కన్పించదు. ఆదర్శవాదులుగా మాత్రమే కన్పిస్తారు. అయితే చాల ఉధృతంగాను, ఆత్మవిశ్వాసంతోను సమాజంలోని నిశ్చైతన్యం మీద దిగంబర కవులు దాడి చేశారు. తమదో శకంగా - దిగంబర శకంగా చెప్పుకున్నారు. తమ కవితల్ని 'దిక్'లు అన్నారు.

దిగంబర కవులు : ఆ పేరెందుకు?

1965 లో ప్రకటించిన మొదటి సంపుటంలో తమని దిగంబర కవులుగా ఎందుకు పిల్చుకున్నారో వారు చెప్పారు. జీవితంలోని కృత్రిమతనూ, నటనసూ

వారు ఖండించారు. బురఖాలను తొలగించి నగ్నంగా, దిగంబరంగా, అసలు రూపంతో బతకాలని సమాజాన్ని శాసించారు. "మీరు జీవిస్తున్నది మీ జీవితం కాదు. మీ ముసుగు - నటన జీవితం, అధికార జీవితం, డబ్బు జీవితం, గౌరవ జీవితం, వాటి కోసం పడిచచ్చి వాటికోసం ఏదైనా సరే, చివరికి మిమ్మల్ని సైతం చంపుకునే దిక్కుమాలిన జీవితం. ఏం ఈ ముసుగు లేక పోతేనేం ? స్వేచ్ఛగా అసలు స్వరూపం' లో బతకడానికి యత్నిస్తేనేం?"[126] అని ప్రశ్నించారు.

తమని గురించి "మేం ఆరుగురం. మాలోని నిజరూపాల్ని దర్శిస్తూ మా చుట్టూవున్న మనుష్య లందర్నీ ప్రేమిస్తూ వాళ్ళని కూడా ఆ ప్రయత్నం చెయ్య మంటున్నాం. అందుకే మేం 'దిగంబర కవులం', మంచికోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడచిన ఆత్మల లోంచి పలుకుతున్న గొంతుకలం"[127] అని చెప్పుకున్నారు.

మూడు సంపుటాలు :

1965 లో మొదటి సంపుటం, 1966 లో రెండవది, 1968 లో మూడవ సంపుటం ప్రకటించారు దిగంబర కవులు. వారి తాత్విక, సాహిత్య, రాజకీయ, సామాజిక దృక్పథాలు వీటి పీఠికల్లో వెల్లడయ్యాయి.

వ్యక్తి కృత్రిమ జీవితం పై విమర్శ : తపన

దిగంబర కవుల మొదటి సంపుటంలో వ్యక్తి కృత్రిమ జీవితాన్ని గురించిన విమర్శ తప్ప వారి రాజకీయ సామాజిక సిద్ధాంతమేదీ కన్పించదు. ముసుగుల్ని చీల్చి స్వేచ్ఛగా, అసలు రూపంతో బతకమని ఆదేశిస్తూ "ఇది సెక్స్ గ్రంథం కాదు, రాజకీయ నినాదాల కోసం ఉద్దేశించినది అంతకంటే కాదు. ఈ దేశంలో, యీ గోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషి ఉనికికోసం తపనపడి, అతని భావిని చూసి వెక్కివెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత"[128] గా తమ ఆక్రోశాన్ని వెలువరించారు.

సాహిత్య దృక్పథం :

1966 సంవత్సరాంతంలో వచ్చిన రెండో సంపుటంలో తమ సాహిత్య దృక్పథాన్నిలా వెల్లడించారు : "ఆదినుండి అనువాదానికీ, అనుసరణకీ అలవాటు పడి నేడు పాశ్చాత్య స్వరాలకి ప్రతినిధిగా మారిన తెలుగు సాహిత్యానికి మౌలిక మైన ధ్వనిని కోరుతున్నాం...... నేటి కావ్యరచనలో జీవితంలోని నిజాయితీనీ, సరళత్వాన్ని, యుగసందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని, ఊపిరిగా పీల్చగల ఆధునిక మానవుని అస్తిత్వం ఆవిష్కరింపబడటం అవసరం"[129]

తాత్విక దృక్కోణం :

తమ తాత్విక దృక్కోణాన్నిలా చెప్పుకున్నారు దిగంబర కవులు. "నిజ మైన అస్తిత్వం భౌతిక ఆనందంతో పాటు మనస్సుని సర్వదా సచేతనంగా వుంచి అందరిలోను నిలబడి తనలో తాను జీవించటం" అంటూ "ఈ జీవితంలో జంతువుల్లా బ్రతికే అధికారం ఎవరికీ లేద"ని ప్రకటించారు. మానవుని నిజ మైన బ్రతుక్కి అర్థాన్నిలా చెప్పారు దిగంబర కవులు, "మనిషి భౌతిక వాంఛ నిజం. ఈ వాంఛతో బాటు అచేతనంగా వున్న మూడో ప్రపంచం కూడా నిజం. అలాగే మానసికమైన 'ఏకాకి తనం' కూడ వాస్తవమే. కాని, ఈ ఏకాకితనం మాత్రమే అస్తిత్వం కాదు. పరిసరాలు, మానవ బాంధవ్యాలు వొదిలి క్షణం పై క్షణం బరువుగాపడి యీడుస్తూ పోవడం కాకుండా చైతన్యవంతమైన ఆత్మ సంతృప్తితో సాగే జీవితం నిజమైన అస్తిత్వం".[130]

రాజకీయ దృక్పథం :

రాజకీయ వ్యవస్థను గురించి మాట్లాడినా ఇంకా స్పష్టమైన అవగాహన అప్పటికి దిగంబర కవులకు కలగలేదన్నది రెండవ సంపుటంలోని పీఠిక స్పష్టం చేస్తుంది. "ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలుముకుని వున్నంత వరకూ మార్క్సిష్టు దృక్పథాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీ లేదు. అయితే వ్యక్తి స్వేచ్ఛ, జన బాహుళ్యానికి అడ్డుకారాదు" అంటూనే "కాని నియమాల నిరంకుశత్వంలో సిద్ధాంతాల వక్రభాష్యంతో మనిషిని కీలు బొమ్మగా యంత్రపు విడి భాగంగా తయారుచేసే నియంతృత్వానికి అది మార్గం కారాదు."[131] అన్నారు. కమ్యూనిష్టు వ్యవస్థలోవ్యక్తి స్వేచ్ఛ పూర్తిగా నశిస్తుందేమో నన్న భయం కొంత

ఈ మాటల్లో వ్యక్తమవుతుంది. మతాలూ, సిద్ధాంతాలూ మానవ సంక్షేమంకోసం, వ్యక్తిని మరింతఉన్నతునిగా మలచడం కోసం పుట్టినవే అయినా చరిత్ర పురోగమనంలో వాటిస్వభావ స్వరూపాలు మారి కేవలం భేషజంగానో, లేక కొద్ది మంది వ్యక్తుల అధికార దాహానికి ఆలంబనంగానో మిగిలిపోయాయని, నేటి పశ్చిమదేశాల ప్రజాస్వామ్యాలలోనూ, మార్క్సిష్టు మతావలంబకులమని చెప్పుకొనే కమ్యూనిష్టు దేశాల్లోనూ ఇదే మిగిలిందనీ అందుకే దిగంబర కవులు యీ మతాలతోను, ఇజాలతోనూ నిమిత్తం లేదంటున్నారని చెప్పుకున్నారు.[132]

సమాజం : కుష్ఠు వ్యవస్థ :

ఆంధ్ర దేశాన్ని జడత్వం ఆవరించిందనీ, సినిమా పిచ్చి దేశాన్ని కుష్ఠు లాగ పట్టుకున్నదనీ అంటూ సినిమా ఆరోగ్యకరమైన, విజ్ఞాన వినోద సాధనంగా, కళాకారుడి నిజమైన స్వప్నావిష్కరణగా తయారు కావాలన్నారు దిగంబర కవులు.[133]

మూడవ సంపుటంలో ఈ సమాజం కుష్ఠు వ్యవస్థని నాశనం చేయటానికి యువతరాన్ని దిగంబర కవులు ఆహ్వానించారు. "మళ్ళీ మళ్ళీ మళ్ళీ చెబుతున్నాం. చెవులుంటే విను, కళ్ళుంటే చూడు, మెదడుంటే ఆలోచించు, పసవుంటే అంటే చీమూ నెత్తురూ వంటి నీతీ నిజాయితీ వుంటే, దేశమంతటా రాజకీయ నాయకులూ, పెద్ద పెద్ద బొజ్జల గొప్ప గొప్ప ప్రజారక్త వ్యాపారులూ పదవికోసం, డబ్బుకోసం దేనికైనా తెగించే మహాత్ములు జాతి రక్తనాళాల నిండా మహమ్మారిలా వ్యాపింప జేస్తున్న ఒక 'కుష్ఠు వ్యవస్థ'ని నాశనం చెయ్యటానికి బయటికిరా"[134] అని పిలిచారు.

ఆంధ్రుడు రోజు రోజుకీ నపుంసకుడుగా తయారు కావటానికి, గ్రూపు రాజకీయ నాయకుడు, పీఠాధి పతులు, గోసాయీలు, బాబాలు, సినిమా హీరోలు, పత్రికాధిపతులూ, సంపాదకులు, రచయితలు, విశ్వ విద్యాలయాలు కారణమనీ, 'ఈ కుష్ఠు వ్యవస్థ'ని పోషిస్తున్న వాళ్ళనీ, యీ వ్యవస్థనీ సర్వనాశనం చెయ్యటానికి దిగంబర కవులు పూనుకున్నారనీ చెప్పుకున్నారు. ఈ కుష్ఠు వ్యవస్థని పెంచి పోషిస్తున్న వారందరి గుట్టు రట్టు చేయడానికీ, ఈ వ్యవస్థనూ, దుర్గంధ సంస్కృతినీ నాశనం చేయడానికీ యువ రక్తాన్ని మేల్కొలవలసిందిగా పిలుపిచ్చారు.[135]

దిగంబర కవులలో ఒకడైన జ్వాలాముఖి తమ ప్రయత్నం 'జడతా బంధంలో ఒకనిష్ఠుర నినాద' మని అది స్పష్టమైన అవగాహనకు పూర్వ రంగాన్ని సృష్టిస్తుందనీ ఒప్పుకున్నాడు. నిశ్శబ్దతను చీల్చి, నిశ్చైతన్యాన్ని పార దోలి విప్లవ కవితోద్యమానికి అంకురార్పణ చేసిన వారు దిగంబర కవులు, పూర్వరంగాన్ని సృజించారు వారు.

5. విప్లవ కవితోద్యమం :

దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నుండి, సాగిన ఉద్య మాల నుండి చైతన్యం పొంది ఉద్యమాలకు మరింత స్ఫూర్తిని కలిగించినది విప్లవ కవితోద్యమం. తెలంగాణా సాయుధ పోరాటం 1946-51 మధ్య జరి గింది. తెలంగాణా రైతాంగ పోరాటమే భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిష్టు పోరాటం. భారతదేశంలో మొదటి రెడ్ ఏరియా కూడ తెలంగాణమే. భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో 1857 సిపాయి విప్లవాని కెంత ప్రాధాన్యత ఉందో, భారతదేశంలో కమ్యూనిష్టు పోరాట చరిత్రలో 1946-51 తెలంగాణా సాయుధ పోరాటానికి అంతప్రాధాన్యత వుంది. భారతదేశంలో కమ్యూనిష్టు ఉద్యమ చరిత్రలో తెలంగాణా పోరాటం చెరగని ముద్రవేసింది. కమ్యూనిష్టులు 1951 లో సాయుధ పోరాటం విరమించుకుని, 1952 లో పార్లమెంటరీ ప్రజా స్వామ్యంలో పాల్గొనటంతో ఈ ఉద్యమం వెనుకంజవేసింది.

1967 లో మొదలైన నక్సల్‌బరీ ఉద్యమ ప్రభావం మొత్తం భారత దేశంలో కనిపిస్తుంది. హిమాలయ పర్వత పాదాల్లో నేపాల్, చైనా, సరిహద్దులో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలోని ఒక చిన్న ప్రాంతం నక్సల్‌బరీ. అది 60 చిన్న గ్రామాల కూటమి. 1967 మార్చి నెలలో ఇక్కడి రైతులుసంఘటితమై పోరాటం సాగించారు. మే నెలలో అనేక సంఘర్షణలు జరిగాయి. ఈ పోరాటం భూమికోసం జరిగిన ఆర్థిక ఉద్యమం కాదనీ రాజ్యాధికారంకోసం చేసే సాయుధ పోరాటమనీ ఉద్యమ నాయకులలో ఒకడైన కానూ సన్యాల్ అభివర్ణించాడు. పోరాటం త్వరలోనే అణగిపోయినా దీని ప్రభావం దేశమంతటా అనేక చోట్ల కనిపించింది, భారతదేశ మంతటా ఈ ఉద్యమాన్ని నక్సలైటు ఉద్యమమనీ, ఉద్యమకారులైన తీవ్రవాద కమ్యూనిస్టుల్ని నక్సలైట్లనీ పిలవటం జరిగింది.

నక్సల్‌బరీతో సంబంధం లేకుండానే అంతకు పదేండ్ల ముందునుండే శ్రీకాకుళంలో గిరిజనుల్ని సంఘటిత పరచటం జరుగుతూ వుంది. 1967 లోనే ఇక్కడ కూడా సంఘర్షణలు మొదలయాయి. 1968 సంవత్సరాంతానికి శ్రీకాకుళం ఉద్యమం సాయుధ పోరాటం స్థాయికి చేరుకుంది. దాదాపు ఒక సంవత్సరం పాటు ఈ ప్రాంతం కమ్యూనిష్టుల అధీనంలో వుందని చెప్పవచ్చు. 1969 సంవత్సరాంతానికి పోలీసు అణచివేత చర్యలు తీవ్రమై ప్రధాన నాయకు లనేక మంది మరణించటంతో ఉద్యమం వెనుకబడ సాగింది. శ్రీకాకుళం ఉద్యమం రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఉద్యమానికి చైతన్య మిచ్చింది. 1969 ఏప్రిల్ 22వ తేదీన కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్టు లెనినిస్టు) పార్టీ ఏర్పడింది.

1969 లో పార్టీగా ఏర్పడక ముందు నుండీ పార్టీ నిర్మాణం, సాయుధ పోరాటం ఎత్తుగడలు మొదలైన విషయాలలో విప్లవ కారులలో భేదాభిప్రాయా లున్నాయి. AICCCR కూ Andhra State Co-ordinating Committeeకి మధ్య విభేదాలున్నాయి శ్రీకాకుళం జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీతో కంటే AICCCR తోనే ఎక్కువ సంబంధాలు పెట్టుకుంది. 1969 ఫిబ్రవరి 7వ తేదీన AICCCR ఆంధ్రరాష్ట్ర కమిటీ అనుబంధాన్ని (Affiliation) తొలగించింది. మరుసటి రోజు పార్టీ ఏర్పరచాలని తీర్మానించింది. ఈ అభిప్రాయ భేదాలు పార్టీ ఏర్పడిన తర్వాత కూడా కొనసాగాయి. ఎదురుదెబ్బలు తగిలే కొద్దీ పార్టీలో విమర్శలు బయలు దేరాయి. అభిప్రాయాలు కలవకపోవటంతో చీలికలు ఏర్పడ్డాయి. విప్లవ కమ్యూనిష్టు పార్టీ గ్రూపులు దేశంలో ఎన్నో ఏర్పడ్డాయి.

ఉద్యమాలకు సాహితీ ప్రతి స్పందన :

తెలంగాణా రైతాంగ పోరాట కాలంలో పోరాట గాథల్ని వర్ణించే అనేక పాటలు వెలువడ్డాయి. అయితే యితర సాహిత్య ప్రక్రియల మీద ఉద్యమానంతర కాలంలోనే కొంత ప్రభావం కనిపిస్తుంది. నవలలు, నాటకాలు ఉద్యమ ప్రేరణతో వచ్చినవి అల్ప సంఖ్యలోనే ఉన్నాయి. అభ్యుదయ కవులలో దాశరథి, ఆరుద్ర, కుందుర్తి వంటి వాళ్ళ రచనలపైన ఉద్యమ ప్రభావం బాగా కన్పిస్తుంది. సమకాలిక సాహిత్యం మీద కంటే, నక్సల్‌బరీ ఉద్యమం తరువాత వచ్చిన సాహిత్యంలో తెలంగాణా పోరాటం మళ్ళీ గుర్తుకు తెచ్చి, స్ఫూర్తిని

చైతన్యాన్ని కల్గించింది. ఉద్యమం నాటికి పోయి రచనలు చేశారు కొందరు రచయితలు. జాతీయోద్యమానికి రాణా ప్రతాప్‌సింగ్, శివాజీలు ప్రతీకలుగా ప్రేరణ అయినట్లు నక్సల్‌బరీ ఉద్యమ కవులకు తెలంగాణా పోరాటం ప్రేరణ అయింది. తరువాతి కాలంలో జనంలో ప్రచారంలో వున్న తెలంగాణా పోరాట పాటలు ప్రచురిత మయ్యాయి. ఆనాటి కవుల పాటలు కూడా ప్రత్యేకంగా పుస్తకాలుగా వచ్చాయి. ఇది ఆనాటి తెలంగాణా సాయుధ పోరాటాన్ని అర్థం చేసుకోవటానికే గాక విప్లవ కవితాయుగంలో సమకాలీన కవులకు చైతన్యాన్ని, స్ఫూర్తి నివ్వడానికి ఉద్దేశించినవే.

తెలంగాణా పోరాట పాటలు రెండో సంపుటికి పీఠికగా కె.వి. రమణారెడ్డి 1974 జనవరిలో కర్నూలు వి.ర.సం. మహాసభలో చదివిన ప్రసంగ వ్యాసాన్ని విరసం ప్రచురించింది. పుస్తకం పోరాట పాటలే అయినా ఈ వ్యాసం మాత్రం పోరాట కాలపు పరిస్థితులను, వాటిని ప్రతిబింబించిన అన్ని సాహిత్య ప్రక్రియలను పరిశీలించింది. ఈ పోరాట విరమణ విషయంలో నాటి పార్టీ వ్యవహరించిన తీరుపట్ల నేటి విప్లవకారుల అవగాహన కూడ ఈ వ్యాసంలో స్పష్టమవుతుంది. కొన్ని పాటలకు నేపథ్యమైన చారిత్రక సంఘటనలను వివరించింది. పోరాట విరమణను "ఇది విప్లవ పార్టీ ఆత్మహత్య, విప్లవహత్య" అని వర్ణించాడు కె. వి. రమణారెడ్డి. అయితే తెలంగాణా సాయుధ పోరాటం నేటి పోరాటానికి వెలుగు నిస్తున్నది. "చివరకు తెలంగాణా పోరాటం గర్వదాయకమైన స్మృతిగా మిగిలింది. లోక విఖ్యాతిని సంపాదించుకున్న ఈ ప్రథమ సాయుధ . రైతాంగ విప్లవ పోరాటం, 'విప్లవ వాణి'గా, 'త్యాగఖని'గా మనకిపుడు కనిపిస్తూంది. ఆ వజ్ర కాంతిలో, ఆ తెలంగాణా తార యొక్క కాంతిధారలో మనం యిప్పుడు నడుస్తున్నాం. ఇది దీర్ఘకాలికమైన పోరాటం. ఇది భారత పీడిత ప్రజల లాంగ్ మార్చ్"[136] అన్నాడు కె. వి. రమణారెడ్డి. సుద్దాల హనుమంతు పాటలకు రాసిన పీఠికలో జయధీర్ తిరుమలరావు పోరాట కాల పరిస్థితుల్ని కొంత వరకు వివరించాడు.

నక్సల్‌బరీ ఉద్యమం, శ్రీకాకుళం ఉద్యమాలు ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రాంతాలలో విప్లవ కారులకు స్ఫూర్తి నిచ్చాయి. తెలుగు సాహిత్యంలో కూడ ఈ ఉద్యమం ఒక ప్రధాన సాహిత్యోద్యమంగా రూపొందింది. 1970 జూలై 4

అర్ధరాత్రి సమయాన 'విప్లవ రచయితల సంఘం' (వి. ర. సం.) ఏర్పడింది. అభ్యుదయ రచయితల సంఘం (అ. ర. సం.) తో అసంతృప్తి చెందిన అభ్యుదయ కవులూ, దిగంబర కవులూ, తిరుగబడు కవులూ కొందరు కలసి వి. ర. సం. గా ఏర్పడ్డారు. "కమ్యూనిష్టు పార్టీలు చేసిందానికీ చెయ్యక విడిచి పెట్టిందానికీ ఫలితంగానే నక్సల్‌బరీ, శ్రీకాకుళం పోరాటాలు ఎలా మొదలయ్యాయో, అ. ర. సం. చేసిందానికీ చెయ్యక విడచి పెట్టిందానికీ జవాబుగానే వి. ర. సం. ఏర్పడింది."137 అన్నాడు కె. వి. రమణారెడ్డి.

సాంస్కృతిక సంఘాలు స్థూలంగా ప్రధాన రాజకీయ లక్ష్య విషయంలో ఏకీభావంతో పని చేస్తాయి. పార్టీ గ్రూపులతో వాటికి అనుబంధం వుండకూడదు. వి. ర. సం. ఏర్పడ్డప్పుడు అటువంటి విశాల ప్రాతిపదిక మీదే ఏర్పడ్డది. పార్టీలకు అనుబంధ సంస్థగా అది ఏర్పడలేదు. ప్రత్యక్షంగా అనుబంధాన్ని చెప్పక పోయినప్పటికీ క్రమక్రమంగా పార్టీలో వచ్చిన చీలికలు వి. ర. సం. లో కూడ కన్పించసాగాయి. సంఘంలో కూడ చీలికలు వచ్చాయి.

"విప్లవోద్యమం ఆటు పోట్లకు గురైనప్పుడు, ముఖ్యంగా నిరాశానిస్పృహలు పోరాట విచ్ఛిత్తికి దారి తీసేలాంటి పరిస్థితి ఎదురైనప్పుడే నిబ్బరం అవసరం. విప్లవ రచయితల సంఘం విచ్ఛిన్నమయ్యే పరిస్థితి 1975 జనవరిలో ఏర్పడింది. ఈ అంతరంగిక ప్రమాదాన్ని ఎమర్జెన్సీ తీవ్రతరం చేసి, సంఘ సభ్యులలో కొందరినైనా నీరు గార్చించింది. అయినా వి. ర. సం. జీవశక్తిగా వుంది. అలా వుందంటేనే దాని చారిత్రకావసరం తీరలేదని అర్థం. విప్లవ రచయితలు విడిగానూ, సమిష్టిగానూ, తమ రచనలతో సంస్థను పోషించి పెంచాలి"138 అన్న కె. వి. రమణారెడ్డి మాటలు ఈ విషయాన్నే సూచిస్తున్నాయి.

విప్లవ కవిత్వ లక్షణాలు :

విప్లవ కవిత్వ పీఠికల్లో విప్లవ కవిత్వ లక్షణాలుగా పీఠికా కర్తలు పేర్కొన్న వాటిని గూర్చి చర్చిస్తాను.

మార్క్సిస్టు-లెనినిస్టు మార్గం మానవ జాతికి ధృవతార :

'ఝంఝ' గేయ సంకలనం మలి కూర్పు కొసమాటలో శ్రీశ్రీ "ఈ భూగ్రహం ఇతర గోళాలను చేరడం కోసం మానవునికి లభించిన launching pad! దీన్ని రకరకాలతో pollutions తో మనం abuse చేస్తున్నాం. అన్నిటికన్నా, కంపు మానసిక మాలిన్యం. ఈ మనస్సుని మరమ్మత్తు చేయడానికి మార్క్సు ఒక దారి చూపించాడు. దానికి భౌతికవాదాన్ని, పరిస్థితుల ప్రభావాన్నీ పునాది చేశాడు. ఊహాప్రాయంగా వున్న ఆ దారిని ఆచరణ రీత్యా అనుభవంలోకి తీసుకు వచ్చాడు లెనిన్. ఈ మార్క్సిస్టు - లెనినిస్టు మార్గం ఒకటే మానవజాతికి ధృవతార. ఆ మార్గంలో మానవుణ్ణి మరింత ముందుకు తీసుకు వెళ్ళుతున్న వాడు మావో"139 అన్నాడు. ఈ మాటలు వి. ర. సం. రాజకీయ సిద్ధాంతాన్ని స్పష్టం చేస్తున్నాయి. వి. ర. సం. అంటే విప్లవ రచయితల బాధ్యతలుగా శ్రీశ్రీ ఇక్కడ ప్రతిపాదించాడు. ఒకటి భగవంతుడనే భావం మీద విడుపులేని యుద్ధం, రెండు సొంత ఆస్తి అనే మమకారాన్ని అందరి హృదయాల్లోంచి తొలగించటం. ఈ రెండూ జరిగిన నాడే ప్రపంచం బాగు పడుతుందని శ్రీ శ్రీ ప్రతిపాదన.140

1971 లో విప్లవ సాహితి ప్రకటించిన 'లే' కవితా సంకలనానికి 'విప్లవ కవిత్వం ఎలావుండాలి' అన్న పీఠిక రాస్తూ త్రిపురనేని మధుసూదనరావు విప్లవ కవుల కర్తవ్యాన్ని, విప్లవ కవిత్వ లక్షణాలను వివరించాడు. మధుసూదనరావు విప్లవ కవికి స్పష్టమైన వర్గ చైతన్యం అత్యవసరమనీ, సమాజంలో సామాజిక వాస్తవికతా స్పృహ కల్గించటమే విప్లవ కవుల ధ్యేయమనీ, దోపిడీ వర్గాన్ని ఎదుర్కొంటున్న వివిధ ప్రజా ఉద్యమాలను శాస్త్రీయంగా సమర్థించటమే విప్లవ కవుల ప్రథమ కర్తవ్యమనీ, తిరోగామి తత్వాన్ని ఖండిస్తూ శ్రామిక జనతను, అభ్యుదయాన్ని సాధించి, సామూహిక విప్లవ వాతావరణాన్ని పుట్టించటమే విప్లవ రచయిత ధ్యేయమని పేర్కొన్నాడు.141

ఈ సంకలనం రెండో ముద్రణకు రాసిన ముందుమాటలో విప్లవ సాహితి "విప్లవరచయితలు మార్క్సియన్ సోషలిజాన్ని నమ్ముతున్నారు. ఆ సోషలిస్టు

వ్యవస్థ రావటానికి సాయుధ పోరాటమే ఏకైక మార్గమని కూడ నమ్ముతున్నారు. ఈ రెంటికిని బద్ధులై భావ విప్లవం కోసం విప్లవ ఆచరణగా తమ రచనలు చేస్తున్నారు. ఈ దోపిడీ వ్యవస్థని, దాని విలువల్ని, దాని అంగాంగాల్ని వేగ వంతంగా పతనం చేసే శక్తుల్లో ఒక భాగంగా సాంస్కృతిక పోరాటం చేస్తున్నారు''142 అని ప్రకటించింది.

మార్క్సిజం, విప్లవం వంటి మాటలు లేకుండానే వంగపండు ప్రసాద రావు "ఎవరయితే ఆకలి పేగులు ఆనకట్టు గొట్టాలుగా పెట్టి అన్నంలేకున్నా బాధపడుతున్నారో, ఎవరయితే తమ కళ్ళను కరెంటు బల్బులుగా వెలిగించి గుడిసెలో ఆరిపోయిన దీపం బుడ్డికోసం దేవులాడుతున్నారో, ఎవరయితే తమ చెమట చుక్కలు పంట మొక్కలుగా పుట్టించి, పస్తులు పడుతున్నారో చివరకు ఎంగిలాకు మీద మెతుకులాగ ఎండిపోతూ దూది పింజలాగ గాలిలో తేలిపోతూ ఏమౌతున్నారో చూడమంటూ ఈ పాటలు పాడమంటూ ఏం చెయ్యాలో ఆలో చించ మంటున్నాను.''143 అని కర్తవ్యబోధ చేశాడు.

సాహిత్య దృష్టి, సాంఘిక దృక్పథాల మేళవింపు విప్లవ రచన :

రచయితకు సాహిత్య దృష్టి, సాంఘిక దృక్పథమూ రెండూ అవసరమే నన్నాడు త్రిపురనేని మధుసూదనరావు. "సాహిత్య దృష్టితో రచన ఎంత కళా ఖండమైనా సాంఘిక దృక్పథం లేనప్పుడు అది అథమరచనే అవుతుంది. సాహిత్య దృష్టి లేకుండా కేవల తీవ్ర రాజకీయ దృక్పథం పేలవ మవుతుంది. సాంఘిక కళాత్మక విలువలు రెండూ సామాన్య జనాన్ని విప్లవ ప్రభావంతో ప్రభావితం చెయ్యగలిగిందే విప్లవ రచన అవుతుంది.''144

కవితలో కవిత్వాంశ దీపం ఆరిపోకూడదని కె. వి. రమణారెడ్డి భావిం చాడు. "మన కావ్యాల సందేశం జనానికి అంది గుండెలకు హత్తుకుపోయి ఉద్యమోత్సాహాన్ని విజయ విశ్వాసాన్ని వెలుగు చూపునీ ఇవ్వాలంటే మాత్రం కవిత్వం కవిత్వమే అయివుండాలన్న విషయాన్ని విస్మరించడం, మనం ఆశించే ప్రజాపరమైన మహా ప్రయోజనానికి మనమే భంగపాటు కలిగించడ మౌతుంది''145 అన్నాడు. ''ఈరోజు కోకొల్లలుగా కవిత్వం రాస్తున్న కవులు ఆ విప్లవ భావాలను కవిత్వీకరించడం దగ్గరే వైఫల్యం పొందుతున్నారు.''146 అని [illegible] నిర్వేదాన్ని వెలిబుచ్చింది.

సాహిత్యం రాజకీయాల సాన్నిహిత్యం:

వి ర.సం. ఒక రాజకీయపార్టీకి అనుబంధంకాదనీ, ఒక రాజకీయపార్టీ కాదనీ అన్నాడు రమణారెడ్డి. ఇది 1970లో మాట. అయితే ఆయన ఎప్పుడూ రాజకీయాలను సాహిత్యంలో పరిహరించాలనుకోలేదు. 1973లో ప్రచురింపబడిన చెరబండరాజు 'గమ్యం'కు పీఠికరాస్తూ "విప్లవాల యుగంలో విప్లవ కవిత్వం ఒక్కటే కాలానికీ జనానికీ అనువైన అవసరమైన కవిత్వం. ఆ ప్రజలు'కాగితం మీద అక్షరాలు'గా కాక, పోరాటపతాకాలుగా జీవసమాధుల నుండి పైకి కెరటాలు కెరటాలుగా లేచి వస్తున్నారు. కవి తన జనం మధ్య వుండాలి. జనంతో బాటు విప్లవకర పార్టీల వెంట నడవాలి అన్నాడు" 147. చెరబండరాజు 'దిక్సూచి' లో సాహిత్యం, రాజకీయాలు వేరుకావని పేర్కొన్నాడు. జ్వాలాముఖి 'ఓటమి తిరుగుబాటు'కు 'వైరుధ్యాల మధ్య - నేను - నా కవితావేశం' అని రాసుకున్న ఉత్తర పీఠికలో సాహిత్యం రాజకీయాలు ఎలా బింబ ప్రతిబింబాలో వివరిస్తూ యిలా అన్నాడు. "ఈ దేశంలో ప్రజల సాహసానికి, త్యాగానికి బుద్ధికి ఎన్నడూ లోపం లేదు. వాటిని సామాజిక వైరుధ్యాల కనుగుణంగా మలచుకొని nativenessతో నిర్విరామ వర్గపోరాటాన్ని రూపొందించే political perspective మాత్రమే కొరవడిందని చెప్ప సాహసిస్తున్నాను. రష్యాలో లెనిన్‌లాగ, చైనాలో మావో లాగ, వియత్నాంలో హోచిమిన్‌లాగ, జనాన్ని శ్రామిక దృక్పథంతో రాజకీయంగా విప్లవీకరించే రాజకీయ నాయకత్వం కొరతగానే మిగిలిపోయింది."148 వర్గ సంఘర్షణ ఉపరితలం మీద సాఫల్యం పొందక పోవటానికి నాయకత్వం లోని లోపమేనని జ్వాలాముఖి అభిప్రాయపడ్డాడు.

నేటి చైతన్య రచయిత రాజకీయ వర్గపోరాటాల విస్తృతిలో రేపు కావల్సిన ప్రజాశక్తిని ఊహించి రూపొందించి నేటి ప్రజారాసిని అటువైపు మళ్ళించాలనీ, upper class domination నుండి శ్రామిక కళలను విడగొట్టి, శ్రామిక సంస్కృతికి రూపు రేఖలు, వారి పోరాటాల కనుగుణంగా తీర్చిదిద్దాలనీ, ముందు తరాలకు విప్లవ వారసత్వాన్ని వీరగాథల ద్వారా అందించడమే నేటి విప్లవ రచయితల చారిత్రక పాత్ర అనీ జ్వాలాముఖి అభిప్రాయ పడ్డాడు. అప్పటికే మందగించిన సాయుధ పోరాటాన్ని గుర్తించిన జ్వాలాముఖి రాజకీయ ప్రతిష్ఠంభనలో మోరల్‌ని కాపాడటమే నేటి విప్లవ సాహిత్య తక్షణ కర్తవ్యంగా భావించాడు.

అయితే కవి విప్లవ బాధ్యతలను నెత్తిమీద వేసుకోకూడదనీ, కవి చేతుల్లో రాజకీయాలుండటం ప్రమాదకరమనీ, రాజకీయాలచేతుల్లో కవి వుండాలని జ్వాలాముఖి అభిప్రాయ పడ్డాడు.[149]

విప్లవ కవిత్వ పీఠికల్లో పీఠికా కర్తలు పేర్కొన్న విషయాలు :

ప్రేరణ - భవిష్యత్ మార్గం : పీఠికల్లో పీఠికా కర్తలు ఎక్కువగా స్పృశించిన విషయం ఏ ప్రేరణతో విప్లవ కవిత్వం ఆవిర్భవించిందో చెప్పటం, భవిష్యత్ మార్గాన్ని సూచించటం. 1970లో వి.ర.సం. ప్రకటించిన 'ఝంఝ' గేయ సంకలనానికి 'కొత్త గుండెల చప్పుళ్ళు వింటారా'? అన్న శీర్షికతో రాసిన కె. వి. రమణారెడ్డి పీఠికలో విప్లవ రచయితల సంఘం ఏర్పడే నాటికి ఉన్న పరిస్థితులనూ, విప్లవ రచయితలకు ప్రేరణ కల్గించిన పరిస్థితులనూ వివరించాడు. "సంకల్ప పూర్వకంగానో, అసంకల్పితంగానో, అయిన వారి నుంచీ, కాని వారి నుంచీ, అభ్యుదయ రచనా సంప్రదాయాన్ని గోతబెట్టే దుస్సంకల్పమే విప్లవ రచయితల సంఘం ఏర్పాటు కావటానికి తోడ్పడింది. భావాలజడిమను వదలగొట్టాల్సిన అగత్యం ఏర్పడింది. రచనల ద్వారా రచయితలు కూడా ఉత్తేజం పొందలేని దుస్థితి నుండి రచయితలే కాక పాఠకులూ, ప్రజలూ ఉత్తేజం పొందవలసిన స్థితికి సాహిత్యాన్ని కొని పోవాలనేది మాసంకల్పం"[150] అని రమణారెడ్డి ప్రేరణనూ, ఆశయాన్ని వివరించాడు.

అదే పీఠికలో ఆ విప్లవ కవుల కవితలకు ప్రేరణ సమకాలిక సాయుధ పోరాటమేనని తెలియజేశాడు. అయితే 1970 ఆఖరు నాటికే పోరాటం మందగించిందన్న విషయాన్ని కూడ గుర్తించాడు. "ఈ తరం కళ్ళ ముందు, మెరుపులా మెరసి ఉరుములా మోగి ఇంతలో తుపాకుల మోతలతో జైలుశిక్షలతో కాల్పులతో కూల్పులతో హింసలతో హత్యలతో తాత్కాలికంగా మందగించక తప్పని సమకాలిక సాయుధ పోరాట మొకటి ప్రముఖంగా నిలచి వుంది. ఎవ్వరే విధంగా దాన్ని విమర్శించినా, అది ప్రధానంగా యౌవనం నడిపిన ఉద్యమం. అందుచేతనే యువకులూ, విద్యార్థులూ, దీనికి ప్రతిస్పందించినట్లుగా కాగి చల్లారిన పాల వయస్సు గల వాళ్ళు ప్రతిస్పందించలేక పోయారు. యువ కవుల ప్రతిస్పందనలు ఎన్నో గేయాలుగా రూపొందాయి. వీర గేయాలూ - విలాస గేయాలూ - ఏవైనా ఒక ఉద్యమానికి అంకితమైనట్టివే - చరిత్ర గర్భంలోని పరిణామ శిశువు హృదయ స్పందనల్లాంటివి".[151]

దిక్సూచిలో చెరబండరాజు తన చుట్టూవున్న పీడిత జన జీవన జీవన్మరణ సమస్యలే తన ప్రేరణలని చెప్పుకున్నాడు. "వర్తమాన సామాజిక పరిస్థితుల్ని, నిర్మోహమాటంగా నిర్ద్వంద్వంగా చిత్రించి, ప్రజల త్యాగాన్ని కీర్తించి, భవిష్యత్ మార్గాన్ని నిర్దేశించటం కన్నా కవి ఏం కోరు కుంటాడు?" అని ప్రశ్నిస్తూ తన కవితా ధ్యేయానికి మార్క్సీయమైన శాస్త్రీయ అవగాహన స్పష్టతను ప్రసాదించిందని చెప్పుకున్నాడు.[152]

భైరవయ్య 'రా' పీఠికలో "ఏ దేశంలో విప్లవం వచ్చినా సాహిత్యం ద్వారానే వచ్చింది. ఏ జాతిలో చైతన్యం కలిగినా సాహిత్యం వల్లనే" అంటూ జీవితం, నా చుట్టూ వున్న ప్రపంచం నాకు మార్క్సిస్టు పాఠాలు నేర్పింది. అన్యాయం అన్నది ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా ఎదిరించి నిలబడమని చెప్పింది"[153] అన్నాడు.

జ్వాలాముఖి 'ఓటమి తిరుగుబాటు' కు 'వైరుధ్యాల మధ్య - నేను - నా కవితా వేశం' అని రాసుకున్న పీఠికలో కేవల మానవతా వాదం నుండి తిరుగుబాటుకు, మార్క్సీయ వర్గపోరాట దృక్పథానికి తన కవిత్వం పరిణామం చెందిన తీరును పరిచయం చేసుకున్నాడు.[154]

నిఖిలేశ్వర్ తన 'మండుతున్న తరం'కు పీఠిక రాసుకుంటూ "శాస్త్రీయ మైన మార్క్సిస్టు దర్శనం సరియైన దిక్కును చూపింది. గత నాలుగు సంవత్స రాలలో ఉవ్వెత్తున చెలరేగిన యువతరం తిరుగుబాట్లు - మండిన నక్సల్‌బరీ - శ్రీకాకులాలు ఒక ఊపు నిచ్చి ముందుకు తోశాయి"[155] అని తన కవితా ప్రస్థానంలో పురోగమనాన్ని సూచించాడు.

ప్రభుత్వ నిర్బంధాలు :

మొదట కమ్యూనిష్టులపై, నక్సలైట్లపై, ఆ తరువాత విప్లవ కవులమీద, కవిత్వం మీద ప్రభుత్వ వైఖరి, ప్రభుత్వ నిర్బంధాలు పీఠికల్లో చర్చ నీయాంశాలయ్యాయి. 'లే' కవితా సంకలనానికి 'లే సమయమిదే లే' అన్న శీర్షికతో శ్రీ శ్రీ రాసిన పీఠికలో ప్రభుత్వ నిర్బంధాలేవీ ఉద్యమాన్ని ఆప లేవన్నాడు. "దేశ మంతటా పోలీసు మంత్రులు విప్లవ సాహిత్యాన్ని నిషేధించ

టానికి పథకాలు వేస్తున్నారు. కాని విప్లవాన్ని నిషేధించబోవటం భేరీని జో కొట్టటం లాంటిదే. మిగిలినదేశం మాట ఎలావున్నా తెలుగునాటికి సంబంధించి నంత మట్టుకు ఈ సరికే విప్లవ రచన విజయవంత మయిందని నేను ఢంకా బజాయించి చెప్పగలను. వేల కొద్దీ గ్రంథాలను నిషేధించినా వందలకొద్దీ రచయితల నోళ్ళు నొక్కినా, ఇదివరకే విజృంభించిన విప్లవ తరంగం ఇకమీద విశ్రమించదు. ఇది ప్రధానంగా యువకుల ఉద్యమం. ప్రాణ శక్తితో ప్రతి స్పందిస్తున్న ఉద్యమం, ప్రపంచ పర్యాప్తమైన ఉద్యమం. అప్పుడే ఇది విజ యాలను సాధించింది. అచిరకాలంలోనే అంతిమధ్యేయాన్ని అందుకుంటుంది"156 అని ప్రకటించాడు.

'కాంతియుద్ధం'కు 'హృద్ఘోషకు జైలు లేదు, జనవాహిని కెదురు లేదు' అన్న శీర్షికతో చెరబండరాజు రాసుకున్న పీఠికలో ఆయన విప్లవోద్యమంతో మమైక్యమైన స్థితి ద్యోతక మవుతుంది. "ప్రజలు తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలకు, అమానుషాలకు, ప్రతిగా వర్గ కసితో భారత పాలకవర్గాల పునా దులు కదిలిపోయే 'యుద్ధం' ప్రకటించారు. ఎవరెన్ని భాష్యాలు చెప్పుకొని తప్పుకొన్నా ఎందరు తలకిందులుగా నడుస్తున్నా నాటి తెలంగాణా పోరాట వైఫల్యం పునరావృత్తమయ్యే ప్రసక్తి లేదు. ప్రకటించిన యుద్ధంలో రాజీలేదు. దావానలంగా దేశ వ్యాప్తంగా విజృంభిస్తున్న రైతాంగ సాయుధ పోరాట ఫలి తాన్ని కాపాడుకుంటూ భారత ప్రజలు జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని పరి పూర్తి చేసుకుంటారు .... ప్రజావ్యతిరేకమైన ఓ ప్రభుత్వమా నీ అంగాంగాన్ని ఖండించి నూతన ప్రజాస్వామ్యాన్ని స్థాపించటమే మా ధ్యేయం"157 అని ఉద్వే గంతో ప్రకటించాడు చెరబండరాజు.

మెచ్చుకోళ్ళు : ఆశ్వాసనలు

కొన్ని పీఠికలు వట్టి మెచ్చుకోళ్ళుగా, సర్టిఫికెట్లిచ్చే ధోరణిలోనో లేక వీపు తట్టి ముందుకు నెట్టే ధోరణిలోనో వుంటాయి. 'లే' పీఠికలో శ్రీ శ్రీ "ఇంకొ న్నాళ్ళు వెంపటాపు సత్యం బతికుంటే ఇంకో లెనిన్ మనకు దక్కేవాడని నా మిత్రుడొకడన్నాడు. దానితో నేను ఏకీభవిస్తున్నాను. ఆ సత్యం వైపుగా పయనించటానికే ఒరేయ్ తెలుగోడా, లే అని తిరుపతి కవి సింహ కిశోరాలు ఎలుగెత్తి ఉద్ఘోషిస్తున్నారు. వాళ్ళతో గొంతు కలిపి 'లే సమయ మిదేలే' అంటు

న్నాను"158 అన్నాడు శ్రీ శ్రీ. ఈయన రాసిన చాలా పీఠికల్లో ఈ ధోరణి కన్పిస్తుంది.

విమర్శ :

పాతధోరణులపై తిరుగుబాటును, సమకాలీన (విప్లవ) సాహిత్యం ధోరణుల బాగోగులను చర్చిస్తూ సాగింది విప్లవ యుగ విమర్శ పీఠికా రూపంలో.

పాతధోరణులపై తిరుగుబాటు :

అభ్యుదయ కవితపై తిరుగుబాటు ప్రకటించిన విప్లవ కవిత్వ విమర్శకులు అభ్యుదయ కవిత్వం నిర్వహించిన పాత్రను మెచ్చుకుంటూనే అది ఎలా విఫలమైందో సూచించారు. 1970లో వి.ర.సం. ప్రకటించిన 'ఝంఝ' గేయ సంకలనానికి పీఠిక రాస్తూ కె.వి. రమణారెడ్డి ఇలా అన్నాడు "అభ్యుదయ రచనా సంప్రదాయం గొప్పది. శ్రీశ్రీ విప్లవ కవిత్వం ద్వారా ఆంధ్రసాహిత్యంలో ఇది స్పష్టమైన ఆకృతి ధరించింది. కుటుంబరావుగారు దీని చేత మేలి పంట పండించారు. అభ్యుదయ రచయితల సంఘం రెండు దశాబ్దాల పాటు పత్రికల ద్వారానూ సభలూ పాఠశాలలూ ద్వారానూ దీన్ని శ్రీశ్రీ, కుటుంబరావుల తరం రచయితల నుండి అనిసెట్టి - కుందుర్తి - సోమసుందర్ తరం రచయితలకు అందించి కృతార్థ మయింది", అంటూ అ.ర.సం. పూర్వం నిర్వహించిన ప్రగతి పాత్రను గుర్తిస్తూ ప్రస్తుతకాలంలో అది ఏ విధంగా పలుచబారి పోయిందీ వివరిస్తూ ఆ సంస్థా సారథులు 'విశాల వేదిక' పేరిట 'మానవతా వాదం' పేరిట సర్వసామరస్య వైఖరిని అవలంబించి చిత్రమైన సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించాడు.159

దిగంబర కవుల కవిత్వాన్ని అటు సంప్రదాయ వాదులూ, ఇటు అభ్యుదయ రచయితలూ కూడ విపరీతంగా విమర్శించారు. విప్లవ కవులు సమర్థించారు. దిగంబర కవులను రాచమల్లు రామచంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించాడు దిగంబర కవులను సమర్థిస్తూ కె. వి. రమణారెడ్డి "దేశంలోని కుళ్ళునూ, కంపునూ వాటికి యోగ్యమైన బూతు మాటలతో బయట పడేశారని 'దిగంబర కవుల'ను పడదిట్టడం కూడా ఈ 'కమ్యూనిష్టు'విమర్శకుల దృష్టి మాంద్యానికి మరొక నిదర్శన

మైంది. ఈ కవులేమో అరాచక వాదులు గానూ, మార్క్సిజం వాసనకూడ కిట్టని కవులేమో మానవతా వాదులు గానూ వీళ్ళకు కనుపించసాగారు"160 అన్నాడు.

విప్లవ కవిత్వ విమర్శ-
వైవిధ్యం లేని నినాద కవిత్వం :

విప్లవ కవిత్వంలో వైవిధ్యం లేదనీ, నినాదాలు తప్ప కవిత్వం లేదనీ తీవ్రమైన విమర్శవుంది. విప్లవ కవిత్వాన్ని నినాద కవిత్వం అన్నాడు నగ్నముని. " 'నాదం' ఒకప్పుడు, 'నినాదం' మరొకప్పుడు కవిత్వంగా చెలామణీ అయ్యాయి. నాదనినాదాలు కవిత్వంగా చెలామణి అయ్యే రోజులు పోయాయి. కవి నేడు సామాజిక శాస్త్రజ్ఞుడుగా పనిచెయ్యాలి''161 ఇలాంటి విమర్శ విప్లవ కవిత్వ వ్యతిరేకులు మాత్రమే చేసింది కాదు. విప్లవ కవులు, విమర్శకులు కూడా ఇటువంటి అభిప్రాయాలకు లోనయ్యారు. అందు వల్లనే చాలా పీఠికల్లో విప్లవ కవులు వైవిధ్యం ఉన్న రచనలు, కేవలం నినాదాలు కాక కళాత్మకత ఉన్న రచనలు చేయాలని ఉద్బోధించడమూ, విప్లవ కవి కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు ఆ కవిలోని వస్తు వైవిధ్యాన్ని, కళాత్మక తనూ ప్రత్యేకంగా సంభావించడమూ కనిపిస్తుంది. "ఒకే రకమైన అనుభవాన్ని ఒకే రకమైన శబ్దజాలంతో వస్తువులో, శిల్పంలో వైవిధ్యం లేకపోతే ప్రజల్ని ప్రభావితం చేయడం సాధ్యంకాదు''162 అన్నది త్రిపురనేని మధుసూదనరావు అభిప్రాయం.

వస్తు వైవిధ్యం లేదన్న ఆరోపణ పూర్వ సాహిత్యంపై కూడ వున్నది. ప్రాచీన కవిత్వం, దక్షిణాంధ్ర యుగ సాహిత్యం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం కూడ ఈ ఆరోపణకు లోనయ్యాయి. అందులో సత్యమూ లేకపోలేదు. ప్రబంధాలు ఒకే మూసలో పోసినట్లుంటాయనీ, ఒకటి చదివితే తక్కిన వేవీ చదవవలసిన అగత్యం లేదనే విమర్శ వచ్చింది. అవి భావనాశక్తి రహితాలనీ, నిష్ప్రయోజనాలనీ విమర్శింపబడ్డాయి. భావ కవిత్వంలో ఒకే విధమైన పదజాలమూ, భావాలూ తప్ప వైవిధ్యం లేదన్న విమర్శ కూడా వున్నది. వెన్నెల, చక్కెర, పువ్వులు, ప్రేయసి, ప్రణయం, విరహం ఇంతేగా భావ కవిత్వ మన్న వారున్నారు. అభ్యుదయకవిత్వ విషయంలోను సంప్రదాయ వాదులు ఇటువంటి విమర్శసాగించారు. విప్లవ కవిత్వ విషయంలో కొట్టు, చంపు, నరుకు, విప్లవం, వర్గకసి వంటి మాటలేతప్ప వైవిధ్యమే లేదన్న వారెందరో

అందుకే విప్లవ కవిత్వ సమర్థకులకు డిఫెన్సివ్ పాస్చర్స్ అవసరమయ్యాయి. "వస్తు వైవిధ్యం లేదని పూర్వం అభ్యుదయ కవిత్వం మీద ఒక విమర్శ వస్తుం దేది. అదే ఈనాడు విప్లవ కవిత్వం మీద కూడా వస్తున్నది. ఇట్లాంటి విమర్శ చేసే వాళ్ళు ఈ కవిత్వాలను సరిగ్గా పరిశీలించి అనటంలేదు. చెరబండరాజు కవిత్వాన్ని చదివితే ఈ ఆరోపణ నిరాధారమైనదని వెంటనే గ్రహించవచ్చు"163 అన్నాడు చేకూరి రామారావు. వరవరరావు "విప్లవ కవిత్వానికి వైవిధ్యంతేగల కవుల జాబితాలో ఆయన చేరతాడు"164 అన్నాడు 'రోడ్డుమీద సూర్యుడు' పీఠికలో.

ప్రామాణిక కవిత్వం :

ప్రామాణిక కవిత్వ మంటే విద్యావంతులకు మాత్రమే అర్థమయ్యే కవిత్వ మన్న భావం త్రిపురనేని మధుసూదనరావులో కనిపిస్తుంది. విప్లవ కవులు సాహిత్య ప్రమాణాన్ని పెంచటానికి రాయాలా ? అందరికీ అర్థమయ్యే రచనలు చెయ్యాలా ? అని ప్రశ్నించుకుని కేవలం ప్రమాణాలకే అంకితమవటం పెద్ద తప్పన్నాడు. అయితే "ప్రమాణాల పేరుతో విప్లవ రచన శ్రామిక సంస్కృతికి దూరమైతే అది బూర్జువా రచనే అవుతుంది. కాని ప్రమాణాలతో కూడిన రచనలు కూడ నేటి వర్గ సమాజంలో కొంత విలువలు సాధించ గలవు"165 అన్నాడు. అయితే వర్గ రహిత సమాజంలో మాత్రం వాటికి ప్రయోజనం ఎందుకుండదు? అన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. చేకూరి రామారావు అభిప్రాయంలో "విప్లవకవి అయిన వాడు అన్ని రకాల స్థాయిల్లో వున్న పాఠకులతోను కమ్యూనికేట్ చేయ గలగాలి, విజ్ఞానవంతులైన చదువుకున్న వాళ్ళతో పాటు చదువురాని సామాన్య శ్రోతల వరకు సందేశం వెళ్ళాలి. ఆ అవసరాన్ని శివసాగర్ గుర్తించాడు. గుర్తించటమే కాదు, అన్ని మార్గాల్లోను ఉత్తమ కవిత్వం అందించాడు."166 నాగరిక పాఠకులను ఆకట్టుకొనే అత్యాధునిక ధోరణి గల కవితలూ, సామాన్య ప్రజల బాణీల్లో, వాళ్ళ పలుకుబడిలో సాగి వాళ్ళకు పరిచయమైన భాషలో సందేశమిచ్చే పాటలూ రాసిన శివసాగర్‌ను గొప్ప విప్లవ కవిగా వర్ణిస్తూ, రెండు రకాల కవితల్లోను కవితా శక్తి కుంటుపడక పోవటమే ఆయన విశిష్టతగా ప్రతిపాదించాడు రామారావు.

కవిత్వ విశ్లేషణ :

పీఠికల్లో కవి కవిత్వ విశ్లేషణ చేసిన వాళ్ళు తక్కువ. చేకూరి రామారావు పీఠికల్లో కవిత్వ విశ్లేషణ విస్తృతంగా వుంటుంది. 'ఉద్యమం నెలబాలుడు'కు రాసిన పీఠిక ఇందుకు ఒక ఉదాహరణ ఈ పీఠికలో శివసాగర్‌ను హోచిమిన్‌తో పోల్చాడు రామారావు. విప్లవ కార్యాచరణలో, కవిత్వంలో ఇద్దరికీ వున్న పోలికలను వివరించాడు. శివసాగర్ కవిత్వంలోని కాల్పనిక ధోరణి ఉద్యమాన్ని నెలబాలుడుగా ఊహించటం లోనే వ్యక్తమవుతుందన్నాడు. కవితా పద్ధతిలో శివసాగర్ విప్లవ కవులకు ఎలా మార్గదర్శకుడయ్యాడో చెప్పాడు. "ఒకే కవి వచన పద్యంలోనూ, జానపద శైలిలోనూ, మాత్రా పద్యంలోనూ, సెటైర్‌లోనూ పరిణతి సాధించి సమాన ప్రతిభతో ఉత్తమ కవిత్వాన్నందించడం అరుదు."167 ఈ అరుదైన తనాన్ని సాధించటం శివసాగర్ ప్రత్యేకతగా రామారావు పేర్కొన్నాడు. శివసాగర్ జానపదబాణీల విశిష్టత అవి ఏకకాలంలో పండిత పామరులను మెప్పించడంలో వుందన్నాడు. జానపద గేయాల్లో కన్పించే భాషా సారళ్యంతో పాటు ఇతర సాహిత్యాల్లో కన్పించే భావ పరిణతి కూడ శివసాగర్‌లో వుందని వెల్లడించాడు. శివసాగర్ కవిత్వంలో నినాద స్థాయికి ఎదిగిన గొప్ప వాక్యాలున్నాయన్నాడు. ఆయన కవిత్వంలోని సింబాలిజాన్ని, ఆయన వాడిన డిక్షన్‌ని విశ్లేషించాడు. "విప్లవ సాహిత్యంలోనే కాదు, మొత్తం తెలుగు సాహిత్యంలో కూడా శ్రీశ్రీ తరువాత గుర్తించదగిన బహుముఖ ప్రజ్ఞావంతుడు"168 గా శివసాగర్‌ను రామారావు అంచనా కట్టాడు.

త్రిపురనేని మధుసూదనరావు కవిత్వ విమర్శ సిద్ధాంత ప్రతిపాదనగా కన్పించే ధోరణిలో సాగుతుంది. 'సూరీడు మావోడు'కు పరిచయం రాస్తూ, కె.వి. రమణారెడ్డి కవిత్వాన్ని పరిశీలించేటప్పుడు "అభ్యుదయ దృక్పథం వుంది. విప్లవ దృక్పథం వుంది. అన్వయ కాఠిన్యం, శబ్దక్లిష్టతా వున్నాయి' మొదలైన వాక్యాల పరిమితుల్ని విమర్శకులు దాటలేదన్నాడు మధుసూదనరావు. తెలుగు సాహిత్యంలో కవిత్వ అధ్యయన పద్ధతులూ, విమర్శా సూత్రాలూ అభివృద్ధి చెందలేదనీ, పై పద్ధతి విమర్శలు పరిశీలనా దారిద్ర్యాన్ని చాటుతున్నాయనీ అంటూ 'సూరీడు మావోడు' కవితల్లోన్ని కవితా సిద్ధాంతాన్నీ, కవిత్వ స్వభావ విప్లవాన్నీ విశ్లేషించ పూనుకొన్నాడు. మధుసూదనరావు అభిప్రాయంలో సాహిత్య

రాజకీయం, రాజకీయ సాహిత్యం అనేవి రెండు విభాగాలు. కవిత్వంలో విప్లవ రాజకీయాలను చెప్పటం రాజకీయ సాహిత్యం. "సాహిత్యంలో విప్లవ రాజకీయ వస్తువుకి అనుగుణ్యంగా సాహిత్య స్వభావాన్ని మార్చడం. సామాజిక ఆర్థిక నేపథ్యం నుంచి రాజకీయాల్ని విమర్శించి విప్లవ రాజకీయాలు చెప్పటం. సాహిత్యానికి శ్రామికవర్గ రాజకీయ ఆచరణ ఇతివృత్తంగా వుండటం; అనుభూతిని గాక, చైతన్యాన్ని కలిగించడం, చైతన్యాన్ని దాని అస్తిత్వ గతితర్కంలో కలిగించటం. సాహిత్యంలో విద్యావంతం చేసే గుణం మీద కేంద్రీకరించి, పాఠకుడికి లేదా శ్రోతకి ఆలోచననీ వివేకాత్మక వికాసాన్ని కలిగించడం సాహిత్య రాజకీయం"169గా నిర్వచించాడు. సాహిత్యం రాజకీయ పాత్ర నిర్వహించడం, వర్గపోరాటంలో శ్రామికవర్గ ఆయుధంగా వుండటం, సాహిత్య రాజకీయంలో కీలకమైన అంశాలుగా పేర్కొన్నాడు. సాహిత్యానికి ఆచరణ స్వభావం సాహిత్య రాజకీయాలు లేకుండా రాదు. ఆలోచన వివేకాత్మక వికాసాల్తో విద్యావంతం చేస్తూ ప్రజల్ని ఆచరణలోకి ఐక్యం అయ్యే చైతన్యాన్ని ఇవ్వడం సాహిత్య రాజకీయ లక్ష్యమనీ, ఈ సాహిత్య రాజకీయమే కె. వి. రమణారెడ్డి కవితా సిద్ధాంతమనీ మధుసూదనరావు ప్రతిపాదించాడు. "ఆల్కెమీ నుంచీ కెమిస్ట్రి విముక్తి పొందినట్లు కె.వి.ఆర్. కవిత్వం సాహిత్యాన్ని 'సారస్వతం'నుంచీ, 'రస - సారసత్వం' నుంచీ 'అందం - ఆనందం - పరమావధి' నుంచీ విముక్తం చేసింద"170న్నాడు.

శ్రీ శ్రీ, శివసాగర్, చెరబండరాజు, గద్దర్‌లు రాజకీయ సాహిత్యానికి చెందినవాళ్ళనీ, కె. వి. రమణారెడ్డి సాహిత్య రాజకీయాల స్థాయికి ఎదిగాడనీ మధుసూదనరావు అభిప్రాయం. వీళ్ళ కవిత్వ స్వభావంలో తెచ్చిన మార్పు చాలా తక్కువనీ, కవిత్వ వస్తువులోనే వీరు మార్పు తెచ్చారనీ ఆయన అన్నాడు. "కవిత్వ వస్తువులో విప్లవం,కవిత్వ స్వభావంలో ప్రాచీనత వీళ్ళ కవిత్వ లక్షణం. ఇది పాత సీసాల్లో కొత్త సారా పోసే పద్ధతి. ద్రవీభవింప జెయ్యడం, శబ్ద లీలా వినోదం కలిగించటం, గానాంశ వుండటం, భావ ప్రచారం వంటివే శ్రీ శ్రీ, శివసాగర్, చెరబండ రాజుల విప్లవ కవిత్వ స్వభావ"171మని మధుసూదన రావు విశ్లేషించాడు.

అయితే కె. వి. రమణారెడ్డి కవిత్వం శ్రీ శ్రీ, శివసాగర్, చెరబండరాజుల కవిత్వం కంటె ఏ విధంగా భిన్నమో ఆయన స్పష్టీకరించ లేదు. తన సిద్ధాంతానికి 'సూరీడు మావోడు' లోని కవితలన్నీ లక్ష్యాలే అని పేర్కొనటం తప్ప, వాటిలో కొన్నైనా ఏ విధంగా లక్ష్యాలో, అవి తక్కిన కవుల కవితల కంటే ఏ విధంగా భిన్నమైనవో ఆయన చూపించ లేదు. తెలుగు సాహిత్య విమర్శలో ప్రాచీన అలంకార శాస్త్ర పరిధిలో సాగే విమర్శతో సహా సాధారణ సూత్రీకరణలూ, స్థూలంగా పైపైనే చెప్పే లక్షణాలూ, తాము విశ్లేషించ దలచుకున్న దానికోసమే ప్రత్యేకంగా తయారు చేసుకున్న విమర్శ సూత్రాలూ, ప్రమాణాలూ అత్యధికంగా కనిపిస్తాయి తప్ప సృజనాత్మక సాహిత్యానికి అన్వయించి వివరించడమూ సాహిత్య విమర్శలో సామాన్య సూత్రాలుగా పరిగణించడానికి వీలుండటమూ అతితక్కువగా కన్పిస్తుంది. సృజనాత్మక సాహిత్యానికి అన్వయించి చెప్పని ఈ విధమైన కేవల సిద్ధాంతీకరణలు నేలవిడచి సాము చెయ్యటం లాంటివి.

విమర్శపై సమాధానాలు :

దిగంబర కవుల మీదా, విప్లవ కవుల మీదా వచ్చిన విమర్శ సంప్రదాయ సాహిత్య విమర్శకుల నుండే కాక అభ్యుదయ రచయితల నుండి కూడా వచ్చింది. అటువంటి విమర్శకుల్లో రాచమల్లు రామచంద్రారెడ్డి ముఖ్యుడు. కవుల్లో దాశరథి ముఖ్యుడు. మూడోవాడు గుంటూరు శేషేంద్రశర్మ. ఆయన కవిసేన మానిఫెస్టో. దిగంబర కవులూ విప్లవ కవులూ సంప్రదాయ విమర్శకులకు సహించినంతగా కూడా వీళ్ళకు సహించలేదు. కొన్ని పీఠికల్లో ఈ విమర్శలకు సమాధానాలు చోటు చేసుకున్నాయి.

రాచమల్లు రామచంద్రారెడ్డి దిగంబరకవుల కవిత్వాన్ని ఏవగించుకున్నాడు. విప్లవ కవిత్వం గురించీ, అనుభూతివాదం గురించీ ఆయన అభిప్రాయాలిలావున్నాయి : "తెలుగు కవిత్వానికి చెడ్డ కాలం దాపురించింది అభ్యుదయం పేరుతో కవిత్వంలో ప్రవేశించిన రాజకీయాలు - యేకు మేకైనట్లు - కవిత్వాన్ని హతమార్చి, తామే కవిత్వంగా ఊరేగుతున్నాయి. 'యెగరెయ్ యెర్రజండా' అన్నదే గొప్ప కవిత్వంగా చప్పట్లు కొట్టించుకునే దశ దాటిపోయి, విప్లవ దశ

వచ్చింది. కొట్టు, నరుకు, చంపు, రక్తం తాగు' అన్నదే యిప్పుడు కవిత్వపు పరాకాష్ఠగా పగటి దీపాలు పట్టించుకుంటున్నది. యిదే మూర్ఖత్వం అనుకుంటే, అనుభూతివాదం పేరుతోను సంకేతవాదం పేరుతోనూ అయోమయాన్నీ, పొడుపు కతలనూ, కవిత్వంగా దేశం మీదికి విసిరేసి, తమ మూర్ఖత్వానికే అగ్ర తాంబూలం రావాలని మరి కొందరు రొమ్ములు చరచుకుంటున్నారు. యిక, తెలుగు కవిత్వానికి చెడ్డ కాలం కాక, మంచి కాలం యెలావస్తుంది?"[172] ఇంకా- "ఉత్తమ కవిత్వానికి గీటురాయి ఆవేశ బలం కాదు, అనుభూతి సౌకుమార్యం. ఈ విషయం తెలియటమే ఒక సంస్కార విశేషం. ఈ సంస్కారం వున్నవాళ్ళే మంచి కవిత్వం రాస్తారు. లేదా రాయాలనే తపనకు లోనౌతారు యీ సంస్కారం కలవాళ్ళు యెప్పుడూ 'విప్లవ' కవిత్వం రాయరు, వచ్చినా పొడుపు కతల కవిత్వం రాయలేరు"[173] అన్నాడు. విప్లవ కవిత్వాన్ని, అనుభూతికవిత్వాన్ని ఒకే గాట కట్టి చేసిన రాచమల్లు రామచంద్రారెడ్డి విమర్శ ఇది విప్లవ కవిత్వ పీఠికల్లో ఈ విమర్శకు ఖండన చాలాచోట్ల కనిపిస్తుంది. దిగంబర కవుల మీద చేసిన విమర్శకు కూడ విప్లవ కవులు తిరుగు జవాబు చెప్పారు.

"ఇందులో ఎంత కవిత్వం వుంది - ఎంత సామాజిక ప్రయోజనం వుంది లేక ఎంత 'సంస్కార' ముంది అనే అంశాన్ని రా. రా. లాంటి 'ప్రఖ్యాత' అనబడే మార్క్సిస్టు విమర్శకుడు తన మాస్కో నల్ల కళ్ళద్దాల వెనుక నుంచి చూసినా - రాగ - ద్వేషాలు మాత్రమే మిగిలించుకుని సాహిత్యపరమైన అంచ నాలు వేయ సాహసిస్తున్న ఆయన ఇచీవలిధోరణి తన పార్టీ బాస్‌ల. ఆజ్ఞలకు లోబడినా, బెదిరిపోవలసిన అవసరం మాకు ఎవరికీ లేదు"[174] అని నిఖిలేశ్వర్ అంటే "మరి అతడూ గాక ఆమే గాలేక తృతీయా ప్రకృతి మాత్రం కాగలిగిన వారు 'సృజనాత్మకత' మాటున మార్క్సిజాన్ని 'జాతీయ' సంప్రదాయానికి తారుస్తూ వ్యాపార సంస్కృతితో స్వలింగ మైథునం చేస్తూ స్వదేశానికి స్వప్రజలకీ సోషల్ సామ్రాజ్యవాదుల ద్వారా జరిగే దోపిడీకి వెల్ల వేసి తెల్ల కమ్యూనిష్టులై ద్రోహాన్ని సైతం దోహదమ్మను కొమ్మంటున్నారు. తాత్విక, ఆర్థిక, రాజకీయ భ్రష్టత నటుంచి ఈ కపటులు దేశ చరిత్రలో రాజరికాన్ని భూస్వామికాన్నీ సమర్థించే స్థితికి, సంస్కృత పదాలకు పద్యాలలో అర్థాలు విప్పి చూపే గతికీ పతనమయ్యారు. విప్లవానికి విందుకీ తేడా తెలియక, ఉద్యమానికి ఉత్సవానికీ

భేదమెంచక, పోరాటానికి విజ్ఞాపనకీ అంతరమెంచక మార్క్సిజాన్ని మాటల మూటగా చేసి ధనస్వామ్య అధికార రాజకీయానికి మాత్రమే వామపక్షమై, వర్గ నిరంకుశత్వానికి మేలిముసుగు అయిన ఈ 'ప్రజాతంత్ర' దుస్తంత్రానికి ప్రజలను బలిపెడుతూ తమ గోయి తామే తవ్వుకుంటున్నారు"175 అన్నాడు కె. వి. రమణారెడ్డి.

విప్లవ కవులు తమ కావ్యాలకు తాము పీఠికలు రాసుకున్నప్పుడు తాము ఎందుకు రాస్తున్నారో, తమకు కలిగిన ప్రేరణను గురించీ, తమలో వచ్చిన పరిణామక్రమ వికాసాన్నీ వివరించడానికి ప్రయత్నించారు. సంకలనాల పీఠికల్లో సిద్ధాంత చర్చే కొంచెం ఎక్కువగా వుంటుంది. ఇతరులకు రాసిన పీఠికలలో సర్వసాధారణంగా కొంత సిద్ధాంతమూ, కవికి ఉన్న సామాజిక చైతన్యమూ, కవితా చర్చా, క్వాచిత్కంగా కవిత్వ విశ్లేషణ కన్పిస్తాయి. అక్కడక్కడా ఇతరులపై విమర్శ, ఇతర విమర్శనలపై ఖండనలు కన్పిస్తాయి.

అభ్యుదయ కవిత్వంలోని అభ్యుదయాంశను విడవక ఇంకా ముందుకు పోయినవారు విప్లవ కవులు. పరిణామ దశలో ఇప్పటి వాళ్ళు వీళ్ళు. ఆ లక్షణాలనే ప్రతిఫలిస్తున్నాయి ఈ పీఠికలు.

ఉద్యమేతర కవిత్వం

ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రధాన ఉద్యమాలను గురించి మునుపటి ప్రకరణంలో చర్చించటం జరిగింది. ఈ ప్రకరణంలో, ఒక ప్రత్యేక ఉద్యమం లేక ధోరణి ప్రధానం కాని స్వతంత్ర రచనల పీఠికల గూర్చి ప్రస్తా విస్తాను. వ్యక్తి ఇష్టాయిష్టాలు, ఆసక్త్యనాసక్తులు ఇక్కడ ప్రధానమవుతాయి. అయినా సమకాలీన సామాజికవ్యవస్థ ప్రభావం ఈ కవుల మీద కూడ వుంటుంది. అందువల్లనే అనేక రకాల ధోరణులు వీరిలో కలగా పులగంగా కనిపిస్తాయి. సమకాలీన ప్రభావం నామ మాత్రంగా వున్న ప్రాచీన సంప్రదాయానికి చెందిన రచనలు కూడ సమాంతరంగా కనిపిస్తాయి. కవుల ఆలోచనా స్రవంతిలో వైరుధ్యాలు, అస్పష్టత గోచరిస్తాయి. తనది ఒక ప్రత్యేక ఆలోచనా స్రవంతి కానపుడు, తాను వ్యక్తిగా మాత్రమే వున్నపుడు. తనను సమకాలీన సాహిత్యోద్యమాలు గుర్తించనపుడు, ప్రతిక్రియగా కవులు, వారి మిత్రులు ఉద్యమ ధోరణులను పూర్తిగా తిరస్కరించే ప్రయత్నం చేశారు.

వ్యక్తి ప్రాధాన్యం వహించటంవల్ల ఈ ప్రకరణంలో, అనేక గ్రంథాలకు పీఠికలు రాసిన పీఠికా కర్తలు, వారి పీఠికారచన గూర్చి చర్చిస్తాను. ఉద్యమేతర కవిత్వంలో కూడ వివిధ ధోరణు లున్నాయి. అయితే అవి వ్యక్తిని దాటి ఒక ప్రత్యేక ధోరణిగా ప్రాచుర్యం పొందలేదు. పీఠికాకర్తలు కూడ వ్యక్తి నుండి పైకెదగలేదు. ఈ ప్రకరణంలో చర్చించబోయే హేతువాద ధోరణి కవిత్వపీఠికలు ఎలా వ్యక్తిని దాటి ఒక ప్రత్యేక ధోరణిగా, ఇతరులను కూడా తనతో కలుపు కుంటూ సాగలేదో చెప్పడానికి ప్రయత్నిస్తాను. అనుభూతివాద ధోరణి పూర్తిగా వైయక్తికమైనదే. సంప్రదాయ కవులు, పీఠికా కర్తలు కూడ వ్యక్తులుగానే మిగిలి పోయారు. వారి రచనలు ప్రత్యేక ధోరణులుగా ప్రాచుర్యం పొందలేదు.

ఉద్యమేతర కవిత్వంలో రూపభావాలలో కవులు ప్రత్యేకంగా సాధించినదేమీ లేదు. సంప్రదాయ కవులు పద్యరచనే చేశారు. భావంలో కూడ కొత్తదన

మేమీలేదు. హేతువాద ధోరణి కవిత్వంలో మాత్రం రూపంలో కొత్తదనం లేకపోయినా, భావంలో కొత్తదనం ప్రవేశించింది. కవి వ్యక్తినుండి పైకెదగలేక పోవటం వల్ల ఈ ధోరణి ఉద్యమం కాలేక పోయింది. కాని కొంత సామాజిక చైతన్యం, హేతువు ప్రాధాన్యాన్ని గుర్తింప చేయటంలో కొంతవరకు కృతకృత్యమయింది. అనుభూతివాదులు సమకాలీన సమాజం, ఉద్యమాలతో ప్రభావితులై రూపం లోని కొత్తదనాన్ని ఆహ్వానించినా, భావం వైయక్తికమవటం వల్ల, సమాజాన్ని చైతన్యం చేయటం మాట అటుంచి, తాము తమలోకి ముడుచుకు పోయారు.

పందొమ్మిదో శతాబ్దం :

19వ శతాబ్దంలో కవులు ప్రచురించిన స్వంత కావ్యాల సంఖ్య చాలా పరిమితమే. ఈ శతాబ్దంలో ప్రధానంగా ప్రాచీన కవుల రచనల ప్రచురణమీదే దృష్టి కేంద్రీకృతమయింది. అనువాద నాటకాలు, స్వతంత్ర నాటకాలు, వచన రచనలూ, వ్యాకరణాలూ, పాఠ్య పుస్తకాలుగా ఉండదగిన కథల పుస్తకాలూ ఎక్కువగా వచ్చాయి. పద్య కావ్యాల రచనా, ప్రచురణా చాలా విస్తృతంగా లేదనే చెప్పాలి. కావ్యకర్తలు తమ గ్రంథాలను ఎక్కువ భాగం పీఠికలు లేకుం డానే ప్రచురించారు. పీఠికలు ఉన్న గ్రంథాలలో మళ్ళీ ఎక్కువ భాగం కవుల స్వీయ పీఠికలే. తక్కినవి ప్రచురణ కర్తల పీఠికలు. ఇతర ప్రముఖుల చేత పీఠికలు రాయించుకోవడమన్న సంప్రదాయం అప్పటికింకా వ్యాప్తిలోకి రాలేదు. కావ్య వస్తువు కూడ ప్రాచీన పురాణేతిహాసాదుల నుండి బయటపడలేదు. అందు వల్ల గ్రంథేతివృత్త ప్రాశస్త్యమూ, రచనా కారణాలూ పీఠికలో ఎక్కువభాగాన్ని ఆక్రమించాయి. ప్రచురణ కర్తలు రాసిన పీఠికలలో కావ్య శిల్పం కూడా కొంత కన్పిస్తుంది.

కొక్కొండ వేంకటరత్న శర్మ 'బిల్వేశ్వరీయా'నికి ప్రచురణ కర్త పనప్పాకం అనంతాచార్యులు ఇంగ్లీషులో పీఠిక రాశాడు. వేంకటరత్న శర్మకు ఇంగ్లీషులో శామ్యూల్ జాన్సన్‌తో పోలిక చెప్పాడు. కవి తిక్కనను అనుసరించ గలిగాడనీ, ఇది తెలుగు క్లాసిక్స్‌లో శాశ్వత స్థానం కలిగి ఉంటుందనీ అభిప్రాయపడ్డాడు.[1]

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి తన 'కనకగిరి'కి పీఠిక రాస్తూ అది స్థల మాహాత్మ్య గ్రంథమనీ, టి. యం. శేషగిరిశాస్త్రి గారి కంకితమనీ చెప్పాడు. సీరియల్‌గా రాస్తూ ముద్రిస్తూ వచ్చినందువల్ల ఆశ్వాస విభజన చేయడానికి కుదరలేదనీ, అందువల్ల ఆశు రచన అని చదువరులు నవ్వుకోవచ్చుననీ అన్నాడు.[2]

భాగవతాది పురాణ గాథలు, భారత రామాయణాలూ, వేదాంత ప్రధానమైన రచనలూ సంప్రదాయ సాహిత్యంలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి. ఇప్పటివరకూ వస్తున్న సంప్రదాయ సాహిత్య రచనలన్నీ కూడ ఈ పరిధిలోనే ఉన్నాయి. కనీసం ప్రబంధ యుగపు కావ్యాల వైవిధ్యాన్ని కూడా ఇవి సాధించలేకపోయాయి. ఒకే ఇతివృత్తాన్ని తీసుకొని అనేక మంది కవులు రచనలు చేశారు. కొన్నిసార్లు ఇటువంటి రచనలకు కవుల భావావేశం కంటే, కృతిపతులకోరికే ప్రోద్బలకం అయిన సందర్భాలున్నాయి.

ఇరవయ్యవ శతాబ్దం :

వావిలికొలను సుబ్బారాయకవి తన 'శ్రీ కౌసల్యా పరిణయానికి' పీఠిక రాసుకుంటూ రచనా మూలాన్ని విశేషాలనూ తెలియజేశాడు. రచనా కాలం 1894 మార్చి 16, నవంబరు మధ్య అనీ, మరాఠీలో ఉన్న కౌసల్యా పరిణయ గాథను తల్లివలన విన్నట్లు, తర్వాత, లంకలపల్లి వేంకట సుబ్బయ్య గారి లేఖ ద్వారా తెలుసుకున్నట్లూ చెప్పుకున్నాడు. రచన చాలా క్లిష్టంగా వుండడంవల్ల మరీ క్లిష్టమయిన నూరు పద్యాలను తొలగించినట్లు, మూడవ ఆశ్వాసంలోని కొన్ని పద్యాలకు రామాయణార్థం ఉన్నట్లూ, ప్రతి ఆశ్వాసాంత పద్య ప్రథమ పాద ప్రాసాక్షరాలను ఒక క్రమంలో పేరిస్తే 'కౌసల్యా వివాహం' 'రామార్పణ మస్తు' అని ఔతుందనీ, తన కథ శ్రీపాద వేంకటాచల కవి రచించిన 'శ్రీకౌసల్యా పరిణయం' కథకంటే భిన్నమైనదనీ, కౌసల్యా పరిణయ యక్షగాన కథతో కొంత సామ్యమున్నదనీ, నూతనమైన వర్ణనలు చేసే ప్రయత్నం చేశాననీ తెల్పుకున్నాడు.[3]

తిరుపతి వేంకటకవులు తమ 'లక్షణా పరిణయము' పీఠికలో ఈ ఇతి వృత్తంతో అనేక మంది పూర్వమే రచనలు చేసినా కృతిభర్త అయిన తాటి కొండ రామారెడ్డి దేశాయి కోరికవల్ల తామీ కావ్యం రాస్తున్నట్లు చెప్పుకున్నారు.4

కోలాచలం శ్రీనివాసరావు తన 'ఆంధ్రీకృతాగస్త్య బాలభారతము'కు పీఠిక రాస్తూ మూల కర్త గురించిన వివరాలు తెలియవనీ, తన అనువాద విధానం భావానుసరణమనీ చెప్పుకున్నాడు. మల్లినాథ సూరి నుండి తన దాకా తమ వంశ క్రమాన్ని ఇంగ్లీషులో వర్ణించాడు.5

వావిలి కొలను సుబ్బారావు తన 'శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణ' పీఠికలో రామాయణంపై భక్తి ఏర్పడిన విధానాన్ని వివరించాడు. అనువాదం మొదట విపులమనీ తర్వాత మూలానుసరణం అనీ చెప్పుకున్నాడు.

పీఠికలో రామాయణ ప్రాశస్త్యాన్ని గురించీ, దానిలో శైలి, రీతి, రసాలు, అలంకారాలు, ధ్వని మొదలైన విషయాలను గురించీ వివరించి, రామాయణంలో కనిపించే శాస్త్ర, సామాజిక ధర్మాలను గురించి తెలియ చేశాడు.6

దాసు శ్రీరాములు తన 'శ్రీరామదాంధ్ర భాగవతము'నకు పీఠిక రాస్తూ ఉప, మహా పురాణ భేదం లేదని వ్యాస ప్రోక్తమయితే చాలుననీ అన్నాడు. దేవీ భాగవతం మహా పురాణ తత్వాన్ని గూర్చి చర్చించాడు. ఇప్పటి కవులు రంధ్రా న్వేషణ తత్పరులని చెప్తూ పద్యాలలో వళి ప్రాసలను గూర్చిన తన మార్గాన్ని పద్యాలలో తెలియ జేశాడు.7

1908 ప్రాంతంనుండే తెలుగు కవిత్వంలో మార్పులు గోచరించసాగాయి. సమాజంలోని ఆధునికత కవిత్వంలో ప్రతిఫలించ సాగింది. గురజాడ, రాయ ప్రోలు మొదలైన వారు కవిత్వంలో నూతన పోకడలను ప్రవేశపెట్టారు. తెలుగులో నవ్య కవిత్వం ప్రారంభమయింది. అప్పటి నుండి ఇప్పటి దాకా తెలుగు కవిత్వం రూపం, వస్తువులలో, స్వభావంలో, లక్ష్యంలో అనేక మార్పులు పొందింది. అనేక ఉద్యమాలు, ధోరణులు కవిత్వంలో ప్రవేశించాయి.

కవులుగా గుర్తింపు పొందడానికి లేక తమ ప్రతిష్ఠను ఇనుమడింప జేసుకోవడానికి పండితులు, విమర్శకులు, కవులుగా అప్పటికే ప్రతిష్ఠ సాధించిన పెద్దల

చేత పీఠికలు రాయించుకోవడం సంప్రదాయంగా స్థిరపడసాగింది. "ఆయినను ప్రస్తుత మాంధ్ర లోకమునందు తక్కిన యన్ని యలవాటులతో బాటు, ఎంతటి తేనె వాకల నూరించు సరస కావ్యమున కైనను ఏవో ఒకటి రెండు మాటలు పీఠికా కృతిని గ్రుచ్చవలసి యుండుట యాచారమై పోవుటచేత, నందులకు విధేయులమై ఒకటి రెండు మాటలను యిచ్చట మనవిచేయ సాహసించితిమే గాని ప్రజ్ఞాపారమ్యమును బట్టి మాత్రము కాదు"[8] అన్నాడు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి 'ఎంకి పాటలు'కు పీఠిక రాస్తూ 1925లో. అంటే అప్పటికే పీఠికా రచన ఒక అచారమై పోయిందన్నమాట. ఒకరి పీఠికతో తృప్తిపడక అనేకమంది ప్రముఖులతో పరిచయ వాక్యాలు రాయించుకున్న కవులు కూడా ఎంతమందో ఉన్నారు. అటువంటి సందర్భాలలో పునరుక్తి దోషం అధికమే. కేవలం రచయిత అడిగాడు కాబట్టి ఏవో మంచి మాటలు నాలుగు రాద్దామనో, మొహమాటం కొద్దీ ఏదో ఒకటి నాలుగు మాటలు రాద్దామనో పీఠికాకర్తలు పీఠికా రచనకు పూనుకోవడంతో పీఠిక అంటేనే అడిగి పుచ్చుకొనే ఒక సర్టిఫికెట్టు కింద జమై విలువను పోగొట్టుకుంది. కేవలం ముఖప్రీతి పీఠికలను గురించి చర్చించవలసిన ఆవశ్యకత లేదు. ఏదో ఒక విధమైన వైశిష్ట్యం ఉండి కొంత ప్రాధాన్యతను సంతరించుకున్నవి, కవిత్వానికి విలువగట్టడానికి పనికి వచ్చేవీ, భాషా, సాహిత్య, సామాజిక చరిత్రలకు తోడ్పడ్డవీ, భాషా, సాహిత్య, సామాజిక సిద్ధాంతాలను గూర్చి చర్చించినవీ అయిన పీఠికలను గూర్చి, పీఠికా వస్తు పరంగానూ, శైలి పరంగానూ ఒక విశిష్టతను చూపెట్టిన పీఠికా కర్తలను గూర్చి చర్చించవలసిన అవసరం ఉంది.

కట్టమంచి రామలింగారెడ్డి :

కొందరు చాలా పుస్తకాలకు పీఠికలు రాశారు. పీఠిక రచనలో ఒక వరవడిని దిద్దారు. అటువంటి వారి పీఠికలు ప్రత్యేక సంపుటాలుగా కూడా వచ్చాయి. వాటిలో ముఖ్యమైనవి కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు. సంప్రదాయం నుండి ఎదిగి కొత్తదనం వైపు దృష్టి సారించిన మనీషి - కట్టమంచి రామలింగారెడ్డి. సి. ఆర్. రెడ్డి పీఠికలలో 'కళాపూర్ణోదయము', 'కృషీవలుడు' పీఠికలను పరిశీలించడం జరిగింది. మిగతావిప్పుడు పరిశీలిస్తాను.

రూపం :

పింగళి, కాటూరుల 'తొలకరి'కి పీఠిక రాస్తూ ప్రాచీన, ఆధునిక రచనలను, భాష, శైలి, ఛందస్సుల భేదాన్ని గుర్తించాడు ఆయన. "ఆంధ్ర భాష యను మహా వనము కొన్ని శతాబ్దములుగ ప్రాత ప్రబంధములను పండిన యాకులను రాల్చి, పాశ్చాత్య సంపర్కమను కృషి మొదలగు కారణముల చేత దనకు నైజమైన పునర్వికాసము చూపుట కారంభించి, క్రొత్త క్రొత్త చిగుళ్ళను, బూవులను వెలిబెట్టుచు నవీన వసంతమును ధరించి యెంతయు మనోహరముగ నున్నది."[9] అదే పీఠికలో భావకవిత్వాన్ని గూర్చి చెప్తూ, "వాడబడు పదములు వేఱు, అవి కూర్చబడు విధములు వేఱు" అన్నాడు.

స్థానాపతి రుక్మిణమ్మ రాసిన 'కాదంబిని'కి పీఠిక రాస్తూ ఖండ కావ్యశబ్ద చర్చచేశాడు సి. ఆర్. రెడ్డి. "ఖండ కావ్యమను మాట నిర్దుష్టము కాదని నా యభిప్రాయము. ఆభాసమన్నను తప్పులేదు. ఖండము అను పదముచే అసమగ్రము అసంపూర్ణము - ఇత్యాది భావములు స్ఫురించెడిని ... (ఖండకావ్యము) తనంతటనే పరిపూర్ణము. ఇంకొక కృతి యొక్క విభాజనము కాదు; విచ్ఛిన్నము కాదు. మఱి, ఇట్టి భాగములు అనేకములు కలిసినగాని సహజమైన పూర్ణాకృతి నిర్మాణమునకు రాదు - అను సూచనకు అవకాశములేనిది," అంటూ ఇంగ్లీషులోని 'షార్టర్ పోయమ్స్' అన్న పేరుకు ఈ పర్యాయ పదం సరైంది కాదని, చిన్నవి, పొట్టివి, లఘువులు, దీర్ఘములు కానివి ఇటువంటి మాటలలో పేర్కొంటేనే ఉచిత మన్నాడు. "అఖండము కానిది కృతి కానేరదు. సజీవమైన గాని మనల రంజింప జేయ జాలదు. చైతన్యముతోడ సంపూర్ణమైన ఆకృతిగ నుండుటేగదా జీవలక్షణము: నిర్జీవము కవిత్వమా? ఇక జీవముండిన యెడల ఖండత్వ మెక్కడిది?"[10] అని ప్రశ్నించాడు.

భావం :

కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలను వర్గీకరించడంలో సంపాదకులు 'అభిజన కృతుల పీఠికలు' అని ఒక విభాగం చేశారు. ఈ పీఠికలలో ప్రత్యేకత ఏమిటంటే ఆయనే చెప్పుతున్నట్లుగా "మా వంశ చరిత్రయే కాక పూర్వమున మా ప్రాంతము వృత్తాంతమేమియు నూతనకవియగు గంగన్నమాత్యునకైన గోచరింపక

పోదు".11 ఈ పీఠికలవల్ల రామలింగారెడ్డి బాల్య జీవితమంతా తెలుస్తుంది. అనాటి గ్రామ జీవితమూ వ్యక్తమవుతుంది.

నిర్మోహమాటం :

కాళ్ళకూరి గోపాలరావు రచించిన 'అపూర్వ సంఘ సంస్కారణము'కు పీఠిక రాస్తూ హేళన కావ్య రచనకు తెలుగులో వేమన, కందుకూరి వీరేశలింగం దక్షులని చెప్తూ ఈ అపూర్వ సంఘ సంస్కారణము అటువంటి హేళనా కావ్యమని చెప్పాడు. అయితే గోపాలరావు భావాల విషయంలో ఏకీభవించలేదు సి.ఆర్. రెడ్డి. ముఖ్యంగా ఈ గ్రంథంలో వాక్పారుష్యమూ, సర్వతిరస్కార భావమూ, సమాజోద్ధారక మార్గాలను సూచించక పోవడమూ రామలింగారెడ్డి మెచ్చని విషయాలు. "ఇట్లు వీరి యభిప్రాయమున నధునాతన సనాతన మార్గములు రెండును దోషదూషితములే. ఇక దిక్కేమయ్యా యంటిరేని, "కాలమేగతి"యని యొదార్చు చున్నారు. "సర్వ సంస్కారణంబులు"ను "సహజముగ" వచ్చునట. కాలానుసారముగ దనంతట వలదన్నను వచ్చు సంస్కారము నాకు జూడ నొక్కటే - అగ్ని సంస్కారము"12 అన్నాడు.

లోపాలను విమర్శించడంతో తృప్తిపడక సన్మార్గాన్ని చూపించాలని రామలింగారెడ్డి అభిప్రాయం. అందుకే "వీరికి బ్రాతది పనికిరాదు, క్రొత్తది మొదలే గిట్టదు, ఇక నేది పనికి వచ్చునో మనకు జెప్పరు. ఇక ముందు బయలు వెడలు గ్రంథములలో ఖండనముతో బని చాలించుకొనక, సన్మార్గ దర్శనము గొంత కలిగింతురు కాబోలు"13 అన్నాడు. ఆర్థికస్థితి, సంఘస్థితి పరస్పర సంబంధం కలిగి ఉంటాయని, మానవ ప్రవృత్తిలో పరమార్థము, భావము, కార్యము అని మూడంశాలుంటాయని, వీటిలో అన్నీ మంచివి, అన్నీ చెడ్డవి, కొన్ని మంచివీ, కొన్ని చెడ్డవీ కావచ్చునని అంటూ "సంఘపరమైన దృష్టితో జూచిన గార్యముల కుండు గౌరవము భావములకు లేదు"14 అన్నాడు

వస్తువు : స్వజాత్యభిమానం :

వస్తువునకు సంబంధించి కట్టమంచి రామలింగారెడ్డి అభిప్రాయాలు విశిష్టమైనవి. విషయం, శైలి పరస్పరం తగినట్లు ఉండాలంటాడు. 'ఆత్మకథ యందు

రచన మనోహరము, గాథలోకోత్తరము' అన్నాడు. ఇంతకంటే గొప్ప రచనలు వస్తాయని విశ్వాసం ప్రకటించాడు. "దేశభక్తి, ఆంధ్రాభ్యుదయ రక్తి, పితృ పూజ యివన్నియు మన జీవితమున నఖండములైన జ్యోతులు. వాని వెలుగుచే మనల నావరించియుండు తమము కొంతకు గొంత విరియును. అయినను వీనికిని మించిన యితివృత్తములు లేకపోలేదు. యావన్మానవుల యాత్మలను బరవశ ములజేసి హృదయమునగలించి మనసులకు నిశ్చైతన్యమొసంగెడు కావ్యములు, భారత రామాయణముల వంటివి పుట్టవా యికముందు? హైందవ భావనా శక్తి యడుగంటి యింకిపోలేదు. దేశమునకు స్వతంత్ర పరిపాలనా భాగ్యము సంభ వించినది. ఈ గొప్పదశకు తగినట్టి వీర కావ్యములను వ్రాయజాలిన వారలలో సీతారామమూర్తి యున్నాడా? లేడా? ఉన్నాడని నా నమ్మిక" అన్నాడు. "సరస్వత్యారాధనతోడ దేశారాధనము జేసి శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి ద్విగుణీకృత కృతకృత్యుడైనాడు"14 అని పేర్కొన్నాడు.

కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలలో ప్రత్యేక లక్షణాలు - కవిత్వాన్ని గూర్చిన చర్చ ఎక్కువగా వుండటం, ఇంగ్లీషు మాటలు అసలు వాడకపోవడం, గ్రాంథికమే అయినా సరళమైన శైలి, వ్యంగ్య హాస్య ధోరణి, గుణ దోషాలు రెండింటినే పేర్కొనడం, స్వజాత్యభిమానం.

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ :

కట్టమంచి రామలింగారెడ్డి పీఠికల లాగానే ప్రత్యేకతను సంతరించుకున్న పీఠికలు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ పీఠికలు. ఆయన పీఠికలు కూడా ప్రత్యేక గ్రంథంగా ప్రచురితమయ్యాయి.

రూపం : ఛందస్సు

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ పీఠికలలో అధికభాగం ఆధునిక సాహిత్యా నికే సంబంధించినా, ఈ ఆధునిక సాహిత్యం కూడా అధికభాగం కాలాన్నిబట్టి మాత్రమే ఆధునికం. చాలా రచనలు సాంప్రదాయకమైనవే. భారత, భాగవత రామాయణాదులనుండి ఇతివృత్తాన్ని గ్రహించిన కావ్యాలే. అటువంటి రచనల పీఠికలలో కవిత్వ చర్చే అధికం. శైలి, పాత్ర చిత్రణ, భాషా ప్రయోగాలు ఆయన చర్చలలో చోటుచేసుకున్నాయి. కవితో తనకున్న మత భేదాన్ని చాలా

సున్నితంగా వ్యక్తం చేస్తాడు. "పెద్ద వృత్తములనే గ్రహించుటచేత అందందు కూర్పు ఎక్కువయై ప్రసాదగుణము కొంత కుంటు పడినదని, స్వచ్ఛంద శబ్ద రూపములు కొన్ని దొరలినవని, అర్థములలో కొంచెము పునరుక్తికిపాలైనవని సూచింపకుండలేను. కాని మంచి సర్వాంగీణ సౌందర్యముగ పద్యములెన్నో ఇందున్నవి. వానిని పరిచయ వాక్యములలో నుదాహరించుట వట్టి విస్తర మగును"15 అన్నాడు నారునాగ నార్య 'శ్రీరామ నిర్వేదా'నికి పీఠిక రాస్తూ (1967). "పుట్టపర్తి వారి యనుకరణము చేత మీ రచన అర్థముకంటే శబ్దము, దానికంటె ధారా వేగమును ప్రధానముగా సాగినవనిపించినదని చెప్పవలసి యున్నాను ... గతి ఎక్కువగా ఐదు మాత్రల 'ఖండ' నడకలో నున్నది. ఇది 'దేశి'లో రక్తగతమైన రుచి, కాని, అందందు జగణము దూరి గతి సౌందర్యము దెబ్బతిన్నదని చెప్పక తప్పదు. అర్థ భావములలోను పునరుక్తులు అందందు కానవచ్చి వాని కమనీయత పలచ పరుచుచున్నవనుకొందును. మొత్తముమీద రచన కమ్మగానున్నను, మీరింతకంటే రమ్యమైన రచన చేయగలవారనిపించుచున్నది"16 అన్నాడు, మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము 'శ్రీకృష్ణతాండవము - గోపికాలాస్యము'కు పీఠిక రాస్తూ.

కావ్యంలో ఛందస్సు విషయాన్ని గురించి కూడా 'శివభారతము' ప్రస్తావనలో అనంత కృష్ణశర్మ ప్రస్తావించాడు. ఛందస్సులలో ప్రయోగాలను ఆయన పెద్దగా హర్షించలేదు. ఈ విషయంలో గడియారము వేంకట శేషశాస్త్రి అనుసరించిన ప్రాచీన మార్గాన్ని ఈయన మెచ్చుకున్నాడు. "కావ్య మందలి రసభావసిద్ధికి ఛందస్సు గూడ ముఖ్యమైన సాధనమను కొందఱి సిద్ధాంతమున వీరికి నమ్మికలేదని తలచెదను. నామట్టుకు నాకులేదు."17 అని ఈ విషయాన్ని స్పష్టం చేశాడు.

పద ప్రయోగం :

వాడుక తప్పిపోయిన మాటలు, అర్థం సుగతంకాని మాటలు కావ్యాలలో వాడటం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకు వాంఛితం కాదు. "వాడుక తప్పి పోయిన కొన్ని శబ్దములు అందందు ప్రయోగించుటయు, వానికి అర్థము వ్రాయుటయు, ఈ కావ్యమున సంభవించి, కవికిని, చదువరులకును వెట్టిపని కొంత యేర్పడినదని నా తలంపు"18 అన్నాడు.

శైలి :

రఘునాథీయ శైలిని గురించి, " 'భావో భావం నుదతి' అని కాళిదాసు వచించినట్లు భావములొక దాని కతుకుకొని యింకొకటి సరవణి వలె సాగు ధార. దానికి తగినట్లు యతి ప్రాసాది ఛాందసములను నిర్లక్ష్యముగా ఈడ్చుకొని నడచు శబ్దార్థములు, వ్యావహారికమైన దేశీయ గౌణ ప్రయోగములు, తాత్పర్య ప్రధానమైన వాక్య వృత్తులు రెండు మాటలను ఒక మాటతో నిర్వహించు పదునైన చిక్కదనము - ఈ మొదలయిన అసాధారణ కవితా గుణములన్నియు శివ భారతముననే పగుల మొగ్గలుగా నుండినవి - ఈ రఘునాథీయమున విచ్చు కున్నవని సూక్ష్మేక్షికతో గమనింపవచ్చును."19 అని విశ్లేషించారు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ. ఛందస్సులు, యతి ప్రాసల విషయంలో ఈయన దృష్టి ఈ మాటల్లో కూడ వ్యక్తమవుతుంది.

ఖండకావ్య, మహాకావ్య చర్చ :

గడియారం వేంకటశేషశాస్త్రి 'శివభారతా'నికి, 'రఘునాథీయా'నికీ కూడా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ పీఠికలు రాశాడు. ఆధునిక కాలంలో ఖండ కావ్యాలే తప్ప మహాకావ్యాలు వచ్చేకాలం కాదంటూ రెండింటికీ గల తారతమ్యాన్ని 'క్రొక్కారు మెఱుగు'కు రాసిన పీఠికలో సూచించాడు. "మహాకావ్యములు వ్రాయలేక పోయితిమే అని లజ్జ పడవలసినదే కాని లఘు కావ్యములు వ్రాయు చున్నామని లజ్జపడవలసిన పనిలేదు. సృష్టిలో పిన్న పెద్దలు రెండును స్వతంత్ర ములు, ఆవశ్యకములు. గుణదోషములు రెండును గలవు. గొప్ప వస్తువునందలి గాంభీర్యము చిన్న వస్తువునకుండదు చిన్నదానికి గల చెలువము గొప్పవానికి రాదు. పెద్దలకు మ్రొక్కులు, పిల్లలకు ముద్దులు. వస్తువు పెద్దదియగు నల్లెల్ల నయనాభ్యములు తగ్గును. చిన్నదియైనల్లెల్ల గౌరవ గాంభీర్యములు కృశించును. రెండు గుణములును ఒకచో జేరుట సృష్టిలోని యుద్దేశమే కాదేమో" అనీ "గొప్ప కావ్యములలో భావములకును, అభిప్రాయములకును తగినంత గొప్పదనమును, బలమును ఇట్టివి రూపుగొల్పుటకు వలసినంత పూర్వోత్తర సందర్భములను వివ రించుట కవకాశమున్నది. ఖండ కావ్యములలో అతి ముఖ్యమైన విషయములు దప్ప తక్కినవి విస్తరింప వీలులేదు. సంగ్రహము వీనికిని విస్తరము వానికిని స్వాభావిక లక్షణము. పనికిమాలిన విస్తరము మహాకావ్యములలో నెంత దోషమో

పని చెఱుచు సంగ్రహము ఖండ కావ్యములలో నంతకన్న దోషమగును. కావ్యము కొలతను దగ్గించుటలో నందలి విషయపు తీవ్రతను గూడ తక్కువ పఱచు నపాయము గలదు"20 అని ఖండ, మహా కావ్యభేదాన్ని వివరించాడు.

ఖండ కావ్యంలో భావ తీవ్రత ప్రధానమని అనంతకృష్ణశర్మ అభిప్రాయం. ఆ భావ తీవ్రత లేనప్పుడు అందులో కవిత్వముండదంటాడు. "మనసులో లేని తీవ్రత మాటలలో రాదను విషయము ఖండకావ్య కవులనేకులు గమనింపవలసియు గమనింపవలసినది. ముఖ్యముగా ఖండ కావ్యము ప్రవృత్తి నిమిత్తము, కవికి, గలిగిన హార్ద భావములను తలపులను జిత్రించు నుద్దేశము. కాబట్టి కవికి నిజముగా లేని భావములు కవిత లోనికి రాజాలవు"21 అంటాడు.

గడియారము వేంకటకృష్ణశాస్త్రి 'శివ భారతా'నికి పీఠిక రాస్తూ అనంత కృష్ణశర్మ 'క్రొక్కారు మెఱుగు' పీఠికలో మహా కావ్యములు రచించు కాలము గడిచినదని అన్నమాటలను ఉపసంహరించుకున్నాడు. "మనకు మహాకావ్యములు రచించు కాలము గడచినదని యొకచో తొందరపడి వ్రాసితిని. ఆ తప్పుకు ప్రాయశ్చిత్తముగా ఈ 'శివభారతము'న కిప్పుడుపోద్ఘాతముగా రెండు మాటలు వ్రాయుచున్నాను."22 అన్నాడు.

అయితే 1934లో ఖండ కావ్యాల గురించి ఉన్నసద్భావం కూడా 1966 నాటికి రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మలో లోపించినట్లు కన్పిస్తుంది. అప్పుడు ఖండ కావ్యాలూ, మహా కావ్యాలూ రెండూ ఆదరణీయాలే అన్నవాడు 'శ్రీయతి రాజీయము'కురాసిన పీఠికలో "కావ్యరచన రెండు ముఖ్యాంశాలుగా నుండును. ఒకటి తాత్కాలికముగ మన మనస్సులలోని కుళ్ళను జళ్ళను, ఆశా నిరాశలను, అసూయాభిమానములను వెలువరుచునది. దీనిని ఆత్మాశ్రయమని పేర్కొందురు. దీని కొలత చిన్నది. ఈ క్షుద్ర రచనలు మొదటి నుండి మనలో వెలువడుచునే యున్నవి. తెనుగులో ఇప్పుడివి విధి విరామము లేక సాగుచున్నవి. రెండవది ప్రమాణములో పెద్దది. ప్రమేయము వివిధ సందర్భములతో వివిధ వ్యక్తుల నడవడులలో నిండి యుండును. వీనియందు విషయ భావన విషయి భావనకంటె లోతుగా విశాలముగ పరాశ్రయముగా సాగవలసినది ఈ 'మహా'కావ్య రచనకు చేయి వేయగలవారు ఎప్పుడును కొందరే. ఆ పరకాయ ప్రవేశ యోగమున సిద్ధి పొందగలిగిన వారు, కాలూని నిలబడగలిగిన వారు ఏ ఇద్దరు ముగ్గురో!"23

భావం : నానృషిః కురుతేకావ్యం:

శివ భారతాన్ని "ఆధునికాంధ్ర సాహిత్య మందు నాకు గల యల్పాను భవములో మహాకావ్యమను పేరున కింత తగిన గ్రంథమును నే జూడలేదు" అని మహా కావ్యంగా అభివర్ణిస్తూ, మహా కావ్యకర్తను ఋషిగా భావించాడు. కావ్యవస్తువు శుష్కమగు చరిత్రమే. అసమగ్రమయిన సమాచారమే అయినా, చారిత్రక వ్యక్తుల ఆదిభౌతిక స్వరూపం మనకిప్పుడెక్కువగా తెలుసుకోవడానికి వీలు లేక పోయినా "కవి గారికి వారి విషయమున తీవ్రమైన తలస్పర్శియగు ఆధ్యాత్మిక దృష్టి కలదు. కావున పైలోపము మన మనస్సునకు దగులదు"24 అన్నాడు. మహా కావ్య నిర్మాణంలో కావ్య కర్తకు ఋషిత్వ సిద్ధి ఆవశ్యక మని అనంతకృష్ణ శర్మ నిశ్చితాభిప్రాయం. ఋషి అంటే శాంతి సిద్ధి కల వాడన్నాడు. కవి ఉద్రేకాన్ని చాల వరకు హద్దుల్లో ఉంచుకొని ప్రశాంత చిత్తంతో రచన చేయాలనీ, ఈ విషయంలో శేషశాస్త్రికి తిక్కనతో సామ్యమున్న దనీ అన్నాడు.

కావ్య ప్రయోజనం :

చరిత్రను యథాతథంగా కావ్యంగా రాయటం కష్టమనీ, ఆ పని అసలు చరిత్రకారులే చేయలేరనీ అనంత కృష్ణశర్మ అభిప్రాయం. కావ్య రచనకు పరమ ఫలంగా ప్రజల అంతః కరణలను సంస్కరించటమే నన్నది ఆయన స్పష్టీకరించారు. ''వట్టి చరిత్రలలో ఇతిహాస పురాణాలలో సూచింపబడిన సందర్భ సన్నివేశాలను విస్తరించి వివేకముతో చిత్రించు మెళకువ, వాటిలో విస్తరింపబడిన విషయాలను సంగ్రహించి సూచించు ఔచిత్య దృష్టి- ఇవి కావ్య కర్తలు తీసుకున్న అధికారాలు. కాక, నాటి ఉదాత్త వ్యక్తులందును, నేటి యుదాత్తులందువలెనే అనుదాత్త సంగతులెన్నో యుండును. వారును మనుష్యులే గనుక, అట్టి వానిని యథాతథముగా వివరించుటకు వట్టి చరిత్రకారులే సంకోచింతురు కదా. ఇక కవులు ప్రవచించునది ఆధ్యాత్మిక సత్యమే కాని ఆధి భౌతిక సత్యము గాదనుట మహా కవులు నాడును నేడును - రేపును గమనించి ఆచరించు ధర్మము. ఆ దారిలో ఉదాత్త భావములను తేజోవంతముగా వెలువరిచి ప్రజల అంతః కరణములను సంస్కరించుటయే కావ్య రామణీయకమునకు పరమ ఫలము''25 అన్నాడు.

అందువల్లనే రామాయణ, మహాభారతాది ప్రాచీన రచనలలో చారిత్రకాంశాలను వెదకటం అనంతకృష్ణ శర్మకు నచ్చదు. "రామాయణ మహాభారతాది రచనలందు చారిత్రికాంశములను వెదకుచు పుటలు త్రిప్పువారిని జూచి సహృదయులు 'అయ్యో పాపము' అనుకొని ఊరకుందురంతే"[26] అంటాడు.

రాజకీయాలు :

స్వాతంత్ర్యం వచ్చింతర్వాత రాజకీయ నాయకత్వం, స్థితిమీద రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మకు భ్రమలు లేవు. "ఇట్టి (నరసింహారెడ్డి వంటి) వారెందరి పచ్చినెత్తురు కండలో ఈ పుణ్యభూమిలో ఇంకి యెండిపోయిన తర్వాత గదా యీ మహాదేవికి స్వతంత్ర భూమిక వేసుకొనుట సాధ్యమైనది. మరి దీనిని స్వార్థపరుల 'అహి భయము' నుండి తప్పించి నెలకొల్పుటకు ఇంకెంతో వివేకుల అవివేకుల రక్తము ప్రవహింపవలిసి యున్నదని మనమిప్పుడు గమనించుచున్నాము - ఇది అనాదిగా అనంతముగా జరుగు సృష్టి తత్వమని సమాధానపడవలసి యున్నది."[27] అన్నాడు. రాజకీయంగా ఇటువంటి అభిప్రాయం ఉన్నా సాహిత్యంలో వచ్చిన వివిధ నూతనోద్యమాల మీద సద్భావం మాత్రం లేదు. అందుకే "బెండు కవితలు బిత్తలి కవితలు, విప్లవ కవితలు, వెఱ్ఱి కవితలు ఇత్యాదిగా ఎన్నోరకాల రచనలలో మునిగియున్నను నేటి తెలుగు రసికుల హృదయమును ఈ అయఃకాంత మాకర్షింపగలదు"[28] అన్నాడు.

భాషలో, భావంలో సంయమనం, ఉదాత్త వస్తువు, ఛందస్సులో అపూర్వ ప్రయోగాలు లేకుండా ఉండటం, భాషలో కూడా అపూర్వ ప్రయోగాలు, అర్థ క్లిష్టత, వాడుక తప్పిన పదాలు ప్రయోగించక పోవడమూ, సస్పెన్సు వంటి చమత్కారం కోసం కొనితెచ్చుకున్న లక్షణాలు లేకుండా ఉండడమూ అనంత కృష్ణశర్మ మెచ్చే కవిత్వ లక్షణాలు. నాగార్జున సాగరం, పెన్నేటి పాట, గంగిరెద్దు, సర్వోదయ గానము మొదలైన కావ్యాల పీఠికలను పరిశీలిస్తే ఈ విషయం విదితమౌతుంది.

విశ్వనాథ సత్యనారాయణ :

ఆధునిక కాలంలో విస్తృతంగా పీఠికలు రాసిన వారిలో విశ్వనాథ సత్యనారాయణ ఒకరు. ఆయన పీఠికలలో కావ్య తత్వ విచారం చేసినవి అంత

ఎక్కువగా లేవు. ఆయన సృజనాత్మక రచనలు, వ్యాసాలలోని శైలీ ఈ పీఠికలలో కలగలిసి ఉంటుంది. అనేక పీఠికలు మొక్కు తీర్చుకున్నట్లు కనిపించినా కొన్ని పీఠికలు మాత్రం కవి తత్వాన్ని చక్కగా వ్యక్తం చేస్తాయి. నాయని సుబ్బారావు గురించి "ఈ కవి ప్రకృతితః సుకుమారమైన బిడ్డ. వయసు వచ్చినను పసితనములోని మాధుర్యము వెను ద్రొక్కని చిట్టికూన"29 అంటాడు. "తెలుగు దేశములో ఆచారములు సర్వథా కావ్యము నిండ నుండును. 'ప్రణయ యాత్ర' కూడ నిట్టిదే. భావనా శీలురైన ఆధునిక కవులు తెలుగు దేశమున నింకను గలరు. కాని వారి కావ్యములందు పాశ్చాత్య వాసన ప్రబలముగ నుండును. వారి యూహలకు తెలుగు దేశములోని గాలి, తెలుగు గడ్డలోని సత్యము పోషకములుగా నుండవు. ఈ కవి కావ్య మచ్చముగా తెలుగు కావ్యము"; "ఈ కవి కవితా శక్తి యొక విచిత్రమైనది. ఇట్టి కవి సామాన్యముగ పుట్టడు. మన పూర్వ కవులలో నెవనిని చూచినను వారి కవిత్వమునకు భాష తెచ్చిన సొగసు మిక్కిలిగా నుండును. శబ్ద చిత్రములు, అలంకారములు, రచనా నైపుణ్యములు - వీని చేత భావములందగించుట యుండును. ఈ కవి అట్టి పొంతలకే పోడు. శైలి మిక్కిలి సులభమనుటకును వీలు లేదు. కూర్పునందు బిగింపు కలదు"30 అన్నాడు, మాతృ గీతాలు పరిచయ వాక్యంలో.

కవిత్వ వస్తువు కాదు, కవితా శక్తే ముఖ్యం :

విశ్వనాథ సత్యనారాయణ వస్తువుకు ప్రాధాన్య మీయలేదు. కవిత్వం రెండు భాగా లన్నాడు. ఒకటి వస్తువు, విషయము, కవి ఊహ, అభిమానము; రెండు భాష, పలుకుబడి, జాతీయత, శబ్దములను కూర్చుటలో కవిశక్తి, పాండిత్యము, శైలి. "ఈ రెండవ లక్షణము సమృద్ధిగా నున్నవాని కా మొదటి లక్షణములుండ పనిలేదు"31 అన్నాడు. పాఠకులు వస్తువును వదలి కవితా శక్తి కోసమే చదువుతారని చెప్తూ ఇతివృత్తమైన హరిజన సమస్య కంటే కవి కవితా శక్తి వలననే హరిజనాభ్యుదయమమే ఈ పుస్తకాన్ని చదువుతారని అభిప్రాయ పడ్డాడు.

దివాకర్ల వేంకటావధాని :

ఆధునిక కాలంలో విశ్వనాథ సత్యనారాయణ లాగానే అనేక మంది కవులకు పీఠికలు రాసిన వాడు దివాకర్ల వేంకటావధాని. పండితుల ఆమోదం

కావాలనుకున్న వర్ధమాన రచయితలూ, ప్రసిద్ధులూ కూడా వీరిరువురి చేతా పీఠికలు రాయించుకున్నారు. కావ్య వస్తువును తెలియచేయడం, కవి శైలిని పద ప్రయోగ వైచిత్ర్యాదులతో సహా వివరించడం, శైలికి ఉదాహరణలుగా కొన్ని పద్యాలనుదహరించడం, ప్రశంసించడం దివాకర్ల వేంకటావధాని పీఠికలలో కనిపించే లక్షణాలు. వేముగంటి నరసింహాచార్యుల 'నవ మాలిక'కు పీఠిక రాస్తూ అందులోని ఖండికలను ప్రకృతి వర్ణనాత్మకములు, దేశభక్తి పూరితములు, పూజ్యస్మరణ పూర్వకములు, ఆత్మీయతా వ్యంజకములు అని నాలుగు విధాలుగా వర్గీకరించి పేరు పేరునా ఏయే ఖండికలు ఏయే వర్గాలలో చేరతాయో స్థూలంగా వాటిలోని విషయ మేమిటో వివరించాడు.

రూపం :

అలంకారాలు, వర్ణనలు, రసాలు, ఛందస్సులు మొదలైన విషయాల స్పర్శ దివాకర్ల వేంకటావధాని పీఠికలలో ఎక్కువ. సంప్రదాయ సాహిత్య రచనలు, ప్రాచీన కావ్యాల పరిష్కరణ పీఠికల ధోరణిలోనే ఆయన పీఠికలు నడుస్తాయి. "వారి రచనలో నచ్చటచ్చట కనబడు సమాసములు మృదు మధుర పదముల కూర్పుగల్గి, దీర్ఘములయ్యు, సరళములై శ్రుతి సుభగములుగా నుండును. వారు వాడు తెలుగు పలుకుల సొలుపు కర్పూరపు పలుకుల చెలువునకు నిలయమై మొలుపలాని మధుర వాసనల గుబాళించు చుండును."[32]

మహాకవులు, సహజ కవులు :

"కవులలో కొందరు భావోన్నతికై యత్నింతురు, కొందరు శబ్ద చమత్కారమునకు ప్రాధాన్యమిత్తురు, కొందరు రసముపై దృష్టి సారింతురు, కొందరు శిల్పమున కగ్రస్థాన మొసంగుదురు. ఈ గుణములన్నియు పుంజీభవించు నట్లు కవిత చెప్పగల ప్రతిభావంతులరుదుగా గన్పింతురు. అట్టివారే మహా కవి శబ్ద వాచ్యులు. కొందరు పై గుణములలో దేని కొఱకు గాని బుద్ధి పూర్వకముగా యత్నము చేయరు. తమకు పరమేశ్వరుడెట్లు తోపించిన నట్లు వ్రాయుదురు. వారే సహజకవులు. వ్రాయవలెనను నుత్సాహము పుట్టగానే వారు వ్రాయుటకుపక్రమించి తమకు తోచిన భావములను స్వచ్ఛందముగా వెల్లడింతురు. అట్టి సహజ కవులలో శ్రీ జంగయ్య గారొకరు"[33] అన్నాడు.

పీఠికల వెల్లువ :

తమ కావ్యాలను గురించి ప్రసిద్ధ పండితుల అభిప్రాయాలను కావ్యానికి ముందో వెనకో ముద్రించుకోవడం ఒక సాంప్రదాయం. అట్లా వేసిన పండితాభిప్రాయాలు ఒక్కొక్కసారి కావ్యమంత స్థానాన్ని ఆక్రమించవచ్చు. అయితేపండితాభిప్రాయాలు అని శీర్షిక పెట్టి వారి ఉత్తరాల్నీ, అభిప్రాయాల్నీ ఉటంకించకుండా ఒకరి కంటే ఎక్కువ మంది చేత పీఠికలే రాయించుకోవడం మొదలయింది. ఒకరు రాసిందానికి 'పీఠిక' అని పేరు పెడితే మరొకరు రాసిందానికి 'పరిచయ మ'నీ, ఒకరు రాసింది 'పరిచయ'మైతే మరొకరు రాసింది 'భూమిక' అనీ, ఒకరు రాసింది 'తొలిపలు'కైతే, మరొకరు రాసింది 'పీఠిక' అని రకరకాలుగా పేర్లు మార్చి పెట్టడం జరుగుతున్నది. రాసిన వ్యక్తుల్ని బట్టి విషయంలో కొంత భేదమూ ఉండవచ్చు; ఎంతో సామ్యమూ ఉండవచ్చు. వీటితో పాటు 'ప్రవేశిక' అనో, 'నివేదన' అనో, 'నామాట'అనో, 'ప్రస్తావన' అనో ఒక పేరుతో రచయిత స్వీయ పీఠిక కూడా ఉంటుంది. రచయిత స్వయంగా తన గ్రంథానికి పరిచయం రాసుకొనేటప్పుడు మరొకరి పీఠికతో అవసరమేమిటి? అన్న ప్రశ్న కూడా పుడుతుంది. నలుగురు పండితుల యోగ్యతా పత్రాలు పొందాలన్న ఆకాంక్ష తప్ప అనేకుల పీఠికల వల్ల ఒరిగే ప్రత్యేక ప్రయోజనమేమీ లేదు. పైగా అనేక సందర్భాలలో పునరుక్తులు చోటుచేసుకుంటాయి.

కరుటూరి సత్యనారాయణ 'కరుణా సౌగతము' 1969 ప్రచురణకు కవి ప్రస్తావనకు తోడుగా మల్లంపల్లి శరభయ్య, దిగుమర్తి సీతారామ స్వామి, ఆర్. కె. మొగసాటి పీఠికలు రాస్తే 1978 ప్రచురణకు మల్లంపల్లి శరభయ్యకు తోడుగా విశ్వనాథ సత్యనారాయణ, పుట్టపర్తి నారాయణాచార్యులు దర్శన మిస్తారు. పాటిబండ్ల డేనియల్ కవి 'మాణిక్య వీణ'కు విశ్వనాథ సత్యనారాయణ, కరుణశ్రీ, కొండవీటి వేంకట కవి, దివాకర్ల వేంకటావధాని పీఠికలు రాశారు. నలుగురూ కవిత్వాన్ని గురించిన విషయమే ప్రసంగించారు. ఈ విధంగా ఒక సంప్రదాయంగా పీఠికలు రాయించుకోవడంతో పీఠికా రచనలో నిజాయితీ, గాంభీర్యమూ లోపించాయి. గుణ దోషాలు, కావ్య విషయ చర్చ తగ్గుముఖం పట్టి ప్రశంసలు, అర్థరహిత ప్రసంగాలు అధికం అయ్యాయి. షేక్ బుడన్ సాహెబ్ 'ఆజాద్ నామా'కు మొదటి మాట రాస్తూ "తానుమహమ్మదీయుడయ్యు

గీర్వాణవాణిలో నుండు నసాధారణములైన పదములను సైతము రసవంతముగా పొందుపరచి చక్కని శైలిలో పండితపామర జనవేద్యముగా గావ్యము రచించుట ప్రశంసార్హము''34 అన్నాడు జనమంచి వేంకట సుబ్రహ్మణ్య శర్మ. తెలుగు దేశంలో పుట్టి పెరిగిన మహమ్మదీయుడైతే ఏమి? క్రైస్తవుడైతేనేమి, హిందువు డైతేనేమి మంచి రచన చేయడానికి? సంస్కృతంలో వుండే అసాధారణ శబ్దాల్ని కూడా పండిత పామరులకు సైతం అర్థమయ్యేట్లు రాయడం ఎట్లా?

''ఈ శృంగార లహరి అన్న గ్రంథము శ్రీమతి వేదవతీదేవి వ్రాసినది. ఈమె నాకు ఆత్మీయుడైన ఒక మిత్రుని మేనకోడలు''...... ''కాని యీమె ఆధునిక కాలము నందు జీవించుచున్న స్త్రీ. ఆ లక్షణములు పలుచోట్ల కనుపించును. కొన్ని ఇంగ్లీషు మాటలు నిస్సంశయముగా ప్రయోగించును.''35 అన్నాడు విశ్వనాథ సత్యనారాయణ శృంగారలహరి పీఠికలో. "ఐక్యమని వ్రాసినాడు. ఐక్యత అనలేదు. అది తప్పుమాట యని తెలియును"36 అన్నాడు. హరిజనాభ్యుదయ పీఠికలోనికి విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వేంకటావధాని ఇద్దరూ పీఠికలు రాశారు. హరిజన సమస్య ఇతివృత్తంగా బిర్నీడి మోషే కవి రచించిన ఈ కావ్యానికి వర్ణాశ్రమ ధర్మాలమీద విశ్వాసం ఉన్న ఇద్దరు పండితుల పీఠికలు. విశ్వనాథ సత్యనారాయణ వస్తువులో ఏముంది? కవిత్వమే ప్రధానం అన్నాడు. "కవి ఆత్మీయాంశమైన కథను ఇందులో చెప్పినాడు. ఆర్యులు, మను ధర్మశాస్త్రము, వేదములు, వీటి దూషణ ఉన్నను క్షమించదగు"37నని దివాకర్ల వేంకటావధాని అనడం ఆత్మీయమైన దుఃఖాలకు కారణమైన వ్యవస్థమీద ఆగ్రహం, ఆవేశం కావడమే తప్ప వాటి దోషమేమీ లేదనడమే. తమ అభిప్రాయాలలో సామ్యం లేకపోవడం, తాము తీసుకున్న వస్తువుమీద గౌరవం లేకపోవడం స్పష్టంగా తెలిసినప్పటికీ అటువంటి వారితో పీఠికలు రాయించుకోవడం, సమకాలంలో వారి ప్రశంసలే తమకు యోగ్యతా పత్రాలుగా కవులు భావించడం తప్ప మరొకటి కాదు.కావ్యాలకు వచ్చిన ఇటువంటి ప్రశంసాపత్రాలవంటి పీఠికలే, పీఠికలు ఒక విధమైన అపహాస్యానికి గురికావడానికి హేతువులయ్యాయి. పీఠికా కర్తలు తాము నమ్మని విషయాలను సైతం నమ్మకంగా చెప్పడమూ, యువకవులను ప్రోత్సహించడమన్న సాకుతో అతిగా పొగడడమూ, ఎవరు ప్రముఖులో అయితే మొహమాటానికి ప్రశంసించ

డమూ, ప్రతి కవినీ మహాకవి అనీ, ప్రతి కావ్యాన్నీ మహాకావ్యమనీ స్తుతించడమూ పీఠిక గౌరవాన్ని తగ్గించి వేసింది. ఇది కవులు స్వయంగా కాక తమ కావ్యాలకు ఇతరులచేత పీఠికలు రాయించుకోవడంలో ఏర్పడ్డ ఒక పేర్కొనదగిన దుర్లక్షణం.

స్వీయ పీఠికలు :

తానెందుకు రాస్తున్నాను? అని ప్రశ్నించుకొని సమాధానం చెప్పవలసిన అవసరాన్ని గుర్తించిన వాళ్ళు, తమ కావ్య నేపథ్యాన్ని తామే వివరించుకోవడం సమంజసమని భావించిన వాళ్ళు తమ కావ్యాలకు, తామే పీఠికలు రాసుకున్నారు. ఎక్కడన్నా ఇతరులచేత రాయించుకున్నా తమ బాధ్యతను మరచిపోలేదు.

పీఠికలలో ఇతివృత్త చర్చ-జాషువా :

దేశ స్వాతంత్ర్య పోరాటమూ, ఆ పోరాటం సఫల మయిం తర్వాత దేశంలో తలెత్తిన అనేక సమస్యలూ జాషువా కవిత్వానికి వస్తువు లయ్యాయి. సంప్రదాయ పద్ధతిలో పద్య రచనను చేపట్టినా ఇతివృత్తం మాత్రం సామాజిక సమస్యాపరమైనదే ఎన్నుకోవడం జాషువా ప్రత్యేకత. తన కావ్య పీఠికలలో కావ్య ఇతివృత్తాన్ని తప్పనిసరిగా వివరిస్తాడు జాషువా. "కాళిదాసుని మేఘ సందేశము మనస్సులో నుంచుకొని నేనీ కావ్యమును రచించితిని. గ్రంథ నామము గబ్బిలము. శ్రోతలకిది కటువుగా దోపవచ్చును. కాని అందలి కథానాయకుడు ప్రణయ సందేశము నంపును. ఇతడంపునది తుక తుక నుడుకు సత్రవ సందేశము. అతని శిక్షాకాల పరిమితి యొక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము, తరతరములు దీని కవధిలేదు. అతడు మన్మథాగ్ని తప్తుడు. ఇతడు క్షుధాగ్ని పీడితుడు. ఇరువురిలో నితడు దయనీయుడు.

'నాడు కన్నిటి కథ సమన్వయము సేయ
నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు'

అని యితడు వాపోవును. కులీనులగు రాజులకు వలె హంసములు, చిలుకలు మున్నగు సుష్టుప పక్షిదూతలితనికి జిక్కుట అసంభవము, కావున నిట్టిదుల

జీర్ణ కుటీరములలో నిరంతరము దర్శన మిచ్చు గబ్బిలము నితనికి సందేశ హారిగా బరిగ్రహించితిని. రసజ్ఞులకిందలి యౌచితి సులభ గ్రాహ్యము. ఇంట బ్రవేశించి దీపమార్పిన గబ్బిలమును జూచి తన కన్నీటి కథ నీశ్వరునితో చెప్పుమని పీడు ప్రార్థించెగాని నిజమున కతని యుద్దేశ్యము దేశారాధన"38 అన్నాడు గబ్బిలము పీఠికలో.

"కావ్యంపేరు స్వయం వరం. వధువు స్వరాజ్యం. పెండ్లి కొడుకులు ప్రజలు. మహాత్ముని సత్యాగ్రహ మహాయజ్ఞంలో స్వరాజ్య బాల జన్మిస్తుంది. ప్రతిఫలంగా బాపూజీ బలవన్మరణాన్ని స్వీకరించి పరమపదిస్తారు. ఉరుసులు తిరునాళ్ళ, ఊరేగింపులు చేసి దేశీయులు బాలకు బారసాల జరిపి, తాతగారి ప్రతిమలు పల్లెల్లో పట్టణాల్లో ప్రతిష్ఠిస్తారు. స్వరాజ్య బాల అంతై, ఇంతై పెండ్లీడు కెదుగుతుంది. స్వయంవరం ప్రకటిస్తారు. నీతిమంతులు, అవినీతి మంతులు, ధనవంతులు, దరిద్రులు, దొంగలు, దొరలు పెండ్లికొడుకులై వస్తారు. సత్యాహింసలనే చెలికత్తెలు పెండ్లికొడుకుల్ని పేరుపేరు వరుసన వర్ణిస్తారు. కల కల నవ్వుతూ కల్యాణ వేదిక నలంకరించిన స్వరాజ్య కన్యక వల వల ఏడుస్తూ సభా రంగం విడిచి పోతుంది. అనురూపుడైన భర్తకోసమై కన్యక దేశాటనం చేస్తుంది. అకృతార్థయై విసిగి వేసారి మంచుకొండల సమీపారణ్యాలు చేరి ఒకా నొక బోయ పల్లెలో వసిస్తూ మనశ్శాంతి చేసికొని కాలం గడుపుతుంది. ఒక నాడు స్వప్నంలో మహాత్ముడు దర్శనమిచ్చి సదుపదేశం చేసి బాల నోదారు స్తాడు. ఒకానొక యువకుని వివాహమాడి స్వరాజ్యం రాజ్యమేలు కుంటుంది. నవయుగారంభమౌతుంది. దేశంలో శాంతి నెలకొంటుంది. స్వరాజ్య సుఖాన్ని ప్రజలు చూఱలాడ్తారు. ప్రకృతిలో, విజ్ఞానంలో, విద్యలో కళాలోకంలో, సంఘంలో వలసిన మార్పులిందు వర్ణించబడ్డాయి. "39 అని చెప్పుకున్నాడు 'స్వయంవరం' పీఠికలో.

వింజమూరి వేంకట లక్ష్మీనరసింహారావు :

తన జీవితయాత్రలోని కొన్ని సంఘటనలు తన మనస్సు విషాదాంత గాథలవైపే మొగ్గేటట్లు చేసిందని అందుకనే తన రచనలు అధిక భాగం విషాదాంతంగానే నడిచాయని చెప్పుకున్నాడు, వింజమూరి వేంకట లక్ష్మీ

నరసింహారావు. "నటకునిగా నాటక కర్తగా నాకున్న యనుభవమును బట్టి విషాదాంత గాథలు అమిత తీవ్రముగా, అత్యంత త్వరితముగా ప్రజల చిత్తముల నత్తుకొని రససిద్ధి చేకూర్చునని నా విశ్వాసము"... "ఉదాత్తమైన విషాదాంత కథను పఠించినను, తిలకించినను, ఆత్మ క్షాళితమై, శుద్ధి పొందిన భావము స్ఫురింపక మానదు"40 అన్నాడు.

తన రచనను గురించి "ఈ రచనయందు కావ్య లక్షణమంతగా నేను పాటింపకుంటిని. కథా సందర్భానుసారముగా వచ్చిన వర్ణనములేగాని పనిబట్టి కావ్య లక్షణము సాధించుటకై చేసిన వర్ణనములు లేవు. ఆశ్వాస నియమములు సైతమనుసరింపకుంటిని. ఒక్కొక యభిప్రాయము ముగియునప్పటికి ఒక్కొక యధ్యాయమైనట్లు లెక్కించి, 12 అధ్యాయములుగా నా గ్రంథమును విభజించితిని; కృత్యాద్యవస్థకు నేను పాల్పడనేలేదు. శకట రేఫ సాధు రేఫములకు యతి ప్రాసములు, అర్థ సౌలభ్యము కొరకు వాక్య మధ్య మందు విసంధియు, అఖండ యతి ప్రయోగమును బాహాటముగా జేసితిని. కథాకాలమును బట్టి ఆ వాతావరణము స్ఫురింప చేయుటకు పర భాషా పదములు విరివిగా వాడితిని...కథనే కరువు పెట్టుటలో వచన రూపాన చెప్పదగిన యంశములు కూడ సులభ శైలిని పద్యములుగానే రచియించితిని"41 అన్నాడు.

"ఆయా ఖండ కావ్యాల అవతారికలలో నన్ను రచనకు ప్రేరేపించిన సన్నివేశమేమిటో. ఆ విషయం ప్రకటించడానికి నేను అనుకున్న విధానమేమిటో పాఠకులకు నివేదించు కున్నాను. ఆ సంగతులు తెలిసుంటే ఆ ఖండిక సుబోధం కాగలదని నా ఆశ. అప్పుడే నా నిర్వహణలోని లోపాలోపాలు విశద మవుతాయని నా ఊహ. ఆ యూహతోనే ఈ అవతారికలు వ్రాసే పద్ధతి అవలంబించాను."42 అంటూ ప్రతి ఖండికకూ పూర్వం ఆయా విశేషాలు వివరించాడు తాపీ ధర్మారావు 'పెంకుటిల్లు'.

బోయి భీమన్న :

బోయి భీమన్న తన గ్రంథాలకు తానే పీఠికలు రాసుకున్నాడు. కుల మత నిర్మూలనకు సంబంధించిన అంశాలు, తన రచనకు ప్రేరణ మైన అంశాలు, తన జీవిత వివరాలు, సమకాలీన సామాజిక స్థితి గతులు మొదలైన విషయాలు ఈ పీఠికలలో ప్రాధాన్యం వహిస్తాయి. ఫ్యూడల్ వ్యవస్థ కారణంగా ప్రవే

శించిన అంకితాలు ఈ శతాబ్దంలో ఆధునిక కవిత్వంలో కూడా అనివార్యంగా కన్పించడం ఒక విశేషం. జాషువా గ్రంథాలన్నీ ఎవరికో ఒకరికి అంకితాలే. ఆయన తన పీఠికలలో ఆ విషయం ప్రస్తావిస్తాడు. బోయి భీమన్న గ్రంథాలు కూడా ఎవరికో ఒకరికి అంకితంగా ఇచ్చినవే. ఈ విషయాలను వరుసగా ప్రస్తావిస్తాను.

రూపం :

పద్య కళ తెలుగుకు ప్రత్యేకమైందనీ, అందుకే తనకు ఇష్టమనీ అంటాడు బోయి భీమన్న. సృజనాత్మక భావనా శిల్పి అయిన రచయితకు ప్రక్రియతో పని ఉండదు; పద్యమైనా ఒకటే గద్యమైనా ఒకటే. వస్తువును బట్టి ప్రక్రియ. చెప్పదలచుకొన్న విషయం ఏ ప్రక్రియలో బాగా ఒదుగుతుందో ఆ ప్రక్రియను స్వీకరిస్తాడు రచయిత, అన్నాడు బోయిభీమన్న.[43] సంగీతాన్ని కూడా సమలంకరించుకొని ఒక సంపూర్ణ స్వరూపాన్ని సంతరించుకొన్న పద్యం తెలుగు పద్యమని అది పాట కంటే పాడుకోవడానికి అనుకూలమైనదని, సులువుగా కంఠస్థమవుతుందనీ, రాగానికి ఒదుగుతుందనీ, ఆధునిక రచయితలు పద్యం రాయకపోవడానికి కారణం వారికి భాష, గణ, యతి, ప్రాసల అవగాహన సరిగా లేకపోవడమేననీ అంటాడు. "కొందరికి పద్యమంటే ఏదో ఒక అపోహ, ప్రిజుడిసు, ఎలర్జీ. అందుకు కారణం ఆధునిక రచయితలు పద్యాన్ని ఒక బూచిగా చిత్రించి బెదిరించడం... ఆధునిక రచయితలు ప్రజలకూ సాహిత్యానికీ చేస్తున్న ద్రోహం ఇది"[44] అన్నాడు.

కొత్త ప్రక్రియలో రచన సాగిస్తున్నప్పుడు ఆ ప్రక్రియను పరిచయం చేయడం పీఠికలో ఒక ప్రధానాంశం. బోయి భీమన్న 'త్రిపదలు' రాశాడు. ''మొన్న నీ మధ్య ఏదో వ్రాస్తూ వుంటే, భావం మూడు పాదాలలోనే ముగిసి పోయింది. అలానే వుంచేస్తే యేం, అనుకున్నానప్పుడు. ద్విపదలాగే త్రిపద ఎందుకుండకూడదూ? తెలుగులో ఇంతవరకు వున్నట్టు లేదు. లేకపోతే మాత్రం, ఇప్పుడు వ్రాయగూడదూ?''[45] అంటూ త్రిపదల రచనకు పూనుకున్నాడు.

భావం : 'ఇజాలు' 'ముఠాతత్వం' పద్దు

బోయి భీమన్న విద్యారంగంలోని అవ్యవస్థను, సమాజంలోని దగాకోరుతనాన్ని, అన్ని రంగాలలోనూ విలయ తాండవం చేస్తున్న స్వార్థాన్ని విమర్శించాడు. బోయి భీమన్నకు ఇజాలు పనికిరాలేదు. "మన కళలను మన సాహిత్యాన్ని, మన సంగీతాన్ని, మన ఆధ్యాత్మిక తత్వామృతాన్ని మాత్రమేకాక - మన నదుల్లోని నీటిని, మన చేలల్లోని పంటను, మన ప్రజల్లోని శక్తిని కూడ ప్రపంచానికి పంచిపెట్టగలిగిన మహాజాతి - పొరుగు దేశాలవాళ్ళు ప్రయోగం చేసి పనికిరావని పారేసిన ఉడికీ ఉడకని 'ఇజాల' మెతుకుల కోసం నేడు అర్రులు చాస్తున్నది"46 అన్నాడు. సాహిత్య రంగంలో ముఠాతత్వాన్ని కూడా భీమన్న విమర్శించాడు. "ఈనాడు రాజకీయ రంగంలో కంటె సాహిత్య రంగంలో ముఠాతత్వం ఎక్కువ. నేను ఏ ముఠాకు, ఏ ఇజానికీ చెందిన వాణ్ణి కాను. వ్యావహారికంగా ఈ మనస్థితి నష్టదాయకమే. సహాయ సన్మానాలన్నీ ఏ ముఠాకు ఆ ముఠాకే పరిమితమై ఉంటాయి. అయితే, నేనొక్కణ్ణి ఒక ప్రత్యేక వ్యవస్థగా రూపొందడానికి ఈనా ఒంటెత్తు మనస్థితి నాకు తోడ్పడింది"47 అన్నాడు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతిభకు గౌరవం ఇవ్వాలంటాడు. "దేశ శ్రేయస్సును కోరే నాయకులంతా నడుంకట్టి, స్వార్థాన్ని అరికట్టి ప్రతిభను గుర్తించి దానికి అన్ని రంగాలలోనూ చెలామణీని కలిగిస్తే తప్ప దేశ పురోగమనం సాధ్యం కాదు"48 అన్నాడు. సంస్కృతంలో ఉంటే పవిత్రము, తెలుగులో ఉంటే బూతూనా? అని ప్రశ్నిస్తాడు.

హిందూ మతం, వర్ణ వ్యవస్థ :

'పిల్లీ శతకం' పీఠికలో హిందూమతాన్ని గురించీ కర్మ సిద్ధాంతాన్ని గురించీ బోయిభీమన్న విపులంగా చర్చించాడు. "హిందూ మతాధిపతులు సృష్టించిన కర్మ సిద్ధాంతం కేవలం సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం అధికారంలో వున్నవాళ్ళు కల్పించిన బూచి, నిర్మించిన పాక్షిక శాసనం. సామాన్య జనాన్ని మూఢత్వంలో ఉంచి, వాళ్ళు తమకు నిత్య బానిసలుగా ఉండేటట్లు కల్పించిన ఒక చీకటి గారడీ"49 అన్నాడు. మానవుడు స్వతంత్రుడనీ, తన మంచి చెడ్డలకు తానే బాధ్యుడనీ, వాటి ఫలితాలను తానే అనుభవించక తప్పదనీ అన్నాడు. హిందూ మతం అనడం కంటే ఆర్షమతం అనాలనీ, దాని జీవన ధర్మ ప్రణాళిక ఈ క్రింది విధంగా ఉంటుందనీ చెప్పాడు.

"ప్రథమ ధర్మం : బాల్యం, బ్రహ్మచర్యం, ధర్మం, శూద్రం.
ద్వితీయ ధర్మం : యౌవనం, గార్హస్థ్యం, అర్థం, వైశ్యం.
తృతీయధర్మం : కౌమారం, విజయం, కామం, క్షత్రియం.
చతుర్థధర్మం : వృద్ధాప్యం, వానప్రస్థం లేక సన్యాసం, మోక్షం, బ్రాహ్మణం.

ఒకే మనిషి - శూద్రుడుగా పుట్టినప్పటి నుంచి, చతురుపాయాలనూ సాధనాలుగా ఉపయోగించుకుంటూ, క్రమ వికాసం పొందుతూ, చివరకు బ్రాహ్మణుడుగా ముగియాలి. అదీ ఆర్ష జీవన ప్రణాళిక."50

పుట్టుకతోనే కులం వస్తుందని ఏనాడైతే ఎవరు వక్ర భాష్యం చేశారో ఆనాటినుండే భారతజాతి పతనం ప్రారంభమయిందంటాడు. భగవద్గీత మీద భీమన్నకు గౌరవమే. దాన్ని యుద్ధగీతగా అభివర్ణించాడు. అది చెప్తున్న వర్ణ వ్యవస్థ గుణకర్మలను ఆశ్రయించింది, డివిజన్ ఆఫ్ లేబర్ తప్ప మరొకటి కాదన్నాడు. ద్రావిడ, ఆర్య తెగలు కూడా దాయాదులే నన్నాడు.

కులనిర్మూలనం :

కుల నిర్మూలన చట్టం చేయాలన్నాడు భీమన్న. ఎవరి ఇష్టం వచ్చిన కులంలోకి వారు మారడానికి అవకాశం కల్పిస్తూ ఒక చట్టం చేస్తే కులమన్నది లేకుండా పోతుందన్నది ఆయన వాదం. రాగవాశిష్ఠం, ధర్మం కోసం పోరాటం, గుడిసెలు కాలిపోతున్నై, శివాలకలు మొదలైన రచనల పీఠికలలో కూడా ఇదే అభిప్రాయాలను బోయి భీమన్న వ్యక్తం చేశాడు.

బోయి భీమన్నకు హిందూ మతంమీద వైషమ్యం లేదు. దాని పేరుతో ప్రచారమైన వర్ణ వ్యవస్థ, కర్మ సిద్ధాంతం, పునర్జన్మ వీటితోనే ఆయనకు వైరుధ్యం.

లక్ష్యం :

'గుడిసెలు కాలిపోతున్నై' పీఠికలో ప్రజల్ని పట్టుకొని పీడిస్తున్న పీడలు మూడనీ, అవి మతం, భక్తి, దేవుడు అనీ వాటినుండి విముక్తి పొందవలసిందిగా

ప్రజల్ని ఉద్బోధిస్తున్నాననీ అన్నాడు. పులులు, నక్కలు, గొర్రెలు అని మానవుల్ని మూడు వర్గాలుగా విభజించాడు. పులులు బలవంతులు, కొంత తెలివి తక్కువ వాళ్ళు, నక్కలు వాళ్ళనాశ్రయించుకుని బతుకుతున్న తెలివి గలవాళ్ళు, గొర్రెలు పులులకు, నక్కలకు ఆహారమవుతున్న సామాన్యులు. సాధించాల్సిన లక్ష్యాలు ఐదు. భావవిప్లవం, జాతి సమైక్యం, కుల నిర్మూలన, సమ సమాజ స్థాపన, శ్రేయో రాజ్యసిద్ధి. వీటిని సాధించడానికి యువకులే సమర్థులు, అందుకే వారికే నా ఉద్బోధన అంటాడు బోయి భీమన్న.[51]

ఈ పీఠికలోనే యూనిటీ టైప్ ప్రభుత్వం ఉండాలనీ, రాష్ట్ర శాసన సభలూ, రాష్ట్ర మంత్రి వర్గాలూ ఉండకూడదనీ అప్పుడే భాష, ప్రాంతం, సంప్రదాయం, జీవిత పద్ధతీ వగైరా భేదాలతో ప్రజలు కొట్టుకుచావడం నిరోధించ బడుతుందనీ, దేశం చిన్నచిన్న రాజ్యాలుగా మళ్ళీ విడిపోయే ప్రమాదం తప్పుతుందనీ భీమన్న ప్రతిపాదించాడు.[52]

"పడక కుర్చీల గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ల - స్కాచ్ విస్కీల - నినాదాల రచయితలను విప్లవ యుగకర్తలుగాను, మడిగట్టుకున్న సనాతన సమాధుల్ని జీవత్ బ్రహ్మలుగాను వర్ణిస్తూ - ఒకటే డబ్బా వాయించే పత్రికలు, విమర్శకులు, ప్రసార వేదికలు చేస్తున్న ప్రచారం అంతా నిజమనుకోవద్దు, అందులో మూర్ఖత్వానికి మించిన మోసం వుంది. గొర్రెల్ని శాశ్వతంగా గొర్రెలుగానే ఉంచడం గుడిసెల్ని ఎల్లప్పుడూ గుడిసెలుగానే అట్టి పెట్టడం ఆ మోసం"[53] అన్నాడు.

అంకితం :

భీమన్న పుస్తకాలన్నీ ఎవరికో ఒకరికి అంకితమే. 'పిల్లీ శతకం' పీఠికలో "అంకితాలు ఎంతమందికైనా ఇవ్వవచ్చు. మైత్రి, ప్రేమ, గౌరవం, భక్తి - వీటిలో ఏది ఉన్నా చాలు. ఈ విషయంలో పోతన్నగారి 'బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యకన్' అనే పద్యంతో నేను ఏకీభవించను. నా కావ్యాంకితాలు ప్రేమ ప్రధానమైనవే కాని, ధన ప్రధానమైనవి కావు. నాకు గౌరవాస్పదులైన ప్రముఖులకు, మిత్రులకు నేను అంకితం ఇచ్చిన చాల

కావ్యాలు నా సొంత డబ్బుతో ముద్రించుకొన్నవే. ప్రతిఫలాపేక్ష లేనట్టివే. అందుకే పోతన్నగారి పద్యం ఈ కాలానికి చెల్లదనడం"[54] అన్నాడు.

మరికొన్ని స్వీయ పీఠికలు :

నీలా జంగయ్య దాదాపు పాతిక కావ్యాలు రచించాడు. అన్నింటికీ పీఠికలు తానే రాసుకున్నాడు. మూడు నాల్గింటికి మాత్రం కాళోజీ, దివాకర్ల వేంకటావధాని వంటి వారి పీఠికలు కూడా ఉన్నాయి. నీలా జంగయ్య స్వీయ పీఠికలు నానా విషయాలను చర్చిస్తాయి. తన కావ్య విషయాన్ని గురించి కంటే లోకం పోకడలు, ప్రభుత్వం ఉండవలసిన తీరు, లోకాన్ని మార్చ ప్రయత్నం చేసే ప్రతిభావంతులు, భాషలు, భాషా చరిత్ర మొదలైన అనేక విషయాలను చర్చిస్తాడు. సామెతలు, జాతీయాలు, ఉపాఖ్యానాలతో ఒక ప్రత్యేక పద్ధతిలో వుంటాయి, నీలా జంగయ్య పీఠికలు. అంకితం తప్పనిసరిగా ఉంటుంది. బోయి భీమన్న లాగా అంకితం తీసుకున్న వారి వివరాలు, వారితో తనకున్న సాన్నిహిత్యం వగైరాలు తప్పకుండా ఉంటాయి.

కరుణశ్రీ కూడ తన కావ్యాలకు పీఠికలు రాసుకున్నాడు. ఆయన స్వీయ పీఠికలు అంత దీర్ఘంగా ఉండవు. ఆయన 'విజయశ్రీ'కి మల్లంపల్లి సోమశేఖర శర్మ, 'ఉదయశ్రీ' రజతోత్సవ ముద్రణకు నండూరి రామకృష్ణమాచార్య పీఠికలు రాశారు. సన్నివేశాలను, పద్యాలను ఉదాహరిస్తూ కరుణశ్రీ కవితా స్వరూపాన్నీ, స్వభావాన్నీ ఈ పీఠికలలో వివరించడం జరిగింది. కరుణశ్రీ స్వీయ పీఠికల్లో కూడ అంకిత ప్రస్తావన ఉంటుంది.

అభ్యుదయాంశ :

ఇప్పటి వరకు ప్రస్తావించిన రచయితలు, పీఠికాకర్తలు స్థూలంగా సంప్రదాయ వాదులుగా కనిపిస్తారు. కాని వారిలో కూడ అభ్యుదయాంశ లేకపోలేదు. ముఖ్యంగా స్వీయ పీఠికల్లో రచయితలు తమ దృష్టిని సమాజం వైపు మళ్ళించారు. వారి పీఠికల్లో వట్టి కవితా చర్చే లేదు. 'గబ్బిలము' జాషువా అభ్యుదయాంశకు ప్రతీక. దేశంలోని పరిస్థితులకు ఆయన 'స్వయం వరం' స్పందించింది. బోయి భీమన్న కులాలను నిరసించాడు. ప్రజల్ని పట్టి కొని పీడిస్తున్న పీడలు - మతం, భక్తి, దేవుడు, అనడం, ప్రభుత్వం ఏవిధంగా

ఉండాలో చెప్పటం ఆయన సమాజాన్ని, చుట్టూవున్న పరిస్థితులను పరిశీలించి స్పందించడమూ కనిపిస్తుంది. ఇది అభ్యుదయాంశే.

అయితే ఈ రచనలకు పూర్వమే 1934లో 'రైతు భజనావళి'కి గోగినేని రంగనాయకులు పీఠిక వచ్చింది. ఈ పీఠికలో ఆయన వెలువర్చిన అభ్యుదయ దృష్టిని ప్రస్తావించవలసిన అవసరం ఉంది.

కాల్పనిక కవితోద్యమంలో దేశభక్తి, పూర్వ వైభవ పునరుద్ధరణము వంటి భావాలున్నాయి. జాతీయోద్యమ ప్రభావం ఈ విధమైన భావాలకు ప్రేరణ అయింది. పూర్వ చరిత్రలో మహమ్మదీయ చక్రవర్తులకు వ్యతిరేకంగా తమ స్వాతంత్ర్యంకోసం పోరాడిన శివాజీ, రాణా ప్రతాపసింహులు జాతీయ వీరులయ్యారు. వీరి గాథలను ఇతివృత్తాలుగా చేసుకొని దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకటశేషశాస్త్రి మహా కావ్యాలు రచించారు. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన గాంధీ ఆధునిక కాలంలో జాతీయ వీరుడయ్యాడు. ఆయన గాథల్ని ఇతివృత్తంగా తీసుకొని కావ్యాలు వచ్చాయి. తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'మహాత్మకథ' వంటివి ఇందుకుదాహరణలు. స్వాతంత్ర్యం వచ్చింతర్వాతకూడా వినోభాబావే వంటి వారి చరిత్రలు 'సర్వోదయ గానము' వంటి కావ్యాలకు ఇతివృత్తమయ్యాయి. జాతీయోద్యమ నాయకులు సంఘటనలు ఇతివృత్తాలుగా ఎన్నో ఖండ కావ్యాలు వచ్చాయి. దేశభక్తి భావం కాల్పనికోద్యమ ఫలితమే అయినా అందులో కొంత అభ్యుదయాంశకూడా ఉంది. మొదట సామ్రాజ్యవాద వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యాభిలాష, ప్రజాస్వామ్య భావాలు ఈ అభ్యుదయాంశంలో భాగాలు, అయితే ఇది ఇంతటితో ఆగలేదు. కార్మిక కర్షక వర్గాల ఐక్యత, కార్మిక కర్షక వర్గాల రాజ్యాధికారం, ధనిక పేద భేదంలేని సమ సమాజ స్థాపన, హేతువాద దృష్టి ఏర్పడి రాబోయే అభ్యుదయ సాహిత్యోద్యమానికి నాంది పలికింది.

ఈ విషయాన్నే ఎన్. జి. రంగా 'రైతు భజనావళి' పీఠిక సూచిస్తోంది. ఈ పీఠికలో "ప్రపంచమందొక చోట రైతులు రాజ్యానికి వచ్చినారు. కూలీలు పెత్తనము చేస్తున్నారు. కోటీశ్వరుల కచ్చట తావులేదు. తినడానికి తిండి పరుండడానికి పడక అచ్చట ఎల్లరికి కరవు లేకున్నవి. ప్రజాస్వామ్యమునకు

తరువు ప్రతిష్ఠలు అచ్చట లభ్యమవుచున్నవి. ఆంధ్ర ప్రజలు కూడా అలాంటి స్వరాజ్యమునే కాంక్షించుచున్నారు''55 అన్నాడాయన.

''రాజకీయ హక్కులు కొన్ని మన ప్రజలకు యున్నవి. కాని సంపూర్ణ స్వరాజ్యమే కార్మిక కర్షకులకు అభిలషణీయము. రానున్న స్వరాజ్యపు భారతావనిలో రైతులకు రక్షణ, కార్మికులకు కాపుదల అగత్యము''...... ''తుప్పు పట్టిపోయిన సాంఘికాచారములు, బూజు పట్టిన పురాణములు, విప్లవ తుఫానులో యెగిరి పోవలసినదే''56 నన్నాడు.

"ఇది కష్టాలకు కట్టడి కల్గించే కలియుగం. పనికిరాని దేవుడూ, దెయ్యము యీ కాలంలో పారిపోవలసిందే! నష్టకారణమైన అన్ని సంస్థలు, ఆచారాలూ ఆరామడ దూరం వెళ్లాల్సిందే! జ్ఞానమే ఈ కాలపు దేవాలయం. సేవయే ఇప్పటి భక్తి స్వరూపం. సర్వజన శ్రేయమే ఈ నాటి ప్రజలు కోరు వర ప్రసాదం. పరస్పర సహకార సంపదే ఈ దినపు కామధేనువు. పరుల హింసించి, స్వాభిమానము ప్రేమించి, పలువురిని పీడించి, కొంతమంది వ్యక్తులకే ధన దాహము తీర్చు ఇప్పటి దౌర్భాగ్యపు ధనదాస్య విభజన పద్ధతియే ఈ యుగపు యజ్ఞ పశువు."57 అన్నాడు.

సాంఘికతత్వం భారతదేశంలోనే మొదట ఆంధ్రదేశంలోనే ఉన్నవ లక్ష్మీ నారాయణ ద్వారా నిర్వచింపబడిందనీ ఆంధ్రదేశంలో ఈ సామ్యవాదాన్ని సుస్థిర పరచడానికి రైతులు, హరిజనులు, భజన చేస్తున్నారనీ, నెహ్రూ దివ్య వాక్కుల ద్వారా సమత్వ ధర్మం ఇంటింటా ప్రత్యక్షమౌతున్నదనీ అన్నాడు.

ఈ రైతు భజనావళి పీఠికలో వివిధ భావాల సమ్మేళనం కనిపిస్తుంది. సమతావాదం, హేతువాదాలతో పాటు, సంస్కరణ భావాలు, భక్తి కూడా కని పిస్తాయి. స్వాతంత్ర్యం ప్రధాన భావం.

రూపంలో సంప్రదాయం, ఆధునికత : వైవిధ్యం

ఉద్యమేతర కవిత్వం, పీఠికలు వ్యక్తి నిష్ఠమైనవనీ, ఒక వర్గీకరణకు లొంగవనీ ఇంతకుముందే చెప్పడం జరిగింది. సంప్రదాయ కవుల్లోనూ పీఠికా

కర్తలలోనూ, అభ్యుదయ భావాలున్నాయి. భావంలో వారి అభ్యుదయాంశను, సంప్రదాయకతను చర్చించాను. రూపంలోనూ, ఈ అవ్యవస్థితత్వం గోచరిస్తుంది. సంప్రదాయవాదులు పద్య కవిత్వానికి కాలదోషం పట్టలేదని వాదించారు. వచన కవిత, గేయం ఆధునిక కవితా రూపాలని కొంతమంది భావించారు. అయితే అభ్యుదయ కవులూ కొంతమంది పూర్తిగా పద్య కవితను ఛందస్సును విడనాడలేదు.

ఆధునిక కాలంలో కవితా రూపం విషయంలో విభిన్న అభిప్రాయాలు ద్యోతకమవుతాయి. వచన కవితయే ఆధునిక కవితా రూపమని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. విప్లవ కవులు గేయ కవిత్వాన్ని అవలంబించారు. పద్య కవిత్వం ఒకవైపు వస్తూనే ఉంది కాని దాన్ని కేవలం సంప్రదాయ కవిత్వంగా ఈ లోకానికి పనికిరానిదానిగా అభ్యుదయ విప్లవోద్యమాలు భావించాయి. అయితే కొంతమంది పద్య కవిత్వానికి కాలదోషం పట్టలేదని, అది అట్లాగే నిలబడుతుందనీ భావించారు. భోగవరపు సత్యవతీదేవి 'తొలకరి జల్లులు'కు పీఠికరాస్తూ వాసిలి వేంకట లక్ష్మీనరసింహారావు, "తెలుగునాట పద్య కవిత్వానికి కాలదోషం పట్టిందనే పద్యకవిత్వం చదివే దిక్కులేకుండా పోతున్నదనీ ప్రత్యక్ష సాక్ష్యాలతో బల్లగుద్ది వాదించే వారొక ప్రక్క వాదిస్తూనే ఉన్నారు. వాళ్ళ నోళ్ళకు వాకట్టుకట్టి వాళ్ళ కళ్ళకు కవిత్వంలో కొత్తలోకం చూపించే పద్యవాక్యాలు మరొకప్రక్క పుట్టేవి పుడుతూనే ఉన్నాయి"[58] అన్నాడు.

'కూనలమ్మ పదాల'కు పీఠిక రాస్తూ ప్రచారంలో ఉన్న ఎనిమిది పదాలను పేర్కొని, అవి తనపై కల్గించిన ప్రభావాన్ని వాటి సంవిధానాన్ని అర్థం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని, పత్రికలలో ఫీచర్ రాయాల్సి రాగా ఈ ఛందస్సులో రాయాలనిపించడాన్ని' 'జ్యోతి' మాసపత్రికలో ప్రకటించినప్పుడు అవి పొందిన జనాదరణనీ పేర్కొన్నాడు ఆరుద్ర. కూనలమ్మ పదాల చరిత్రనీ, ఛందో లక్షణాన్నీ వివరించాడు.[59]

'మరో మూడు యాభై'లకు పీఠిక రాస్తూ అది "విదూషక సాహిత్యమనీ అయినా దాన్ని కేవలం నవ్వించడానికి కాక, పత్రికా ప్రపంచంలో కార్టూనులు

నిర్వహించే విధిని ఈ కవిత్వం ద్వారా సాధించడం కోసం రాస్తున్నానని శ్రీశ్రీ చెప్పుకున్నాడు. తన ఆదర్శం వేమన, గురజాడ అని చెప్పుకున్నాడు. రాబిలై, రూసో, వాల్టేర్ మొదలయినవారి నిశిత హాస్య రచనలే ఫ్రెంచి విప్లవానికి ప్రేరక శక్తులుగా పనిచేశాయన్న నిజాన్ని మరచిపోగూడదన్నాడు.

"ఒక 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' అనే తల్లివేరు జీవిత మృత్తిక నుంచి చైతన్య పోషకమైన పదార్థాలను అనుక్షణమూ ఈ కవిత్వానికి అందిస్తూ ఉంటుంది. ఈ విషయం తెలుసుకోకుండా ఊరికే నవ్వేసి ఊరుకునేవాళ్లు ఆఖరికి తామే నవ్వులపాలయి పోతారు"60 అన్నాడు.

హేతువాద భావ వాద ధోరణులు :

హేతువాద, భావవాద ధోరణులు ప్రత్యేకమైనవిగా బయల్వెడలినా చివరి కవి వ్యక్తినిష్ఠమయ్యాయి.

హేతువాదం :

సూతపురాణం : హేతుబద్ధ విశ్లేషణ :

తెలుగు సాహిత్యంలో హేతువాద రచయితలలో తొలివాడుగా త్రిపురనేని రామస్వామి చౌదరిని పేర్కొంటున్నారు. ఆయన రచనల్లో ప్రధానమైనది 'సూత పురాణం'. సూత పురాణానికి త్రిపురనేని రామస్వామి చౌదరి కొంత దీర్ఘమైన పీఠికే రాశాడు. ఈ పీఠికలో యుగాలు, వాటి లక్షణాలు, ప్రస్తుత పరిస్థితులు, సూతపురాణ రచనావశ్యకత చర్చించడం జరిగింది. పురాణాలు కృత, త్రేత, ద్వాపర, కలియుగాలు ఒకదాని వెంట ఒకటి వర్ధిల్లుతాయని చెప్తున్నాయి. కృత యుగంలో ధర్మము నాలుగుపాదాల నడుస్తుందని, త్రేతాయుగంలో మూడు పాదాల నడుస్తుందని, ద్వాపరంలో రెండు పాదాలని, కలియుగంలో ఏకపాదమని పురాణాలు చెప్తున్నాయి. ఈ విషయాన్ని సతార్కికంగా ఈ పీఠికలో రామస్వామి చౌదరి ఖండించాడు. కాలానికి స్వభావసిద్ధంగా మంచి చెడులు ఉండవని సమాజం మంచి చెడును బట్టి యుగ లక్షణం ఉంటుందని వాదించాడు. భిన్న దేశాలలో, భిన్న కాలాలలో, భిన్న పరిస్థితులున్నపుడు సామాన్యమైన యుగ లక్షణాలు ఎట్లా వర్తిస్తాయని ప్రశ్నించాడు. పురాణాలలోని కథలనుబట్టి ఆయా

యుగాలలోని మానవుల ప్రవర్తనా విధానాన్ని విశ్లేషించి ఆ యుగాలకు ఆ పేర్లు తగినవేనా అని ప్రశ్నించాడు. "ప్రజాబాహుళ్యముయొక్క ధర్మ ప్రవర్తనముచే యుగములు కల్గుచుండుననుట నిర్వివాదము"61 అన్నాడు.

కలియుగ లక్షణాలను చెప్తూ "విద్య ద్విజుల ముల్లె అను మాట ప్రచారము లోనికి వచ్చెను. తాము చదువ వచ్చుననుటకన్న నితరులు చదువకూడదను వితండ వాదము హెచ్చినది. స్త్రీల స్వాతంత్ర్యము నిర్మూలింపబడినది... 'బ్రాహ్మణో మమ దేవతా' యను సూక్తి సర్వవిధముల సార్థకమయినది. యంత్రగాని చేతంబడిన తోలుబొమ్మ వలె బ్రాహ్మణాధీనమునబడి రాజులు రాజ్య తంత్రము నిర్వర్తించిరి. ఆశ్రమస్థితి నశించినది. కాని వర్ణ ధర్మములు విచ్చల విడి పెచ్చురేగినవి... ప్రజా సామాన్యము తమ ధర్మమునుగాని స్వత్వమునుగాని యెఱుంగజాలక శోచనీయ దశంబడి పొరలాడ దొడంగెను. 'విస్సన్న చెప్పినదే వేదమయి బ్రాహ్మణవాక్యములే మణి మంత్రౌషధము లయినవి. ఈ పరిస్థితి నూతకోల చేసికొని విప్రులు ప్రజలయొక్క సూక్ష్మదేహమునే నశింప జేసిరి. దీనికై యవలంబింపబడిన మార్గములు పండిత గర్హ్యములు. పౌరాణికులు ధర్మమును సామాన్య ధర్మములనియు, విశేష ధర్మములనియు విభజించి లోక ప్రతారకులైరి. విశేష ధర్మములు, బ్రాహ్మణేతర లోకమును చీల్చి పిప్పి చేయుటకు నొడ్డిన యురులు. కాలక్రమమున నీయురులే యొడ్డినవారి కుత్తుకలను నులిమివేయు కొరుముట్లయినవి. ఈ యవియే యార్యజాతి పతన హేతువైనవి. ఆర్య ధర్మము తురక మసీదయినది. కరి మింగిన వెలగ పండయినది. మతాంతరులచే గ్రసితమయినది. హిందువు నిలువు గ్రుడ్డున బాహ్య ప్రపంచమును వీక్షింపదొడగెను. నిర్జీవ ప్రతిమ అయ్యెను. శుష్క వేదాంతము శరణము బొందెను"62 అన్నాడు. ఈనాటి భారతదేశ దుస్థితికంతా బ్రాహ్మణులే కారణమని చెప్పినట్లయింది.

"దుర్జ్ఞేయమైన భాషయందున్న కథలెల్లను నజ్ఞులకు శిరోధార్యములగు నన్న సంగతి లోక విదితము. ఇది యెరింగియే విప్రులు సంస్కృతము పవిత్ర మగు భాషయనియు, అందలి వాక్యములు భగవదుక్తములనియు, వాని నితర భాషలోనికి బరివర్తనము చేసిన యడల, వాని నంటియున్న పవిత్రత కలుషిత మగునను నభిప్రాయము లోకమున వ్యాపింప జేసిరి. సంస్కృత భాషయందలి

మంత్రములను తెలుగు భాషలోనికి దెచ్చిన యెడల సామాన్య జనమునకు నవగాహమై యందలి నీతులు ధర్మములు సులభైక వేద్యములగును. మాననీయ ములైనచో మన్నింపబడును. కానిచో తిరస్కరింపబడును... ప్రజలెంత దనుక భావము గుర్తెరుంగక, యర్థము గ్రహింపక, శబ్దజాలమునకు గౌరవము చూపింతురోనంత దనుక పురోభివృద్ధి పురాయింపదు"63 అన్నాడు.

సూత పురాణ రచనావశ్యకతను ఈ విధంగా వివరించాడు. "ప్రాకృత జనంబునకు వేదార్థము సులభైక వేద్యము కాదని యెఱిగి, వైదికులును, నిష్కాములును, లోక సంసర్గ రహితులును, నిసర్గ భూతదయా శీలురును నయిన ఋషిచంద్రులు నిర్వ్యాజ కరుణా విశేషంబున 'స్త్రీ శూద్ర ద్విజ బంధువు'లకు ముక్తి మార్గమును జూపి తరింప జేయుటకునై వేదార్థమునుటం కించి పురాణములు వ్రాసిరని యార్యోక్తి. ఈ ఆర్యోక్తి యందు విశ్వాసముంచి మూఢలోకము బురాణము లార్షేయములనియు దత్కారణమున బూజ్యములనియు దదంతర్గత ధర్మములు, నీతులు, కథలు శిరోధార్యములనియు విశ్వసించు చున్నది. ఈ విశ్వాసమువలన కలిగిన ప్రతిఫలమాత్మద్రోహముగా బరిణమించుట జేసి, పురాణములెంతవరకు బ్రతికూలములో, ఎంతవరకు నీతి బాహ్యములో, ఎంతవరకు బక్షపాత భూయిష్ఠములో మోడ్పుగన్నుతో నున్న విద్వల్లోకమునకు జూపించు తలంపుతో సూతపురాణము రచించబడినది."64

ప్రచారం :

వర్తమాన కాలంలో విద్య సామాన్యమై కులానుకూల ధర్మనిర్ణయంపై బ్రాహ్మణేతర లోకం దాడి వెడలిందనీ, భారత దేశంలో వివిధ ప్రాంతాలలో బ్రాహ్మణేతరులు సంఘటితమై పౌరాణికులు ప్రతిష్ఠించిన విశేష ధర్మాల నిర్మూలనకు ప్రయత్నిస్తున్నారనీ, ఇది ధర్మ సంగ్రామం కాబట్టి బ్రాహ్మణేతర లోకం మీద విజయలక్ష్మి వర్షిస్తుందని అన్నాడు. దీని వల్ల "ఇక హిందూ సంఘము సర్వాంగ సందరముగా జీవింపగలదు. మతాంతరులను, జాత్యంతరులను హిందూ సంఘమున లయింప జేయుట చేతను, చండాలాది నిమ్న జాతులకు సత్వము లొసంగుటచేతను; మరల భారత ఖండమున సౌభ్రాతృత్వము నెలకొల్ప"65 బడునని ఆశించాడు

"బ్రాహ్మణ కులమునకుగూడ వన్నె దేగలిగిన పండితులు విద్వద్వంద్యులు బ్రాహ్మణేతర కులములయందు బొడముటచే బ్రాహ్మణ గౌరవము నిదాఘనదీ జలంబులంబలె నదృశ్యమగుటచే తదితరకులములకు సాంఘిక దాస్య విముక్తి కల్గుచున్నది. బ్రాహ్మణ పౌరోహిత్యములేని వివాహములు వందలకొలది జరుగు చున్నవి......మత విషయమున నెల్లరకు సరిసమానములగు హక్కులు కలుగు చున్నవి"66 అన్నాడు

త్రిపురనేని రామస్వామి వాదం హేతుబద్ధమేనా?

పురాణాల సత్యాసత్యాలను హేతుబద్ధ దృష్టితో పరిశీలించడమనే అభ్యుద యాంశతోపాటు త్రిపురనేనిలో కొన్ని లోపాలుకూడ కనిపిస్తాయి. ఆయన పీఠికలో స్పష్టంగా కనుపించేది బ్రాహ్మణ ద్వేషం. పురాణాలు, నీతి బాహ్యాలని నిరూపించే ప్రయత్నమూ, వాటిని ఆధారంచేసుకుని బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులను అజ్ఞా నంలో ఉంచి తమకు బానిసలుగా ఊడిగము చేయించుకుంటున్నారని నిరూపించే ప్రయత్నమూ కనిపిస్తుంది. బ్రాహ్మణ మత ద్వేషంకంటే బ్రాహ్మణ ద్వేషం ఎక్కువ. ఆయన సూత పురాణంలో చేసిన పూర్వ కవి స్తుతిలో పనిగట్టుకొని బ్రాహ్మణేతర కవులనే స్తుతించాడు తప్ప బ్రాహ్మణ కవుల నెవరినీ పేర్కొనలేదు. వ్యవస్థ మొత్తం మీద వ్యతిరేకత కాక ఆ వ్యవస్థలోనే భాగమైన ఒక ప్రత్యేక కులం మీద వ్యతిరేకత ఆయనలో కనిపిస్తుంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణేతి హాసాల విషయంలో రాహుల్ సాంకృత్యాయన్ వంటి వారికున్న స్పష్టమైన చారిత్రికావగాహన రామస్వామి చౌదరి కున్నట్లు తోచదు. పౌరోహిత్యం మీద వ్యతిరేకత లేదు. బ్రాహ్మణ పౌరోహిత్యం మీద వ్యతిరేకత.

సామాజిక వ్యవస్థ స్వరూపాన్ని నిర్ణయించే ఆర్థిక వ్యవస్థాపరమైన వివేచన ఆయన పీఠికల్లో ఎక్కడా కనిపించదు. పురాణాలలోని చెడును విమ ర్శించడానికి, వెలికి తీయడానికి తోడ్పడ్డా త్రిపురనేని రామస్వామి చౌదరి అభి ప్రాయాలు నిర్మాణాత్మక మార్గంలో ఉన్నట్లుగా ఈ పీఠికలో ద్యోతకం కావు. యుగ లక్షణాలను తిరస్కరించడమూ, అర్థం తెలియని కేవల శబ్దజాలానికి గౌరవం చూపించడం మౌఢ్యమనడం, పురాణ రచనలో బ్రాహ్మణుల స్వార్థాన్ని నిరూపించడం, పురాణ ధర్మాల నిరాకరణ ద్వారా భారతదేశంలో సర్వ సౌభ్రా తృత్వం నెలకొంటుందని చెప్పడం, విద్యావ్యాప్తివల్ల బ్రాహ్మణ ప్రాధాన్యం

పోయి, మత విషయంలో అందరికీ సమాన హక్కులు లభిస్తాయని భావించడమూ త్రిపురనేని పీఠికలలో ప్రధానంగా కనుపించే భావాలు.

త్రిపురనేని రామస్వామి - బోయిభీమన్నలు :

బోయి భీమన్న, త్రిపురనేని రామస్వామి చౌదరి వీరిద్దరిలో ఒక వింత వైరుధ్యం కనిపిస్తుంది. బోయి భీమన్న ఆర్షమతాన్ని కీర్తించాడు వాల్మీకి, వ్యాసుడు, తమవాళ్లేనని, మతంగుడూ, చండుడూ తమ పూర్వీకులనీ గర్వించాడు. వ్యాస పురాణాల మహత్తును కీర్తించాడు. కులమత భేదాలను నిరసించాడు. సోషలిస్టు వ్యవస్థను కాంక్షించాడు. రామస్వామి చౌదరి పురాణాల బూతు కథలను విమర్శించాడు. మరి పురాణాలన్నింటా బ్రాహ్మణాధిక్యతే ఉందని ఒకవైపు రామస్వామి చౌదరి విమర్శిస్తుంటే, వ్యాసుడు తమవాడేననేమో బోయి భీమన్న సర్దుకు పోతున్నాడు.

రామస్వామి చౌదరి, నార్ల వెంకటేశ్వరరావులు, వారి నాటికలకు రాసుకున్న పీఠికలు హేతువాద పీఠికలలో ప్రాముఖ్యాన్ని పొందాయి, హేతువాదులు ఒక ప్రత్యేక లక్ష్యాన్ని ఆధారంగా పెట్టుకొని రచనలు చేశారు కాబట్టి ఆలక్ష్య వివరణ వాళ్లే చేయవలసి ఉంటుంది. అందుకే వారి రచనలకు వారి స్వీయ పీఠికలే ఉంటాయి. ఇతరులచేత పీఠికలు రాయించుకోవడం సాధారణంగా కనిపించదు.

అనుభూతి వాదం :

గుంటూరు శేషేంద్రశర్మ అనుభూతివాద ధోరణిని కవిత్వంలో ప్రచారం చేసినవాడు. ఆయన బాటనే అనుసరించిన వారు అరిపిరాల విశ్వం, ఆర్. ఎస్. సుదర్శనం మొదలయినవారు. కొత్త ధోరణిలో కవిత్వం రాస్తున్నామనుకున్న వాళ్ళు ఆ ధోరణేమిటో తమ పీఠికలలో చెప్పడానికి ప్రయత్నిస్తారు. అనుభూతి వాద కవులూ ఆ ప్రయత్నం చేశారు. వారికి అనుభూతే ప్రధానం. అనుభూతి లేని కవిత్వం కవిత్వం కాదు. తన 'కాలంగీస్తున్న గీతలు'కు ఆముఖం రాస్తూ అరిపిరాల విశ్వం "కవిత్వం ఒక్కటే జీవితాన్ని నిండుగా చేసేదీ. చెప్పేదీ, అనుభూతి విరహితమైన కవిత నిర్జల మీనంలాగా ఎక్కువకాలం రహించలేదు. అనుభూతి ఎలాంటిదైతేనేమి? హృదయస్పందన కావాలి. కవిత ఎక్కడో వేయి

సముద్రాల లోతుగా పవ్వళించిన స్మృతులను, నీలో కదల్చగలగాలి. అట్టి తన్మయీభవన చేతస్కతను తేలేని కవిత, ఎంత లలిత కోమల పదశయ్యను కలిగినా, దాని ప్రకాశం ప్రసరించేది సమకాలీన వాస్తవ పరిధులవరకే. సర్వ కాలీన సత్యసౌధాన్ని ఆ కవితాదీపం వెలిగించలేదు" అన్నాడు. మరి అనుభూతి అంటే ఏమిటి? - అనుభవైక వేద్యమే. "కవితకో నిర్వచనం చెప్పాలనటం, దేవుడున్నాడని చూపించడానికి పూనుకోవడం లాంటిది. కవితకు అనుభూతిని మించిన నిర్వచనం ఏముంది కనుక? అనుభూతి ఉన్నప్పుడది అనిర్వచనీయమై పోయె. ఇక దానికి అనంతత్వం స్వరూపమైతే అనిర్వచనీయానుభూతి స్వభావ మని సరిపుచ్చుకోవాలి''67 అన్నాడు.

ఆర్. ఎస్. సుదర్శనం 'నిశాంతం'కు పీఠికరాస్తూ గుంటూరు శేషేంద్ర శర్మ ఆ కావ్యాన్నిగూర్చి యిలా అన్నాడు. ''ఈ కావ్యపు బహిరంగ స్వరూపాలు నిగూఢములు. కేవలం కావ్య శరీరంగాచూస్తే బహిఃశరీరమంతా ప్రతీకలు, బింబాలు, అలంకారాలు అయిన వాటిచేత నిర్మింపబడింది; అంటే వ్యంగ్య శరీరమేకాని వాచ్య శరీరం లేదు. ఇక అంతఃస్వరూపం చూస్తే అనుభవైక వేద్యం. జీవాత్మయొక్క వేదన. కుండలిన్యుత్థాపన, సహస్రారాంత చంద్ర మండల వేధ, అమృత వర్షము, శివశక్త్యైక్యము, మోక్షసుఖము - ఇదీ కావ్య వృత్తము. ఇట్లా కుండలినీ యోగానుష్ఠాన విషయం వివిధ శీర్షికల్లో వికసించి ఒక మహానుభూతి కావ్యంగా జన్మఎత్తింది. అంటే కావ్యానికీ శీర్షికలకూ అంగాంగి భావ సంబంధం ఉంది. నినాదకవుల జార్గన్ భాషలో అయితే దీన్ని 'సామాజిక చైతన్యం' లేని 'ఆత్మాశ్రయ' కవిత్వం అనవచ్చు"68

పలు విధాలుగా కన్పించే విషయాలను వర్గీకరించడానికి ఏదో ఒక 'జార్గన్' అవసరమే. ఆయనే ఒప్పుకున్నట్టుగా అనుభూతి వాద కవిత్వం 'ఆత్మాశ్రయ' కవిత్వమే. గుంటూరు శేషేంద్ర శర్మ కవిత్వాన్నలావుంచి, విరాట్ స్వరూపంతో 'నేను'గా కన్పించే ఆయన పీఠికలను పరిశీలించినా అనుభూతి వాదం ఆత్మాశ్రయ ధోరణే అనేది స్పష్టం.

"నేనెప్పుడు గొంతెత్తినా నాకోసం కాదు. ఐదుకోట్ల మంది కోసమూకాదు. యాభైకోట్ల మందికోసం గొంతెత్తాను. నేను పడుతున్న బాధలే నాదేశమంతా

పడుతోంది. నా మానవ జాతి అంతా పడుతోంది. కనుకనే నా జ్వాలిక దేశపు నాలిక"69 అన్నాడు గుంటూరు శేషేంద్ర శర్మ. 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ' అన్న చెలం మాటలు మనకు గుర్తుకువస్తాయి.

అనుభూతివాద ప్రవర్తకుడిగా గుంటూరు శేషేంద్ర శర్మ అభిప్రాయాలను పరిశీలిస్తే మిగతా అనుభూతి వాదులందరూ మనకర్థమవుతారు.

ఆధునిక ఇతి హాసం :

గుంటూరు శేషేంద్ర శర్మ తన కావ్యాలకు తానే పీఠికలు రాసుకున్నాడు. కొన్నింటికి ఇంగ్లీషులో, కొన్నింటికి తెలుగులో. కొన్నింటికి ఇందిరాదేవి ధనరాజ్ గిర్ కూడ ఇంగ్లీషులో పీఠికలు రాసింది. 'నాదేశం నాప్రజలు'కావ్యానికి పీఠిక రాసుకుంటూ ఆ కావ్యాన్ని ఆధునిక ఇతిహాసమన్నాడు శేషేంద్రశర్మ."ఇతిహాస నిర్మాణానికి బాధానుభూతిపూర్వక బలి కావాలి. నేనే ఆ బలి. నా వయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి మాటల గొంతుల్లో పోసిన నా రక్తం ఈ ఇతిహాసం. ప్రపంచ మానవుల్నీ, వాళ్ళ చరిత్రల్నీ, వాళ్ళ జయాపజయాల్నీ, వాళ్ళ భూత భవిష్యద్వర్తమానాలనీ అన్నింటినీ అనుభవ జ్ఞాన నేత్ర ద్వంద్వంతో అవలోకన చేసి ఆ విశ్వ దృశ్యం నించి ఈ తాత్పర్యం పిండాను - గత మే నెల నీలగిరి కొండల్లో కూర్చుని. ఇది ఈ శతాబ్దం ఇచ్చిన పాట"70 అంటాడు.

అంతే కాదు. ఆధునిక సాహిత్యంలో తన కావ్యమే మొదటి ఇతిహాసమని ఆయన అభిప్రాయం. "వర్తమాన ఆంధ్ర కవిత్వంలో ఇతిహాసం ఒక అపూర్వమైన ప్రక్రియ. ఇప్పుడు నేను ఈ ఇతిహాసం సమర్పిస్తున్నాను. దేశంలో ఒక సామాన్య కర్షకుడు నాయకుడో, అతని జీవిత గాథే దాని ఇతివృత్తమూ, ఆ ఇతిహాసం."71

ఈ ఇతిహాసంలో కథ కోసం చూడకూడదు. ప్రాచీన ఇతిహాసాల్లో కొన్ని సామాన్య లక్షణాలున్నాయి కొన్ని భేదాలూ ఉన్నాయి. కొన్నింటిలో రామాయణ భారతాల్లాగ ఇతివృత్తం ఒకే కథగా ఉన్నప్పటికీ మరికొన్నింటిలో - షానామా,

రాజతరంగిణి, రఘువంశం, డివైన్ కామెడీ వంటి వాటిల్లో - ఓ కథారూప ఇతివృత్తం లేదు. ఆధునిక యుగంలో పాశ్చాత్య దేశాల్లో కథారూప ఇతివృత్తం లేని ఇతిహాసాలే వస్తున్నాయి. నోబెల్ బహుమతి గ్రహీత సెంట్ జాన్ పెర్స్ మహాకవి రాసిన 'క్రోనీక్' అనే ఇతిహాసానికి కథారూప ఇతివృత్తం లేదు. అందువల్ల తన రచనలో కూడా అటువంటి కథారూప ఇతివృత్తం కోసం చూడ గూడదనీ ఆయన అభిప్రాయం.

సమకాలీన భాష, భావాల ఆవశ్యకత :

భాష భావమూ సమకాలీనమైంది కావాలంటాడు, ఎందుకంటే ఈ కాలపు మనిషి గురించి చెప్పుకోవాలి కాబట్టి "ప్రతి తరమూ తన భాషనూ, తన లోకాన్నీ తాను సృష్టించుకొంటుంది తన అనుభూతి కోసం. అన్ని దేశాల్లోనూ, అన్ని కాలాల్లోనూ ఇదే సత్యం. అందుచేత ఈ ఇతిహాసంలో కవిత్వాన్ని అర్థ చమత్కారం చేతనే చూడాలి"[72] అన్నాడు.

అనువాదాల ఆవశ్యకత :

గుంటూరు శేషేంద్రశర్మ తన కావ్యాలను తానే ఇంగ్లీషులోకి అనువదించాడు. ఇతరులు హిందీ ఉర్దూలలోకి అనువదించారు. రచన అనువాదాల ఆవశ్యకతను శేషేంద్రశర్మ మరీ మరీ నొక్కి చెప్పాడు. "దీన్ని ఇంగ్లీషులోకి నేనే తర్జుమా చేశాను, (ఇండియాలో ఇంగ్లీషు ఆధునిక సంస్కృతం కదా.) హిందీలోకి ప్రసిద్ధ కవి మిత్రుడు శ్రీ ఓం ప్రకాష్ నిర్మల్ అనువాదం చేశాడు. అనేక భాషలు మాట్లాడే ప్రజల అల్లిక అయిన మనదేశంలో అనువాద రహితంగా పుస్తకాలు ముద్రించడం నిరర్థకమే కాకుండా మనం ఏ కాలంలో బతుకుతున్నామో ఆ కాలాన్ని గురించి స్పృహకూడా లేకపోవడమవుతుంది. ప్రపంచమంటే తెలుగు మాట్లాడే ప్రజలేకాదు. అన్నిభాషల ప్రజలు, అన్నిదేశాల ప్రజలు మన ప్రజలే కనుక ఇది కర్తవ్యం ఈనాడు[73]."

తత్వ పరిణామం :

'గొరిల్లా' పీఠికలో వేదాంత పరిణామాన్ని పేర్కొన్నాడు. ఆధునిక ప్రపంచంలో ఏర్పడ్డ ఏకైక న్యాయమైన దృక్పథంగా మార్క్సిజాన్ని అభివర్ణించాడు. "It is this sense of justice which is of supreme histori-

cal significance in the evolution of human society from the classical to the feudal then the Capitalist and finally to Socialist stages as expounded by Marx in the modern times... To look at man's story on earth from the point of view of Justice, is the only true point of view from any civilised sense of the term history. Because it is the laws of a society that symbolise the civilisation, culture, learning, thought, ideas and values of that society."

"The entire history of mankind has been one long drawn out human struggle for justice which has been ellusive through times under the different mazes of culture and civilisation. "The history of all hitherto existing society is the history of class struggles" is the first sacred line of the greatest human document of this age, the communist manifesto"[74]

ప్రతీక వాదం :

గుంటూరు శేషేంద్ర శర్మ ప్రధానంగా సింబాలిస్టు. "ఒక ఉన్న వస్తువును మరో ఉన్న వస్తువుతో పోల్చి చెప్పడం మామూలు రూపక లేక ఉపమాలంకార శైలికవిత. కాని ఒక వస్తువును ఇతర తెలిసిన వస్తువుల్లో ఉన్న మరో అంతర్ వస్తువును చూచి ఆ సూక్ష్మాంశాల సహాయంతో సూచించే ప్రయత్నం సింబాలిజం అవుతుంది... అయితే ముఖ్యమైనది, ఈ ప్రయత్నం బుద్ధి పూర్వకము కాదు; ఒక అనిర్వచనీయ అనుభూతి పూర్వకం. అనుభూతి, కవి సంపాదించుకోవలసిన స్థితి. ఆ స్థితి నుంచి అప్రయత్నంగా పుట్టే ఫలితాలు ప్రతీకలు"[75] ఇటువంటి కవిత్వాన్ని విమర్శించడానికి ప్రత్యేక పద్ధతులు అవసరమని, వట్టి అలంకార మార్గం చాలదనీ, బింబ ప్రతీకల ద్వారా వివరించే పద్ధతి, పశ్చిమ దేశాల కవిత్వాన్ని వ్యాఖ్యానించే ఆధునిక విమర్శనా పద్ధతుల్లో ఉపలబ్ధమయ్యే పద్ధతి ప్రతీక వాద విమర్శ కావాలనీ అంటాడు.

ప్రపంచ ప్రసిద్ధ కళాకారులు - 'నేను'

గుంటూరు శేషేంద్రశర్మ 'శేషజ్యోత్స్న' పీఠిక ఒక ప్రత్యేక తరగతికి చెందింది. దీనిపేరు 'నేనూ - నా నెమిలీ లేక నెమిలీ - నా నేనూ' వాల్మీకి నుండి శేషేంద్ర శర్మ దాకా ప్రసిద్ధ కళాకారులంతా ఇందులో వస్తారు. వాళ్ళు ఎక్కడెక్కడో, ఏ సందర్భాలలోనో వాడిన వాక్యాలను తీసుకొని వాటిని తన ఆలోచనా ధారలో పేర్చుకుంటూ పోతాడు. "ఈ గొంతు (వాల్మీకి) ఎపుడూ ఇలా తిడుతూనే ఉంటుందా అన్నికాలాల వేటగాళ్ళను? మానవతకు గాయాలు చేసేవాళ్ళనీ, ద్వేషాన్నీ, స్వార్థాన్నీ రక్తాక్షరాల్లో రాసేవాళ్ళనీ ... కాలపు రాస్తాలో దాడులు జరిపే బందిపోటు దొంగలనుండి మానవతను రక్షించడానికి అహరహము పహరాకాచే పోలీసా ఏమిటి? ఈ గొంతు! విశ్వంలో మహనీయత శబ్దంగా మారుతుంది. ఆ శబ్దం శాశ్వతంగా లోకమంతటా పరిభ్రమిస్తూ ఉంటుంది, యుగంనుంచి యుగానికీ, దేశంనుంచి దేశానికీ, భాషనుంచి భాషకూ, అనంతంగా నిరంతంగా"76 అంటాడు.

వామపక్ష కవులపై విమర్శ : మానవతా వాదం

కొందరు ఇతరుల రక్త ప్రవాహాలలో కీర్తి శిఖరాలకు ప్రయాణం చేస్తున్నారనీ వారిలో చిత్తశుద్ధి ఏమాత్రం లేదనీ వాళ్ళు శ్రామికులకోసం కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే వంచకులనీ అంటాడు. కవిత్వానికి రాజకీయ సంబంధం అనివార్యం కాదంటాడు. దీనికి టి. ఎస్. ఇలియట్‌ను ఉటంకిస్తాడు. సమకాలిక కవులనూ, వారి సాహిత్యాన్ని ఈ విధంగా విమర్శించాడు. "ఏ ప్రేమ మానవతకు రూపాంతరమో, చిత్తశుద్ధికీ, నీతికీ, ధైర్యానికీ మారుపేరో ఏ ప్రేమ ఇద్దరు పరస్పర అజ్ఞాత వ్యక్తుల్ని విలీనంచేసి సృష్టి అనంతతను ఆవిష్కరిస్తుందో ఏ ప్రేమ సర్వమానవ జాతినీ ఒక చరిత్ర మూసలోవేసి మానవతా హిరణ్యంగా మలచివేస్తుందో,ఏ ప్రేమచేత మనిషి తోటి మనిషిబాధచూచి ద్రవిస్తాడో, ఏ ప్రేమచేత మనిషి అన్యాయంమీద మనిషి దౌర్జన్యం మీద తన ఇనప పిడికిలి ఝళిపిస్తాడో, ఏ ప్రేమవల్ల మనిషి న్యాయాన్ని నిరోధించే శక్తుల్ని తన పవిత్ర కర్కశ పరశువుకి బలిచేస్తాడో, గాయపడ్డ మానవతకి రక్తంతో తర్పణం చేస్తాడో ఆ యుగయుగాల శిక్షా ఫలితంగా మానవుడు సాధించి రక్తకణాల్లో నిక్షిప్తం చేసుకున్న సంపదను గాలితో తన్నేవాళ్ళు కవిత్వం చెపుతున్న ఈ రోజుల్లో, దాన్ని

సెంటిమెంట్ అని ఈసడించుకొనే వాళ్ళు కవిత్వంలో పోకడలను నిర్దేశిస్తున్న ఈ రోజుల్లో, మానవ రక్తాన్ని, స్వేదాన్ని మకుటాలు చేసుకుని మస్తకాల మీద అలంకరించుకుంటున్న ఈ రోజుల్లో మోసము, చౌర్యము, ద్వేషమూ, అసూయ, అజ్ఞానమూ, కవిత్వం పేరుతో కలరావ్యాధిలా వ్యాపిస్తున్న ఈ రోజుల్లో, కవిత్వం పేరు చెప్పి కాయలమ్ముకుంటున్న వెధవలకి గండపెండేరాలు తొడుగుతున్న ఈ రోజుల్లో, ఆ గండపెండేరాలు తయారు చేసే బ్రతుకుదెరువు పండితులూ, వాటి వ్యాపారంకోసం తెరిచిన దుకాణాలూ ముమ్మరంగా ఉన్న ఈ పాడు రోజుల్లో—

ఆకాశాలు తగిలే శిఖరాలు, విమల వాయువులు విహరించే ఆకాశాలు, పూల భాషలు మాట్లాడే అమాయక వాయువులు, కిరాతులమీద జ్వలించే రంగులు ఉమిసే పూవులు, మానవతతో దోబూచులాడే రంగులు, కాంతీ కమనీయత మనిషి మనిషికి సమానంగా పంచిపెట్టాలని ఆక్రోశించే మానవత - ఇవన్నీ ఎవరి మనసులో వెన్నెల తిరునాళ్ళు చేసుకుంటున్నాయో, వాడు చచ్చిపోవడమే మేలు"[77]

కవి - ద్రష్ట :

కవి ద్రష్ట కావాలంటాడు. అతడు త్రికాలాబాధ్యుడంటాడు. ఈ పీఠికలో గుంటూరు శేషేంద్ర శర్మ తనను భవభూతి, కోక్తో, లియోనార్డో, మైకలేంజిలో, బోదిలైర్, మల్లార్మే, కాళిదాసు, ఇలియట్, పౌండ్, జార్జ్ శాంటాయన...ఇక్బాల్, రిల్కే, వర్జిల్, పికాసో, సోక్రటీస్ మొదలైన వారి సరసన కూర్చోబెట్టు కున్నాడు."[78]

కవి - అకవి :

శేషేంద్ర శర్మ పీఠికలలో కవి అంటే ఎవరో అకవి అంటే ఎవరో చెప్ప డానికి చాలచోట్ల ప్రయత్నం చేశాడు. తెలుగులో కవులది మైనారిటీ అని అకవులదే మెజారిటీ అనీ, అందుకే నిజమైనకవి ప్రాణాలు నిలుపుకోవడానికి పరాయి భాష ల్లోకి పారిపోతున్నాడని అంటాడు.[79] పూవులోని సంపూర్ణానుభూతిని కోరేవాడు కవి. తేనె మాత్రమే కోరేవాడు అకవి అంటాడు.

అసలైన కవీ, కవిత్వం :

"కవిత్వాన్ని కవిత్వంకోసమే చదువుతాము కానీ, రాజకీయ సిద్ధాంతాల కోసం చదవము. అందులో కవిత్వం లేకపోతే దాని జోలికిపోము"80 అన్నాడు. "నేను నిర్భయంగా వ్యవహరించే కవులు కావాలంటాను. తన భావాల్ని ధైర్యంగా చెప్పే నీతి కవికి అవసరం అంటాను. నినాదాలకు బెదిరేవాడు చస్తే కవి కాడు. వాడికి ఒకటే నినాదం. అంతరాత్మ నినాదం. కవికి బయట ఎంత ప్రపంచం ఉందో లోపల అంత ప్రపంచం ఉంది. కవి ఈ రెండు ప్రపంచాల్నీ మోస్తూ జీవయాత్ర చేస్తాడు. చెయ్యాలి. దేన్ని చంపుకున్నా కవి కాడు; దొంగ అవుతాడు. ఈయన కవిత్వంలో సమాజ స్పర్శలేదు. అదిలేదు ఇదిలేదు అనే ఈ వెధవ నినాదాలు వట్టి చవటలు చేసే నినాదాలు."81 అనీ "ఈ రోజుల్లో అందరు మానవులకు తిండి బట్ట ఇల్లు ఉండాలి. అందరూ సమానమే అనే మాటలతో భేదాభిప్రాయం ఎవరికీలేదు. కనుక ఈ మాటలు ఏ రాజకీయ పార్టీ నినాదమో లేక మోనోపలీనో కానక్కరలేదు. అందరు కవులూ అవే రాస్తు న్నారు. కొత్తవి రాసే దొక్క శుద్ధి ఎవడికీ లేదు కనక. కానీ వాళ్ళు రాస్తున్నది కవిత్వమా అనేదే ప్రశ్న ఈనాడు... ఈ నినాదాలేమిటి? మానవ సమూహాల అచేతన హృదయాంతరాళాల్లో స్పందించే జ్వాలలు. ఈ జ్వాలల్ని కదిపి కవి మాటల ఒడుపులో బంధిస్తాడు; మాటతో శతాబ్దాల తోరణాలకు నిప్పంటిస్తాడు. ఆ జ్వాలల మాలల ధరించి ముందుకు దూకేవాడు నవయుగ నిర్మాత. అజ్వాలల్లో చలికాచుకునే వాడు రాజకీయ వాది"82 అన్నాడు.

"ప్రతి యుగంలోనూ ఒక ఫాషన్ ఉంటుంది. భాషలోనూ భావంలోనూ అందరూ దాన్నే అనుకరిస్తారు. దాన్ని పోలిందయితేనే మంచిది పోలందయితే చెడ్డది. ఎక్కువ మంది సామాన్యులు ఫాషన్ సృష్టించలేరు. భారతీయుల్లో అలాంటి ఎక్కువ మందిలో తెలుగువాళ్ళు ఎక్కువమంది. వీడిదెప్పుడూ కాపీ రైటు మాత్రమే. ఏ బోది లేరో, ఏ అల్లేన్‌పోనో వచన కవిత 100, 150 ఏళ్ళ క్రింద మొదలుపెడితే, వీడు నేనే దానికి పితామహుణ్ణంటాడు. దొంగవెధవ! 'గద్యం కవీనాం నికషం వదంతి' అని ఎప్పుడో చెప్పిన ఈ ప్రాచీన భారతదేశంలో. ఈ దొంగ వెధవ చెప్పిందే ఈనాటి తెలుగు దేశమంతా నిజమే అంటుంది. ఒకడుకాడు, ఇద్దరుకాదు, దేశం దేశమంతా. నీకిష్టం కాకపోతే నీవే ఉరి పోసుకుని

చావమంటుంది నీవేదయినా ఒక కొత్త విషయం చెపితే అదే నీకు సమాధి పొమ్మంటుంది. బాబో ఈ దేశంనుంచి పారిపోదామనిపిస్తోంది ప్రాణాలకోసం."83

సమకాలీన కవుల గురించి వారి కవిత్వాన్ని ప్రశంసించే పీఠికా కర్తల్ని గురించి శేషేంద్రశర్మ ఇట్లా అంటాడు. "వట్టి మాటలురాసి ఇదే కవిత్వం పొమ్మంటూ ఉంటే అది నిజమేనని సాహిత్య విమర్శకులు వంత పలుకుతూ ఉంటే, సాహిత్యంతో సంబంధం లేని వాళ్ళు అధికారంలో ఉన్న అకాడమీలు, విశ్వ విద్యాలయాలు దానిమీద అధికార ముద్ర వేస్తూ ఉంటే చివరకు తెలుగు దేశంలో నిజమయిన కవిత్వానికి నిలవనీడ లేకుండా పోయింది. ఒరే వెధవా ఏ శిక్షణా లేకుండా ఎలా రాస్తున్నావురా కవిత్వం అని అడిగే దిక్కే లేకుండా పోయింది. నిర్భయంగా నిజం చెప్పే విమర్శకులు లేకపోవడం తెలుగు సాహిత్యానికి ఎంత దౌర్భాగ్యం. వీళ్ళు విమర్శకులు కారు; స్తోత్ర పాఠకులు, అజ్ఞానులూ కలిసిన ఒక బృందగాన సమాజం. వీళ్ళు తెలుగు దేశంలో కవిత్వాన్ని ఇప్పుడు చంపడమేకాదు, తరతరాలకు మళ్ళీ తలెత్తకుండా చంపుతున్నారు. ఎవడన్నా ఎక్కాల పుస్తక మొకటి రాసి తీసికొస్తే ఇందులో కాళిదాసు పోకడలున్నాయని పీఠికరాస్తాడే - వాడు విమర్శకుడా, గాడిదా, ఎవడు?"84

రెండు కవిత్వ లక్షణాలు :

మంచి కవిత్వానికి శేషేంద్ర శర్మ రెండు లక్షణాలు చెప్పాడు. "కవిత్వం ఎప్పుడూ రెండు లక్షణాలు తృప్తి పరచాలి ఒకటి 'వ్వా' అనిపించాలి; రెండు నాలిక మీద నర్తించగలగాలి. ఈ రెండు లక్షణాలకు అవినాభావ సంబంధం ఉంది. జాషువా, కృష్ణశాస్త్రి వగైరా భావకవుల కావ్యాలకు పూర్వం ఇలాంటి స్థానం ఉండేది తెలుగు దేశంలో. వచన కవులు వచ్చిం తర్వాత చచ్చిందా స్థానం కవులందరికీ."85

వస్తువుకాదు, కవి సృష్టే ప్రధానం :

మనం ఆనందించేది వస్తువునుకాదనీ, వస్తువు ఆధారంగా కవి చేసే సృష్టిననీ శేషేంద్రశర్మ అభిప్రాయం. "వస్తువు కవి సృష్టి కాదుగదా, కుండలినీ యోగాన్ని సుదర్శనంగారు గానీ వాల్మీకిగారు గానీ సృష్టించలేదు. కనక వస్తువే కవిత్వం అనుకునే మూర్ఖులు కవిత్వంలో వస్తువు పాత్ర ఎంతవరకో ముందు

స్పష్టంగా తెలుసుకోవాలి. దానిమీద ఏ మాత్రం అస్పష్ట అభిప్రాయం ఉన్నా వాడు కవి అయితే వాడి కవిత్వం నాశనమవుతుంది. వాడు విమర్శకుడైతే వాడి విమర్శ భ్రష్టమవుతుంది."86

తాత్కాలిక సామాజిక సమస్యలు వస్తువుగా అవసరం వచ్చినప్పుడు, భావావేశం కలిగినప్పుడు రాయడంలో అభ్యంతరం లేదు గాని ఎప్పుడూ అదే రాయడం కృత్రిమత కాదా? నిశాంతం వంటి కావ్యాలు ఏ సామాజిక సమస్యనూ తీర్చలేక పోవచ్చు మరి ఆకలి కవిత్వం వల్ల పరిష్కారమవుతున్నాయా? అని ప్రశ్నిస్తాడు. "తత్కాల ప్రయోజనమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న మనిషి ఎత్తుల నించి జారిపడతాడు. మనిషి జన్మకే ఆధార భూతమైన అంతస్సూత్ర రహస్యాల ఆవిష్కరణ, అనవసరమైన విజ్ఞానం అని ఎవడో మూర్ఖుడు అనుకోవలసిందే. మనిషి ఆకలితో అలమటించినప్పుడు ఆ విజ్ఞానం అనవసరమైనప్పటికీ, ఆకలి తీరగానే మానవజాతికి దాని అవసరం ఉంటుంది. ఆర్థిక సమానత వచ్చిన తర్వాత మనిషి చేతులు ముడుచుకొని కూర్చోడు; వాడి అన్వేషణ వాడి ఉద్యమం నిరంతరం సాగుతూనే ఉంటుంది. ఉన్నతోన్నత లక్ష్యాలవైపు. అది వైజ్ఞానిక పురోగమనం; అది అనివార్యం."87 అంటాడు.

నూత్న మార్గాలు :

"పూర్వ కవిత చిరునవ్వులొలికే అధర సీమల నుంచి జాలువారే ఒక మధుర లహరి అయితే యీ నాటి కవిత స్వకీయ హృదయ కుహరాంతరాలలో నిలుచుని ఏకాకి మానవుడు చేసే అన్వేషణాత్మక 'ఓం' కారోచ్చారణకు విశ్వవ్యాప్త ప్రతిధ్వని తరంగంగా వుంటుంది. ఈ అపూర్వ మానవ సముల్బణానికి ప్రయత్నిస్తున్న మానవప్రతిభకు పూర్వపు శబ్దాలు, అలంకారాలు చాలవు. కనుక యీ నూత్న అంతఃశక్తి సముల్బణ వ్యక్తీకరణకు సాహిత్య ద్రష్టలు నూత్న విధానాలు అన్వేషించ వలసిన అవసరమేర్పడింది. ఇలాంటి విధానాల్లో అత్యాధునికంగా ప్రధానపాత్ర వహించింది సింబాలిజం. కొన్ని భావాలను కొన్ని గుర్తులచేత సూచించడం 'సింబాలిజం' అని చెప్పవచ్చు."88

ఇండియాలో యెందరో ఆ మార్గాన్ని (సింబాలిస్టు) అవలంబించి ఇంగ్లీషులో కవిత చెప్పినవారు వున్నారు కాని ఒక్కరికి కూడా ఆ 'సింబాలిజం'

తాలూకు శిల్పం నిర్వహించడంలో నైపుణ్యం చిక్కలేదు. 'టాగూర్' కవిత ఎంత మధురంగా వున్నా యీ మార్గానికి ఒక్క తరం వెనకటిది. వర్తమాన భారతీయ ఆంగ్ల కవుల్లో ప్రతిభలో కాని భావంలో కాని రచనా పటుత్వంలో కాని 'సెంట్ జాన్ పెర్స్'ని గుర్తుకు తెచ్చే ఒకే ఒక కవయిత్రి 'రాజకుమారి ఇందిరాదేవి ధనరాజ్ గిర్' ఆవిడ ఇటీవలనే ప్రకటించిన 'పార్టింగ్ ఇన్ మెమోసా' అనే కావ్యం చదివితే కాలం, దూరం, మానవతా భావం మొదలైన వాటిని గురించి ఆవిడ చేసే వైజ్ఞానిక సృజనా విన్యాసంలో కన్పించే ఆవిడ ప్రతిభ ఔజ్జ్వలం మాట అటుంచి యీ ఆధునిక కవితా మార్గ నిర్వహణలో ఆవిడ ప్రతిభ 'సెంట్ జాన్ పెర్స్' ప్రతిభకు యెలా సమానస్కంధంలో వుంటుందో విదిత మౌతుంది. ఈ దృష్టిలో తెలుగు కవితా రంగాన్ని సమీక్షిస్తే ఆ కోవకు చేరగలిగిన చేవ వున్న వాడు నా తమ్ముడు విశ్వం ఒక్కడు."[89]

రూపం :

కవిత్వంలో సంక్షిప్తత అవసరమని గుంటూరు శేషేంద్ర శర్మ అభిప్రాయం "ఈ లాంగ్ అయిన లాంగూలాలు కవిత కాదు. కవిత్వం ఎప్పుడూ సాంద్రంగా సంక్షిప్తంగా వుంటుంది. పలచగా పారిపోయే నీళ్ళలా ఉండదు. నన్ను నేనే కోట్ చేసుకుంటే - విశిష్టమైన భావం, విశిష్టమైన భాష తన రక్తంలో ప్రవహించే ఒక అసామాన్యమైన వాక్యం మాత్రమే కవిత్వం అవుతుంది. తద్భిన్నమయినది అకవిత్వమవుతుంది. - తోకల్తోకలుగా వ్రాసుకుంటూ పోవటం మన పితామహుల లక్షణం కానీ మన లక్షణం కాదు. అరడజన్, డజన్ వాక్యాల్లో అంతా ముగించాలి. లేకపోతే వాడు శక్తిలేని కవి అన్న మాట."[90] అన్నాడు 'రేపటి వసంతం' పీఠికలో.

ఆర్. ఎస్. సుదర్శనం 'నిశాంతం'కు పీఠిక రాస్తూ "ఈ కవి గీత పద్యాల్లో కవిత్వం చెప్పాడు. వచన కవిత్వంలో చెబితేనే కానీ కవిత్వం కాదనే రోజుల్లో వచన కవితాసురుల చేతుల్లో పడ్డాడు.... నిజానికి సుదర్శనంగారి గీత పద్యాలు లేక సాధారణంగా ఎవరి గీత పద్యాలయినా, వచన కవిత్వమే."[91] అన్నాడు శేషేంద్ర శర్మ. లఘువైన వృత్తాలతో బరువైన భావం చెప్తారనీ, ప్రౌఢ, భావాభివ్యక్తి వృత్త గమనాన్ని కుంఠితం చేస్తుందనీ పూర్వులు అటువంటి సందర్భాలలో లఘువృత్తాలను వాడారనీ చెప్పాడు. అయినా దీనికీ లఘు

వృత్తానికీ, వచన కవిత్వానికీ సంబంధం ఏమిటి? ఘన వృత్తాలకంటే ఛందః శిల్ప ఖేల తక్కువగా వుండటమే కాబోలు.

అరిపిరాల విశ్వం ప్రస్తుత వచన కవితకు పరిణామ వాదం మూలమంటూ సంప్రదాయం మీద తిరుగుబాటును మూడు విధాలుగా వర్గీకరించాడు. 1. సుస్థాపితమైన, పురాతన సంప్రదాయాన్ని కూకటి వేళ్ళతో పెకలించి వేయడమే ధ్యేయంగా గల ఆవేశ పూరిత ఆశయ రహిత తిరుగుబాటు తత్వం (రెబెల్స్) 2. కేవల పురాసంప్రదాయ పరాఙ్ముఖతతోనే, ఏదో నవ్య మార్గాన్ని సృష్టించ గలమన్న విప్లవ తత్వం (రివల్యూషనిస్ట్స్) 3. ఆవేశ రహితంగా పురా సంప్రదాయం నుంచి కావలసిన మంచిని స్వీకరిస్తూ, ఆలోచనాత్మక పరిణామాన్ని కోరే తత్వం (ఎవల్యూషనిస్ట్స్) ప్రస్తుత వచన కవితకు వెన్నెముక ఈ పరిణామ వాదమే నన్నాడు. ఛందస్సు లేనిదే కవిత్వం నిలవదనే వారి వాదాన్ని ఖండించాడు. ఛందస్సహితత్వ, రహితత్వాలతో కంటే కవితమనకిచ్చే అనుభూతికే ప్రాధాన్య వివక్ష అన్నాడు. "నియతచ్ఛందమైనా - మాత్రాచ్ఛందమైనా - నిర్ముక్తచ్ఛందమైనా - ఏదైనా పలక గల కవియొక్క సంస్కారాన్ని బట్టి, అనుభూతి బలాన్ని బట్టి, తపస్సును బట్టి కవితగా రూపొందుతుంద"[92]న్నాడు. పరిణామం ఆగదన్నాడు. వచనకవితా ప్రక్రియను తిరస్కరించవలసిన అవసరం లేదన్నాడు.

గుంటూరు శేషేంద్ర శర్మ పీఠికల్లో ప్రధానంగా కనిపించే లక్షణాలు:

1. ఆలంకారికులూ, విమర్శకులూ, పాశ్చాత్య, భారతీయ కవుల నుండి పుంఖానుపుంఖంగా కొటేషన్స్ ఇవ్వడం.

2. ప్రతిక్రియ, ఉక్రోషం : తనపై వచ్చిన తీవ్ర విమర్శకు ప్రతిగా ఉక్రోషంతో పేర్లు చెప్పకుండానే దుయ్యబట్టడం. కవులు గాని, విమర్శకులు గాని చదవ కుండా రాస్తున్నారని ఆయన బాధ. "ఈ దేశపు శాస్త్రాల మీద భరించలేనంత ద్వేషం ఉంటే, ఆ శాస్త్రాలు పాతకాలపు చాదస్తుల పుస్తకాలన్న విశ్వాసం మిమ్మల్ని పీక్కు తింటుంటే అవి చదవక్కర లేదు. కానీ కనీసం మీరు ప్రమాణాలుగా ఒప్పుకునేవి ఏవో ఆ పాశ్చాత్య గ్రంథాలన్నా చదవండి. కవిత్వం అంటే ఏమిటో ముందు తెలుసుకోండి. తర్వాత కవిత్వం రాయండి. విమర్శ రాయండి"[93] అంటాడు. తెలుగు దేశపు కవులమీద విమర్శకుల మీదా భయంకర

మైన అపనమ్మకం. ఆయన నినాదాల కవులు, నినాదాల విమర్శకులు అనేది ఎవరిని? విప్లవ రచయితలనే కదా. మార్క్సిజం మీదకాని, సమసమాజం కావాలన్న విషయంలో కాని గుంటూరు శేషేంద్ర శర్మతో సహా విప్లవకవులు, అభ్యుదయ కవులు కానివాళ్ళలో కూడా చాలామంది సహమతి చూపిస్తారు. మార్క్స్ అంత తత్వవేత్త లేడనే విషయం శేషేంద్ర శర్మే చెప్తాడు. ఆధునిక ప్రపంచానికి మార్గం చూపించినవాడుగా గుర్తిస్తాడు. కాని కమ్యూనిస్టులంటే నిరసన ఎందుకో అర్థం కాదు. తిండీ, బట్టా, గూడూ అందరికీ కావాలన్న మాట అందరూ అంగీకరించేదే. అది ఏ ఒక్కపార్టీ మోనోపలీ కాదనడంలోని అభిప్రాయం అన్ని పార్టీలు ఆ దిశకే ప్రయాణం చేస్తున్నాయనా? కాలాన్నిబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో అన్ని పార్టీలూ సోషలిజమే తమ ధ్యేయమంటున్నాయి కాని నిజాయితీగా అంటున్నాయా? ఆచరణలో ఆ మార్గం కనిపిస్తున్నదా? అన్నది విచారించవలసిన అంశం.

విప్లవ కవిత్వంలో నినాదాలు కావలసిన దానికంటే ఎక్కువగానే ఉన్నాయనీ, కేవలం నినాదాలే కవిత్వం కాదనీ మార్క్సిస్టు విమర్శకులే అంటున్నారు. కేవల రాజకీయ సిద్ధాంతాలు కవిత్వం కాకపోవచ్చు కాని రాజకీయ సంబంధముండడమే కవిత్వం కాకపోవడానికి కారణం కాదు. అటువంటి రాజకీయ సంబంధం, సామాజిక స్పృహ లేకపోవడం అనుభూతే కవిత్వానికి ప్రధానమనడం మార్క్సిస్టు విమర్శకుల తీవ్ర విమర్శకు గురికావడమే శేషేంద్ర శర్మ ఈ విధంగా రియాక్ట్ కావడానికి కారణం కావచ్చు. తనను తన కవిత్వాన్ని ప్రజలు గుర్తించడం లేదన్నబాధ స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే మంచి కవిత్వాన్ని ఎవరూ గుర్తించడం లేదనీ, తన మాటలను ఎవరూ స్వీకరించడం లేదనీ వాపోయాడు. ఇది శేషేంద్ర శర్మలోనే కాదు రాజకీయ నిబద్ధత లేని కవులందరిలోనూ కనిపిస్తుంది. ఈ కాలంలో సామాజిక చైతన్య సంబంధమైన కవిత్వం తప్ప మరోరకపు కవిత్వానికి ఆదరణ లేకపోవడం ఇటువంటి ప్రతిక్రియకు కారణం. రాజకీయ సంబంధం తాత్కాలిక అవసరం అయితే కావచ్చు కాని ప్రథమ కర్తవ్యమైంది.

3. ఆధునిక కవిత్వానికి ఏకైక మార్గంగా సింబాలిజాన్ని పేర్కొనడం. ఆర్. ఎస్. సుదర్శనం, అరిపిరాల విశ్వంల రచనలలోని సింబాలిజాన్ని

శేషేంద్రశర్మ చాలా ప్రశంసించాడు. భారతదేశంలో ఇంగ్లీషులో అటువంటి సింబాలిస్టు కవిత్వంలో అగ్రస్థానం ఇందిరాదేవి ధనరాజ్ గిర్‌కు ఇచ్చాడు. ఆర్. ఎస్. సుదర్శనం 'నిశాంతం' లోని సింబాలిజాన్ని "పద్యములన్నియు రూప కాలంకార దీపములు" అన్నాడు విశ్వనాథ సత్యనారాయణ అదే గ్రంథం మున్నుడిలో. "సుదర్శనంగారు ఈ పద్యములు చదువుచుండగా నేను నా చిన్న ప్పుడు అనగా 1926 నకు పూర్వము వ్రాసిన 'గిరి కుమారుని ప్రేమగీతాలు' జ్ఞాపకమునకు వచ్చినవి. ఇంచుమించుగా పద్యములట్లున్నవి"95 అన్నాడు విశ్వనాథ. సుదర్శనాన్ని భార్య యందలి ప్రేమ దివ్యలోకాలలో, దివ్య భావన లలో ప్రవర్తింప జేసిందంటూ "ఇట్టి లక్షణము పూర్వము నేనెఱుగుదును. ఒక మిత్రుని బ్రతుకులో నేను జూచితిని. అతనిపేరు శ్రీ నాయని సుబ్బారావు, అతని సౌభద్రుని ప్రణయ యాత్ర ఇంతటి భావనా మాధుర్యముగల గ్రంథము, ఇట్టి రమణీయ భాషగల గ్రంథము"96 అని కూడా అన్నాడు. విశ్వనాథ సత్యనారా యణ దృష్టిలో ఈ భావాలు, భాష కొత్తేమీ కాదు పూర్వం చూచినవే. ఈ సింబా లిజం ఆయన దృష్టిలో రూపకాలంకారమే. శేషేంద్రశర్మ చెప్పే ఈ గ్రంథాల లోని మిస్టిసిజం కూడా ఆయన దృష్టిలో కొత్తదేమీ కాదు.

4. భాష విషయంలో "భాష లోహం వంటిది. ఎవడి దగ్గర భావ జ్వాల లున్నాయో వాడే దాన్ని ఆ జ్వాలలమీద కాల్చి, కరిగించి శైలిగా, సమాసాలుగా వాక్యాలుగా రేఖలిచ్చి, రూపులిచ్చి వాటిలో ఒక అఖండ జీవ లీల మేల్కొల్పు తాడు. వాడు శిల్పి"97 అంటాడు. "కానీ నీవు చేసే చమత్కారములన్నియు నీవు ఎవడ్ని సంబోధించి నీ మాటలు చెప్తున్నావో వాడికి అర్థం కావాలి కదా? లేక పోతే నీ చమత్కారాలూ, నీచేత ఆ చమత్కారాలు చేయించే ప్రతిభ అన్నీ వ్యర్థమే కదా? మరి అలాంటి వ్యర్థమైన పని ఎందుకు చేయాలి?"98 అని ప్రశ్నించుకున్నాడు. కాని దీనికి విరుద్ధంగా "రాజకీయ వాది అయితే తప్ప కవి అయినవాడు, తన భాష అర్థమయిన పాఠకులసంఖ్య మీదనే ఆధారపడాలి. తన భాష పోల్చుకో గలిగిన వాళ్ళు, తన భాష అంతరాత్మను పసిగట్టగలిగిన వాళ్ళు తన పాఠకులు; ఎక్కువ మంది కోసం ఆశించడం కవి లక్షణం కాదు."99 అన్న కోక్తో మాటల్ని మరోచోట ఉదహరించాడు. "The unquestiona- ble sign of every poet in the prophetic unconscious-

ness, the disturbing faculty of uttering to all men and at all times strange words, whose meanings he him-self dose not comprehend"100 అని లియోన్ బ్లాయ్‌ని ఉదహరించాడు. నీవు తెలిసిన, నిన్ను అర్థం చేసుకోగలిగిన నలుగురి కోసమేనా నీవు రాయడం? మరి అంతా అర్థం చేసుకోవడం లేదని బాధపడడం ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి.

5. కవిత్వంలో వస్తువు కంటే, ఆ వస్తువు ఆధారంగా కవిచేసే సృష్టి ప్రధాన మనడం. ఈ విషయంలో మార్క్సిస్టులు వస్తువుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అభ్యుదయ కవుల్లో కుందుర్తి కథకు ప్రాధాన్యం ఇచ్చాడు.

6. కవిత్వం దీర్ఘంగా ఉండకూడదు. కాని తాను ఒక ఇతి హాసమే రాశాడు కదా. తన కవిత్వ మంతా అరడజను, డజను వాక్యాల కవిత్వమేనా? కవిత్వం ఒడ్డూ పొడుగులను బట్టి కవితా గుణాలను నిర్ణయించ వచ్చా? దీర్ఘమైన కావ్యం రాయడం తక్కువ మాటల్లో కవిత్వం చెప్పేశక్తి లేకపోవడం వల్ల నేనా? అన్న ప్రశ్నలకి శేషేంద్ర శర్మ సమాధానం చెప్పవలసి ఉంటుంది. కవితా గుణానికి అది దీర్ఘమా హ్రస్వమా అన్నది కారణం కాదు. వచన కవిత్వం వల్లనే కవితాస్వాదన తగ్గుముఖం పట్టిందనడం, తాను వచన కవిత్వం రాయడం పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి.

7. తాను, తన సంబంధులు, అనుయాయుల రచనలు చాలా గొప్పవని పొగడడం. ఆర్. ఎస్. సుదర్శనానికి "ఇతడొక గొప్ప కవి సాధారణ కవికాదు -ఒక్క కావ్యం రాసినా గొప్పకవే: నైషధమొక్కటే రాసిన హర్షుడిలా"101 అని మెచ్చుకున్నాడు.

8. కవిలో గాని కావ్యంలోగాని ఎటువంటి దోషమూ చూపించకపోవడం.

చేకూరి రామారావు : 'కొయ్యగుర్రం' - ఆధునిక మహా కావ్యం'.

'కొయ్యగుర్రం' 1977 డిశంబరులోనే మార్కెట్లోకి వచ్చిన 1-1-1978 ప్రజాతంత్ర వార పత్రికలో మొదట అచ్చయింది. 1980 లో పుస్తకంగా అచ్చయింది. దీనికి చేకూరి రామారావు 'కొయ్యగుర్రం ఆధునిక మహాకావ్యం' అన్న

శీర్షికతో పీఠికరాశాడు. ఈపీఠికలో నగ్నమునికవిత్వశైలినిగురించి, కవితాపరిణామం గురించి చెప్పిన విషయాలున్నాయి. అయితే వీటికంటే అధికంగా కొయ్యగుర్రం ఆధునిక మహాకావ్యమని చేసిన ఒక ప్రతిపాదన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.'ఆధునిక మహాకావ్యం' అన్నమాటను వాడినతర్వాత అందులో ఆధునికత, మహాకావ్యం అన్న పదాలను నిర్వచించి ఆధునిక మహా కావ్య లక్షణాలను తెలియ జేయవలసిన అవసరం ఏర్పడింది. పీఠికలో అక్కడక్కడా ఈ లక్షణాలను ప్రతిపాదిస్తూ ఆ లక్షణాలన్నీ ఉన్న తొలి ఆధునిక మహా కావ్యంగా చేకూరి రామారావు కొయ్య గుర్రాన్ని ప్రతిపాదించాడు. ఈ పీఠిక ఈ ప్రతిపాదన మూలంగానే వాద వివాదాలకు లోనయింది. నగ్నముని కవిత్వ గుణాధిక్యం గురించి కాని, కొయ్య గుర్రంలోని ఉత్తమ కవితా లక్షణాలను గురించి కాని ఎవరూ సందేహం ప్రకటించినట్లు కనిపించదు. కొయ్యగుర్రాన్ని మంచి కవిత అని అంగీకరించడానికి ఎవరూ సంశయించలేదు. కాని కేవలం 'ఆధునిక మహా కావ్యం' అన్న చేకూరి రామారావు ప్రతిపాదనను అంగీకరించడానికి మాత్రం ఎవరూ ముందుకు వచ్చినట్లు కన్పించదు. చర్చ అంతా ఈ ప్రతిపాదన మీదే సాగింది.

మహా కావ్యం - ఆధునిక మహా కావ్యం :

"ఒక మహా కావ్యం కావడానికి చాలా విషయాలు కారణమవుతై. కావ్య వస్తువు, కవితా పద్ధతి, రచనా వైవిధ్యం, సందేశం-ఇట్లాంటి విషయాలన్నిట్లోనూ కవి ప్రతిభ వల్ల ఒక కావ్యం మహా కావ్యం అవుతుంది."[102] అన్నాడు రామారావు. అయితే ఈ లక్షణాలన్నింటి వల్ల మహా కావ్యం అయ్యే కావ్యాలు ఉండవచ్చు. కాని అవి ఆధునికం కావలసిన అవసరంలేదు. కాలాన్ని బట్టి అవి ఆధునికం అయినా వాటిని నేటి కావ్యాలనాలి తప్ప ఆధునిక కావ్యాలనగూడదని రామారావు అభిప్రాయం. మరి ఆధునికం కావడానికి ఉండవలసిన ప్రధాన లక్షణమేమిటి?

ఇతి వృత్తలేమి, వచన కవితా రూపం, ఆర్బెనిటీ :

"ఆధునిక కావ్యాలలో వచ్చిన ఒక ప్రధానమైన మార్పు కథను వదిలెయ్యటం. వ్యక్తీకరణలో ఆధునికత కోసం ఇంగ్లీషు 'ఫ్రీవర్స్' అనే వచన కవితా రూపం తెలుగులో బాగా ప్రచారమైంద"న్నాడు.[103] వస్తువు, ఛందస్సులలో ఆధునికి

కరణం ఆధునిక కవిత్వ లక్షణాలని చెప్తున్నట్లయింది. ఈ లక్షణాలు ఆయన అంటున్న నేటి కావ్యాలలో కూడా విస్పష్టంగానే ఉన్నాయి. అయితే "ఎన్నుకున్న వస్తువు, ఛందస్సులలో ఆధునికత మాత్రమే కాక వేదనతోకూడిన ఒక తాత్విక చింతన, వ్యక్తీకరణలో చమత్కారాలకు బదులు సీరియస్‌నెస్ వీటన్నిటి కలయికే అర్బేనిటి" అని అర్బేనిటీని నిర్వచిస్తూ, "ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్విక చింతనతో, సందేశంతో అనేక భావాలతో, మూడ్స్‌తో కథ లేకుండా అర్బేనిటీ అనే లక్షణం కలిగి ఉండి తగినంత విస్తారంగా ఉన్న కావ్యాన్ని ఆధునిక మహాకావ్యం అంటున్నాను."104 అని ఆధునిక మహాకావ్య లక్షణాన్ని ప్రతిపాదించాడు. అర్బేనిటీ అంటే రామారావు చెప్పిన లక్షణం ఎన్నుకున్న వస్తువు, ఛందస్సులలో ఆధునికత, వేదనతో కూడిన తాత్విక చింతన, వ్యక్తీకరణలో చమత్కారాలకు బదులు సీరియస్ నెస్ - వీటన్నిటి కలయిక. వస్తువులో ఆధునికత కథారాహిత్యంవల్ల వస్తుంది. ఛందస్సులలో ఆధునికత ఛందో రాహిత్యం, వచన పద్యంవల్ల వస్తుంది. కాబట్టి కథ లేక పోవడం, వచన కవితగా ఉండడం అన్న రెండు లక్షణాలకు వేదనతో కూడిన తాత్విక చింతన, సీరియస్ నెస్‌లు జోడిస్తే అర్బేనిటీ అన్న లక్షణమౌతుంది. వేదనతో కూడిన తాత్విక చింతన ఉన్న తరువాత వ్యక్తీకరణలో సీరియస్‌నెస్ అనివార్యంగా వస్తుంది. ఈ రెండింటిని వేరువేరుగా చెప్పవలసిన అవసరం లేదు. ఇప్పుడు 'అర్బేనిటీ'కి రామారావు చెప్పిన లక్షణాలను, మహాకావ్యానికి చెప్పిన లక్షణాలను పరిశీలిస్తే రెండో దానిలోని పునరుక్తి స్పష్టమౌతుంది.

అర్బేనిటీ నిర్వచనం :

'అర్బేనిటీ' అన్న లక్షణం రామారావు కొత్తగా చెప్పింది. అందుకే దాన్ని నిర్వచించవలసిన అవసరాన్ని గుర్తించాడు. Urbane అన్న మాటను 'having the polish and suavity regarded as characteristic of sophisticated social life in major cities' అనీ 'reflecting elegance, sophistication etc. especially in expression' అనీ రాండమ్ హౌస్ డిక్షనరీ అర్థం ఇచ్చింది. మామూలు మాటల్లో చెప్తే ఈ 'అర్బేనిటీ'ని తెలుగులో 'నాగరికం' అనవచ్చు. నగర సంస్కృతిని ఆధునిక సంస్కృతిగా నాగరిక వ్యక్తీకరణను ఆధునిక వ్యక్తీ

కరణగా నగరాల ఆలోచనా ధోరణిని ఆధునిక తాత్విక చింతనగా భావించడం వల్ల అర్బేనిటీనే ఆధునికతగా చిత్రించడం జరిగింది. సమకాలీనమైన దానిని నేటి అని, అర్బేనిటీ ఉన్న దాన్ని మాత్రమే ఆధునికమనీ అన్నట్లయింది. నేటి ఆధునికం అన్న మాటలను ప్రత్యేక పరిధుల్లో వాడడంవల్ల ఆధునికం అన్న మాటకు కాల సంబంధమైన అర్థం నశిస్తుంది. అప్పుడు రిలేటివ్ మీనింగ్ పోయి ప్రాచీన దశలోనూ ఈ లక్షణాలున్న రచనలను ఆధునిక రచనలనవలసి వస్తుంది. నేడు వస్తున్న సాంప్రదాయిక రచనలను ప్రాచీన రచన లన్నట్లుగానే నాటి కొన్ని రచనలను ఆధునిక రచనలనవచ్చునేమో. ఇప్పుడు మనం ఆధునిక మహాకావ్యం అంటున్న రచన కూడా భవిష్యత్తులో కూడా ఆధునిక రచనగానే గుర్తింపు పొందాలి. రాబోయే రచనలను అత్యాధునిక రచనలు ఇంకా ముందు రాబోయే రచనలను అత్యంతాధునిక రచనలని ఈ విధంగా ముందు ముందు కొత్త సంకేతాలు ఏర్పరచుకోవలసి వస్తుంది. మహాకావ్యాలయినా, కాకపోయినా రామారావు చెప్పిన అర్బేనిటీ అన్న లక్షణం నేటి కవుల చాలా రచనల్లో విస్తృతంగానే ఉంది. వాటన్నింటిని ఆధునికం అనకుండా కేవలం నేటి కావ్యాలని కొట్టివేయడం జరిగింది. ఆధునికతకు ఆయన చెప్పే లక్షణానికి ప్రమాణాలు చూపలేదు. ఆధునికతను పలువురు పలు విధాలుగా నిర్వచించారు.

విస్తారం :

ఆధునికత ఉన్న తరువాత మహాకావ్యం కావడానికి కావలసిన ప్రధాన లక్షణం 'తగినంత విస్తారంగా ఉన్న దీర్ఘ కవిత'105 కావడం. ఆయన ఆధునిక మహాకావ్య నిర్వచనంలో చెప్పిన 'అనేక భావాలు, మూడ్స్' కలిగించడానికి ఈ విస్తారం అవసరమైంది.

నిర్మాణ బంధం :

ఫిలాసఫీ ఒకటే అయినా భావాలనేకం కావచ్చు. భావాలనేకం అయినా వాటిని కలిపే నిర్మాణ బంధం ఒకటి ఉన్నట్లయితే అది మహాకావ్యమౌతుందని అట్లా కాక వాటినివేటికవే విడదీసి చదువుకునే అవకాశమున్నప్పుడు అఖండత్వం ఉండక ఖండికల సంపుటులే అవుతాయని రామారావు అభిప్రాయ పడ్డాడు "భావ, అభ్యుదయ, విప్లవ కవుల ఖండికల సంపుటులు మహాకావ్యాలుగా భ్రమపడ కూడదు. వాటిల్లో ఏ ఒక్క సంపుటి తీసుకున్నా ఫిలాసఫీ ఒకటే కావచ్చు;

భాషా వైరుధ్యమూ ఉండొచ్చు. కానీ భిన్న భావాలను కలిపే నిర్మాణ బంధం (స్ట్రక్చరల్ టై) లేక పోవడం వల్ల అవి ఖండికల సంపుటులే అవుతై కాని మహా కావ్యాలు కావు." 106 అన్నాడు. ఇక్కడ భాషా వైవిధ్యం అన్న మాటకు అర్థం లేదు. భావ వైవిధ్యం కావచ్చు. 'మహాకావ్యం భావరీత్యా ముక్కలుగా కనిపించినా నిర్మాణరీత్యా అఖండం' అన్నాడు.

ఈ లక్షణాలతోవున్న ఆధునిక మహాకావ్యాలు :

'నాదేశం - నాప్రజలు' (ఆధునిక ఇతిహాసం)

ఈ లక్షణాలను ప్రతిపాదించి "ఈ నిర్వచనంతో కొలిచిచూస్తే కొయ్యగుర్రమే' మొదటి ఆధునిక మహాకావ్యంగా అనిపిస్తున్నది."107 అన్నాడు రామారావు. ఈ లక్షణాలే అధారంగా తీసుకుని పరిశీలిస్తే ఆధునిక మహాకావ్యాలు కాదగిన కావ్యాలు మరేవైనా ఉన్నాయేమో చూడవచ్చు. ఉదాహరణకు గుంటూరు శేషేంద్ర శర్మ 'నాదేశం - నాప్రజలు' తీసుకొంటే కవి దీన్ని 'ఆధునిక ఇతిహాసము' అన్నాడు.

ఇతివృత్తలేమి :

"కృషి చేస్తే కాని బ్రతుకు గడవని వాడు కర్షకుడు. నాగలి పట్టుకొని నేల దున్నేవాడు ఆ జాతికంతా చిహ్నం. కర్షకుడి జీవితంలో ఏ గాథలుంటాయి శ్రమ, శ్రమ, శ్రమతప్ప-కనక ఈ ఇతిహాసంలో కథకోసం చూడకూడదు."108 అంటూ షానామా, రాజతరంగిణి, రఘువంశాలు కథల సముదాయాలనీ, వర్జిల్ 'ఈనియడ్' డాంటే 'డివైన్ కామెడీ' మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' వంటి వాటిల్లో కథలాంటి ఇతివృత్తం లేదనీ, ఆధునిక యుగంలో పాశ్చాత్య దేశాలలో కథారూప ఇతివృత్తం లేని ఇతిహాసాలే వస్తున్నాయని కూడా శేషేంద్రశర్మ పేర్కొన్నాడు.

"ఈ ఆధునిక ఇతిహాసంలో ఏ కథాలేదు. కాని ఒక జీవితగాథ పూలలో దారంలా పరివ్యాప్తమై ఉంటుంది.''109 అన్నాడు శివలెంక ప్రకాశరావు.

వచన కవిత - నిర్మాణ బంధం :

'నాదేశం నా ప్రజలు' వచన కవితే. ఇది కూడా భావ రీత్యా ముక్కలుగా కనిపించినా నిర్మాణ రీత్యా అఖండమైనదే. "A sintillating intellectual theory held in the lines of the Upanishad 'annaath vai purushaha' breathes life into this great modern epic 'my country, my people'. This Upanishadic concept is the cyclic rotation of life. The trees and crops bear fruit and grain, which in the form of food transforms into blood, and then into sperm, which is the cyclic seed of the generation of man. It implies that the 'Purushaha' is already in the fruit and the grain, in the trees and the plants having entered their bodies through the rain and the soil of the earth. In this epic man emotionally feels the direct relationship with the entire world of created things"[110]

పద ప్రయోగం : ప్రతీకలు :

ఆలోచనలకు అవధుల్లేక పోవడంవల్ల అవి తాత్విక స్థాయికి చేరుకోవడం 'నాదేశం - నా ప్రజల'లో కూడా గుర్తింపవచ్చు. ప్రతీకలు కొయ్యగుర్రంలో ఉన్నట్లుగానే నాదేశం - నా ప్రజలలోకూడా ప్రాధాన్యాన్ని వహించాయి. 'కొయ్య గుర్రం'లో ప్రతీకలను వాచ్యం చేయడంవల్ల (వివరించడంవల్ల) నగ్నముని స్పష్టతను సాధించాడు. అటువంటి వివరణ తన కవిత సామాన్యం కావడానికి అవసరమనీ భావించి ఉండవచ్చు. "For writing this work Seshendra Sharma has simplified his diction to reach his people and to record the impact of an age on the third world"[111].

కొద్దిపాటి చమత్కారాలతో గిలిగింతలు పెట్టి అల్పానుభూతిని కలిగించడం కాక సీరియస్ భావాలతో మహానుభూతి కలిగించడం మహాకావ్య ప్రయో

జనం"112 అన్న రామారావు లక్షణానికి నాదేశం - నాప్రజలు కూడా ఒక ఉదాహరణ.

అభ్యుదయాంశ :

"దీనికంతకూ కారణం సర్వత్రా వ్యాపించిన బకాసుర సంస్థ. ఈ వ్యవస్థకు నాంది స్వార్థ శక్తులకు నిలయమైన నేటి రాజకీయాలు. ఈ ప్రబల సత్యం కవి గుండెల్లో బ్రద్దలవుతున్న అగ్ని పర్వతం. గొంతులో గర్జిస్తున్న జలపాతం. అభ్యుదయ తత్వం సంపూర్ణంగా ఉన్న ఈ భావాలూ, శబ్దాలూ ఎప్పుడూ ఎవరి కాళ్ళూ నడవని దేశాలు."113

నగ్నముని 'కొయ్యగుర్రం' అసమర్థ పరిపాలనకు ప్రతీక. అక్కడా ఇక్కడా కవి సందేశం అభ్యుదయాత్మకమే.

"బానిసల్ని తయారు చేసే కర్మాగారాలన్నీ కూలిపోతాయి. కర్మ ఆగి పోతుంది కర్త పారిపోతాడు. దేశం మళ్ళీ శ్వాస పీలుస్తుంది."114 అంటాడు శేషేంద్ర శర్మ.

'కొయ్య గుర్రం' కోసమే కల్పించిన మహాకావ్య లక్షణాలు :

1. పై అంశాలను పరిశీలించినప్పుడు 'కొయ్య గుర్రా' నికి 'నాదేశం - నాప్రజలు' కీ నిర్మాణం విషయంలో చాలా పోలికలు కన్పిస్తాయి. కవి ప్రతిభ వల్లే ఒక కవిత మహా కావ్యమవుతుందన్న రామారావు మాటనే ప్రమాణంగా తీసుకుంటే కవిగా గుంటూరు శేషేంద్ర శర్మ ప్రతిభను ఆయనకూడా శంకించడు. కొయ్య గుర్రం పీఠికలో చేకూరి రామారావు ప్రతిపాదించిన ఆధునిక మహాకావ్యలక్షణాలన్నీ కొయ్యగుర్రానికి ముందే (1975 లోనే) వచ్చిన గుంటూరు శేషేంద్ర శర్మ 'నాదేశం నాప్రజలు'లో కూడా కనిపిస్తూ ఉండగా కొయ్య గుర్రాన్నే తొలి ఆధునిక మహాకావ్య మనడం సమంజసం కాదు.

2. ఎస్టాబ్లిష్డ్ (ప్రమాణీ కృతమైన) లక్షణాలున్నప్పుడు ఆ లక్షణాలన్నీ ఉన్న మొదటి రచన ఇది అని చెప్పడంలో కాలం తప్ప మరొక ప్రమాణం అవసరం లేదు. ప్రాచీనుల లక్షణాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలించినప్పుడు

ఇది మహాకావ్యం, ఇది కాదు అని నిర్ణయించడమూ వాటిలో కాలాన్ని బట్టి పూర్వాపరాలను నిర్ణయించడమూ కష్టంకాదు. అటువంటి ఎస్టాబ్లిష్డ్ నియమాలేవీ లేకపోవడంతో విశిష్టలక్షణాలున్న రచనను ఒక ప్రత్యేక రచనగా విశ్లేషించే ప్రయత్నం విమర్శకుడు చేస్తాడు. ఆధునికకాలంలో కూడా మహాకావ్య, కథా కావ్యాది విషయాల చర్చ విస్తృతంగా జరిగింది. కావ్యానికి కథ అవసరమన్న వాళ్ళూ, తగినంత విస్తృతి కావాలన్నవాళ్ళూ కుందుర్తి ఆంజనేయులు వంటి వాళ్ళు ఉన్నారు. మహాకవి, మహాకావ్యం అన్నమాటలు కొంత శిథిలం (loose) గానే వాడడం జరిగిందికూడా. తాము పీఠిక రాస్తున్న ప్రతికవీ మహాకవి అనీ, కనీసం కాబోయే మహాకవి అనీ, అది మహా కావ్యం అనీ, కాకపోతే మహా కావ్యాలకు తీసిపోదనీ మెచ్చుకొనే పీఠికా కర్తలుండనే ఉన్నారు. అందుకే పీఠికల విషయంలో పాఠకుడు కొంత చులకన భావాన్నేర్పరచు కొన్నాడు.

3. కథ ఉంటే ఒక కావ్యం ఆధునికం కాకుండాపోతుందా? ఆధునికం కావడానికి అర్బనిటీ అన్నది అనివార్యమైన లక్షణమా ? తగినంత విస్తారమంటే అస్పష్టంగా లేదా? వ్యక్తీకరణలో సీరియస్ నెస్ అంటే సాధారణంగా కవులు తమ భావాలను నాన్ సీరియస్‌గా వ్యక్తీకరిస్తారా? ఈ విధంగా ప్రశ్నిస్తూపోతే రామారావు ప్రతిపాదనలోని అస్పష్టత, పునరుక్తులు, సబ్జెక్టివ్ ఔట్ లుక్ వ్యక్తమవుతాయి. ఈ కారణంగానే 'కొయ్య గుర్రం' పీఠిక వాద వివాదాలకు దారి తీసింది.

4. 'కొయ్య గుర్రం' పీఠికలో చేకూరి రామారావు 'కొయ్యగుర్రం' కోసమే కొన్ని లక్షణాలను కల్పించినట్లూ, ఆ లక్షణాలదృష్ట్యా 'కొయ్యగుర్ర'మే మొదటి ఆధునిక మహాకావ్యమని ప్రతిపాదించినట్లూ, స్పష్టమవుతున్నది. అందుకే కొయ్య గుర్రాన్ని తన నిర్వచనంతోనే కొలవ మంటున్నాడు. తన నిర్వచనానికి సరిపోయే రచనలు ఇంకేవైనా ఉన్నాయేమోనని కానీ, వాటిని మరొక రచనకు అన్వయించవచ్చునేమోననిగాని విచారించక పోవడంవల్ల కొయ్య గుర్రమొక్కటే ఏకైక ఆధునికమహా కావ్యమయింది.అసలు ఆయన దృష్టిలో ఉన్నది అది ఒక్కటే. దానికోసమే ఈ సిద్ధాంత ప్రతిపాదన కూడా. అందుకే ఇతర రచనలు దృష్టిపథంలోకి రాలేదు. శేషేంద్ర శర్మ 'ఆధునిక ఇతిహాసా'నికీ రామారావు 'ఆధునిక మహాకావ్యాని'కీ భేదమేమీ లేదు.

ఉద్యమేతర కవిత్వంలో సామాన్య లక్షణాలు :

ఉద్యమేతర కవిత్వంలో ప్రప్రథమ సామాన్య లక్షణం వైయక్తిక దృష్టి. వ్యక్తి ఇష్టాయిష్టాలు, ఆసక్త్యానాసక్తులు ఈ పీఠికల్లో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. సమకాలీన ప్రభావం వ్యక్తిపై వున్నా, తానో ఆలోచనా స్రవంతిలో భాగం కానపుడు వ్యక్తి రియాక్షనరీగా మనకు కనిపిస్తాడు.

రూపం :

రూపంలో ఉద్యమేతర కవులు సాధించినదేమి లేదు. సంప్రదాయ, ఆధునిక ధోరణులు సమానాంతరంగా కన్పిస్తూనే వుంటాయి. వచన కవిత్వాన్ని ఆహ్వానించిన కవులూ, పీఠికాకర్తలు, ఛందోబద్ధకవిత్వాన్ని తిరస్కరించలేదు. 'పద్య కళ తెలుగుకు ప్రత్యేకమైందనీ, అందుకే తనకిష్టమనీ' అంటాడు బోయి భీమన్న. 1975లో రాస్తూ తెలుగునాట పద్యకవిత్వానికి కాల దోషం పట్టిందనీ పద్యకవిత్వం చదివేదిక్కు లేకుండా పోతున్నదనీ వాదించే వారి నోళ్ళు మూయించేటట్లుగా కవిత్వంలో క్రొత్త లోకం చూపించే పద్యకావ్యాలు మరోపక్క పుట్టేవి పుడుతూనే ఉన్నాయన్నాడు వాసిలి వేంకట లక్ష్మీ నరసింహారావు. ఎవరి పద్యాలయినా వచన కవిత్వమే నని సిద్ధాంతీకరించాడు గుంటూరు శేషేంద్ర శర్మ. అంటే కాలంతో పాటు వచ్చే మార్పుతో ప్రభావితమైన వారూ, కాక సంప్రదాయాన్ని అనుసరించిన వారూ ఒకే కాలంలో ఉన్నారు. అయితే సంప్రదాయ పద్య కవిత్వాన్నెవరూ తిరస్కరించక పోగా తమ తమ ధోరణుల్లో వాటిని సమర్థించారు. అందుకే అరిపిరాల విశ్వం 'నియతచ్ఛందమైనా - మాత్రాచ్ఛందమైనా-నిర్ముక్తచ్ఛందమైనా-ఏదైనా పలకగల కవియొక్క సంస్కారాన్ని బట్టి అనుభూతి బలాన్ని బట్టి తపస్సునుబట్టి కవితగా రూపొందుతుంద'న్నాడు.

భావం :

ఈ పీఠికల్లో ప్రధానంగా చోటుచేసుకున్నది కవిత్వ విమర్శ. కవిత్వేతర విమర్శలో ప్రముఖంగా సామాజిక దృక్పథం కనిపిస్తుంది. అందరిలో కనిపించే సామాన్య విషయం రాజకీయాలను పరిహరించడం.

కవిత్వ విమర్శ :

కవి-దర్శిష్ఠ : కవిని ద్రష్టగా భావించారు చాలమంది. మహాకావ్య నిర్మాణంలో కావ్యకర్తకు ఋషిత్వ సిద్ధి ఆవశ్యకమని రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ అభిప్రాయం. గుంటూరు శేషేంద్ర శర్మ కవి ద్రష్ట కావాలంటాడు. అతడు త్రికాలా బాధ్యుడంటాడు.

మహాకావ్యం :

'గొప్ప కావ్యములలో భావములకును అభిప్రాయములకును, తగినంత గొప్పదనమును, బలమును ఇట్టివి రూపుగొల్పుటకు వలసినంత పూర్వోత్తర సంద ర్భములను వివరించుట కవకాశమున్నది' అని రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ సామాన్య మహాకావ్యలక్షణం చెప్పాడు. గుంటూరు శేషేంద్రశర్మ, చేకూరి రామా రావులు ఆధునిక మహాకావ్య లక్షణాలను పేర్కొన్నారు. తన ఆధునిక ఇతి హాసానికి లక్షణాలుగా ఇతివృత్తలేమి, వచన కవితా రూపం, విస్తారం, నిర్మాణ బంధాలు గుంటూరు శేషేంద్రశర్మ చెప్పుకుంటే, చేకూరి రామారావు 'కావ్య గుర్రం' పీఠికలో పైవే కాక అర్బేనిటీ అన్న మరో లక్షణాన్ని కూడా చేర్చాడు.

వస్తువుకు కాక, కవితా శక్తికే ప్రాధాన్యం :

వస్తువుకు కాక కవితాశక్తికే ప్రాధాన్యత నిచ్చినవాడు విశ్వనాథ సత్యనారాయణ. ఇతివృత్తాన్ని పూర్తిగా పరిత్యజించాలన్న గుంటూరు శేషేంద్ర శర్మ కూడా కవితా శక్తికే ప్రాధాన్యమిచ్చాడు. ప్రతీకవాద లక్ష్యంతో రాసిన గుంటూరు శేషేంద్రశర్మలో ఈ లక్షణం సుస్పష్టం.

కవిత్వేతర విమర్శ :

హిందూ మతం, వర్ణవ్యవస్థ, కులతత్వం :

హిందూమతాన్ని, అది సృష్టించిన వర్ణవ్యవస్థను, కులతత్వాన్ని తూర్పార బట్టాడు బోయి భీమన్న 'పుట్టుకతోనే కులం వస్తుందని ఏనాడైతే ఎవరు వక్ర భాష్యం చేశారో ఆనాటినుండే భారత జాతి పతనం ప్రారంభమయిం'దన్నాడు. కుల నిర్మూలన చట్టం చేయాలన్నాడు ఆయన. అయితే హేతువాది త్రిపురనేని రామస్వామి కుల నిర్మూలనం కోరక బ్రాహ్మణేతర లోకాన్ని కూడగట్టాలని

ప్రయత్నం చేశాడు. వేదాలు, ఉపనిషత్తుల నంగీకరించాడు. పౌరోహిత్యం మీద కాక బ్రాహ్మణ పౌరోహిత్యం మీద వ్యతిరేకత చూపించాడు. పురాణాలన్నిటా బ్రాహ్మణాధిక్యతే వుందని రామస్వామి చౌదరి విమర్శించాడు. బోయి భీమన్న ఆర్షమతాన్ని, పురాణాలను సమర్థించాడు.

రాజకీయాలు :

రాజకీయాలు చాలామందికి పరిహార్యాలు. బోయి భీమన్నకు ఇజాలు, మతాతత్వాలు ఇష్టంలేదు. అయితే సోషలిస్టు వ్యవస్థను కాంక్షించాడు. అనుభూతి వాది యైన గుంటూరు శేషేంద్ర శర్మ కూడ మార్క్స్ అంత తత్వవేత్త లేడనే విషయం అంగీకరించాడు. అయితే ఆయనకు రాజకీయ స్పృహ వున్న కవిత్వం నినాద కవిత్వం.

అంకితం :

ఫ్యూడల్ వ్యవస్థలో ఒక భాగంగా సాగిన అంకితాలు ఉద్యమేతర కవిత్వంలో సర్వసాధారణ మయ్యాయి. జాషువా, బోయి భీమన్న, కరుణశ్రీ, నీలా జంగయ్య మొదలయిన వాళ్ళెందరో తమ కవితల్ని అంకితమిచ్చారు. అభ్యుదయ కవులు కూడ తమ కావ్యాలను అంకిత మిచ్చారు. గుంటూరు శేషేంద్ర శర్మ తన కావ్యాలను భార్య కంకిత మిచ్చాడు.

కవిత్వేతర ప్రక్రియలు

నాటకం, నవల, కథానిక, సాహిత్య విమర్శలలో మొదటి మూడు సృజనాత్మక ప్రక్రియలు. సృజనాత్మక ప్రక్రియల పీఠికలు సాహిత్య విమర్శకు తోడ్పడతాయి. సాహిత్య విమర్శ గ్రంథాల పీఠికలు కూడా అందుకు ఉపయోగ పడతాయి. అందుకే ఈ ప్రక్రియలను గూర్చి ఈ ప్రకరణంలో చర్చించడం జరుగుతుంది. అయితే రాశిలో గ్రంథరచన ఎక్కువే అయినప్పటికీ వాటి పీఠికల సంఖ్య పరిమితం కావడమూ వాటిలో వ్యక్తమయ్యే సాహిత్య విమర్శ కూడా పరిమితమే కావడమూ వల్ల ఒకే ప్రకరణంలో వీటిని చర్చించడం జరిగింది.

ఆయా ప్రక్రియల ప్రారంభకాలంలో ఆ ప్రక్రియలలో రచనలు చేసిన వారిలో ఎక్కువమంది కవిత్వం రాసినవాళ్ళే. కాబట్టి కవిత్వ రచనలకు పీఠిక లున్నట్లే వాటికీ పీఠికలు వచ్చాయి.అయితే తరువాతి కాలంలో కొంత ప్రత్యేకీకరణ జరిగింది. కేవల నవలాకర్తలు, నాటక కర్తలు, కథానికా రచయితలు బయలు దేరారు. ఈ ప్రక్రియలు జనరంజక ప్రక్రియలు కావడం, వ్యాపార దృష్ట్యా ప్రత్యేక ప్రచారం అవసరం లేకుండానే వ్యాప్తి ఉండడంవల్ల వ్యాపార దృష్టితో చేసిన రచనలకు పీఠికల అవసరం పెద్దగా లేకపోయింది. యశఃకాంక్ష కలిగిన రచయితలూ, తామెందుకు రాస్తున్నారో చెప్పుకోవలసిన అవసరం ఉందని భావించిన రచయితల రచనలకు మాత్రమే పీఠికలు అనివార్యమయ్యాయి. అందుకే ఈ ప్రక్రియలలో హేతువాదుల నాటకాలకు వచ్చినట్లుగా విపులమైన పీఠికలు అరుదుగా కనిపిస్తాయి. విస్తృతమైన సాహిత్య సిద్ధాంత చర్చలుకూడా చాలా అరుదు. అందుకే ఈ ప్రక్రియలకు సంబంధించి పీఠికలు చెప్పేది కవిత్వ గ్రంథాల పీఠికలు చెప్పేదానికంటే కొంత తక్కువే అయినా, వీటి విషయంలో సాహిత్య విమర్శలో విడిగా వచ్చిన విమర్శ కూడా అంత గణనీయం కాక పోవడంవల్ల ప్రయోజనకరమైందే.

నాటకం :

ప్రారంభదశ : ఆంగ్లనాటకానువాదాలు :

తెలుగులో నాటక రచన క్రీ. శ. 1860కు పూర్వం లేదు. కోరాడ రామచంద్రశాస్త్రి 1860లో రచించిన మంజరీమధుకరీయమే తొలితెలుగు నాటక మంటున్నారు. 1860-80 మధ్యకాలంలో కొన్ని సంస్కృత నాటకాలు తెలుగు లోకి వచ్చాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో షేక్స్పియర్ నాటకానువాదాలు కూడా వచ్చాయి. 1876 లో ప్రచురితమైన సీజరు చరిత్రమే తెలుగులో తొలి ఆంగ్ల నాటకానువాదం. వావిలాల వాసుదేవశాస్త్రి రచించిన ఈ నాటకానికి ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పీఠికలున్నాయి. తెలుగులో నాటకరచనే అపూర్వం కాబట్టి రచనా విషయంలో అవలంబించవలసిన విషయాల చర్చే ఈ పీఠికలలో ప్రధానంగా గోచరిస్తుంది. తెలుగు పుస్తకాలు విభిన్న ఛందాలలో కూర్చడం సాధారణం. అయితే ఇంగ్లీషులో అయాంబస్ ఛందంలోనే పూర్తిగా నడిచిన గ్రంథాన్ని విభిన్న వృత్తాలలో నడపడం ఉచితంగా ఉండదని, ఇప్పటి వారికి నాటకరీతిలోనే ఆసక్తి ఎక్కువని మిత్రులు సలహా ఇవ్వడంతో మొత్తం నాట కాన్ని కేవలం తేటగీతిలోనే రచించానని కవి చెప్పుకున్నాడు. గ్రంథమంతా షేక్స్పియర్ రచననే అనుసరించినా "ప్రకరణానుకూలముగా నచ్చటచ్చట గొంత చేర్పఁబడె"[1] నని కూడా చెప్పుకొన్నాడు. ఆంగ్లపీఠికలో "I have done my best to introduce Hindu custom and manners where I could"[2] అని చెప్పాడు.

1880 లో గురుజాడ శ్రీరామమూర్తి షేక్స్పియర్ 'మర్చంట్ ఆఫ్ వెనీస్' నాటకాన్ని 'వెనీసు వణిజ నాటకము' అనే పేరుతో అనువదించాడు. "అవి (పూర్వం అనువదింపబడ్డ ఆంగ్ల నాటకాలు) నాటకులకు పాఠకులకు వలయు వివిధ వృత్తంబులచే నొప్పకుంట యొక కొఱతగ నిశ్చయించి యిప్పడే నా యిర్వురఁదనియించుట కీ త్రోవం ద్రొక్కితిని"[3] అని చెప్పుకున్నాడు పీఠికలో కవి. పేర్లు మార్చకుండా యథాతథంగా ఉంచానని, ప్రాచీనగాథలలో ఆయా గుణగణాలకు ప్రసిద్ధులైన వ్యక్తుల నామాలను ఉపమానంగా వాడేటప్పుడు, విదేశీయులకు ఆ పేర్లతో, కథలతో పరిచయం ఉండదు కాబట్టి వ్యర్థ మౌతుందనీ, అందుకే ఆ గుణాలనే వాడుతున్నాననీ చెప్పుకున్నాడు.[4]

సాంఘిక నాటకరచన 1880 ప్రాంతంలో మొదలైంది. వావిలాల వాసుదేవశాస్త్రి 'నందకరాజ్యము' మొదటి సాంఘిక నాటకంగా భావిస్తున్నారు. స్వతంత్ర నాటకంలో కూడా ఒకే ఛందం వాడే సంప్రదాయాన్ని ఈ నాటకంలో వాసుదేవశాస్త్రి పాటించాడు. "ఒక తేటగీతిలోనే వ్రాయుటవల్లఁ జదువు వారికి విసుగు పుట్టునని కొందఱన్నారని విన్నాను గాని, నాకు మాత్రము సహజమగు వాక్ప్రవాహమునకు దీనిలో నున్నంత సమమార్గము తక్కిన వానిలో లేదని స్పష్టముగా దెలిసియున్నది"5 అన్నాడు కవి. ఈ అనువాద నాటకాలకు అంతగా ప్రచారం రాలేదన్న విషయం నందక రాజ్యపీఠికలో "నేను వెనుకఁ దెనిగించిన 'సీజరు నాటకము'ను మనవారు చాలమంది చదివినట్లే కనఁబడదు" అన్న మాటల వల్ల స్పష్టమౌతుంది.

సంస్కృత నాటకానువాదాలు :

క్రీ. శ. 1872 నాటికే సంస్కృత నాటకాల అనువాదం ప్రారంభమైంది. 1880 తర్వాత నాటక ప్రదర్శన ప్రచారంలోకి వచ్చేదాకా నాటక రచన విరళంగానే సాగింది. ప్రదర్శన మొదలు కావడంతోనే నాటక రచన వేగాన్నందుకుంది. సంస్కృత నాటకాలు ధారాళంగా అనువదితమయ్యాయి. స్వతంత్ర నాటక రచనకూడా ప్రచురమయింది. నాటక ప్రక్రియ తెలుగులో కొత్తది కాబట్టి ఉపయోగించవలసిన భాషా రూపాలు, ఛందస్సుల విషయంలో స్పష్టమైన సంప్రదాయం లేకపోవడం చేత అనేక ప్రయోగాలు జరిగాయి. ఉత్తమ, మధ్యమ పాత్రలకు తత్సమ బహుళమైన తెలుగునీ, స్త్రీ నీచపాత్రలకు తద్భవ దేశ్య బహుళమైన తెలుగునీ కోరాడ రామచంద్రశాస్త్రి ప్రయోగిస్తే, కొక్కొండ వేంకటరత్నం అన్ని పాత్రలకు గ్రాంథిక భాషనే వాడాడు. సంస్కృత నాటకంలో శ్లోకం ఉన్నచోట పద్యాన్ని, గద్యం ఉన్నచోట గద్యాన్ని రాశాడు. పరవస్తు వేంకట రంగాచార్యులు సంస్కృత నాటకాలలోని సంస్కృత భాగాన్ని తత్సమంతో కూడిన తెలుగులోకి, ప్రాకృత భాగాన్ని కేవలం అచ్చతెనుగులోకి అనువదించాడు. 1891 లో వేదం వేంకటరాయశాస్త్రి నాగానంద నాటకాన్ని అనువదించాడు. ఇందులో సంస్కృత భాగాన్ని గ్రాంథికంలోనూ, ప్రాకృత భేదాలను గ్రామ్య భేదాలలోనూ వేంకట రాయశాస్త్రి రచించి దీన్ని పాత్రోచిత భాష అన్నాడు. అయితే 1880 లోనే తమ ప్రహసనాలలో కందుకూరి వీరేశలింగం సజీవ భాషను

ప్రయోగించాడు. 1897 లో ప్రచురింపబడ్డా 1892లోనే ప్రదర్శితమైన గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం పూర్తి వ్యావహారిక భాషలో రచితమైన సమగ్ర నాటకం. గద్య పద్యాత్మకమైన నాటకాలు రాసే సంప్రదాయమే ప్రచురంగా ఉండగా కేవలం గద్యంలోనే రాసే పద్ధతికూడా మొదలయింది. తరువాత్తరువాత గద్య పద్యాత్మకమైన సంస్కృత నాటకాలను కేవలం గద్య నాటకాలుగా కూడా అనువదించారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు :

ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1886 ప్రాంతంలోనే నాటకరచనకు పూనుకొని సుమారు 30 నాటకాలు రాశాడు. వీటిలో మొదటిది 'చిత్రనళీయం' చిత్రనళీయం పీఠికలో ఆనాడు నాటక రచనంలో తాము పడ్డ శ్రమను వివరించాడు. 1887లోనే ప్రదర్శన జరిగినా తర్వాత ఎంతోకాలానికి ముద్రించిన 'విషాదసారంగధర' నాటకం తెలుగులో తొలి విషాదాంత నాటకం. ఎప్పటి కప్పుడు నాటకాలు రచించి ప్రదర్శింపజేసే కార్యక్రమంలో మునిగి తేలుతుండడం వల్లనే వీటి ప్రచురణ విషయంలో అలక్ష్యం జరిగినట్లు ఆయన విషాద సారంగ ధర పీఠికలో పేర్కొన్నాడు. మిత్రుల బలవంతంవల్ల ముద్రణకు పూనుకొన్నట్లు చెప్పుకొన్నాడు.[6] ఈ నాటక కథకు ఉన్న మూలకథలను పేర్కొని తాను చేసిన మార్పులను వివరించాడు. ఈ కథయే నాటక రచనకు తగినది కాదన్న వారికీవిధంగా సమాధానం చెప్పాడు. "ఈ కథయే అప్రశస్తమనియు సవతితల్లి కుమారుని మోహించుట దుర్నీతిదాయకమనియు నాటకమునకుఁ దగినది కాదనియుఁ గొందరి యభిప్రాయము. నీతియుదుర్నీతియుఁ బరస్పరాధారములు గల్గినవి. దుర్నీతి యించుకైనన్ ప్రకటింపకున్న నీతికిఁ గాంతి గలుగదు. రావణుని దుర్నీతి లేకున్న శ్రీరామున కంతకీర్తి గలుగునా? దుర్యోధనుని దుర్నీతి లేకయున్నఁ బాండవుల కంతటి ఖ్యాతి కలిగియుండునా? కావున నీతి కుదర్పవలెనన్న, దుర్నీతి నించుక ప్రకటించియే తీరవలెనని నా సవినయ విజ్ఞాపనము. రుచి భేదములు నభిప్రాయభేదములున్న నుండుగాక."[7]

నాటకాన్ని విషాదాంతంగా రాయడానికి కల కారణాలనుకూడా ఆయన వివరించాడు. "ఈ నాటకము విషాదాంతముగా నొనర్పఁబడియున్నది. ఇది క్రొత్త పద్ధతి యగుట యెఱుఁగని వాఁడఁగాను. ఆంగ్లేయ భాషయందిట్టి విషాద

నాటకములనేకములు కలవు. నీతిబోధ విషాదనాటకములయందువలె మంగళాంత నాటకములయందుఁగలుగఁ జాలదని నాకుఁదప్పని యభిప్రాయము కావున నీ క్రొత్త పద్ధతి ననుసరించితి."8 ఈ కథను సుఖాంతం చేయడానికి కల్పించిన అంశాలు అసహజాలనీ, సత్పురుషులకు సుఖాన్నీ, దుష్టులకు దుఃఖాన్నీ వర్ణించడమే సమంజసనీయమనే వాదం సరైంది కాదనీ, లోకంలో ఎందరో సత్పురుషులు దుఃఖాన్ని పొందడం చూస్తూనే ఉన్నామనీ, ఇదే సహజమనీ వాదించాడు.

నాటక రచనలో మొదట నాటకమంతా వచనంలో రాసి తర్వాత నటులను దృష్టిలో పెట్టుకొని తగినట్లు పద్యాలు, పాటలూ రాయడమనే పద్ధతిని ధర్మవరం రామకృష్ణమాచార్యులు అవలంబించాడు. అయితే నాటకాన్ని అచ్చువేసేటప్పుడు మాత్రం వీటిలో ముఖ్యమైన ఏ కొన్నింటినో తప్ప తక్కిన వాటిని అనుబంధంలో ముద్రించే పద్ధతిని అనుసరించాడు. "ఈ నాటకమునందలి పాటలొకటి రెండు తప్పఁ జిత్రనళీయమునందువలె ననుబంధముననే ముద్రింపఁబడియె. నాటకమునందలి యనుబంధముల సంఖ్యల నెత్తి చూచిన నయ్యెడనుండగల గేయములు తెలియు"9 నన్నాడు.

వేదం వేంకటరాయశాస్త్రి :

వేదం వేంకటరాయశాస్త్రి నాటకాలలో ప్రతాపరుద్రీయము, బొబ్బిలి యుద్ధము. ఉషా నాటకములు స్వతంత్రాలు. తక్కినవి అనువాదాలు. ఉత్తర రామ చరిత్రము వంటి అనువాదాలకు సుదీర్ఘమైన పీఠికలు రచించాడు. నాటక కథ, పాత్రలు, రసము, నాటక లక్షణ సమన్వయము, మూలకర్త మొదలైన విషయాలు వేంకటరాయశాస్త్రి పీఠికలలో ప్రాధాన్యత వహిస్తాయి. నాగానంద నాటకాన్ని ఆంధ్రీకరిస్తూ "మనవారు మేఁకదాఁటుగా చిరకాలము పురాణములనాంధ్రీకరించి తర్వాత ప్రబంధముల వెసివి యిపుడు అన్యములం దొడంగినారు. మఱియు గీర్వాణ నాటకముల నెఱింగియు హూణ నాటకములం జదువువఱకు నాటకముల వ్రాయరైరి. గీర్వాణ కథల నెఱింగియు హూణనవలలం గాంచిన దనుక నవలల వ్రయింబడరైరి. మఱి గద్యకవన మొక ప్రజ్ఞ కాదఁట. ఆ భావముచే నవలలు లేకపోయినవి. నాటకములు వ్రాయమికి అట్టి కారణమే యొకటి గలదు" అని అప్పటికి నాటక రచన విరళంగా ఉండడానికి కారణాలు సూచించే ప్రయత్నం చేశాడు. బొబ్బిలి యుద్ధ నాటకంలో గాని, ఉషా

నాటకంలోగాని పీఠికలలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. నెల్లూరు లోని ఆంధ్ర భాషాభిమాని సమాజం కోసం రచించినట్లు చెప్పుకున్నాడు. ఏ నాటకానికి పీఠిక రాసినా కథా సూత్రాన్ని మాత్రం వేదం వేంకటరాయశాస్త్రి తప్పకుండా వివరిస్తాడు. ఇది ప్రతాపరుద్రీయ నాటకంలో కూడా గమనించ వచ్చు.

గురజాడ మహోదయం :

19 వ శతాబ్దంలో వచ్చిన నాటకాలలో చాలావాటికి అవి అనువాదాలైనా, మౌలికాలయినా ఇంగ్లీషులో పీఠికలు రాసే సంప్రదాయం కనిపిస్తుంది. కొన్నిటికి ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లోనూ పీఠికలున్నాయి. గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం **1892** లోనే ప్రదర్శితమైంది. దీని మొదటి ప్రచురణ 1897 లో జరిగింది. 1897 జనవరి 1 వ తేదీన రాసిన ఈ పీఠిక చిన్నదే అయినా అనేకాంశాలను చర్చించింది. తాను తీసుకున్న సమస్య, ప్రక్రియ వాడిన భాషలకు సంబంధించిన విషయాలను చాలా స్పష్టంగా గురజాడ చర్చించాడు. ఆనాడు విశాఖపట్నం జిల్లాలో జరుగుతూ ఉండిన బ్రాహ్మణుల కన్యాశుల్క వివాహాలూ, కడుపులో ఉన్న పిల్లల దగ్గర్నుండీ, 5, 6, ఏళ్ళ వయస్సు పిల్లల వరకూ జరుగుతూ ఉండిన బేరసారాలూ సమాజానికి చాలా అవమానకరమైన వనీ, ఇటువంటి ఆచారాలను వెల్లడి చేసి, ఉన్నత ప్రమాణాలకు చెందిన నైతిక భావాలను ప్రచారం చేయడంకంటే సాహిత్యానికి మరో పరమ ప్రయోజనమేమీ లేదనీ అన్నాడు.10

తాను నాటక ప్రక్రియనే స్వీకరించడానికి కారణ మేమిటి? సామాన్య ప్రజలలో చదివే అలవాటు పెరిగే వరకు ఆరోగ్యకరమైన ఆచార వ్యవహారాలను ప్రచారం చేయడానికి నాటక రంగం కంటే గత్యంతరం లేదన్నాడు. అందుకే కన్యాశుల్క రచనకు నాటక ప్రక్రియనే ఎన్నుకొన్నా నన్నాడు నాటక రచనకు తాను వాడుక భాషనే స్వీకరించానని చెప్తూ అది సామాన్య ప్రజలకు బాగా అర్థం కావడమేకాక, హాస్యరసాభి వ్యక్తికి అదే తగినదని కూడా పేర్కొన్నాడు. ఛందోబద్ధ రచన నాటకంలో సంభాషణలకు అడ్డంకి అనీ, నాటక రచనకు ప్రాచీన సంప్రదాయమే అనుసరణీయం అయినా తెలుగులో అసలు నాటక సంప్రదాయమన్నదే నామమాత్రం కావడం చేత వివరిమార్గాన్ని వారు ఎంచు

కానే స్వేచ్ఛ కలుగుతున్నదనీ, ప్రపంచంలో ప్రస్తుత కాలంలో నాటక రచనకు వచనమే ప్రచారాన్ని పొందుతున్నదనీ అన్నాడు. గ్రామ్య భాష అని తప్పుగా పిలుస్తూ ఉన్న భాష ప్రయోజనాన్ని అంచనాకట్టే కొత్త ప్రమాణాలను భాషా శాస్త్రం నెలకొల్పిందన్నాడు. వాడుకలో లేని పదాలు, వ్యాకరణ రూపాలు, గణయతి ప్రాసల పద్య రచన, విపరీతంగా ప్రవేశపెట్టిన సంస్కృత పదాలు గ్రాంథిక భాషను పూర్తిగా చంపివేశాయనీ, వ్యావహారిక భాషకు దగ్గరగా ఉండే సాహిత్య భాష కావాలనీ, సమర్థులయిన రచయితలు పూనుకుంటే అటువంటి ఉమ్మడి సాహిత్య భాషను సృష్టించడం కష్టం కాదనీ అన్నాడు గురజాడ.[11]

కందుకూరి వీరేశలింగం బ్రాహ్మ వివాహానికి, తన నాటకానికీ ఉన్న సమాన భావాలను గుర్తించాడు గురజాడ. అయితే హాస్యం, పాత్ర చిత్రణ, సంశ్లిష్టమైన కథా సంవిధాన నిర్మాణం విషయాలలోనూ, ఇతివృత్త నిర్మాణ పద్ధతిలోనూ పూర్తి భేదముందన్నాడు గురజాడ.[12] 1909లో ప్రచురించిన కన్యాశుల్క నాటకం ద్వితీయ ప్రచురణకు గురజాడ మొదటి పీఠిక కంటే కొంచెం విస్తృతమైన పీఠిక రాశాడు. తమ మిత్రుడు ఎస్. శ్రీనివాసయ్యంగార్ సలహాలననుసరించి ఈరెండో ప్రచురణ కొద్ది మార్పులతో చేద్దామనుకున్నదాన్ని దాదాపు ఒక కొత్తనాటకంగా తయారు చేయవలసి వచ్చిందన్నాడు గురజాడ. సంఘ సంస్కరణనూ, వాడుక భాషనూ ఏమాత్రం సహించలేని కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు తప్ప నాటకాన్ని అందరూ ఆదరించారనీ, కొద్ది వారాలలోనే ప్రతులన్నీ అమ్ముడయ్యాయనీ, మిత్రుల బలవంతంవల్ల ఇప్పుడు ఈద్వితీయ ముద్రణ కార్యక్రమాన్ని చేపడుతున్నాననీ చెప్పాడు. ఈ పీఠికలో ముఖ్యంగా తెలుగు రచయితలు పుస్తక ప్రచురణలో పడేపాట్లు వివరించాడు.

ఆనాటి నాటకాల పరిస్థితిని కూడా గురజాడ వివరించాడు. మరాఠా నాటక కంపెనీలు ఇక్కడ నాటకాలాడుతూ ఉన్నాయని, తెలుగు కంపెనీలు వాటినే అనుసరిస్తున్నాయనీ, తమకు అర్థంకాని ఆ నాటకాలను, జనం ఉత్సాహంగా చూస్తున్నారనీ, ఈ నాటకాలలో ఉండే మెరిసే దుస్తులూ, గిలిగింతలుపెట్టే డాన్సులూ, భయంకరమైన సంగీతం, బూటకపు యుద్ధాలూ కన్యాశుల్కంలో లేకపోయినా, దాని విజయం వాడుక భాష సాఫల్యాన్ని నిరూపించిందన్నాడు గురజాడ. తాను నాటకాన్ని ప్రచురించడానికి కాక సంఘ సంస్కరణకూ,

నాటకరంగానికి వాడుక భాష పనికివస్తుందని నిరూపించడానికి రాశానని చెప్పుకొన్నాడు.[13]

హిందీ నాటకాలు వెనుకబడ్డందుకు సంతోషించాడు. అయితే సరైన థియేటర్లు, నటులు లేక పోవడమూ, ఆధునిక జీవితంలోని సంశ్లిష్ట సామాజిక పరిస్థితులను ప్రహసన రచనకుతప్ప రచయితలు నిర్లక్ష్యం చేస్తుండడమూ, టెక్నిక్ లేకపోవడమూ మొదలైన కారణాలు తెలుగు నాటక రంగం దుస్థితిని తెలియజేస్తున్నాయనీ, రచానా నైపుణ్యంలోని ఈ లోపాలకు కళాశాలల్లో ఆంగ్ల సాహిత్య బోధనలోని లోపాలే కారణమన్నాడు గురజాడ.[14]

వాడుకభాష ఉపయోగాన్ని తెలుగు రచయితలు గుర్తించక పోవడానికి గురజాడ ఆశ్చర్యపోయాడు. మెకెంజీ ప్రాంతీయ చరిత్రలలోని తెలుగు వచనం అనేక గ్రాంథిక భాషా రచనలకంటే ఉత్తమంగా ఉందనీ, కందుకూరి వీరేశలింగం పంతులు మొదటి సంపుటంలోని వాడుక భాషా రచనలు తెలుగు పాఠక లోకాన్ని చాలా ప్రభావితం చేశాయనీ అన్నాడు. నాటకాలలో మొదట వ్యావహారికభాషను సంస్కృత ఫక్కీలో ప్రవేశపెట్టింది వేదం వేంకటరాయ శాస్త్రినని చెప్తూ, వాడుక భాషలో మొత్తం నాటకం రాసే మొదటి ప్రయత్నం తనదేననీ, ఇది విఫలం కాలేదన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తూనే రచయితల వ్యక్తిగత విజయాలు, వైఫల్యాలు ఒక భాషాశక్తికి పరీక్షలు కావని అంగీకరించాడు.[15]

సామాన్య రైతులనూ, విదేశీయుల్నీకూడా చేరుకో గలిగే భాష వాడుక భాష. దీని ప్రయోజనాలనేకం అన్నాడు. వాడుక భాషలో రచనలుచేసే ఈ ఉద్యమం చాలా నెమ్మదిగా జరుగుతున్నదని బాధపడ్డాడు.

ముద్రణలో ఉచ్చారణను యథాతథంగా ప్రతిబింబించే చిహ్నాలు తెలుగులో లేవనీ తానటువంటి మార్పులు కొన్ని చేశాననీ, వాడుకభాష బాగా వ్యాప్తిలోకి వస్తే తప్ప అచ్చులో ఈ మార్పు రాదనీ అన్నాడు.[16]

రచన హేతువును, తాను ఆ ప్రక్రియను స్వీకరించడానికి గల కారణాలనూ వివరించడానికీ, వాడుక భాషను ప్రచారం చేయడానికీ గురజాడ తన కన్యాశుల్క పీఠికలను వినియోగించాడు.

సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి తెలుగులో, నాటకాన్ని ప్రతిభావంతంగా రాసిన మొదటి నాటక కర్త గురజాడ అప్పారావు. భాషలోను, భావంలోను విప్లవాన్ని తీసుకువచ్చినవాడు ఆయన. ప్రజల భాషలో, సజీవ పాత్ర చిత్రణతో ఆయన రచించిన 'కన్యాశుల్కం' తెలుగు నాటక ప్రపంచంలో మహోదయం. అంత గొప్ప నాటకం తెలుగులో అంతకుముందూలేదు. ఆ తరవాతా లేదు.

గురజాడ తరువాత :

సంస్కృత నాటకాల అనువాదాలెన్నో తెలుగులో వచ్చాయి. ఒక్క శాకుంతల నాటకానికే సుమారు 40 అనువాదాలున్నాయి. భాస నాటకాలు, మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, ఉత్తర రామచరిత్ర, వేణీ సంహారం, మొదలైన నాటకాలను అనేకమంది అనువదించారు. వీటి పీఠికలు అనువాద విధానాన్ని ప్రధానంగా చర్చిస్తాయి. మూలకర్త, మూల రచనలను గూర్చిన ప్రశంసకూడా ఉంటుంది. ఇతరుల అనువాదాలకూ ప్రస్తుత నాటకకర్త అనువాదానికీ ఉన్న భేదాన్ని కూడా వివరించడం జరుగుతుంది. సంస్కృత నాటకాల లక్షణాలను అనుసరించే తెలుగులో స్వతంత్ర నాటకాలు చాలా వచ్చాయి. కొన్ని విషయాలలో ఆంగ్ల నాటక సంప్రదాయాలను అనుసరించినా కన్యాశుల్క నాటకం వచ్చేవరకు తెలుగులో సంపూర్ణమైన ఆధునిక నాటకం రాలేదు. అయితే నాటకాలు ప్రదర్శించే సంస్థలు పెరగడంతో నాటక రచయితల సంఖ్యా పెరిగింది. ప్రేక్షకులను ఆకర్షించే హంగులు కొన్ని నాటకాలలో చేరాయి. సంస్కృత నాటక లక్షణం క్రమక్రమంగా శిథిలం కాజొచ్చింది. కన్యాశుల్క నాటకావతరణ తర్వాత ఆధునిక లక్షణాలతో నాటక రచన ప్రారంభమయింది. పాటలతో నాటకం రాయడం, నటి, సూత్రధారులకు తిలోదకాలివ్వడం, నాంది పద్యానికి నాటక సంబంధం ఉండకపోవడం, నాటకంలో ప్రత్యక్షంగా ప్రదర్శింపరాదని ప్రాచీన లక్షణకర్తలు చెప్పిన వాటిని పాటించక ప్రదర్శించడం, నాటక శాస్త్రాలను మూలపారవేయడం మొదలయినవి కొందరు సంప్రదాయ నాటక కర్తలకు కష్టం కలిగించింది.[17] అందువల్ల ప్రాచీన నాటక లక్షణానుసారంగ నాటకం రాయాలనే ఉద్దేశంతో నాటకాలు రాసిన వారున్నారు. "ఒక్కతటి నాటక లక్షణములం జదువునపుడు తదనుగుణ్యముగా నాటక మొకటి వ్రాయవలయునని నాకుం దోచినది"[18] అన్నాడు జనమంచి శేషాద్రి శర్మ.

హేతువాదం : త్రిపురనేని రామస్వామి చౌదరి :

'కురుక్షేత్ర సంగ్రామము' తొలిపలుకులలో త్రిపురనేని రామస్వామిచౌదరి తెలుగులో నాటక రచన ఆలస్యంగా ప్రారంభం కావడానికి గల హేతువులను పరిశీలించాడు. "కవి వతంసులైన నన్నయాదులప్పుడప్పుడే మోసులెత్తింపఁదల యెత్తసాగిన కవితాకన్యను దగిన కట్టుదిట్టము నేర్పఱివి చిరంజీవినిం జేయ సమకట్టి తదనుకూలములైన గ్రంథములకు నిర్మాతలైరి. రూపకములు ప్రదర్శనానుకూల్యము లౌటచే నట్టి ప్రదర్శన మా కాలమునయందు రాజానుగ్రహముండినంగాని నెరవేరమింజేసి, రాజులో నాటకంబులన్న నెఱుంగని వారగుటచే నాటకములు వ్రాయుట యందభిమానమా కాలము వారి కేరికిని బొడచూపదయ్యె. ఇంకఁదిక్కనాదుల మాటయన్నచోఁ జేతినిండ బనియుండుటచే నాటకముల పొంతఁ బోవలేదు. పదంపడి కవిచంద్రులైన శ్రీనాథాదులు కేవలోదర పోషణార్థమై కృతులొసంగ నుండినను వారు సంస్కృతంబున నాటకంబులుండుట యెఱింగియు నాటకాంధ్రీకరణంబునకు నుత్సాహపడరైరి. ఆ గొడవలేని పోతనాదులు భగవద్భక్త్యను గుణంబులయిన పురాణములను దెనుఁగుఁజేసిరి. సంస్కృత భాషా ప్రవీణులై రాజానుగ్రహము గల్గుట సంకల్ప సిద్ధులైన పెద్దనాదులీ రూపక నిర్మాణంబునకుఁ దొడంగవలసినవారు, రాజు మిగుల విశాల బుద్ధి యగుటచే నాంధ్రీకరణంబున కుపక్రమింపక వైదగ్ధ్య కుసుమంబు వికసింపజేయు గ్రంథరచనకుఁ జేయూత యొసంగె. కాననెన్నెన్ని యో ప్రబంధములా కాలము నుండి యుట్టి పడఁజొచ్చెను. ఇట్లు రానురాను నాటక నిర్మాణము మిగిలియుండెను రాయని యనంతరమ్మున సంస్కృతాంధ్ర భాషావిదుఁడైన చక్రవర్తియే యీ త్రిలింగదేశమును నలంకరించినచో నా ప్రభుకాలంబున నాటకంబులు తలయెత్తెడివే కాని యట్టి మహాదశ యీ దేశంబునకుఁగలుగదయ్యె. ఎల్లవిధముల విద్యలు దైనందినాభివృద్ధి నొందుచున్న యిక్కాలంబునందున్న కవి శిఖామణులకు రూపక నిర్మాణ కార్యభారము మిగిలెను."19

ప్రస్తుత కాలంలో నవల, నాటకం రెండూ ప్రచారంలోకి వచ్చాయని, నాటకాలు మొదట ఆంధ్రీకరణాలుగా ఉండి ఇప్పుడు స్వతంత్రాలవుతున్నాయని అంటూ సంస్కృత నాటక లక్షణాలు తెలుగు నాటకాలకు పనికి రావన్నాడు.

తెలుగులో వస్తున్న నాటకాలను దృష్టిలో పెట్టుకొని కొత్త లక్షణ గ్రంథాలు బయలుదేరాలన్నాడు రామస్వామి చౌదరి.

'శంబుక వధ' తొలిపలుకులలో పద్యనాటకాలకంటె గద్యనాటకాల అవసరాన్ని నొక్కి చెప్పాడు. "పద్యమునకన్న గద్యము ప్రాకృత జనంబునకు సులభ గ్రాహ్యముగా నుండును. కాన సంగీత నాటకములున్నను, లేకున్నను వచన నాటకములు మాత్రమ్యవసరము"[20] అన్నాడు.

త్రిపురనేని రామస్వామిచౌదరి హేతువాద ప్రచారానికి తననాటకాల పీఠికల నుపయోగించుకున్నాడు. ముఖ్యంగా 'శంబుక వధ', 'ఖూనీ' ఈ రెండు నాటకాల పీఠికలు ఈ విషయంలో పేర్కొన దగినవి. శంబుక వధకు 40 పేజీల తొలిపలుకులు రాస్తూ రామాయణ పూర్వ, రామాయణ, రామాయణానంతర కాలాలలోని హిందూ దేశస్థితిని వివరించాడు రామస్వామిచౌదరి. ఆర్య, అనార్య భేదాలను, అనార్యులైన రాక్షస, వానరాదులు ద్రావిడులేననీ పేర్కొంటూ ఆర్యులలోని వర్ణభేదాలు అనార్యులైన ద్రావిడులలో ఎట్లా ప్రవేశించాయో పరిశీలించాడు. పురాణాలలో చెప్పే కాల వివరాలు అబద్ధాల పుట్టలని నిరూపించాడు. ఈ నాటకం రెండవకూర్పు తొలిపలుకులలో కూడా ఈ విషయాన్ని మరింత విశదం చేశాడు. భారతదేశంలో నివసిస్తూ ఉండిన ద్రావిడులను, ఉత్తర కురు భూముల నుండి వచ్చిన ఆర్యులు ఓడించి దక్షిణానికి తరిమివేశారనీ, విజితులైన ద్రావిడతెగలే శూద్రులయ్యారనీ అన్నాడు. ఆర్యులు అనార్యులకంటె కొంత నాగరకులే అయినా వారి నాగరికతలలో పెద్దగా అంతరం లేదన్నాడు. కాల పరిణామంలో ఆయాజాతుల్లో వచ్చిన సామాజిక నియమాల మార్పుల్ని కూడా వివరించాడు. అయితే ఈ తొలికూర్పు పీఠికలో శంబుక వధ ఇతివృత్తాన్ని గూర్చిన విషయాలేవీ నోటుచేసుకోలేదు. రెండవకూర్పు పీఠికలో మాత్రం దీని మీద వచ్చిన విమర్శలను ఖండిస్తూ, తన వాదాన్ని సమర్థించుకున్నాడు రామస్వామి చౌదరి.

విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'వేనరాజు' నాటకాన్ని చదివింతర్వాతే 'ఖూనీ' నాటకం రాయాలనిపించిందని చెప్పాడు రామస్వామి చౌదరి. 'ఖూనీ' తొలిపలుకులలో భాగవత చతుర్థ స్కంధంలోని వేనరాజు కథను ఉదహరిస్తూ,

వేనరాజు క్రూరకర్ముడు, ధర్మద్రోహి కావడంవల్ల కాక బ్రాహ్మణసంతర్పణలు మాన్పడంవల్ల హత్య చేయబడ్డాడని రామస్వామి చౌదరి అభిప్రాయపడ్డాడు. మతం సర్వకాలాల్లోనూ, దేశాల్లోనూ కీడే చేసిందన్నాడు. "మతము ప్రతి దేశము నందు సౌజన్యము, సౌభ్రాతృత్వము, సమానత్వమును జింపర వంపర చేసి, మానవుల నల్లకల్లోలముజేసి, ప్రపంచశాంతి లేకుండఁ జేయుటయే కాకుండ మహాపురుషుల నెందఱినో తన పొట్టఁబెట్టుకొన్నది"[21] అన్నాడు. రష్యావిప్లవం వల్ల రష్యాలో మతం వెనుకబట్టడమూ, ప్రజలు సుఖపడడమూ జరిగిందన్నాడు. వేన రాజు కాలానికి మతం లేదు. ఆర్య ఋషులు చెప్పిన ధర్మాలే సనాతన ధర్మమని భావించబడుతూందని, వారి అభిప్రాయాలకు వ్యతిరేకమయిన అభిప్రాయాలు కలవారిని పాషండులుగాను, నాస్తికులుగానూ పరిగణించేవారనీ చెప్పాడు. 'ఖూనీ' రచనకు కారణాన్ని ఈ విధంగా చెప్పుకొన్నాడు రామస్వామి చౌదరి. "పాషండులైనంత మాత్రమున (అనగా వైదిక ధర్మములను ననుష్ఠింప నంతమాత్రమున) మానవుడు పాప కర్మములను చరించునని కాని ధర్మ పీడలను సల్పునని కాని చెప్పుట లోకమునెడ మహాపచారము చేయుట యగును. భగవంతుని ప్రేమించుట కన్నఁదోడి మానవులఁ బ్రేమించుట పరమోత్తమంబు. పాషండుఁడనఁగా సకల పాపములను జేయువాఁడని ప్రాకృతలోకంబున గల యూహలను నాధారము జేసికొని విశ్వనాథ సత్యనారాయణ గారు వేనరాజును నా విధముగ నభివర్ణించియున్నారు. ఇది కేవలము పొరపాటు. పాషండులయందెట్టి పవిత్ర జీవనము సల్పిన యుత్తమ పురుషులున్నారో లోకచరిత్రఁ జదివిన వారికి బోధపడకపోదు. కావుననే పాషండులైనంత మాత్రముననే మానవులు దుర్మార్గులు కారనియు వేనరాజు పాషండుఁడైనను, సత్యనారాయణ గారు చిత్రించినట్లు దుర్మార్గుఁడు కాఁడనియు రుజువు చేయుటకే 'ఖూనీ' వ్రాయఁబడినది"[22]

త్రిపురనేని రామస్వామి చౌదరి నాటకాలన్నీ హేతువాదాన్ని బలపరచేవే. ఆయన పీఠికలు కూడా అందుకే ఉపయోగపడ్డాయి.

నార్ల వెంకటేశ్వరరావు :

హేతువాద నాటకాల పీఠికల్లో నార్ల వెంకటేశ్వరరావు పీఠికలు కూడా పేర్కొనదగ్గవి. 'జాబాలి' నాటక పీఠిక నాటకానికి రెట్టింపు ఉంది. ఈ పీఠిక ప్రధానంగా సంస్కృత రామాయణాన్ని గురించి చర్చించింది. రామాయణం

పురాణమే తప్ప చరిత్ర కాదంటాడు నార్ల. రామాయణం కేవలం వాల్మీకి కర్తృకం కాదనీ, అందులో ఆయా కాలాలలో పౌరాణికులనేక విషయాలు చేర్చారనీ అంటాడు. భారతంకంటే చాలా ఆలస్యంగా రామాయణం లిఖితరూపాన్ని పొందిందనీ అప్పటివరకూ పాటగానే ఉండిందనీ అన్నాడు. అనేకమంది చేతులు పడడంవల్లనే రామాయణంలో అనేక వైరుధ్యాలు కనిపిస్తున్నాయనీ, అసంభవ విషయాలు, అద్భుత సంఘటనలు, అభూతకల్పనలూ చోటు చేసుకున్నాయన్నాడు. ప్రక్షిప్తాలు లేని వాల్మీకిరామాయణకథ ఎట్లా ఉంటుందో వివరించాడు.

పురాణాలలో అభూతకల్పనలు, అద్భుత విషయాలు ఉండడం అన్నది అన్ని దేశాలలోనూ సహజమే. అయినా అక్కడ ఆధునిక కాలంలో వాటిని శాస్త్రీయ దృష్టితో పరిశీలిస్తున్నారనీ, మనవారుమాత్రం అదంతా చరిత్ర అనీ వాస్తవమనీ ఇప్పటికీ భావించడం, శాస్త్రీయ దృక్పథం లేకపోవడం దేశపురోగతికి భంగం కలిగిస్తున్నదనీ నార్ల వెంకటేశ్వరరావు బాధపడ్డాడు. "కాని, చదువు సంధ్యలున్న వారే, పట్టభద్రులైన వారే, పండిత ప్రకాండులుగా చెల్లుతున్నవారే, ఈ నవ యుగానికి తగినట్టు నవ్యభావాలను ప్రచారం చేస్తూ, నూతన సంఘ నిర్మాణానికి ప్రాతిపదికలను వేయడంలో ప్రత్యేక బాధ్యత వహించవలసిన ప్రజానాయకులే, పత్రికా సంపాదకులే ఈ కాకమ్మ కథ లన్నింటిని కడిగి పోసిన సత్యాలుగా స్వీకరించడం మన దేశ దౌర్భాగ్యం కాదా ? ఈ మేధావులే, ఈ సంఘ నాయకులే, ఇంత మౌఢ్యాన్ని ప్రదర్శిస్తే, శాస్త్రీయ (సైంటిఫిక్) దృక్పథం మన ప్రజలలో ఏ విధంగా విస్తరిస్తుంది? వైజ్ఞానిక పథంలో మన జాతి ఏ విధంగా పురోగమిస్తుంది? సాంకేతిక రంగంలో మన దేశం ఏమి విజయాలను సాధించగలుగుతుంది ?"[23] అని ప్రశ్నించాడు నార్ల.

మోక్షమార్గాన్ని చూపించే మత గ్రంథంగా గాని, రసవత్తరమైన మహా కావ్యంగా గాని రామాయణాన్ని భావించే వారితో తనకు పేచీలేదంటాడు నార్ల. "ఒక రసవత్తర కావ్యమే కాక, అది చారిత్రక గ్రంథమని వాదించే వారి అజ్ఞానమే, వారి అహంకారమే నాకు దుస్సహం"[24] అంటాడు.

ముప్పై పేజీల, మూడు పాత్రల, ఏకాంక నాటికకు అరవయ్యేడు పేజీల పీఠిక ఏ పాఠకుల కోసం రాశాడో ఎందుకు రాశాడో కూడా నార్ల చెప్పుకున్నాడు.

"ఆలోచనా శక్తిని, తార్కిక బుద్ధిని, విచక్షణ దృష్టిని, యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని ప్రదర్శించగల వారి నుద్దేశించే విపులమైన ఈ పీఠికను నేను వ్రాస్తున్నాను".25

"నా నాటిక చిన్నదైనా, దానికి పెద్ద పీఠిక అవసరమని దీన్ని ప్రారంభించాను. అయితే ఇంత పెద్దదిగా ఇది పెరిగిపోతుందని మాత్రం ఊహించలేక పోయాను. ఇది మీకెంతవరకు ప్రయోజనకారి కాగలదో తెలియదుగాని, దీనివల్ల నా మట్టుకు నేను పెద్ద లాభమే పొందాను. పెక్కేండ్లుగా సంస్కృత రామాయణాన్ని, రామాయణ వ్యాఖ్యానాలను, రామాయణంపై పరిశోధక గ్రంథాలను చదువుతున్నాను. ఈ విస్తృత పఠనం స్పష్టాస్పష్టమైన భావాలను ఎన్నింటినో నాలో రేపుతూ వచ్చింది. ఏపుగా పెరిగిన ఒక కీకారణ్యంవలె వున్న ఈ భావ జాలానికి ఒక తీరు దిద్దడానికి, ఒక తెన్ను కూర్చడానికి ఈ పీఠికా రచన నాకు విశేషంగా తోడ్పడింది. ఇట్టి ప్రయోజనాన్ని మీలో ఏ కొందరు దీనినుంచి పొందగలిగినా, ఆరోగ్యం అంత సరిగాలేని రోజులలో దీన్ని వ్రాయడానికి నేను పడిన శ్రమ వృథాకాలేదని సంతోషిస్తాను"26 అన్నాడునార్ల.

ఈ పీఠికలో సంస్కృత రామాయణంలో కనిపించే వైరుధ్యాలను, అసందర్భాలను అభూతకల్పనలను, అద్భుతసంఘటనలను సోదాహరణంగా నిరూపించాడు నార్ల.

'నరకంలో హరిశ్చంద్రుడు' అన్న నాటకానికి దాదాపు నాటకమంత పీఠిక రాశాడు నార్ల వెంకటేశ్వరరావు. పురాణాలు చరిత్ర కాదనీ, వాటిలో ఉన్నదంతా రంకులూ, బొంకులూనేననీ, వర్ణాధిక్యం, వర్ణాధిక్యతలను కాపాడడానికే అవి ఉపయోగపడ్డాయనీ ఆ విషయంలో పురాణాలు అద్భుత ఫలితాలు సాధించాయనీ అన్నాడు నార్ల. "పురాణాలు చేసిన చేస్తున్న - 'బ్రెయిన్ వాషింగ్' నుంచి ఇప్పటికైనా మనం బయటపడలేకపోతే, ఇప్పటి అజ్ఞానంలోనే మనదేశం మిగిలిపోతుంది. పురాణాలు స్వర్గద్వారాలు మనకోసం తెరవడం శుద్ధాబద్ధం; అవి మనను ప్రతీపశక్తుల కారాగారంలో బంధించడం పరిపూర్ణ సత్యం"27 అంటాడు. మతం నుండి నీతిని విడదీయకపోవడం చాలా గొప్ప లోపంగా నార్ల ఈ పీఠికలో పేర్కొన్నాడు. "చరిత్ర అనే ఛద్మవేషంవేసి పురాణం మానవుని మేధా శక్తిని

బలహీన పరుస్తుంది; అతడి హేతుదృష్టిని మందగింపజేస్తుంది. అతడిని వాస్త వికతకు దూరంచేసి, వెర్రి మొర్రి లోకాలలో ప్రవేశ పెడుతుంది. ఇదే విధంగా, నేడు ఇంతకంటె దుష్టంగా - మతం వ్యవహరిస్తోంది, విశ్వాసం పేర అది మౌఢ్యానికి ప్రోది చేస్తుంది. ఆచారం పేర దురాచారాలను నెలకొల్పుతుంది; సంప్రదాయం పేర సద్వర్తనను చంపివేస్తుంది. దీని కంటె ముఖ్య విషయం మరొకటి వున్నది. నీతి అనే మేలిముసుగు వేసుకొని, ఆ ముసుగుకింద మతం ఎన్ని దోషాలనైనా జరుపుతుంది. అది ఏ మతమైనా కానివ్వండి, దాని చరిత్ర పుటలు కన్నీటితో తడిసి వుంటాయి. ఆ పుటలలోని పంక్తులు నెత్తురు మరకల కారణంగా మనం చదవలేని తీరులో వుంటాయి."[28] అన్నాడు.

"పురాణాల దుష్ప్రభావం నుంచి ఇప్పటికైనా ఒక ప్రజగా మనం బయట పడలేకపోతే, రాముడు, కృష్ణుడు, నలుడు, హరిశ్చంద్రుడు మున్నగు వారిని సముద్రాంతరాలకు సాగనంపకపోతే ధర్మశాస్త్రాలను భస్మీపటలం చేయకపోతే, కులవ్యవస్థను రూపుమాపకపోతే, హేతు దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించుకొనకపోతే మన దేశంపైకి కాక క్రిందికి, మరింత క్రిందికే - పోతుంది. మనము వెనుకకే - మరింత వెనుకకే - నడుస్తాము. మనలో భావవిప్లవం రానంత వరకు ఏ పంచవర్ష ప్రణాళికలు, ఏ పంచసూత్రాలూ అధోగతినుంచి మనను తప్పించలేవు"[29] అన్నాడు నార్ల మనలో రావలసిన భావ విప్లవాన్ని విశ్లేషిస్తూ. నార్ల వెంకటేశ్వరరావు తన 'సీత జోస్యం' నాటికకు సుదీర్ఘమైన పీఠిక రచిం చాడు. 52 పేజీల నాటికకు సుమారు 125 పేజీల పీఠికను సంతరించాడు. రామాయణంలోని చారిత్రకత ఎంత? అన్న విషయాన్ని పలువురు ప్రసిద్ధ రామాయణ విమర్శకుల రచనలను పరిశీలించి చర్చించాడు. రామాయణ కథకు సంబంధించిన భౌగోళిక విషయాలను గూర్చి, అప్పటి జాతులను గురించి, ఋషు లను గురించి రామాయణకాలపు ఆయుధాలనుగూర్చి వివరంగా చర్చించాడు. 'జాబాలి' నాటికకు రాసిన పీఠికకు ఇది కొనసాగింపు.

"నా రెండుపీఠికలలో ఏదీ మీకు నచ్చకపోవచ్చు నా రెండు నాటకాలలో దేన్నీ మీరు మెచ్చక పోవచ్చు. అంతే జరిగితే, అందుకు నేనెంత మాత్రం బాధ పడను. నాకు కావలసింది మీ ఆమోదం కాదు, మీలో ఆలోచన; నేను కోరేది మీ ప్రశంస కాదు, మీలో జిజ్ఞాస'' అన్నాడు నార్ల.

"నాది ఆర్య ఆర్యేతర దృష్టికాదు; బ్రాహ్మణ, బ్రహ్మణేతర దృష్టి అసలే కాదు. అవి సంకుచిత దృష్టులు. అవి నాకుంటే నన్నుచూచి నేనే సిగ్గుపడాలి. జాతిమత కులవర్గ విభేదాలన్నీ సమసిపోవాలి; సమతా స్వాతంత్ర్యాలు సర్వత్రా నెలకొనాలి; దారిద్ర్యం, దైన్యం ఈ భూతలం నుంచి మటుమాయమై పోవాలి; అణ్వస్త్రయుద్ధం ద్వారా నరజాతి, దాని నాగరికత సర్వనాశనం కాగల ప్రమాదం పూర్తిగా తొలగాలి; వివేక విజ్ఞానాలు వర్ధిల్లాలి; మానవునికి, అతడి మానవతకు పట్టాభిషేకం జరగాలి- ఇదే నా ఆరాటం, ఇందుకే నా పోరాటం. ఈ పోరాటంలో మీరు నా సరసను నిలిస్తే సంతోషిస్తాను; నా సమ్ముఖంలో నిలచినా సంతోషిస్తాను. ఇదే మీకు నా ఆహ్వానం"30 అన్నాడు.

ముద్దుకృష్ణ :

ముద్దుకృష్ణ 'అశోకం' సింహావలోకనంకూడా ఒకవిధంగా పీఠికలాంటిదే. త్రిపురనేని రామస్వామిచౌదరిలో కనిపించే హేతువాదం ముద్దుకృష్ణలోనూఉంది. తరువాత నార్ల వెంకటేశ్వరరావు చెప్పిన విషయాలకు ముద్దుకృష్ణ ఈ సింహావలోకనంలో చెప్పిన విషయాలకు పోలికలున్నాయి. అయితే ముద్దుకృష్ణ ఆర్య, అనార్యభేదాలే రామాయణంలో రావణాదులను దుష్టంగా చిత్రించడానికీ, రామాదులను ఉత్తమోత్తములుగా చిత్రించడానికీ కారణమని అంగీకరిస్తూనే రావణుణ్ణి సమర్థిస్తున్నప్పటికీ రామాదులకు లోపాలను కల్పించలేదన్నాడు. "రామాయణ కర్తలవలె రావణుణ్ణి సమర్థించడంలో నేను రాముడికిగాని, సీతకుగాని, ఏ లోపాలూ సృష్టించలేదు. పైగా ఈ నాటకంలోని సీతారాములను రామాయణాలలో కన్నా ఉత్తములనుగా, ఎక్కువ గంభీరులనుగా, ఉదార స్వభావులుగా, మానవ పరిణామంలో ఉత్తమస్థాయిని పొంది, సత్యం నిండు తేజస్సును గ్రహించిన పవిత్రాత్ములనుగా నిర్మించడానికి యత్నించాను"31.

నీతిసూత్రాలలో స్త్రీపురుషులమధ్య వ్యత్యాసం స్త్రీని ఎట్లా పతనం చేసిందో వివరించాడు ముద్దుకృష్ణ, "ఈ విధంగా నీతిని పురుషులకు ఒకటి, స్త్రీలకు ఇంకొకటి అని రెండువిధాలుగా విభజించడంలో తయారైన ప్రమాణ గ్రంథాలను బట్టి హిందూస్త్రీ అన్యాయస్థితిలో పడిపోయింది.... స్త్రీ కేవలం వస్తువు. వస్తువు తన నీతిని తాను నిర్ణయించలేదుకదా! అందుచేత వస్తువులకు సంబంధించిన నీతిని అనుభవించేవారు నిర్ణయిస్తారు. కేవలం వస్తువువంటిది అయినది కనుక,

స్త్రీ, తన నీతిని తాను నిర్ణయించుకోలేదు. తమ నీతిని నిర్ణయించుకోలేనివారికి స్వేచ్ఛ పనికిరాదు"[32] ఈ నాటకం రాయడంలో ముద్దుకృష్ణలక్ష్యం "విరోధినైనా సానుభూతితో గ్రహించేటట్టుగా మానవ హృదయంలోని దాక్షిణ్యాది మహత్తర గుణాలను వినియోగ పరిచేటట్టు చేయడం, ఉత్తమ మానవత్వానికి సరియైన దారిని చూపడంకదా!"[33]

భావవాద ధోరణి నాటకాలు :

సంఘంలో స్త్రీలకు జరిగే అన్ని అన్యాయాలను ఎదిరించటానికి అన్ని సాహిత్య ప్రక్రియలను వినియోగించుకున్నట్లే నాటకాలను కూడ ఉపయోగించు కున్నాడు గుడిపాటి వెంకట చలం. ఆయన రాసిన 'చిత్రాంగి', 'పద్మరాణి', 'సావిత్రి', 'శావలిని', 'మంగమ్మ' మొదలైన నాటకాలు సాహితీ లోకంలోను ప్రజాసామాన్యంలోనూ గొప్ప సంచలనాన్ని కలిగించాయి. సంఘంలో స్త్రీ పురుషుల అసమానత, స్త్రీల సాంఘిక బానిసత్వం, అర్థంలేని కట్టుబాట్లు చలం తీవ్ర విమర్శకు గురయ్యాయి. చలం 'సావిత్రి'కి ప్రవేశిక రాస్తూ పింగళి నాగేంద్రరావు "దాంపత్య ప్రేమ ఎంత నిష్కల్మషమైందో, సంకోచరహిత మైందో, ఆత్మ విశ్వాస వర్ధకమై భయరహితమైన అఖండ సౌఖ్యాన్ని ఇస్తుందో మనకీ నాటకంలో కనబడుతుంది. స్త్రీత్వము సావిత్రీత్వమే కావాలి అని అనూహ్యమైన ఒక అజ్ఞాతమునుండి ప్రేమగానము ధ్వనిస్తుంది. ఇది ఈ నాటకానికి ఫలశ్రుతి"[34] అన్నాడు.

వ్యక్తివాదం భావవాద ధోరణుల్లో ఒకటి. బుచ్చిబాబు వ్యక్తి దృష్ట్యా జీవితాన్ని, జీవిత సమస్యలను పరిశీలించిన నాటకకర్త. ఆయన నాటికల సంపుటి-1 కి 'నేను మెచ్చుకునే బుచ్చిబాబు' అన్న పీఠికలో నార్ల వెంకటేశ్వర రావు యిలా అన్నాడు. "బుచ్చిబాబుగారిలో, ఆయన రచనలలో నన్ను ఆకర్షించేది ఆయన భావనాపటిమ. నన్ను అలరించేది ఆయన శిల్పచాతురి. ఆ రెంటితోపాటు ఆయనలో మరొక విశిష్ట లక్షణం కూడ కానవస్తుంది. అది జీవితాన్ని గురించి, దాని సమస్యల గురించి, ఆయనకున్న విశిష్ట దృక్పథం. దీన్నే మరొక విధంగా చెప్పాలంటే ఆయనకు ఒక 'ఫిలాసఫీ ఆఫ్ లైఫ్' ఉన్నది."[35]

భూమి కోసం :

"ధనిక పేదవర్గాల మధ్య నిత్య సంఘర్షణనూ, ధనిక వర్గాల దోపిడీ విధానాన్ని తమ హక్కులకోసం, తమ శ్రేయస్సుకోసం, దున్నేవారికి భూమి కోసం ప్రజానీకం సాగించిన పోరాటాన్ని ప్రముఖంగా చిత్రిస్తూ నాటకాలను రచించిన జంట రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు గార్లు. సర్వ సౌభాగ్యాలతో సర్వజనులూ సుఖంగా జీవించే నవసమాజాన్ని నిర్మించుకోవాలని కలలుకంటూ, ఆ లక్ష్యసిద్ధికి మహదావేశంతో కలంపట్టిన అభ్యుదయ రచయితలు సుంకర, వాసిరెడ్డి. వీరు 1946 లో 'ముందడుగు' నాటకాన్నీ, 1947 లో 'మా భూమి' నాటకాన్నీ రచించి చరిత్రను సృష్టించు కున్నారు."36

"నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజా పోరాటాన్ని గురించి ఈ నాటకం వ్రాయబడింది... ఈ మహోజ్జ్వల పోరాటమే, మమ్మల్ని ఈ నాటకం రాయ టానికి ప్రోత్సహించింది"37 అంటూ 'మా భూమి', పీఠికలో సుంకర, వాసిరెడ్డి రాసుకున్నారు.

ప్రజా పోరాటాల ప్రధాన సమస్యల్లో బంజరుభూమి సమస్య ఒకటి. బంజరు భూమి సమస్యలను, భూపోరాటాలను చిత్రిస్తూ సుంకర, కె.వి. రమణా రెడ్డి, పి వేణు నాటకాలను రాశారు. సుంకర 'భూమికోసం' రమణారెడ్డి, వేణు 'అన్నపూర్ణ' నాటకాలను రాశారు. సుంకర సత్యనారాయణ 'భూమికోసం', 'మనవి'లో "రైతుభూమినీ, పశువుల్నీ ఎంతగానో ప్రేమిస్తాడు. వాటి కోసం ప్రాణాన్ని సహితం త్యజించడానికి సిద్ధమౌతాడు. ఆ వాస్తవాన్ని ఈ నాటకంలో నిరూపించడానికి కృషి చేశాను. అంతేగాదు చారెడు భూమికోసం వ్యవసాయ కూలీలు పడే తహతహను కూడా పాఠకుల దృష్టికి, ప్రేక్షకుల దృష్టికి తీసుకు రావడానికి ప్రయత్నించాను."38 అన్నాడు.

సాంఘిక నాటకాలు :

సామాజిక సమస్యల్ని ప్రతిబింబించే నాటకాలు అనేకం వచ్చాయి. 1940-50 మధ్యలో వెలువడిన 'యన్ జి.వో'లో ఆత్రేయ మధ్యతరగతి గుమస్తా దుర్భర జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. వివాహ సమస్యలను ప్రత్యే కంగా తీసుకుని రాసిన వాటిలో ముఖ్యమైనవి రాంషా 'లక్ష్మీపతిగారి అమ్మా

యిలు', గనిశెట్టి 'భలేపెళ్ళి', మునిమాణిక్యం 'గృహప్రవేశం', భమిడిపాటి 'ఇదేమిటి'; సామాజిక సమస్యల్ని ప్రతిబింబించే నాటకాల్లో పింగళి నాగేంద్ర రావు 'ఒకే కుటుంబం', ఆత్రేయ 'కప్పలు', భమిడిపాటి 'కీర్తిశేషులు', 'అపూర్వ సృష్టి', జాన్సన్ 'నటనాలయం', సోమంచి యజ్ఞన్నశాస్త్రి 'విశ్వం పెళ్ళి', 'న్యాయం', నరసరాజు 'పీలునామా', రెంటాల, బెల్లంకొండ, గిడుతూరి మొదలైనవారు అనువదించిన 'ఇన్స్పెక్టర్ జనరల్', శివం 'నేరము-శిక్ష', మారుతీరావు 'రాగ-రాగిణి', కొఱ్ఱపాటి 'విషకుంభాలు', 'సంక్రాంతి', ముద్దుకృష్ణ 'ఆడవాళ్ళ తెలివి' మొదలైనవెన్నో వచ్చాయి.

వర్ణ వ్యవస్థను తూర్పార పడ్తూ 'పడిపోతున్న గోడలు' రాశాడు బోయి భీమన్న. దానికి 'వర్ణాంతర వివాహాలు, కులతత్వము' అన్న పేరుతో రాసిన పీఠికలో బోయి భీమన్న యిలా అన్నాడు. "వర్ణ వ్యవస్థ దుష్ఫలితాలకు అస్పృశ్యతా వ్యాధికి మందు ఒక్క వర్ణాంతర వివాహాలు మాత్రమేనని నా ఆబాల్యోద్దేశ్యం. అదే వుద్దేశంతో వ్రాసినట్టివే పాలేరు, కూలిరాజు మొదలైన నాటకాలు తదితర కథలూను. అందులో ఈ నాటిక ఒకటి."39

సామ్యవాద ధోరణి నాటకాలు :

'నిజం' నాటకానికి రాచకొండ విశ్వనాథశాస్త్రి చిన్న పీఠికను రాశాడు. చేసిన నేరాన్నుండి తప్పించుకునే ధనికులూ, చేయని నేరాలకు శిక్షలు అనుభవించే పేదలూ ఉన్న ఈ సమాజం మారాలన్న కోర్కె ఈ నాటకం రచనకు హేతువైందన్నాడు రాచకొండ విశ్వనాథశాస్త్రి. "కాని ఏ పాపం ఎరగని వాళ్ళు మాత్రం యిళ్ళలోను, జెయిళ్ళ బయట మగ్గుతూనే వున్నారు; పాపంలా పెరిగిన పెద్దవారు ఏ పాపం చేసినా వారే పెద్దవారుగా ప్రభువులుగా వుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంఘంలో పేదవాడికి న్యాయం దొరకదుగాక దొరకదు. తన కన్యాయం జరిగితే ఎదిర్కొందికి పేదవాడికి సంఘంలో అవకాశం లేదుకాక లేదు. ఈ పరిస్థితి మారాలని నాకుంది. అందుకే ఈ నాటకం రాశాను."40

రాజకీయ సాంఘిక చైతన్య వంతులయిన రచయితలు నూతన భావాలతో కొత్త పోకడలతో నాటకాలు రాయసాగారు. శ్రీకాకుళం గిరిజన ప్రజల పోరాటా

నికి సంబంధించిన కథా వస్తువును తీసుకుని మాండలిక భాషారూపమైన జముకుల కథలో మలిచిన మొట్ట మొదటి నాటకం అత్తిలి కృష్ణారావు 'తూర్పురేఖలు' జానపద ప్రక్రియను ఆసరాగా చేసుకుని ఆధునిక నాటకంలో ఆ ప్రక్రియకు స్థానం కల్పించిన యక్షగానం యం. వి. యస్. హరనాథరావు 'రుద్రవీణ' పాటలతో, మాటలతో వంగపండు ప్రసాదరావు గిరిజన పోరాటాలకు సంబంధించి కూర్చిన మరోనాటకం 'అడవి దివిటీలు', యన్. ఆర్. నంది 'మరో మొహంజొదారో' కూడ మంచి నాటకం.

చాలా నాటకాలకు పీఠికలు లేకపోవటంవల్ల ప్రసిద్ధమయిన నాటకాలనేకం ఈ పరిశీలనలోకి రాలేదు. తెలుగులో నాటక రచన, ప్రదర్శన, విమర్శ కూడ యింకా పరిణత స్థాయికి చేరలేదనే చెప్పాలి.

నవల :

తెలుగు నవల వయస్సు వందసంవత్సరాలు నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి రాసిన 'శ్రీరంగరాజ చరిత్ర' అనే వచన ప్రబంధం మొదటి తెలుగునవల. అది 1877 లో అచ్చయింది. కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్ర 1880 లో పుస్తక రూపాన వెలువడ్డది. తెలుగు నవల పుట్టిన తరువాత దాదాపు పాతికేళ్ళు ఈ ప్రక్రియను 'వచన ప్రబంధ' మనే వ్యవహరించేవాళ్ళు. 1897 లో కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి వివేక చంద్రికా విమర్శనం అనే గ్రంథం వెలువడింది. ఇది వీరేశలింగం 'రాజశేఖర చరిత్ర'ను విమర్శిస్తూ వచ్చిన గ్రంథం. విమర్శన గ్రంథ పీఠికలో బ్రహ్మయ్యశాస్త్రి "ఈ ప్రక్రియను ఇంగ్లీషులో మాదిరిగానే 'నవల' అని పిలవటమే బాగనీ, తానిక ముందునుంచీ ఈ ప్రక్రియను నవలగానే వ్యవహరిస్తానని"41 పేర్కొనటంతో తెలుగు నవలకు పేరు రూఢి అయింది.

ప్రారంభ దశ :

దేశీయుల ఆచార వ్యవహారాలు, జీవన విధానం తెలియజేసే గ్రంథరచనకు ఆంగ్ల ప్రభుత్వం ప్రోత్సాహమిచ్చింది. ఆ ఉద్దేశంతోనే 1872 లో నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి 'శ్రీ రంగరాజ చరిత్ర' రచించాడు. "తెలుగుదేశము వారి యాచార వ్యవహారంబులు తెలుపునట్టి ప్రబంధం బొకటి రచియించుట తెలుగు

వారి కుపయుక్తంబగునని తలంచి నా నేర్చుకొలది నీ ప్రబంధంబు చెప్పబూనితిని" అనీ "కేవల గద్యాత్మక ములయిన తెనుఁగు ప్రబంధములు - విశేషము లేమింజేసి యిది తెలుగు విద్యార్థులకు సయితముపయోగించునని తలంచెద"42 అనీ తన పీఠికలో రాసుకున్నాడాయన.

అదే ఉద్దేశంతో కందుకూరి వీరేశలింగం కూడ 'రాజశేఖర చరిత్ర' రాశాడు. పైగా ఈయన్ని సంఘసంస్కార లక్ష్యం కూడ పురికొల్పింది. పీఠికలో యిలా చెప్పుకున్నాడు ఆయన "ఈ వఱకు మన యాంధ్రభాషలో జనుల యాచార వ్యవహారములను తెలుపుచు నీతిబోధకములుగా నుండిన వచన ప్రబంధము లేవియు లేకపోవుట యెల్లవారికిని విశదమయియే యున్నదిగదా! అయినను దేశ భాషలలో నెల్లను మధురమైనదని పేర్కొనఁ బడిన మన తెనుఁగు భాషకటువంటి లోపమును తొలగింప వలయునని కొంతకాలము క్రిందట నే నీ గ్రంథమును 'శ్రీ వివేక వర్ధనీ' పత్రికా ముఖమునఁ బ్రకటించితిని. ఇట్టి గ్రంథమును వ్రాయుట కిదియే ప్రథమప్రయత్నమగుటచేత దీనియందు బెక్కు లోపములుండి యుండవచ్చును."

"ఈ గ్రంథము యొక్క కథను కల్పించుటలో గోల్డుస్మిత్తను నింగ్లీషు కవీశ్వరుని గ్రంథ సాహాయ్యమును గొంతబొందినను దానికిని దీనికిని విశేష సంబంధ మేమియు నుండదనియు దీనియందు వ్రాయబడిన విషయము లన్నియు నూతనములే యనియుఁగూడ విన్నవించుచున్నాడను."

"మనలోగల మూఢవిశ్వాసములను పోగొట్టవలెనన్న ముఖ్యోద్దేశముతో"43 గ్రంథ రచన చేశాడు కందుకూరి.

అట్లా సాంఘిక ప్రయోజనం లక్ష్యంగా నవల అవతరించింది. పాశ్చాత్య నాగరికతా పరిచయం, ఉదారవాదం, ప్రజాస్వామ్య భావాలు, సాంకేతిక ప్రగతి విద్యాప్రచారంతో తెలుగు దేశంలో పాఠకులు ఎక్కువయ్యారు. చాలామందికి కవిత్వాన్ని అర్థంచేసుకునే శక్తి, ఓపికా తీరికాలేవు. ఈ మధ్య తరగతి చదువు కొన్నవారు నవలను ఆహ్వానించారు. చింతామణి పత్రిక, విజ్ఞాన చంద్రికా మండలి నవలల పోటీలను నిర్వహించటం ప్రారంభించాయి. నవలా రచన విరివిగా సాగింది.

ప్రారంభదశలో నవలా రచన గ్రాంథిక భాషలో సాగింది. వ్యవహార భాషావాదం వేళ్ళూనుకున్న తరువాత నవలా రచన ప్రజలవాడుక భాషలో రాసాగింది. చింతా దీక్షితులు తన 'చిత్రలేఖ' పీఠికలో 1914 లో యిలా చెప్పు కున్నాడు. "ఇందు సంభాషణలో గ్రామ్యభాష బాహాటముగా నుపయోగింపబడి నది. బుద్ధి కుశలత నభివృద్ధి పరచుట కుద్దేశింపబడిన ఇట్టి నవలలయందు, గ్రామ్యభాష సంభాషణలో నుపయోగింపని యెడల, స్వాభావికలోక ప్రతిబింబ మీ గ్రంథముల యందుఁ గాన్పింపదని మా యాశయము."44

ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' పీఠికలో "భాషయొక్క ప్రస్తుత స్థితిలో వాడుక భాషలో వ్రాయటం కంటె గ్రాంథిక భాషలో వ్రాయటం సుల భంగా కనుపడ్డది" అంటూనే 'మాలపల్లి' ని వాడుక భాషలో రాశాడు. వాడుక భాషలో పుస్తకం రాయటానికి నాకిదే మొదటి ప్రయత్నం. మాదిరికి తగిన గ్రంథములు కూడాలేవు. సంస్కృత భాషా పాండిత్యంగాని, తెలుగు ప్రబంధ ముల పరిచయంగాని వాడుక భాషలో గ్రంథములు వ్రాయటానికి విశేషంగా తోడ్పడవు ... వీలయినంత వరకు తెలుగు భాషయొక్క నడక కనుకూలంగా యీ గ్రంథం, వ్రాయడానికి ప్రయత్నం చేశాను." ఇది 1922 లో మాట. వాడుక భాషలో ప్రయత్న పూర్వకంగా రాయటానికి కొంత కృషి జరిగినట్లు ఈ మాటలవల్ల అర్థమవుతుంది. అయితే ఇది ప్రజలకు సరిగ్గా అర్థమవుతుందో లేదో నన్న భయంతో ఎలా చదువుకోవాలో కూడ ఉన్నవ లక్ష్మీనారాయణ సూచన చేశాడు. "మాట్లాడే మోస్తరుగానే చదవటం ప్రారంభిస్తే వాడుక భాషలో రుచి కనబడుతుందిగాని లేకపోతే తెలియదు."45

1900 సంవత్సరంనుండి తెలుగునవల రెండోఘట్టం ప్రారంభమైంది. చిలకమర్తి పౌరాణికేతి వృత్తాలను గ్రహించి నవలలు రాయటం ప్రారంభించాడు. 1905, 1906లలో వందేమాతరం ఉద్యమం తెలుగు దేశాన్ని బాగా ప్రభావితం చేసింది. స్వాతంత్ర్యోద్యమం బలపడసాగింది. దేశాభిమానాన్ని రేకెత్తించే రచనలు రాసాగాయి. ప్రజలకు చరిత్రపట్ల అభిరుచి కలగటానికి విజ్ఞాన చంద్రికామండలి ద్వారా కొమర్రాజు లక్ష్మణరావు చారిత్రక నవలల పోటీ ఏర్పాటు చేశాడు. భోగరాజు నారాయణమూర్తి, కేతవరపు వేంకటశాస్త్రి, దుగ్గిరాల రామచంద్రయ్య మొదలైన వారెందరో ఉత్తమ చారిత్రక నవలలు రాశారు. 1900 నుండి 1920

దాకా సాగిన మలిదశలో వంగనవలలు, చారిత్రక నవలలు, అపరాధ పరిశోధక నవలలు వెలువడ్డాయి. 1910 వ సంవత్సరంలో ప్రారంభమైన ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమంకూడ తెలుగువాళ్ళ గతచరిత్రను అధ్యయనంచేసి నవలలరూపంలో అందించటానికి ప్రేరకమయింది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రివంటి ఆధునిక రచయితలుకూడా చరిత్రను కొత్త దృక్కోణాలలో వ్యాఖ్యానించి ప్రతిపాదించారు. 1914లో ప్రకటించిన 'మిథునానురాగము' పీఠికలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఇలా అన్నాడు: "ఆంధ్రదేశమున నింతవరకు ననేకాఖ్యాయికలు వెలసినవిగాని యందొక్కటియు, నాంధ్రుల వైభవములను బ్రకటించునది లేదు. ఇది యెంతయు విచారకరము. మొన్నటివరకు నాంధ్రదేశ చరిత్రము ప్రకటింపబడకపోవుట దీనికి గారణమని కొందరు చెప్పుదురు. కాని యది యంత ముఖ్యకారణమని చెప్పుటకు వీలులేదు. నేనాఖ్యాయికా రచనము సేయఁ దలంపు గొనినపుడు ముఖ్యముగ నాంధ్రుల కథలనే వ్రాయవలయునని నిశ్చయించుకొంటిని."

అంతేకాదు. ఆలంకారికుల శాసనాలను ధిక్కరించటమూ కొత్తపద్ధతుల నవలంబించటమూ జరిగింది. 'మిథునానురాగము' పీఠికలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి యిలా అన్నాడు. "హైందవాలంకారికుల శాసనమునకు వ్యతిరేకముగ నీకథ కేవల మమంగళముతో ముగిసినది. కాలక్రమమున నభిరుచులు మారుటయు, నూత్నాభిరుచులు గలుగుటయు సహజము. పరిణామసిద్ధాంతము ననుసరించి యిట్లు స్వతంత్రించినందులకు క్షమింపఁ బండితులు ప్రార్థితులు."

ఆధునికనవల : తొలిదశ :

1920 నుండి ఆధునిక నవల అవతరించిందని చెప్పవచ్చు. బహుళ సంఖ్యలో వెలువడటమేకాక ఇతివృత్తవైవిధ్యం ఉన్న నవలలు రాసాగాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిలాంటి ప్రసిద్ధ రచయితలు ఎన్నో రచనలు చేశారు. ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' తెలుగు నవలా సాహిత్యంలో మహోజ్వల సృష్టి. దీనికి కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక రాశాడు. గ్రంథవస్తువు, పాత్రలు, భాష, ప్రేమతత్వము, లక్ష్యము మొదలైన విషయాలను చర్చిచాడాయన. తిలక్ గాంధీ సిద్ధాంతాల ఆదర్శ సమన్వయం ప్రతిఫలింపచేసిన ఈ నవల సామ్యవాద సిద్ధాంతాలను, దృక్పథాన్ని ప్రతిపాదించి ముందుకడుగువేసింది.

ఆలస్యంగా వచ్చినా, జాతీయోద్యమంతో ప్రభావితమై గాంధీ నాయకత్వం క్రింద సాగిన స్వాతంత్ర్యోద్యమం తెలుగుదేశాన్ని ఏవిధంగా ప్రభావితంచేసిందో చిత్రించింది మహీధర రామమోహనరావు రాసిన 'కొల్లాయి గట్టితేనేమి'. 'ఒక మాట'లో బెజవాడలో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం ఆంధ్రదేశంలో జాతీయోద్యమ వ్యాప్తికి తోడ్పడిందనీ, గాంధీ నాయకత్వాన్ని ప్రజలు స్వీకరించారనీ, ఆనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను వస్తున్న మార్పులను చిత్రించే ప్రయత్నమే తానానవలలో చేసినట్లు చెప్పుకొన్నాడు మహీధర రామమోహనరావు[46].

ఆధునిక తెలుగు నవలా రచయితల్లో ఈ దశలో చెప్పుకోదగ్గవారు నల్గురు. వారు విశ్వనాథ సత్యనారాయణ, అడవిబాపిరాజు, చలం, నోరినరసింహ శాస్త్రి, ఒక్కొక్కరిదీ ఒక్కొకతోవ, విశ్వనాథ సత్యనారాయణ సంప్రదాయ వాది. ఆయన రాసిన సాంఘిక, చారిత్రక,పౌరాణిక,అధిక్షేపక నవలలన్నింటిలోను సంప్రదాయంపట్ల ఆయన ప్రీతి వెల్లడవుతుంది. పురాణాలలోని చరిత్రను కాదని పాశ్చాత్యులు చెప్పిన చరిత్రను నమ్మటం తప్పని ఆయన వాదన. పురాణవైర గ్రంథమాలలోని 'నందోరాజాభవిష్యతి'కి రాసిన పీఠికలో విశ్వనాథ యిలా అన్నాడు. "అల్పమైన యూహగల వారి మార్గమును మనమనుసరించు చున్నాము...ఇంతకు చెప్పవచ్చిన దేమనగా మన పురాణములు చరిత్రయే. మన ఋషులకు చరిత్ర జ్ఞానము లేదనుట, మన పూర్వనాగరికతను ఎంత తక్కువపరచినచో వారి పలుకుబడి అంతగొప్పగా సాగునని పాశ్చాత్యులు పన్నిన పన్నుగడ...గ్రీకు రచనలలోని సాండ్రకోటస్ గుప్తచంద్రగుప్తుడే కాని మౌర్య చంద్రగుప్తుడు కాడు...మహమ్మదు గోరీ వచ్చువరకు మన చరిత్రలో పాశ్చాత్యులు చేసిన యవకతవకలు కాదని నవలల రూపమున నిరూపించుటకుచేసె ప్రయత్నమిది."[47]

విశ్వనాథ సంప్రదాయవాది అయితే, అడవిబాపిరాజు భావుకుడు. ఈయన కవి, చిత్రకారుడు. ఈయన జాతీయోద్యమంతో ప్రభావితుడైనవాడే. ఈయన తన నవలలకు సాధారణంగా పీఠికలు రాయడు. 'అడవి శాంతిశ్రీ'కి మాత్రం 'ఉపక్రమణిక' అంటూ కృష్ణవేణిని, ఆంధ్రమాతను స్తుతించాడు.[48]

నోరినరసింహశాస్త్రి చారిత్రక నవలా రచయిత. ఆయన రాసినవన్నీ తెలుగుదేశపు చరిత్రకు సంబంధించిన వవటం ఆయన దేశాభిమానం చెప్పకనే చెప్పుతాయి. "బాపిరాజుకు ఆంధ్రాభిమాన మెక్కువ, నాకు మహాభారతాభిమాన మెక్కువ"49 అంటూ కవిత్రయంలో ప్రథముడైన నన్నయ కథను 'నారాయణ భట్టు'లో చిత్రీకరించాడు. "ఇప్పటికి ౯౦౦ సంవత్సరముల క్రిందట తెలుగు దేశంలో రాజమహేంద్రపురములో అట్లు స్మరింపదగిన ముయ్వురు పవిత్ర మూర్తులు వెలసిరి. నారాయణభట్టు, నన్నయభట్టు, రాజరాజ నరేంద్రుడు - 'కలి కాలజదోషతుషార సంహతిని దవ్వుగ జేసిన' తేజోమూర్తులు వారు!"... "చరిత్ర రచనపరమావధి యట్టి పుణ్యపురుషుల గుణాను కీర్తనమే."50

'రుద్రమ దేవి'కి రాసిన పీఠికలోను ఆయన అదే ప్రస్తావించాడు." భారత ధర్మము ఏయే కాలముల నెట్లెట్లు విజృంభించినదో వర్ణించుటే ఈ నవలలు వ్రాయుట కుద్యమించుటకు ప్రధాన కారణము. కాని మూడింటియందును మూడు వేరు వేరు మార్గములను అవలంబింప ప్రయత్నించితిని. 'నారాయణభట్టు'లో అనేక ఘట్టములు సన్నివేశములు కల్పింపబడినవి. కాని యవి యన్నియు ఒకే విషయముపై - భారతాంధ్రీ కరణముతో ధర్మవ్యాప్తిపై - కేంద్రీకరించును. అందులో అంతరంగిక విప్లవము ప్రధానము... రుద్రమదేవిలో బాహ్యమైన విప్లవము ముఖ్యము. దాని నెదుర్కొనుటకు అంతరంగిక మగు పరస్పర విరుద్ధ శక్తులెన్నియో ఏకమై ఆత్మస్థైర్యము సాధించిన విధము దానిలో చిత్రింప బడినది."51

"కవిత్రయము వారి కాలములను ప్రదర్శింపవలెనని రచించిన నవలా త్రయము దీనితో పూర్తియైనది. నారాయణ భట్టులో నన్నయను, రుద్రమ దేవిలో తిక్కనను, ఈ మల్లారెడ్డిలో ఎఱ్ఱయను ప్రధాన పురుషులుగా గ్రహించి తిని".52 అన్నాడు 'మల్లారెడ్డికి' రాసిన పీఠికలో.

చారిత్రిక నవలా రచనకు చరిత్ర పరిశోధన అవసరం. తెలుగులో ఇది మరింత అవసరం. "సమగ్రమగు ఆంధ్రుల చరిత్ర మిప్పటికిని వెలువడలేదు. ఉన్నకొలది మంది చరిత్ర కారులును ఒకరితో నొకరు ఏకీభవింపరు. ఇట్టి సందర్భమున చారిత్రక నవలలు వ్రాయ యత్నించు వారికి బహు ప్రయాసపడి

మూలాధారముల శోధించుట తప్పుటలేదు."53 అని రాసుకున్నాడు నోరి నరసింహశాస్త్రి 'రుద్రమదేవి' పీఠికలో. నారాయణభట్టు రచనలోనూత "నాకు సాధ్యమైనంతవరకు ఆకాలపు చరిత్ర సంపాదించితిని... ఆనాటి చరిత్ర భాసించునంతవరకు మాత్రము ఇది సత్యదూరము కాదని నా విశ్వాసము."54 అన్నాడు 'ధూర్జటి' పీఠికలో రచనకు ప్రేరణ ఎలా కలిగిందో చెప్పుకొన్నాడు." ఒకనాటి ఉదయం రైలులో రేపల్లెకు వస్తూ శ్రీకాళహస్తీశ్వర శతకం చదువుతూ ఉండగా కవి ధూర్జటి స్వరూపస్వభావాదులు ప్రత్యక్షమైనట్లయినది. అప్పుడే ధూర్జటి నవల వ్రాయవలెననిపించినది."55

చారిత్రక నవల చరిత్రకాదు. కళారూపం. అందువల్లనే "చరిత్రకు సత్యము కావలె. నవలకు కల్పనతో కూడిన సౌందర్య మవసరము. చారిత్రక నవల సత్య సౌందర్యముల సమ్మేళనము" అన్న బెజవాడ గోపాలరెడ్డి నిర్వచనాన్ని ఉట్టంకిస్తూ "వారి నిర్వచనమున కనుగుణముగా ఈ నవల ఉన్నదని సహృదయులు భావించినచో నేను కృతజ్ఞుడను"56 అన్నాడు 'ధూర్జటి' పీఠికలో నోరినరసింహశాస్త్రి.

చలం ఒక ఉప్పెన, ఓ ప్రభంజనం. భావుకుడైనా, వాస్తవికతకు దూరం కానివాడు; కవి; వ్యక్తి స్వాతంత్ర్యానికి పరితపించినవాడు. "నాటి సాంఘిక వ్యవస్థలో ప్రచురంగా కనపడిన పురుషుని దౌష్ట్యం, ఆత్మవంచన, అల్పత్వం, నీచత్వం, చలానికి ఆగ్రహాన్ని తెప్పించాయి. దీనికితోడుగా స్త్రీలు అన్యాయానికి, వంచనకు, బానిసత్వానికి గురికావటం ఆయన ఓర్చుకోలేకపోయాడు." అందుకే చలం 'శశిరేఖ'కు పీఠికరాస్తూ శివశంకరశాస్త్రి సాంఘిక ధర్మములకంటే మానవ ధర్మములు ఉత్తమమైనవన్నాడు. "ఈ నవల నీతిబాహ్యమని కొందరంటారు. కాదని మరికొందరంటారు. సాహిత్యానికి నీతితో పనిలేదు; రమణీయార్థము ప్రతిపాదించటమే కావ్యోద్దేశము. నీతులు ఏకరువు పెట్టటమే ప్రధానమైతే వ్యాసాలు రాసుకోవచ్చును ఉపన్యాసాలు చెప్పుకోవచ్చును, రెండు కాకపోతే ధర్మగ్రంథములు రచించుకోవచ్చును అని చాలమంది రసికుల ఆశయము."58

ఆధునిక నవల : మలిదశ

"కవిత్వంలో భావ కవిత్వ ధోరణులనుంచి ఆధునిక కవిత్వ మార్గాల లోకి అడుగుపెట్టినట్లుగా నవలా రచనలో కూడా 1940 వ సంవత్సరం తరువాత ఇతివృత్తంలోను, శిల్పంలోను, నిర్వహణలోను నవీన పంథాలు బయలుదేరాయి. మనో విశ్లేషణం, తాత్త్విక చింతన, రాజకీయ సిద్ధాంత విశ్లేషణం మొదలైన వన్నీ నవల్లో చోటుచేసుకున్నాయి. అంటే సిద్ధాంత ప్రతిపాదనకు అనుగుణమైన పాత్రచిత్రణం చేసి సామాజిక పరిస్థితులను విశ్లేషించడం, వ్యాఖ్యానించడం రచయితలు ప్రారంభించారు."

"దేశభక్తి, జాతీయోద్యమం, పూర్వవైభవ స్మరణం, స్వాతంత్ర్య ప్రబోధం మొదలైన ఇతివృత్తాలు క్రమంగా సన్నగిల్లిపోయి సామాజిక దృక్పథం, వాస్తవిక చిత్రణం ప్రాధాన్యం వహించాయి. కొడవటి గంటి కుటుంబరావు, గోపీచంద్, జి. వి. కృష్ణారావు, బుచ్చిబాబులు కొత్త తరహా నవలలు వ్రాశారు."59

అయితే గోపీచంద్, జి. వి. కృష్ణారావు, బుచ్చిబాబులు ప్రత్యేక ధోరణులు కలిగినా ఒక కోవకు చెందినవారు. కొడవటిగంటి కుటుంబరావు సామాజిక సిద్ధాంతాల గూర్చి స్పష్టమైన అవగాహనవున్న రచయిత. ఆర్థిక సంబంధాలే సామాజిక సంబంధాలను నిర్ణయిస్తాయని భావించిన వ్యక్తి.

జి. వి. కృష్ణారావు వ్యక్తికి ప్రాధాన్యమిచ్చిన రచయిత. ఆయన రాసిన 'కీలుబొమ్మలు' మనిషిలోని బాహ్యాభ్యంతర ప్రవృత్తులను, సంఘర్షణల, పాప పుణ్యాల భావనలను, అవి వ్యక్తిని ప్రభావితం చేయటం, ఆదర్శ ప్రవచనం వాస్తవికతల మధ్యవుండే అంతరాలను చిత్రిస్తుంది. ఆయన రచనలో అనుభూతి ప్రధానం. 'కీలుబొమ్మలు' 'ప్రస్తావన'లో "ఇది ప్రణయగాథ కాదు, ప్రాచీన చరిత్ర కాదు, భారతీయ ధర్మవిశిష్టతా బోధకం కాదు. వ్యక్తులను కాని, పార్టీలనుకాని, వస్తున్న ఎన్నికలను కాని ఉద్దేశించి దీనిని వ్రాయలేదు... ఈ రచనకు కళానుభూతే ప్రధానం. పార్టీ ఆవేశాలను సాధ్యమైనంతవరకు మానవి చదివినప్పుడే ఆ అనుభూతి ఇందులో సాధ్యం."60 అంటాడు జి. వి. కృష్ణారావు.

ఒకే ఒక్క నవల 'చివరకు మిగిలేది'తో నవలాకారుడుగా పేరుపొందిన వాడు బుచ్చిబాబు. మనుష్యులు పరస్పరం అసహ్యించుకోవటాన్ని, మానవ జీవితంలోని అపశ్రుతుల కారణాన్ని వెతకటానికి ప్రయత్నించి, తాత్విక దృష్టితో రాసిన నవల 'చివరకు మిగిలేది'. తన 'చివరకు మిగిలేది'కి రాసిన 'సమర్పణ'లో బుచ్చిబాబే చెప్పుకున్నాడు. "జీవితంపై వొక దృక్పథాన్ని కలగజెయ్యాలన్న వుద్దేశంతోనే ఈ రచన సాగింది. ఆర్థిక సాంఘిక చారిత్రక వ్యత్యాసాలకతీతమై, మనిషినీ మనిషినీ స్నేహపాశంతో బంధించి లేక మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూసినప్పుడు, ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఈ జీవిత రహస్యం - దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నం - ఏ గ్రంథానికైనా ఇవి పునాది. ఈ నవలకీ అవే పునాది."

"సమాజాల మధ్య వున్న ద్వేషాలకీ, వ్యక్తులు ప్రేమించలేక పోవడానికీ ఏదో సంబంధం వుండి వుండాలని నా నమ్మకం. అదేమిటో, ఎల్లా వుంటుందో కనుక్కుందామని ఈ నవలా రచన సాగిందనిపిస్తుంది."61

ఆక్కిరాజు రమాపతిరావు గోపీచంద్ గూర్చి యిలా అన్నాడు. "శ్రీగోపీచంద్‌ది ఒక విలక్షణమైన శైలి. ఆయన 'అసమర్థుని జీవితయాత్ర' మొదలుకొని అసంపూర్ణంగా వదిలిపెట్టిన 'చీకటి గదుల' వరకూ ఆయనలోని తాత్త్విక చింతన ఏయే అగాధమైన లోతులను స్పృశిస్తూ వచ్చిందో, ఏయే పున్నత శిఖరాల విహరిస్తూ వచ్చిందో, క్రమపరిణామశీలంగా గమనించవచ్చు. హేతువాద దృక్పథంతో జీవితంలోకి చొచ్చుకొని వచ్చి పూర్ణయోగం దాకా ఎదిగిన నిరంతర పరిశ్రమ, సాధన, జిజ్ఞాస గోపీచంద్ జీవితంలోని విలక్షణతలు. "ఎందుకు" అని ప్రశ్నించటంతో ముందుకుసాగి "ఇందుకు" అని సమన్వయ ప్రతిపాదన చేయగల ప్రతిభాశాలిత్వం గోపీచంద్ రచనలలో కనపడుతుంది."62 గోపీచంద్ 'శిథిలాలయం' పీఠికలో బైరాగి ఇదే స్పష్టం చేస్తాడు. "మతిమంతులు తమ తమ వలయాలను అధిగమించి, అన్ని వలయాలను, అన్ని పరిస్థితులనూ సమన్వయ పరచుకొని పురోగమించటానికి దోహదం చెయ్యగలిగిన శక్తిని పెంపొందించుకోవాలి. ఈ శక్తి మనస్సుకు లేదు. ఇందుకు మానవుడు మనస్సుపైన

వున్న అంతస్థులను చేరుకోవాలి. ఈ అవసరాన్ని ప్రస్తావించటమే ఈ నవల యొక్క ఆదర్శం"63

గోపీచంద్ 'అసమర్థుని జీవితయాత్ర'కు ప్రవేశిక రాసిన ఆర్.ఎస్. సుదర్శనం ఇలా అన్నాడు "జీవితానికి అర్థాన్ని జీవితమే ప్రసాదించాలి. సిద్ధాంతాలు ప్రసాదించవు! హేతువాదమూ, మరొకవాదమూ జీవించటం చేతగాని అసమర్థునికి జీవించటం నేర్పలేవుకదా."

"ఆలోచనలో కేవలం హేతువాద దృక్పథపు ప్రాభవానికీ, లోకం పట్ల కేవలం సామాజిక దృష్టికీ స్వస్తి చెప్పి గోపీచంద్ విచికిత్సబదులు విశ్వాసాన్ని పెంపొందించుకున్నాడు. ఆ విశ్వాసం మానవుడి మీద, సామాజిక విప్లవం మీద కాదు. వ్యక్తియైన మానవుడి మీద."64

తెలంగాణా ఉద్యమాన్ని ప్రతిబింబించే నవలలు :

'ఓనమాలు', 'రథచక్రాలు', 'దవానలం' అనే పేర్లతో తెలంగాణా భూస్వామ్య వ్యతిరేకోద్యమం ఇతివృత్తంగా మూడు నవలలు రాశాడు మహీధర రామమోహనరావు. ఇదే ఇతివృత్తంతో వచ్చిన యింకో నవల వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజలమనిషి' తరతరాలుగా అణగదొక్కబడి, అక్షరాస్యత లేని సామాన్య జనంలో చైతన్యం తీసుకురావటానికి ఉద్యమ కార్యకర్తలు చేసినకృషీ, త్యాగం దీనిలోని ఇతివృత్తం. ప్రజల మనిషి పీఠికలో "చాలభయంతో ఈ నవలను బయటికి తెస్తున్నాను. నవలలో తెలంగాణా జన సామాన్యంతో పాటు, సర్వసామాన్యంగా అందరూ మాట్లాడే భాషను సంభాషణల్లో రాశాను. మరి ఎంతవరకు సఫలుడనయ్యానో! ఇక నవల కథావిషయం 1938లో హైదరాబాదు స్టేటు కాంగ్రెసు పుట్టుటకు పూర్వం తెలంగాణా వాతావరణాన్ని ఆధారం చేసుకొని, దాని ప్రభావం నుండి బయలుదేరిన ఒకరిని కథానాయకుడుగా తీసుకున్నాను."65 వట్టికోట ఆళ్వారు స్వామి 'గంగు'కు పీఠిక రాసిన ప్రకాశకులు యిలా రాశారు. "ఆనాటి ఉద్యమాలలో పాల్గొని శిక్షలను అనుభవించిన వారు శ్రీ ఆళ్వారు స్వామి. కమ్యూనిష్టు పార్టీ సిద్ధాంతాలను, తప్పు సమన్వయాలతో సహా, తను వాదనల్లో వినిపించి, అభిమానాన్నీ, అపహాస్యాన్నీ చూరగొన్నవారు శ్రీ స్వామి. అందుచేతనే, ఆయన ఆనాటి పార్టీ కార్యకర్తల జీవితాన్ని, కార్యదీక్షను, త్యాగనిరతిని, ఆలోచనా విధానాన్ని యథార్థంగా చిత్రించ గలిగారు."

"ఈ విధంగా వారి 'గంగు' రాజకీయ నవలకన్నా చారిత్రక నవల అనడం సముచితం అవుతుందేమో."66

తెలంగాణా ఉద్యమాన్ని ప్రతిబింబించిన మరో నవల బొల్లిముంత శివ రామకృష్ణ 'మృత్యుంజయులు'. "ప్రజల ఈ వీరోచిత ప్రతిఘటనను రచయిత ఈ నవలయందు చాల సజీవంగా చిత్రించాడు. అంతేకాదు. రచయిత హైదరా బాదు ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు తన నవల ద్వారా ఒక సందేశాన్ని ఇస్తు న్నాడు. ప్రభుత్వ తుది ఆయుధమైన మిలటరీని ప్రతిఘటించుటకు నిరాయుధు లైన ప్రజలు ప్రపంచమంతటా అవలంబించవలసిన పోరాట విధానాన్ని సూచిం చాడు. అదే 'గెరిల్లా' పోరాటం. నైజాం నిరంకుశ జాగీర్దారీ విధానాన్ని నాశనం చేయుటకు గెరిల్లా పోరాటం తప్ప వేరేమార్గం లేదని చాటాడు."

"తెలుగులో ఆంధ్ర ప్రజా జీవితాన్ని సజీవంగా చిత్రించే పుస్తకాలు చాలా తక్కువ. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రచించిన 'మాలపల్లి' లాంటి పుస్తకాలు ఒకటి రెండు మాత్రమే కనబడుచున్నవి. ఇక తెలంగాణా ఆంధ్రప్రజల జీవితాన్ని చిత్రించే పుస్తకాల గురించి చెప్పవలసిన అవసరమే లేదు. శ్రీ బొల్లిముంత శివరామ కృష్ణయ్యగారు ఈ నవలను రచించి తెలుగు వాఙ్మయంలో నవలా రచనయందు ఈ లోపాన్ని దూరం చేయుటకు కృషి చేశా రని చెప్పవచ్చు"67 అని 'మృత్యుంజయులు'కు 'పరిచయం' రాసిన రావి నారాయణరెడ్డి అన్నాడు.

దాశరథి రంగాచార్య కూడ తెలంగాణా ఉద్యమాన్ని వర్ణించే నవలలు రాశాడు. ఆయన 'చిల్లర దేవుళ్ళు'కు పీఠిక రాసిన దేవులపల్లి రామానుజరావు "1947వ సంవత్సరానికి ముందు తెలంగాణా పరిస్థితులు తెలిసిన వారికి ఈ నవల కేవలం కల్పనాకథ కాక యథార్థమని స్పష్టము కాగలదు"68 అన్నాడు. అలాగే దాశరథి రంగాచార్య 'మోదుగుపూలు'కు పీఠిక రాసిన తిరుమల రామ చంద్ర "శ్రీ రంగాచార్యులు గారు ఆనాడు నిజాం పాలనలో ప్రజలు పడ్డబాధలు అన్యాయాలు, అక్రమాలు, అధికారుల నిరంకుశత్వం, ప్రజల నిస్సహాయత మొదలయిన వాటిని కన్నులకు కట్టేట్టు చిత్రించారు, ఈ నవల 'మోదుగుపూలు' లో"69 అన్నాడు.

సాహిత్యం ఉద్యమాలకు కారణం కాకపోయినా, దోహదం చేస్తుంది. తెలంగాణా ఉద్యమనవలలు ఆ బాధ్యతను నిర్వర్తించాయి.

గొప్ప చారిత్రక నవల :

తెలుగు సాహిత్యంలో యిలాంటి గొప్ప చారిత్రక నవల మరిలేదు అన్నట్లుగా తెన్నేటిసూరి 'చంఘిజ్ ఖాన్' రాశాడు. చరిత్రను సరైన పద్ధతిలో అధ్యయనం చేయటం, ఆర్థిక, సాంఘిక, చారిత్రక నేపథ్యంలో సత్యాన్వేషణ 'చంఘిజ్ ఖాన్'లో తెన్నేటి సూరి ప్రయత్నం. మంగోల్ ప్రజల చరిత్రను సముద్ధరించటానికి కృషి చేసిన హెన్రీ హెచ్. హోవర్త్ దంపతులకు, నవలను అంకితం చేశాడు. తెన్నేటి సూరి మానవతావాది. "హిట్లర్ మంగోల్ సైన్యం నమూనాలో తన సైన్యాన్ని తయారు చేశాడు; కాని తాను మాత్రం రాక్షసుడై కూర్చున్నాడు గాని, చంఘిజ్ ఖాన్ వంటి మానవుడు కాలేకపోయాడు. అందు చేతనే తన్నుతాను నాశనం చేసుకోవటమేకాక, తన జాతి నంతాకూడా మొత్తం వినాశదశకు నడిపించేశాడు."70 అన్నాడు సూరి తన పీఠికలో. ఒక మహోన్నత మానవుడైన చంఘిజ్ఖాన్ హృదయాన్ని వ్యక్తం చేయటానికే ఈ నవల రాస్తున్నా నన్నాడాయన. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీదమనకాండను, సామ్రాజ్యవాద తత్వాన్నీ, మానవ మారణహోమాన్నీ నిరసిస్తూ, కొంతమంది చరిత్రకారులు హంతకుడుగా, నియంతగా, దారిదోపిడీ దారుగా వర్ణించిన అనాగరకుడైన చంఘిజ్ఖాన్, హిట్లర్ కంటే ఎంత ఉన్నతుడో, ఏ కారణాలవల్ల అతణ్ణావిధంగా వర్ణించారో విశ్లేషించే ప్రయత్నం చేశాడు సూరి. సమకాలీన జీవితం ఆయన్ని ఒక్కసారి వెనక్కి చూచేట్లు చేసింది. ఇటీవల చైనాలోను, మంగోలియాలోనూ చంఘిజ్ఖాన్ చారిత్రక పాత్రను మళ్ళీ అంచనావేసే ప్రయత్నం జరుగుతున్నది. సూరి అభిప్రాయాలు ధృవపడుతున్నాయి.

రెండు దారులు :

తెలుగు నవల సమాజంలో, ప్రజలలో, భావాలలో వచ్చే మార్పులతో తానూ మారుతూవచ్చింది. ఒకవైపున సంప్రదాయ భావాలతో వైయక్తిక వాదంతో, తాత్వికతల మసాలాలతో నవలలు వస్తూనే వున్నాయి. రెండో వైపున సామ్యవాద దృక్పథంతో, సామాజిక స్పృహతో నవలారచన సాగింది.

కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటివారు రెండో తోవకు చెందినవారు. తాము నమ్మింది చెప్పాలి అనే దృక్పథంతో వారు

రాశారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి'కి పీఠికరాస్తూ "నా నమ్మకం ఇతరులకి తెలియజేయాలనే కోరిక నాలో ఎందుకు కలిగిందో నేను స్పష్టంగా చెప్పలేను. ఒకరు తెలుసుకున్నానన్న విషయం ఇంకొకరితో చెప్పడవే, లేకపోతే చెప్పాలనే కోరికే లేకపోతే మనుష్యులం ఈ విధంగా వుండనే వుండము... కవిత్వానికి మనుష్యుల్ని ఎటో అటు మళ్ళించే శక్తి కలదని నేను నమ్ముతాను. నిజాన్ని తెలుసుకోవడం అందులో మంచిచెడ్డలేవో నిర్ణయించుకోవడం, మనుష్యుల్ని మంచికి మళ్ళించడానికి ప్రయత్నించడం రచయితల కర్తవ్యం అని ప్రస్తుతం నేను అనుకుంటున్నాను... మంచికి హాని చెడ్డకు సహాయవూ, చెయ్యకూడదని నేను భావిస్తాను"71 అంటాడు.

పోలీసు రాజ్యాన్ని నిశితంగా విమర్శిస్తూ వచ్చిన నవల 'మాపల్లె'. రచయిత చెరబండరాజు 'పాఠకులతో'లో 'విద్యార్థుల్నీ, రైతుల్నీ, విప్లవ సానుభూతిపరుల్నీ 'మార్క్సిస్టు - లెనినిస్టు' పార్టీ కార్యకర్తల్నీ విప్లవ రచయితల్నీ కలిపి బనాయించిన సికిందరాబాదు 'కుట్ర' కేసులో అరెష్టయి అండర్ ట్రయిల్ ఖైదీగా వుంటున్న కాలంలో రాసిన నవల 'మాపల్లె'" అంటూ "ఈనాడున్న దేశంలోని విప్లవదశను బట్టి నా అవగాహన తప్పో ఒప్పో తెలీదు గాని పొట్టకూటికోసం తుపాకి పట్టిన పేద పోలీసులకు జనరల్‌గా 'అప్పీల్' చెయ్యాలేగాని 'అటాక్' చెయ్యగూడదేమో అనుకుంటున్నాను"72 అని రాశాడు.

భావవాద దృష్టితో సృజనాత్మక నవలాప్రక్రియను చేపట్టి, మార్క్సిస్టు తాత్త్వికత ఆధారంగా తన రచనలనే తాను విమర్శించుకున్న రచయిత్రి రంగనాయకమ్మ. తన 'బలిపీఠం' ఆరోముద్రణకు 'ముందుమాట' రాస్తూ ఆమె యిలా అన్నది. "ఒక పుస్తకం రాసిన తర్వాత రెండు మూడేళ్ళయ్యేటప్పటికే అదికథావస్తువులోనో, శైలిలోనో, సంభాషణ విధానంలోనో, అభిప్రాయాల్లోనో నన్ను చాల అసంతృప్తి పరుస్తోంది. నాకెంతో నచ్చిన 'పేక మేడలు' రచయిత్రి నవలల్లో కూడ తర్వాత కాలంలో ఎన్నో అభిప్రాయ భేదాలు ప్రారంభమయ్యాయి. దాదాపు అన్నికథల గురించీ ఇప్పుడాలోచిస్తే, అసంతృప్తిగానే వుంది, కథావస్తువులూ సమస్యలూ అసహజంగాలేవు ఇప్పటికి. వాటిని నేను అర్థంచేసుకున్న తీరేచాల అసమగ్రం."

"అసమగ్రం అంటే, సమస్య తాలూకు మూలకారణాలు తెలుసుకోకుండా సమస్యని కూలంకషంగా పరిశీలించకుండా, అసలు విషయం గురించి ఎటువంటి శాస్త్రీయమైన అవగాహనా లేకుండా దాని పై స్వరూపాన్ని చూసి, సహజ ప్రభావంలో మాత్రమే విమర్శించడం, శుద్ధ భావవాద దృష్టితో సమస్యల్ని పరిష్కరించాలనుకోవడం."

"సాంఘిక సమస్యల్నీ, జీవితాల్నీ, పరిశీలించడానికి శాస్త్రీయదృక్పథం లేకపోతే, రచయితలు తెలుసుకునేది, సాహిత్యం ద్వారా చెప్పేదీ అంతా తప్పుడు విధానం అవుతుంది."73

'కృష్ణవేణి' పీఠికలో కూడ "ఈ నవల రాసినప్పుడు నేను రాజకీయంగా పొరపాటు అభిప్రాయాలతో వున్నానని ఇప్పుడీనవల చదివితే నాకేతెలుస్తుంది."74 అని రాసింది.

రంగనాయకమ్మ కలం చాలా వాడియైంది. 'జానకి విముక్తి'కి 'ముందు మాట' రాస్తూ "స్త్రీల సమస్యలు స్త్రీల జీవితాలకే పరిమితంకాదు. అవి పురుషుల జీవితాలకు సంబంధంలేని విషయాలు కావు. స్త్రీల సమస్యలమీద స్త్రీలకు సరైన జ్ఞానం కలగటం ఎంత అవసరమో పురుషులకు కూడా అంత అవసరమే"75 అన్నది.

'జానకి విముక్తి' ప్రచురణ 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలో ఆగిపోవటానికి కారణాలు వివరిస్తూ "దెయ్యాలకీ, భూతాలకీ, చేతబళ్ళకీ సాహిత్య విలువలు కల్పించే పత్రికలు 'జానకి విముక్తి'ని తీసెయ్యటంలో ఆశ్చర్యమేమీలేదు."

"ఇద్దరు 'భర్తల్ని' ఒకరికి తెలియకుండా ఒకర్ని పెళ్ళాడి, ఆ రహస్యం దాచటానికి డబ్బూ, నగలూ గుప్పిస్తూ సతమతమైపోయే స్త్రీ పాత్రలో వుదాత్తతా ఆరచనలో కళాత్మకతా చూడగలిగిన వాళ్ళకు 'జానకి విముక్తి' డాషింగ్ గాను, డైడాక్టిక్ గానూ, కళావిహీనంగాను కనపడటంలో ఆశ్చర్యంలేదు."

"అధమస్థాయి పాఠకుడివెంట పత్రికలూ, ఆ పత్రికలవెంట రచయితలూ శరవేగంతో పరుగులు తీస్తున్నారు. ఇదీ ఈనాటి పత్రికా ప్రపంచంలో ప్రధానమైన ధోరణి."76 అని రాసింది.

అభ్యుదయ భావాలతో రాసే రచయిత్రులలో వాసిరెడ్డి సీతాదేవి ఒకరు. ఆమె 'మట్టిమనిషి'కి 'ఏవరీ...మనిషి' అన్న శీర్షికతో పీఠిక రాసిన పండితారాధ్యుల నాగేశ్వరరావు "చదువరులలో పఠనాశక్తిని కల్గించిన చౌకబారు సాహిత్యం క్రమంగా తగ్గి పాఠకులలో ఉన్నత ఆశయాలను ఉదాత్తమైన ఆలోచనలను, అభ్యుదయకరమైన భావాలను కలిగించే సాహిత్యం వస్తున్నది. ఒకప్పుడు అడ్డంగా మాత్రమే పెరుగుతున్న నవలా సాహిత్యం ఇప్పుడు నిలువుగా కూడా పెరుగుతున్నది."77 అన్న ఆశాభావం చూపించాడు.

సామ్యవాద దృక్పథంతో, సామాజిక స్పృహతో వచ్చే రచనలతో పాటు సాంప్రదాయ రచనలూ, వైయక్తిక వాద ధోరణులు, తాత్వికత మిళాయింపు నవలలు వస్తున్నాయనుకున్నాం.

మల్లాది రామకృష్ణశాస్త్రి వచనం ప్రవాహ వేగంతో సాగిపోతుంది. ఆయన రాసింది వచనంలో అయినా కవితా ధోరణి కలిగింది. సాంప్రదాయకత ఆయన రచనలో చక్కగా ప్రతిఫలిస్తుంది. మల్లాదిరామకృష్ణశాస్త్రి 'కృష్ణాతీరం' నవలకు 'మానసోల్లాసం' రాసిన బి. నళినీకాంతరావు, పి.ఎస్. గోపాలకృష్ణ ఇలా అన్నారు. "కృష్ణా తీరంలోని వెలనాటి వైదిక కుటుంబాలు ఈ నవలలో శాస్త్రిగారి సమరాంగణం. వారి పోకడలూ, మెలకువలూ ఆయన వాక్యాలు. వారి కష్టసుఖాలే ఈ నవలలోని సంఘటనలు. ఈ నవల చదివితే తెలుగు కుటుంబాల ఆపేక్షలు, అంతఃకరణలు ఎలాంటివో, ఆ మర్యాదలు, మన్ననలు ఎట్టివో అర్థమవుతుంది. ముచ్చటవుతుంది. శాస్త్రిగారికి అభిజనం మీద ఉండే అభిమానాన్ని కూడా వెల్లడి చేస్తుంది ఈ పుస్తకనామం."78

వ్యక్తి వాద తాత్త్వికధోరణిలో వుంటాయి భాస్కరభట్ల కృష్ణారావు, వడ్డెర చండీదాస్‌ల రచనలు భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచిక పుల్లలు'కు పరిచయం రాస్తూ గోపీచంద్ యిలా అన్నాడు. "మనిషిని అర్థం చేసుకోవాలంటే, ఏ మనిషికి ఆ మనిషినే పరిశీలించాలి. ఏ ఇద్దరినీ కూడగట్టుకొని వారికి సరిపోయే సిద్ధాంతాన్ని సృష్టించలేం. మనిషి అంటే ఇది అని మనుష్యులందరికీ సరిపోయే నిర్వచనం అసలే చెయ్యలేం. ఎప్పుడైనా పదిమందికీ సరిపోయే సిద్ధాంత నిర్వచనకు పూనుకున్నామో అప్పుడే మనిషిలో వున్న

ప్రత్యేకత దెబ్బతింటుంది. ఎప్పుడైతే మనిషిలో వున్న ప్రత్యేకత దెబ్బ తింటుందో, అప్పుడే అతనిలో వున్న సృజనాత్మకశక్తి ఇంకిపోతుంది. సృజనాత్మకశక్తిని కోల్పోయిన మనిషి మనిషి కాదు; యంత్రం."

"ఈ విధంగా నడుస్తుంది అస్తిత్వ వాదం. ఈ వాదం మనిషిని పార్టీకి లోబరిచిన కమ్యూనిష్టు పార్టీకి, స్టేట్‌కి లోబరిచిన హిట్లరిజానికి ప్రతిగా పెరిగింది."

"ఈ గ్రంథకర్త భాస్కరభట్ల కృష్ణారావుగారు ఈ తాత్త్విక రచనలను చదివి జీర్ణించుకుని ఆకర్షింపబడి ఈ గ్రంథరచనకు ఉపక్రమించినట్లు ఈ గ్రంథం మొదటి పేజీలు చదువగానే బోధపడుతుంది."79

వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల'కు 'ఒక వురుమూ, ఒక మెరుపూ' రాసిన పురాణం సుబ్రహ్మణ్య శర్మ యిలా అంటాడు. "శ్రీ చండీదాస్ వ్యక్తి వాదాన్ని సమర్థిస్తారు. వ్యక్తి వినా సంఘం లేదు అంటారు. వ్యక్తి వాదం వర్గ స్వభావాన్ని దాచుకుందుకు వుపయోగపడే ముసుగు మాత్రమే. ఈ వ్యక్తివాదం రాజకీయాల్లో తటస్థవాదం లాంటిది. మానవతా వాదులు, వ్యక్తి వాదులూ మార్క్సును వ్యతిరేకిస్తారు. సాహిత్యానికి రాజకీయాలకు వుండే సంబంధాన్ని తెలుసుకోకపోతే రచయిత శక్తి సమాజానికి వుపయోగపడకుండా తోమిన చెంబుల్లాంటి కళాఖండాల్ని సృష్టిస్తూ పోతుంది... సాహిత్యం కూడ ఉత్తేజకరమైన పానీయం లాంటిది. 'హిమజ్వాల' ఎటువంటి కిక్కిస్తుందో పాఠకులు ఎవరికివారే నిర్ణయించుకోవాలి."80

ప్రయోగాలు :

కొత్తదనానికి కొత్త టెక్నిక్‌లు ఉపయోగించిన రచయితలున్నారు. 'వెలుగు వెల్లువా - గోదారీ'లో గోదావరి మండల మాండలికంలో రచన సాగించిన పోరంకి దక్షిణామూర్తి. 'రంగవల్లి' పీఠికలో మూడు మాండలికాల లోను తొలి నవలలు రాసిన గౌరవం తనదేనంటాడు 81

చైతన్య స్రవంతి శిల్పంతో నవీన్ 'అంపశయ్య' రాశాడు. అయితే "ఈ నవలలో నేను కేవలం చైతన్య స్రవంతి శిల్పంమీద మోజుతోనే రాయలేదు చైతన్య స్రవంతి శిల్పం నేను యెంచుకున్న వస్తువుకు చక్కగా సరిపోతుందన్న దృష్టితోనే ఆ శిల్పాన్ని యెంచుకున్నాను. వస్తువుకు విడివడిన శిల్పం వేరేలేదు."

"సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం ఉండి తీరాలని నేను నమ్ముతాను. సాహిత్యం పాఠకుడి యొక్క చైతన్య పరిధిని విస్తృతం చేయాలి. రచయిత ఎన్ని ప్రయోగాలు చేసినా ఈ ప్రయోజనాన్ని సాధించలేకపోతే ఆ ప్రయోగాలన్నీ వ్యర్థమే."[82] అని ఆయన అభిప్రాయం. గొలుసు నవలలు, ఉత్తరాల నవలలూ మొదలైన ప్రయోగాలు కూడా జరిగాయి.

నవలా థ్రిల్లర్‌లు :

సామాజిక ప్రయోజన దృష్టిగాక సగటు మధ్యతరగతి పాఠకుణ్ణి ఊహాలోకాల్లో తిప్పి, సస్పెన్స్‌లో ముంచిఎత్తి, సాధారణంగా ఇంగ్లీషు థ్రిల్లర్‌లకు అనుసరణగా, కొన్నిచోట్ల మాతృకను పేర్కొనకుండా రచనచేసే రచయితలు ఇపుడు చాలామంది ఉన్నారు. యండమూరి వీరేంద్రనాథ్ 'తులసిదళం'కు పీఠిక 'నవలా థ్రిల్లర్' రాసిన కొమ్మూరి వేణుగోపాలరావు ఇలా అన్నాడు. "ఇటీవలి కాలంలో పాఠక లోకంలో యింతగా సంచలనాన్ని కలిగించిన నవల మరొకటి లేదు. ఆశ్చర్యమేమంటే యీ నవల్లో 'ప్రేమ' కథా వస్తువు కాకపోయినా, భయానకమైన యితివృత్తం నిండివున్నా అన్ని వర్గాల పాఠకుల్ని కూడా అమితంగా ఆకట్టుకోవటం. సాహిత్యపరంగా ఇది గొప్ప నవలా కాదా అన్న మీమాంస ఇక్కడ అనవసరం. 'తులసిదళం' గొప్ప థ్రిల్లర్. ఈ నవల పాప్యులారిటీని అంచనా వెయ్యటం కష్టం. పాఠకులెప్పుడూ వైవిధ్యం కోసం నిరీక్షిస్తారని ఈ నవల నిరూపించింది."[83] అయితే కొమ్మూరి వేణుగోపాలరావు ఈ పీఠికపై రంగనాయకమ్మ చేసిన విమర్శ, ఆయన కోర్టులో పరువునష్టం కేసు నడిపేటంతవరకూ వచ్చింది.

ఈ థ్రిల్లర్‌ల గూర్చి రాయటానికేమీ లేదన్నట్టుగానే వీటికి వచ్చిన పీఠికలు వుంటున్నాయి. ఉదాహరణకు 'తులసి' పీఠికకు ప్రకాశకులు 'ప్రియమైన పాఠకులకు' అంటూ యిలా రాశారు." అందమైన ఆడపిల్లకి అలంకారంగా మెడలో హారం, అందమైన నవలకి అలంకారంగా ముందుమాట పెట్టి పంపడం అనాదిగా వస్తున్న ఆచారం. నవల గొప్పదనాన్ని ముందుమాటలో చూచాయగా చెప్పి పాఠకుల్ని కండిషన్ చేయటం ప్రొఫెషనల్ సీక్రెట్. అయితే తెలుగు పాఠకులు ఈ స్థితి దాటిపోయారని 'తులసి' సీరియల్ తెలిపింది. నీరక్షీరాన్ని వారే వేరుచేయగల్గుతున్నారు. వారికి కావాల్సింది ఏదో వారు కోరుకొని తీసుకోగలుగుతున్నారు."

"అందుకే ఈ అమ్మాయికి మెడలో హారం లేకపోయినా అందం తగ్గదని మేము నమ్ముతున్నాం"[84] అన్నారు.

ఈ పరిశీలనలో ఎన్నో ప్రముఖ నవలల్ని పేర్కొనలేదు. కారణం ఆ నవలలకు పీఠికలు లేకపోవటం, పీఠికలున్నా అందులో చెప్పిందేమీ లేకపోవటం. నవలా రచన కవిత్వంలాగ కొత్త పుంతలు తొక్కినా, నవలా విమర్శ అంతంత మాత్రమే.

కథానిక :

"తెలుగుదేశం కథలకు కాణాచి. ప్రపంచంలో ఏ భాషకూ తీసిపోని కథా సాహిత్యం తెలుగువాళ్ళకుంది. ప్రపంచంలో ఏ భాషకయినా ప్రతిష్ఠ తేగల కథకులు తెలుగుదేశంలో వున్నారు. అయితే రాసి విషయంలో నయితేనేం వాసి విషయంలో నయితేనేం - కథా సాహిత్య పరిస్థితి తెలుగువాళ్ళ అభిరుచులకు, దక్షతలకూ, అవగాహనకూ, కృషికీ ప్రతిబింబమేనని చెప్పాలి. అంటే మనమెందాకా పెరిగితే మన 'కథ' కూడా అందాకా పెరుగుతుందని తాత్పర్యం."[85] అంటాడు పోరంకి దక్షిణామూర్తి.

కథలు పెరిగినా తెలుగు కథానికా విమర్శ పెరగలేదు. పెద్ద పెద్ద నవలలకు, నాటకాలకే పీఠికలు రాయటం, విమర్శ చేయటం తక్కువగా ఉన్న సమయంలో ఒక కథను విమర్శించటం దానికి పీఠిక రాయటం అరుదే. కథానికా సాహిత్యంలో పీఠికలు సంకలనాలకు మాత్రమే వచ్చాయి. ఈ పీఠికల్లో పీఠికా కర్తలు చర్చించిన విషయాలు కథారూపం, పరిధి, విషయం, పరిణామం, టెక్నిక్, భాష, సంకలనంలో వున్న ప్రత్యేక కథల పరిచయం.

పరిధి : విషయం :

ఎం. హీరాలాల్ రాయ్ 'బ్రతుకుబాటలు'కు పరిచయం రాస్తూ డి. రామలింగం కథానిక పరిధిని యిలా చెప్పాడు. "కథానిక జీవితంలోని ఒక సంఘటనను చిత్రించవచ్చు. సంఘటన అనటానికి వీలులేనంతటి సూక్ష్మమైన విషయాన్ని విడమర్చి చెప్పవచ్చు. వివిధ మనస్తత్వాలను చూపవచ్చు. వాతావరణాన్ని కథనం చెయ్యొచ్చు. ఏదో విచిత్రమైన ఊహను, అనుభవాన్ని చెప్పవచ్చు

వ్యక్తిత్వాన్ని చూపెట్టవచ్చు. మానసికమైన అనుభూతుల్ని చిత్రించవచ్చు. జీవితాన్నే ఛాయాచిత్రంగా చూపించేదికావచ్చు. కాని ప్రసిద్ధ చైనా రచయిత 'లిన్‌యూటాంగ్' అన్నట్లు చదువరికి మానవ స్వభావం తెలుసుకున్నాననే తృప్తి కలిగినా జీవితాన్ని గురించిన జ్ఞానం విశాలపడిందని భావించినా మరొక మానవుని మీద జాలి, ప్రేమ సానుభూతి పొటమరించినట్లు అనిపించినా ఏ కథ అయినా తన ప్రయోజనాన్ని సాధించినట్లే."86

"స్వయం సమగ్రత, ఏకాంశ వ్యగ్రత, సంక్షిప్తత"87 అనేవి ప్రధాన లక్షణాలుగా భావించింది ఆవుల జయప్రదాదేవి.

"కథానిక విషయం ఉదాత్తమైనది కావాలి. శృంగారాది రసములలో ఏ రసమునకు సంబంధించినదైనా అయివుండవచ్చు. జిగి లేక పోవడము, నీరస మైన భాష, పులుముడు, అసభ్య విషయ వర్ణన, ఆగమ్యత ఇవి కథానికకు దోషములు. శాఖా చంక్రమణం పనికిరాదు. కథానిక రక్తనాళంద్వారా గాని, లేక గుండెలోనికి నేరుగా గాని ఇచ్చే ఇంజక్షన్ వంటిది. గనుక డొంకతిరుగుడు అంతగా రాణించదు. కథానిక షడ్రసోపేతమైన విందు భోజనంవంటిది కాదు. ఏకరస పూర్ణమైన స్ఫాటిక పాత్రవంటిది. కడుపు నింపకపోయినా అంతలో సంతుష్టిని కూర్చుతుంది. అది నానా ఫల పుష్పశోభితమైన ఉద్యానవాటిక కాదుగాని విరియబూచి కంటికి, ఘ్రాణమునకు తర్పణంచేసే గులాబి మొక్క వంటిది."88 అంటూ కథానికపరిధిని వివరించాడు అడవి బాపిరాజు.

అందువల్లనే "చుట్టూవున్న జీవితాన్నే ఈ కథల్లో ఇతివృత్తంగా తీసు కొన్నాను. రక్తమాంసాలున్న మనుష్యరకాల్నే పాత్రలుగా చిత్రించడానికి ప్రయత్నించాను. పాత్రలు, జీవితంతో సంబంధంలేని గాలికబుర్లాడకుండా చూశాను. వస్తుశిల్పాలమధ్య సామరస్యంకోసం తపించాను"89 అంటాడు కేతు విశ్వనాథరెడ్డి 'జప్తు'కు రాసిన 'నామాట'లో.

ఏ సాహిత్య ప్రక్రియకైనా జీవితమే ఉదాహరణ. సుబ్బరామయ్య కథా రచనా వైశిష్ట్యం గురించి విశ్లేషణచేస్తూ "జీవితాన్ని అంటిపెట్టుకుని అటూ, ఇటూ బెసక్కుండా సాహిత్యసృష్టి చేయగల రచయితలు, ఏకాలంలోనైనా,

ఏదేశంలోనయినా అరుదు"[90] అంటూ పెద్దిభొట్ల సుబ్బరామయ్య అట్లాంటి వాడంటాడు పురాణం సుబ్రహ్మణ్యశర్మ.

మనస్సుకీ బాహ్యప్రపంచానికీ గల సంబంధం కథానికలో చెప్పవీలవుతుందంటాడు ఆర్. ఎస్. సుదర్శనం "మనస్సుకీ బాహ్యప్రపంచానికీగల సంబంధాన్ని గూర్చిన తత్వాన్వేషణ ఏడతెగని అన్వేషణ. దాని విన్యాసాన్ని జీవితానుభవాలద్వారా, సన్నివేశాలద్వారా చిత్రించిచూడడము సాహిత్యంలో తరచు ఎదురయ్యే ఇతివృత్తముకాదు. అది ఈ కథల విశిష్టత."[91]

"రచనకి కాలమే గీటురాయి, లోకమే ప్రమాణం. అనుభూతియే ఆత్మ; హృదయాన్ని స్పందించే అనుభూతికి తావలమైన రచన ఏదైనా శాశ్వతకాలం రహిస్తుంది.... జీవితాన్ని అర్థం చేసుకోవడానికి నేను చేసిన ప్రయత్నాల ఫలితాలే నాకథలు"[92] అంటాడు అరిపిరాల విశ్వం.

పరిణామం :

కథాపరిణామం నాల్గుదశలలో సాగినట్లుగా భావించాడు గోపీచంద్. మొదటిదశలో కథనము లాగే నడిచేది. రెండోదశలో ఒక సంఘటనను వర్ణించటమే కథ, మూడవదశలో సంఘటన, ప్లాట్ లేకుండానే వాతావరణాన్ని కల్పించటమేకథ. పైసరుకేమీ లేకుండానే చదువరిని మానవస్వభావంలోకి తొంగి చూడనిస్తేచాలు నాలుగవ దశలో[93].

భాష :

రాచమల్లు రామచంద్రారెడ్డి భాషను గురించిరాస్తూ మాండలికమూ, రెండు మూడు మాండలికాలు కల్తీ కావడమూ దానివల్ల కలిగే ఫలితాలను పరిశీలించాడు. "ఒకే ప్రాంతానికి చెందిన మనుషులైనా, వాళ్ళు మాట్లాడే భాషలో కులాలనుబట్టీ వృత్తులనుబట్టీ సామాజిక అంతస్తులను బట్టీ అనేక భేదాలు వున్నాయి. యిది ప్రపంచమంతటా వున్న వాస్తవం. ఈ వాస్తవాన్ని నాటకం ప్రతిబింబించాలి. వచన సాహిత్యంలోని యే శాఖ అయినా ప్రతిబింబించాలి. వాస్తవికత యీనాటి సాహిత్యానికి గీటురాయి."[94] భాష విషయంలో వాస్తవికతకు వున్న పరిమితులు, సమిష్టి సాహిత్య భాష సిద్ధించే మార్గం, అన్ని ప్రాంతాల వాళ్ళకు అర్థమయ్యే

టట్లు రాయడమనే లక్ష్యానికీ, వాస్తవిక సూత్రానికీ పొత్తుకుదరటం అన్న ప్రశ్న లను లేవనెత్తాడు రారా.

మాట్లాడే భాషలో రాయాలని అంటాడు డి. దుర్గాప్రసాద్. "గాలిలేకుండా ప్రాణం లేదు. మాట్లాడుకునే భాష లేకుండా మనుషుల్లేరు. గాలికి విలువలేక పోయినా మాట్లాడే భాషకి విలువపోదు. రచయితన్న వాడికి మాట్లాడేభాషలో రాయడంకన్నా మంచిపని మరొకటి లేదు."95

తెలంగాణా మాండలిక పదాలను కాపాడాలనే తాపత్రయం చూపించింది పి. యశోదారెడ్డి, "ఇప్పుడే తెలంగాణా తెలుగు కూడ తదితర ప్రాంతము లందువలెనె తన నిజస్వరూపమును చాలవరకు పోగొట్టుకొని నామమాత్రావశి ష్టమై యున్నది. కావున అమూల్యమైన ఆ పదబంధములు కాలగర్భంలో కలసి పోకుండునట్లుగ గ్రామీణ జన వ్యవహారమందున్న పద ప్రయోగములను కాపాడ వలెననెడి తాపత్రయమే ఈ కథల సంపుటికి కారణము."96

చివరి మాట :

వార మాస పత్రికలు పెరగటం కథానిక బహుళంగా ఉత్పత్తి కావటం జరుగుతోంది. అన్ని రకాల ధోరణుల్లోను కథానిక వస్తూనే వుంది. వాస్తవికత పై ఆధారపడి కథలొస్తున్నాయి. అయితే పండితుల దృష్టిలో కథానిక కింకా గౌరవం తగినంతగా లభించటం లేదు. కథానిక చిన్నదైనా పదునైన ఆయుధం. దానిమీద కావలసినంత విమర్శరాలేదు. సంకలనాల పీఠికలలోనూ సాహిత్య సిద్ధాంతాల చర్చ జరగలేదు. అయా కథలకు కథానికా సంకలనాలకు మాత్రమే పరిమితమయ్యాయవి. చాలా మంది పీఠికా కర్తలు కథానికను నిర్వచించడమే కష్టమన్నారు. భిన్న సామాజికోద్యమాల ప్రభావం కథానికల మీద ఉన్నంతగా వాటి పీఠికలమీద లేదు.

విమర్శ :

తొలి దశ : దోషాన్వేషణ :

ఆధునిక తెలుగు సాహిత్యంలో విమర్శ కందుకూరి వీరేశలింగం విగ్రహ తంత్ర విమర్శనంతోనే మొదలైందని పలువురంటున్నారు. ఈ విమర్శ ప్రధానంగా విగ్రహతంత్రంలోని దోషాలను వెలికి తీయడానికే ఉద్దేశించింది.

అందుకే ఇందులో గుణాలకోసం పరిశీలించడం "కుమ్మరావములో నిత్తడి ముంతల కొరకు వెదకునట్లుండు"97నని గ్రంథ పీఠికలో కందుకూరి అన్నాడు. విమర్శ అంటే గుణదోష పరిశీలనమన్న విషయాన్ని అందరూ అంగీకరించినా చాలా కాలంవరకు దోషాలను వెల్లడి చేయడమే ప్రధాన లక్ష్యంగా సాగింది.

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి 'వివేక చంద్రికా విమర్శనము' కూడా ఇటు వంటిదే. దీని పీఠికలోనే తెలుగులో నవలా ప్రక్రియకు నవల అన్న పేరు స్థిరపడింది. "హూణ భాష యందును నీ మాటకిదే యర్థమగుటచే నవలయను పదమునకు సరియగు వేరొక సంస్కృత పదమునకయి ప్రయత్నముచేయక 'నవల'యని ఈ పదమునే నేనిట వాడుచున్నాను"98 అన్నాడు.

గ్రంథాలపై ఖండనాత్మకమైన విమర్శలు, వాటికి సమాధానాలు గ్రంథ రూపంలో వచ్చాయి. వాటి పీఠికలు ప్రధానంగా వాద విషయాన్ని చెప్తూ వాదానికి సంబంధించిన చరిత్రను వివరిస్తాయి. పరస్పర నిందారోపణలు తమ ప్రవర్తనను సమర్థించుకోవడమూ, అనుకూలంగా ఇతర పండితుల అభిప్రాయాలను ప్రకటించుకోవడమూ ఈ విమర్శలలో సర్వసాధారణంగా కనిపిస్తాయి. మల్లాది సూర్యనారాయణశాస్త్రి ఆంధ్ర దశరూపకంమీద విశేషంగా వాగ్వివాదం జరిగింది. వెల్లాల సదాశివశాస్త్రి చేసిన ఆక్షేపణలకు సమాధానంగా సూర్యనారాయణశాస్త్రి ఖండనలు ప్రకటిస్తే, ఆయన 'ఖండనాభాస నిరాసము' ప్రకటించాడు. తమ వాదాలకు మాధ్యస్థాన్ని కోరి వారి తీర్పు రాకముందే ఈ ఖండనాన్ని ప్రకటించడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తూ వెల్లాల సదాశివశాస్త్రి ఈ గ్రంథాన్ని ప్రకటించాడు. ఆక్షేప సమాధానరూపంలో ఈ గ్రంథ రచన జరిగింది.99 మల్లాది సూర్యనారాయణశాస్త్రి వాదానికి వ్యతిరేకంగా పండితుల అభిప్రాయాలను 'పండితాభిప్రాయమణిమాలిక' అన్న పేరుతో మరొకగ్రంథంగా వెల్లాల సదాశివశాస్త్రి సంపాదకత్వంలో ప్రకటించడం జరిగింది.100

రామచంద్రశాస్త్రి రచించిన 'భారతీ తారామాలా' అనే చిన్న సంస్కృత రచనను విమర్శిస్తూ 'రామచంద్ర చరితము' అనే విమర్శ గ్రంథాన్ని ప్రకటించాడు కే. శివశాస్త్రి. "కవితాసామగ్రీ దరిద్రుండయి పదపదార్థజ్ఞానము చక్కగ లేక దుష్టకావ్యము చేసి యంతటితో నుండక ముద్రించి మూలనున్నవారికిఁబంచి

పెద్ద డంభాచారి వేషముతో విఱ్ఱవీగుచున్నపుడెవఁడో కొమ్ములు మిఱుగఁగొట్టక పోఁడు"[101] అన్నాడు ఈ గ్రంథ పీఠికలో ఆయన.

వేదం వేంకటరాయశాస్త్రి చాలా తీవ్రమైన గ్రంథ విమర్శలు చేశారు. ఆయన గ్రంథ విమర్శల్లో ప్రధానంగా చెప్పుకోదగింది 'ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శనము'. కొక్కొండ వేంకటరత్నం నాటకాన్ని ఈ గ్రంథంలో నిర్దాక్షిణ్యంగా విమర్శించడం జరిగింది. గ్రంథావతారికలో "ఈ కాలములో ఆంధ్రభాషలో ప్రబంధములు పెచ్చు పెరుఁగుచున్నవిగదా. వానిలో అనేకముల వలన భాషకుం గడుం జెట్ట గలుగుచుంటం గాంచి, ఏదే నొక గ్రంథమాధారముగా నీ చెఱుపెల్ల విద్యార్థి జనోపయోగమునకై భాషారక్షకై వెల్లడి సేయఁ దలంపుఁగొన్న వాఁడనై, అట్టి యిప్పటి గ్రంథములలో నెల్ల మ.రా.రా.శ్రీ కొక్కొండ వేంకటరత్నం పంతులవారు రచియించిన యాంధ్ర ప్రసన్న రాఘవము నా యుద్యమమున కత్యంతోపయుక్తముగా నున్నందున దానిని విమర్శింప దొరకొంటిని"[102] అన్నాడు వేదం వేంకటరాయశాస్త్రి. ఈ గ్రంథంలో అన్నీ దోషాలే అన్నాడు, "అలంకార శాస్త్రమునఁ జెప్పిన దోషములలో నిందు లేనిది లేదు. అందులేనివి ఇందెన్నియేని గలవు. ఇందలివి చేర్చిన దోష పరిచ్ఛేదములు ఇఁక మూఁడింతలగును".[103] గ్రంథంలో దోషాలు తప్ప గుణాలే లేవా? అంటే "ఈ గ్రంథమున గుణమేమేని లేదా యని కడుంగడు నరసితిని గాని యాంధ్రీకరణ భాగమందెచ్చటను గాననైతి. కడమ భాగములో నొక గుణము కలదు. వీరు తమ గ్రంథమును తమ జనకులకు అంకితము చేసినారు. పితృపూజ అవశ్య కర్తవ్యము గదా"[104] అన్నాడు.

పరిమాణంలో అసంఖ్యాకంగా రచనలు వస్తున్నా ప్రమాణాలు ఉన్నతంగా లేక దోషభూయిష్ఠంగా ఉన్నాయనీ అందువల్ల విమర్శ గ్రంథాలు ఆవశ్యకమవుతున్నాయనీ 'ఆంధ్రవేణీ సంహార విమర్శనము' పీఠికలో శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి అన్నాడు. కేవలం తప్పులు వెదకడమే తమ పనికాదని అంటున్నప్పటికీ చేసినపని అదే. విమర్శల అవసరం అధికంగా ఉందనీ, కాని వాటి సంఖ్య గణనీయంగా లేదనీ కూడా ఆయన అభిప్రాయపడ్డాడు. "ఇంటింటికిం బదుగురుం బదునెడుగురుం గవులుగా నశ్రమంబునఁ దేలు నిక్కాలంబున జలబుద్బుదముల

వలె నలంతి కబ్బంబు లద్భుదములు స్వర్భుదములుగాఁ బ్రబలు చుండుటం జేసి తద్దోష పరిహారార్థము విమర్శనగ్రంథ విరచన మత్యావశ్యకమై యున్నయది. అట్టి గ్రంథము లిపుడొండు రెండు తక్కమెండు గానరావు ... యథార్థముగా నాతెలిసినంత పట్టులో నిజమైన తప్పులనే పట్టి వ్రాయుచున్నాడ. కాని ద్వేషబుద్ధిం బురోభాగినై స్తనశల్య పరీక్ష చేయుటకుం దొడంగిన వాఁడఁగాను"[105]

అయితే ఆ కాలంలో జరిగిన విమర్శ అంతాకూడా ప్రధానంగా భాషా ఛందోలంకారాలకు సంబధించిందే. భాషారూపాలు అన్నింటికంటె ప్రముఖ మయ్యాయి. వివేకచంద్రికా విమర్శనము వంటివి ఒకటి రెండు మాత్రమే దీనికి అపవాదంగా నిలుస్తాయి. కవిత్వపరంగా పాఠకుని అనుభూతిని గణనలోనికి తీసుకొని విమర్శను ఆ మార్గంలో నడపడం నాడు అరుదే. నాటి విమర్శలను గూర్చి కట్టమంచి రామలింగారెడ్డి "వీరికిని (వేదం వేంకటరాయ శాస్త్రిగారికిని) మహా మహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నము పంతులు గారికిని నడచిన వాగ్యుద్ధము అనాటి అచారమునకు సరిపోయినదిగాని నేఁడుమనకు స్మరణ యోగ్యముకాదు, వ్యాకరణాది మీమాంసలే నాటి విమర్శక విచారములు, ఆ చర్చలలో సరళములరుదు. పరుషములే మెండు; భాష ప్రధానము, భావము కాదు"[106] అన్నాడు. కందుకూరి వీరేశలింగం, మండపాక పార్వతీశ్వరశాస్త్రి, నడకుదుటి వీరరాజు, వావిలికొలను సుబ్బారావు మొదలైన ప్రముఖులు పాల్గొన్న నాటి విమర్శ అధికంగా ఈ మార్గానికి చెందిందే.

రెండవదశ : కవిత్వతత్వాన్వేషణ

కిందటి శతాబ్దం చివర ఈ శతాబ్దం ప్రారంభంలో కవిత్వాన్ని గురించిన ఆలోచన ప్రారంభమయింది. 'మనుచరిత్ర రచనా విమర్శన' పీఠికలో వెన్నేటి రామచంద్రరావు తన గ్రంథ రచనాలక్ష్యాన్నిట్లా పేర్కొన్నాడు "The chief aim with which the following pages have been written was to press home this method of appreciating poetry on the Telugu reading public more especially, on the rising generation."[107]

కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వ విచారము' తెలుగులో ఆధునిక విమర్శకు తొలి ప్రయత్నమన్న విషయంలో అందరికీ ఏకీభావం లేకపోయినా

తరువాతి తెలుగుసాహిత్య విమర్శ మీద దాని ప్రభావాన్ని మాత్రం ఎవరూ కాదనలేదు ఈ గ్రంథ పీఠికలో రామలింగారెడ్డి గ్రంథరచనకు సంబంధించిన చరిత్రనే తప్ప ఇతర విషయాలను పేర్కొనలేదు. ఈ గ్రంథ ప్రభావాన్ని దీని మీద వచ్చిన విమర్శలే నిరూపిస్తాయి. కురుగంటి సీతారామయ్య 'అలంకార తత్త్వవిచారము', కాశూరి వ్యాసమూర్తి 'కవిత్వతత్త్వ విచార విమర్శనము', జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి సమీక్ష వాటిలో ముఖ్యమైనవి. 'కవిత్వతత్త్వ విచారము' ప్రాచీన సాహిత్యతత్త్వాన్ని తోసివేసి ఆంగ్లవాఙ్మయ విమర్శధోరణులను వ్యాప్తిలోకి తెస్తున్నదని సంప్రదాయవాదులు భయపడ్డారు. అందువల్ల ప్రాచీనులు చెప్పిన సాహిత్య సిద్ధాంతాల తత్త్వ విచారణకు పూనుకున్నారు. 'అలంకార తత్త్వ విచారము'నకు భూమిక రాస్తూ "కేవలాంగ్ల వాఙ్మయ విమర్శనా నియమములు మన యాంధ్ర వాఙ్మయమును విమర్శించుటలో పనికిరావు. కేవల పూర్వ విమర్శనా నియమములు ప్రస్తుత కాలమునకు దగవు. కావున రెండు విధముల నియమములను సమ్మేళనము చేసి సంప్రదాయము చెడకుండ విమర్శలను సాగింపవలయును. ఇపుడు ప్రచురింపబడుచున్న విమర్శనములు పూర్తిగ సంప్రదాయ నిరసనము చేయుచున్నవి. అట్లు చేయకూడదు. సంప్రదాయ నిరసనము విమర్శనమును పెడద్రోవల కీడ్చుకొని పోవును...కావున విమర్శనము సరియైన త్రోవల నడువవలయును"108 అన్నాడు వింజమూరి రంగాచార్యులు- సంప్రదాయ, ఆంగ్ల విమర్శ ధోరణుల సమన్వయ ధోరణి కొంత కనిపించినా, బలంగా కనిపించే సంప్రదాయ ప్రాధాన్యాన్ని ఇక్కడ స్పష్టంగా గుర్తించవచ్చు.

భాషనుండి భావానికి విమర్శ మళ్ళడంలో ప్రధానపాత్ర వహించడమే కాక సాహిత్య విమర్శలో సామాజిక విషయాల చర్చ తొలిసారిగా 'కవిత్వతత్త్వ విచార'మే చేసింది. కవిత్వతత్త్వ విచారం మీద వచ్చిన వ్యతిరేకతకు సంప్రదాయ సాహిత్య సిద్ధాంతాల విమర్శేకాక సంఘ విమర్శకూడా ప్రధానమైన కారణం. సాహిత్య విమర్శకంటే సంఘ విమర్శే ఇందులో అధికంగా ఉందన్న విమర్శ కూడా వచ్చింది. ఈ సంఘ విమర్శ అంతా అనవసరమేనని సంప్రదాయవాదులు అభిప్రాయపడ్డారు. అయితే ఆనాడు కట్టమంచి రామలింగారెడ్డి నిర్వహించిన పాత్రను అంచనావేస్తూ "తెలుగు సాహిత్యవిమర్శ ప్రధానంగా రూపం మీదే ఇంతవరకు కొనసాగుతూ వస్తోంది. సంస్కృతాంధ్ర లక్షణ గ్రంథాల్లో

ప్రమాణాలను గ్రహించి కావ్యాలకు అన్వయించడం, అలంకారశాస్త్ర ప్రమాణంగా సాగే పరిశీలన సాంప్రదాయ విమర్శనా పద్ధతిలో భాగం. ఈ పద్ధతిని అసంబద్ధంగా ఆధునిక సాహిత్యానికి అన్వయించే ప్రయత్నం కూడా జరిగింది. దీన్ని అధిగమించి విమర్శలో ఆధునికతను ప్రవేశ పెట్టినవాడు కట్టమంచి రామలింగా రెడ్డి. ఆయన వ్యాసంలో ఇతర అంశాలతో పాటు సాహిత్యంపై సామాజిక శక్తుల ప్రభావం గురించికూడా మొదటిసారి కాబోలు ప్రస్తావించాడు. అయితే తరవాతి కాలంలో సాహిత్యవిమర్శ ఆ ఇతర అంశాలపైనే దృష్టి నిలిపినట్లు కనిపిస్తుంది. సాహిత్యాన్ని సాహిత్య ప్రమాణాలతో మాత్రమే పరిశీలించే పద్ధతే కొన సాగింది"109 అన్నాడు సి. వి. సుబ్బారావు.

కట్టమంచి రామలింగారెడ్డి తరువాత వచ్చిన విమర్శ ప్రాచీన సాహిత్యానికి సంబంధించినంతవరకు ప్రాచీన సాహిత్య ప్రమాణాలకు, ధర్మశాస్త్ర సంబంధమైన చర్చలకూ పరిమితమయింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో అధికభాగం సంస్కృతం నుండి అనువాదమే కాబట్టి మూలగ్రంథంతో అనువాదాన్ని తులనాత్మకంగా పరిశీలించడం కూడా ప్రారంభమయింది. "కేవల భాషాంతర కర్తలుగ నెన్నఁబడుచున్న భారత కవుల కళాచాతుర్య విశేషములను మూల గ్రంథముతోఁబోల్చి విడఁదీయవలయునను తలంపే నన్నీ విమర్శనమునకుఁ బురికొల్పినది"110 అన్నాడు కోరాడ రామకృష్ణయ్య. ప్రాచీన సాహిత్యానికి సంబంధించి ఆ తరువాతి కాలంలో కూడా చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించదు. ఆయా గ్రంథాల ప్రాచీన అర్వాచీనతలు, కర్తృత్వ వివాదాల వంటి బాహ్య విషయాలూ, రూప సంబంధమైన విమర్శలతోనే తృప్తిపడటం జరిగింది. 'కుమార సంభవ' కావ్యాన్ని గురించి "ఈ గ్రంథము చాలా ప్రాచీనమనియు, సత్యుత్కృష్టమనియు నీ రకపు వాదములనన్నింటిని నా యీ గ్రంథమే విమర్శిస్తుంది"111 అన్నాడు వేదాల తిరువేంగళాచార్యులు.

నవ్యకవిత్వ విమర్శ :

ఇరవయ్యవ శతాబ్దం మొదటి దశకాంతంలో నవ్యకవిత్వావిర్భావం జరిగింది. దీనికి లక్షణ నిరూపణం చేయడమూ, సైద్ధాంతిక ఆధారం కల్పించడమూ అవసరమయింది. 'కవిత్వ తత్త్వవిచారం' కళాపూర్ణోదయ, ప్రభావతీ ప్రద్యుమ్నాల విమర్శే అయినా నవ్య కవులకు పరోక్షంగా ప్రోత్సాహాన్నిచ్చింది.

అయితే ఈ కవిత్వానికి సమర్థన ప్రధానంగా వ్యాసాల రూపంలోనూ, ఆయా కవిత్వ గ్రంథాల పీఠికల రూపంలోనూ వచ్చింది. ప్రతికూల విమర్శే అయినా నవ్య కవిత్వం గురించిన నిశితమైన పరిశీలన గ్రంథ రూపంలో తొలిసారి రావటం అక్కిరాజు ఉమాకాంతం 'నేటి కాలపు కవిత్వం' గానే. ఈ గ్రంథ రచనకు పూనుకోవడానికి హేతువునిట్లా చెప్పాడు ఉమాకాంతం-

"Even in the limited circles, the influence of poetry on not only the rise and growth of the noble qualities but also on the moral and intellectual prosperity of a nation is not inconsiderable. What is the nature of the poetry that we meet at every corner of our own country to-day? What is the relation of this poetry with our life real and ideal? what is its effect upon us Telugu as a race? We, Andhras, as Indians are proud of our Ancient India, Are we inline with that cultural advancement? or are we falling? Such considerations led me to inquire into our literature past and present."[112]

కళారూపాలన్నిటికీ ఆనందం ఒక ప్రయోజనమైనాన కళ అంతటికే పరిమితం కాదని ఉమాకాంతం అభిప్రాయం" No art is worth the name if it doesnot atleast refine the grosser feelings of humanity"[113] అన్నాడు. నవ్యకవిత్వంలోని ధనాంశను ఉమాకాంతం గుర్తించక పోలేదు. "However, there are some happy signs of reaction against the intellectual stagnation of the middle ages but it is like the case of one who crawled out of a stagnant pool with no life giving water fountain for purification and resuscitation"[114] అన్నాడు.

కళాసిద్ధాంతాల సమన్వయం :

భారతీయ, పాశ్చాత్య కళాసిద్ధాంతాల తత్వాలను వివరించడానికి, కళా స్వరూపాన్ని నిరూపించడానికీ, ఆ సిద్ధాంతాలను సమన్వయం చేయడానికీ ప్రయత్నం జరిగింది. ఎన్నో వ్యాసాలు వచ్చాయి. పాత సిద్ధాంతాలకు, భావాలకు నూతనార్థాలను కల్పించడానికీ, నూతన సమన్వయాలను కుదర్చడానికీ ప్రయత్నం జరిగింది. రసవాదాన్నీ, అధిభౌతిక సిద్ధాంతాన్నీ అన్వయించడానికి ప్రయత్నించాడు జి. వి. కృష్ణారావు. "నా సిద్ధాంతం క్రొత్తదికాదు; ప్రాతదీ కాదు. ఇలా అనటంవల్ల ప్రాతక్రొత్తల కలయిక అని చెప్పటానికి అంతకన్నా వీలులేదు. ఎందుకంటే - భరతాది లాక్షణికులు చెబుతూవచ్చిన రసవాదాన్నే స్వీకరించి ఆధిభౌతిక సిద్ధాంతాన్ని అన్వయించాను. ఈ రెండు సిద్ధాంతాలూ ప్రాతవే. మొదటిది ప్రాచీన మతం, రెండోది పద్దెనిమిది, పంధొమ్మిది శతాబ్దాలలో ప్రబలమై ఈ రోజుల్లో ప్రసవిస్తూ వుంది.

దీన్నిబట్టి నా స్వతంత్రత ఏమీ లేదే అని చప్పరించటానికి వీలులేదు. ఈ లెక్కలో మార్క్సిజంలో మార్క్సు స్వతంత్రత ఏమీలేదు. ఈ క్రొత్త పంథాలో రసాన్ని నిర్వచించటమే నా విశిష్టత"115 అన్నాడు కావ్యజగత్తు పీఠికలో.

అభ్యుదయ కవిత్వ విమర్శ :

అభ్యుదయ కవిత్వంతోపాటే సాహిత్యానికీ, సమాజానికీ సమన్వయం స్థాపించే ప్రయత్నం సాహిత్య విమర్శలో విస్తృతంగా సాగింది. ఇక్కడ భావమే ప్రధానం కావలసిఉండగా ఒక్కొక్కసారి రూపం భావాన్ని మింగిన సందర్భాలు లేకపోలేదు. ఒక రచనను పరిశీలించడంలో సామాజిక, చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం కొంతవరకైనా ఇక్కడ కనిపిస్తుంది. కవిత్వ పీఠికలలో, వ్యాసాలలో ఇది వ్యక్తమౌతుంది. అయితే ప్రత్యేకంగా చెప్పుకోదగిన సాహిత్య విమర్శ గ్రంథాల సంఖ్య అత్యల్పమేనని చెప్పాలి. 'మహోదయం' పీఠిక ఆదిత్య హృదయంలో గురజాడ హృదయాన్ని, తరువాతి వారి మీద గురజాడ ప్రభావాన్ని అంచనా కట్టాడు కె. వి. రమణారెడ్డి.

సాహిత్యరచనలను మార్క్సిస్టు దృక్కోణంలో పరిశీలించినవారిలో మొదటి తరానికి చెందినవాడు మద్దుకూరి చంద్రశేఖరరావు. ఆయన వ్యాసావళికి పీఠిక రాస్తూ "పార్టీపాలసీని వివరించటంలో వారి నైశిత్యాన్ని, సంస్కృతీ సాహిత్య సమస్యలను మార్క్సిస్టు దృక్కోణంలో పరిశీలించటంలో వారి సామర్థ్యాన్ని, రచనా పటుత్వాన్ని ఈ వ్యాసావళి ద్వారా పాఠకులు గ్రహించగలరని ఆశిస్తున్నాను"117 అన్నాడు వై. వి. కృష్ణారావు.

కొడవటిగంటి కుటుంబరావు 'సాహిత్య ప్రయోజ'నానికి పరిచయం రాస్తూ "శాస్త్రీయమైన ఆలోచనా విధానమూ, మార్క్సిస్టు సామాజిక దృక్పథమూ, మానవతావాదమూ ఆయన వ్యక్తిత్వంలో భాగాలు. యివన్నీ కలిసే అభ్యుదయ దృక్పథం ఏర్పడుతుంది"118 అన్నాడు రాచమల్లు రామచంద్రారెడ్డి.

వ్యక్తి దృక్పథం :

ఇదే సమయంలో మరికొన్ని ఇతర దృక్పథాలూ వ్యక్తమయ్యాయి. రచయిత దృక్పథానికీ, అతని రచనకీ ఉండే సంబంధమే ప్రమాణంగా సాగే విమర్శ బయలుదేరింది. "సాహిత్య వ్యవసాయమూ, సత్యాన్వేషణమూ జీవితంలో ఒకటైన కవి లేక నవలా రచయిత తన దృక్పథంలో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు. రచయితకు సంబంధించిన ఆ 'ఆత్మకథ'ను అతని సాహిత్య కృషి ప్రతిబింబిస్తుంది. ఈ పద్ధతిలో కొందరూ రచయితలనూ, వారి గ్రంథాలనూ పరామర్శించటమే ఈ వ్యాసాల ఉద్దేశ"మన్నాడు119 'సాహిత్యంలో దృక్పథాలు' పీఠికలో ఆర్. ఎస్. సుదర్శనం. ఇంకా "కావ్యార్థం కవి దృక్పథం మీదే ఆధారపడుతుంది. 'కవి దృక్పథం' అంటే అతడు వాచ్యం చేసే అభిప్రాయాలే కావు; అతని జీవితానికీ, వ్యక్తిత్వానికీ సంబంధించి అతనికి పూర్తిగా అర్థంకాని భాగం; సమకాలీన సంఘ జీవనంలో అతనికి గల పాత్రనూ సంబంధాన్నీ నిర్వచించే విషయం. కావ్యాభివ్యక్తిలో దానిలోతుల్ని దర్శించే ప్రయత్నం చేస్తేనే కావ్యస్వరూపం గోచరిస్తుంది. అప్పుడే హృదయగతమైన కావ్యాస్వాదనం మేధాగతమైన కావ్యార్థ వివరణగా రూపొందుతుంది. కావ్యార్థవివరణ సమగ్రంగా, సవ్యంగా చేయని విమర్శ సాహిత్య విమర్శే కాదు"120 అన్నాడు.

కొత్త విమర్శ మార్గాలు వచ్చినప్పటికి ఈ పద్ధతి నిశ్చిత ప్రమాణ మన్నాడీయన. "కాలంతో అభిరుచులూ, అభిప్రాయాలూ మారుతాయి. సాహిత్యరచనలో

మార్పులూ కొత్త పోకడలూ వస్తాయి. సాహిత్యాన్ని విమర్శించి వ్యాఖ్యానించే మార్గాలూ భిన్నంగా రూపొందవచ్చు. కాని రచయిత దృక్పథానికి, అతని రచనకీ గల సంబంధం ఒక నిశ్చిత ప్రమాణం. రచన మనలో కలిగించే అనుభూతి ద్వారా ఆ సంబంధాన్ని తెలుసుకొని వివరించడానికి చేసే ప్రయత్నమే సాహిత్య విమర్శ. సాహిత్యవిమర్శ స్వభావము కావ్యార్థ ప్రకాశము; దాని స్వరూపము సత్యాన్వేషణము"[121] అన్నాడు. ఈ విమర్శలో రాజకీయాలకు తావులేదు.

పరిశోధన :

బంగోరెలో విషయసేకరణ ప్రధానమయింది. అతి పట్టుదలగా తాను పరిశీలించదలచుకొన్న విషయాన్ని మరి చూడవలసింది లేదన్నంతవరకు ఆధార వస్తుజాలాన్ని పరిశోధించి తెలుసుకోవడం బంగోరె ప్రత్యేకత. 'బ్రౌన్ జాబులు-తెలుగు జర్నలిజం చరిత్ర' ముందుమాటలో "ఈ బంగారు పంజరపు ఉద్యోగ జీవితంలో న్యాయంగా లభించిన తీరికనంతటినీ ఈ పరిశోధనా వ్యాసంగానికి వెచ్చించాను...... ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, తమిళనాడు ఆర్కైవ్స్-వీటిమధ్య అసుపోసినట్లు ఆవురావురుమంటూ తిరిగేవాణ్ణి. ఇంతకాలం నాకున్న వీలునుబట్టి లభించిన అవకాశాన్నిబట్టి సైలెంట్‌గా దొరికిన గనులను త్రొవ్వుకుంటూ సమాచారాన్ని సేకరించుకొంటూ వచ్చాను"[122] అన్నాడు. గ్రంథ రచన విషయంలో "పక్షం రోజులుగా ఈ బ్రౌన్ సమాధి లోనే ఉండిపోయాను. మరో ధ్యాసలేదు. వేరే ధ్యానంలేదు. తల దిమ్మెక్కి ఉంది. చేయి అలసిపోయింది. 'ముందు మాటలు' రూపంలో చెప్పుకోవలసిన సొంతగోడు అసలుగోడు బోలెడంత ఉన్నా కుదురుగా కూర్చొని వ్రాసేస్థితిలో లేను"[123] అన్నాడు. 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' వగైరా రచనల పీఠికలను చూచినా బంగోరె విషయసేకరణ కృషి స్పష్టమౌతుంది.

స్వచ్ఛ సాహితీ విమర్శ :

ఏ రాజకీయ దృక్పథానికీ కట్టుబడకుండా ఉండే విమర్శను స్వచ్ఛ సాహితీ విమర్శగా అభివర్ణించాడు అద్దేపల్లి రామమోహనరావు. టి. ఎల్. కాంతారావు 'కవితాలోకనా'నికి పీఠిక రాస్తూ, మూడు దృక్కోణాలుంటాయనీ వస్తుదృష్టి, శిల్పదృష్టి, ఈ రెండింటి సమన్వయ దృష్టి అన్న ఈ మూడింటిలో చివరిది స్వచ్ఛ సాహితీ విమర్శ అన్నాడు.[124]

మార్క్సిస్టు విమర్శ :

1970 తర్వాతే మార్క్సిస్టు విమర్శ కొంత ముందడుగు వేసింది. మార్క్సిస్టు విమర్శ ఎట్లా ఉండాలి? అని ప్రశ్నించుకోవడంకొ, ఎత్తైనా ఆ మార్గంలో విమర్శచేసే ప్రయత్నం చేయటం స్పష్టంగా కనిపిస్తుంది. మార్క్సిస్టు పరిభాష విస్తారంగా ఉపయోగించకపోయినా స్పష్టమైన శాస్త్రీయావగాహనతో భాషా సంబంధమైన జటిలత లేకుండా విమర్శ చేసినవాడు కొడవటిగంటి కుటుంబరావు. ఒకరకంగా ఈ విడమరచి చెప్పే పద్ధతి మార్క్సిస్టు విమర్శను పలుచబరచిందన్న విమర్శకు కూడా గురయ్యాడు. మార్క్సిస్టు విమర్శకుల్లో అందరి గౌరవాలకూ పాత్రుడయ్యాడు. ఆయన 'సాహిత్యంలో విప్లవోద్య' మానికి పీఠికరాస్తూ "విప్లవ సాహిత్యంలో కుటుంబరావుగారిది వ్యాసపీఠం. స్పష్టమైన అవగాహన, సూటిగా చెప్పే లక్షణం, కాలంతో ఎదిగే వ్యక్తిత్వం, అపారమైన అనుభవంవల్ల, అధ్యయనంవల్ల అక్షరాల్లో బరువుగా, కాని చాల తేలిక మాటల్లో పరుచుకున్న ఆలోచన - కొడవటి గంటి"[125] అన్నాడు వరవరరావు. "సిద్ధాంతం కోసం, నిర్ధారణలకోసం మాత్రమే కుటుంబరావు వ్యాసాలు రాయలేదు. విస్తరిస్తున్న తెలుగుదేశపు విప్లవోద్యమ సమస్యల్ని గురించి ఆలోచింపచేయటానికే రాశాడు. విప్లవ రచయితల సంఘం ఏర్పడినప్పుడు, రివిజనిస్టుల, నయారివిజనిస్టుల తీవ్రమైన దాడిని గట్టిగా ఎదుర్కొన్నాడు. మార్క్సిస్టు కానివాడు విప్లవ రచయిత కాలేడు అని స్పష్టంగా నిరూపించాడు"[126] అన్నాడు త్రిపురనేని మధుసూదనరావు 'కళలు - శాస్త్రీయవిజ్ఞానం' పీఠికలో. ఈ పరిస్థితుల్లో విమర్శ చేయవలసిన పనీ, కుటుంబరావు విమర్శ ఎందుకు చేసిందీ "విమర్శ కూడా విజ్ఞానశాస్త్రాల వెలుగులో విప్లవ వాస్తవికతలో భాగంగానే రాశారు. అంటే విమర్శ విమర్శతోనే ఆగిపోదు. విప్లవ ఆవశ్యకతని సూచిస్తుంది. మార్పే చైతన్యాన్ని కలిగించటానికి విమర్శించటం కుటుంబరావు సాహిత్య లక్షణం"[127] అని విశ్లేషించాడు. "క్రియకీ, భావానికీ నడమ వుంటూ వచ్చిన ఎల్లలను తుడిపెయ్యడం అందరివల్లా అయ్యే పనికాదు. భావం క్రియలోనుంచీ, క్రియ భావంలోనుంచీగాక, దేనికది విడిగా ఉంటుందనుకోవడం అజ్ఞానమో, భ్రమో. భావానికీ, క్రియకీ గల గతతార్కికమైన లంకెను చూసి, ఆ రెండూ ఎలా పరస్పర దోహదం చేసుకుంటాయో గ్రహించిన బుద్ధిశాలి కొడవటిగంటి కుటుంబరావు"[128] అన్నాడు కె. వి. రమణారెడ్డి.

వివాదాస్పదమైన తెలుగు రచయితలలో చలం ఒకడు. చలం సాహిత్యాన్ని ఆకాశానికెత్తినవాళ్ళూ, పాతాళానికి తొక్కినవాళ్ళూ ఉన్నారు. 1976లో వచ్చిన 'చలం శ్మశాన సాహిత్యం' కొంత దుమారం రేపింది. రచయిత నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు "నాకున్న పరిమితుల్లో, నా అవగాహన మేరకు నేనీ పుస్తకంలో అతి ముఖ్యమైన సాహిత్య చర్చకు నాంది పలికాను. నా పరిశీలనా ధోరణి అసమగ్రం అని గాని, అన్యాయం అని గాని భావించేవారు సహేతుకంగా చలం పట్ల 'సమగ్ర' పరిశీలన చేసి ఆయన పట్ల, ఆయన సాహిత్యంలోని భావజాలం పట్ల తెలుగువారికి ఒక నిర్దిష్టాభిప్రాయం కలిగించేందుకు తమ వంతు కృషి చేయవచ్చు. అటువంటి కృషికి ప్రేరణ కలిగించటమే నాయీ పుస్తక లక్ష్యం"129 అన్నాడు. ఈ పుస్తకానికే ముందుమాట రాస్తూ "నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు గారు చలం భావాలలో, ప్రబోధాలలోగల ప్రమాదకర ధోరణులనూ, అశాస్త్రీయలక్షణాలనూ నిర్దాక్షిణ్యంగా ఖండిస్తూ ఇప్పుడీ పరిశీలన చేశారు"130 అన్నాడు చలసాని ప్రసాదరావు. అయితే ఈ పరిశీలనలోని నిజాయితీని రంగనాయకమ్మ, కుటుంబరావు గాంధీలు ప్రశ్నించారు "నిమ్మగడ్డ వారి నిశిత పరిశీలన మీదగానీ, నిమ్మగడ్డ వారికి చలసాని వారు ఇచ్చిన సర్టిఫికెట్టు మీదగాని మాకెంతమాత్రం సదభిప్రాయం లేదు. ఎందుచేతంటే ఈ విమర్శకుడు చేసిన పరిశీలన అంతా శుద్ధ తప్పుడు, దగాకోరు పరిశీలనే గనక.

మార్క్సిజం మీదా, చలం సాహిత్యంలో అభివృద్ధికరమైన అంశాల మీదా మాకు వున్న అపారమైన ప్రేమతో, కృతజ్ఞతతో ఈ గురు శిష్యుల బండారం బయట పెట్టడం మా ధర్మంగా ఎంచి ఈ నిశిత పరిశీలన రొచ్చులో దిగడానికి సిద్ధపడుతున్నాం."131 అన్నారు. మార్క్సిస్టు విమర్శ ఎట్లా ఉండాలో ఈ పుస్తకం ప్రారంభంలో చెప్పారు. రచయిత చలాన్ని ఎక్కడెక్కడ ఎట్లా తప్పుడుగా ఉట్టంకించాడో చూపించారు.

సాహిత్యవిమర్శ పరిమాణదృష్ట్యా విశ్వవిద్యాలయ సిద్ధాంత గ్రంథాల్లో ఎక్కువగానే జరిగింది. ప్రశంసా పూర్వకమైన పీఠికలుతప్ప ఉపయోగకరమైన పీఠికలు వీటిలో చాలా తక్కువ. కొన్ని మాత్రం తమ పరిశోధనా పద్ధతిని, పరిశోధనలో పరిశోధకులు పడ్డ శ్రమను వివరిస్తూఉన్నాయి. మార్క్సిజమ్ ఆధారంగా వచ్చిన సాహిత్యవిమర్శ సిద్ధాంత గ్రంథాల సంఖ్య అల్పమే.

"సాంఘిక అస్తిత్వమే చైతన్యాన్ని నిర్ణయిస్తుందన్న మార్క్స్ ప్రతిపాదన ప్రాతిపదికగా తీసుకుని తెలుగు కవిత్వంలో వచ్చిన మార్పుల స్వరూపం పరిశీలించడం ఈ పరిశోధనలో సంకల్పించిన పని. సాహిత్య పరిణామానికి ఒక నియతమైన స్వరూపం వున్నదని నిర్ధారించడమూ, సాహిత్య రూపాలను స్ఫుటంగా అభివర్ణించేందుకు సమర్థమైన విధానం కనుగొనడమూ సాహిత్య విమర్శకి ఒక తాత్త్విక ప్రాతిపదికను సమకూర్చడమూ ఈ ప్రయత్నంవల్ల ఆశించిన ఫలితాలు"[132] అన్నాడు వెల్చేరు నారాయణరావు తనసిద్ధాంత గ్రంథం పీఠికలో.

మిరియాల రామకృష్ణ కవితాత్మకంగా "సాహిత్య విమర్శను ఒక పాఠ ప్రవచనంగా ఒక తత్త్వంగా ఒక శాస్త్రంగా ఒక కళగా ఒక చరిత్రగా భావిస్తూ రచించిన ఈ గ్రంథాన్ని ..."[133] అని తన సిద్ధాంత వ్యాసాన్ని గురించి చెప్పుకున్నాడు.

అయితే ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో మార్క్సిస్టు భావజాలం ఎంతగానో చోటుచేసుకున్నా సృజనాత్మక రచనలను ఆ దృక్పథంతో పరిశీలించడానికి అవసరమైన సామాగ్రిని తెలుగు విమర్శకులు మాత్రం సమగ్రంగా కూర్చుకోలేదు. వారి విమర్శ సమకాలీన సాహిత్యం మీద, అందులోనూ ముఖ్యంగా కవిత్వం మీద కేంద్రీకృతమయింది. అంతేతప్ప ప్రాచీన ఆధునిక సాహిత్యాలను వాటి చారిత్రక సామాజిక నేపథ్యంతో విశ్లేషించే ప్రయత్నం విస్తృతంగా జరగలేదు. ఈ మార్గంలో ఆలోచించడం ఈ మధ్యనే ప్రారంభమయింది. ఈ ప్రయత్నం ప్రధానంగా కె.కె. రంగనాథాచార్యులది. ఆయన చేసిన విమర్శ అధికభాగం పీఠికా రూపంలోనే జరిగింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురించిన సారస్వత వేదిక ఉపన్యాస సంకలనాలకు ఆయన విపులమైన సంపాదకీయ పీఠికలను రచించాడు. సంకలన గ్రంథాల పీఠికలలో సాధారణంగా కనిపించే రచయితల, వ్యాసాల పరిచయం రంగనాథాచార్యుల పీఠికకు వస్తువు కాలేదు. ఆ ఉపన్యాసాలు ఏ ప్రధాన విషయానికి ఉపాంగాలో ఆ ప్రధాన విషయాన్ని దాని సామాజిక చారిత్రక నేపథ్యంలో విపులంగా అధ్యయనం చేయడమే ఈ పీఠికల లక్ష్యం. అందువల్ల ఆయా విషయాల మీద వచ్చిన వ్యాసాల కంటే వీటి పరిధి విశాలమైంది. ప్రత్యేక గ్రంథ పరిమాణం వీటిలో కొన్నిటిది. సాహిత్య సంబంధమైన సామాజిక చారిత్రక భూమికను అధ్యయనం

చేయడం, అటువంటి సాహిత్యావిర్భావానికి హేతువులను గుర్తించే ప్రయత్నం చేయడం ఇంత విస్తృత పరిధిలో తొలిసారిగా చేసింది రంగనాథాచార్యులే. ప్రాచీన సాహిత్యాన్ని ఈ దృక్కోణంతో అధ్యయనం చేయటం 'తెలుగు సాహిత్యం మరో చూపు'తో మొదలయింది. ఈ గ్రంథ పీఠికలో "ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల్లో కాలక్రమంలో వచ్చిన పరిణామాన్ని చెప్పటమే దేశచరిత్ర అయితే, ఆ సంబంధాలు సాహిత్యంలో ఎట్లా ప్రతిబింబించాయో, దానికి అనుగుణంగా సాహిత్యరూపాలు ఎట్లా సంతరించుకున్నాయో చెప్పటమే సాహిత్యచరిత్ర"134 అని విశ్లేషించాడు. సాధారణంగా అంతవరకూ వస్తూఉన్న సాహిత్యంలో ప్రతిబింబించే సామాజిక పరిస్థితుల పరిశీలనవంటి ధోరణికి ఇది పూర్తిగా భిన్నమైనది. పైగా అంతవరకూ సాగుతూ వస్తున్న సాహిత్య విమర్శలో ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన సామాజిక వివరాలు నాటి ఆచార వ్యవహారాలు, కులమతాలు, ఆహార పానీయాలు, వేషభాషలు, వృత్తులు మొదలయినవాటికి మాత్రమే సంబంధించినవి. ఇప్పుడు సాహిత్యంవైపునుండి సమాజంలోకికాక, సమాజంలోనుండే సాహిత్య ప్రక్రియల, రచనల స్వరూపస్వభావాలను గుర్తించే ప్రయత్నానికి నాందిపలకడం జరిగింది. అయితే సమకాలీన సాహిత్య పరిశీలన సమకాలీన సమాజాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా కొంత సులువవుతుంది. విమర్శకుడు తన కాలాన్నే విశ్లేషించే ప్రయత్నం చేస్తాడు కాబట్టి సామగ్రి సులభసాధ్యమే. అదే ప్రాచీన సాహిత్యం విషయంలో అంత తేలికకాదు. దానికి సామాజిక చరిత్రకు సంబంధించిన ఆధారాలు పుష్కలంగా కావాలి. మన దేశచరిత్రే అసమగ్రంగా ఉన్నప్పుడు అటువంటి ఆధారాలను సంపాదించడమూ, వాటిలో సత్యాన్ని అన్వేషించడమూ దాన్ని సాహిత్యానికి అన్వయించడమూ చాలా క్లిష్టమైన విషయం. ఈ క్లిష్టమైన అధ్యయన విషయానికి రంగనాథాచార్యులు మంచి పునాదే వేశాడు.

భిన్న చారిత్రక దశలలో వ్యవస్థను కొంతైనా నిరసించి ఎదిరించి నిలిచిన కవులను తొలి సమాజ కవులుగా పేర్కొంటూ ఏ తాత్విక ధోరణులు, పరిస్థితులు ఈ కవుల ఆవిర్భావానికి కారణమయ్యాయో విశ్లేషించే ప్రయత్నం 'తెలుగులో తొలి సమాజకవులు' పీఠికలో జరిగింది "గత చరిత్రలో మధ్య

యుగంలో ప్రత్యేక చారిత్రక పరిస్థితులలో, అప్పటి ఆర్థిక సంబంధాల పునాది పైన నిలబడిన సామాజిక వ్యవస్థలో, ఆనాటి పరిమితులలో కొంతవరకైనా అభివృద్ధికరమైన పాత్రను, అభ్యుదయ పంథాను అవలంబించిన వారిని సమాజ కవులని పేర్కొనటం జరుగుతున్నది. ఆధునిక కాలంలో అభివృద్ధి పొందిన శాస్త్రీయ దృక్పథం భిన్న, చారిత్రక దశల స్వరూప స్వభావాలను, వర్గ వైరుధ్యాలను విశ్లేషించే అవగాహనను, పరికరాలను అందించింది. ఈ అవగాహనలో తమ కాలంనాటి భౌతిక సామాజిక అవసరాలను బట్టి, వర్గ ప్రయోజనాలను బట్టి వారు నిర్వహించిన పాత్రను నిర్వచించవలసి ఉంటుంది"135 అని నేటి శాస్త్రీయ దృక్పథంతో ఏ విధంగా ప్రాచీన కవులను, రచనలను అర్థం చేసుకోవచ్చో, విశ్లేషించవచ్చో రంగనాథాచార్యులు తెలియజేశాడు. "పాలకవర్గ సంస్కృతిలో ప్రజలను దూరంచేసే కారణాలను ఖండించి, నిర్మూలించే ప్రయత్నం చేయటం వీరి విశిష్టత"136 అని సమాజకవుల ప్రత్యేకతను వెల్లడించాడు. భారతీయ తాత్విక ధోరణులను ఈ పీఠికలో వివరించటం జరిగింది. వర్తమానంలో మన కర్తవ్యాన్ని రంగనాథాచార్యులు ఈ విధంగా నిరూపించాడు "గత చరిత్రలోని భిన్న దశలలోని ఆర్థిక సంబంధాలు, పరిస్థితులపైన ఆధారపడిన విభిన్న తాత్విక దృక్పథాలన్నీ ఆధునికయుగంలో కూడా మన మానసిక క్షేత్రాలను మన నిత్యజీవిత విధానంతో ఏమాత్రం సంబంధం లేకుండా పాలిస్తూనే ఉన్నాయి. ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో దానినుంచి చీల్చుకుని రావలసిఉంది. తమ అగ్రకులాహంకారాన్ని చంపుకోవటానికి కొందరు భక్తిమార్గానికి సంబంధించిన కవులు సాధన చేసిన ఎనిమిది శతాబ్దాల తరువాత, కింది వర్గాలలో హిందూ మహమ్మదీయ మతభేదాన్ని కూడా నిరాకరించిన ఉద్యమాలు వచ్చిన తరువాత వర్గరాహిత్యస్థితిని సాధించవలసిన సందర్భంలో కూడా కులం మతం రాజకీయ స్వభావాన్ని సంతరించుకుని మరింత సంక్లిష్టం ఔతున్నాయి. దానిని బద్దలు కొట్టి బయటకు రావలసి ఉంది. ప్రత్యేక చారిత్రక పరిస్థితుల్లో సమాజ కవులు తమ పాత్రను నిర్వహించారు. శాస్త్రీయంగా అభివృద్ధి చెందిన ఆధునిక కాలంలో ఆర్థిక వ్యత్యాసాలను కూడా రూపుమాపే మార్గంలో మనం పయనించవలసిఉంది."137

తెలుగు దేశంలోని రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల పరిశీలనే ప్రధానం అయినప్పటికీ దాన్ని మొత్తం భారతదేశ నేపథ్యంలో క్రీ.శ. 1857-1957 నడిమి కాలాన్ని వివరించడానికి చేసిన ప్రయత్నమే 'నూరేళ్ళ తెలుగునాడు' పీఠిక. ఇందులో జాతీయతా పరిణామ కారణాలు, భావ జాలంలో కనిపించే వైరుధ్యాలకు కారణాలు అన్వేషించటం జరిగింది. "బ్రిటిష్ పారిశ్రామికుల పెట్టుబడిపైన ఆధారపడిన బ్రిటిష్ పాలనకు అప్పుడే మొదలవుతున్న స్థానిక పారిశ్రామికులు, విద్యావంతులు, మధ్యతరగతి వారికి మధ్యగల వైరుధ్యం జాతీయతాపరిణామానికి దారితీసింది. సుమారు క్రీ.శ. 1850 వరకు భారతదేశ ఉత్పత్తులను, వస్తువులను ప్రపంచదేశాల్లో అమ్మి లాభం గడించటంగా ప్రారంభమైన వలసవాదం, భారతదేశాన్ని తమ పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్‌గా చేసుకోవటంతో దేశరాజకీయ సామాజిక రంగాలలో వచ్చినమార్పులను గుర్తించవలసి ఉంటుంది"[138] అన్నాడు. "సాంప్రదాయక మత దృక్పథం స్థానాన్ని ఆధునిక జాతీయతాభావం పూర్తిగా ఆక్రమించే అవకాశం, నూతన భావజాలం, లౌకికదృక్పథం ఈ దేశంలో కనిపించదు. దానికి కారణం ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు ఒక రూపంలో రాకపోవటమే. ఇక్కడ మతంతో, పునరుద్ధరణ భావాలతో ముడిపడిన జాతీయభావన ఏర్పడటానికి కారణం వలస ఆర్థిక వ్యవస్థ. దేశంలో వచ్చిన మత సంస్కరణలకు, సంప్రదాయ వ్యతిరేకతకు ఆంగ్లేయులే కారణమన్న భావన ఇక్కడ సర్వసమానమైన సామాజిక పరిణామంగా ఆధునిక లౌకికభావ ధోరణి ఏర్పడకుండా ఉండటానికి కారణమైంది. లౌకిక దృక్పథం పాశ్చాత్యం, విదేశీయం అన్నభావన ఆధునికతనంతా వ్యతిరేకించే సంప్రదాయవర్గం బలపడటానికి కూడా దారితీసింది"[139] అనివివరిస్తూ, "సంప్రదాయవాదం బలపడటానికి కారణం కొత్త ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కాకుండానే అంతవరకు భారత ఆర్థిక సామాజిక వ్యవస్థకు ఆధారభూతమైన గ్రామీణ వ్యవస్థ బ్రిటిష్ పాలనలో శిథిలంకావటం"[140] అని విశ్లేషించాడు.

ఈ పీఠికలు కేవలం గతాన్ని విశ్లేషించటమే కాక గతంనుండి నేర్చుకోవలసిన పాఠాలను, వర్తమానంలో మన కర్తవ్యాన్నికూడా నిరూపిస్తాయి. ఇదే పీఠికలో "వలసీకరణవల్ల జరిగిన ఆధునికీకరణ పునరుద్ధరణ భావాలకు,

సంస్కృతీకరణకు, దారితీస్తుంది. జీవిత వాస్తవాలకు, ఆలోచనలకు మధ్య వైరుధ్యాలను పెంచుతుంది. వలస పాలన ఫలితాలైన విషమ ఆర్థికవ్యవస్థ, పరిమిత అవకాశాలు, వనరులు భిన్న తెగల, కులాల, మతవర్గాల మధ్య పోటీలను, వైరుధ్యాలను పెంచుతుంది. వలసపాలన ఫలితాలైన ఈ వైరుధ్యాలను తొలగించి లౌకికీకరణను, ఆధునికీకరణను సాధించాలంటే రాజకీయాలకు, సాహిత్యానికి నిరంతర చైతన్యం అవసరం. తీవ్రమైన ఉద్యమాల దశలో కంటే సాధారణ పరిస్థితులలోనే అవి తమకర్తవ్యాన్ని నిర్వహించటం కష్టం"[141] అన్నాడు.

"సాహిత్యాన్ని దానిసామాజిక అస్తిత్వంనుండి పరిశీలించాలంటే ముందుగా సమాజం గురించి కొంత తెలిసివుండాలి. సామాజిక చరిత్రగురించి ఒక అవగాహన, ఒక విశ్లేషణా చట్రం రేఖా మాత్రంగానైనా ఉండాలి. తెలుగు సాహిత్యాన్ని ఈ సామాజిక చరిత్ర పరిధిలో పరిశీలించే ప్రయత్నాలు ఇటీవల ఆరంభమయ్యాయి కూడ (రంగనాథాచార్యులు)"[142] అని ఈ విషయంలో ఉదహరించాడు సి. వి. సుబ్బారావు.

త్రిపురనేని మధుసూదనరావు విమర్శల్లో సాధారణ సూత్రీకరణలూ, స్థూలంగా సిద్ధాంతాలూ అధికంగా కనిపిస్తాయి. చాలావరకు ఇవి విధి నిషేధాల రూపంలో ఉంటాయి. ప్రత్యేక రచనలను సామాజిక చరిత్ర నేపథ్యంలో అధ్యయనంచేయడం, అన్వయించడం కనిపించదు. "విమర్శకు ప్రమాణాలు వుండాలి. ఆ ప్రమాణాల సామంజస్యాన్ని, సార్థకతను విమర్శకుడు నిరూపించాలి ఆ సామంజస్యం, సంఘ పరంగానే జరగాలి"[143] ధోరణిలో సాగుతుంది. మధుసూదనరావు వ్యాసాలను "విప్లవ రచనల్లో భాష మొదలు విప్లవ సిద్ధాంతం వరకు అనేక సూక్ష్మ విషయాలు ఈ వ్యాసాల్లో సూచింపబడ్డాయి. ఆధునికత పేరుతో రచనల్లో ఆవరిస్తున్న పాలక పక్ష ప్రయోజనం, వాస్తవికత లోని వివిధ ధోరణులు, ప్రజల్లో ఆచరణ నుంచీ భావాలు ఏర్పడే విధానం, భావాల స్వరూపం, శాస్త్రీయమైన విమర్శనా మార్గం - మొదలైనవి సహేతుకంగా చర్చించి నిర్ణయాలు చేయబడ్డాయి. కవిత్వం సిద్ధాంతం, చైతన్య, ఆచరణల పరస్పర నిత్య సంబంధాల్ని విశ్లేషించటంలో కొత్త కోణాల్ని అనుసరించారు"[144] అన్నది విరసం తిరుపతిరావు.

బాలగోపాల్ 'రూపం - సారం'కు పీఠిక రాస్తూ "బాలగోపాల్ సాయుధ సామాజిక విశ్లేషకుడు. చారిత్రక భౌతికవాదం బాలగోపాల్ వ్యక్తిత్వంలో కలసి పోయిన ఆయుధం. చట్టం నుంచీ సాహిత్యం వరకూ దేన్ని అయినా చారిత్రిక భౌతిక వాద దృక్పథం నుంచి రాజకీయ - ఆర్థిక - తాత్విక విశ్లేషణ చేసి వస్తు సారాంశాన్ని బహిర్గతం చేస్తాడు"145 అన్నాడు త్రిపురనేని మధుసూదనరావు. ఇదే పుస్తకానికి మరో పీఠికలో "సాహిత్య విమర్శను సమాజ విమర్శగా, రాజకీయ విమర్శగా, తత్వవిమర్శగా విస్తరింపజేసిన ఈ మేధావి, మార్క్సిజాన్ని కేవలం సిద్ధాంతంగా గాక, ఆచరణంగా గ్రహించాడు గనక ఇంత లేత వయస్సులో అంత చిక్కటి లోకానుభవం గడించాడు"146 అన్నాడు కె. వి. రమణా రెడ్డి.

తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని విమర్శ ధోరణులూ కావ్య పీఠికల్లో కనిపించినంత స్పష్టంగా విమర్శగ్రంథ పీఠికల్లో కనిపించక పోయినా విమర్శ సిద్ధాంతాలకు సంబంధించిన కొన్ని ధోరణులు మాత్రం స్పష్టతను పొందాయి.

ఉపసంహారం

నాటకాల ప్రస్తావనలూ, కావ్యావతారికల రూపంలో ప్రాచీనకాలం నుండీ కనిపిస్తూ ఉన్న పీఠిక గ్రంథ ప్రచురణ ప్రారంభమైన తరువాత కొంత పరివర్తనం పొందింది. సంప్రదాయ కావ్యాలూ, ఒకటి రెండు ఆధునిక రచనలూ తప్పిస్తే ఇది పూర్తిగా గద్య రూపాన్ని ధరించింది. గ్రంథకర్తా, పీఠికా కర్తా ఒకరు కావడం ప్రస్తావనలకు, అవతారికలకు సాధారణ లక్షణమయితే ఇక్కడ అది వైకల్పికమైంది. అందువల్ల గ్రంథ సమీక్షా, విమర్శనాత్మకతాది లక్షణాలు పీఠికలో విస్తృతిని పొందాయి. ప్రాచీన కావ్యాలకు పరిశోధనాత్మకమైన పీఠికలను ఆధునిక పరిష్కర్తలు, పరిశోధకులు సమకూర్చారు. ఇది ఆధునిక రచనలకూ వ్యాపించి ప్రక్రియ, సామాజిక చరిత్ర, రచనా శైలి, వస్తువులకు సంబంధించిన విపులమైన చర్చ ప్రారంభమైంది. ఒకే గ్రంథానికి ఏకకాలంలో అనేక పీఠికలు, విభిన్న ముద్రణలు, ప్రచురణలలో విభిన్న పీఠికలు సాధ్యమయ్యాయి. ముద్రణ ఆరంభం కాకపూర్వం దీన్ని ఊహించడానికి వీల్లేదు. పీఠికల పరిధి విశాలమైందావాపు అవి తడమని విషయమే లేదంటే ఆశ్చర్యం అవసరం లేదు.

భాషా సంబంధ చర్చ :

ప్రాచీన కావ్యాల పీఠికలలోనూ, మొదటి దశలో వచ్చిన విమర్శ గ్రంథాలూ, వాటి పీఠికలలోనూ, భాషా సంబంధమైన చర్చ విశేషంగా జరిగింది. పరిష్కృత గ్రంథాల పీఠికలలో ఆయా కవులు ప్రయోగించిన భాషా ప్రయోగాల సాధుత్వ అసాధుత్వాలు, వారి లక్షణ విరుద్ధమైన ప్రయోగాలు, వారు వాడిన అన్య దేశ్య శబ్దాలు విపులంగా చర్చించబడ్డాయి. ఒక కవి భాషా ప్రయోగాలను ఆధారంగా చేసుకొని ఆ కవి ప్రాచీనత అర్వాచీనతలను నిర్ణయించడానికి ప్రయత్నం చేశారు. నన్నెచోడుడి కాల నిర్ణయంలో ఈ భాషా పరిణామ పరిశీలనను మానవల్లి రామకృష్ణ కవి ఉపయోగించాడు. దీనికి భాషా చరిత్ర

పరిశీలన అవసరం. భాషా పరిణామంలో ఏయే చారిత్రక దశలలో ఏయే భాషా రూపాల ప్రయోగం జరిగిందో అవి ఎప్పుడెప్పుడు పరిణామం చెందుతూ వచ్చాయో తెలిస్తే తప్ప ఈ విధమైన నిర్ణయం చేయడానికి వీలుపడదు. ఆ విధంగా భాషా పరిశోధనకు ఇటువంటి పరిశీలన దోహదం చేసింది.

నన్నయ నాటికే స్థిరపడిన కావ్యభాష రచనా భాషగా కిందటి శతాబ్దం వరకు కొనసాగింది. ఈ తొమ్మిది శతాబ్దాలలో కావ్య భాషా స్వరూపం యథా తథంగా ఏ మాత్రమూ మారకుండా ఉందని చెప్పడానికి వీల్లేదు. ఆ మార్పులలో కొన్నిటిని లాక్షణికులు అంగీకరించడమూ, కొన్నిటిని అంగీకరించకపోవడమూ జరిగింది. ఏవి అంగీకరింపదగిన రూపాలు, ఏవికావు అన్న విషయంలో అభిప్రాయ భేదాలేర్పడ్డాయి. కిందటి శతాబ్దాంతంలో రచయితల ప్రయోగాల విషయంలో వాటి ప్రామాణికత విషయమై చర్చ జరిగింది. ఒక కవి రచనను విమర్శించడానికి అతడు వాడిన అపశబ్దాలు, లక్షణ విరుద్ధమైన ప్రయోగాలు ప్రధానమైన ఆధారమయ్యాయి. రచనా భాషవిషయంలో వాగ్వివాదాలు ప్రారంభ మయ్యాయి. గ్రంథమంతా సలక్షణమైన గ్రాంథికంలో ఉండాలని కొందరంటే, నాటకాలలో పాత్రోచిత భాషను సమర్థించారు కొందరు. గురజాడ పూర్తి వ్యావ హారిక భాషలో 'కన్యాశుల్కం' నాటకాన్ని రచించాడు. ఆ నాటక పీఠికలో వాడుక భాషా ప్రయోగావశ్యకతను నొక్కి చెప్పాడు. అయినా నాటకాలు, నవలలు, కథానికలు మొదలయిన జనరంజక (పాపులర్) ప్రక్రియలు కూడా కొంతకాలం వరకు భాష విషయంలో ఒకమార్గం (డైరెక్షన్) లేకుండా నడిచాయి. నవల అంతా గ్రాంథికంలోనే రాస్తూ సంభాషణలు మాత్రం వ్యావహారికంలో రాసి కొత్త ప్రయోగం చేశామన్నారు కొందరు. పూర్తి వ్యావహారిక భాషలో ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవల రాశాడు. గ్రాంథిక వ్యవహారిక వాదం, వ్యావహారిక భాషలో ధారాళంగా సృజనాత్మక రచనలు రావడంతో మరుగుపడి పోయింది.

వ్యావహారికమే, ప్రజల భాషే రచనల్లో వాడినా అది రచయిత నిత్య జీవితంతో వాడుతున్నదేనా, ఆయా పాత్రలు చేసే సంభాషణలు వాటి నిత్య వ్యవహారానికి, సంస్కారానికి సన్నిహితంగా ఉన్నాయా మొదలయిన ప్రశ్న లుదయించాయి. ఎంకి పాటల యాస మీద విమర్శ వచ్చింది.

ఈ మధ్యవరకూ మాండలికంలో రచనలు చేయవచ్చా? చేస్తే వాటి ప్రయోజనం పరిమితమయి పోతుందా అన్న విషయం చర్చనీయాంశంగానే ఉంది.

అయితే ఈ విధమైన చర్చలకు భాషాశాస్త్రాభివృద్ధివలన కలిగిన అవగాహన కారణం కావాలి. కిందటి శతాబ్దంలో తులనాత్మక పద్ధతి అభివృద్ధి చెందడమూ, తెలుగును ద్రావిడ భాషగా నిరూపించడమూ జరిగింది. ఈ పరిశోధనకు ఒక పీఠికే దారితీసింది. కాంప్‌బెల్ వ్యాకరణానికి ఎల్లిస్ రాసిన నోట్ ఈ వాదాన్ని లేవదీసింది. కాల్డ్వెల్ ద్రావిడ భాషా తులనాత్మక వ్యాకరణంతో అది నిరూపిత మయింది. అయినా పాత విశ్వాసాలను వదలుకోలేని పండితులు కొందరు సంస్కృత భాషా జన్యవాదాన్ని అప్పుడప్పుడూ ఎత్తుతూ వచ్చారు. ఆ విధంగా భాషా శాస్త్రాభి వృద్ధికి పీఠికలు కూడా కారణమయ్యాయి. వ్యావహారిక భాషా వాదానికి కూడా భాషా శాస్త్రాభివృద్ధివల్ల కలిగిన అవగాహనే మూలమయింది.

చరిత్ర పరిశోధన :

కల్నల్ కాలిన్ మెకంజీ చరిత్ర పరిశోధనకు మౌలికాధారాలు సమకూర్చి పెట్టిం తర్వాతే తెలుగులో చరిత్ర పరిశోధన ప్రారంభమయింది. కొన్ని వేల శాసనాలూ, కైఫియత్తులూ, తాళపత్ర గ్రంథాలూ, నాణాలూ, పురావస్తువులూ, మెకంజీ సేకరించాడు. సి. పి. బ్రౌన్ కూడా గ్రంథ సేకరణ విస్తృతంగా చేశాడు. పందొమ్మిదవ శతాబ్దం ప్రథమార్ధంలో గ్రంథప్రచురణ ఆరంభమయిం తర్వాత ప్రాచీన కావ్యాల ప్రచురణ సందర్భంలో ఆయా కవుల కాలం, ప్రాంతం, జీవిత విశేషాలను తెలుసుకోవడానికి ప్రయత్నం జరిగింది. గ్రంథస్థ సాక్ష్యాన్ని వెలికి తీయడానికి, సమకాలీన, అనంతర గ్రంథాలనుండి సంబంధిత సమాచారాన్ని అన్వయించడానికీ, శాసనాది చారిత్రక మూలాధారాల సహాయంతో వాటిని స్థాపించడానికీ, మరింత సమాచారాన్ని సమకూర్చడానికీ, కైఫియత్తులు, కవిలెలు మొదలైన ప్రాథమిక సామగ్రిలో లభించే వృత్తాంతాలను అన్వేషించి సమాచారాన్ని రాబట్టడానికీ పరిశోధకులు ప్రయత్నించారు. అందువల్ల సాహిత్య కృషిలో భాగంగానే చారిత్రక కృషీ ప్రారంభ మయింది. కవులు, పండితులే శాసనాదుల పరిశోధనకు పూనుకున్నారు. పరిష్కృత గ్రంథాల పీఠికలను పరి

శీలిస్తే ఈ విషయంలో వీరి కృషి వెల్లడవుతుంది. కందుకూరి వీరేశలింగం, మానవల్లి రామకృష్ణ కవి, జయంతి రామయ్య, చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, వేటూరి ప్రభాకర శాస్త్రి, నేలటూరి వేంకటరమణయ్య మొదలయిన వాళ్ళు ఈ రంగంలో కృషి చేశారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వేంకటరమణయ్య ప్రభృతులు చరిత్ర కారులుగా ప్రసిద్ధి కెక్కారు ఇప్పటికీ చరిత్ర పరిశోధన రంగంలో కేవల చరిత్ర పరిశోధకుల కృషితో సమానంగా సాహిత్యకారుల కృషికూడా సాగుతున్నది. మౌలిక చారిత్రకాధారాల సేకరణ ఒక ఎత్తయితే వాటి విశ్లేషణ మరొకఎత్తు. తెలుగులో సాహిత్యంకూడా ఒక ప్రముఖమైన చారిత్రకాధారమే ఔతున్నది. కృత్యవతారికలు ఈ విషయంలో ప్రముఖ స్థానం వహిస్తున్నాయి. అవతారికలు, ఆశ్వాసాద్యంతపద్యాలు కృతికర్త, కృతిపతులను గురించి ఎంతో సమాచారాన్నిస్తున్నాయి. కృతి పతులు ఎక్కువగా రాజులూ, సామంతులు, గొప్ప ప్రభుత్వాధికారులూ కావడం వల్ల దేశ చరిత్రకు సంబంధించిన ఎన్నో వివరాలకు కావ్యాలు ఆకర మౌతున్నాయి. పీఠికా కర్తలు ఆయా కావ్యాలు అందించే ఈ వివరాలను పీఠికలలో ప్రదర్శించారు. కావ్యాల లోని వర్ణనలు ఆధారంగా నాటి ప్రజల జీవన విధానాన్ని కనుక్కునే ప్రయత్నం చేశారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రల రచనలకు ఈ పీఠికలు చాలా ఉపయోగ పడ్డాయి.

రాజులు, రాజవంశాలు, వారి యుద్ధాలు గెలుపోటములు, ప్రజల జీవన విధానం ఇవి ప్రధానమైన పరిశీలనాంశాలయ్యాయి. వీటిని ఆధారాల నుండి యథాతథంగా గ్రహించడం తప్ప విశ్లేషించే ప్రయత్నం అంతగా జరగలేదు. సామాజిక చరిత్రను మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచించడం మొదలు పెట్టింతర్వాత తప్ప ఇటువంటి విశ్లేషణా ప్రయత్నం తీవ్రతరం కాలేదు. ఇప్పుడు ప్రత్యేక రచనలు ఏ సామాజిక నేపథ్యంలో రచింప బడ్డాయో వివరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ నేపథ్యాన్ని వివరించడానికి పీఠికలు ఉద్దేశింప బడ్డాయి. అంతేగాక ప్రాచీన, ఆధునిక సాహిత్య చరిత్ర మొత్తాన్ని ఆ దృక్కోణంతో పరిశీలించడం కూడా పీఠికలలోనే ఆరంభమయింది. తెలుగుదేశ చరిత్ర నిర్మాణానికి పీఠికలు ఎంతో దోహదం చేశాయని చెప్పక తప్పదు.

సాహిత్య విమర్శ :

19 వ శతాబ్దం తృతీయ పాదంలో తెలుగులో సాహిత్య విమర్శ ప్రారంభ మయింది. అయితే ఆ పాదాంతం వరకు రచనా గత దోషనిరూపణమే విమర్శగా సాగింది కవిత్వ తత్వ వివేచనం పాలు చాలా తక్కువ. సాహిత్య విమర్శ బయలుదేరి తెలుగులో నూరేళ్ళుదాటింది అయినా దాని పరిమాణ ప్రమాణాల విషయంలో ఈ నాటికి సాహిత్య వేత్తలలో ఉన్నతాభిప్రాయం గానీ, సంతృప్తి గాని కనిపించదు. 'సారస్వత వ్యాసములు' నాలుగో సంపుటానికి పీఠిక రాస్తూ "తెలుగులో సాహిత్య విమర్శ లేదన్న వారికి లేదు, ఉందన్న వారికుంది, ఉన్న దయినా వుండవలసినంత లేదు, వుండవలసి నట్టున్నూ లేదేమో అంతగా" అనీ' "పాశ్చాత్య సాహిత్యాలతో గాని, తుదకు హిందీవంటి ఇరుగు పొరుగు సాహిత్యా లతో గాని సరిపోల్చి చూసినపుడు విమర్శ విషయంలో మనము తలవంచుకో వలిసే వస్తున్నది"[1] అనీ అన్నాడు పురిపండా అప్పల స్వామి.

ప్రాచీన సాహిత్యానికి సంబంధించి నంత వరకు వచ్చిన సాహిత్య విమర్శ పట్ల కొంత సంతృప్తిని కనబరచినా ఆధునిక సాహిత్య ప్రక్రియలపై వచ్చిన విమర్శ పట్ల పూర్తి అసంతృప్తిని వ్యక్తం చేశాడు తెలుగులో సాహిత్య విమర్శ మీద సిద్ధాంత వ్యాసం రచించిన ఎస్.వి. రామారావు. ''కాని తెలుగు విమర్శ పుట్టి నూరేళ్ళు పైబడినా, అది చేరవలసిన గమ్యం ఇంకా అందుకో లేదనే అని పిస్తుంది. ప్రాచీనాంధ్ర సాహిత్యం పై విమర్శ విరివిగా కొనసాగినా, అర్వాచీన సాహిత్యాన్ని సమగ్రంగా పరామర్శించిన విమర్శలు ఇంతవరకూ వెలువడలేదు. ఆధునికాంధ్ర సాహితీ ప్రక్రియల్లో ప్రముఖమైన నవల, కథానిక, నాటకం, కవితలపై ప్రామాణిక విమర్శలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది... నవలా సాహిత్యాన్ని సామూహికంగా సమీక్షించిన గ్రంథాలే కాని ఒక నవలపై ప్రత్యేక విమర్శనా గ్రంథా లేవీ లేక పోవటం మన విమర్శ స్థితికి నిదర్శనం ...కథానికా విమర్శను వెతకటానికి భూతద్దం పట్టుకొని రావటం ఎంతైనా అవసరం. తెలుగు కథానిక స్థానం ఎంత గొప్పదో, దానిపై విమర్శ అంత చిన్నది''[2] అన్నాడు.

''ఈ విమర్శ ప్రక్రియ ఎక్కువగ అభివృద్ధి చెందలేదు, ప్రమాణాల్లో గాని, పరిమాణంలో గాని గొప్పగా చెప్పుకో వలసిన విమర్శ చాల తక్కువ

వచ్చిందన్న విమర్శే ఎక్కువగా కనిపిస్తూంది. మన ఆధునిక సాహిత్యంలో వివిధ ప్రక్రియలు విలసిల్లి అభివృద్ధి చెందినంతగ ఈ విమర్శ ప్రక్రియ వృద్ధి చెంద లేదన్నది వాస్తవం. ఆ సాహిత్యం మీద రావలసినంత, ఆశించినంత విమర్శ రాలేదు''[3] అన్నది సంజీవమ్మ.

''తెలుగులో సాహిత్య విమర్శ చాలా తక్కువ. ఉన్న కాస్తలోనైనా ఆధునిక విమర్శకుల్లో పాక్షిక దృష్టే ఎక్కువగా కనిపిస్తున్నది''[4] అన్నది సాహితీ బంధు బృందం.

ఆధునిక సాహిత్య విమర్శ పెడధోరణులలో పడడానికి వ్యక్తిగత దృష్టే కారణం అంటున్నాడు బూదరాజు రాధాకృష్ణ, ''విషయ నిష్ఠం కావలసిన విమర్శ వ్యక్తి నిష్ఠమైన, నచ్చిన వారు మహనీయులై, నచ్చని వారు పరమ దుర్మార్గులై హేళనా పాత్రులవుతున్న ధోరణి ప్రబలుతున్నది.''[5]

ఆధునిక విమర్శలో భావ పలాయన వాద ధోరణులు ప్రబలడానికి కూడా ఇదే కారణమన్నాడు కె.కె. రంగనాథాచార్యులు, "విశ్లేషణం, శాస్త్రీయత ప్రధాన లక్షణంగా ఉండవలసిన విమర్శలో వస్తుగత దృష్టి కంటే, వ్యక్తిగత దృష్టి ప్రధాన స్థానాన్ని ఆక్రమించడమే దీనికి కారణం".[6]

తెలుగు సాహిత్య విమర్శలో ఉన్న దుర్లక్షణాలను, వాటికి కారణాలను "చిత్రమేమిటంటే విమర్శ అనేది ఒక స్వయం సంపుష్ట శాస్త్రదశకు . ఎదిగినా దీనికింకా ఒక మెథడాలజీ ఏర్పడక పోవడం. అందువల్లనే ఇప్పటికీ పెద్ద పెద్ద విమర్శకుల రచనల్లోనే ఇంకా పెడత్రోవలు సాక్షాత్కరిస్తుంటాయి. ఏక దేశాన్వయత లోపించడం, శాస్త్రీయ ప్రాయోగిక విధానం అవలంబించకపోవడం, ఒక్కో చోట రూప ప్రాధాన్యతను కేవలం అత్యల్పంగా భావించడం, మరోచోట అనల్పం చేసి పట్టం గట్టడం, స్వీకృత వస్తువు నుంచి పూర్తిగా దూరమై సిద్ధాంత చర్చ చేయడం మొదలైన దుర్లక్షణాలు అగుపడుతుంటాయి"[7] అని వివరించాడు గంగిశెట్టి లక్ష్మీనారాయణ.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో వ్యక్తిగత దృష్టి ప్రాధాన్యం వహించడం, మెథడాలజీ లేకపోవడాలే కాక ఒక ప్రత్యేక దృక్పథం లేకపోవడం

కూడా విమర్శ శాస్త్రీయ ధోరణిలో అభివృద్ధి చెందకపోవడానికి ఒక ప్రధాన కారణం. ఆధునిక విమర్శకులలో చాలా మందికి ఒక ప్రత్యేక దృక్పథం కొరవడింది. సాహిత్యాన్ని సాహిత్య ప్రమాణాలతోనే కొలవడం సాంప్రదాయక విమర్శ పద్ధతుల నుండి ఆధునిక విమర్శ పద్ధతులకీ కొంతవరకు వ్యాపించింది. సాహిత్య ప్రమాణాలలో కొంత మార్పు ఉండవచ్చు. పాశ్చాత్య విమర్శనా ధోరణుల ప్రభావం కొంతవరకు ప్రమాణాలలో మార్పుకు కారణం. రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో జరిగిన సాహిత్య విమర్శ కూడా పూర్తిగా ఒక కోణం నుండి జరగలేదు. కార్య కారణ సమన్వయం తగినంత స్థాయిలో లేదు. "ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో కొట్టొచ్చినట్లు కనపడే లక్షణం ఒక స్పష్టమైన ధోరణి అంటూ ఏర్పడకపోవడం. పరస్పర విరుద్ధమైన అనేక ధోరణులు, సాహిత్య సిద్ధాంతాలు, అధ్యయన సిద్ధాంతాలు కలగా పులగంగా ఇంచుమించు ప్రతి విమర్శకుణ్ణీ ప్రభావితం చేశాయి"[8] అన్నాడు సి.వి. సుబ్బారావు. ఆధునిక సాహిత్య విమర్శకు ఒక పద్ధతి (మెథడాలజీ), ఒక దృక్పథం (డైరెక్షన్) ఇచ్చింది మార్క్సిజం. "సాహిత్యానికి స్వయం ప్రతిపత్తి లేదని, అది నిర్దిష్ట స్థల కాలాల్లో నిర్దిష్ట సామాజిక ధోరణుల ప్రభావంతో తన అస్తిత్వాన్ని పొందుతుందని మొదటి నుంచి గుర్తిస్తున్న వారు మార్క్సిస్టు విమర్శకులు... మార్క్సిస్టు విమర్శ పరిశీలిస్తున్న సాహిత్యం వల్ల నిర్వచించబడదు. పరిశీలించే పద్ధతివల్ల నిర్వచించబడుతుంది"[9] అన్నాడు సి.వి. సుబ్బారావు. అభ్యుదయ, విప్లవ సాహిత్య విమర్శలు కొంతవరకు దీనికి ఉదాహరణలుగా నిలుస్తాయి. అయితే మార్క్సిస్టు విమర్శ పరిశీలిస్తున్న సాహిత్యం వల్ల గాక పరిశీలించే పద్ధతివల్ల నిర్వచించబడుతుందనడం వల్ల ఈ విమర్శ కేవలం అభ్యుదయ, విప్లవ సాహిత్యాలకు మాత్రమే పరిమితం కాదనీ, మొత్తం అన్ని రకాల సాహిత్య ధోరణులనూ, అన్ని కాలాల సాహిత్యాన్నీ ఈ దృక్పథంతో అధ్యయనం చేయ వచ్చుననీ స్పష్ట పడుతుంది. కాని అటువంటి అధ్యయనం చాలా పరిమితంగా జరిగింది.

మార్క్సిజం ప్రభావం సృజనాత్మక సాహిత్య ప్రక్రియల మీద ఉన్నంతగా సాహిత్య విమర్శ మీద కన్పించదు. మార్క్సిస్టు విమర్శ ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. "ఇందరు ఇంతగా కృషి చేసినా మార్క్సిస్టు సాహిత్య విమర్శ (తెలుగులో) శైశవ దశను దాటలేదు ఈ విమర్శకులు ఆధునిక సాహి

త్యాన్నే తమ విమర్శకు ప్రధాన వస్తువుగా ఎన్నుకున్నారు అందులోనూ కవిత్వం ఎక్కువచోటు ఆక్రమించింది. కథ, నవల, నాటకం వంటి వాటి మీద వచ్చిన విమర్శలు చాలా తక్కువ"10 అన్నాడు చేకూరి రామారావు.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో కనిపించే అన్ని ధోరణులు, గుణ దోషాలూ అన్నీ పీఠికల్లో కూడా కనిపిస్తాయి. రచయితకూ పీఠికా కర్తకూ ఉండే సంబంధం ఒకటి పీఠికను వ్యక్తిగతం (సబ్జెక్టివ్) చేస్తుంది. ఇటువంటి సంబంధం రచయితకూ విమర్శకుడికీ మధ్య కూడా ఉండవచ్చు. అయితే పీఠిక విషయంలో దీని ప్రసక్తి ఎక్కువ. ఈ సంబంధం వల్ల పీఠికా కర్త నేనుగా బయట పడతాడు. "నేనుతో ప్రారంభం అయ్యే విమర్శ ధోరణులు కూడా నేటికాలంలో విరివిగా కనిపిస్తాయి. పీఠికలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.... ఒక ప్రత్యేక విషయం పైన తనకున్న అభినివేశాన్ని వ్యక్తం చేయదలచుకొన్నప్పుడు, వ్యక్తి గత దృక్కోణంతో ఒక విషయాన్ని పరిశీలించ దలచుకొన్నప్పుడు, ఒక రచనను గురించి అభిమానంతో కూడిన అభిప్రాయాలను చెప్పదలచుకున్నప్పుడు సాహిత్యంలో తాను కొత్త భావాలను, ప్రతి పాదనలను ప్రవేశ పెట్టదలచు కున్నప్పుడూ, సాహిత్య రంగంలో తన స్థానాన్ని పెంచుకోవాలనే తాపత్రయం పెరిగినప్పుడు ఈ 'నేను' విమర్శలో ప్రవేశిస్తుంది."11 అన్నాడు కె. కె. రంగ నాథా చార్యులు. అందువల్ల సామాన్య సాహిత్య విమర్శ ప్రక్రియలలో కంటే పీఠికలో వ్యక్తిగత దృష్టి ఎక్కువైన నందువలన కలిగే లోపం గమనించదగిందే. అయినా ఈ అన్ని లోపాలతోనూ ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో పీఠిక నెరవేర్చిన ప్రయోజనం సామాన్యమయినదేమీ కాదు.

తెలుగు సాహిత్య విమర్శ పరిమాణ దృష్ట్యా చూచినా వెనకబడే ఉందని పలువురి అభిప్రాయం. ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన విమర్శ సాహిత్యం పరిమాణం విషయంలో కొంత సంతృప్తి విమర్శకులు కనబరచారు. ప్రాచీన సాహిత్యంలో కొందరు కవులను గురించి మాత్రమే ప్రత్యేక గ్రంథాలు వచ్చాయి. వ్యాసాలనేకం వచ్చాయి. కాని కొందరు కవులను గూర్చిన వివరాలు మాత్రం వారి గ్రంథాల ద్వారానే వెల్లడౌతాయి. ప్రఖ్యాత కవులు తప్ప తక్కిన వారిని గురించి ప్రత్యేక గ్రంథ రచనలు జరగలేదు. వీరిని గురించిన పరిశో ధన విశ్వవిద్యాలయ సిద్ధాంత వ్యాసాల రూపంలో ఇప్పుడు అధికంగా జరుగు

తున్నది. ఆధునిక కవుల, రచయితల గురించి వచ్చిన ప్రత్యేక గ్రంథాలు గాని, ఆధునిక రచనలమీద వచ్చిన ప్రత్యేక గ్రంథాలుగాని అత్యల్పమనే చెప్పవచ్చు. ఈ విషయంలో విశ్వవిద్యాలయ పరిశోధనలు, విశ్వవిద్యాలయాల వెలుపల జరిగిన కృషీ సమానమే. గురజాడ అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీశ్రీ, విశ్వనాథ, చలం మొదలైన కొద్ది మందిని గురించి మాత్రమే విశ్వవిద్యాలయాల వెలుపల, ప్రత్యేక గ్రంథ రచనలు జరిగాయి. అనేక మంది రచయితలను గురించి తెలుసుకోవడానికి ఇప్పటికీ వారి గ్రంథ పీఠికలే ప్రధానాధార మౌతున్నాయి.

కవిత్వం మినహా తక్కిన అన్ని సృజనాత్మక ప్రక్రియలకు సంబంధించి వ్యస్తంగా చెప్పుకోదగిన విమర్శలేదు. ఆయా ప్రక్రియలను గురించి ఆయా రచనల పీఠికలే అధిక సమాచారాన్నిస్తున్నాయి. సాహిత్యోద్యమాలు, సిద్ధాంతాలను గురించి కవిత్వ పీఠికలు చర్చించినంతగా ఇతర సాహిత్య ప్రక్రియల పీఠికలు చర్చించలేదు. వీటిలో ప్రక్రియా పరమైన చర్చ కొంత కనిపిస్తుంది. ఉదాహరణకు కథానికకు సంబంధించి చాలా పీఠికలు కథానికను నిర్వచించడం కష్టం అంటూ మొదలై నిర్వచించే ప్రయత్నం చేశాయి. సామాన్యంగా ఈ ప్రక్రియలో సంపుటాలు అధికం కాబట్టి పీఠికలు రచయితల్నీ, కథానికల్నీ పరిచయం చేయడమే లక్ష్యంగా నడిచాయి. అయినా కనీసం ఆ రచయితలను గురించి తెలుసుకోవడానికైనా అవి తోడ్పడుతున్నాయి.

ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులను 1. రూపవాద విమర్శనా పద్ధతి, 2. మనస్తత్వ విశ్లేషణా విమర్శ, 3. అనుభూతి వాదం, 4. భాషాశాస్త్ర విమర్శ 5. ప్రక్రియా పరవిమర్శ, హిందూమత తాత్విక ధోరణులు ఆధారంగా సాగే విమర్శ అని సి. వి. సుబ్బారావు విభాగించాడు.[12] 1. రూపవిమర్శ 2. మానసిక శాస్త్ర విమర్శ. 3. మార్క్సిస్టు విమర్శ 4. నైతిక విమర్శ, 5. భాషాశాస్త్ర విమర్శ, 6. ప్రక్రియావిమర్శ అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య విభాగించాడు.[13] పేర్లు వేరైనా, ఒక్కొక్కసారి ప్రమాణాలు వేరయినా పెరిగే తరిగే విభాగాలు చాలామంది చేశారు. స్థూలంగా 1. సంప్రదాయ విమర్శనా పద్ధతి - ఆలంకారిక విమర్శనా ధోరణి 2. పాశ్చాత్యుల శిల్ప విమర్శనా ధోరణి, 3. మార్క్సిస్టు దృక్పథంతో విమర్శ అని సంజీవమ్మ చేసిన విభాగం సరిపోతుంది.[14] ఈ మూడు పద్ధతులూ వివిధ ప్రక్రియల పీఠికలు చర్చించిన విషయాలను బట్టి పీఠికలలో

విస్తృతంగా చోటు చేసుకున్నట్లు గమనించవచ్చు. ముఖ్యంగా మూడవది అయిన మార్క్సిస్టు దృక్పథంతో విమర్శ మాత్రం పీఠికలలోనే ఎక్కువగా కనిపిస్తుంది.

పీఠిక లక్ష్యం కేవలం ఆ రచనను అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే నేపథ్యాన్ని అందించడమే అయినప్పటికీ తెలుగులో అది ఒక ప్రధాన సాహిత్య విమర్శా వాహికగా రూపొందింది. అది గ్రంథ సమీక్షలు చేసే పనినీ, పరిశోధనా వ్యాసం చేసే పనినీ కూడా నిర్వహించింది. అందుకే కొన్ని పీఠికలు విడిగా విమర్శ గ్రంథాలుగా ప్రచురితం కావడానికీ, ఇతర సందర్భాలలో పత్రికలలో వచ్చిన వ్యాసాలు, గ్రంథ సమీక్షలు గ్రంథ పీఠికలుగా ప్రచురణలలో చోటు చేసుకోవడానికీ వీలు ఏర్పడింది. వ్యాసంలాగా స్వతంత్ర ప్రక్రియ కాకపోయినా ఆ లక్షణం కొంతవరకు పీఠికకూ వ్యాపించింది. కొలకలూరి ఇనాక్ పీఠికను పీఠికావ్యాసంగా, ఒక వ్యాసభేదంగా వర్గీకరించాడు.15

వివిధ ఉద్యమాలను ప్రచారం చేయడంలో వ్యాసం, పుస్తకం ఎటువంటి పాత్ర వహించాయో పీఠిక కూడా అటువంటి పాత్రే వహించింది. ఒక విధంగా అంతకన్నా ఎక్కువ కృషే పీఠికలలో జరిగిందని చెప్పవచ్చు. హేతువాదాన్ని, ప్రచారం చేయడంలో త్రిపురనేని, నార్ల వెంకటేశ్వరరావుల పీఠికలు ఎంతో తోడ్పడ్డాయి. వాళ్ళు తమ రచనలకు నేపథ్యాన్ని చెప్పడానికి కాక తమ అభిప్రాయాలను, సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి మాత్రమే పీఠికలు రాశారు. వారు గ్రంథరచనలో ఎంత శ్రద్ధ తీసుకొన్నారో పీఠికా రచనలోనూ అంత శ్రద్ధ తీసుకున్నారు. పీఠికా రచనకు తానెంత శ్రమపడిందీ నార్ల చెప్పుకున్నాడు.

కాల్పనిక, అభ్యుదయ, విప్లవ కవిత్వోద్యమాల ప్రచారంలో పీఠికలు అద్వితీయమైన పాత్ర నిర్వహించాయి. రచయితలు తమ రాజకీయ, సామాజిక, సాహిత్య సిద్ధాంతాలను పీఠికల ద్వారా ప్రచారం చేశారు. ఆ ఉద్యమాలలోని రచయితలకు సైద్ధాంతిక స్ఫూర్తినిచ్చారు. ఆయా ఉద్యమాల మీద వచ్చిన విమర్శను పీఠికల ద్వారా ఎదుర్కొన్నారు తమ తమ సిద్ధాంతాలను స్థాపించుకోవడానికి విపులమైన విషయ చర్చలు చేశారు రచయితలు యథేచ్ఛగా విశృంఖల విహారం చేయకుండా వారికి నిర్దిష్టమైన పథ నిర్దేశం చేయడంలో ఉద్యమ కవిత్వ సంబంధమైన పీఠికలు తోడ్పడ్డాయి. కవులను హెచ్చరిస్తూ, కవిత్వంలో ప్రవేశిస్తూన్న అరాచక ధోరణులనుండి వారిని తప్పించడానికి ప్రయత్నించాయి. ఉద్యమ రచయితలు రాజకీయ నినాదాన్నే కవిత్వ మనుకొని, కవిత్వానికి బదులు నినాదాలే సృష్టిస్తుంటే కర్తవ్యాన్ని ప్రబోధించాయి. ఈ విధంగా గ్రంథం లేకుండా ఉనికి లేనిదయినప్పటికీ పీఠిక ఇతర స్వతంత్ర ప్రక్రియల లాగానే తనదైన ఒక విశిష్టతను స్థాపించుకుంది.

వివరాలు

పీఠిక : స్వరూపం - నిర్వచనం

1. "గ్రంథము మొదట వ్రాసెడు దాని పుట్టుపూర్వోత్తరము" శబ్ద రత్నాకరము - బహుజన పల్లి సీతారామాచార్యులు - దేశ భాషా గ్రంథకరణ సభ, చెన్న పట్టణము, 1912, "గ్రంథములో మొదట వ్రాసెడు దాని పుట్టుపూర్వోత్తరములు." సూర్యరాయాంధ్ర నిఘంటువు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1982.
2. తెలుగు సాహిత్య కోశము - తెలుగు అకాడమి - హైదరాబాదు, 1986
3. "పీఠయిన పీఠికా, భూమిరివ భూమికా" - కావ్యాలంకార సంగ్రహం - వ్యాఖ్యానం-సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, యం. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు, 1976.
4. "Something spoken as introductory to a discourse, or written as introductory to a book or other composition." The International Webster New Encyclopedic Dictionary of the English language and Library of useful Knowledge - Tabor House, New York.
5. "Introduction to book stating, subject, scope etc". The New Oxford Illustrated Dictionary, Vol. 2 - Bay books in association with Oxford University press and

   The concise Oxford Dictionary of current English, Oxford, 1965.
6. "A Statement or brief essay, usually by the author, included in the front matter of a book

etc , and dealing primarily with the purpose and scope of the Work" - The Reader's Digest great encyclopedic Dictionary III Edition. The Reader's Digest Association, Inc., Pleasant villi, New York, 1969.

7. "Something written as introduction to a literary work, usually explaining its subject, scope and method" - A. F. Scott. Current Literary Terms - Macmillan, New York, 1965.

8. "An introductory statement to a book or other published writing, forming a seperate entity, explaining the object, scope of the Composition, acknowledging sources, and supplying facts pertinent to the text" - Joseph T. Shipley Dictionary of world literature - criticism- forms- technique - The Philosophical library, New York, 1943.

9. "A preliminary statement by the authour or editor of a book, setting forth its purpose, expressing acknowledgement of assistance etc." The Random House Dictionary of the English Language - College edition - Allied Publishers Private Ltd., New York, 1969.

10. "A Preface is generally shorter than our introduction, which contains matter kindred in subject, and additonal or leading upto what follows; while a preface is usually confined to particulars relating to the origin, history, scope or aim of the work to which it is prefixed" - The century

Dictionary and Cyclopedia, the Century Co., New York.

11. "Some thing that leads to or opens the way for the understanding of some thing else; specifically, a preliminary explanation or statement; The Part of a book or discourse which precedes the main work, and in which the author or speaker gives some general account of his design and subject; an elaborate preface, or a preliminary discourse." -Ibid-

and

"An essay, sometimes a poem, which prepares the way for a literary work. A preliminary explanation or statement; the part of a book or discourse (speech) which precedes the main work and in which the author or speaker gives some general account of his design, subject or intention"- A.N. Gupta, Satish Gupta, A Dictionary of Literary Terms, Prakash Book Depot, Bareilly, 1976.

12. "Something that leads upto what follows, as the first part of a book. The opening of a musical work etc. An elementary treatise in any branch of study"- The Reader's Digest Association, Inc., Pleasant Villi, New York, 1969.

13. "An essay, some times a poem, which prepares the way for a literary work." A. F. Scott, Current Literary Terms, Macmillan, New York, 1965.

14. శాస్త్రస్యారంభకో గ్రంథ ఉపోద్ఘాత ఇతీరితః ।
స ఏవ గ్రంథ సందర్భః ప్రస్తావః కథితో బుధైః ॥

రామరాజ భూషణుడు, కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రి వ్యాఖ్యానం. యం. శేషాచలం అండ్ కంపెనీ, సికింద్రాబాదు, 1976.

15 "Introductory remarks to a book, especially written by a person other than the author of the book in which it appears" A. F. Scott, Current Literary Terms, Macmillan, New York, 1965.

and

"Preface; Introductory remarks, especially by an author other than the author of the book etc. (from 1842; modern formation of the anti-latinists, after German Vorwort)" - The Concise Oxford Dictionary of Current English, Oxford, 1965.

16. రామరాజభూషణుడు, కావ్యాలంకార సంగ్రహం - సన్నిధానం సూర్య నారాయణశాస్త్రి, యం. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు, 1976.

17. "A preliminary discourse; a preface or introductory part of a discourse, poem or novel." The International Webster New Encyclopedic Dictionary of the English Language and Library of useful knowledge, Tabor house, Newyork.

18. "A short poem, introductory in character, prefix to a long poem or to a section of a long poem" A. N. Gupta and Satish Gupta. A Dictionary of literary terms, Prakash Book Depot, Bareilly, 1976.

19. "An introductory paragraph or division of a discourse or writing in formal resolutions it indicates the reasons and intent of what follows." A. N. Gupta and Satish Gupta, Prakash Book Depot, Bareilley, 1976.

20. "Exordium is the old or classic technical word in rhetoric for the beginning of an oration, upto the second division, which may be "narration", "partition", "proposition" or the like. Introduction is a more general word, in this connection applying to spoken or written discourse, and covering whatever is preliminary to the subject, in a book it may be the opening chapter. As distinguished from the preface, the introduction is supposed to be an essential part of the discussion or treatment of the theme, and written at the outset of composition. A preface is supposed to be the last words of the author in connection with his subject, and is generally explanatory, or conciliatory having the style of more direct address to the reader. A prelude is generally an introductory piece of music, a preamble of a resolution, an ordinance or a law. A prologue is a conciliatory spoken preface to a play. All these words have some freedom of figurative use." The Century Dictionary and Cyclopedia, The Century Co., New York.

21. చూ 15

22. దూబగుంట నారాయణకవి, పంచతంత్రము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1989.

23. సముఖం వేంకట కృష్ణప్పనాయకుడు, శృంగార అహల్యా సంక్రందనము, జి. యన్. శాస్త్రి అండ్ కొ., మద్రాసు, 1927.

24. వట్టికోట ఆళ్వారు స్వామి, గంగు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, విజయవాడ, 1974.

25. వేంకట పార్వతీశ కవులు, భావ సంకీర్తనము, ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్, రాజమండ్రి, 1943.
26. నార్ల వెంకటేశ్వరరావు, జాబాలి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1974
27. కాండూరి నరసింహాచార్యులు, వినోద బహిష్కరణములు, ప్రొద్దుటూరు, 1965.
28. స్థానాపతి రుక్మిణమ్మ, కాదంబిని, కవితా సమితి, విశాఖపట్టణం, 1950.
29. అబ్బూరి రామకృష్ణారావు, ఊహాగానము - ఇతర కృతులు, కవిత, న్యూఢిల్లీ, 1973.
30. గడియారం రామకృష్ణ శర్మ, పాంచజన్యము, జ్యోతిర్మయి సాహిత్య సాంస్కృతిక సమితి, వనపర్తి, 1980.
31. చలం, స్త్రీ, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 1984.
32. రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఆరు సారా కథలు, విజయాబుక్స్, విజయవాడ, 1975.
33. కాళూరి హనుమంతరావు, మృగతృష్ణ, హైదరాబాదు, 1973.
34. త్రిపురనేని రామస్వామి చౌదరి, సూతపురాణము, సరళా పబ్లికేషన్స్, తెనాలి, 1971.
35. దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథావళి - 1, నెల్లూరు, 1935.
36. వాసా కృష్ణమూర్తి, శ్రీ పోతరాజు, అర్క గ్రంథమాల, శ్రీకాకుళం, 1976.
37. శ్రీకృష్ణదేవరాయలు, ఆముక్తమాల్యద, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1914.
38. కుమార ధూర్జటి, శ్రీ ఇందుమతీ పరిణయము, చంద్రికా ప్రెస్, గుంటూరు.
39. దువ్వూరి రామిరెడ్డి, పానశాల, నాల్గవ ప్రచురణ, కవికోకిల పబ్లికేషన్స్, నెల్లూరు, 1952.
40. దువ్వూరి రామిరెడ్డి, కృషీవలుడు, కవికోకిల గ్రంథావళి-1, నెల్లూరు, 1935.
41. కందుకూరి వీరేశలింగం, వేశ్యా ప్రియాప్రహసనం, శ్రీ కందుకూరి వీరేశలింగ కవికృత గ్రంథములు, సంపుటి-1, హితకారిణి సమాజము, రాజమహేంద్రవరము, 1949.

42. మంగళగిరి కేశవాచార్య, ఆచార్యసూక్తి ముక్తావళి, యనమదల అనంతాచార్యులు, మద్రాసు, 1883.

43. సుంకర సత్యనారాయణ, భూమికోసం, విశాలాంధ్ర ముద్రణాలయం, విజయవాడ, 1954.

44. చింతా దీక్షితులు, ప్రజావాఙ్మయము, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.

45. దేశికాచార్య, అశ్రుహారం, లహరి ప్రచురణలు, హైదరాబాదు.

46. సంపత్కుమారాచార్య, మన పండితులు, కవులు, రచయితలు, జన ధర్మ, వరంగల్లు.

47. సారంగు తమ్మయ, వైజయంతి విలాసము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ చెన్నపట్నము, 1909.

48. కొండేపూడి సుబ్బారావు, కావ్యాంజలి, విశాఖపట్టణం, 1976.

49. సి. నారాయణరెడ్డి, కర్పూర వసంత రాయలు, యం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1972.

50. చింతాదీక్షితులు, ప్రజావాఙ్మయము, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.

51. నార్ల వెంకటేశ్వరరావు, నరకంలో హరిశ్చంద్రుడు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1974.

52. పాల్కురికి సోమన, బసవ పురాణము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1966.

53. పాల్కురికి సోమన, పండితారాధ్య చరిత్ర, ఆంధ్ర గ్రంథమాల, చెన్నపురి, 1939.

54. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, సారస్వతాలోకము, త్రివేణీ పబ్లిషర్స్ మచిలీపట్టణం, 1954.

55. దువ్వూరి రామిరెడ్డి, పానశాల, కవికోకిల పబ్లికేషన్స్, నెల్లూరు, 1952.

56. జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆంధ్ర సామ్రాజ్యము, అజంతా ప్రింటర్స్, సికింద్రాబాదు, 1962.

57. సం. స్వామి శివశంకర స్వామి, శతక సంపుటము - 2, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1968.

58 ఉండవల్లి సీతారామస్వామి, నివాళి, ఉండవల్లి హేమసుందర గాంధి, నర్సాపురము, 1965.

59. త్రిపురనేని రామస్వామి చౌదరి, సూతపురాణము, సరళా పబ్లికేషన్స్, తెనాలి, 1971.

60. త్రిపురనేని రామస్వామి చౌదరి, శంబుక వధ, సరళా పబ్లికేషన్స్, తెనాలి, 1971.

61. శివ సత్య, క్రాంతి రేఖలు, ఆంధ్ర సాహితీ నికేతనం, కాకినాడ, 1980.

62. గోపాల - కృష్ణ - రాఘవన్, చంద్రిక కథ, బంగోరె, నెల్లూరు, 1971.

63. మొల్ల, రామాయణము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1952.

64. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1955.

65. వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రి, ద్రావిడ భాషా సామ్యములు, కాకరపర్తి వేంకట సీతమ్మగారు, విజయనగరము, 1972.

66. తుమ్మల సీతారామమూర్తి చౌదరి, మహాత్మ కథ, అప్పికట్ల, 1968.

67. కాండూరు నరసింహాచార్యులు, వినోద బహిష్కరణములు, ప్రొద్దుటూరు, 1965.

68. ముప్పిరాల సుబ్బరాయకవి, ప్రద్యుమ్న చరిత్రము, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య సంశోధనాలయము, తిరుపతి, 1974.

69. సం॥ భద్రిరాజు కృష్ణమూర్తి, మాండలిక వృత్తి పదకోశం - 1, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974.

70. చదలువాడ కోటి నరసింహము, రాష్ట్రగీత, సరస్వతీ బుక్ డిపో, విజయవాడ, 1946.

71. ఉప్పాడ రాజారావు, మధూదయము, హనుమంతు మోహనరావు, తలగాం, 1960.

72. కరుటూరి సత్యనారాయణ, కరుణా సౌగతము, ఉదయమోహన పబ్లిషర్స్, భీమవరం, 1969.

73. బొడ్డుచర్ల చినతిమ్మయ, ప్రసన్నరాఘవనాట్య ప్రబంధము, ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు, 1932.

74. చెంగళ్వ కాళ కవి, రాజగోపాల విలాసము, మద్రాస్ ప్రభుత్వము ఓరియంటల్ సిరీస్, మద్రాసు ప్రభుత్వము, మద్రాసు, 1951.

75. భట్టు పెనుమర్తి కోదండ రామకవి, వల్లభాభ్యుదయము, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, 1940.

76. ఎఱ్ఱయ, సకల నీతి కథాసారము, మద్రాసు ప్రభుత్వము, మద్రాస్, 1951.

77. పెద్దాద నాగారాజామాత్యుడు, శకుంతలా పరిణయము, శ్రీరాజా కొచ్చెర్లకోట రామచంద్ర వేంకట కృష్ణారావు బహద్దూర్, చెన్నపట్టణము, 1900.

78. శేషము రఘునాధార్య, కుల శేఖర మహీపాల చరిత్ర, క్యూరేటర్, జి. ఓ. ఎమ్. లైబ్రరీ, మద్రాసు అండ్ స్టాఫ్ ఆఫ్ ద లైబ్రరీ, మద్రాసు 1955.

79. చింతాక్షితులు, ప్రజావాఙ్మయము, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.

80. అడిదము రామారావు, అడిదము సూరకవి జీవితము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు. అండ్ సన్స్, చెన్నపురి, 1955.

81. అడిదము సూరకవి, కవి సంశయ విచ్ఛేదము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1955.

82. అనంతామాత్యుడు, అనంతుని ఛందము, వి. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1968.

83. కాళహస్తి కవి, వసుచరిత్రం, బి. రామరాజు, హైదరాబాదు, 1965

84. సం॥ వేటూరి ప్రభాకరశాస్త్రి, ప్రబంధరత్నావళి, శ్రీ ప్రభాకర పరిశోధక మండలి, హైదరాబాదు, 1976.

85. గోపాల-కృష్ణ-రాఘవన్, చంద్రిక కథ, బంగోరె, నెల్లూరు, 1971.

86. పింగళి సూరన, ప్రభావతీ ప్రద్యుమ్నము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1966.

87. పింగళి సూరన, కళాపూర్ణోదయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

88. పొన్నిగంటి తెలగన్న, యయాతి చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

89. రఘునాథనాయకుడు, వాల్మీకి చరిత్రము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైద్రాబాదు, 1968.

90. అనంతామాత్యుడు, భోజరాజీయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1969.

91. దూబగుంట నారాయణ కవి, పంచతంత్రము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1980.

92. సం॥ స్వామీ శివశంకర స్వామీ, శతక సంపుటము - 2, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1968.

93. అజ్ఞాతకవి. శృంగార పదములు, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాదు, 1972.

94. శాహ మహారాజు, సీతాకల్యాణము, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ అండ్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్. హైదరాబాదు, 1971.

95. కరుటూరి సత్యనారాయణ, శిష్యరక్షిత, రాజమండ్రి, 1967.

96. బీర్నీడి మోషేకవి. హరిజనాభ్యుదయము, బీర్నీడి ప్రసన్న, వినుకొండ, 1969.

97. చూ. 94.

98. వాసా కృష్ణమూర్తి, శ్రీపోతరాజు, శ్రీకాకుళం, 1976.

99. అనంతామాత్యుడు, అనంతుని ఛందము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1921, 1947, 1968.

100. నండూరి సుబ్బారావు, ఎంకి పాటలు, ఉదయభాస్కర పబ్లికేషన్స్, విజయవాడ.

101. పింజమూరి వేంకట లక్ష్మీనరసింహారావు, నౌరోజ్, మద్రాసు, 1950.

102. సంపత్కుమారాచార్య, మన పండితులు, కవులు, రచయితలు, జనధర్మ, వరంగల్లు.

103. గడియారం రామకృష్ణశర్మ, పాంచజన్యము, జ్యోతిర్మయి సాహిత్య సాంస్కృతిక సమితి, వనపర్తి, 1980.

104. కాళూరి హనుమంతరావు, మృగతృష్ణ, హైదరాబాదు, 1973.

105. నోరి నరసింహశాస్త్రి, తేనెతెట్టె, సాహితీసమితి, రేపల్లె, 1950.

106. గుఱ్ఱం జాషువా, స్వయంవరం, డి. వేంకటేశ్వర అండ్ కో. తెనాలి, 1950.

107. చింతా దీక్షితులు, ప్రజావాఙ్మయము, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.

108. సి. నారాయణరెడ్డి, శిఖరాలూ - లోయలూ, యువ భారతి, సికిందరాబాదు, 1976.

109. గుఱ్ఱము వేంకటసుబ్రహ్మణ్యము, అభిజ్ఞాన శాకుంతలము, సాహితీ సమితి, నెల్లూరు, 1958.

110. వేదం వేంకట రాయశాస్త్రి, ఆంధ్ర విక్రమోర్వశీయనాటకము, వేదం వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాస్, 1948.

111. తుమ్మల సీతా రామమూర్తి, మహాత్మకథ, అప్పికట్ల, 1968.

112. అబ్బూరి రామ కృష్ణారావు, నదీసుందరి, ద్వి. ము., కవిత, హైదరాబాదు, 1979.

113. దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథావళి -1, కావ్యములు, నెల్లూరు, 1935.

114. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేమన, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, 1928.

115. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, సారస్వతాలోకము, త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్టణం, 1954.

116. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, మిరాబాయి, మానవసేవా గ్రంథమాల, రాజమహేంద్రవరము, 1913,

117. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, సుందరపాండ్య విరచిత ఆర్య, శ్రీరాముల సాహిత్య పరిషత్తు, ప్రొద్దుటూరు, 1970.

118. (సం) భద్రిరాజు కృష్ణమూర్తి, మాండలిక వృత్తి పదకోశం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974.

119. శ్రీనాథుడు, క్రీడాభిరామము, గంటి సూర్యనారాయణశాస్త్రి, 1928.

120. బూర్గుల రామకృష్ణారావు, పండితరాజ పంచామృతము, తెలుగు రచయితల సంఘం, హైదరాబాదు, 1959.

121. ప్రబంధ మణిభూషణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971.

122. కేతన, దశకుమార చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

123. దూబగుంట నారాయణకవి, పంచతంత్రము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1980.

124. ఆరుద్ర, త్వమేవాఽహం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1971.

125. కేతన, దశకుమార చరిత్ర, చింతామణి ప్రెస్, మద్రాసు, 1901.

126. Christopher Morley, Prefaces, Shandygaff, Garden City Publishing Co. Inc. New York, 1918.

127. నార్ల వెంకటేశ్వరరావు, జాబాలి, నవోదయ పబ్లికేషన్స్, విజయవాడ, 1974, పు. 7, 67.

128. చందు సుబ్బారావు, **మూల రచనకు పల్లకి మోస్తున్న పీఠికా రచన,** ఆంధ్రప్రభ, 15-5-1983

129. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, మీరాబాయి, మానవసేవా గ్రంథమాల, రాజమహేంద్రవరము, 1913.

130. కరుటూరి సత్యనారాయణ, కరుణా సౌగతము, ఉదయ మోహన పబ్లిషర్స్, భీమవరం, 1969.

131. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం - 8, ఎమెస్కో, మద్రాసు, 1965.

132. తుమ్మల సీతారామమూర్తి చౌదరి, మహాత్మ కథ, అప్పికట్ల, 1968.

133. కాండూరు నరసింహాచార్యులు, వినోద బహిష్కరణములు, ప్రొద్దుటూరు 1965.

134 గడియారం వేంకట శేషశాస్త్రి, రఘునాథీయము, అనంతపురం, 1973.

135. చింతాదీక్షితులు, ప్రజావాఙ్మయము, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.

136. చూ. 130.

137. గజ్జల మల్లారెడ్డి, శంఖారావం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1968.

138. చూ. 128.

139. నండూరి సుబ్బారావు, ఎంకిపాటలు, ఉదయభాస్కర పబ్లికేషన్స్, విజయవాడ.

140. A. F. Scott, current literary terms, Macmillan, New York, 1918.

141. The New Dictionary of Thoughts, Disraeli, Orig. Com. by Tryton Edwards, D. D. Standard Book Company, 1963.

142. బి. భాస్కరచౌదరి, సాహితీమూర్తి కట్టమంచి, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల, చిత్తూరు.

నీరిక : ఉత్పత్తి, వికాసాలు పూర్వరంగం

1. Homer's Iliad, Translated by S. O. Andrew & M. J. Oakley, Every man's Library, London, 1963.

2. Homer's, Odyssey, Translated by Kimon Frair, Simon and Schuster, 1958, P. 1.

3. Homer's Odyssey, Tr. by Kimon Frair, Simon and Schuster, New York, 1958.

4. "Pro, before; logos, speech. The part before the entrance of the chorus in greek tragedy which introduces in monologues or dialogue, the subject of a drama." A. N. Gupta and Satish Gupta, Dictionary of Literary Terms, Prakash Book Depot Bareilly, 1976.

5. "With Euripides... it (prologue) takes the place of an - explanatory first act" - Encyclopaedia Britannica.
6. Euripides - Hippolytus. Tr. by David Grene. From Greek Tragedies Volume-I 233-235. The University of Chicago Press Chicago, Eleventh impression 1968.
7. Euripides - Alcestis. Tr. by Dudley Fitts & Robert Fitzgerald, Greek plays in modern translation. The Dial Press, New York, 1951.
8. "You'd better stand up and stretch your legs; a long play by plautus is going to be staged." Plautes, Pseudolus, The complete Roman Drama, Volume-I, Ed. George E. Duckworth, Random house, New York, 1942.
9, Plautus, The comedy of Asses, Ibid.
10. Plautus, The Captives, Ibid.
11. Plautus, the pot of Gold, Ibid.
12. Terence, The Eunuch, The complete Roman Drama, Vol. II Ed. George E. Duckworth, Random house, Newyork, 1942.
13. "Moliere revived the Plautine prologue in the introduction to his Amphitryon; Racine introduced Piety as the speaker of a prologue to "Esther". Encyclopaedia Britannica.
14. Ibid.
15. Christopher Marlowe, The Tragical History of Doctor Faustus. Prologue, London : Methuen and Co. Ltd., 1965.

16. The world Book Encyclopaedia, London : Field Enterprises Educational Corporation, 1966.

17. Ben Jonson, Every man out of his Humour, the complete plays of Ben Jonson Vol-I, J. M. Dent Sons Ltd, London, 1936.

18. Encyclopaedia Britannica.

19. Chaucer, Canturbury Tales, The Prologue, Ed. Alfred W. Pollard, Macmillan 1967. pp. 1, 2.

20. E. Spencer, The Faerie Queene Book I, Macmillan and Co. Ltd., London, 1965.

21. John Milton - Paradise Lost Book-I & II, Oxford, 1952.

22. Alexander Pope, *Rape* of The Lock, Ed. Geoffrey Tillotson, Methuen, London, 1966.

23. వాల్మీకి రామాయణమ్, శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాదు, 1979, 1-4 సర్గలు.

24. కాళిదాసు, రఘువంశం, ఆంధ్ర బుక్‌హౌస్, హైదరాబాదు, ద్వి.ము. 1971.

25. బాణుడు, కాదంబరీ, శ్రీ పరమేశ్వర పబ్లికేషన్స్ హైదరాబాద్, 1972.

26. బాణుడు, హర్షచరితమ్, సం॥ జగన్నాథపాఠక, ది చౌఖంబా విద్యాభవన్ వారణాసి, 1964.

27. ధనంజయుడు, దశరూపకం, చౌఖంబా విద్యాభవన్, వారణాసి, 1967 3.2 నుండి 7.

28. భాసుడు, భాసనాటక గుచ్ఛమ్ కల్యాణి గ్రంథమండలి, విజయవాడ, 1962.

—ప్రతిమా,	,,	1963.
—అవిమారకమ్	,,	1963.
—పంచతంత్రమ్	,,	1962.
—చారుదత్తమ్	,,	1963.
—అభిషేకమ్	,,	1963.
—బాలచరితమ్	,,	1963.

29. కాళిదాసు, అభిజ్ఞాన శాకుంతలమ్, వేదం వేంకట రాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మదరాసు, 1957.

30. కాళిదాసు, మాళవికాగ్ని మిత్రం, చౌఖాంబా సంస్కృత్ సీరీస్ ఆఫీస్, వారణాసి, 1965.

31. విశాఖదత్తుడు, ముద్రారాక్షసమ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1972.

32. మురారి, అనర్ఘరాఘవం, పాండురంగ జావజీ, బొంబాయి, 1937.

33. A. Zis, Marxist Leninist Aesthetics and life, Ed. by I. Kulinova and A. Zis-Progress Publishers, Moscow, 1976.

34. కె.కె. రంగనాథాచార్యులు –'తెలుగులో తొలిసమాజ కవులు' – ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1983 పు. XVI

35. పై PP XVI-XVII

36. A. L. Basham, 'The wonder that India was', London, 1953, P. 233.

37. Dr. S. Radhakrishnan, 'Indian Philosophy' Vol-I, London, 1977 PP. 63.

38. చూ. 33

39. Albert Einstein-Science and Religion - Selections from prose and verse - O. U., Orient Longman, Bombay, 1974, P. 11.

41. కాళిదాసు, రఘువంశం, ఆంధ్ర బుక్ హౌజ్, హైదరాబాదు, ద్వి. ము. 1971.

42. భవభూతి, ఉత్తర రామచరితం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1977.

43. దండి, దశకుమార చరితమ్, శ్రీ పరమేశ్వర పబ్లికేషన్స్, హైదరాబాదు, 1972.

44. బాణుడు, కాదంబరి, శ్రీ పరమేశ్వర పబ్లికేషన్స్, హైదరాబాదు, 1972.

45 బాణుడు, హర్షచరితమ్, ది చౌఖంబా విద్యాభవన్, వారణాసి, 1964 పే. 1 & 2.

46. Homer, Odyssey, Tr. Jr. Kiman Frair, Simon and Schuster, New York 1958 P. 1.

47. Homer, Iliad, Tr. S. O. Andrew & M. J. Oakley, Every Man's Library, London, 1963.

48. చూ. 20

49, 50. John Milton, Paradise lost Book I, Oxfoad, 1952.

51. వాల్మీకి, రామాయణమ్, శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాద్, 1979.

52. R. C. Mazumdar, H. C. Rayachaudhuri, Kalikinker Datta, Advanced History of India, London, 1958 P. 36.

53. Ibid. P. 51.

54. తిరుమల రామచంద్ర, మనలిపి - పుట్టుపూర్వోత్తరాలు, మద్రాసు, 1957 లిపి, లేఖన పరికరాల అభివృద్ధినిగూర్చి తెలుసుకోవడానికి ఈ పుస్తకాన్ని చూడవచ్చు.

55. పై P. 46

56. పై P. 48

57. A. L. Basham, The Wonder that India was, London, 1953. PP 398-399.

58. భవభూతి, మహావీర చరితమ్, నిర్ణయసాగర ప్రెస్, బొంబాయి, 1900, ప్రస్తా - 7.

59. భవభూతి, ఉత్తరరామ చరితమ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1965, 7-20.

60. మురారి అనర్ఘరాఘవమ్, పాండురంగ జావజీ బొంబాయి, 1937.

61. Ed. George E. Duckworth, The Complete Roman Drama Vol-II, Random House, N-wyork, 1942.

62. బాణుడు, కాదంబరీ, శ్రీపరమేశ్వర పబ్లికేషన్స్, హైదరాబాదు, 1972.

63. బాణుడు, హర్షచరితమ్, చౌఖంబా విద్యాభవన్, వారణాసి, 1964. శ్లో.7.

64. పై శ్లో. 8-11

65. మురారి, అనర్ఘ రాఘవమ్, పాండురంగ జావజీ, బొంబాయి, 1937.

66. వాల్మీకి, రామాయణమ్. శ్రీజయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాదు, 1979.

67. భవభూతి, ఉత్తర రామ చరితమ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1965. ప్రస్తా - 2.

68. చూ. 61

69. Homer, Odyssey, Tr. by Kimon Frair, Simon & Schuster, Newyork, 1958.

70. కాళిదాసు, రఘువంశం, ఆంధ్రబుక్‌హౌజ్, హైదరాబాదు, 1971, 1-2-4

71. Edmond Spencer, Fairie Queene, Macmillan & Co. London, 1965.

72. కాళిదాసు, మాళవికాగ్నిమిత్రమ్, చౌఖంబా విద్యాభవన్, వారణాసి, 1965

73. భవభూతి, మాలతీ మాధవమ్, తుకారాంజావజీ, బొంబాయి, 1900.

74. భవభూతి, ఉత్తర రామ చరితమ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1965, ప్రస్తా. 5.

75. చూ. 61

76. చూ. 66

77. బాణుడు, కాదంబరీ, శ్రీ పరమేశ్వర పబ్లికేషన్స్. హైదరాబాదు, 1971.

78. చూ. 9.

79. మురారి, అనర్ఘరాఘవమ్, పాండురంగ జావజీ, బొంబాయి, 1937.

80-82. బాణుడు, హర్షచరితమ్, చౌఖంబా విద్యాభవన్, వారణాసి, 1964.

83 వాల్మీకి, రామాయణమ్, శ్రీజయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాదు, 1979.

84. కాళిదాసు, రఘువంశమ్, ఆంధ్రబుక్ హౌస్, హైదరాబాదు, 1971. 1-59.

85. భాసుడు, ప్రతిమా నాటకమ్, కల్యాణి గ్రంథమండలి, విజయవాడ, 1963.

86. Homer, Iliad, Every man's Library, London, 1968.

87. చూ. 6.

88. చూ. 15.

89. చూ. 19.

90. చూ. 21.

91. K. Antonova, G. Bongard - Levin, G. Kotovsky A History of India Vol-I, Moscow, 1979, P. 181.

92. D. D. Kosambi, An Introduction to the study of Indian History, Bombay, 1975. PP 353-355.
కోశాంబి ఫ్యూడల్ లక్షణాలను Marion Gibbs రాసిన 'Feudal Order' అన్న పుస్తకం నుండి ఉట్టంకించడం జరిగింది.

93. దండి, కావ్యాదర్శం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1981, 1-5

94. బాణుడు, హర్షచరితమ్, చౌఖాంబా విద్యాభవన్, వారణాసి, 1964 పే. 21.

95. శంకరాచార్య శివానందలహరీ, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1971.

96. చూ. 20.

97, R. C. Mazumdar, H. C. Rayachaudhuri, Kalikinker Datta, An Advanced History of India, London, 1958. P. 33.

98. కాళిదాసు, రఘువంశమ్, ఆంధ్రబుక్ హౌస్, హైదరాబాదు, 1971, 1-10

99. కాళిదాసు, అభిజ్ఞాన శాకుంతలమ్, వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1957, ప్రస్తా - 2.

100. విశాఖదత్తుడు, ముద్రారాక్షసమ్, నిర్ణయసాగర్ ప్రెస్, బొంబాయి,1900.

101. చూ. 61

102. అప్పకవి. అప్పకవీయము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1970. 1-26

103. నన్నయ, ఆంధ్ర మహాభారతము, శారదాంబా విలాస్ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1915. 1-1-1

104. భారవి, కిరాతార్జునీయమ్, వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1967.

105. మాఘుడు, శిశుపాలవధ, వి. రామస్వామి శాస్త్రిలు అండ్ సన్స్, మద్రాసు, 1967.
106. భోజరాజు, చంపూరామాయణమ్, వి. రామస్వామి శాస్త్రిలు అండ్ సన్స్, మద్రాసు, 1956.
107. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-16
108. పై 1-1-20
109. వేదాల తిరువేంగళాచార్యులు, కుమార సంభవ తత్వము, హైదరాబాదు, 1965. పే. 65-85
110. నన్నయ, ఆంధ్ర మహాభారతము 1-1-9
111. పై 1-1-21
112. పై 1-1-22
113. పై 1-1-24
114. చూ. 51
115. మురారి, అనర్ఘ రాఘవమ్, పాండురంగ జావజీ, బొంబాయి, 1937.
116. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-31
117. పై 1-1-65
118. చూ. 115.
119. భవభూతి, మహావీర చరితమ్, నిర్ణయ సాగర ప్రెస్, బొంబాయి, 1900.
120. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-31.
121. పై 1-1-76.
122. చూ. 115.
123. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-15.
124. పై 1-1-33.
125. పై 1-1-71.
126. చూ. 51.
127. కందుకూరి రుద్రకవి, సుగ్రీవ విజయము, మాధవీ బుక్ సెంటర్, హైదరాబాదు, 1973. ప - 1.
128. శ్రీనాథుడు, హరవిలాసము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1968, పీఠిక - 30.

129. శ్రీనాథుడు, శృంగార నైషధము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1956. 1-13.
130. సముఖం వేంకట కృష్ణప్ప నాయకుడు, అహల్యా సంక్రందనము, యం. శేషాచలం అండ్ కో, అవతారిక 14, 15.
131. ఎఱ్ఱన, నృసింహ పురాణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967, 1-17 నుండి 21.
132. మట్ల అనంతరాజు, కకుత్స్థ విజయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1980. 1-17 నుండి 30.
133. సముఖం వేంకట కృష్ణప్పనాయకుడు, అహల్యా సంక్రందనము, యం. శేషాచలం అండ్ కో. 1971. అవ. 16.
134. పాలవేకరి కదరీ పతి, శుక సప్తతి, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1935, ప్ర. 15-77.
135. శ్రీకృష్ణదేవరాయలు, ఆముక్తమాల్యద, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్, మద్రాసు, 1914.
136. వినుకొండ వల్లభ రాయడు, క్రీడాభిరామము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1960. 2 నుండి 36.
137. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-14
138. నన్నెచోడుడు, కుమార సంభవము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1953, 1-52 నుండి 55.
139. అయ్యలరాజు రామభద్రుడు, రామాభ్యుదయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967, పీఠిక - 15 - 114.
140. పింగళి సూరన, రాఘవ పాండవీయము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1968.
141. నన్నయ, ఆంధ్ర మహాభారతము, 1-1-23.
142. మడికి సింగన, జ్ఞానవాసిష్ఠ రామాయణము, వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1935, ప్ర-6.
143. నన్నెచోడుడు, కుమార సంభవము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1953, 1-35.

144. ప్రౌఢకవి మల్లన, రుక్మాంగద చరిత్ర, జి. నాగయ్య తెలుగు కావ్యావతారికలలో ఉదహరించినది.

145. రఘునాథ నాయకుడు, వాల్మీకి చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1968, 1-15.

146. మొల్ల, రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1967, పీఠిక - 17.

147. తిక్కన నిర్వచనోత్తర రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1966, 1-5.

148. శ్రీనాథుడు, భీమేశ్వర పురాణము, కల్యాణి గ్రంథమండలి, విజయవాడ, 1958, 1-11.

149. కనుపర్తి అబ్బయామాత్యుడు, కవిరాజ మనోరంజనము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1-18.

150. మొల్ల, రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967, పీఠిక - 15.

151. పిల్లలమఱ్ఱి పినవీరన, జైమిని భారతము, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1984, 1-25.

152. బైచరాజు వేంకటనాథుడు, పంచతంత్రము, వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1924. 1-18.

153 నన్నయ్య, ఆంధ్ర మహాభారతము 1-1-29

154. దుగ్గన, నాసికేతోపాఖ్యానము, కళాభారతి, గుంటూరు - 1-11

155. తిక్కన, నిర్వచనోత్తర రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1969

156. మొల్ల, రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967, పీఠిక - 21.

157. పోతన, శ్రీమదాంధ్ర మహాభాగవతము, వేమూరు వేంకట కృష్ణమ సెట్టి అండ్ సన్స్, మద్రాసు, 1911, 1-22.

158. శ్రీనాథుడు, శృంగార నైషధము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1956, 1-17.

159. పిల్లలమర్రి పిన వీరన, జైమిని భారతము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1984, 1-9.

160. నంది మల్లయ, ఘంట సింగన, వరాహ పురాణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1978, 1-9

161. నందిమల్లయ, ఘంట సింగన, ప్రబోధ చంద్రోదయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1976.

162. దోనూరి కోనేరునాథకవి, బాల భాగవతము, మద్రాసు ప్రభుత్వ ప్రచురణము, మద్రాసు, 1914.

163. పిల్లలమర్రి పిన వీరన, శృంగార శాకుంతలము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1970. 1-27.

164. తెనాలి రామ కృష్ణుడు, పాండురంగ మాహాత్మ్యము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

165. తిక్కన, ఆంధ్ర మహాభారతము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్, మద్రాసు.

166. కొరవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1982. 1-35.

167. చూ. 158.

168. పాల్కురికి సోమన, బసవ పురాణం, వావిళ్ళరామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1966. 165 నుండి 169.

169,170 పాల్కురికి సోమన, పండితారాధ్య చరిత్ర, ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు, 1926.

171. తిక్కన, నిర్వచనోత్తర రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1968. 1-15.

172. తిక్కన, ఆంధ్ర మహాభారతము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, - విరాట. 1-30.

173. నన్నెచోడుడు, కుమార సంభవము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1953, 1-68.

174. నన్నయ, ఆంధ్ర మహాభారతము 1-1-25
175. పై 1-1-72
176. పోతన, శ్రీమదాంధ్ర మహాభాగవతము, వేమూరు వేంకట కృష్ణమ సెట్టి అండ్ సన్స్, మద్రాసు, 1911. 1-36.

పీఠిక : ఉత్పత్తి, వికాసాలు ఉత్తర రంగం

1. A. R. Desai - Social Background of Indian Nationalism 3rd edition - Popular Book Depot - Bombay, 1959 - PP. 30.
2. K. A. Antonova, G. Bongard-Levin, G. Kotovsky- A history of India Vol. II; Progress Publishers, Moscow - 1979 P. 55.
3. Ibid., PP. 62-63.
4. విజ్ఞాన సర్వస్వము - 4వ సంపుటము, తెలుగు సంస్కృతి-2; తెలుగు భాషా సమితి, మద్రాసు. పే 979-80.
5. Dr. J. Mangamma, Book Printing in India, Bangorey Books, Nellore, 1975. P. 145.
6. విజ్ఞాన సర్వస్వము, నాలుగవ సంపుటము, తెలుగు సంస్కృతి-2; తెలుగు భాషా సమితి, మద్రాసు. పే. 980.
7. Dr. J. Mangamma, Book Printing in India, Bangorey Books, Nellore, 1975. PP. 211, 212.
8. విజ్ఞాన సర్వస్వము, నాలుగవ సంపుటము. తెలుగు సంస్కృతి-2; తెలుగు భాషా సమితి, మద్రాసు. పే 981-82.
9. Dr. J. Mangamma, Book Printing India, Bangorey Books, Nellore, 1975. P. 283.
10. R. C. Majumdar, H. C. Raya Chaudhuri, Kalikinkar Datta, An Advanced History of India, Macmillan & Co. Ltd., London, 1958. P. 817.

11. Ibid. P. 818.

12. R. C. Majumdar, H. C. Raya Chaudhuri, Kalikinkar Datta, An Advanced History of India, Macmillan & Co. Ltd., London, 1958. P. 819.

13 L. S. S. O' Malley - Modern India and the West, Oxford University Press P. 739.

పరిష్కృత ప్రాచీన కావ్య ముద్రణలు :

1&2 మామిడి వెంకయ్య, ఆంధ్ర దీపిక, శ్రీవాసవి గ్రంథ ప్రచురణ సమితి, మచిలీపట్టణం, 1965.

3. "No poem or classical composition in Telugu has hither to been printed, and I believe no translation of a classic in to English has been attempted" C. P. Brown, Preface to Vemana, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ 1977. పు. 2.

4. పై పు. 1

5. పై పు. 1,2

6. పై పు. 3

7. పై పు. 3

8. పై పు. 4,5

9. నెల్లూరి రాఘవ కవి, ద్విపద నంచక్రవర్తి కథ, మద్రాసు, 1841.

10. పురాణం కృష్ణ శాస్త్రిలు, ఆత్మబోధ ప్రకాశిక, చెన్నపురి, 1840.

11. గౌరన, హరిశ్చంద్ర ద్విపదకావ్యము, ఆర్. డబ్ల్యు. థార్న్, డి వేపెరి ప్రెస్, మద్రాసు, 1842.

12. పోతన, శ్రీమదాంధ్ర మహా భాగవతము, పురాణం హయగ్రీవ శాస్త్రిలు, చెన్నపురి, 1848.

13. తిక్కన, ఆంధ్ర మహాభారతము, ఉద్యోగ పర్వము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైద్రాబాదు.

14. శ్రీనాథుడు, శృంగార నైషధము, ప్రకాశిక, ఎం. ఎస్. రావు, ఎమెస్కో, సికింద్రాబాదు, 1970.

15. ధూర్జటి, కాళహస్తి మాహాత్మ్యము, ప్రకాశిక, ఎం.ఎస్. రావు, ఎమెస్కో, సికిందరాబాదు, 1970.

16. శ్రీనాథుడు, క్రీడాభిరామము, ఎమెస్కో, సికిందరాబాదు, 1972, పేజీలు 11, 12.

17. "కుమారసంభవమును కూలంకషముగ చూచుకొలది అర్వాచీన గ్రంథ మనుటకు మాత్రమే గాక, నవీన గ్రంథ మనుటకును సాధన సంపత్తి లభించినది" అన్నాడు కొర్లపాటి శ్రీరామమూర్తి, దీనిమీద రచించిన గ్రంథానికి మున్నుడిలో.
కొర్లపాటి శ్రీరామమూర్తి, నన్నెచోడుని కుమార సంభవము ప్రాచీన గ్రంథమా? రమణశ్రీ ప్రచురణ, విశాఖపట్టణము. 1983.

18. గౌరన, హరిశ్చంద్ర ద్విపద కావ్యము, ఆర్. డబ్ల్యు. థార్స్, ది వేపేరి ప్రెస్, మద్రాసు, 1842.

19. రఘునాథుడు, శ్రీ రఘునాథ రామాయణము, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ, 1937.

20. అనంతామాత్యుడు, భోజరాజీయము, ఎన్. గున్నేశ్వరరావు బ్రదర్స్, రాజమహేంద్రవరము 1911.

21. కేతన, దశకుమార చరిత్రము, కందుకూరి వీరేశలింగం, చింతామణి ప్రెస్, మద్రాసు, 1901.

22. ఏనుగు లక్ష్మణ కవి, జాహ్నవీ మాహాత్మ్యము, అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వము, పిఠాపురం, 1918.

23. దీపాల పిచ్చయ్య శాస్త్రి, భాగవత పాఠ పరిశోధనము, నెల్లూరు, 1968.

24&25 పోతన, శ్రీమదాంధ్ర భాగవతము, వేమూరు వేంకట కృష్ణమ సెట్టి అండ్ సన్సు, చెన్నపురి, 1911.

26. పోతన, శ్రీమహా భాగవతము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1977

27. చూ. 24.

28&29. దీపాల పిచ్చయ్య శాస్త్రి, భాగవత పాఠ పరిశోధనము, నెల్లూరు, 1968
30. బాల వ్యాకరణం, కన్యాశుల్కాంల కర్తృత్వ వివాదాలు ప్రసిద్ధమే.
31. మానపల్లి రామకృష్ణ కవి రచనలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1972.
32. బండారు తమ్మయ్య, చిలుకూరి పాపయ్య శాస్త్రి, గడియారం వేంకట శేషశాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, కుందూరి ఈశ్వరదత్తు మొదలైన వారి గ్రంథాలు, వేమూరి విశ్వనాథశర్మ, కిళాంబి రాఘవాచార్యులు, టేకుమళ్ళ అచ్యుతరావు మొదలైన వారి వ్యాసాలు ఎన్నో వచ్చాయి.
33. శ్రీనాథుడు, క్రీడాభి రామము, వేటూరి ప్రభాకర శాస్త్రి, శృంగార గ్రంథమాలిక, 1929. పేజీలు 9-85
34. పై పేజీ. 80
35. వినుకొండ వల్లభరాయడు, క్రీడాభిరామము, పీ. బండారు తమ్మయ్య వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1960. పే 10-24.
36. శ్రీనాథుని శృంగార శేఖరత్వము, వల్లభరాయని వంశ వృక్షము, పాఠ భేదాలు మొదలగునవి. "విష ముష్టి విత్తులు, నాభి, నల్లమందు, ఉల్లి పాషాణము ఎట్టి చెట్టవస్తువులో యీ క్రీడాభిరామము కూడ నట్టి చెట్ట పుస్తకమే యనదగును" అంటూనే పీఠికలో శ్రీనాథుని శీలము మంచిది కాదనడానికి అతని శృంగార ప్రధానమైన చాటువులనెన్నిటినో ప్రభాకర శాస్త్రి ఉదహరించాడు. ఇంకా వివాదం ఉన్నవి, ఇతరులవీ అయిన బూతు పద్యాలను ఉదహరించాడు. ఈ దృష్ట్యా చూస్తే అసలు పుస్తకం కంటే పీఠికే బూతుగా వుందనవచ్చు ఈ విషయాన్ని కూడా, పుస్తకం ధరతో సహా బండారు తమ్మయ్య తన పీఠికలో విమర్శించాడు.
37. వల్లభరాయడు, క్రీడాభిరామము, వి.బి.ఎస్ శాస్త్రి, నవోదయ సమితి, హైద్రాబాదు, 1968.
38. శ్రీనాథుడు శృంగారియా? చి.పా.శాస్త్రి, ఆముఖం.
39. చెంచయ్య, రాజభుజంగరావు, ఎ హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్, ది హెరిటేజ్ ఆఫ్ ఇండియా సీరీస్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, ఆక్స్‌ఫర్డ్, 1921.

40. గోన బుద్ధారెడ్డి, రంగనాథరామాయణము, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, 1942.
41. రంగనాథ రామాయణము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ చెన్నపురి, 1960.
పై రాయల అండ్ కో చెన్నపురి.
42. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, భారతి, మద్రాసు, మే 1941.
43. గోన కాచభూపతి, విఠ్ఠల భూపతి, ఉత్తరరామాయణము, పీఠిక చెలికాని లచ్చారావు, అముద్రితాంధ్ర గ్రంథసర్వస్వము, చిత్రాడ.
44. భాస్కరాదులు, భాస్కర రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1969
45. రంగనాథుడు, రంగనాథ రామాయణము, సి. వి. కృష్ణా బుక్ డిపో, మద్రాసు, 1927.
46. తిక్కన, నిర్వచనోత్తర రామాయణము, వేమూరు వేంకట కృష్ణమ సెట్టి అండ్ సన్స్, మద్రాసు, 1898.
47. తిక్కన, నిర్వచనోత్తర రామాయణము, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1969.
48. చూ. 44
49. చూ. 45
50. శ్రీకృష్ణదేవరాయలు, ఆముక్త మాల్యద, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1869.
51. శ్రీకృష్ణదేవరాయలు, ఆముక్త మాల్యద, సంజీవనీ వ్యాఖ్య సహితం, వేదం వేంకటరాయశాస్త్రి, చెన్నపురి.
52. కంకంటి పాపరాజు, ఉత్తర రామాయణము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1966.
53. కంకంటి పాపరాజు, విష్ణు మాయా విలాసము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.
54. చూ. 52.
55. కొర్లపాటి శ్రీరామమూర్తి, నన్నెచోడుని కుమార సంభవము ప్రాచీన గ్రంథమా? రమణశ్రీ ప్రచురణ, విశాఖపట్టణం, 1983.

56. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షర శాల, చెన్నపురి, 1938.
57. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, విశాలాంధ్ర ప్రచురణాలయము, విజయవాడ.
58. శిష్ట్లా రామకృష్ణశాస్త్రి, ఆంధ్రసాహిత్య పరిషత్తు పత్రిక, కాకినాడ 1965.
59. గౌరన, హరిశ్చంద్ర ద్విపద కావ్యము, ఆర్. డబ్ల్యు. థార్స్, ది వేపేరి ప్రెస్, మద్రాసు, 1842.
60. నన్నెచోడుడు, కుమార సంభవము, విస్మృత కవులు, మద్రాసు, 1909.
61. 'నన్నెచోడుని' కాలాన్ని గురించిన వ్యాసాలు, గ్రంథాలు ఎన్నో. ఆనాడు తెలుగు సాహిత్యంలో ఇంత చర్చ ఏవిషయం మీదా జరగలేదు.
62. నన్నెచోడుడు, కుమార సంభవము, వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1953.
63. పాల్కురికి సోమన, బసవపురాణం, ఆంధ్రగ్రంథమాల, మద్రాసు, 1926
64. పై ద్వితీయముద్రణ
65. పై వావిళ్ళ, రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ చెన్నపురి, 1966 పేజీ. 68
66. చాగంటి శేషయ్య, ఆంధ్ర కవి తరంగిణి. సం. 3. హిందూ ధర్మశాస్త్ర గ్రంథ నిలయము, కపిలేశ్వర పురము, 1948. పేజీలు 136-154.
67. ఎఱ్ఱన, నృసింహ పురాణం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైద్రాబాదు, 1967.
68. కందుకూరి వీరేశలింగం, ఆంధ్ర కవుల చరిత్ర, హితకారిణీసమాజము, రాజమండ్రి.
69. చాగంటి శేషయ్య, ఆంధ్ర కవి తరంగిణి. సం. 4, హిందూధర్మశాస్త్ర గ్రంథ నిలయము, కపిలేశ్వరపురము, 1948.
70. ఎఱ్ఱన, హరివంశము, వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1967.
71. ఎఱ్ఱన, హరివంశము, పూర్వభాగము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి హైదరాబాదు, 1968.
72. విజ్ఞానసర్వస్వములో నోరి నరసింహశాస్త్రి రచన.

73. చూ. 67

74. ఎఱ్ఱన, ఆంధ్రమహాభారతము (ఆరణ్యపర్వము) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971.

75. మొల్ల, రామాయణము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

76. పింగళి సూరన, కళాపూర్ణోదయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

77. తెనాలి రామకృష్ణుడు, పాండురంగమాహాత్మ్యము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

78. కొరవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ, 1936.

79. కొరవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1982.

80. నాచన సోమన, ఉత్తర హరి వంశము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు, అండ్ సన్స్, చెన్నపురి, 1967.

81 వల్లభరాయడు, క్రీడాభిరామం, విస్మృత కవులు, చెన్నపురి, 1909.

82. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1938. పేజీ 69.

83. పై పేజీ 48.

84 85. శ్రీనాథుడు శృంగార నైషధము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1967.

86, 87. శ్రీనాథుడు, హరవిలాసము, ఖండవల్లి లక్ష్మీరంజనం ఉదహరించినది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1968.

88. శ్రీనాథుడు, శృంగార నైషధము, వావిళ్ళ రామస్వామి శాస్త్రిలు అండ్ సన్స్, చెన్నపురి, 1956.

89, 90. శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యము, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, కాకినాడ, 1930.

91. చూ. 71

92. చూ. 74

93. చూ. 67

94. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షర శాల, చెన్నపురి, 1938. ద్వి.భూ. పుట 5

95. పాల్కురికి సోమన, పండితారాధ్య చరిత్ర, ఉపో. చిలుకూరి నారాయ రావు, ఆంధ్ర గ్రంథమాల, చెన్నపురి, 1939.

96. పాల్కురికి సోమన, బసవపురాణము, పీ. బండారు తమ్మయ్య, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1966

97. పోతన, శ్రీమదాంధ్ర మహా భాగవతము, ఉపో. నాగపూడి కుప్పుస్వామయ్య, వేమూరి వెంకట కృష్ణమ సెట్టి అండ్ సన్స్, మదరాసు, 1911. మొదట ఈ గ్రంథాన్ని ప్రచురించిన పురాణం హయగ్రీవశాస్త్రి ఈ వాదాన్ని లేవ దీసిన వాడు.

98. వల్లభ రాయడు, క్రీడాభిరామము, పీఠిక మానవల్లి రామకృష్ణ కవి, విస్మృత కవులు, చెన్నపురి, 1909.

99. శ్రీనాథుడు, పల్నాటి వీర చరిత్ర, శ్రీరామ ముద్రాక్షర శాల చెన్నపురి, 1938, ప్ర.భూ. 43-46 పుటలు.

100. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, విశాలాంధ్ర, విజయవాడ, 1961.

101. నాయని సుబ్బారావు, జన్మభూమి, హైదరాబాదు, 1973.

102, 103 ఎఱ్ఱన, ఆంధ్ర మహాభారతము (ఆరణ్య పర్వము) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1971. పేజీ 16.

104. శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1938.

105. గోన బుద్ధారెడ్డి, రంగనాథ రామాయణము, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, 1942.

106. పోతన, శ్రీమదాంధ్ర భాగవతము, ఆనందాశ్రమ గ్రంథమాల, మద్రాసు, 1911.

107. చూ. 88.

108. శ్రీనాథుడు, పల్నాటి వీర చరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1938. ద్వి. భా, పేజీ 36.
109. శ్రీనాథుడు, భీమేశ్వర పురాణము, పీఠిక బండారు తమ్మయ్య, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1967. పేజీ10.
110. పై పేజీ 14, 15.
111. పై పేజీ 18.
112. చూ. 71.
113. శ్రీనాథుడు, పల్నాటి వీర చరిత్ర, శ్రీరామ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1938 ప్ర. భా. పేజీ 75.
114. పై ద్వి. భా. పేజీ 36.

కవితోద్యమాలు :

1. గురజాడ అప్పారావు, ముత్యాల సరాలు, ఎమెస్కో, మద్రాసు, 1972 పుట : 22
2. పై పుట - 23
3. పై పుట - 26
4. రాయప్రోలు సుబ్బారావు, తృణకంకణము, 1913, పుట - 3,4
5. శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు, భావ సంకీర్తనము, ఆంధ్ర ప్రచారిణి లిమిటెడ్, రాజమహేంద్రవరము, 1943, పుట - 5
6. పై పుట - 6
7. దువ్వూరి రామిరెడ్డి, కృషీవలుడు, కవికోకిల గ్రంథావళి, నెల్లూరు, 1935
8. పింగళి, కాటూరి, తొలకరి, త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం, 1923, పుట 5,6

9,10. నండూరి సుబ్బారావు, ఎంకిపాటలు, ఉదయ భాస్కర పబ్లిషర్స్, విజయవాడ.

11,12. శ్రీశ్రీ, ప్రభవ, కవితా సమితి గ్రంథావళి, విశాఖపట్టణం, 1928

13,14. శ్రీరంగం నారాయణ బాబు, రుధిరజ్యోతి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1976.

15. సం॥ అనిసెట్టి సుబ్బారావు, అవసరాల సూర్యారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణ, కల్పన, చేతన సాహితి, విజయవాడ, 1953.

16,17. శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1973.
18. ఆరుద్ర, త్వమేవాऽహం, కళాకేళి ప్రచురణలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1971.
19. సం॥ మురళీధర్, తృణకోణాలు, వరంగల్, 1968.
20. నగ్నముని, తూర్పుగాలి, విముక్తి ప్రచురణ, హైదరాబాదు, 1972.
21. కె. వి. రమణారెడ్డి, భువనఘోష, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.
22. సం॥ కె.వి. రమణారెడ్డి, అడుగుజాడ గురజాడది, సాధన సమితి, కావలి, 1962.
23. చూ. 21.
24. పఠాభి, పిడేలు రాగాల డజన్, వర్ధమాన సమాజము, నెల్లూరు, 1973.
25. ఎన్. గోపి, తంగెడుపూలు, చైతన్య ప్రచురణలు, హైదరాబాదు, 1976.
26. యం. కృష్ణారెడ్డి, దివ్యదీపం, హైదరాబాదు, 1981.
27. విరజాజి రామిరెడ్డి, దర్పణం, అలంపురం, 1980.
28. కుందుర్తి ఆంజనేయులు, కుందుర్తి కృతులు, కుందుర్తి సన్మాన సంఘం, గుంటూరు, హైద్రాబాదు, 1975.
29. చూ. 27.
30. దేవరకొండ బాలగంగాధర తిలక్, అమృతం కురిసిన రాత్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1972.
31. చూ. 28.
32. చూ. 25.
33. రవీంద్ర, కసిగా కదిలి వస్తే, ప్రజాసాహితి, నిజామాబాదు, 1980.
34, 35. హిమజ్వాల, చూపు, సాహితీ సమితి, అచ్చంపేట, 1977.
36. నిఖిలేశ్వర్, ఈనాటికీ...నవతా పబ్లికేషన్స్, హైదరాబాదు, 1984.
37. సం. కె. వి. రమణారెడ్డి, మరో ఝంఝ, వి.ర.సం, 1980.
38, 39. జయధీర్ తిరుమలరావు, అరణ్య నేత్రం, నవయుగ బుక్‌హౌస్, హైదరాబాదు.
40, 41 చెరబండరాజు, జన్మహక్కు, హైదరాబాదు, 1978.

42. సం. చేకూరి రామారావు, 1971-81 ఈతరం యుద్ధ కవిత, ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్, హైదరాబాదు, 1982.
43, 44. సం. టి. సుభాష్, లే, విప్లవ సాహితి, తిరుపతి, 1972.
45. చూ. 40.
46. చూ. 37.
47. చూ. 40.
48. కె. రాంమోహన్ రాజు, రోడ్డుమీద సూర్యుడు, హన్మకొండ, 1981.
49. కె. హనుమంతరెడ్డి, గుండెదండోరా, హైదరాబాదు, 1979.
50. శివసాగర్, ఉద్యమం నెలబాలుడు, సృజన ప్రచురణలు, హన్మకొండ, 1983.
51. చూ. 38.
52. కట్టమంచి రామలింగారెడ్డి, ముసలమ్మ మరణము, కళారత్నాకర ముద్రాక్షరశాల, చెన్నపురి, 1900.
53. సం॥ అవసరాల సూర్యారావు, గురజాడ లేఖలు.
54. పై పుట : 207
55. పఠాభి, ఫిడేలు రాగాల డజన్, వర్ధమాన సమాజము, నెల్లూరు, 1973
56. రాయప్రోలు సుబ్బారావు, తృణకంకణము, సికిందరాబాదు, 1913, పుట : 4
57. రాయప్రోలు సుబ్బారావు, స్నేహలత, 1914
58. రాయప్రోలు సుబ్బారావు, తృణకంకణము, 1913.
59,60. దువ్వూరి రామిరెడ్డి, కవికోకిల గ్రంథావళి-1, నెల్లూరు. 1935.
61. శ్రీశ్రీ, ప్రభవ, కవితా సమితి గ్రంథావళి, విశాఖపట్టణం, 1928.
62. రాయప్రోలు సుబ్బారావు, తృణ కంకణము, 1913, పుటలు : 3,4
63. పై పుట : 4
64,65. శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు, భావ సంకీర్తనము, ఆంధ్రప్రచారిణీ లిమిటెడ్, రాజమహేంద్రవరము, 1943, పుట : 7.
66. బసవరాజు అప్పారావు, బసవరాజు అప్పారావు గీతాలు, ఉదయ భాస్కర పబ్లిషర్స్, విజయవాడ. పుట : 3.
67. పై పుట : 7

68. శ్రీవేంకట పార్వతీశ్వర కవులు, కావ్యకుసుమావళి, ఆంధ్రప్రచారిణీ లిమిటెడ్, రాజమహేంద్రవరము, 1943.
69. పింగళి, కాటూరి, తొలకరి, త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నము, 1923. పుటలు : 1, 2.
70. పై పుట 7.
71. కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, నయాగరా, ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1975.
72. సం. పూఖా, మణి మకుటము, శోభా ప్రచురణలు, 1961.
73. దాశరథి, అగ్నిధార, దాశరథి కవిత, మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1977.
74. చూ. 15.
75. ఆవంత్స సోమసుందర్, వజ్రాయుధం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1979.
76. రెంటాల గోపాలకృష్ణ, సంఘర్షణ, సాహితీ స్రవంతి, విజయవాడ, 1950.
77, 78. చూ. 15.
79. శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1973.
80. శ్రీరంగం నారాయణ బాబు, రుధిర జ్యోతి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1976. పుట 26.
81. సం. కె.వి. రమణారెడ్డి, అడుగుజాడ గురజాడది, సాధన సమితి, కావలి, 1962.
82,83. చూ. 76
84. ఆవంత్స సోమసుందర్, వజ్రాయుధం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1979.
85. చూ. 76.
86. సం॥ పూఖా, మణిమకుటము, శోభా ప్రచురణలు, 1961
87,88. చూ. 15.
89. చూ. 28.

90. సి. విజయలక్ష్మి, విషాదభారతం, అభ్యుదయ సాహితీ ప్రచురణ, విజయవాడ, 1966.

91. చూ. 15.

92. శ్రీరంగం నారాయణబాబు, రుధిరజ్యోతి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1976, పుట - 31.

93. యం కృష్ణారెడ్డి, దివ్యదీపం, హైదరాబాదు, 1981.

94-98. చూ. 81,

99-101 చూ. 28.

102. నారపరెడ్డి, అశ్రుమాల, కవికోకిల పబ్లికేషన్స్, నెల్లూరు, 1950

103,104. నారపరెడ్డి, మధువనము, దేశి కవితా మండలి, విజయవాడ, 1960.

105 మల్లవరపు విశ్వేశ్వరరావు, ఉగాదులు - ఉత్సవాలు, రాజమండ్రి, 1978

106. దాశరథి, కవితా పుష్పకం, యం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1966.

107. చూ. 30.

108-113. శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1973.

114. గజ్జల మల్లారెడ్డి, శంఖారావం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ 1968.

115. చూ. 25.

116-118 చూ. 30.

119. రవీంద్ర, కసిగా కదలివస్తే, ప్రజా సాహితి, నిజామాబాదు, 1980

120. విరజాజి రామిరెడ్డి, దర్పణం, అలంపురం, 1980.

121. రాజు, చారి, రావు, రెడ్డి, లేడి చంపిన పులి నెత్తురు, బుక్‌లాన్స్, హైద్రాబాదు, 1973.

122-124 చూ. 90.

125. హిమజ్వాల, చూపు, సాహితీ సమితి, అచ్చంపేట, 1977.

126-135 దిగంబర కవులు, దిగంబర కవులు, యం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1971.

136. సం॥ కె. వి రమణారెడ్డి, తెలంగాణా పోరాట పాటలు, వి. ర. సం., 1977.

137. కె. వి. రమణారెడ్డి, అభ్యుదయ రచయితల సంఘానికి కాయ కల్ప చికిత్స? మరి రెండు వ్యాసాలు, 1972.

138. కె వి. రమణారెడ్డి, జైలు కోకిల, ఝంఝ ప్రచురణలు, కావలి, 1977.

139,140. సం॥ కె. వి. రమణారెడ్డి, ఝంఝ, కె. వి. రమణారెడ్డి, 1970.

141,142. సం॥ టి. సుభాష్, లే, విప్లవ సాహితి, తిరుపతి, 1972.

143. ప్రసాదరావు, వంగపండు, పొలికేక, వి. ర. సం., విశాఖపట్టణం, 1977.

144. చూ. 141.

145. సం॥ కె. వి. రమణారెడ్డి, మరో ఝంఝ, వి. ర. సం. 1980.

146. జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య, ఎరుపెక్కిన వెన్నెల, జనసాహితి, హైదరాబాదు, 1985.

147. చెరబండ రాజు, గమ్యం, హైదరాబాదు, 1973.

148,149. జ్వాలాముఖి, ఓటమి తిరుగుబాటు, నవయుగ పబ్లిషర్స్, హైదరాబాదు, 1972.

150,151. చూ. 139.

152. చెరబండరాజు, దిక్ సూచి, హైదరాబాదు, 1970.

153. భైరవయ్య, రా, స్పందన డిస్ట్రిబ్యూటర్స్, హైదరాబాదు, 1970.

154. చూ. 148.

155. నిఖిలేశ్వర్, మండుతున్న తరం, హైదరాబాదు, 1972.

156. చూ. 141

157. చెరబండ రాజు, కాంతియుద్ధం, హైదరాబాదు, 1973.

158. చూ. 141.

159, 160. చూ. 139.

161. చూ. 38

162. చూ. 141.

163. చెరబండ రాజు, జన్మహక్కు. హైద్రాబాద్, 1978.

164. కె. రాంమోహన్‌రాజు, రోడ్డు మీద సూర్యుడు, హన్మకొండ, 1981.

165. చూ. 141.

166-168. శివసాగర్, ఉద్యమం నెలబాలుడు, సృజన ప్రచురణలు, హన్మకొండ, 1983.

169-171. కె.వి. రమణారెడ్డి, సూరీడు మావోడు, ఝుంఝు ప్రచురణలు, కావలి, 1986.

172, 173. అమ్మంగి వేణుగోపాల్, మిణుగురు, మానససరోవరం, భాగ్యనగరం 1980.

174. చూ. 155.

175. చూ. 145.

ఉద్యమేతర కవిత్వం :

1. కొక్కొండ వేంకటరత్న శర్మ, బిల్వేశ్వరీయము, పనప్పాకం అనంతాచార్యులు, (ప్రిఫేస్ ఇన్ ఇంగ్లీష్) చెన్నపురి, 1893.
2. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కనకగిరి, శ్రీ యాజ్ఞవల్క్య ముద్రాక్షరశాల, చెన్నపురి, 1898.
3. వావిలికొలను సుబ్బారావు, కౌసల్యాపరిణయము, శ్రీ రాజా వెల్లంకి వేంకట రామారావు బహద్దూర్, మద్రాసు, 1902.
4. తిరుపతి వేంకటేశ్వరులు, లక్షణాపరిణయము, శ్రీ భైరవ ముద్రాక్షరశాల, మచిలీబందరు, 1907.
5. కోలాచలం శ్రీనివాసరావు, ఆంధ్రీకృతాగస్త్య బాలభారతము, వాణీవిలాస ముద్రాక్షరశాల, బళ్ళారి, 1908.
6. వావిలికొలను సుబ్బారావు, శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము, చెన్నపురి, ప్ర. ము. 1909, ద్వి. ము. 1914.
7. దాసు శ్రీరాములు, శ్రీమదాంధ్ర దేవీ భాగవతము, దాసు కేశవరావు, బెజవాడ, 1907.
8. నండూరి సుబ్బారావు, ఎంకి పాటలు, ఉదయభాస్కర పబ్లిషర్స్, విజయవాడ, —

9-14. సం॥ బి. భాస్కర చౌదరి, కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు, చిత్తూరు జిల్లా సహకార ప్రచురణ సంఘం, చిత్తూరు. 1983.

15-28. సం॥ ఘ. అశ్వత్థ నారాయణ, ఆర్వీయస్. సుందరం, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ పీఠికలు, రాళ్ళపల్లి అభినందన సమితి, 1978.

29,30. నాయని సుబ్బారావు, మాతృగీతాలు, 1939.

31. బీర్నీడి మోషేకవి, హరిజనాభ్యుదయము, బీర్నీడి ప్రసన్న, వినుకొండ, 1969.

32. సి. నారాయణరెడ్డి, కర్పూర వసంత రాయలు, ఎమెస్కో, మద్రాసు, 1972.

33. నీలా జంగయ్య, రమ్య పథము, దేవరకొండ, 1968.

34. షేక్ బుడన్ సాహెబ్, జలాల్ నామా, అబ్దుల్ సలాం, కడప, 1969.

35. వేదవతీ దేవి, శృంగార లహరి, యం. శేషాచలం అండ్ కం. మచిలీపట్నం, 1973.

36,37. బీర్నీడి మోషే కవి, హరిజనాభ్యుదయము, బీర్నీడి ప్రసన్న, వినుకొండ 1969

38. గుర్రం జాషువా, గబ్బిలం, హేమలతాలవణం, విజయవాడ, 1976.

39. గుర్రం జాషువా, స్వయం వరం, డి. వెంకటేశ్వర అండ్ కో, తెనాలి, 1950.

40,41. వింజమూరి వేంకట లక్ష్మీనరసింహారావు, నౌరోజ్, మద్రాసు, 1950.

42. తాపీ ధర్మారావు, పాతపాళీ, హైదరాబాదు, 1960.

43-45. బోయి భీమన్న, జన్మాంతర వైరమ్, హైదరాబాదు, 1980.

46-49. బోయి భీమన్న, పిల్లీ శతకం, హైదరాబాదు, 1967.

50. బోయి భీమన్న, జన్మాంతర వైరమ్, హైదరాబాదు, 1980.

51-53. బోయి భీమన్న, గుడిసెలు కాలిపోతున్నై, హైదరాబాదు, 1973.

54. బోయి భీమన్న, పిల్లీ శతకం, హైదరాబాదు, 1967.

55-57. సం. గోగినేని రంగనాయకులు, రైతు భజనావళి, నిడుబ్రోలు, 1934.

58. చోడవరపు సత్యవతీదేవి, తొలకరి జల్లులు, విజయవాడ, 1975.

59. ఆరుద్ర, కూనలమ్మ పదాలు, నవోదయ పబ్లికేషన్స్, విజయవాడ, 1976.

60. శ్రీశ్రీ, మరో మూడు యాభయిలు, ఎమెస్కో, మద్రాసు, 1974.

61-66. త్రిపురనేని రామస్వామి చౌదరి, సూత పురాణము, సూతాశ్రమము, తెనాలి, 1942.

67. అరిపిరాల విశ్వం, కాలం గీస్తున్న గీతలు, హైదరాబాదు, 1963.

68. ఆర్. ఎస్ సుదర్శనం, నిశాంతం, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1976.

69-73. గుంటూరు శేషేంద్ర శర్మ, నాదేశం నా ప్రజలు, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1975.

74. గుంటూరు శేషేంద్రశర్మ, గొరిల్లా, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1977.

75. ఆర్. ఎస్. సుదర్శనం, నిశాంతం, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం హైదరాబాదు, 1976.

76-78. గుంటూరు శేషేంద్రశర్మ, శేష జ్యోత్స్న, హైదరాబాదు, i872.

79. ఆర్. ఎస్. సుదర్శనం, నిశాంతం, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1976.

80-85. ఎల్లోరా, రేపటి వసంతం, శ్రీనివాస ప్రచురణలు, మద్రాసు, 1974.

86, 87. అర్. ఎస్. సుదర్శనం, నిశాంతం, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1976.

88,89. అరిపిరాల విశ్వం, రేపటి స్వర్గం, హైదరాబాదు, 1968.

90. ఎల్లోరా, రేపటి వసంతం, శ్రీనివాస ప్రచురణలు, మద్రాసు, 1974.

91. అర్ ఎస్. సుదర్శనం, నిశాంతం, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1976.

92. అరిపిరాల విశ్వం, కాలంగీస్తున్న గీతలు, హైదరాబాదు. 1963

93. చూ. 90

94-97. చూ. 91

98. గుంటూరు శేషేంద్రశర్మ, నాదేశం నా ప్రజలు, ది ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, హైదరాబాదు, 1975.

99. గుంటూరు శేషేంద్ర శర్మ, శేష జ్యోత్స్న, హైదరాబాదు, 1972.

100. చూ. 91

101. చూ. 91

102-107 నగ్నముని, కొయ్యగుర్రం, విముక్తి ప్రచురణ, హైదరాబాదు, 1980

108. చూ. 98.

109. శివలెంక ప్రకాశరావు, నా దేశం నా ప్రజలు - సమీక్ష, విశాలాంధ్ర, 7-3-76.

110,111 చూ. 98.

112. నగ్నముని, కొయ్యగుర్రం, విముక్తి ప్రచురణ, హైదరాబాదు, 1980.

113. చూ. 109

114. చూ. 98.

కవిత్వేతర ప్రక్రియలు :

1,2. వావిలాల వాసుదేవశాస్త్రి, శ్రీసీజరు చరిత్రము, సమూహివారు అండ్ కో, చెన్నపురి, 1876.

3,4. గురజాడ శ్రీరామమూర్తి, వెనీసువణిజ నాటకము, చెన్నపురి, 1880.

5. వావిలాల వాసుదేవ శాస్త్రి, నందక రాజ్యము, చెన్నపురి, 1880.

6-9. ధర్మవరం రామకృష్ణమాచార్యులు, విషాద సారంగధరము, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983.

10-16 గురజాడ అప్పారావు, కన్యాశుల్కము, విశాలాంధ్ర, విజయవాడ, 1986

17,18. జనమంచి శేషాద్రి శర్మ, విచిత్రపాదుకా పట్టాభిషేక నాటకము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1927.

19. త్రిపురనేని రామస్వామి చౌదరి, కురుక్షేత్ర సంగ్రామము, సరళా పబ్లికేషన్స్, తెనాలి, 1971.

20. త్రిపురనేని రామస్వామి చౌదరి, శంబుక వధ, సరళా పబ్లికేషన్స్, తెనాలి, 1971.

21, 22. త్రిపురనేని రామస్వామి చౌదరి, ఖూనీ, సరళా పబ్లికేషన్స్, తెనాలి 1971.

23-26. నార్ల వెంకటేశ్వరరావు, జాబాలి, నవోదయ పబ్లికేషన్స్, విజయవాడ, 1904.

27-29. నార్ల వెంకటేశ్వరరావు, నరకంలో హరిశ్చంద్రుడు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1982.

30. నార్ల వెంకటేశ్వరరావు, సీత జోస్యం, నవోదయ పబ్లికేషన్స్, విజయవాడ, 1979.

31-33. ముద్దుకృష్ణ, అశోకం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, విజయవాడ, 1934.

34. చలం, సావిత్రి, యువ బుక్ డిపో, మద్రాసు, 1927.

35. బుచ్చిబాబు, బుచ్చిబాబు నాటికలు (సంపుటి-1) విశ్వవాణి పబ్లిషర్స్, విజయవాడ, 1964.

36. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, తెలుగునాటక సాహిత్యం, ఆంధ్రసారస్వత పరిషత్, హైదరాబాదు. 1986 పేజీ 33-34.

37. సుంకర, వాసిరెడ్డి, మాభూమి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1947; 7వ ముద్రణ, 1984.

38. సుంకర సత్యనారాయణ, భూమికోసం, సుంకర పబ్లికేషన్స్, విజయవాడ 1980.

39. బోయి భీమన్న, పడిపోతున్న అడ్డుగోడలు, హరిజన సేవక్ సంఘము, విజయవాడ, 1958.

40. రాచకొండ విశ్వనాథశాస్త్రి, నిజం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1962.

41. అక్కిరాజు రమాపతిరావు, తెలుగు నవల, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1975. పేజీ 9

42. మొదలి నాగభూషణశర్మ, తెలుగు నవలా వికాసం, హైదరాబాదు, 1971 పేజీ 19, 20.

43. కందుకూరి వీరేశలింగం, రాజశేఖర చరిత్రము, రాజమహేంద్రవరము 1880.

44. చింతా దీక్షితులు, చిత్రలేఖ, రాజమహేంద్రవరము, 1914.

45. ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి, జయంతీ పబ్లికేషన్స్, విజయవాడ, 1986.

46. మహీధర రామమోహనరావు, కొల్లాయి గట్టితేనేమి?, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1978.

47. విశ్వనాథ సత్యనారాయణ, నందోరాజా భవిష్యతి, పురాణ వైర గ్రంథమాల.

48. అడివి బాపిరాజు, అడవి శాంతిశ్రీ, త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నం, 1958.

49. నోరి నరసింహశాస్త్రి - రుద్రమదేవి, సాహితి సమితి, రేపల్లె, 1951.

50. ,, - నారాయణభట్టు, సాహితి సమితి, రేపల్లె, 1949

51. ,, - రుద్రమదేవి, ,, 1951

52. ,, - మల్లారెడ్డి, కవితా పబ్లికేషన్స్, విజయవాడ, 1958.

53. ,, - రుద్రమదేవి, సాహితీ సమితి, రేపల్లె, 1951.

54. ,, - నారాయణభట్టు, సాహితీ సమితి, రేపల్లె, 1949

55-56 ,, - ధూర్జటి, త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్టణం, 1971.

57. అక్కిరాజు రమాపతిరావు, తెలుగు నవల, హైదరాబాదు, 1975, పే.20

58. చలం, శశిరేఖ, (1926) అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1984.

59. అక్కిరాజు రమాపతిరావు, తెలుగు నవల, హైదరాబాదు, 1975, పే.23

60. జి.వి. కృష్ణారావు, కీలుబొమ్మలు, సాహితీ కేంద్రం, తెనాలి, 1960.

61. బుచ్చిబాబు, చివరకు మిగిలేది, దేశీ బుక్‌డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ, 1979.

62. అక్కిరాజు రమాపతిరావు, తెలుగునవల, హైదరాబాదు, 1975. పే.24

63. గోపీచంద్, శిథిలాలయం, దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ, 1979.

64. గోపీచంద్, అసమర్థుని జీవితయాత్ర, ఎం. శేషాచలం అండ్ కో, మచిలీపట్నం, 1977.

65. వట్టికోట ఆళ్వారు స్వామి, ప్రజల మనిషి, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ, తృతీయ ముద్రణ, 1970.

66. వట్టికోట ఆళ్వారు స్వామి, గంగు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, ద్వితీయ ముద్రణ 1974.

67. బొల్లిముంత శివరామకృష్ణ, మృత్యుంజయులు, ప్రజాశక్తి ప్రచురణాలయం, విజయవాడ, 1947.

68. దాశరథి రంగాచార్య, చిల్లర దేవుళ్లు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1987.

69. దాశరథి రంగాచార్య, మోదుగుపూలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, తృతీయ ముద్రణ, 1985.

70. తెన్నేటి సూరి, ఛంఘిజ్‌ఖాన్, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ 1956.

71. రాచకొండ విశ్వనాథశాస్త్రి, అల్పజీవి, విజయా బుక్స్, విజయవాడ, చతుర్థ ముద్రణ, 1975.

72. చెరబండరాజు, మాపల్లె, హైదరాబాదు, 1978.

73. రంగనాయకమ్మ, బలిపీఠం, స్వీట్ హోం పబ్లికేషన్స్, హైదరాబాదు, 1980, 8వ ముద్రణ.

74. రంగనాయకమ్మ, కృష్ణవేణి, హైదరాబాదు, 1975.

75,76 రంగనాయకమ్మ, జానకి విముక్తి, స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 1982.

77. వాసిరెడ్డి సీతాదేవి, మట్టి మనిషి, పద్మజ పబ్లికేషన్స్, విజయవాడ, 2వ ముద్రణ, 1976.

78. మల్లాది రామకృష్ణ శాస్త్రి, కృష్ణా తీరం, యం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1973.

79. భాస్కరభట్ల కృష్ణారావు, వెల్లువలో పూచిక పుల్లలు, ఆధునిక గ్రంథ మండలి, హైదరాబాదు, 1960.

80. వడ్డెర చండీదాస్, హిమజ్వాల, నవజ్యోతి పబ్లికేషన్స్, విజయవాడ, 1974.

81. పోరంకి దక్షిణామూర్తి, రంగవల్లి, యం. శేషాచలం అండ్ కంపెనీ, మచిలీపట్నం, 1975.

82. నవీన్, అంపశయ్య, దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ, 3వ ముద్రణ, 1982.

83. యండమూరి వీరేంద్రనాథ్, తులసిదళం, నవభారత్ బుక్ హౌస్, విజయవాడ, 1981.

84. ,, తులసి, నవభారత్ బుక్‌హవుస్, విజయవాడ, 1981.

85. పోరంకి దక్షిణామూర్తి, కథానికావాఙ్మయము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1975.

86. ఎం. హీరాలాల్‌రాయ్, బ్రతుకుబాటలు, దేశోద్ధారక గ్రంథమాల, సికిందరాబాదు, 1958.

87. సం. ఆవుల జయప్రదాదేవి, కథా మందారము రెండవ సం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1979.

88. సం. కాటూరి వెంకటేశ్వరరావు, కథా తోరణం (సంకలనం) వేమూరి ఆంజనేయశర్మ, ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘము, విజయవాడ, 1949.

89. కేతు విశ్వనాథరెడ్డి, జప్తు, అభ్యుదయ రచయితల సంఘం, కడప, 1974.

90. పెద్దిభొట్ల సుబ్బరామయ్య, కళ్ళజోడు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1981.

91. ఆర్. వసుంధరాదేవి, నీడలు, ఆర్. ఎస్. సుదర్శనం, రాజమండ్రి 1982.

92. అరిపిరాల విశ్వం, కల చెరిగి పోదు నేస్తం, శ్రీ వేంకటేశ్వర గ్రంథ మండలి, విజయవాడ, 1964.

93. గోపీచంద్, ధర్మ ఆసుపత్రి, దేశికవితామండలి, విజయవాడ, 1950

94. కుట్ర, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, యుగ సాహితి, ప్రొద్దుటూరు, 1982.

95. డి. దుర్గాప్రసాద్, కొత్తకథలు, 21, ట్వంటీఫస్ట్ సెంచరీ రైటర్స్, విజయనగరం, 1975.

96. పి. యశోదారెడ్డి, మావూరి ముచ్చట్లు, సుధర్మా పబ్లికేషన్స్, హైదరాబాదు, 1973.

97. కందుకూరి వీరేశలింగం, విగ్రహతంత్ర విమర్శనము, కందుకూరి వీరేశలింగ గ్రంథావళి, హితకారిణి సమాజము, రాజమండ్రి, 1918.

98. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, వివేక చంద్రికా విమర్శనము, 1896.

99. వెల్లాల సదాశివశాస్త్రి, ఖండనాభాస నిరాసము, చెన్నపురి, 1917.

100. సం. వెల్లాల సదాశివశాస్త్రి,పండితాభిప్రాయమణిమాలిక,చెన్నపురి,1919.

101. కె. శివశాస్త్రి, రామచంద్ర చరితము, గుంటూరు, 1926.

102-104. వేదం వేంకటరాయశాస్త్రి, ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శము, చెన్నపురి, 1898.

105. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, ఆంధ్ర వేణీ సంహార విమర్శము.

106. వేదము వేంకటరాయశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రులవారి జీవిత చరిత్ర సంగ్రహము, వేదం వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్ మద్రాసు, 1943.

107. వెన్నేటి రామచంద్రరావు, మనువసు చరిత్ర రచనా విమర్శనము, శ్రీ చింతామణీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1899.

108. కురుగంటి సీతారామయ్య, అలంకార తత్త్వ విచారము, ఆంధ్ర కవితా విమర్శన గ్రంథమాలిక, మదరాసు, 1915.

109. సం. సి.వి. సుబ్బారావు, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్ హైదరాబాదు, 1986.

110. కోరాడ రామకృష్ణయ్య, ఆంధ్ర భారత కవితా విమర్శనము, ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు, 1929.

111. వేదాల తిరువేంగళాచార్యులు, కుమార సంభవ తత్త్వము, హైదరాబాదు, 1965.

93. గోపీచంద్, ధర్మ ఆసుపత్రి, దేశికవితామండలి, విజయవాడ, 1950
94. కుట్ర, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, యుగ సాహితి, ప్రొద్దుటూరు, 1982.
95. డి. దుర్గాప్రసాద్, కొత్తకథలు, 21, ట్వంటీఫస్ట్ సెంచరీ రైటర్స్, విజయనగరం, 1975.
96. పి. యశోదారెడ్డి, మావూరి ముచ్చట్లు, సుధర్మా పబ్లికేషన్స్, హైదరాబాదు, 1973.
97. కందుకూరి వీరేశలింగం, విగ్రహతంత్ర విమర్శనము, కందుకూరి వీరేశలింగ గ్రంథావళి, హితకారిణి సమాజము, రాజమండ్రి, 1918.
98. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, వివేక చంద్రికా విమర్శనము, 1896.
99. వెల్లాల సదాశివశాస్త్రి, ఖండనాభాస నిరాసము, చెన్నపురి, 1917.
100. సం. వెల్లాల సదాశివశాస్త్రి, పండితాభిప్రాయమణిమాలిక, చెన్నపురి, 1919.
101. కె. శివశాస్త్రి, రామచంద్ర చరితము, గుంటూరు, 1926.
102-104. వేదం వేంకటరాయశాస్త్రి, ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శము, చెన్నపురి, 1898.
105. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, ఆంధ్ర వేణీ సంహార విమర్శము.
106. వేదము వేంకటరాయశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రిలవారి జీవిత చరిత్ర సంగ్రహము, వేదం వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్ మద్రాసు, 1943.
107. వెన్నేటి రామచంద్రరావు, మనువసు చరిత్ర రచనా విమర్శనము, శ్రీ చింతామణీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1899.
108. కురుగంటి సీతారామయ్య, అలంకార తత్త్వ విచారము, ఆంధ్ర కవితా విమర్శన గ్రంథమాలిక, మదరాసు, 1915.
109. సం. సి.వి. సుబ్బారావు, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్ హైదరాబాదు, 1986.
110. కోరాడ రామకృష్ణయ్య, ఆంధ్ర భారత కవితా విమర్శనము, ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు, 1929.
111. వేదాల తిరువేంగళాచార్యులు, కుమార సంభవ తత్త్వము, హైదరాబాదు, 1965.

112-114. ఉమాకాంత విద్యాశేఖరులు, నేటికాలపు కవిత్వం, వావిళ్ళ రామ స్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1928.

115. జి.వి. కృష్ణారావు, కావ్య జగత్తు (మార్క్సిస్టు దృక్పథం), సూతాశ్రమ గ్రంథమాల, తెనాలి, 1944.

116. కె. వి. రమణారెడ్డి, మహోదయం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1969.

117. మద్దుకూరి చంద్రశేఖర రావు, చంద్రం వ్యాసావళి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1974.

118. కొడవటిగంటి కుటుంబరావు, సాహిత్య ప్రయోజనం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1969.

119-120. ఆర్. ఎస్. సుదర్శనం, సాహిత్యంలో దృక్పథాలు, ఆర్. వసుంధరా దేవి, రాజమండ్రి, 1982. (2వ కూర్పు)

121. ఆర్.ఎస్. సుదర్శనం, సమాజము-సాహిత్యము, చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘము, చిత్తూరు, 1972, పేజీ 183.

122,123. జం.గో.జె., బ్రౌన్ జాబులు, తెలుగు జర్నలిజం చరిత్ర, నెల్లూరు, 1973.

124. టి. ఎల్. కాంతారావు, కవితాలోకనం, తెలుగు విద్యార్థి ప్రచురణలు, మచిలీపట్నం, 1976.

125. కొడవటిగంటి కుటుంబరావు, సాహిత్యంలో విప్లవోద్యమం, సృజన ప్రచురణలు, వరంగల్, 1971.

126,127 కొడవటి గంటి కుటుంబరావు, కళలు - శాస్త్రీయ విజ్ఞానం, విప్లవ రచయితల సంఘం, గుంటూరు, 1980.

128. స॥ టంకసాల అశోక్, భావవిప్లవకారుడు కొడవటిగంటి సమాలోచన, ప్రగతి సాహితి, న్యూఢిల్లీ, 1982.

129,130 నిమ్మగడ్డ వేంకటేశ్వరరావు, చలం శ్మశాన సాహిత్యం, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 1983. 2వ ముద్రణ.

131. రంగనాయకమ్మ, కుటుంబరావు గాంధీ. నిశితపరిశీలనా? దగాకోరు పరిశీలనా?, స్వీట్ హోమ్ పబ్లికేషన్సు, హైదరాబాదు, 1977.

132. వెల్చేరు నారాయణరావు, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాదు, 1978.

133. మిరియాల రామకృష్ణ, శ్రీశ్రీ కవిత్వం, వస్తువు - సంవిధానం (1926-1947), ఎం. లక్ష్మీదేవి, కాకినాడ, 1980.

134. సం॥ కె.కె.రంగనాథాచార్యులు, తెలుగుసాహిత్యం - మరోచూపు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1981.

135-137 సం॥ కె. కె. రంగనాథాచార్యులు, తెలుగులో తొలి సమాజ కవులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1983.

138-141 సం॥ కె. కె. రంగనాథాచార్యులు, నూరేళ్ల తెలుగునాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1984.

142. సం॥ సి. వి. సుబ్బారావు, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైదరాబాదు, 1986.

143,144 త్రిపురనేని మధుసూదనరావు, కవిత్వం - చైతన్యం, విరసంశాఖ, తిరుపతి 1972, పేజీ 55.

145,146 బాలగోపాల్, రూపం - సారం, స్నేహ ప్రచురణ, 1986.

ఉపసంహారం:

1. సం. పురిపండా అప్పలస్వామి, సారస్వత వ్యాసములు, 4వ సం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1970.

2. ఎస్. వి. రామారావు, ఆధునిక సాహిత్య విమర్శ, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, పేజీలు: 30-31.

3. సంజీవమ్మ, సాహిత్య విమర్శ - మార్క్సిస్టు దృక్పథం, అభ్యుదయ విశేష సంచిక, పేజీ. 33.

4. సుప్రసన్న, సాహిత్య వివేచన, సాహితీబంధు బృందం, వరంగల్లు, 1971.

5 బూదరాజు రాధాకృష్ణ, విమర్శ కావ్యాలు, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, పేజీ: 44.

6. కె. కె. రంగనాథాచార్యులు, ఆధునిక సాహిత్య విమర్శలో భావ పలాయన వాద ధోరణులు, అభ్యుదయ, విమర్శ విశేష సంచిక, పేజి: 89.

7. గంగిశెట్టి లక్ష్మీనారాయణ, సాహిత్య విమర్శ - శాస్త్రస్థాయి, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, పేజి: 23.

8, 9. సం. సి. వి. సుబ్బారావు, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైద్రాబాదు, 1986.

10. బాలగోపాల్, రూపం - సారం, స్నేహ ప్రచురణ, 1986.

11. కె. కె. రంగనాథాచార్యులు, ఆధునిక సాహిత్య విమర్శలో భావ పలాయన వాద ధోరణులు, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, పేజీలు: 95,96.

12. సం. సి. వి. సుబ్బారావు, విభాత సంధ్యలు, సౌత్ ఇండియా పబ్లికేషన్స్, హైదరాబాదు, 1986.

13. వల్లంపాటి వెంకట సుబ్బయ్య, ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు, అభ్యుదయ విమర్శ విశేష సంచిక పేజీలు: 108-117.

14. సంజీవమ్మ, సాహిత్య విమర్శ - మార్క్సిస్టు దృక్పథం, అభ్యుదయ విమర్శ విశేష సంచిక, పేజి: 34.

15. కొలకలూరి ఇనాక్, తెలుగు వ్యాస పరిణామం, జ్యోతి గ్రంథమాల, అనంతపురం, 1980, పేజీలు 514-515.

తోడ్పడ్డ గ్రంథాలు

ఇంగ్లీషు :

Antonova, K. Bongard-Levin, G. & Kotovsky, G. A History of India Vol. I. Moscow: Progress Publishers, 1979.

Basham, A. C. The Wonder That India Was. London: 1953.

Chaucer. Canterbury Tales Ed. Alfred W. Pollard. London: Macmillan & Co. Ltd., 1967.

Chenchaiah and Raja Bhujanga Rao. A History of Telugu Literature Oxford: The Heritage of India series, Oxford University Press, 1921.

Desai, A R. Social Background of Indian Nationalism. 3rd Ed. Bombay: Popular Book Depot, 1959.

Einstein, Albert. Science and Religion. Selections from prose and verse. Bombay : O. U., Orient Longman, 1974.

Euripides. Alcestis. Tr. by Dudley Fitts & Robert Fitzgerald. Greek plays in Modern Translation, New York : The Dial Press, 1951.

Euripides. Hippolitus Tr. by David Grene from Greek Tragedies Vol-I, Chicago: The University of Chicago Press, 1968.

Gupta, A. N. & Satish Gupta. A Dictionary of Literary Terms. Bareilly: Prakash Book Depot, 1976.

Ed. George, E. Duckworth. The Complete Roman Drama Vol-II. New York: Random House, 1942.

Ed. George E. Duckworth. The Complete Roman Drama Vol-I. New York: Random House, 1942.

Homer. Odyssey. Tr. by Kimon Friar New York: Simon and Schuster, 1958.

Homer. Iliad. Tr. by S. O. Andrew & M. J. Oakley. London : Every Man's Library, 1963.

Jonson, Ben. Every man out of his humour. The Complete Plays of Ben Jonson Vol-I London : J. M. Dent Sons Ltd., 1936.

Kosambi, D. D. An Introduction to the study of Indian History. Bombay: 1975.

Mangamma, J. Book Printing in India. Nellore : Bangorey Books, 1975.

Mazumdar, R.C. Rayachaudhuri, H. C. and Kalikinker Datta. Advanced History of India. London: 1958.

Milton, John. Paradise Lost Book - I (The Poetical works of John Milton Vol-I) Oxford: 1952.

Milton, John. Paradise Lost Book-II (The Poetical works of John Milton Vol-I) Oxford: 1952.

Morley, Christopher. Prefaces. Shandy gaff. New York: Garden City Publishing Company, 1918.

Marlowe, Christopher. The Tragical History of Doctor Faustus. London : Methuen and Co. Ltd., 1965.

O' Malley, L.S S. Modern India and the West. Oxford: Oxford University Press.

Pope, Alexander. Rape of the Lock. Ed. Geoffrey Tillotson. London: Methuen, 1966.

Radhakrishnan, S. Indian Philosophy Vol. I. London: 1977.

Scott, A. F. Current Literary Terms. New York: Macmillan, 1965.

Shipley, Joseph T. Dictionary of World Literature - Criticism - Forms - Technique. New York: The Philosophical Library, 1942.

Spencer, Edmond. The Fairie Queen Book-I. London: Macmillan & Co. Ltd., 1965.

Zis, A. Marxist Leninist Aesthetics and Life, Ed. I. Kulinova and A. Zis, Moscow: Progress Publishers, 1976.

The Century Dictionary and Cyclopedia. New York : The Century Co., -

The Concise Oxford Dictionary of Current English. Oxford: 1965.

Encyclopaedia Americana New York: Americana Corporation, 1929.

Encyclopaedia Britannica Chicago: Encyclopaedia Britannica, Inc., 1961.

The International Webster New Encyclopedic Dictionary of the English Language and Library of Useful Knowledge. New York : Tabore House,-

The New Oxford Illustrated Dictionary, Vol-2. Oxford Bay Books in Association with Oxford University Press,-

The New Dictionary of thoughts, Edwards Tryton. D. D. Standard Book Company, 1963.

The Random House Dictionary of the English Language College Ed. New York : Allied Publishers Private Ltd., 1969.

The Reader's Digest Great Encyclopedic Dictionary, III Ed. New York : The Readers Digest Association, Inc., 1969.

The World Book Encyclopaedia. London : Field Enterprises Educational Corporation, 1966.

సంస్కృతం :

కాళహస్తికవి. వసుచరిత్రం. సం॥ బి. రామరాజు. హైదరాబాదు: 1965.

కాళిదాసు. రఘువంశం. హైదరాబాదు: ఆంధ్ర బుక్ హౌస్, 1965.

— అభిజ్ఞాన శాకుంతలమ్. మదరాసు: వేదంవేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, 1957.

— మాళవికాగ్ని మిత్రమ్ వారణాసి: చౌఖాంబా సంస్కృత్ సిరీస్ 1965.

దండి. కావ్యాదర్శః, హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి, 1981.

— దశకుమార చరిత్రమ్. హైదరాబాదు: శ్రీపరమేశ్వర పబ్లికేషన్స్, 1962.

ధనంజయుడు. దశరూపకమ్. వారణాసి: ది చౌఖంబా విద్యాభవన్, 1967.

బాణుడు. కాదంబరి. హైదరాబాదు: శ్రీ పరమేశ్వర పబ్లికేషన్సు, 1972.

— హర్షచరితమ్. వారణాసి: ది చౌఖాంబా విద్యాభవన్, 1964.

భవభూతి. ఉత్తర రామచరితమ్. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1977.

— మహావీర చరితమ్. బొంబాయి: నిర్ణయసాగర్ ప్రెస్, 1900.

— మాలతీ మాధవమ్. బొంబాయి: తుకారాం జావజీ, 1900.

భారవి. కిరాతార్జునీయం. మదరాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1967.

భాసుడు. భాసనాటక గుచ్ఛమ్ కర్ణభారం, దూతవాక్యం, దూతఘటోత్కచం, ఊరుభంగం, మధ్యమ వ్యాయోగః, విజయవాడ: కల్యాణి గ్రంథ మండలి, 1962.

భాసుడు.	ప్రతిమా.	విజయవాడ : కల్యాణి గ్రంథమండలి	1963
—	అవిమారకమ్.	,,	1963
—	పంచతంత్రమ్.	,,	1962
—	చారుదత్తమ్.	,,	1963
—	అభిషేకమ్.	,,	1963
—	బాలచరితమ్.	,,	1963

భోజరాజు. చంపూరామాయణమ్ మద్రాసు: వి. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1966.

మాఘుడు. శిశుపాలవధ. మద్రాస్: వి. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1967

మురారి. అనర్ఘరాఘవమ్. బొంబాయి: పాండురంగ జావజీ, 1937

వాల్మీకి. రామాయణమ్. హైదరాబాదు: శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్, 1979.

విశాఖదత్తుడు. ముద్రారాక్షసమ్. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1972.

శంకరాచార్య. శివానందలహరీ. మదరాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 19[illegible]1.

తెలుగు :

అప్పకవి. అప్పకవీయము. చెన్నపురి: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1970.

సం. అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు. సుందరం, ఆర్.వి.యస్. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ పీఠికలు. రాళ్ళపల్లి అభినందన సమితి, 1978.

ఆంజనేయులు, కుందుర్తి. కుందుర్తి కృతులు. హైదరాబాదు: కుందుర్తి సన్మాన సంఘం, 1975.

ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం (సం. 8). మద్రాసు : ఎమెస్కో, 1965.

ఇనాక్, కొలకలూరి. తెలుగు వ్యాసపరిణామం. అనంతపురం : జ్యోతి గ్రంథ మాల, 1980.

ఉమాకాంతం, అక్కిరాజు. నేటి కాలపు కవిత్వం. చెన్నపురి : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1928.

కాంతారావు, టి. ఎల్. కవితాలోకనం. మచిలీపట్నం : తెలుగు విద్యార్థి ప్రచురణలు, 1976.

కుటుంబరావు, కొడవటిగంటి. సాహిత్య ప్రయోజనం. విజయవాడ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1969.

—— సాహిత్యంలో విప్లవోద్యమం. వరంగల్ : సృజన ప్రచురణలు, 1971.

—— కళలు- శాస్త్రీయ విజ్ఞానం. గుంటూరు : వి.ర.సం, 1980.

కృష్ణారావు, జి. వి. కావ్యజగత్తు. తెనాలి : సూతాశ్రమ గ్రంథమాల, 1944.

తిరువేంగళాచార్యులు, వేదాల. కుమార సంభవ తత్వము. హైదరాబాదు: 1965.

దక్షిణామూర్తి, పోరంకి. కథానికా వాఙ్మయం. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1975.

నాగభూషణశర్మ, మొదలి. తెలుగు నవలావికాసం. హైదరాబాదు : 1971.

నాగయ్య, జి. తెలుగు కావ్యావతారికలు. తిరుపతి : 1968.

నారాయణరావు, వెల్చేరు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. హైదరాబాదు: 1978.

పాపయ్య శాస్త్రి, చిలుకూరి. శ్రీనాథుడు శృంగారియా ?

పిచ్చయ్య శాస్త్రి, దీపాల. భాగవత పాఠపరిశోధనము. నెల్లూరు: 1968.

ప్రకాశరావు, శివలెంక. నాదేశం నా ప్రజలు - సమీక్ష, విశాలాంధ్ర, 7-3-1976.

బాలగోపాల్. రూపం-సారం. స్నేహ ప్రచురణ, 1986.

బ్రహ్మయ్యశాస్త్రి, కాశీభట్ట. వివేకచంద్రికా విమర్శనము. 1896.

భాస్కర చౌదరి, బి. సాహితీమూర్తి కట్టమంచి. చిత్తూరు: తెలుగు శాఖ, ప్రభుత్వ కళాశాల.

— (సం), కట్టమంచి రామలింగారెడ్డి పీఠికలు, చిత్తూరు : చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, 1983.

మధుసూదనరావు, త్రిపురనేని. కవిత్వం-చైతన్యం. తిరుపతి: వి. ర. సం. శాఖ, 1972.

రంగనాథాచార్యులు, కె. కె. (సం) తెలుగులో తొలి సమాజ కవులు, హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1983.

రంగనాథాచార్యులు, కె.కె. (సం).నూరేళ్ళ తెలుగునాడు. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1984.

— తెలుగు సాహిత్యం మరో చూపు, హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1981.

— ఆధునిక సాహిత్య విమర్శలో భావపలాయనవాద ధోరణులు. అభ్యుదయ, విమర్శ విశేష సంచిక.

రమణారెడ్డి, కె. వి అభ్యుదయ రచయితల సంఘానికి కాయకల్ప చికిత్స మరి రెండు వ్యాసాలు. హైదరాబాదు: వి. ర. సం., 1972.

రమాపతిరావు, అక్కిరాజు. తెలుగునవల. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1975.

రాధాకృష్ణ, బూదరాజు. విమర్శకావ్యాలు. అభ్యుదయ, విమర్శ విశేషసంచిక.

రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని. తెలుగు నాటక సాహిత్యం. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1980.

రామకృష్ణకవి, మానవల్లి. మానవల్లి రామకృష్ణకవి రచనలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1972.

రామకృష్ణయ్య, కోరాడ. ఆంధ్రభారత కవితా విమర్శనము. మద్రాసు: ఆంధ్ర గ్రంథమాల, 1929.

రామకృష్ణశాస్త్రి, శిష్ట్లా. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. కాకినాడ: 1965.

రామచంద్ర, తిరుమల. మనలిపి - పుట్టు పూర్వోత్తరాలు. మద్రాసు: 1957.

రామరాజ భూషణుడు. కావ్యాలంకార సంగ్రహము. సికింద్రాబాదు: ఎమెస్కో, 1976.

రామారావు. ఎస్. వి. ఆధునిక సాహిత్య విమర్శ. అభ్యుదయ, విమర్శ విశేష సంచిక.

లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. సాహిత్య విమర్శ - శాస్త్రస్థాయి. అభ్యుదయ, విమర్శ విశేషసంచిక.

వీరేశలింగం, కందుకూరి. ఆంధ్రకవుల చరిత్ర. రాజమండ్రి: హితకారిణీ సమాజము.

వీరేశలింగం, కందుకూరి విగ్రహతంత్ర విమర్శనము. రాజమండ్రి: హితకారిణీ సమాజము, 1918.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులు. అభ్యుదయ, విమర్శ విశేష సంచిక.

శేషయ్య, చాగంటి. ఆంధ్రకవితరంగిణి (3,4 సంపుటాలు). కపిలేశ్వరపురము : హిందూధర్మశాస్త్ర గ్రంథనిలయము, 1948.

శ్రీరామమూర్తి, కొర్లపాటి. నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీన గ్రంథమా? విశాఖ పట్టణం : రమణశ్రీ ప్రచురణ, 1983.

సంజీవమ్మ. సాహిత్య విమర్శ - మార్క్సిస్టు దృక్పథం. అభ్యుదయ, విమర్శ విశేషసంచిక.

సీతారామయ్య, కురుగంటి. అలంకార తత్వవిచారము. మదరాసు: ఆంధ్రకవితా విమర్శన గ్రంథమాలిక, 1916.

సుదర్శనం, ఆర్, ఎస్. సాహిత్యంలో దృక్పథాలు. రాజమండ్రి: ఆర్. వసుంధరా దేవి, 1982.

——సమాజమూ - సాహిత్యమూ. చిత్తూరు : చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘము, 1972.

సుబ్బారావు, చందు. మూలరచనకు పల్లకీమోస్తున్న పీఠికారచన. ఆంధ్రప్రభ దినపత్రిక, 15-5-1983..

సుబ్బారావు, సి. వి. (సం.) విభాతసంధ్యలు. హైదరాబాదు : సౌత్ ఇండియా పబ్లికేషన్స్, 1986

సూర్యారావు, అవసరాల (సం.) గురజాడ లేఖలు. విజయవాడ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

తెలుగు సాహిత్య కోశము. హైదరాబాదు : తెలుగు అకాడమి, 1986.

ప్రబంధమణిభూషణము. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1971.

సూర్యరాయాంధ్ర నిఘంటువు. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి, 1982.

విజ్ఞాన సర్వస్వము (6 సం.) విశ్వసాహితి. మద్రాసు : తెలుగు భాషాసమితి, 1961.

తెలుగు పీఠిక స్వరూపస్వభావాలను, ఆరంభ వికాసాలను చారిత్రక, సామాజిక నేపథ్యంలో పరిశీలించి, తెలుగు సాహిత్య విమర్శలో పీఠిక నిర్వహించిన పాత్రను నిరూపించిన గ్రంథం.

డా॥ డి. చంద్రశేఖరరెడ్డి 1974 నుండీ ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ హైస్కూలులోనూ, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల లోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ విద్యాభ్యాసం చేసిన వీరు తెలుగులోనూ, భాషాశాస్త్రంలోనూ ఎం.ఏ. డిగ్రీలు, తెలుగులో ఎం.ఫిల్. (నాయని సుబ్బారావుగారి 'జన్మభూమి' కావ్య పరిశీలనం, 1980), పిహెచ్.డి. (తెలుగు కావ్య పీఠికల పరిశీలనం, 1988. ప్రస్తుత గ్రంథానికి పూర్వరూపం) పట్టాలను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొందారు.

తెలుగు భాషా, సాహిత్య చరిత్రలు ప్రధాన బోధనా విషయాలు కాగా, సాహిత్య విమర్శ వ్యాసాలు రాయడం, కథలు, కవితలు అనువదించడం వీరి ప్రత్యేక ఆసక్తులు.